భాగవత ప్రాభృతకం

దివ్యసూరులుగా కీర్తింపబడే ఆళ్వార్ల అనుగ్రహించిన దివ్యప్రబంధాలలో ఆణ్డాళ్ అనుగ్రహించిన **"తిరుప్పావై"** దివ్యప్రబంధం ప్రత్యేకమైన స్థానాన్ని అలంకరిస్తున్నది. శ్రీవైష్ణవాలయాలలోనే కాక, ప్రతి వైష్ణవ గృహాలలో కూడా ఈ ప్రబంధం అనుసంధింపబడకుండా నిత్యారాధన జరుగదు. ఈ ప్రబంధవైలక్షణ్యాన్ని గూర్చి తెలియజేయడానికి ఈ ఒక్క విషయమే చాలు **"అఞ్జుకుడిక్కు ఒరు శన్తతియాయ్, ఆళ్వార్కళ్తమ్ శెయలై విఞ్జినిఱ్కుమ్ తన్మైయళాయ్ పిఞ్జాయ్ ప్పళ్ళుత్తాళై అణ్డాళై"** (మంగళాశాసనం చేసే దివ్యసూరుల కులానికి ఏకైక పుత్రికయై. ఆ ఆళ్వార్ల భక్తికి మించిన భక్తిని కల్గినదై, చిన్నవయస్సులోనే పరిణతిని పొందిన ఆణ్డాళ్ను) అని శ్రీమణవాళమహామునులు ఉపదేశరత్తినమాలై ప్రబంధంలో అనుగ్రహించిన శ్రీసూక్తి గోదాదేవి యొక్క జ్ఞానభక్తుల వైలక్షణ్యాన్ని తెల్పుతున్నది. దివ్యసూరులు **"ఆళ్వార్లు"** (అవగాహిస్తున్నవారు- ఇంకా భగవదనుభవ పర్యంతసీమను పూర్తిగా దర్శించనివారు) కాగా, ఈమె **"ఆణ్డాళ్"** (ఆణ్డాళ్) (భగవదనుభవాన్ని పూర్ణంగా అవగాహించినది) అనే శబ్దచమత్కృతి పూర్వకమైన వివరణాన్ని కూడా పెద్దలు తెల్పుతారు. ఇది **"ఏకదేశవికృత మనన్యవద్భవతి"** అనే న్యాయాన్ని పురస్కరించుకొని **"న హి నిందా"** న్యాయంలో చేసిన వివరణమని గ్రహించాలి. ఈ రీతిలో వక్తృవైలక్షణ్యాన్నిబట్టి తిరుప్పావైకు గల ప్రత్యేకత స్పష్టం. **"వేదమనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదైతమిళ్"** అనే పూర్వాచార్య సూక్తి ద్వారా ప్రబంధవైలక్షణ్యం- **"మార్గళినీరాడల్"** - అనేపదానికి చరమ పర్వనిష్ఠావగాహనమని స్వాపదేశార్థం కనుక ప్రమేయవైలక్షణ్యం కూడా ఈప్రబంధానికి ఉన్నాయి.

శ్రీమన్నాథమునులనుండి ప్రవర్తించిన ఆచార్యపరంపరలోని పూర్వాచార్యులందఱు ఈ ప్రబంధాన్ని విశేషంగా ఆదరించారు. భగవద్రామానుజులకు ఈ ప్రబంధంపై గల గౌరవాన్నిబట్టి **"తిరుప్పావై జీయర్"** అనే నామంతో ఆ ఆచార్యవర్యులు సంప్రదాయంలో వ్యవహరింపబడుతున్నారు. పెరియవాచ్చాన్పిళ్ళై అనుగ్రహించిన మూవాయిరప్పడివ్యాఖ్య. అళకియమణవాళ ప్పెరుమాళ్ నాయనార్ అనుగ్రహించిన ఆఱాయిరప్పడి వ్యాఖ్య, శ్రీవరవరమునులకు సమకాలీనులైన **తిరునారాయణపురత్తు ఆయ్**- అనే ఆచార్యులు అనుగ్రహించిన **ఈఱాయిరప్పడి, నాలాయిరప్పడి**- అనే రెండు వ్యాఖ్యానాలు, స్వాపదేశవివరణం, మూవాయిరప్పడివ్యాఖ్యానాన్ని వివరించే **పెరియ అరుమ్బదమ్, శిన్న అరుమ్బదమ్,**

కుట్టి అరుమ్బదమ్ - అనే మూడు అరుమ్బద వివరణలు, ఇవే కాక, వానమామలై మఠస్థాపకులు **వానమామలై జీయర్ స్వామి, శుద్ధసత్త్వమ్ దొడ్డయాచార్యస్వామి** అనుగ్రహించిన స్వాపదేశవ్యాఖ్యానాలు - ఇవి అన్నీ తిరుప్పావై ప్రబంధం పట్ల పూర్వాచార్యులకు గల ప్రతిపత్తివిశేషానికి తార్కాణలు. అందువల్లనే **"వేదమనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదై తమిழ் ఐయైన్దు మైన్దుమ్ అఱియాద మానిడరై వైయమ్ శుమప్పదుమ్ వమ్బు"** (వేదాలన్నిటికి బీజం వంటిది అయిన గోదాదేవి ప్రబంధం ముప్పై పాశురాలను తెలియని మానవుని భూమి మోయడం వ్యర్థం) అని పూర్వాచార్యులు వక్కాణించారు.

గడచిన శతాబ్దిలో సుమారు 80 సంవత్సరాల పాటు భగవద్రామానుజ సంప్రదాయాన్ని ఆసేతుహిమాచలం అవ్యాహతంగా పలు రీతులలో ప్రచారాన్ని చేసి, పరిరక్షించిన మహనీయులు - **కాంచీమహావిద్వాన్ ప్రతివాది భయంకరమ్ అణ్ణంగరాచార్యస్వామివారు.** 92 సంవత్సరాల తమ ఆయుష్కాలాన్ని అన్ని విధాలుగా సఫలం చేసికొన్న శ్రీమాన్ స్వామివారు సహస్రాధికగ్రంథాలను పలు భాషలలో (తమిళం, తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో) రచించి వెలువరించారు. ఆழ்వార్ల ప్రబంధాలకు, పూర్వాచార్య స్తోత్రగ్రంథాలకు, శ్రీవైష్ణవ సంప్రదాయ రహస్యగ్రంథాలకు వ్యాఖ్యలు, ఎన్నో వ్యాసాలు, స్వయంగా రచించిన ఎన్నో స్తుతులు, పలువాదగ్రంథాలు- ఈవిధంగా బహుముఖంగా వీరు ప్రచురించిన గ్రంథాలు ఈనాటికీ సంప్రదాయి జిజ్ఞాసువులకు పెన్నిధులుగా భాసిస్తున్నాయి.

తిరుప్పావై దివ్యప్రబంధాన్ని గూర్చి కూడా శ్రీమాన్ అణ్ణంగరాచార్యస్వామివారు ఎన్నో గ్రంథాలను రచించి వెలువరించారు. కొన్ని సంవత్సరాలపాటు ప్రతి ఏడు ధనుర్మాస సందర్భంగా శ్రీమాన్ స్వామివారు తిరుప్పావై ప్రబంధాన్నిగూర్చి తమిళభాషలో విలక్షణమైనశైలిలో ఒక విశేషమైన వివరణను అపూర్వార్థభరితంగా ప్రచురించారు. **తిరుప్పావై దివ్యార్థదీపికై, తిరుప్పావై విశేషార్థమ్, శెజ్గత్తమిழ்మాలై ముప్పదు, కోదైతమిழ்మాలై నఱుమణమ్, తిరుప్పావైయిల్ దివ్యదేశానుభవమ్, తిరుప్పావై జీయర్, ఆణ్డాళ్ అళిత్త అముదవెళ్ళమ్, శోభకృత్ ఆణ్డు మార్గழிవిరున్దు**- ఇత్యాదులు వాటిలో కొన్ని. ఈవిధంగా ఎన్నో శీర్షికలతో తిరుప్పావై ప్రబంధాన్ని గూర్చి శ్రీమాన్ అణ్ణంగరాచార్యస్వామివారు రచించిన పలు గ్రంథాలు రస్యరహస్య ధ్వన్యర్థ భరితాలు. సంస్కృతభాషలో కూడా తిరుప్పావై ప్రబంధానికి శ్రీమాన్‌స్వామి వారు విస్తృతమైన వ్యాఖ్యను రచించడం విశేషం.

తిరుప్పావైను గూర్చి శ్రీమాన్ అణ్ణంగరాచార్యస్వామివారు రచించిన వ్యాఖ్యానాలు ఉన్నో ఉన్నా, వాటి అన్నిటిలో **"తిరుప్పావై విశేషార్థమ్"** అనే పేరుతో **1957** సం॥లో రచించిన స్వాపదేశవ్యాఖ్యానం చాలా విలక్షణమైనది. ఈగ్రంథాన్ని గూర్చి శ్రీమాన్ స్వామివారే స్వయంగా వ్యక్తం చేసిన అభిప్రాయం ఈవిధంగా ఉన్నది- **"తిరుప్పావైక్కు ముదన్‌ముదలాక అడియేన్ ఎழுది వెళియిట్ట ఉరై దివ్యార్థదీపికై ఎన్బదు. అదు విరివానదు. అదన్ పిఱకు, ఇరణ్డామ్ పదిప్పాకవుమ్, మూన్ఱామ్ పదిప్పాకవుమ్, నాన్గామ్ పదిప్పాకవుమ్ వెళియిట్ట ఉరైకళ్ పెరుమ్బాలుమ్ వెవ్వేఱుపట్టవై. ఇవ్వురైకళ్ ఎల్లామ్ అజ్గాజ్గు తిరుప్పావై ప్రవచనమ్ శెయ్యుమ్ పణ్డితర్‌కళుక్కు పల ఆణ్డుకళాక ప్పరమోపకారమళిప్పవై. ఎల్లావఱ్ఱిఱ్కాట్టిలుమ్ ఇవ్విశేషార్థ ఉరై అవర్‌కళుక్కు అధికమాన ఉపకారమళిక్కుమెన్బదు అడియేను డైయ తుణిపు."** (తిరుప్పావైకు మునుముందుగా నేను రచించి ప్రచురించిన వ్యాఖ్య దివ్యార్థదీపిక- అనేది. అది చాలా విస్తృతమైనది. దానికి పిమ్మట, రెండవ ప్రచురణగా, మూడవ ప్రచురణగా, నాల్గవ ప్రచురణగా ప్రచురించిన వ్యాఖ్యలు ఇంచుమించుగా విభిన్నమైనవి. ఈ వ్యాఖ్యలు అన్నీ అక్కడక్కడ తిరుప్పావై ప్రవచనాలను చేసే పండితులకు పలు సంవత్సరాలుగా గొప్ప ఉపకారాన్ని చేస్తున్నవి. వీటి అన్నిటికంటే ఈ విశేషార్థ వ్యాఖ్య వారికి అధికంగా ఉపకరిస్తుంది- అనేది నా అభిప్రాయం)

ఈవిధంగా తాము రచించిన వ్యాఖ్యలన్నిటిలో విలక్షణమైనదిగా శ్రీమాన్ స్వామివారు భావించిన **"తిరుప్పావై విశేషార్థమ్"** అనే ద్రావిడ వ్యాఖ్యానం ఇపుడు అంధ్రీకరింపబడి, ఆస్తిక భాగవతలోకానికి సమర్పింప బడుతున్నది. ఈవ్యాఖ్యానంతో పాటు వారు రచించిన **"తిరుప్పావైయిల్ దివ్యదేశానుభవమ్", "తిరుప్పావై జీయర్"** - అనే రెండు లఘుకృతులు కూడా ఆంధ్రీకరింపబడి ప్రచురింపబడుతున్నాయి. ఇవి అన్నీ తిరుప్పావై ప్రబంధంలోని అపూర్వాలైన అర్థాలను తెలిపే అమూల్యకృతులు.

శ్రీమాన్ అణ్ణంగరాచార్యస్వామివారు తమ విశేషార్థవ్యాఖ్యలో తిరుప్పావై ప్రబంధంలోని పలు స్వాపదేశ-అన్యాపదేశార్థాలను వివరించారు. ఈ రెండు సాంప్రదాయిక, పారిభాషిక పదాల అర్థం ముఖ్యంగా తెలిసికోవలసి ఉన్నది. ఈ రెండిటిని ఆస్వామివారు వివరించిన క్రమం ఇక్కడ ప్రస్తావింపబడుతున్నది.

"స్వాపదేశమ్ - అన్యాపదేశమ్" అనే సంజ్ఞ సంస్కృతశాస్త్రమర్యాదకు అనుగుణమా? (పొసగుతుందా?) ఈ సమస్తపదాలలోని **"అపదేశ"** మనే పదం **"అన్య"**

శబ్దంతో సమసించడం పొసగుతుందే తప్ప "స్వ" అనే పదంతో సమసించడం పొసగదు కదా! ఎందుకంటే, వ్యాజంగా గ్రహింపబడిన అముఖ్యార్థాన్ని సూచించే అపదేశమనే పదం, "అన్య" అనే పదంతో సమసించడమే సహజం. "స్వ" అనే పదంతో అది ఏవిధంగా కలుస్తుంది? వ్యాజంగా గ్రహింపబడిన అముఖ్యమైనది అన్యమే తప్ప స్వపదవాచ్యంగా ఉండే అవకాశం లేదే?'' - అని ఈవిధంగా కొందఱు సందేహపడవచ్చు. ఈ విషయంలో సమాధానాన్ని స్పష్టం చేస్తాను.

సంస్కృతభాషలోని **"వ్యపదేశ"** మనే ఒక పదం ప్రసిద్ధం. దానికి ఏమి అర్థమో, అదే అపదేశమనే పదానికి కూడా అర్థం. **"వి"** అనే ఉపసర్గం చేరినా, చేరకపోయినా అర్థం ఒకటే. **"వ్యపేక్షా- అపేక్షా"** అనే పదాలను దీనికి ఉదాహరణగా చెప్పవచ్చు. అప్పయ్యదీక్షితులు, కువలయానందంలో **"స్వక్రియాసాధనవ్యగ్రో నాలమన్యత్ వ్యపేక్షితుమ్"** అనే ఒక కారికను చూపారు. ఇందులో **"వ్యపేక్షితుమ్"** అనే పదంలోని **"వి"** అనే ఉపసర్గకు ప్రత్యేకంగా ఏ అర్థం లేదు. సాపేక్షః, నిరపేక్షః అనే పదాల స్థానంలోనే **"సవ్యపేక్షః, నిర్వ్యపేక్షః"** - అనే పదాలను కూడా పండితులు ప్రయోగిస్తారు. ఈ రీతిలోనే వ్యపదేశమనేది, అపదేశమనేది పర్యాయాలుగా వ్యవహరింపబడుతున్నాయి. వ్యపదేశమనే పదానికి **"సూచన"** (సూచించడం- నిర్దేశించడం) అని అర్థం. అపదేశమనేదానికి కూడా అదే అర్థం. ముఖ్యంగా ఉద్దేశింపబడిన అర్థంకంటే వేఱొక అర్థాన్ని సూచించడం అన్యాపదేశమన బడుతుంది. వాస్తవానికి వివక్షితమైన అర్థాన్ని సూచించడం స్వాపదేశమన బడుతుంది. **"స్వస్య అపదేశః- స్వాపదేశః, అనస్య అపదేశః అన్యాపదేశః"** అని గాని, **"స్వమ్ అపదిశ్యతే అస్మిన్ ఇతి స్వాపదేశః, అన్యత్ అపదిశ్యతే అస్మిన్ ఇతి అన్యాపదేశః"** అనే వ్యుత్పత్తులద్వారా ఈ రెండు పదాలు ఉపపత్తిని కల్గినవి. నన్నూల్‌లో **"ఎప్పొరుళై చ్చొలిన్ ఎవ్వాఱు ఉయర్న్దోర్, శెప్పినార్ అప్పడి శెప్పుదల్ మరపే"** (ఏ అర్థాన్ని చెప్పినా, ఏవిధంగా ఉత్తములు చెప్పారో, ఆవిధంగా చెప్పడం సంప్రదాయం) అనేది ఒక సూత్రం. పూర్వులు ఏ పదాన్ని ప్రయోగించి ఏ అర్థాన్ని నిర్దేశించారో, ఆ పదాన్ని ప్రయోగించే ఆ అర్థాన్ని పల్కడం సంప్రదాయం- అని తెలుపుతున్నది- ఈ సూత్రం. అన్యాపదేశం, స్వాపదేశం- అనే ఈ పదాలు నిన్న, ఈనాడు ఎవరో ఒకరిచే కూర్పబడి ప్రయోగింపబడినవి కావు. శ్రీమన్నాథమునుల కాలం నుండి సంప్రదాయ పరంపరగా వ్యవహరింపబడుతున్న పదాలు ఇది. తిరుప్పావై ప్రబంధం చరమపర్వనిష్ఠ ప్రతిపాదకం కనుక, ఆనిష్ఠను ప్రతిపాదించే

అర్థమే తిరుప్పావై ప్రబంధంలోని స్వాపదేశార్థమని, శ్రీకృష్ణుడు గోపికల పరమైన అర్థం అన్యాపదేశార్థమని గ్రహించాలి. (ఈవిధంగానే శ్రీఅణ్ణాస్వామివారి వ్యాఖ్యానం సాగింది.)

ఆళ్వార్ల దివ్యప్రబంధవ్యాఖ్యానాలలో కూడా పూర్వాచార్యులు ఆలంకారిక మైన నాయక- నాయకీ భావాన్ని అన్యాపదేశార్థంగాను, తద్ద్వారా ప్రతిపాదింపబడే (వక్తృ వివక్షితమైన) ఆత్మ- పరమాత్మలకు సంబంధించిన వేదంతతత్త్వార్థం స్వాపదేశార్థంగాను వివరించడం ప్రకృతంలో అనుసంధేయం. ఇందువల్లనే దివ్యప్రబంధాలన్నీ వ్యంగ్యార్థప్రధానాలైన ఉత్తమ కావ్యాలుగా పరిగణింపబడు తున్నాయి.

ఇటీవలి కాలంలో తిరుప్పావై దివ్యప్రబంధానికి సర్వత్ర విశేషణమైన ఆదరణ ప్రచారాలు లభించడం చాలా హర్షణీయం; పలుచోట్ల పలు ఆధ్యాత్మిక సంస్థల, దేవాలయాల యాజమాన్యాల సహాయసహకారాలతో పలువురు పండితులు ఈ ప్రబంధాన్ని ధనుర్మాస సందర్భంగా ప్రవచించడం కూడా సంతోషించదగిన విషయం. అయితే, ఈ ప్రవచనాల ద్వారా తిరుప్పావై ప్రబంధంద్వారా గోదాదేవి లోకానికి ఉపదేశించదలచిన ప్రధానతత్త్వాన్ని గుర్తించి, గ్రహించి దానిని శ్రోతలకు అందించడం ఉపన్యాసకుల ముఖ్య కర్తవ్యం. ప్రసిద్ధులైన, పరినిష్ఠిత పాండిత్యాన్ని కల్గిన పెద్దల ప్రవచనాల ద్వారా తిరుప్పావై ప్రబంధంలోని జ్ఞాతవ్యార్థాలు శ్రోతలకు వీనులవిందు చేస్తున్నాయి. కాని, ప్రస్తుత కాలంలో పలు కారణాలవల్ల వచ్చిన పరిణామాల కారణంగా, ఆచార్యుల సన్నిధిలో శిష్యుడు గ్రంథాధ్యయాన్ని చేసే కాలక్షేపపరంపరాక్రమం క్రమంగా లుప్తమైపోతున్నందున, చాలా కాలంగా మౌఖికంగా పెన్నిధులవల్ల కాపాడుకుంటూ వచ్చిన సాంప్రదాయికమైన అర్థాలు మఱుగుపడిపోతున్నాయి. ప్రస్తుతతరానికి అవి అందే అవకాశాలు సన్నగిల్లు తున్నాయి. అందువల్ల కొందఱు యువవక్తలు స్వకపోల కల్పితాలైన, పూర్వాచార్య పరంపరకు విరుద్ధమైన అర్థాలను ఉద్భావించి, ఉపన్యసించే ప్రమాదం లేకపోలేదు. ప్రధాన ప్రతిపాద్యమైన అర్థాన్ని తెలియనపుడు ఇటువంటి ప్రమాదాలకు అవకాశం ఉన్నది కదా. వీనిని నివారించడం కోసంగానే **కాంచీ మహావిద్వాన్ ప్రతివాది భయంకరమ్ అణ్ణంగరాచార్యస్వామివారు, కులపతులు శ్రీమాన్ తె.కం. గోపాలా చార్యస్వామివారు, శ్రీమాన్ శ్రీభాష్యం అప్పలాచార్యస్వామివారు** వంటి మహనీయులు చిరకాలంగా శిష్యాచార్యపరంపరాప్రాప్తాలైన అమూల్యాలైన, అవశ్యావధేయాలైన

సాంప్రదాయికార్థాలను గ్రంథస్థం చేశారు. ఆవిధంగా, శ్రీమాన్ అణ్ణాస్వామి వారు తిరుప్పావై ప్రబంధానికి తమిళభాషలో రచించిన స్వాపదేశార్థ వివరణ రూపమైన విశేషార్థవివరణాన్ని సహృదయులైన ఆంధ్రపాఠకులకు ఈ ఏడు మార్గశీర్షవ్రత సందర్భంలో ప్రాభృతంగా సమర్పించాలనే ఉద్దేశ్యంతో ఈ అనువాద ప్రయత్నం చేయబడింది. ఈ గ్రంథం, వర్ధిష్ణువులైన, తిరుప్పావై ప్రబంధాన్ని గూర్చి ఉపన్యసించదలచిన, నేటితరం జిజ్ఞాసువులైన వక్తలకు తప్పక ఉపయోగ పడుతుంది- అని, సహృదయపాఠకులను రంజింపజేస్తుందని అనడంలో సందేహం లేదు.

వీటిని ఆంధ్రీకరించి, ప్రచురించడానికి అనుమతిని ఉదారంగా అనుగ్ర హించిన **సహృదయులు, శ్రీమాన్ స్వామివారి పౌత్రులు.** ఉ.వే. శ్రీమాన్ పి.బి. **రాజహంసమ్ స్వామివారి** సన్నిధిలో, వారి కుటుంబసభ్యులందఱి సన్నిధిలో కృతజ్ఞతాపూర్వకంగా నమోవాకాలను సమర్పిస్తున్నాను. ఈ సద్గ్రంథాన్ని ప్రచురించడానికి కావలసిన ద్రవ్యాన్ని సమర్పించడానికి ఉత్సాహంతో, ఉదారంగా ముందుకు వచ్చిన హైదరాబాద్ వాస్తవ్యులు, మిత్రమణి, భగవద్భాగవతాచార్య కైంకర్య నిష్ఠులు, పలుచోట్ల ఉభయవేదాంత పండిత సభలను పెద్దలు అందరూ ప్రశంసించే రీతిలో నిర్వహించిన అదృష్టశాలి, ఈవిధంగా ఎన్నో గ్రంథాల ప్రచురణలో పలువురికి ఆర్థికసాహ్యాన్ని అందించిన విశాలహృదయులు **శ్రీమాన్ పి. గోపాలకృష్ణమూర్తి**, వారి ధర్మపత్ని **శ్రీమతి పి. అలమేలుమంగ దంపతులను**, అదే విధంగా, ఈ కైంకర్యంలో యథాశక్తి తమ పవిత్ర ద్రవ్యాన్ని సమర్పించిన మహనీయులను మనసారా కృతజ్ఞతాపూర్వకంగా అభినందిస్తూ, వారికి, వారి కుటుంబసభ్యులకు శ్రీగోదాసమేత శ్రీరంగనాథుల దివ్యానుగ్రహంవల్ల సమస్త సన్మంగళాలు ఇతోధికంగా కలగాలని ఆశిస్తూ ఆశాసిస్తున్నాను. ఈగ్రంథ ప్రచురణలో సహాయపడిన ఉ.వే. శ్రీమాన్ కోయిల్ కందాడై వెంకట సుందరాచార్య స్వామివారికి, వారి కుమారులు సహృదయ మిత్రం **శ్రీమాన్ లక్ష్మణ స్వామి వారికి** అనేక కృతజ్ఞతలు. వీరు ఇంతకముందే పలు సాంప్రదాయిక గ్రంథాలను ప్రచురించడం ద్వారా ప్రచారాన్ని చేస్తున్నారు. ఈ ప్రయత్నంలో నన్ను అన్నివిధాలా ప్రోత్సహించి, మార్గదర్శనాన్ని చేసిన పితృపాదులు **న్యాయవేదాన్త విద్వాన్, ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగాచార్యస్వామివారి** సన్నిధిలో సవినయంగా, కృతజ్ఞతా పూర్వకంగా ప్రణమిల్లుతున్నాను. గ్రంథముద్రణలో సహాయపడిన శ్రీమతి

ఏ.ఎస్.జయలక్ష్మి, శ్రీచంద్రశేఖర్, శ్రీహర్షవర్ధన్‌గార్లకు హార్దికంగా కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను. నా అనువాదంలోని లోటుపాట్లను సహించవలసినదిగా సహృదయపాఠకులను వేడుతూ, ఈ సద్గ్రంథప్రకాశనం భాగవతలోకానికి ఆనందం కల్గించగలదని నమ్ముతున్నాను. స్వస్తి.

విశేషార్థవ్యాఖ్యా మచకథత గోదోక్తసుకృతేః
తిరుప్పావైనామ్న్యాః సుమధురగిరాఽణ్ణంగరగురుః ।
రహస్యార్థై హృద్యా మనువదతి తామాంధ్రవచసా
నృసింహోఽయం దాసః సహృదయవిపశ్చిజ్జనముదే ॥

రామానుజమతసేవీ శ్రీమాన్ గోపాలకృష్ణమూర్తి రసౌ ।
గోదాకృపయా జీయాత్ ప్రకాశితేయం కృతిర్యేన ॥

భాగవతప్రాభృతకం సాహిత్యరసికనివేదనం చైతత్ ।
క్రియతే గోదాశ్రీవ్రతగాథాదివ్యార్థసౌరభం రుచిరమ్ ॥

తిరుపతి
25-10-13

ఇట్లు
భాగవత విధేయుడు
ఈ.ఏ. శింగరాచార్యులు

శ్రీవిల్లిపుత్తూరు వైభవం

పాండ్యదేశం మధ్యలో ఉండే శ్రీవిల్లిపుత్తూరు ఆ దేశానికి అద్వితీయా లంకారంగా భాసిస్తున్నది. ప్రాచీనమైన, చారిత్రకమైన ఈ క్షేత్రం ప్రస్తుతం తమిళనాడురాష్ట్రంలోని రామనాథపురం జిల్లాలో ఉన్నది. ఈ నగరానికి ఉత్తర, నైఋతి దిశలలో దీర్ఘమైన పర్వతశ్రేణులు వ్యాపించి ఉన్నాయి ఇది పెరియాళ్వార్ల, గోదాదేవి అవతారాలతో పునీతమైన క్షేత్రం. చెన్నై- త్రివేంద్రం రైల్వేమార్గంలో విరుదునగర్ జంక్షన్‌కు సుమారు 26 మైళ్ళదూరంలో ఈ దివ్యదేశం ఉన్నది. రోడ్డుమార్గంద్వారాకూడా ఈ క్షేత్రాన్ని చేరవచ్చు. శ్రీవిల్లిపుత్తూర్‌లోని వటపత్రశాయి పెరుమాళ్ కోవెల రాజగోపురాన్ని తమిళనాడు రాష్ట్రప్రభుత్వం రాజ చిహ్నంగా చేసికోవడం ఈ క్షేత్రవైలక్షణ్యానికి ఒక అద్వితీయ తార్కాణం. చాలా దూరంనుండి సందర్శకులకు మనోహరంగా కానవచ్చేఈ గోపురనిర్మాణవైభవం దర్శనైకవేద్యం.

పురాణకాలంనుండి ఈ క్షేత్రం చాలా ప్రసిద్ధిని పొందింది. మండూకమహర్షి ఇక్కడ చిరకాలం వాసం చేశాడు. గోరకమహర్షి అనే సిద్ధుడు ఇక్కడ చాలా కాలం నివసించి, "గోరకర్‌వైప్పు" అనే వైద్యగ్రంథాన్ని రచించాడట. తిరుజ్ఞాన సంబంధర్ అనే శివభక్తుడు జన్మించిన చోటు కూడా ఇదే. శ్రీవైష్ణవసంప్రదాయానికి చెందిన శ్రీరామానుజులు, శ్రీవేదాంతదేశికులు, మణవాళమహామునులు మొదలైన పూర్వాచార్యులతో ఈ క్షేత్రానికి అవినాభావసంబంధం ఉన్నది.

ఇక్కడ ఉండే ప్రసిద్ధాలైన ఆలయాలు రెండిటిలో - వటపత్రశాయి పెరుమాళ్ కోయిల్ ఒకటి. రెండవది ఆణ్డాళ్ కోయిల్. ఇది పెరియాళ్వార్ నివసించిన చోటుగా ప్రసిద్ధి. దీనికి **"నాచ్చియార్ తిరుమాళిగై"** అని కూడా పేరు.

వటపత్రశాయి పెరుమాళ్ కోయిల్‌కు పెరియపెరుమాళ్ కోయిల్- అనే పేరు కూడా ఉన్నది. ఈ ఆలయరాజగోపురం ఎత్తు సుమారు 196 అడుగులు. ఇది తొమ్మిది అంతస్థులను, పదకొండు కలశాలను కల్గి ఉన్నది. మధురప్రభువు శ్రీవల్లభదేవరాయలు ఈ గోపురాన్ని నిర్మించాడని ప్రతీతి. కంబమహాకవి ఈ గోపురాన్ని మేరుపర్వతంగా కీర్తించాడు. ఈ గోపురానికి సంబంధించిన అద్భుతమైన ఒక కథ కర్ణపరంపరగా వినవస్తున్నది. ఇక్కడ ఈ ప్రాంతంలో మహమ్మదీయుల దండయాత్ర జరిగినపుడు, మహమ్మదీయసైన్యం కోవెల లోపలకు ప్రవేశించి, కోవెలలోని అమూల్యరత్నాలను, విలువైన వస్తువులను దోచుకొనబోయింది. అపుడు

శ్రీవైష్ణవభక్తుడొకడు వారిని ధైర్యంగా అడ్డుకొని నిలబడ్డాడు. అతని ధైర్య సాహసాలను మహమ్మదీయ సేనాధిపతి చూచి ఆశ్చర్యపడి, "నీవు ఈ గోపురం పైకి ఎక్కి క్రిందకు దూకాలి. అపుడు నిన్ను నీ దేవుడు రక్షిస్తే, నేను ఏమీ దోచుకోకుండా తిరిగి వెళ్ళిపోతానని" సవాలు చేశాడు. వెంటనే ఆ భక్తుడు నిస్సంకోచంగా గోపురం పైకి ఎక్కి కిందకు ధైర్యంగా దూకాడని, అతనికి ఏ గాయం తగలలేదని, దానిని చూచిన ఆ సైన్యాధిపతి చాలా ఆశ్చర్యంతో తిరిగి వెళ్ళిపోయాడనే కథ జన ప్రచారంలో ఉన్నది.

ఈ కోవెలలో మూలవర్ పేరు వటపత్రశాయి పెరుమాళ్. ఈస్వామి భుజంగశయనంలో తూర్పు ముఖంగా శయనించి ఉంటాడు. తాయార్ పేరు ఆండాళ్. తీర్థం తిరుముక్కుళమ్. ఇచటి స్వామి మండూకమహర్షికి, పెరియాళ్వార్లకు ప్రత్యక్షం.

ఈ క్షేత్రానికి శ్రీవిల్లిపుత్తూరు- అనే పేరు కల్గడానికి కల కారణాన్ని తెలిపే కథ ఉన్నది. పూర్వం ఒకానొక సమయంలో శ్రీవిల్లిపుత్తూర్‌ను, తత్పరిసర ప్రాంతాలను **"మల్లి"** అనే రాణి పాలించిందట. అందువల్ల ఆ ప్రాంతానికి **"మల్లినాడు"** అనే పేరు వచ్చింది. ఇప్పటికీ, శ్రీవిల్లిపుత్తూర్‌కు సమీపంలో **"మల్లి"** అనే నగరం ఒకటి ఉన్నది. ఈ రాణికి **"ధనుష్మాన్- ఖండుడు" - (విల్లి, కండన్)** అని ఇద్దరు కుమారులు ఉండేవారు. వీరిరువురు ముందు జన్మలో మునులైనా, పరమభక్తుడైన శబరకులానికి చెందిన ఒక తాపసి విషయంలో చేసిన అపచారం కారణంగా శాపాన్ని పొంది కిరాతకులంలో జన్మించారు - అని వరాహ పురాణాంతర్గతమైన శ్రీవిల్లిపుత్తూర్ మాహాత్మ్యంలో తెలుపబడింది. ఒకనాడు వారిద్దరు వేటకోసం సమీపంలోని అరణ్యంలోకి వెళ్ళారు. ఖండుడు **(కండన్)** ఒక పులిని తరుముతూ అరణ్యంలో చాలా దూరం వెళ్ళాడు. చివరకు ఆ పులి అతనిని వధించింది. ధనుష్మాన్ **(విల్లి)** కూడా అరణ్యంలో వేఱొక దిక్కుగా చాలా దూరం వెళ్ళాడు. అతడు తన సోదరుడు ఖండుని కోసం వెదకినా అతని జాడలు కన్పించలేదు. విల్లి అలసిపోయి ఒక చెట్టుకింద నిద్రించాడు. అపుడు అతనికి కలలో భగవానుడు కన్పించి, అతని సోదరుడు ఖండుడు అరణ్యంలో పులిచే చంపబడినట్లు తెలిపి, అక్కడకు దగ్గరగా ఉండే పొదలలో పుట్టకింద తాను అర్చారూపంలో గుప్తంగా ఉన్నట్లు తెలియజేశాడు. తన మూర్తిని వెలికిదీసి, ఆలయప్రాకారాదులను మధురను పాలించే పాండ్యరాజు సహాయంతో నిర్మింప జేయమని కూడా ఆదేశించాడు. ధనుష్మాన్ (విల్లి) భగవదాజ్ఞను అనుసరించి

భగవన్మూర్తిని బయటకు తీసి, పాండ్యప్రభువు సహకారంతో ఆలయాన్ని నిర్మింపజేసి, చుట్టూ నగరాన్ని కూడా అభివృద్ధిచేశాడు. ధనుష్మాన్ అనే పేరును కల అతనిచే కొత్తగా నిర్మింపబడిన ఊరు కనుక, ఆప్రాంతానికి **(ధన్వినవ్యపురి)** **"విల్లిపుదూర్"** అనే పేరు వచ్చింది. దీనికి ముందు ఉండే **"శ్రీ"** అనే పదం మంగళవాచకం. ఈ వృత్తాంతం వరాహపురాణాంతర్గతమైన శ్రీవిల్లిపుత్తూర్ క్షేత్రమాహాత్మ్యంలో ఆఱవ అధ్యాయంలో ఉన్నది.

ఈ ప్రాంతానికి **"పుదువై పుత్తూర్"** అనే పేరు కూడా ఉన్నది. ద్రావిడంలో పుట్టకు **"పు*ఱ్*ఱు"** అని పేరు. పూర్వం ఈ నగరం ఒక పెద్ద పుట్టచే ఆవరింపబడి నందున, "విల్లి" అనే ప్రభువుద్వారా మళ్ళీ నూతనంగా పునర్నిర్మింపబడినందున దీనికి గుర్తుగా **"పుదువై పుత్తూర్"** అనే పేరు వచ్చిందని కూడా అంటారు.

ఈ క్షేత్రానికి వరాహక్షేత్రమనే పేరు కూడా ఉన్నది. వరాహపురాణంలోని సూతప్రోక్తమైన వరాహక్షేత్ర మహిమను అనుసరించి ఈ పేరు కల్గడానికి గల కారణం ఈ క్రింది విధంగా తెలుపబడింది. హిరణ్యాక్షుడనే రాక్షసుడు క్రూరుడై ఈ ప్రాంతంలో నివసించే జనులను, మునులను పీడించాడు. అతడు భూమిని చాపగా చుట్టి సముద్రం లోపలకు ముంచి వేశాడు. భగవానుడు భూదేవి ప్రార్థనను మన్నించి వరాహావతారాన్ని ఎత్తి అతనిని వధించిన తరువాత, తాను కొంతకాలం ఆ రూపంలోనే శ్రీవిల్లిపుత్తూర్ ప్రాంతంలో నిలచి ఉండి అందఱిని అనుగ్రహిస్తానని, దానివల్ల దానికి వరాహక్షేత్రమనే పేరు వస్తుందని వరమిచ్చాడు. **"దేవి ! విశ్వంభరేఽత్రైవ నిత్యసంనిహితోఽస్మ్యహమ్, తతో వరాహనామైతత్ లభతే క్షేత్ర ముత్తమమ్"** **(1-42)** అనే వరాహపురాణాంతర్గతమైన శ్రీవిల్లిపుత్తూర్ క్షేత్రమాహాత్మ్యంలోని శ్లోకం ఈవిషయాన్ని తెల్పుతున్నది. ఈరీతిలో దీనికి వరాహక్షేత్రమనే పేరు వచ్చింది. తరువాత కొంతకాలానికి ఈ ప్రాంతం అరణ్యంగా మాఱిపోయింది. చాలా ప్రశాంతంగా, తపస్సుకు అనుకూలంగా ఉండే ఇక్కడ భృగువు, మార్కండేయుడు మొదలైన పలువురు మునులు తపస్సు చేసికొనేవారు. అపుడు కాలనేమి అనే అసురుడు వారి తపస్సుకు భంగాన్ని కల్గించాడు. మహర్షులు భగవానుడైన శ్రీమన్నారాయణుని రక్షించమని అర్థించారు. భగవానుడు చక్రాయుధాన్ని కాలనేమి వధించడంకోసం ప్రయోగించాడు. చక్రాయుధం కాలనేమిని వధించింది. అపుడు కాలనేమిరక్తం చక్రానికి అంటుకొన్నది. ఆరక్త స్పర్శ పోవడంకోసం గంగ, యమున, సరస్వతి- నదులను అక్కడకు ప్రవహించి కలువమని, ఆ పుష్కరిణి తీర్థంలో సుదర్శనచక్రం స్నానమాడి కాలనేమి రక్తస్పర్శను

తొలగించుకొనగలదని భగవానుడు ఆజ్ఞాపించాడు. ఆమూడు నదులు ఆవిధంగానే ప్రవహించి వచ్చి కలిశాయి. అందువల్ల ఈ క్షేత్రంలోని పుష్కరిణికి "త్రివేణి" - "తిరుముక్కుళమ్" అనే పేర్లు వచ్చాయి. **"ఏతస్య సురమాంసాసృక్పంకిలాంగస్య మాధవః, ప్రక్షాళనాయ భగవానస్మరచ్చ నదీత్రయమ్, తతో గంగాఽవిర్భవత్ యమునా చ సరస్వతీ, తాస్తు చక్రం తథాభూతం సంస్నాప్య బహుశః శనైః, భూమౌ సరఃస్వరూపేణ తత్ర తస్థుః హరేః పురః" (4-35,36)** అనే శ్రీవిల్లిపుత్తూర్ మాహాత్మ్యంలోని శ్లోకాలు ఈ వృత్తాంతాన్ని తెల్పుతున్నాయి. గోదాదేవి తిరుప్పావైలో మార్గశీర్షస్నానావగాహంకోసం ప్రస్తావించిన ఈ పుష్కరిణియే అని పెద్దల సూక్తి. ఈ నాటికీ ఈ పుష్కరిణి తీరంలో ఉత్తరదిశగా మఱ్ఱిచెట్టు, దాని కింద శ్రీసుదర్శన మూర్తి సాక్షాత్కరిస్తాయి.

కాలనేమి వధానంతరం మునుల ప్రార్థనను అనుసరించి భగవానుడు ఇక్కడ మఱ్ఱిచెట్టు కింద శయనించిన భంగిమలో అర్చామూర్తిగా వేంచేసి ఉన్నాడు. అందువల్ల ఈ స్వామికి వటపత్రశాయి అని, ఈ క్షేత్రానికి వటేశ్వరపురమని పేర్లు కలిగాయి. ఈ వృత్తాంతం వరాహపురాణాంతర్గతమైన శ్రీవిల్లిపుత్తూర్ మాహాత్మ్యంలోని నాల్గవ అధ్యాయంలో గల ఈ క్రింది శ్లోకాల వల్ల తెలుస్తున్నది- "మునయ ఊచుః - "శ్రూయతా మభిధాస్యామః శేషభోగే మనోహరే, శయానం త్వాం శ్రియా భూమ్యా, ద్రష్టుం కాంక్షామహే వయమ్, ఇతి తైర్యాచితః శ్రీమాన్ భక్తవత్సో జగత్ప్రభుః, తథాస్త్వితి ప్రతిజ్ఞాయ తత్రైవాంతర్దధే హరిః, తత్తటాకాన్నాతిదూరే కుత్రచిత్ సుమహాన్ వటః, సమంతాత్క్రోశవిస్తారః శాఖాగతసమావృతః, అభ్రాలిశరదా స్నిగ్ధచ్ఛాయామండలశోభితః, తత స్తే మునయః సర్వే తస్య మూలతలం యయుః, తత్రాపశ్యన్మణిమయే విమానే విమలాకృతౌ, అనంతభోగపర్యంకే సమున్నత ఫణావృతే, సంవాహ్యమానచరణం శ్రియా భూమ్యా చ సాదరమ్, నాభిపద్మస్ఫురద్బ్రహ్మముగ్ధస్తుతి పదోత్కరైః, ఈడ్యమానం పురాణైశ్చ మునిభిః శౌనకాదిభిః, సేవ్యమానం సదా సిద్ధైః గీయమానం సమంతతః, సర్వాభరణ సంయుక్తం స్వసర్వాయుధరక్షితమ్, ద్వారపాలై గణేశైశ్చ రక్ష్యమాణం హరిం తదా, తే దృష్ట్వా మునయః సర్వే పరమం విస్మయం గతాః, భూమౌ ప్రణమ్య తే శ్రీశం ప్రత్యుత్థాయేద మబ్రువన్"

మునయ ఊచుః- "భగవన్ ! కృతకృతాస్స్మ స్సనాథా వయ మంజసా, దృష్ట్వాఽద్య సర్వగోప్తారం భవంతం శేషశాయినమ్, అనేన తవ రూపేణ సంనిధేహి

సదేహ నః", ఇతి తైర్యాచితః శార్ఙ్గీ శరణాగతవత్సలః, ఉవాచ తాన్ మునీన్ సర్వాన్ వికాసీ కమలేక్షణః"

శ్రీభగవానువాచ- శ్రుణ్వంతు మునయ స్సర్వే మదేవాంతమనోరథమ్, సదా సన్నిహితోఽస్మ్యత్ర మునయః సపితామహాః, అనేనైవ స్వరూపేణ మామిహారాధయన్ పురా, దర్శితం హి భవద్భ్యోఽహి రూపమేత దనుత్తమమ్, ఇతః పశ్చాత్ భవంతోఽపి పరే చ సుసమాహితాః, అర్చావతారరూపేణ నిగూఢం భావనామయమ్, మామర్చంత్వత్ర సతతం సర్వాభీష్టఫలప్రదమ్, వటేశ్వరపురం నామ పుర మేతత్ సనాతనమ్, వటమూలేఽత్ర యే యస్మాత్ ప్రాదుర్భావగతోఽస్మ్యహమ్, తం మాం వటమహాధామనామ్నా లోకోఽర్చయిష్యతి, ఇత్యుక్త్వాంఽతర్దధే శౌరిః తత్ర తేషాం తు పశ్యతామ్ పశ్చాత్తే మునయ స్సర్వే వ్యవసాయ సమాయుతాః, అర్చావతారరూపేణ ప్రతిష్ఠాప్య జగత్పతిమ్, అర్చయిత్వా యథా న్యాయం బ్రహ్మభూయం సమాగతాః".

ఈ క్షేత్రానికి సమీపంలో ఉండే పర్వతానికి మండూకపర్వతమని పేరు. ఈ పేరు రావడానికి గల కారణాన్ని తెలిపే పౌరాణిక వృత్తాంతం ఒకటి ఉన్నది. ఒకానొక సమయంలో సుతపుడనే ముని తిరుమాలిరుమ్‌శోలై క్షేత్రసమీపంలో గల శిలమ్బాఱు (నూపురగంగ) తీరంలో తపస్సు చేసికొనేటపుడు, అచటికి దూర్వాసముని వచ్చాడు. అతని రాకను సుతపుడు గమనించినందున దుర్వాసుడు అతనిపై కోపించి మండూకరూపాన్ని (కప్పరూపును) పొందాలని అతనిని శపించాడు. సుతపుడు ఆ మునిని శాపవిమోచనంకోసం వేడగా, దుర్వాసుడు అతనిని శ్రీవిల్లిపుత్తూర్ సమీపంలో ఉండే ధర్మాద్రివద్దకు పోయి, అక్కడ ఉండే నదిలో స్నానమాడి అచటి భగవానుని ఆరాధిస్తే శాపవిమోచనం కల్గుతుందని పలికాడు. ఆవిధంగా మండూకరూపాన్ని పొందిన సుతపుడు తపస్సు చేసి శాపవిమోచనం పొందిన పర్వతం కనుక, ఈ పర్వతానికి మండూకపర్వతమనే పేరు వచ్చింది. ఈ వృత్తాంతాన్ని పౌరాణికమైన శ్రీవిల్లిపుత్తూర్ మాహాత్మ్యంలోని ద్వితీయాధ్యాయంలో గల ఈ క్రింది శ్లోకాలు తెల్పుతున్నాయి.

నారద ఉవాచ - "సుతపా నామ ధర్మాత్మా కౌండిన్యకులసంభవః, వృషభాద్రౌ తప్త స్తేపే బ్రహ్మసాయుజ్యకామ్యయా, తత్ర నూపురనద్యాం తు పుణ్యే తస్య తపోవనే, ఆగతా బ్రహ్మనిష్ఠాంతా వాలఖిల్యాస్తపోధనాః, మునయో వాతరసనా దూర్వాశః ప్రముఖా స్తథా, తానాగతా నసంభాష్య సుతపాః స్నానకాంక్షయా, అవతీర్ణో

మహానద్యా మఘమర్షణ మాస్థితః, జలాంతరావగాఢం తం సుచిరం ప్రతిపాల్యతే, అవసన్నాశ్రమే తేన క్రుద్ధోఽభవన్మునిః, దుర్వాశాః సుతపా స్తత్ర స్నాతో ధ్యాయక్రమాత్తతః, ఆశ్రమం సమనుప్రాప్య తేషాం పూజార్థముద్యతః, వహన్నాతిథ్యసంభార మృషీణాం మగ్రతో గతః, తదా మునిస్తు దుర్వాశాః శశాపైనం సమాగతమ్, అనాత్మజ్ఞ! మహాభాగా నేతాంశ్చ గృహమాగతాన్, అనాదృత్య జలాకాంక్షీ మండూకో భవ సర్వదా....."- "మహాముని స్తు దూర్వాశా యదువాచ తథైవ తత్; తపస్విన్! అత్ర మాభైషీ రనుగృహ్ణీమహే వయమ్, వరాహక్షేత్రపర్యంతే ధర్మాద్రిర్నామ పర్వతః, తస్య ప్రాచీనభాగే తు నిర్ఝురః సంప్రవర్తతే, తస్యోభయో స్తు తటయోః పుష్పితద్రుమసంఘయోః, పురాఽవసన్ మహాత్మానః సత్త్వనిష్ఠా స్తపోధనాః... తేషా మభిమతే తత్ర నిర్ఝురే త్వాం సమాప్లుతః, పరిత్యక్ష్యసి మండూకం రూప మేతన్మహామునే!, మండూకముని రిత్యాఖ్యా తవ వత్స! భవిష్యతి, ధర్మాద్రిశ్చ భవద్యోగాన్మండూకాఖ్యో భవిష్యతి, తత్రైవ తవ ఆతిష్ఠ శీఘ్రం సిద్ధి మవాప్స్యసి", ఏతచ్ఛ్రుత్వా తు సుతపాః ప్రశ్నం పునరథాబ్రవీత్, సుతపా ఉవాచ - "భగవంతో యదాహు స్తత్ తథా భవతు నాన్యథా, యస్తు నియమః కృతః పూర్వం మయా నిత్యం సమాశ్రితః, అత్ర నూపురనద్యాం తు స్నాత్వా నియమమానసః, నిత్యం తమర్చయిష్యామి సుందరాఖ్యం హరింత్వితి, తచ్ఛ్రుత్వా మునయ స్సర్వే విస్మితాః ప్రతినందితాః, పునరూచు రిదం వాక్య మనుగ్రహ సమేధితమ్, మునయ ఊచుః- "మండూకపర్వతే తత్ర సుందరాఖ్యో హరిః స్వయమ్, సన్నిధత్తాం మహానద్యా నూపురాయాశ్చ నిర్ఝురే, సాధో సదైవ సంప్రాప్తా ఆతిథ్యం సాధయామహే, ఇత్యుక్త్వాంతర్దధు స్సర్వే మునయ స్తత్ర తే తే తదా "-

ఆ మండూక ముని ప్రార్థించగా, అతడు నిత్యం ఆరాధించే తిరుమాలిరుమ్‌శోలైలో వేంచేసి ఉండే సుందరరాజస్వామి రూపంలో భగవానుడు మండూకపర్వతంపై ఆవిర్భవిస్తాడని మునులు వరమిచ్చారు. ఆ రీతిలోనే భగవానుడు సుందరబాహురూపుడై ఆవిర్భవించగా అపుడు ఆ ముని భగవానుని దర్శించి మోక్షాన్ని పొందాడు.

వటపత్రశాయి పెరుమాళ్ కోవిల్‌కు మూడు ప్రవేశద్వారాలున్నాయి. ఈ ఆలయం రెండు అంతఃస్థులను కల్గి ఉన్నది. రెండవ అంతఃస్థులో మూలమూర్తి విగ్రహం ఉన్నదట. శ్రీవిల్లిపుత్తూర్ ఆలయం నిర్మింపబడిన ప్రదేశం పూర్వం

దట్టమైన అరణ్యప్రాంతంగా, పుట్టలతో నిండి ఉన్నందున అక్కడ భూమినుండి నీరు ఉబికి పైకి వస్తూ ఉండేదట. అందువల్ల ఈ ఆలయం రెండు అంతః స్థులతో నిర్మింపబడిందని పెద్దలంటారు. దక్షిణ దిశలోగల మెట్లద్వారా పై అంతః స్థును చేరుకొని మూలమూర్తిని దర్శించాలి. గర్భాలయంలో మూలమూర్తి అయిదు పడగలను కల్గిన ఆదిశేషునిపై శయనించి ఉన్నాడు. శ్రీదేవి భూదేవులు ఇరువురు చెఱి ఒక వైపు కూర్చున్న భంగిమలో స్వామి శ్రీచరణసంవాహనాన్ని చేస్తున్న సన్నివేశంలో ఉన్నారు. స్వామి కుడిచేయి అధోదిశగా దర్శనమిస్తుంది. కుడిచేయి అభయముద్రతో ఉన్నది. స్వామికి దగ్గరలో విల్లి, కంఠన్ విగ్రహాలున్నాయి. స్వామి నాభీకమలం చతుర్ముఖ బ్రహ్మను కల్గిఉన్నది. భగవానుడు శ్రీహస్తాలలో శార్ఙ్గం, కౌమోదకి, పాంచజన్యం, సుదర్శనం, నందకం- అనే పంచాయుధాలను ధరించి ఉన్నాడు. స్వామి సమీపంలో సూర్య, చంద్ర, వరుణులు కూడా దర్శనమిస్తారు. స్వామి శిరస్సుకు సమీపంలో గరుడాళ్వార్, విష్వక్సేనులు నిలచిన సన్నివేశంలో కన్పిస్తారు. వీరే కాక, ఒక కిన్నరమిథునం కూడా గోచరిస్తుంది. ఆదిశేషునకు దగ్గరలో కుడివైపున మార్కండేయ మహర్షి, ఎడమవైపున భృగుమహర్షి ఉన్నారు. గర్భగృహంలోని ఉత్తరదిశలోని గోడపై శివుని చిత్రం చిత్రీకరింపబడి ఉన్నది. స్వామి కిరీటం, పీతాంబరం, ఆభరణాలు- అన్నీ బంగారు రంగును కల్గి కళ్ళకు మిఱుమిట్లు గొల్పుతాయి. మార్గళి వ్రతప్రారంభం నాడు ఆణ్డాళ్ దివ్యాలంకారంతో వటపత్రశాయి స్వామి కోవెలకు వేంచేస్తాడు. ఆ సమయంలో భక్తులకు సౌకర్యంకోసం ఆలయం మూడు ద్వారాలు తెఱువబడుతాయి. దక్షిణ ప్రాకారంలో ఆణ్డాళ్ అవతరించిన నందనవనం ఉన్నది.

ఆణ్డాళ్ కోవెల వటపత్రశాయి పెరుమాళ్ కోవెల కంటే పెద్దది. ఈ ఆలయం కూడా తూర్పుముఖంగా ఉన్నది. ఈ ఆలయంలోని స్తంభాలు చాలా పెద్దవి. అద్భుత శిల్పకళాసంపదలో చూపును ఆకర్షిస్తాయి. వేణుగోపాల, రామ, లక్ష్మణ, కర్ణ, మన్మథ, విశ్వకర్మ, సరస్వతి మొదలైన ఆకృతులు వీటిపై గోచరిస్తాయి. ఒక స్తంభంలోని శిల్పం ఆకారం గజముఖాన్ని, కంఠంనుండి నడుమువరకు స్త్రీరూపాన్ని, నడుమునుండి కిందవరకు సింహరూపాన్ని కల్గి ఉండడం చూపరులకు ఆశ్చర్యాన్ని కల్గిస్తుంది. ఆస్తంభంలోనే వేఱొక వైపు శంఖనిధి, పద్మనిధి ఆకారాలు చెక్కబడ్డాయి. ఈ రూపాలు అరుదైనవి. ఆణ్డాళ్ కోవెలలో మూడు బావులున్నాయి. ఒక బావికి **"కణ్ణాడి కిణరు"** అని పేరు. (**కిణరు=బావి**) దీనికే దర్పణ తీర్థమనే పేరుకూడా ఉన్నది. గోదాదేవి తులసీ మాలను అలంకరించుకొని, తన ప్రతిరూపాన్ని ఈబావి

నీటిలోనే చూచి పరీక్షించుకొన్నదని ప్రతీతి. ఇందులోని నీరు చాలా స్వచ్ఛంగా ఉంటుంది. ఏనాటికీ ఈ బావి ఎండదు. రెండవ బావికి **"చందన కిణరు"** అని, గరుడతీర్థమని పేరు. మూడవ తీర్థానికి **"తిరుమడప్పళ్ళి కిణరు"** అని, వాసుకి తీర్థమని పేరు.

ఆణ్డాళ్ కోవెలలోని గర్భగృహంలో ఏకాసనంలో మధ్యలో రంగమన్నార్, కుడివైపున గోదాదేవి, ఎడమ వైపున పెరియ తిరువడి (గరుడుడు) వేంచేసి ఉన్నారు. వీరు ముగ్గురు ప్రణవరూపానికి సంకేతం. అకారానికి రంగమన్నార్, ఉకారానికి ఆణ్డాళ్, మకారానికి గరుడుడు సంకేతాలు. ఈమూడు వర్ణాలు కలిస్తే **"ఓమ్"** అనే ప్రణవంగా కదా రూపొందుతుంది. అంతేకాక, ఈ ముగ్గురు తత్త్వత్రయానికి సంకేతం. రంగమన్నార్ ఈశ్వరతత్త్వానికి, ఆణ్డాళ్ చిత్తత్త్వానికి, గరుడుడు అచిత్తత్త్వానికి ప్రతీకలు. గరుడుడు, తనను వివాహసమయానికి సకాలంలో తీసికొని వచ్చినందుకు ఆనందించి భగవానుడు అతనికి గోదాదేవితో తనతో సమానమైన ఆసనాన్ని ఇచ్చి గౌరవించాడని ప్రతీతి.

ఆణ్డాళ్ ఉత్సవవిగ్రహానికి సంబంధించిన ఒక వృత్తాంతం ఉన్నది. ఆణ్డాళ్ నాచ్చియార్ తిరుమొழி అనే ప్రబంధంలో, తిరుమాలిరుమ్ శోలై క్షేత్రంలోని సుందరబాహుస్వామికి నూఱు గంగాళాల వెన్నను, పాయసాన్ని సమర్పిస్తానని అన్నది. కాని, ఆమాటను కార్యరూపంలో నెరవేర్చలేకపోయింది. తరువాతి కాలంలో శ్రీరామానుజులు ఆ మాటను పూర్తిచేసి, సుందరబాహుస్వామికి నూఱు గంగాళాల వెన్నను, పాయసాన్ని నివేదన చేశారు. శ్రీరామానుజులు తరువాత ఒకానొక సమయంలో శ్రీవిల్లిపుత్తూర్‌కు వేంచేసినపుడు, ఆణ్డాళ్ తన మాటను సఫలం చేసినందులకు చాలా సంతోషించి, వేగంగా గర్భగృహంనుండి వెలుపలికి అర్ధమండపం వరకు వచ్చి, శ్రీరామానుజులను **"అణ్ణా !"** అని అంటూ గౌరవంగా సంబోధించిందట. దీనికి గుర్తుగా ఈనాటికీ ఆణ్డాళ్ అర్చామూర్తి గర్భగృహంలో కాకుండా అర్ధమండపంలోనే వేంచేసి ఉన్నది.

ఆణ్డాళ్ శ్రీహస్తంలోని చిలుక బొమ్మకు సంబంధించిన వృత్తాంతం కూడా ఒకటి ఉన్నది. నాచ్చియార్ తిరుమొழி ప్రబంధంలోని ఒక పాశురంలో ఆణ్డాళ్ కోయిలను తన ప్రేమను నివేదించే దూతగా స్వామివద్దకు పంపింది. ఆకోకిలతో పలికేటపుడు, అది కార్యాన్ని సఫలం చేసి తిరిగి వస్తే, దానికి ప్రతిఫలంగా తాను వెంటే చిలుకను సఖిగా ఇస్తానని మాట ఇచ్చింది. ఈ పాశురానికి గుర్తుగా, ఆణ్డాళ్

విగ్రహంలోని శ్రీహస్తంలో చిలుక బొమ్మ అలంకరింపబడి ఉన్నది. కొన్నిచెట్ల ఆకులతో అరటి దారాలతో, వెదురు కర్రలతో, అందంగా చేయబడే ఈ చిలుక బొమ్మను నిర్మాణం చేసే కౌశలం కేవలం ఆ దివ్యదేశంలోని కొన్ని కుటుంబాల సొత్తు. ప్రతిదినం ఆణ్డాళ్ శ్రీహస్తంలో అలంకరింపబడే ఈ చిలుక బొమ్మ మఱునాడు భక్తులకు ప్రసాదంగా అనుగ్రహింపబడుతుంది.

ఆణ్డాళ్ కోవెలలో శ్రీసుదర్శనస్వామి ప్రతిష్ఠింపబడడానికి గల కారణాన్ని తెలిపే ఆసక్తిని కలుగజేసే ఒక వృత్తాంతం ఉన్నది. ఆణ్డాళ్ కోవెలలో ఈనాడు మనకు దర్శనమిచ్చే శ్రీసుదర్శనస్వామిమూర్తి ఒకానొక సమయంలో తిరువనంతపురంలో ఉండేదట. మహమ్మదీయులు ఈ క్షేత్రప్రాంతంలో ముట్టడి చేసినపుడు, శ్రీవిల్లిపుత్తూర్‌లోని అర్చావిగ్రహాలు కేరళ రాజ్యానికి తీసికొనిపోబడి అక్కడ తిరువనంతపురక్షేత్రంలో రక్షింపబడ్డాయి. తిరువనంతపురంలోని సుదర్శనమూర్తి చాలా ఉగ్రంగా, అగ్నిజ్వాలలను వెలువరించే రీతిలో ఉండేదట. గోదాదేవి అర్చామూర్తి ఆ క్షేత్రంలోని ఆలయంలోకి తీసికొనిపోగానే, శ్రీసుదర్శన స్వామి శాంతమూర్తి అయ్యాడట. కొంతకాలం తర్వాత ఆణ్డాళ్ మూర్తిని శ్రీవిల్లి పుత్తూర్‌కు తిరిగి తీసికొనిపోయినపుడు మళ్ళీ సుదర్శనమూర్తి ఉగ్రుడయ్యాడట. అందువల్ల ఆ సుదర్శనమూర్తి శ్రీవిల్లిపుత్తూర్‌కు తీసికొనిరాబడి ఆణ్డాళ్ సన్నిధిలో ప్రతిష్ఠింపబడింది. ఆమూర్తి చాలా కాలం వటపత్రశాయి పెరుమాళ్‌కోవిలలోని పై అంతఃస్థులో ఏ ఆరాధన లేకుండా ఉన్నాడట. తరువాతనే ఈమూర్తికి సన్నిధి ఏర్పాటు చేయబడింది. ఈసుదర్శనమూర్తి పంచలోహవిగ్రహం. ఈ మూర్తిలో శ్రీవత్సచిహ్నం దర్శనమిస్తున్నందున ఇది భగవానుడైన శ్రీమన్నారాయణుని ప్రతిరూపంగా భావింపబడుతున్నది. శ్రీసుదర్శనమూర్తికి వేఱొక వైపున లక్ష్మీసహితుడైన నృసింహస్వామి దర్శనమిస్తాడు.

ఆణ్డాళ్ కోవెలలోని రథం కూడా చాలా ప్రసిద్ధమైనది. ఇపుడు ఉండే రథాన్ని సుమారు 150 సం॥లకు పూర్వం శ్రీవానమామలై జీయర్ నిర్మింపజేశారు. దీని ఎత్తు 160 అడుగులు. దీనికి ముందున్న రథం ఒక పర్యాయం జరిగిన రథోత్సవసమయంలో తిరుప్పాఱ్కడల్ తీర్థంలో దిగబడిపోయి బయటకు రాలేదట. అపుడు ఆ రథంలోని అపూర్వశిల్పసంపదను కల శ్రీరామాయణ, భారతంలోని సంఘటనలను సూచించే భాగాలు ఆలయంలోని గోపాలవిలాసమనే పేరును కల పగల్‌పత్తు మండపంపై భాగంలో బిగింపబడ్డాయి. శ్రీవిల్లిపుత్తూర్‌లో పలు పుణ్యతీర్థాలున్నాయి. కణ్ణాడి తీర్థం, చక్రతీర్థం, తిరుప్పాఱ్కడల్ తీర్థం,

త్రివేణి (తిరుముక్కుళం) తీర్థం, మండూకనది (నూపురగంగ), కణ్వతీర్థం, చంపకవనంలోని పంచతీర్థాలు మొదలైనవి వాటిలో కొన్ని.

శ్రీవిల్లిపుత్తూర్ క్షేత్రంలోని ఆలయాలలో లభించే పలు శిలాశాసనాలు ఆక్షేత్రంలో పలువురు ప్రభువులు, ధనికులు చేసిన అనేక దానధర్మాలను గూర్చిన వివరాలను తెల్పుతున్నాయి. ఇవి అన్నీ ఆ క్షేత్రవైభవానికి ప్రతీకలు. వాటి వివరం విస్తృతిభీతిచేత ఇక్కడ ప్రస్తావించడంలేదు.

దివ్యప్రబంధాలలో శ్రీవిల్లిపుత్తూర్ వైభవం

మిన్ననైయ నుణ్ణిడైయార్ విరికుழల్ మేల్ నుழైన్ద వణ్డు
ఇన్నిశైక్కుమ్ విల్లిపుత్తూర్ ఇనిదమర్న్దాయ్ ! ఉన్నై క్కణ్డార్
"ఎన్న నోన్బు నోற்றாళ్‌కొళ్ ఇవనైప్పెற்ற వయిఱుడైయాళ్
ఎన్నుమ్ వార్త్తై ఎయ్‌దువిత్త విరుడీకేశా ! ములై యుణాయే !॥

శ్రీవిల్లిపుత్తూర్‌లోని, మెఱుపువలె ఉండే సన్నని నడుమును కల స్త్రీల విస్తరించిన కేశపాశంపై మధుపానం చేయడంకోసం ప్రవేశించిన (వాలిన) తుమ్మెద మధురంగా ధ్వనిస్తున్నది. అటువంటి శ్రీవిల్లిపుత్తూర్‌లో, పరమపదంలో కంటే మిక్కిలి ప్రీతితో నిత్యవాసం చేసేవాడా! రూపగుణాలతో, చేష్టలతో విలక్షణుడవైన నిన్ను చూచినవారు, "ఇతనిని కన్నతల్లి ఏమి నోము నోచిందో కదా!" అని పొగడేమాట నాకు కల్గించిన హృషీకేశా! నా స్తన్యాన్ని తాగు.

ఈ పాశురంలో ప్రస్తావింపబడిన తుమ్మెద వృత్తాంతం ద్వారా గోదాదేవి తాను ధరించి సమర్పించిన పూమాలిక పట్ల మిక్కిలి ఆదరాన్ని వటపత్రశాయి స్వామి పొందిన వృత్తాంతం సూచింపబడింది - అని పూర్వాచార్యుల అభిప్రాయం.

మెన్నడై యన్నమ్ పరన్దు విళైయాడుమ్ విల్లిపుత్తూరుఱైవాన్తన్
పొన్నడి కాణ్బతోరాశైయినా లెన్ పొరు కయఱ్కణ్ణిణై తుఞ్జా
ఇన్నడిశిలొడు పాలముతూట్టి ఎడుత్త ఎన్ కోలక్కిళియై
ఉన్నొడు తోழమై కొళ్ళువన్ కుయిలే ! ఉలకళన్దాన్ వర క్కూవాయ్ 5

మందగమనాన్ని కల హంసలు అంతటా వ్యాపించి క్రీడించడానికి తగిన చోటు అయిన శ్రీవిల్లిపుత్తూర్‌లో వేంచేసి ఉండే భగవానుని బంగారు వలె స్పృహణీయాలైన పాదాలను దర్శించడంలో ఉండే ఆశచేత పరస్పరం స్పర్ధించే రెండు కోర మీనులవంటి

నా నేత్రాలు నిద్రించడం లేదు. ఓ కోయిలా! (త్రివిక్రముడై) లోకాలను కొలిచిన స్వామి వచ్చేటట్లుగా నీవు కూయాలి (ఆ విధంగా నీవు కూస్తే) బెల్లపు పాయసాన్ని, పాలపాయసాన్ని తాగించి పెంచిన నా అందమైన పెంపుడు చిలుకను నీతో స్నేహం చేసేటట్లు చేస్తాను.

ఈ పాశురంలో ప్రస్తావింపబడిన హంస ద్వారా "మెయ్‌న్నావన్ మెయ్యడియాన్ నాథయామునిపోల్‌వార్రై అన్నమెన్నుమ్" అనే ఆచార్య హృదయ సూక్తి సారస్యాన్ని బట్టి, దీనిని "మెయ్‌న్నావన్ మెయ్యడియాన్ విట్టుశిత్తన్ - ఎన్గిఅ పెరియాఴ్వార్ పోల్ వార్రైయుమ్" అని అంటూ వివరించిన శ్రీవరవరముని సూక్తిస్వారస్యాన్ని బట్టి విశుద్ధమైన జ్ఞానాన్ని, అనుష్ఠానాన్ని కల్గిన పెరియాఴ్వార్లు సూచింపబడ్డారని అభిజ్ఞులైన పూర్వాచార్యుల అభిప్రాయం.

పెరియాఴ్వార్ తిరుమొఴి, నాచ్చియార్ తిరుమొఴి ప్రబంధాలలోని దశకాలకు ఫలశ్రుతిని తెలిపే చివరి పాశురాలలో శ్రీవిల్లిపుత్తూర్ వైభవాన్ని తెలిపే పలు సూక్తులున్నాయి. వాటిని పెరియవాచ్చాన్‌పిళ్ళై వివరణవల్ల ఆ క్షేత్రానికి చెంది పలు విశేషాలు తెలుస్తున్నవి.

1) శ్రీవిల్లిపుత్తూర్‌లోని ఉద్యానవనాల సమృద్ధి :

పెరియాఴ్వార్ తిరుమొఴిలోని "నాట్కమఴ్ పూమ్పొఴిల్ విల్లిపుత్తూర్ (1-6-11), "వణ్డు అమర్ పొఴిల్ పుదువై" (4-4-10), "కోలమార్‌పొఴిల్ పుదువై" (4-7-11) అనే సూక్తులు శ్రీవిల్లిపుత్తూర్‌లోని ఉద్యానవనాల వైభవాన్ని తెల్పుతున్నాయి. అంతేకాక, ఆ క్షేత్రంలోని తటాక సమృద్ధి, అందులో తామరల సమృద్ధి "నీరణిన్ద కువళై వాశమ్ నికఴునాఴుమ్ విల్లిపుత్తూర్" (2-2-11) అనే ప్రయోగం ద్వారా తెలుపబడింది.

స్వాపదేశార్థ ప్రక్రియలో - "అహృతసహజదాస్యాః సూరయః ప్రస్తబంధాః" ఇత్యాది పరాశరభట్టర్ సూక్తిక్రమంలో ఇక్కడి ఉద్యానవనాలు, అందులోని వృక్షలతాదులన్నీ నిత్యముక్తుల రూపాలు. "వణ్డు అమర్ పొఴిల్ శూఴ్" అనే సూక్తి లోని తుమ్మెదను తెలిపే "వణ్డు" అనే పదానికి "పొరివణ్డు" అనే తిరుప్పావై సూక్తిని బట్టి, "దెయ్‌వవణ్డు" అనే నమ్మాఴ్వార్ల సూక్తిని బట్టి స్వాపదేశార్థంలో భగవానుడని అర్థాన్ని గ్రహించడం సరసం. అందువల్ల ప్రకృత ప్రయోగం ద్వారా శ్రీవిల్లిపుత్తూర్‌లోని తోటలలో అచటి స్వామి ఆదరంతో విహరించే సన్నివేశం సూచితం అని చెప్పవచ్చు. అంతేకాక, ఆచార్యులు తుమ్మెదతో ఉపమింపబడడం

చేత, ఈ క్షేత్రంలో ఆదరాన్ని కల్గిన పూర్వాచార్యులు ఈ పదం ద్వారా వివక్షితులని చెప్పవచ్చు. "శేమముడై నారదర్..... పోల్‌వార్రై వణ్డు, తుమ్బియెన్నుమ్" అనే ఆచార్య హృదయ సూక్తినిబట్టి ఇచటి "వణ్డు" శబ్దం ద్వారా భగవద్గుణగానాన్ని చేసే నారదుడు మొదలైన భాగవతుల సమృద్ధి సూచింపబడిందని చెప్పవచ్చు. వరాహక్షేత్రంగ ప్రసిద్ధిచెందిన శ్రీవిల్లిపుత్తూర్ వైభవాన్ని నారదమహర్షి వ్యాసమహర్షి మొదలైన మునులకు ఉపదేశింపబడిన వైనాన్ని ఆ క్షేత్రమాహాత్మ్యంలో దర్శించవచ్చు.

"కువళై వాశమ్ నికఴునాఴుమ్ విల్లిపుత్తూర్" (2-2-11) అనే ప్రయోగం ద్వారా ఆక్షేత్రంలోని సత్పురుషుల హృదయకమలాలలోని జ్ఞానభక్తుల పరిమళం సదా అంతటా గుబాళిస్తున్నదనే అర్థాన్ని గ్రహించవచ్చు. తిరుప్పావైలోని "పూమ్ కువళైప్పోదిల్" అనే ప్రయోగంలో "కువళై" అనే పదాన్ని సత్పురుషుల హృదయ కమలాలనే అర్థాన్ని పూర్వాచార్యులు స్వాపదేశంగా పల్కిన విషయం స్మరణీయం. ఆ హృదయ కమలాలలో పరిమళించేవి జ్ఞానభక్తులే కదా!

2) శ్రీవిల్లిపుత్తూర్‌లోని భవన సౌందర్యం, ఔన్నత్యం :

శ్రీ విల్లిపుత్తూర్‌లోని భవనాలు చాలా అందమైనవి, ఉన్నతమైనవి. ఈ విషయం- "మచ్చణి మాడప్పుదువై" (1-8-11), "పొన్‌తికఴ్ మాడమ్ పొరున్ది తోన్టుమ్ పుదువై" (5-3-10), "పొన్ తికఴ్ మాడమ్ పుదువై" (3-2-10) అనే పెరియాఴ్వార్ తిరుమొఴి సూక్తులు, "పొన్నియల్ మాడమ్ ప్పొలిన్దు తోన్టుమ్" (12-10) అనే నాచ్చియార్ తిరుమొఴి సూక్తి వల్ల తెలుస్తున్నది. ఇచట ఉదాహరింప బడిన గోదాసూక్తిని పెరియవాచ్చాన్‌పిళ్ళై వ్యాఖ్యానిస్తూ "శ్రీమద్ద్వారకైయిల్ మాళికై యోడొక్కుమాయ్‌ఱ్ఱు అవ్వూరుమ్" - అని వ్యాఖ్యానించడం శ్రీవిల్లిపుత్తూర్‌కు, శ్రీద్వారకకు కం సామ్యం ఈ సూక్తివల్ల స్ఫురిస్తున్నదని కూడా తెలుస్తున్నది.

సూక్తి భవనాల అందాన్ని "పొరుప్పన్న మాడప్పొలిన్దు తోన్టుమ్" (1-11) అనే నాచ్చియార్ తిరుమొఴి సూక్తి భవనాల ఔన్నత్యాన్ని తెల్పుతున్నది. "విణ్‌తోయ్ మదిళ్ విల్లిపుత్తూర్" (2-5-10) అనే పెరియాఴ్వార్ల సూక్తి ఇచటి కోటల ఔన్నత్యాన్ని తెల్పుతున్నది.

"పొన్‌ఇయల్" ఇత్యాది అనే సూక్తి స్వారస్యాన్ని బట్టి భగవానుడు శ్రీవిల్లి పుత్తూర్‌లోని వటపత్రశాయి స్వామిగా ఆవిర్భవించగా పరమపదమే శ్రీవిల్లి

పుత్తూరుగా ఆవిర్భవించిందనే స్వారస్యం ధ్వనిస్తుంది. పరమపదం కూడా హిరణ్మయమైన పురమే కదా.

3) శ్రీవిల్లిపుత్తూర్ ప్రాచీనత, ప్రశస్తి :

పురాణకాలంనుండి శ్రీవిల్లిపుత్తూర్ ప్రసిద్ధి చెందిన క్షేత్రం. వరాహ పురాణాంతర్గతమైన ఈ క్షేత్రమాహాత్మ్యం ఈ విషయానికి తార్కాణం. ఈ క్షేత్రం యొక్క ప్రాచీనతను, ప్రశస్తిని **"పార్మలి తొల్ పుదువై"** (2-4-10) అనే పెరియాళ్వార్లసూక్తి **"వేయర్పుకழ్ విల్లిపుత్తూర్"** (6-11) అనేనాచ్చియార్ తిరుమొழి సూక్తి తెల్పుతున్నవి. **"విశేషతో౽త్ర సర్వేషు వరాహ క్షేత్ర ముత్తమమ్",** (1-28) అని, **"వక్ష్యామ్యహమశేషేణ వరాహక్షేత్రసంగతమ్, మాహాత్మ్యం మునిశార్దూల! శ్రూయతా మవధానతః"** ఇత్యాది శ్రీవిల్లిపుత్తూర్ మాహాత్మ్యంలోని ఈ క్షేత్రవైభవాన్ని తెలిపే వచనాలు ఇక్కడ స్మరణీయాలు.

4) శ్రీవిల్లిపుత్తూర్‌లోని సస్యసమృద్ధి :

"శెన్నెల్ ఓఙ్గు విళైక్కழని పుదువై" (4-1-10) అనే పెరియాళ్వార్లసూక్తి, దీనిని వ్యాఖ్యానిస్తూ, **"శెన్నెలానవై ఉయర వళర్న్దు కదిర్కనత్తాలే కుత్తిరైముకమ్బోలే తలై వణఙ్గి విళైయానిన్డుళ్ళ కழణికళై యుడైయ శ్రీవిల్లిపుత్తూర్"** (ఎఱ్ఱని ధాన్యపు కంకులు ఉన్నతంగా పెరిగి, ధాన్యపు బరువువల్ల గుఱ్ఱంముఖంవలె తల కిందకు వంచి, వృద్ధి చెందే సస్యక్షేత్రాలను కల శ్రీవిల్లిపుత్తూర్) అని పల్కడం ఇచటి సస్య సమృద్ధిని సూచిస్తున్నది.

"వరమ్బుఱ్ఱకతిర్‌శెన్నెల్ తాళ్శాయ్‌త్తు తలైవణక్కుమ్", "శెన్నెల్ ఓఙ్గు విళైక్కழని పుదువై" (4-1-10) అనే పెరియాళ్వార్ల (4-9-8) సూక్తి స్వారస్యాన్ని బట్టి, స్వాపదేశార్థ ప్రక్రియలో **"శెన్నెల్"** అనేపదం ద్వారా ప్రాకృతదేహ విశిష్టుడైన జ్ఞాని వివక్షితుడు. ఎఱ్ఱగా పండిన పైరు నిటాలుగా నిలచి ఉండలేక, తలవాల్చేటట్లు, ఆత్మయాథాత్మ్యజ్ఞానాన్నికల సత్పురుషులు **"సోహమ్"** అనే దశ తొలగపోగా **"దాసోహమ్"** అనే నమ్రస్థితిని పొందడం దీనిద్వారా సూచితం. ఇటువంటి జ్ఞానులు సమృద్ధిని ఈ క్షేత్రం కల్గి ఉన్నదని తాత్పర్యం.

5) సాంసారిక తాపాన్ని తీర్చగల్గిన శక్తి :

పెరియాళ్వార్ల **"కుళిర్ పుదువై"** (4-4-11) అనే సూక్తిని పెరియవాచ్చాన్ పిళ్ళై - **"సాంసారిక సకలతాపహరమాన కుళిర్త్తియై యుడైయశ్రీవిల్లిపుత్తూర్"** అని, అదే రీతిలో **"తణ్‌పుదువై"** (3-8-10) అనే పెరియాళ్వార్ల సూక్తిని **"సంసార శమహరమాన కుళిర్త్తి యుడైయ తిరుప్పుదువై"** అని వివరించినందున ఈ సూక్తులలో తెలుపబడ్డ చల్లదనం అలౌకికమైనదని, సంసారక్లేశహారి అని తెలుస్తున్నది. శ్రీవిల్లిపుత్తూర్‌కు సాంసారిక క్లేశాలను తొలగించ గల్గిన శక్తి ఉండే విషయం ఆ క్షేత్రమాహాత్మ్యంలోని పలు సూక్తులలో స్పష్టపడుతున్నది.

6) జ్ఞానభక్తిప్రదాయకత్వం, విపరీతజ్ఞాననివర్తకత్వం :

"ఒళిపుత్తూర్" (1-4-10) అనే పెరియాళ్వార్ సూక్తిని **"నిలమితితానే జ్ఞాన ప్రేమఙ్గళై విళైక్కుమ్ తేజస్సైయుడైత్తాక శ్రీవిల్లిపుత్తూర్"** అని పెరియవాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానించినందున ఆ క్షేత్రం జ్ఞానభక్తిప్రదాయకమని, **"వెమ్‌కలి నలియా విల్లిపుత్తూర్"** (4-7-11) అనే సూక్తిని **"విపరీతజ్ఞానాదికళై జనిప్పిక్కుమ్ క్రూరమాన కలియుగత్తాల్ వన్ద నలివు ఎన్బదు ఒన్ఱిల్లాద శ్రీవిల్లిపుత్తూర్"** అని వ్యాఖ్యానించి నందున విపరీతజ్ఞాననివర్తకమని తెలుస్తున్నది. ఇందువల్ల ఇష్టప్రాప్తి - అనిష్ట నివృత్తి రూపమైన రక్షణను ఈక్షేత్రం, అచట వేంచేసి ఉండే స్వామివలె, కల్గించగల్గినదని ఏర్పడుతుంది.

7) వైదికులు, మంగళాశాసనపరులు నివసించే క్షేత్రం :

"తిరువిన్‌పొలి మఱైవాణర్ పుత్తూర్" (4-5-11) **"శెఙ్గోల్ మఱైయవల్ శేర్ పుదువై"** (1-3-10) అనే పెరియాళ్వార్ల సూక్తులవల్ల, **"పణ్ణురు నాన్మఱైయోర్ పుదువై"** (5-11) అనే గోదాసూక్తివల్ల ఈ క్షేత్రం వైదికులకు నివాసస్థానమని, **"వేదవాయ్ తొழిలార్కళ్ వాழ் విల్లిపుత్తూర్"** (2-11) అనేనో ఈ సూక్తివల్ల ఈ క్షేత్రం యజ్ఞయాగాదివైదిక క్రియాకలాపాలు నిర్వహింపబడే చోటు అని, **"తిరువిన్ పొలిమఱై వాణర్ పుత్తూర్"** (4-5-11) అనే భట్టనాథసూక్తిని **"శ్రీవైష్ణవశ్రీయాల్ మిక్కు, వేదత్తుక్కు వ్యాసపదమ్ శెలుత్తవల్లరానవర్కళ్ వర్త్తిక్కిఱ శ్రీవిల్లిపుత్తూర్"** అని పెరియవాచ్చాన్‌పిళ్ళై వివరించినందున మంగళాశాసన రూపమైన శ్రీవైష్ణవ సంపద సమృద్ధిగా ఉండే క్షేత్రమని తెలుస్తున్నది.

ఈ విధంగా ఈ క్షేత్రవైభవాన్ని తెలిపే పలు సూక్తులలో ధ్వనించే రస్యమైన స్వాపదేశార్థాలు సహృదయ విభావ్యాలు.

శ్రీమతే రామానుజాయ నమః



ఆణ్డాళ్ అనుగ్రహించిన

తిరుప్పావై

శ్రీ పరాశర భట్టర్ అనుగ్రహించిన తనియన్

1. నీళాతుజ్గ స్తనగిరితటీసుప్త ముద్బోధ్య కృష్ణం
పారార్థ్యం స్వం శ్రుతిశతశిరస్సిద్ధ మధ్యాపయంతీ ।
స్వోచ్ఛిష్టాయాం స్రజి నిగళితం యా బలాత్కృత్య భుంక్తే
గోదా తస్యై నమ ఇదమిదం భూయ ఏవాస్తు భూయః ॥

నీళా = నీళాదేవియొక్క, తుజ్గ = ఉన్నతములైన, స్తన = స్తనములనెడి, గిరి= కొండల యొక్క, తటీ = తటప్రదేశములందు (చరియలయందు), సుప్తమ్= నిదురించిన, కృష్ణమ్ = శ్రీకృష్ణుని, ఉద్బోధ్య = నిద్రలేపి, స్వమ్ = తనయొక్క, శ్రుతిశత = వందలకొలది వేదవాక్యముల యొక్క, శిరః = శిరస్సులయందు (పలు వేదాంతవాక్యములందు), సిద్ధమ్= ప్రసిద్ధమైయున్న, పారార్థ్యమ్ = పరార్థతను (జీవుని భగవత్ పారతంత్ర్యమును), అధ్యాపయంతీ = నేర్పుచున్నదై, స్వ = తనచేత, ఉచ్ఛిష్టాయామ్ = అలంకరించుకొని విడువబడిన, స్రజి = పూమాలికలయందు, నిగళితమ్ = కట్టబడిన శ్రీకృష్ణుని, బలాత్కృత్య = బలాత్కరించి (నిర్బంధించి), యా గోదా = ఏ గోదాదేవి, భుంక్తే = అనుభవించెనో, తస్యై = ఆ గోదాదేవి కొఱకు, ఇదమ్ ఇదమ్ = ఈ ఈ, నమః = నమస్కారము, అస్తు = అగుగాక, భూయః ఏవ భూయః = మరల మరల, అస్తు = అగుగాక!

నీళాదేవియొక్క ఉన్నతస్తనములనెడి పర్వతముల చరియలలో నిద్రించిన (గోదాదేవి జ్ఞానభక్తులకు వశుడైన) శ్రీకృష్ణుని నిదురలేపి, పలు వేదాంత వాక్యములచే ప్రతిపాదింపబడిన జీవుని భగవత్పారతంత్ర్యమును ఆ స్వామికి తెలియజేసి, తాను ముడుచుకొని విడచిన పూమాలికతో అతనిని ఆకర్షించి, ఆ స్వామిని పొందిన గోదాదేవికి పలుమార్లు నమస్కరించెదను.

ఉయ్యక్కొణ్డార్ అనుగ్రహించిన తనియన్

2. అన్న వయల్ పుదువై ఆణ్డాళ్, అరజ్గఱ్కు
ప్పన్ను తిరుప్పావై ప్పల్పదియమ్, – ఇన్నిశైయాల్
పాడి క్కొడుత్తాళ్ నఱ్పామాలై, పూమాలై
శూడి క్కొడుత్తాళై చ్చొల్లు

అన్నమ్ = హంసలు నడయాడు, వయల్ = సస్యక్షేత్రములను కల, పుదువై = శ్రీవిల్లి పుత్తూరులో జన్మించిన, ఆణ్డాళ్ = ఆణ్డాళ్ అను పేరును గల్గినది, పన్ను = విమర్శించి అనుగ్రహింపబడిన, పల్ పదియమ్ = అనేక పద్యములను (పాశురములను కల్గినదై), నల్ = విలక్షణమైన, పా = పాటలయొక్క, మాలై = సందర్భ (మాల) రూపమైనదియగు, తిరుప్పావై = తిరుప్పావై అను దివ్యప్రబంధమును, అరజ్గఱ్కు = శ్రీరంగనాథునకు, ఇన్ = శ్రావ్యమైన, ఇశైయాల్ = గానముతో, పాడి = పాడి, కొడుత్తాళ్ = సమర్పించినది, పూమాలై = పూలమాలికను,శూడి = (ముందుగా తాను) అలంకరించుకొని, కొడుత్తాళై = పిమ్మట (వటపత్రశాయి స్వామికి) అర్పించినదియు అగు గోదాదేవినిగూర్చి, శొల్ = పల్కుము.

హంసలు సంచరించు పొలములను కల శ్రీవిల్లిపుత్తూరు అను క్షేత్రములో పుట్టిన గోదాదేవి, నిత్యానుసంధేయము, పలు పాశురములను కల్గినది, విలక్షణములైన పాటల రూపములోనున్నది అగు తిరుప్పావై దివ్యప్రబంధమును రచించి శ్రీరంగనాథునకు సమర్పించుటయేగాక, తాను ముందుగా ధరించిన పూమాలికను శ్రీవిల్లిపుత్తూరులోని వటపత్రశాయిస్వామికి సమర్పించినది. అట్టి గోదాదేవియొక్క శుభ నామమును, ఓ మనసా!, అనుసంధింపుము.

3. శూడి క్కొడుత్త శుడర్ కొడియే! తొల్పావై,
పాడి యరుళవల్ల పల్ వళైయాయ్!, – నాడి నీ
వేజ్గడవఱ్కు ఎన్నై విది ఎన్ఱ ఇమ్మాఱ్ఱమ్,
నాజ్గడవా వణ్ణమే నల్గు.

శూడి = పూమాలికను అలంకరించుకొని, కొడుత్త = (పిమ్మట) వటపత్రశాయి స్వామికి అర్పించిన, శుడర్ = ప్రకాశించు, కొడియే = బంగారు తీగవంటిదానా!,

తొల్ = అనాదియగు, పావై = తిరుప్పావై అను ప్రబంధమును, పాడి = కీర్తించి, అరుళ వల్ల = కృపచేయ సమర్థురాలైన, పల్ = నానా విధములైన, వళైయాయ్= కంకణములను కల్గినదానా! నీ = నీవు, నాడి = మన్మథుని దరిచేరి, (ఓ కామదేవా!), వేజ్గడవఱ్కు = శ్రీవేంకటేశ్వరునకు, ఎన్నై = నన్ను, విది = (నాయకిని అగునట్లు) విధింపుము, ఎన్ఱ = అని పల్కిన, ఇమ్మాఱ్ఱమ్ = ఈ పాశురమును (సూక్తిని), నామ్=మేము, కడవా వణ్ణమ్ = అతిక్రమింపకుండు రీతిలో, నల్కు = అనుగ్రహింపుము

పూమాలికను తాను ముందుగా అలంకరించుకొని, పిమ్మట ఆ మాలికను వటపత్ర శాయిస్వామికి అర్పించిన, ప్రకాశించు బంగారుతీగవంటి ఓ గోదాదేవీ! అనాదియైన వ్రతమును తిరుప్పావై ప్రబంధముగా గానము చేసిన, పలు కంకణములను దాల్చిన తల్లీ! నీవు కామదేవుని ఉద్దేశించి **“నీవు తగిన ఉపాయమును వెదకి, నేను శ్రీ వేంకటేశ్వరునకు పత్నియగునట్లు చేయుము”** అని ప్రార్థించిన తీరును మేమును దాటకుండునట్లు, నీకు గల అతిమాత్రభగవత్ప్రావణ్యము మాకును కల్గునట్లును అనుగ్రహింపుము.

శ్రీమతే రామానుజాయ నమః



ఆణ్డాళ్ అనుగ్రహించిన

తిరుప్పావై

(మహావిద్వాన్ కాంచీ ప్రతివాది భయంకరమ్ అణ్ణంగరాచార్య స్వామివారి “తిరుప్పావై విశేషార్థవివరణమ్” అనే ద్రావిడ వ్యాఖ్యానానికి ఆంధ్రానువాదం)

అవతారిక

ఆణ్డాళ్ అనుగ్రహించిన తిరుప్పావైలోని మర్మాన్ని గ్రహించిన పూర్వా చార్యులు **“వేదమ్ అనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదై తమిழ் ఐయైన్దు మైన్దుమ్ అఱియాద మానిడరై వైయమ్ శుమప్పదుమ్ వమ్బు”** (వేదం అంతటికి విత్తు అయిన గోదాదేవి తిరుప్పావై ప్రబంధం ముప్పై పాశురాలను తెలియని మానవులను భూమి భరించడం వ్యర్థం) అని పలికారు. తిరుప్పావై వేదానికి అంతటికి విత్తు (బీజం) అనే ఈ సూక్తి అతిశయోక్తి కాదు. వాస్తవోక్తి. (యథార్థమైన మాట) అందువల్లనే చతుః శాస్త్ర విద్వత్సార్వభౌములైన భగవద్రామానుజులవారు ఈ తిరుప్పావై ప్రబంధంలోనే చాలా ఆదరాన్ని కల్గి, **“తిరుప్పావై జీయర్”** అనే పేరును పొందారు. తిరుప్పావైకు గొప్పతనం మార్గశీర్షమాసంలో మాత్రమే కాదు, కోవెలలోను, తిరుమాళిగలలోను ప్రతిదినం జరిగే తిరువారాధన తిరుప్పావై సేవాకాలాన్ని తిరుప్పావై శాత్తుముఱైను ప్రధానంగా కల్గినదై, అంతటా ఒకేవిధంగా ప్రకాశిస్తున్నది. ఆழ్వార్ల, ఆచార్యుల తిరునక్షత్రాల ఉత్సవాలలోకూడ తిరుప్పావై ప్రబంధశాత్తుముఱైయే ముసు ముందుగా చేయబడుతున్నది. ఇది శ్రీరామానుజార్యదివ్యాజ్ఞగానేకదా ఆనాటి నుండి ఈనాటివరకు అంతటా అవ్యాహతంగా ప్రవర్తిస్తున్నది. ఈనాటివరకు అనే మాట ఎందుకు? సూర్యచంద్రులున్నంతవరకు ఈ క్రమం మాఱదు.

తిరుప్పావైకు ఇటువంటి గొప్పతనం కల్గడానికి కారణం -సకలార్థాలు ఇందులో నిండుగా ఉన్నందువల్లనే. ఈ ప్రబంధానికి ఆయిరప్పడి, ఈరాయి రప్పడి, మూవాయిరప్పడి, నాలాయిరప్పడి, ఐయాయిరప్పడి, ఆఱాయిరప్పడి-

అని ఈ రీతిలో పలు వ్యాఖ్యానాలు అనుగ్రహించిన పూర్వాచార్యులుకూడా వాచ్యార్థాలను రసఘనంగా వ్యక్తం చేశారే తప్ప, అంతరార్థాలని, వ్యంగార్థాలని, ధ్వన్యర్థాలని గొప్పగా వ్యవహరింపబడే స్వాపదేశార్థాలను వ్యక్తం చేయలేదు. అవి ఉపదేశగమ్యాలు అని, వారి వారి బుద్ధిచమత్కారానికి తగినట్లుగా నానావిధాలు ఊహించదగినవి అనే అభిప్రాయంతోనే వారు స్వాపదేశార్థాలను వ్యక్తపఱచలేదు.

కొందఱు, స్వాపదేశార్థమని వివరించడం గోదాదేవి అభిప్రాయానికి అనుగుణం కాదని, పాశురాలలో స్పష్టంగా లభించే అర్థాలకు మించి ఇంకా కొన్ని అర్థాలను వ్యంగ్యార్థాలని అంటూ వివరించడం తగదు అని, అది వ్యర్థప్రయత్నమని అంటున్నారు. గోదాదేవి పైపైన వ్యక్తమయే అర్థాలలో పూర్ణమైన దృష్టిని కల్గి ఉండకుండా, అంతరార్థాలలో దృష్టిని కల్గి ఉన్నదనే విషయాన్ని ప్రామాణికులు అంగీకరించే రీతిలో వివరిస్తున్నాను. గమనించండి. తిరుప్పావై మొదటి పాశురంలో **"నీరాడ ప్పోదువీర్ పోదుమినో !"** అని అంటూ "స్నానం చేయడంకోసం వచ్చేవారు అందఱు రండి'' - అని ఆహ్వానించి, నాల్గవ పాశురంలో మేఘాన్ని సంబోధించి, **"నాజ్గళుమ్ మార్గఴి నీరాడ ఉలకినిల్ పెయ్‌దిడాయ్"** (మేము కూడా మార్గశీర్షవ్రత స్నానాన్ని చేసేటట్లు లోకంలో వర్షించు) అని వర్షాన్ని కురవమని నియమించారు. వీటిని చూచినపుడు స్నానం చేయడానికే గోదాదేవి (లేక, గోపికలు) బయలుదేరుతున్నట్లు, స్నానం చేయడంకోసమే చెలికత్తెలను ఆహ్వానిస్తున్నట్లును, స్నానం చేయడానికి కావలసిన తీర్థసమృద్ధిని కల్గడంకోసమే వర్షాన్ని కురవమని మేఘదేవతను నియమిస్తున్నట్లును తెలుస్తున్నది. ఇదే వాస్తవమైన అర్థం అయితే, వీరంతా కలిసి ఓ చెఱువుతీరానికో వెళ్ళి ఉండాలి. స్నానం చేసే చోటు తటాకమే కదా! వీరు ఏ చెఱువు తీరానికి వెళ్ళినట్లుగా తిరుప్పావైలో ఏ పాశురంలోను లేదు. శ్రీనందగోపాలుని భవనానికి చేరి, అక్కడ **"నప్పిన్నైకొజ్గైమేల్ వైత్తు క్కిడన్ద మలర్‌మార్బన్"** (నప్పిన్నై వక్షస్సుపై పరుండి, వికసించిన వక్షాన్ని కలవాడు) అయిన శ్రీకృష్ణుని ప్రబోధించి, నీళాదేవిని (నప్పిన్నైను) మేల్కొలుపి వారిని స్తుతించి, "బ్రాహ్మముహూర్తంలో మేము నిద్రలేచి ఇక్కడకు రావడం ఎందుకోసం?- అంటే, **"ఉన్దన్నోడుఱ్ఱోమే యావోమ్, ఉనక్కే నామ్ ఆట్చెయ్‌వోమ్"** (నీతో సంబంధాన్ని కలవారమే కాగలము, నీకే కైంకర్యాన్ని చేస్తాము) అని విన్నపించడంకోసమే- అని వ్రతసమాప్తిని చేశారు. ఈవిధంగా దివ్యదంపతులవద్దకు పోయి సేవించడమే వీరు పరిగ్రహించిన **"నీరాట్టమ్"** (ధనుర్మాసవ్రతం) అని స్పష్టంగా తెలుస్తున్నది. అందువల్ల **"నీరాడ ప్పోదువీర్"** (స్నానం చేయరండి), **"నాజ్గళుమ్ మార్గఴి నీరాడ"** (మేముకూడా మార్గశీర్ష స్నానం చేసేటట్లు), **"కుళ్ళక్కుళిర క్కుడైన్దు నీరాడాదే"** (చల్లగా అవగాహించి, స్నానం చేయకుండా), **"ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దున్ మణాళనై ఇప్పోదే ఎమ్మై నీరాట్టు"** (అద్దాన్ని, విసనకఱ్ఱను ఇచ్చి, నీమగని, మమ్ములనే ఇపుడు స్నానం చేయించు), **"మాలే! మణివణ్ణా ! మార్గఴి నీరాడువాన్"** (ఆశ్రితవ్యామోహాన్ని కలవాడా! మణివర్ణా! మార్గశీర్షస్నానం కోసం) అనే పాశురాలలో ప్రస్తావింపబడిన నీరాట్టమ్ చన్నీటిలో మునగడం కాదు - అని, భగవత్సంశ్లేషాన్ని, భాగవతసంశ్లేషాన్ని, ఆచార్యకులావగాహాన్ని మాత్రమే నీరాట్టమని అన్నారని నిష్కర్షించడంలో ఔచిత్యం ఉన్నది.

దీనిని మూవాయిరప్పడి వ్యాఖ్యలో పెరియవాచ్చాన్‌పిళ్ళై, ఆఱాయిరప్పడి వ్యాఖ్యలో అఴకియ మణవాళప్పెరుమాళ్ నాయనార్‌కూడ స్పష్టంగా వివరించారు. "నీరాడప్పోదువీర్" అనే సందర్భంలో పెరియవాచ్చాన్‌పిళ్ళై శ్రీసూక్తి ఈవిధంగా ఉన్నది. **"(నీరాడ)- ఇత్తాల్ ఇవర్‌కళ్ నినైక్కిఱదు కృష్ణసంశ్లేషమ్. తమిఴరుమ్ కలవియై "చ్చునైయాడల్" ఎన్టార్‌కళ్... "ఏష బ్రహ్మ ప్రవిష్టోఽస్మి గ్రీష్మే శీతమివ హ్రదమ్" ఎన్ఱు భగవత్సంశ్లేషత్తుక్కు గ్రీష్మకాలత్తిలే కుళిర్‌న్ద మడువిల్ పడువదై దృష్టాంతమాక చ్చొల్లిఱ్ఱితే"** (నీరాడ- ఈపదం ద్వారా వీరు ఉద్దేశించినది కృష్ణసంశ్లేషం. ద్రావిడులు కూడా సంశ్లేషాన్ని **"శునైయాడల్"** అని అన్నారు. "ఏష బ్రహ్మ ప్రవిష్టోఽస్మి గ్రీష్మే శీతమివ హ్రదమ్"- గ్రీష్మకాలంలో చల్లని మడుగులో వలె, ఈ పరబ్రహ్మలో నేను అవగాహిస్తున్నాను- అని అంటూ భగవత్సంశ్లేషానికి గ్రీష్మకాలంలో చల్లని మడుగులో స్నానమాడడం దృష్టాంతంగా తెలుపబడింది కదా!)

ఆఱాయిరప్పడి శ్రీసూక్తి ఈవిధంగా ఉన్నది. **"(నీరాడ) - ఇవర్ తజ్గళుక్కు నీరాడ ఎన్ఱు నోయ్యాశైయిఱే. యమునాజలమ్ ఒరుత్తియుడైయ విరహాగ్నియాలే శువఱుమే. తమిఴర్ కలవియై చ్చునైయాడల్ ఎన్టాయ్‌త్తు చ్చొల్లువతు. కృష్ణసంశ్లేషత్తై యాయ్‌త్తు ఇవర్‌కళ్ "నీరాడ"- ఎన్గిఱదు. "ఏష బ్రహ్మ ప్రవిష్టోఽస్మి గ్రీష్మే శీత మివ హ్రదమ్" ఎన్ఱుమాపోలే"** (నీరాడ - వీరికి అవగాహించాలని పేరాశ కదా! యమునాజలం ఒకగోపిక యొక్క విరహాన్ని చేత సలసల కాగుతుంది కదా! తమిళులు సంశ్లేషాన్ని **"శునైయాడల్"** అని అన్నారు. శ్రీకృష్ణసంశ్లేషాన్ని వీరు **"నీరాడ"** అని అన్నారు, "ఏష బ్రహ్మ ప్రవిష్టోఽస్మి గ్రీష్మే శీతమిహ్రదమ్" వలె)

దీనినిబట్టి లోపల ఉండే అర్థం వేఱొకటి అని, బయటకు చెప్పే మాట ఇంకొకటి అని నిర్ణయింపబడుతున్నది.

"నీరాడ" అనే ఒక పదం విషయంలో మాత్రమే కాదు- ఇది (ఈక్రమం). ఇంచుమించుగా అన్ని పదాలు అంతరంగమైన వేఱొక అర్థాన్ని ఉద్దేశించే ప్రయోగింపబడినవి - అని తెలియవచ్చు. అలంకారశాస్త్రంలో రూపకాతిశయోక్తి అనే ఒక అలంకారమున్నది. "పశ్య! నీలోత్పలద్వంద్వాత్ నిస్సరంతి సితా శ్శరాః" అని దానికి ఉదాహరణం చూపబడింది. "రెండు నల్ల కలువపూలనుండి పదునైన బాణాలు వెలువడుతున్నాయి, చూడు'' అని ఇందులోని అర్థం. ఇక్కడ నల్లకలువ పూవు వివక్షితం కాదు; బాణాలుకూడా వివక్షితాలు కావు. నాయకి కన్నులనుండి వెలువడే కటాక్షపాతాలను తెలుపగోరి ఈవిధంగా చెప్పబడింది. దీనిని తమిళులు "ఉరువక వుయర్వు నవిఱ్చియణి" అని అంటారు. తిరుప్పావై అంతా ఈ అలంకారవైఖరిలోనే రచింపబడింది- అని నా అభిప్రాయం.

ఇదికాకుండా, వేఱే మూడు అలంకారాలుకూడా అలంకారశాస్త్రంలో ఉన్నాయి. అవి, అప్రస్తుతప్రశంస, ప్రస్తుతాంకురం, సమాసోక్తి- అనేవి. "అప్రస్తుత ప్రశంసా స్యాత్ సా యత్ర ప్రస్తుతాశ్రయా" (అప్రస్తుతమైన విషయ ప్రస్తావన ప్రస్తుత విషయంలో పర్యవసిస్తే అది అప్రస్తుత ప్రశంసాలంకారం) అనేది అప్రస్తుత ప్రశంసాలంకార లక్షణం. ప్రస్తుతమైన (ప్రకృతసందర్భానికి చెందిన) ఒక విషయం తెలుపడంకోసం అప్రస్తుతమైన ఒక విషయాన్ని ప్రస్తావించడం అప్రస్తుతప్రశంస- అనబడుతుంది. ఈ అలంకారరీతిలో కూడా కొన్ని పాశురాలున్నాయి. - అని చెప్పవచ్చు. "ప్రస్తుతేన ప్రస్తుతస్య ద్యోతనే ప్రస్తుతాంకురః" (ప్రస్తుతంలో ప్రస్తుతార్థం స్ఫురించడం ప్రస్తుతాంకురం) అనేది ప్రస్తుతాంకురాలంకార లక్షణం. స్పష్టంగా చెప్పబడే అర్థం ప్రకృతమై, వ్యంగ్యంగా భాసించే అర్థంకూడా ప్రకృతమైతే, అక్కడ ప్రస్తుతాంకురాలంకారం ఉన్నదని చెప్పబడుతుంది. ఈ అలంకారవైఖరిలో తిరుప్పావై అమరి ఉన్నది - అని భావించడంకూడా తగినదే. నిజానికి, తిరుప్పావై లోని క్రమం ఇటువంటిదే.

"సమాసోక్తిః పరిస్ఫూర్తిః ప్రస్తుతేఽప్రస్తుతస్య చేత్" (ప్రస్తుత విషయంవల్ల అప్రస్తుత విషయం స్ఫురిస్తే అది సమాసోక్తి.) అనేది సమాసోక్తి లక్షణం. ప్రస్తుతమైన ఒక విషయాన్ని వర్ణించే సందర్భంలో అప్రస్తుతాలైన కొన్ని అర్థాలు స్ఫురించి నట్లయితే అక్కడ సమాసోక్తి చెప్పబడుతుంది. తిరుప్పావైలో ఈ అలంకారం ఉన్నదని భావించే ప్రసక్తి లేనేలేదు. ఎందుకు? అంటే, ఇందులో స్వాపదేశార్థాలు ముఖ్యమైనవి- అని మన అభిప్రాయం కనుక, ఈ అలంకారానికి ఇందులో చోటు

లేదు. కొందఱి అభిప్రాయానుసారం అయితే, ఈ అలంకారం కూడా ఇందులో భావించదగును. ఏవిధంగా అయినా వాచ్యార్థానికి మించిన వ్యంగ్యార్థం ఇందులో విశేషంగా ఉన్నది- అనే విషయమే స్ఫుటమవుతుంది.

తిరుప్పావైలోని ఏడవ పాశురంలో 'కలన్దు పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో పేయ్ప్పెణ్ణే !" (ఓ పిచ్చిపిల్లా ! కలసి పల్కిన మాటలోని ధ్వనిని నీవు వినలేదా?) అని చెప్పబడుతున్నది. "పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో ?" అని అంటే చాలు. "నేను చెప్పే మాటను విను'' అని, "నేను చెప్పే మాట నీ చెవిలో పడలేదా ?'' అని ఈ విధంగాకదా లోకవ్యవహారం ఉన్నది. ఈ రీతిలో "పేశిన పేచ్చు కేట్టిలైయో?" అని అనడం చాలి ఉండగా, "పేచ్చు అరవమ్ కేట్టిలైయో?" అనే ప్రయోగం విశేషమైన అర్థాన్ని కల్గినది. మాటను వినడంలో రసం లేదు. మాటవల్ల స్ఫురించే ధ్వన్యర్థాన్ని విని తెలిసికోవడమే మిక్కిలి భోగ్యమైనది - అని గోదాదేవి ఈ విధంగా సూచించింది. తిరుప్పావైలోని ఇటువంటి భోగ్యాలైన అర్థాలు కొన్ని తెలుపబడు తున్నాయి.

1) మార్గ*ళి*త్తిజ్గళ్ మది నిఱైన్ద నన్నాళాల్
నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరి*ళై*యీర్!
శీర్ మల్కుమ్ ఆయ్ప్పాడి చ్చెల్వ చ్చిఱుమీర్కాళ్!
కూర్వేల్ కొ*ళు*న్తొ*ళి*లన్ నన్దగోపన్ కుమరన్
ఏరార్న్ద కణ్ణి యశోదై యిళమ్ శిజ్గమ్
కార్మేని చ్చెజ్గణ్ కదిర్ మదియమ్ పోల్ ముకత్తాన్
నారాయణనే నమక్కే పఱై తరువాన్
పారోర్ పుక*ళ*ప్పడిన్దు ఏలోరెమ్బావాయ్

తిరుప్పావైలోని మొదటి పదం "మార్గ*ళి*" అనే పదం. ఇది "మార్గ,శీర్ష"మనే రెండు సంస్కృతపదాల వికృతి. మృగశీర్షా నక్షత్రంలో కూడిన పున్నమిని కల్గిన మాసం మార్గశీర్షమాస మనబడుతుంది. మాసాల పేర్లు సౌరమాన ప్రకారం, చాంద్రమాన ప్రకారం వ్యవహరింపబడుతున్నాయి. మేషం, వృషభం, మిథునం- ఇత్యాది పేర్లు సౌరమాన రీతిలోనివి. చైత్రం, వైశాఖం, జ్యేష్ఠం మొదలైన పేర్లు చాంద్రమాన ప్రకారంలోనివి. చిత్తిరై, వైయ్యాశి ఇత్యాదులైన ద్రావిడవ్యవహారాలు కూడా చాంద్రమాన రీతిని అనుసరించినవి. చిత్రానక్షత్రం, పున్నమి ఒకటిగా

కూడితే చైత్రం, విశాఖానక్షత్రం, పూర్ణమి ఒకటిగా కలిస్తే వైశాఖం. ఈవిధంగా ఒక్కొక్క మాసం పేరును ఈ రీతిలోనే గమనించాలి. ఈ క్రమంలో, మృగశీర్షా నక్షత్రం, పౌర్ణమి కలిస్తే మార్గశీర్షమనబడుతుంది. నక్షత్రాల వృద్ధి క్షయాలకు తగినట్లు ముందు నక్షత్రం గాని, తరువాతి నక్షత్రంగాని పున్నమితో కలిసే సందర్భాలుండవచ్చు. దానినిగూర్చిన విచారణ ఇక్కడ పనిలేదు.

మార్గశీర్షమనే సంస్కృతపదంయొక్క అర్థంలోనే **"మార్గ*ళి*"** అనే పదం వ్యవహరింపబడుతున్నదని తెలుపబడింది. ఈ అర్థమే కాక, ఇంకొక అర్థం కూడా మార్గశీర్షమనే పదానికి సంభావితమే. అది ఏమంటే- **(మార్గ-శీర్ష)** అనే రెండు పదాల రూపంగా గ్రహించి, మార్గాలలో గొప్పది- అనే అర్థాన్ని గ్రహించాలి. శీర్షమని శిరస్సుకు పేరు. మార్గమంటే ఉపాయం. ఉపాయాలలో గొప్పది- అని దీని భావం. కర్మ-జ్ఞాన-భక్తి- ప్రపత్తులకు మించి ఆచార్యాభిమానం అనేది గొప్ప ఉపాయం. అదే మార్గశీర్షమనబడుతున్నది. మార్గ*ళి* అనేది కూడా అదే.

ఆణ్డాళ్, నాచ్చియార్ తిరుమొ*ళి* ప్రబంధంలో ఉపాయాలలో గొప్ప ఉపాయాన్ని రెండు పాశురాలద్వారా చక్కగా తెలిపింది. **"కొల్లై యరక్కియై మూక్కరిన్దిట్ట కుమరనార్ శొల్లుమ్ పొయ్యానాల్ నానుమ్ పిఱన్దమై పొయ్యన్తే"** (శూర్పణఖ ముక్కును కోసిన అందగాడు శ్రీరాముడు పల్కిన మాట అసత్యమైనా, నా జన్మ అసత్యం కాదు.) అనేది ఒక పాశురం. **"నల్లవెన్ తో*ళి* ! నాకణైమిశై నమ్పరర్, శెల్వర్ పెరియర్, శిఱు మానిడరవర్ నామ్ శెయ్వదెన్? విల్లిపుదువై విట్టు శిత్తర్ తఙ్గళ్ తేవరై. వల్ల పరిశు వరువిప్పరేల్ అదు కాణ్డుమే"** (ఓ నా ప్రియసఖీ! ఆదిశేషశయనుడైన మన పరమాత్మ చాలా గొప్పవాడు, మనం చాలా చిన్నవారం. మనమేమి చేయగలము? శ్రీవిల్లిపుత్తూర్‌లోని విష్ణుచిత్తులు తగిన ఉపాయంతో తమ దైవాన్ని రప్పిస్తే, అపుడు దర్శించగలము) అనేది ఇంకొక పాశురం. ఈ రెండు పాశురాలతోను ఆణ్డాళ్ తనకు ఆచార్యుల ద్వారానే ప్రాప్యసిద్ధి- అనే విషయాన్ని నిశ్చయించారు. **"కొల్లై యరక్కియై మూక్కరిన్దిట్ట కుమరనార్"**- (వధను వృత్తిగా గల్గిన రక్కసి శూర్పణఖ ముక్కును కోసిన దశరథచక్రవర్తి కుమారుడు శ్రీరాముడు) పల్కిన సూక్తులు ఏమంటే- **"న త్యజేయం కథంచన"** ఇత్యాదులు. ఇవి అసత్యాలైనా, **"నానుమ్ పిఱన్దమై పొయ్యన్తే"** నేను పెరియా*ళ్వా*ర్ల కడుపున పుట్టడం కుమార్తెగా పుట్టడం- అసత్యం కాదు కదా! నాకు ఉండే ఆచార్యసంబంధం వ్యర్థం అవుతుందా? ఏనాటికీ కాదుకదా! అని దీని భావం.

ఇక, **"విల్లిపుదువై విట్టుశిత్తర్ తఙ్గళ్ తేవరై వల్ల పరిశు వరువిప్పరేల్ అదు కాణ్డుమే"** (శ్రీవిల్లిపుత్తూర్‌లోని విష్ణుచిత్తులు తమదైవాన్ని తగిన ఉపాయంతో రప్పిస్తే, అప్పుడు అతనిని దర్శించగలం) అనే పాశురం శ్రీవచనభూషణం దివ్యగ్రంథం చివరలో ఆచార్యనిష్ఠకు ప్రమాణంగా ఉదాహరింప బడింది. అక్కడ మణవాళమహామునులు చేసిన వ్యాఖ్యానం అనుసంధేయం. ఈ రీతిలో ఆణ్డాళ్ తాను పరిగ్రహించిన చరమో పాయాన్నే తిరుప్పావైలో ప్రాణస్థానీయమైన (అత్యంతప్రధానమైన) అర్థంగా కూర్చి పలికినది. దీనికి సూచనమే **"మార్గ*ళి*"** అనే మొదటి పదం.

వాసుదేవశబ్దానికి తద్ధితవృత్తిద్వారా వసుదేవుని పుత్రుడనే అర్థం స్పష్టంగా ఉన్నా, భట్టర్ **"వాసు, దేవ"** అనే పదాల సమాసంగా ఈ నామాన్ని గ్రహించి భాష్యాన్ని అనుగ్రహించినట్లే, ఇక్కడ కూడా **"మార్గ-శీర్ష"** - అనే పదాలకు సమాసంగా గ్రహించడంలో ఏ లోటు లేదు.

(తిఙ్గళ్ మది నిఱైన్ద) - **"తిఙ్గళ్"** అనే పదం చంద్రుని నిర్దేశించే పదంగా గ్రహించి, చంద్రునివలె సౌమ్యమైన, చల్లని, **"మది"**- బుద్ధి, **"నిఱైన్ద"** పూర్ణంగా ఉండడానికి కారణమైన, **"నన్నాళ్"**- మంచి దినం ఇది- అనే భావాన్ని చెప్పవచ్చు. చల్లని బుద్ధి- అని, ఉష్ణంగా ఉండే బుద్ధి - అని రెండు విధాలైన బుద్ధులున్నాయి. భగవద్విషయానికి అనుకూలమైన బుద్ధి చల్లగా ఉంటుంది. ప్రతివాదులను నిరసించడానికి అనుకూలమైన బుద్ధి వేడిగా ఉంటుంది. శ్రీభాష్యాదిగ్రంథాలను అధికరిస్తే వేడియైన బుద్ధి కల్గుతుంది. ఆ*ళ్వా*ర్లు, గోదాదేవి అనుగ్రహించిన శ్రీసూక్తులను అభ్యసిస్తే చల్లనిదనమే మూర్తీభవించిన బుద్ధి కల్గుతుంది. ఆచార్యనిష్ఠను ప్రతిపాదించే ఈ తిరుప్పావైను అధికరించినందువల్ల చల్లని బుద్ధి నిండుగా కల్గుతుంది. అటువంటి మంచి దివసం ఇది. **"నిండబోతున్నది"**. అని భవిష్యత్కాలికంగా చెప్పవలసిన చోట **"నిఱైన్ద"** అని భూతకాలికంగా పల్కిన ఈ సూక్తికి **"కాలవ*ళు*వమైది"** అని పేరు. **"ఆశంసాయాం భూతవచ్చ"** అని పాణిని సూత్రాన్నికూడా (దీనికి సంవాదంగా) గమనించవచ్చు. ఈ **"ఇరుళ్ తరు మాఞాలమ్"** (అజ్ఞానాన్ని కల్గించే విశాలభూమి) లోని జీవనంలో ఇటువంటి మంచి బుద్ధిని నిండుగా కల్గి ఉండాలని భావించే దినం ఏనాడో, ఆనాడు **"నన్నాళ్"** (మంచిదివసం) అని భావం. **"ఆల్"** అయినందువల్ల- అని అర్థం.

(నీరాడ) దీనినిగూర్చి కొంత అవతారికలోనే తెలుపబడింది. ఇక్కడకూడా కొంచెం వివరింపబడుతున్నది. భట్టర్ శ్రీరంగరాజస్తవంలోని 50-60 శ్లోకాలలో

కావేరీనదిని, ఉద్యానవనాలను, ప్రాకారాలను, తిరువీథులను, మండపాలను, చంద్రపుష్కరిణిని, పున్నాగవృక్షాన్ని స్తుతించి, గర్భగృహంలో ప్రవేశించి, ఆమోదస్తంభాలను దర్శించి ఆనందించి, శ్రీరంగనాథుని అనుభవించి, **"పిబ నయన! పురస్తే రంగధుర్యాభిధానం స్థితమివ పరిపుల్లత్పుండరీకం తటాకమ్"** (ఓ నేత్రమా! నీముందున్నవాడు, నిండుగా పూచిన తామరతటాకం వలె ఉండేవాడైన శ్రీరంగనాథుని దర్శించు) అని, **"ఉత్ఫుల్లపంకజతటాక మివోపయాని శ్రీరంగరాజమిహ"** (బాగా పూచిన తామర కొలనువలె ఉండే శ్రీరంగనాథుని దరిచేరుతున్నాను) అని ఒక తామరతటాకంలో స్నానం చేసేటట్లుగా పలికారే తప్ప, భగవానుని సేవిస్తున్నాను- అని అనలేదు. నమ్మా౞్వార్లు తిరువాయ్మొ౞ిలో **"కణ్ కై కాల్ తూయ శెయ్య మలర్కళా శోదిచ్చెవాయ్ ముకి౞్తా శాయల్ శామ త్తిరుమేని తణ్పాశడైయా తామరైనీళ్ వాశత్తడమ్బోల్ వరువానే"** (కన్నులు, చేతులు, కాళ్ళు - పవిత్రాలైన, ఎఱ్ఱని తామరపూల వలె, ప్రకాశించే ఎఱ్ఱని పెదవి-చిగురువలె, నీలవర్ణాన్ని కల తిరుమేని చల్లని నాచువలె ఉండే పెద్ద తామరతాటకం వలె వచ్చేవాడా!) అని పల్కడంకూడా గమనార్హం. **"వాశత్తడమ్"**- పరిమళం నిండుగా ఉండే తటాకం- అని అర్థం. ముకుందమాలలో కూడా **"కరణచరణసరోజే కాంతిమన్నేత్రమీనే శ్రమముషి భుజవీచివ్యాకులేఽగాధమార్గే హరిసరసి విగాహ్య"** (శ్రీహస్తాలు, శ్రీచరణాలనే పద్మాలను కల్గినది, కాంతితో కూడిన నేత్రాలనే మత్స్యాలను కల్గినది, శ్రమను తీర్చే భుజాలనే కెరటాలతో కల్లోలంగా ఉన్నది, అగాధమైన మార్గాన్ని కల్గినదైన హరిసరస్సులో అవగాహించి) అనే సూక్తిని గమనించాలి. ఈవిధంగా "నీరాడ" అంటే- భగవదవగాహనం చేయడం కోసం- అని అర్థం. ఇంకా కొంచెం లోపలకు పోతే, ఈ పదానికే "ఆచార్యకులంలో అవగాహించడం'' అనే అర్థం కూడా లభిస్తుంది. తిరువిరుత్తప్రబంధంలో నమ్మా౞్వార్లు **"కాలై నన్ఞానత్తుఱై పడిన్దాడి"** (ప్రాతఃకాలంలోచక్కని జ్ఞానమనే రేవులో అవగాహించి) అని అన్నారు. ఇక్కడ **"ఞానత్తుఱై పడిన్దు ఆడి"** అంటే - ఆచార్యకులావగాహనమేకదా. ఈ రీతిలో ఇక్కడ **"కాలైనన్ ఞానత్తుఱై పడిన్దు ఆడ"** ఆహ్వానిస్తున్నారు.

(పోదువీర్ పోదుమినో) - "వచ్చే వారందఱు రండి'' అని దీని భావం. "సత్యం వద" అనే వైదికవిధికి ఏవిధంగా అధికారి నియమం లేకుండా అందఱు అధికారులో, అదే రీతిలో భగవానుని ఆశ్రయించడానికి, ఆచార్యుని సమాశ్రయించడానికి అందఱు అధికారులే- అని భావం.

(నేరి౞ైయీర్!) - **"ఇ౞ై"** అంటే ఆభరణం. అందమైన ఆభరణాలను అలంకరించుకొన్నవారలారా ! -అని శబ్దార్థం. శ్రీవైష్ణవులకు శమదమాది గుణాలే ఆభరణాలుగా చెప్పబడుతున్నాయి. కంకణకుండలాది భూషణాలు దేహాలంకారాలు. శమదమాది భూషణాలు ఆత్మాలంకారాలు. శ్రీవచనభూషణంలో **"ఆత్మగుణఙ్గళిల్ ప్రధానమ్- శమముమ్, దమముమ్. అవై యిరణ్డు ముణ్డానాల్ ఆచార్యన్ కైపుకురుమ్. ఆచార్యన్ కైపుకున్దవాఱే తిరుమంత్రమ్ కైపుకురుమ్, తిరుమంత్రమ్ కైపుకున్దవాఱే ఈశ్వరన్ కైపుకురుమ్. ఈశ్వరన్ కైపుకున్దవాఱే, "వైకున్దమానకర్ మఱ్ఱుతు కైయదువే" ఎన్గిఱపడియే ప్రాప్యభూమి కైపుకురుమ్"** (ఆత్మగుణాలలో ప్రధానమైనవి శమం, దమం. ఆ రెండిటిని కల్గి ఉంటే ఆచార్యుడు లభిస్తాడు. ఆచార్యుడు లభించగానే తిరుమంత్రం లభిస్తుంది. తిరుమంత్రం లభించగానే భగవానుడు లభిస్తాడు. భగవానుడు లభించగానే, వైకుంఠ మహానగరం, మిగిలినది అంతా లభిస్తుంది'' అనే రీతిలో ప్రాప్యభూమి చేజిక్కుతుంది.) అని చెప్పబడుతున్నది. ఆత్మగుణాలను కల్గి ఉన్నప్పుడే ఆచార్యుడు లభిస్తాడు- అని అన్నందువల్ల, మీరు **"నేరి౞ై"** కలవారై అవగాహించండి- అని తెలుపబడింది. ఆచార్యుని శ్రీచరణాలను ఆశ్రయిస్తే **"నేరి౞ై"** కలవారు కాగలరు- అని తాత్పర్యం.

(శీర్ మల్కు మాయ్ప్పాడి శెల్వ చ్చిఱుమీర్కాళ్ !) -ఇది, శిష్యవృత్తిని చేసే యోగ్యతను కలవారిని ఆహ్వానించే రీతి. పశువులు, పశుపాలకులు సంచరించే చోటు రేపల్లె. **"నృపశుః"** అని ఆళవందార్, **"వృత్త్యా పశుః నరవపుః"** (ప్రవర్తనలో పశువు రూపంలో మానవుడు) అని శ్రీమణవాళమహామునులు అనుగ్రహించిన రీతిలో జ్ఞానహీనులమై, పశుప్రాయులమైన మనం సంచరించే ఈ తమోగుణ ప్రదమైన భూమియే ఒక రేపల్లె. దానికి **"శీర్మల్కుమ్"**- అనే విశేషణం ప్రయోగించినందువల్ల కేవలం బద్ధసంసారులై ఉండకుండా, ముముక్షువులై, వైలక్షణ్యాన్ని కల్గినవారు వర్తించే దివ్యస్థలమని తాత్పర్యం. ''శెల్వచ్చిఱుమీర్కాళ్''- భగవద్భాగవతాచార్య భక్తి ఇక్కడ "శెల్వ"మని అనబడుతున్నది. "గ్రహణధారణ **పోషణపటుర్బాలః"** (విషయాన్ని గ్రహించి, ధరించి, వృద్ధి చేయగల్గినవాడు బాలుడు) అని చెప్పబడింది కనుక, సద్విషయాలను గ్రహించడంలో, ధరించడంలో, వాటిని అభివృద్ధి చేయడంలో సామర్థ్యాన్ని కలవారిని ఉద్దేశించి ఇక్కడ **"శిఱువర్"**, **"శిఱుమియర్"** అని అంటూ స్త్రీలింగ ప్రత్యయం ప్రయోగింపబడింది. **"న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి"** (స్త్రీ, స్వాతంత్ర్యానికి అర్హురాలు కాదు) అనే రీతిలో పారతంత్ర్యమే

రూపుదిద్దుకొన్న స్త్రీలవలె, స్వాతంత్ర్య గంధలేశం కూడా లేకుండా ఉండవలసిన (జీవ) స్వభావాన్ని తెలుపడమే.

దీనికి తరువాత, **"నారాయణనే నమక్కే పఱై తరువాన్"** (నారాయణుడే మనకే పఱైను -ప్రాప్యాన్ని ఇస్తాడు) అని ఏడవ పాదాన్ని అన్వయించాలి. ఆ నారాయణుడు ఎటువంటివాడు? అని అంటే- **"కూర్వేల్ కొడున్దొఴిలన్"** (పదునైన వేలాయుధంతో దుష్టనిరసనరూప కఠినకృత్యాన్ని చేసేవాడు) అని ఆరంభించి మూడు పాదాలతో విశేషింపబడింది. ఇక్కడ నారాయణుడంటే- **"సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీం తనుమ్, మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా"** (సాక్షాత్తు దేవుడైన నారాయణుడు మానవరూపాన్ని ధరించి, సంసారసముద్రంలో మునిగినవారిని కరుణతో శాస్త్రమనే హస్తంతో ఉద్ధరిస్తాడు.) అనే ప్రమాణానుసారం నారాయణావతారమైన ఆచార్యుడని అర్థం. **"శేమమ్ కురుకైయో? శెయ్య తిరుప్పాఱ్కడలో? నామమ్ పరాఙ్కుశమో? నారణమో? తామమ్ తుళవో? వకుళమో? తోళిరణ్డో? నాన్గు ముళవో? పెరుమానుక్కు"** (భగవానునకు నివాసం కురుకాపురియా? లేక, క్షీరాబ్ధియా? పేరు పరాంకుశులనియా? నారాయణుడనియా? ధరించే మాలిక తులసీ మాలికయా? వకుళమాలికయా? భుజాలు రెండా? లేక, నాల్గు ఉన్నాయా?) అని నమ్మాఴ్వార్లను చూచి ఒక పరమభక్తులు పాడిన పాశురం ఇక్కడ అనుసంధేయం. **"పఱై తరువాన్"** అంటే -ఉద్దేశ్యమైన ఫలాన్ని అనుగ్రహిస్తాడు- అని భావం. **"నారాయణనే"** అనే ఏవకారం వల్ల, **"నమక్కే"** అనే ఏవకారంవల్ల "సదాచార్యుడే ఇవ్వగలవాడు, సచ్ఛిష్యుడే పొందగల్గినవాడు'' అనే అర్థం స్ఫురిస్తుంది. ఇటువంటి సదాచార్యుడు ఎటువంటివాడు? అని అంటే-

(కూర్వేల్ కొడున్దొఴిలన్) - తరువాత, **"అన్ఱివ్వులకమళన్దాయ్"** అనే పాశురంలో **"నిన్కైయిల్ వేల్ పోఱ్ఱి"** (నీ చేతిలోని బల్లెం వర్ధిల్లాలి) అని అంటూ శ్రీసుదర్శనాన్ని వేలాయుధంగా పల్కడం ఆంతరమైన అర్థం కనుక, ఇక్కడ కూడా **"వేల్"** అనే పదానికి శ్రీసుదర్శనాన్నే అర్థంగా గ్రహించండి. **"స్ఫురత్సహస్రార శిఖాతితీవ్రమ్"** (ప్రకాశించే వేయి ఆకులలోని శిఖలతో తీవ్రమైనది.) అయిన శ్రీసుదర్శనాన్ని తెలుపడం మిగిలిన శ్రీపాంచజన్యాఴ్వాన్‌కు కూడా ఉపలక్షణం. శ్రీసుదర్శన పాంచజన్యాల లాంఛనాలతో ఆచార్యుడు క్లిష్టమైన కార్యాలను చేస్తాడు. ఇనుమును బంగారంగా చేసేటట్లు, పరమనీచుడైనవానిని ఉత్తమాధికారిగా

చేయడం ఆచార్యునకు తప్ప ఇతరులకు దుష్కరమైన కార్యం కనుక, దానిని **"కొడున్దొఴిల్"** అని అనడంలో అడ్డు లేదు. పంచసంస్కారప్రదానాన్ని చేసి, చెడ్డ మనస్సును పోగొట్టి, దాసునిగా చేసికొనే సదాచార్యుడని భావం.

(నన్దగోపన్) - **"ఎడుత్త పేరాళన్ నన్దగోపన్"** (నిధిని పొందిన అదృష్టవంతుడు నందగోపాలుడు) అని అన్నారు, నమ్మాఴ్వార్లు. ప్రయత్నలేశం కూడా లేకుండా, నిధిని పొందినట్లే, శ్రీకృష్ణుని పొందినవాడు, నిర్హేతుకభాగవత స్వీకారవిషయ భూతుడు నందగోపాలుడు. ఆ రీతిలోనే **"య మేవైష వృణుతే తేన లభ్యః"** (భగవానుడు ఎవరిని వరిస్తాడో అతడే భగవానుని పొందగలడు) అనే రీతిలో పరగతస్వీకారపాత్ర భూతుడైన గొప్పతనాన్ని కలవాడు ఆచార్యుడు- అని భావం.

(కుమరన్) - స్వాపదేశార్థంలో "నందగోపాలుని కుమారుడు'' అనే అర్థాన్ని గ్రహించకుండా, ''నందగోపాలుడై, కుమారుడై ఉండేవాడు'' అనే అర్థాన్ని గ్రహించాలి. ఈ రీతిలో పలు సందర్భాలలో (అర్థాలను) గ్రహించాలి. **"కుమరన్"** అంటే బాలుడని అర్థం. **"పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్"** (పాండిత్యాన్ని పూర్ణంగా పొంది బాలునివలె వినయంగా ఉండాలి) అని ఉపనిషత్తు పల్కిన బాల్యాన్ని కలవాడు ఆచార్యుడు. **"గ్రహణధారణపోషణపటుర్బాలః"** కనుక, ఆ అర్థం కూడా గ్రహించదగినదే.

(ఏరార్న్ద కణ్ణి) - నేత్రసౌందర్యాన్ని కలవాడని భావం. జ్ఞాననేత్రమని, భౌతిక నేత్రమని రెండు నేత్రాలున్నాయి కదా ! **"ఎన్ఱేనుమ్ కట్కణ్ణాల్ కాణాద అవ్వురువై నెఞ్జెన్ను ముట్కణ్ణేల్ కాణు మవ్వురువు"** (ఏనాడూ బాహ్యనేత్రంతో చూడలేని ఆ ఆరూపాన్ని మనస్సు అనేనేత్రంతో చూస్తే సాక్షాత్కరించుకోవచ్చు) (పెరియ తిరువన్దాది) - అని అన్నారు కదా నమ్మాఴ్వార్లు. అటువంటి జ్ఞానదృష్టిని కలవారు- అని భావం. **"కణ్ణి"** అని పూమాలికకు పేరు. కనుక, **"యే కంఠలగ్నతులసీ నలినాక్షమాలాః"** (కంఠంలో తులసి, తామరపూల మాలికలను దాల్చినవారు) అని, **"పైఙ్కమలత్తణ్ తెరియల్ పట్టర్ పిరాన్"** (పచ్చని తామరపూసల మాలికలను ధరించిన భట్టనాథులు) అని, **"అంభోజబీజమాలాభి రభిజాతభుజాంతరమ్"** (తామరపూసల మాలికలతో అందమైన వక్షస్సును కలవానిని) అని పలికే రీతిలో శ్రీవైష్ణవలక్షణమైన తులసీనలినాక్షమాలికలను అలంకరించుకొని వెలిగేవారు- అనికూడా భావం.

(అశోదై)- **“ఎల్లామ్ దెయ్వనఙ్ఞై యశోదై పెఱ్ఱాళే”** (అన్నిటినీ ఆ దైవకాంత యశోద పొందింది.) (పెరుమాళ్ తిరుమొழி-7-5) అనే రీతిలో భగవదనుభవాలలో దేనినీ కోల్పోకుండా అన్నిటిని పొందిన యశోదాదేవి వలె, **“పోకత్తిల్ వழுవాద”** (అనుభవంలో ఏ లోటులేని) ఆచార్యుని తెల్పుతుంది.

(ఇళశ్శిఙ్గమ్) - దుర్వాదాలను చేసేవారికి దరిచేరడానికి సాధ్యం కాకుండా, అభిభవించడానికి (అవమానించడానికి) సాధ్యం కాకుండా ఉండే స్వభావానికి సింహమే ఉపమానం.

(కార్ మేని) ఆచార్యుడు స్వర్ణచ్ఛాయను కల తిరుమేనిని కలవాడై ఉన్నా, **“కొణ్డల్‌వణ్ణన్ ... ఒరువనడియేనుళ్ళానే”** (మేఘవర్ణాన్ని కలవాడు.... అద్వితీయుడు దాసునిలో ఉన్నాడు) అనే రీతిలో కాలమేఘవర్ణుడైన భగవానుని లోపల కలవాడు కనుక, ఆ భగవానుని ప్రకాశించే నీలమేనియొక్క కాంతిప్రతిఫలనంవల్ల తానుకూడా నీలమేనిని కలవాడుగానే సాక్షాత్కరిస్తాడు. ఈ సందర్భంలో - **“అపి ఫణిపతిభావాత్ శుభ్రమంతః శయాళోః మరతకసుకుమారైః రంగభర్తు ర్మయూఖైః, సకలజలధిపాన శ్యామజీమూతజైత్రం పులకయతి విమానం పావనం లోచనే నః”** (ఆదిశేషుని రూపమైనందున తెల్లగా ఉన్నా, లోపల శయనించి ఉండే శ్రీరంగనాథుని మరకతమణికాంతుల వలె సుకుమారాలైన కాంతులతో నల్లని మేఘాన్ని జయించే రీతిలో ఉండే శ్రీరంగవిమానం మన నేత్రాలకు గగుర్పాటు కల్గిస్తున్నది.) అనే శ్రీరంగరాజస్తవదివ్యసూక్తి అనుసంధేయం. శ్రీరంగవిమానం సాక్షాత్తు ఆదిశేషుడే కనుక, తెల్లగా ఉన్నప్పటికీ, లోపల పచ్చని మరతకమహాగిరివలె మేనిని కల అన్నిటిని భగవానుని తిరుమేని ప్రతిఫలనంవల్ల కంఠం వరకు నీటిని తాగిన నల్లని మేఘంవలె దర్శనమిస్తున్నది- అని శ్లోకభావం. **“క్షీరాంభోధేః జఠరమభితో దేహభాసాం ప్రరోహైః కాలోన్మీలత్కువలయదళాద్వైతమాపాద యంతమ్”** (క్షీరాబ్ధి లోపల తన తిరుమేని యొక్క నల్లని కాంతులతో తగినసమయంలో పూచిన నల్లకలువలతో ఐక్యాన్ని పొందించేది.) అనే చంపూరామాయణశ్లోకం ఇక్కడ స్మరణీయం.

(శెఙ్గణ్) - ఎఱ్ఱదనాన్ని కల్గిన నేత్రాలను కలవాడు. **“శెమ్మై”** అంటే-ఆర్జవం- కుటిలత్వం లేని స్వభావం. ఋజువైన స్వభావాన్ని కలవాడని భావం. **“యతిః పూజ్యో న సంశయః”** అని అంటే, “యతి పూజింప దగినవాడే, ఇందులో సందేహం లేదు’’ అనే అర్థాన్ని ఋజుజ్ఞానాన్ని కలవారు గ్రహిస్తారు. కుటిల జ్ఞానాన్ని కలవారైతే, **“యతిః పూజ్యో న”** - యతి పూజింపదగినవాడు కాడు, **“సంశయః”**- అతని

ప్రవర్తన సందేహించవలసి ఉన్నది- అనే అర్థాన్ని గ్రహిస్తారు. అటువంటివారి జ్ఞానం వ్యధికరణ జ్ఞానమనబడుతుంది. ఆ విధంగా కాకుండా, సమానాధికరణజ్ఞానాన్ని కలవారే ఆచార్యులు- అని తెలుపబడుతున్నది- **“శెఙ్గణ్”** అని అనడంద్వారా.

(కదిర్‌మదియమ్‌పోల్ ముకత్తాన్) - చంద్రునివలె, సూర్యునివలె ప్రకాశించే శ్రీసూక్తులను కలవాడు. ఆచార్యుడు శ్రీభాష్య- వేదార్థ సంగ్రహాది ప్రవచన సమయంలో సూర్యునివలె జ్వలిస్తాడు. భగవద్విషయ, శ్రీవచనభూషణాది ప్రవచనకాలంలో సౌమ్యమైన ముఖాన్ని కలవాడై, ఆహ్లాదశీతనేత్రాంబును కలవాడై ఉంటాడు- అని భావం.

(నారాయణనే నమక్కే పఱై తరువాన్) -ఈ ప్రయోగం ముందే వివరింప బడింది. ఈ విధంగా ఇటువంటి సదాచార్యునివద్ద మనం అవగాహిస్తే (ఆశ్రయిస్తే) లోకులు పొగడుతారు. **“వాழ்వర్, వాழ்వ్యెయ్‌ది ఞాలమ్ పుకழுవే”** (ఉజ్జీవనాన్ని పొంది భూలోకం అంతా పొగడే రీతిలో సుఖిస్తారు.) అనే రీతిలో కాగలరు.

2. వైయత్తు వాழ்వీర్‌కాళ్! నాముమ్ నమ్ పావైక్కు
చ్చెయ్యుమ్ కిరిశైకళ్ కేళీరో!, పాఱ్కడలుళ్
పైయత్తుయిన్ఱ పరమనడి పాడి
నెయ్ ఉణ్ణోమ్ పాల్ ఉణ్ణోమ్ నాట్కాలే నీరాడి
మైయిట్టెழுతోమ్ మలరిట్టు నామ్ ముడియోమ్
శెయ్యాదన శెయ్యామ్ తీక్కుఱళై శెన్ఱు ఓదోమ్
ఐయముమ్ పిచ్చైయుమ్ ఆన్దనైయుమ్ కై కాట్టి
ఉయ్యుమాఱెణ్ణి ఉగన్దు ఏలోర్ ఎమ్బావాయ్

పూర్వం మొదటి పాశురంలో **“నీరాడ ప్పోదువీర్ పోదుమినో”** అని “భగవదను భవాన్ని చేయగోరినవారంతా రండి’’ అని ఆహ్వానింపబడింది. ఇందువల్ల ఈ అనుభవానికి అధికారినియమం లేదు - అని, అభిలాషను కలవారందఱు అధికారులే- అని తెలుపబడింది. ఉపనిషత్తులలో **“సత్యం వద, ధర్మం చర”** అనే రెండు విధివాక్యాలున్నాయి. వీటిలో, **“ధర్మం చర”**అనే దానిని వివరించేటపుడు జాతిభేదంతోను, ఆశ్రమభేదంతోను బేధిస్తున్నవి కనుక, ధర్మాలు అన్నిటికీ అందఱు అధికారులు కాలేరు. **“సత్యం వద”** అనే విధికి మాత్రం వీరు, వారు- అనే భేదం లేకుండా లోకంలో జన్మించిన అందఱు సమానంగానే అధికారులుగా అవుతున్నారు. అదే రీతిలో, భగవదాశ్రయణం, భాగవతాశ్రయణం, ఆచార్యాశ్రయణమనే

విషయాలకు అధికారినియమం లేకుండా, అందఱు అధికారులు అనేది వాస్తవమైనా, దీనినికూడా కొంచెం నిష్కర్షించవలసి ఉన్నది. ఆ శిక్షణకోసమే ఈ పాశురం అవతరించింది. అంటే- శాస్త్రవశ్యత్వం ముఖ్యమైన అధికారసంపద- అనే విషయాన్ని ఈ పాశురం వివరిస్తున్నది. భగవద్గీతలో మూడవ అధ్యాయంలోని 23,24వ శ్లోకాలలో గీతాచార్యుడు తెల్పిన విషయం గమనించదగినది. **"యః శాస్త్రవిధిముత్సృజ్య వర్తతే కామకారతః, న స సిద్ధిమవాప్నోతి న సుఖం న పరాం గతిమ్"** (ఎవడు శాస్త్రవిధిని దాటి యథేష్టంగా వర్తిస్తాడో, అతడు సిద్ధిని పొందలేడు. సుఖాన్ని, ఉత్తమగతిని పొందలేడు.) అనేది 23వ శ్లోకం. ఎవడు శాస్త్రవిధిని అతిక్రమించి తన మనస్సుకు తోచినట్లు నడుచుకొంటున్నాడో, అతడు ఆముష్మికసిద్ధిని దేనినీ పొందలేడు. సుఖమేమీ అతనికి లభించదు. పరగతిప్రాప్తికి ప్రసక్తి అనేదే లేదు- అనేది ఈ శ్లోకంయొక్క భావం. దీనికి తరువాత శ్లోకం **"తస్మాత్ శాస్త్రం ప్రమాణం తే కార్యాకార్యవ్యవస్థితౌ"** (అందువల్ల శాస్త్రమే చేయదగిన- చేయదగని కార్యాల వ్యవస్థలో ప్రమాణం.) ఇత్యాది. ఇటువంటిది చేయదగినది, ఇటువంటిది చేయరానిది - అనే వ్యవస్థకు శాస్త్రమే ప్రమాణం- అనేది దీని భావం. అందువల్ల, ఇటువంటి శాస్త్రవశ్యత్వం కల్గినవారే దీనికి (ఈవ్రతానికి) అధికారులు- అని, అది లేనివారు అనధికారులే - అని తెలుపడం ఆవశ్యకం కనుక, దానిని ఈ పాశురం తెల్పుతున్నది.

శాస్త్రం విధినిషేధాత్మకంగా ఉంటుంది. శాస్త్రమంటే- స్మృతీతిహాస పురాణాదులతో కూడిన శ్రుతి. అందులో విధులుంటాయి. నిషేధాలుకూడా ఉంటాయి. **"మాతృదేవో భవ, పితృదేవో భవ, ఆచార్యదేవో భవ, అతిథిదేవో భవ, సత్యం వద, ధర్మం చర"** (తల్లిని దైవంగా కల్గిఉండు, తండ్రిని దైవంగా కల్గి ఉండు, అతిథిని దైవంగా కల్గిఉండు, సత్యాన్ని పల్కు, ధర్మాన్ని ఆచరించు) ఇత్యాదులు విధిపరాలు. **"నాప్సు మూత్రపురీషం కుర్యాత్, న నిష్ఠీవేత్, న వివసనః స్నాయాత్, నానృతం వదేత్, న మాంసమశ్నీయాత్"** (నీటిలో మూత్ర పురీషాలను విసర్జించరాదు, ఉమ్మి వేయరాదు, వస్త్రహీనుడుగా స్నానం చేయరాదు, అసత్యాన్ని పలుకరాదు, మాంసాన్ని తినరాదు) ఇత్యాదులు నిషేధపరాలు. చేయదగిన సత్కార్యాన్ని చేసేటట్లుగా ఆజ్ఞాపించే శాస్త్రభాగం విధిపరమని, విడువదగిన చెడ్డపనులను విడిచేటట్లుగా ఆజ్ఞాపించే శాస్త్రభాగం నిషేధమని తెలిసింది. ఈ రెండిటిని పరిపాలించడమే శాస్త్రవశ్యత్వమనేది. **"పోదువీర్ పోదుమినో"** (వచ్చేవారు రండి) అని పిలువబడినవారు అటువంటి శాస్త్రవశ్యత్వపూర్తిని కలవారై ఉండడం ఆవశ్యకం - అని చూపడమే ఈ పాశురంలోని స్వాపదేశార్థసర్వస్వం.

(వైయత్తు వాఴ్వీర్కాళ్ !) - గడచిన పాశురంలో **"శీర్ మల్కుమ్ ఆయ్ప్పాడి చ్చెల్వచ్చిఱుమీర్కాళ్ !"** అని రేపల్లెలో ఉండేవారిని మాత్రం ఆహ్వానించినట్లుగా తెలిపి, ఈ పాశురంలో భూమండలంలో ఉండేవారిని అందఱిని పిలిచే రీతిలో **"వైయత్తు వాఴ్వీర్వాళ్ !"** అనే ఈ సూక్తి పొసగుతుందా? అని సందేహపడవద్దు. (స్వాపదేశార్థాలను మఱచిపోకుండా మనస్సులో జ్ఞాపకం పెట్టుకోవాలి) గడచిన పాశురంలో రేపల్లె అనేది ఉత్తరమధురసమీపంలోని గోకులమనే పేరుతో వ్యవహరింపబడే ఏదో ఒక స్థలంవిశేషం మాత్రమే కాదుకదా! పశుప్రాయులై, అజ్ఞానులైన నరులందఱు వర్తించే చోటే రేపల్లె- అని తెలుపబడినందున, **"వైయత్తు వాఴ్వీర్కాళ్ !"** అనే ఈ సూక్తికూడా దానికే వివరణం. **"వాఴ్చ్చి"** (ఉజ్జీవనం) అనేది ఈ లోకంలో తప్ప పరమపదంలో కాదు- అని తెలుపబడుతున్న రీతి ఇది. గోదాదేవి నాచ్చియార్ తిరుమొఴిలో **"కొఙ్గై ములైకళ్ ఇడర్ తీర క్కోవిన్దఱ్కోర్ కుఱ్ఱేవల్ ఇమ్మై ప్పిఱవి శెయ్యాదే, ఇని ప్పోయ్ శెయ్యుమ్ తవన్దాన్ ఎన్?"** (స్తనాల ఆర్తి తీరేటట్లు గోవిందునకు అద్వితీయ కైంకర్యం ఈజన్మలోనే చేయకుండా ఇక పోయి చేసే తపస్సు ఏమి?) అని పల్కినందువల్ల, **"ఇచ్చువై తవిర యాన్ పోయ్ ఇన్దిరలోక మాళుమ్ అచ్చువై పెఱినుమ్ వేణ్డేన్"** (ఈ అనుభవాన్ని తప్ప నేను ఇంద్రలోకాన్ని పాలించే ఆ అనుభవాన్ని సైతం ఆశపడను) అని, **"అణ్డర్కోన్ అణి యరఙ్గన్ ఎన్ అముదినై కణ్డ కణ్గళ్ మఱ్ఱొన్ఱినై క్కాణావే"** (అండాధిపతి, అందమైన శ్రీరంగంలో ఉండేవాడు, నా అమృతస్వరూపుడైన స్వామిని దర్శించిన నా నేత్రాలు ఇంకొక వస్తువును దేనిని దర్శించవు.) అని పలికే గోష్ఠిలో చేరినవారు పరమపదంలోనే ఉజ్జీవన మున్నదని తలుస్తారు. ద్వీపాంత రాలలో జన్మించకుండా, పుణ్యఫలానుభవానికి, పుణ్యకర్మార్జనకు తగిన జంబూ ద్వీపంలో భారతవర్షంలో భరతఖండంలో జన్మించడం, అందులోను, జ్ఞానానికి అవకాశం లేని పశుపక్షియోనులలో జన్మించకుండా, మానవజాతిలో జన్మించడం, అందులోను, గర్భంలోనే మరణించడం, బాలారిష్టాలతో మరణించడం కాకుండా, చిరకాలం జీవించగల్గడం, అందులోను , వేద-వేదాంత- వేదాంగాలను- అభ్యసించ డానికి యోగ్యత లేని జాతులలో జన్మించకుండా, **"ఇరు ముప్పొఴుదేత్తి ఎల్లై యిల్లా తొన్నెఱిక్కణ్ నిలైనిన్ఱ తొణ్డర్"** (పంచకాలాలలో స్తుతించి, అంతులేని ప్రాచీనమైన మార్గంలో నిష్ఠను కల దాసుల) కులంలో జన్మించగల్గడం, చిన్నతనాన్ని పాడు చేసికొని, **"తణ్డు కాలా ఊన్ఱి ఊన్ఱి త్తళ్ళినడవా మున్"** (చేతికర్రను కాలుగా ఊని ఊని నడవడానికి ముందే) పరువంలో ఊనికను కల్గి, శ్రమపడడం కాకుండా,

'కిళరొళి యిళమై" (ప్రకాశించే తేజస్సు కల చిన్నతనం) పాడు కాకుండా సద్వినియోగపడడం, లేతవయస్సులో ఉన్నప్పటికీ, ఇందులో ఆసక్తిని లేకుండా ఉండడం కాకుండా, **"యానుమ్ ఎన్నెఞ్జమ్ ఇశైన్దొళ్ళిన్దోమ్"** (నేను, నా మనస్సు అంగీకరించాము) అనే రీతిలోని అంగీకారంతోకూడి ఉండడం, **"శ్రేయాంసి బహువిఘ్నాని భవంతి మహతా మపి"** (గొప్పవారికికూడా మంచిపనులు చేసేటప్పుడు పలు విఘ్నాలు వస్తాయి) అనే రీతిలోని ఆటంకాలు ఎదురు కాకుండా ఉండడం- అనే ఇన్ని సౌకర్యాలు పొంది, రోగం- ఆకలి- వార్ధక్యం- దుఃఖాలతో బాధపడకుండా, "నిన్ఱ వానిల్లా నెఞ్జు" (నిలిచిన చోట నిలువని మనస్సు) ను కూడా జయించి, మంచి విద్యను అధికరించగల్గిన పొందికను (అదృష్టాన్ని) కలవారిని **"వైయత్తు వాళ్వీర్‌కాళ్ !"** (భూమిలో ఉజ్జీవించే వారలారా !)అని ఆహ్వానిస్తున్నారు.

"వైయత్తుమ్ వాళ్వీర్‌కాళ్ !" అని మధ్యలో చకారాన్ని **(ఉమ్)** - చేర్చి ప్రయోగింపబడినట్లుగాకూడా గ్రహించి వివరించవచ్చు. **"పావియేనై ప్పల నీ కాట్టి కెడుప్పాయో ?"** (పాపిష్ఠివాడనైన నాకు ఈలోకంలోని పలు వస్తువులను చూపి పాడుచేస్తావా?) అని, **"ఓ! ఓ! ఉలకినదు ఇయల్వే!"** (అయ్యో! లోక స్వభావమేమి?) అని బాధతో కడుపు పట్టుకోవలసినట్లుగా మహాజ్ఞానులనుకూడా అజ్ఞానాన్ని కల్గించే లోకంలో ఉజ్జీవించడం అరుదు. ఇందులోకూడా ఉజ్జీవించాలనే రుచి మీకు కల్గిందికదా! ఇది ఎంతటి భాగ్యం! అని ప్రశంసించి పలికే రీతి ఇది. **"వాళ్వీర్ !"** అని. అంటేనే చాలి ఉండగా, **"వాళ్వీర్‌కాళ్!"** అని బహువచన ప్రత్యయంపైన ఇంకొక బహువచన ప్రత్యయాన్ని ప్రయోగించి పల్కడం- **"వాళ్లాట్పట్టు నిన్వీరుళ్ళీరేల్"** (ఉజ్జీవించగోరినవారై ఉంటే) అని అన్వేషించవలసిన అక్కఱ లేకుండా **"పొలిక పొలిక... కణ్డోమ్ కణ్డోమ్ కణ్డోమ్ కణ్ణుక్కినియన కణ్డోమ్"** (వర్ధిల్లాలి ! వర్ధిల్లాలి చూచాము. చూచాము. కంటికి ఇంపుగా చూచాము) అనే రీతిలో భగవద్రామానుజుల కాలంలో ఏర్పడిన శ్రీవైష్ణవసమృద్ధిని తెల్పుతుంది. **"ఏకాంతినః ద్వాదశభిః సహస్రైః సంసేవితః సంయమిసప్తశత్యా"** (పన్నెండువేలమంది ఏకాంతులతో, ఏడువందలమంది యతులతో సేవింపబడేవారై) అని వడుగనంబి పల్కిన రీతిలో పన్నెండువేలమంది శ్రీవైష్ణవులు, ఏడు వందలమంది జీయర్ స్వాములు ఈ లోకంలో ఉజ్జీవించిన గొప్ప సమయం రాబోతున్నది- అనే విషయాన్ని జ్ఞాననేత్రంతో గ్రహించిన గోదాదేవి **"వైయత్తు వాళ్వీర్‌కాళ్ !"** అని అనుగ్రహించింది.

(నాముమ్) - ఈ "ఉమ్మై" (చకారం) ద్వారా తమ వైలక్షణ్యాతిశయం స్ఫురింపజేయబడింది. నాస్తికులై, శాస్త్రదుష్కరులై జన్మించకుండా, ఆస్తికనాస్తికులు కాకుండా, ఆస్తికులుగాను, **"శ్రుతిః స్మృతిః మమైవాజ్ఞా యస్తా ముల్లంఘ్య వర్తతే, ఆజ్ఞాచ్ఛేదీ మమ ద్రోహీ మద్భక్తోஉపి న వైష్ణవః"** (వేదాలు, స్మృతులు నా ఆజ్ఞలే. ఎవడు వానిని అతిక్రమించి వర్తిస్తున్నాడో, అతడు నా ఆజ్ఞను మీరినవాడు. నాకు ద్రోహి, వాడు నాకు భక్తుడైనా వైష్ణవుడు కాడు) ఇత్యాదివచనాలలో పరిపూర్ణమైన విశ్వాసాన్ని కలవారై ఉండే గొప్పతనాన్ని చూపిన రీతి ఇది.

(నమ్‌పావైక్కు) - **"పావై"** - అంటే వ్రతం. **"నమ్"** అనే పదానికి స్వాపదేశంలో శిష్యులు- అని అర్థం కనుక, శిష్యుల వ్రతం ఏమి? అనే విషయాన్ని గమనించాలి. నమ్మాళ్వార్ విషయంలో - మధురకవులు, భగవద్రామానుజుల విషయంలో- తిరువరంగత్తముదనార్ చూపిన నిష్ఠయే శిష్యుల వ్రతం. **"తేవు మఱ్ఱఱియేన్ కురుకూర్‌నమ్బి పావినిన్నిశై పాడి త్తిరివనే"** (ఇంకొక దైవాన్ని తెలియను. కురుకూర్‌నంబి అయిన శఠకోపులను పాశుర గానంతో పాడి సంచరిస్తాను) అనేది మధురకవులు చూపిన నిష్ఠ. **"కైయిల్ కని ఎన్న కణ్ణనై క్కాట్టి త్తరిలుమ్ ఉన్ఱన్ మెయ్యిల్ పిఱఙ్గియ శీరన్ఱి వేణ్డిలన్ యాన్"** (కరతలామలకంగా శ్రీకృష్ణుని దర్శింపజేసినా, మీ కల్యాణగుణానుభవాన్ని తప్ప దేనినీ కోరను) అనేది అముదనార్ చూపిన నిష్ఠ. ఆచార్యుని పరదేవతగా భావించే వ్రతమే ఇది. ఈ విధంగా అయితే ఆచార్యనిష్ఠులు భగవానుని కన్నెత్తి కూడా చూడనక్కరలేదా?-అనే ప్రశ్న కల్గుతుంది. వినండి. మధురకవులు **"తేవు మఱ్ఱఱియేన్"** (ఇంకొక దైవాన్ని తెలియను) అని పల్కిన తరువాత, అనంతరపాశురంలో **"తిరితన్దాకిలుమ్ దేవపిరానుడై క్కరియకోల త్తిరువురు క్కాణ్బన్ నాన్"** (తిరిగినా, దేవుడు, స్వామియైన వాని నల్లని అందమైన రూపాన్ని నేను దర్శిస్తాను.) అని అంటూ, భగవానుని సేవిస్తానని అన్నారు. ఇందువల్ల తమకు సాక్షాత్ ఉద్దేశ్యభూతునిగా భగవానుని గ్రహించరాదని, ఆచార్యునకు ఉద్దేశ్యభూతుడు కనుక, ఆ తద్ద్వారా మనకుకూడా ఉద్దేశ్యునిగా భగవానుని గ్రహించవచ్చునని తెలుపబడినది. "ఆచార్యుని ముఖోల్లాసంకోసం భగవద్భక్తి కూడా ప్రాప్తమే'' అనే ప్రతిపత్తియే స్వరూపానురూపం. అముదనార్ కూడా భగవానుని సంబంధాన్ని వీడలేదు. తమకు భగవద్రామానుజులు చేసిన ఉపకారాలనుగూర్చి పలికేటపుడు, **"అరఙ్గన్ శెయ్యతాళిణైయోడార్‌త్తాన్"** (శ్రీరంగ నాథుని అందమైన శ్రీచరణాలతో చేర్చారు) అని పలికారుకదా! శ్రీరంగనాథుని శ్రీచరణాలతో శ్రీరామానుజులు తమను చేర్చి కట్టి పడవేసినట్లుగాకదా పలికారు.

అందువల్ల ఆచార్యనిష్ఠులైన అధికారులకు భగవానుడు త్యజింపదగినవాడనే విపరీతగ్రహణాన్ని పొందకూడదు. శ్రీవచనభూషణ దివ్యగ్రంథంలోని చరమపర్వ నిష్ఠాప్రకరణంలో **"ఉపకార్యవస్తుగౌరవత్తాలే ఆచార్యనిఱ్ఱాట్టిల్ మికవు ముపకారకన్ ఈశ్వరన్"** (ఉపకార్యవస్తు గౌరవంచేత ఆచార్యుని కంటే చాలా గొప్ప ఉపకారాన్ని చేసినవాడు, భగవానుడు) అనే చూర్ణికను మననం చేస్తే ఇందులో చక్కని స్పష్టత కల్గుతుంది. ఇక, తరువాత విషయాన్నిగూర్చి తెలియజేస్తాను.

(నమ్పావైక్కు చ్చెయ్యుమ్ కిరిశైకళ్ కేళీరో) - అనేది సబ్రహ్మచారులను ఉద్దేశించి పల్కిన మాట. **"శెయ్యుమ్ కిరిశైకళ్"** (చేసే కృత్యాలు) అనే ప్రయోగంలో చేయబడేవి, విడువబడేవి - అనే రెండు విధాలైన కార్యాలు అంతర్భవిస్తాయి. గోపికలు పరిగ్రహించిన మార్గళివ్రతం కోసం కొన్నిటిని చేయాలని, కొన్నిటిని విడచి పెట్టాలని ఇక్కడ పల్కడం - ఆ నోము ముగిసేవరకు. తరువాత **"కూడారై వెల్లుమ్ శీర్"** (తనతో కూడని వారిని జయించే కల్యాణగుణాలు) (27) అనే పాశురంలో అన్నిటిని పరిగ్రహించమని అంటున్నారు. స్వాపదేశార్థంలో - ఆచార్యనిష్ఠ అనే వ్రతానికి ఏనాడూ పరిసమాప్తి లేదు కనుక, ఇక్కడ చెప్పబడే త్యాజ్యోపాదేయాలు నిత్యమైనవని తెలియాలి.

"పాఱ్కడలుళ్ పైయత్తుయిన్ఱ పరమనడి" (క్షీరాబ్ధిలో ఆదిశేషునిపై తూగే భగవానుని శ్రీచరణాలను) పాడడం, ప్రాతఃకాలంలో స్నానం చేయడం, దానధర్మాలను, భిక్షను బ్రాహ్మణులకు ఇవ్వడం, ఉజ్జీవించే ప్రకారాన్నిగూర్చి చింతించడం- అనే ఇవి కర్తవ్యాలు. నేతిని భుజించడం, పాలను తాగడం, కాటుకను పెట్టుకోవడం. పూలను ముడుచుకోవడం, చేయకూడనివి చేయకపోవడం, చెడ్డమాటలను పల్కడం- అనే ఇవి త్యాజ్యాలు. (ఇక్కడ ఒక సందేహం కల్గుతుంది) చేయకూడనివి చేయకపోవడం, చెడ్డమాటలను పల్కకపోవడం- అనేవి గోపికలకు కూడా యావజ్జీవం కర్తవ్యాలే కదా! మఱి, ఈ నోముకు అంగంగా వీటిని సంకల్పించినట్లు పల్కడం తగునా? నోము పూర్తికాగానే, పరమాత్మ శ్రీచరణాలను పాడడం, దానధర్మాలను బ్రాహ్మణులకు ఇవ్వడం మొదలైనవానిని విడచిపెట్టడం, చేయకూడనివానిని చేయడం, చెడ్డమాటలను పలుకడం మొదలైనవానినికూడా గ్రహించవలసి వస్తుందికదా! దీనికి ఏమి సమాధానం? అని అంటే- వినండి. వేదంలో ఒక యాగంలో దీక్షను తీసికొన్నవాడు ఆ యాగం ముగిసేవరకు పాటించవలసిన నియతినిగూర్చి చెప్పేటపుడు **"తస్యైతత్ వ్రతం నానృతం వదేత్,**

న మాంస మశ్నీయాత్" (ఇది అతని వ్రతం. అబద్ధం ఆడరాదు. మాంసం భుజించరాదు.) అని చెప్పబడింది. అంటే- 'అసత్యాన్ని పలుకకపోవడం, మాంస భక్షణ చేయకపోవడం- అతనికి వ్రతం''- అని దీని అర్థం. దీనివల్ల ఆ యాగం ముగిసిన వెంటనే అబద్ధాన్ని పలుకవచ్చు. మాంసభక్షణం చేయవచ్చు- అనే అర్థం అని సిద్ధించదు. మఱి ఏమని సిద్ధిస్తుంది? అంటే, సామాన్యసమయాలలో వాటిని చేస్తే సామాన్యమైన పాపం, దీక్షాకాలవిశేషాలలో వాటిని చేస్తే రెండింతలు పాపం కల్గుతుంది -అనేదే శాస్త్రతాత్పర్యంగా సిద్ధిస్తుంది. అదేరీతిలో ఇక్కడకూడా అర్థాన్ని గ్రహించాలి.

స్వాపదేశంలో, **"పాఱ్కడలుళ్ పైయత్తుయిన్ఱ పరమనడి పాడుకై"** (క్షీరాబ్ధిలో ఆదిశేషునిపై పరుండిన పరమాత్మ పాదాలను కీర్తించడం) అంటే ఏమి?- అంటే- **"ఉనతు పాలేపోల్ శీరిల్ పఴుత్తొఴిన్దేన్"** (నీ పాలవలె భోగ్యమైన నీ గుణాలలో పండిపోయాను) (పెరియ తిరువన్దాది) అనే రీతిలో **"పాల్"** అనబడే భగవానుని కల్యాణగుణాలనుగూర్చి పల్కడమే. ఆ కల్యాణగుణాలు అపరిచ్ఛిన్నాలు కనుక, అవి సముద్రంవంటివి. భగవద్గుణసాగరంలో పరమానందానుభవాన్ని చేస్తూ ఉండే **"పరమన్"** - ఆచార్యుడు. అతని **"అడి పాడుకై"** -సాక్షాత్తు ఆ ఆచార్యుని శ్రీచరణాలను కీర్తించడం, వారి శ్రీచరణస్థానీయులైన అంతరంగశిష్యులను కీర్తించడం. నమ్మాళ్వార్లకు శ్రీచరణస్థానీయులు - శ్రీరామానుజులు, భగవద్రామానుజులకు శ్రీచరణస్థానీయులు - ముదలియాణ్డాన్- అనే అంతరంగశిష్యులు వారి వారి శ్రీచరణస్థానీయులుగా వ్యవహరింప బడుతున్నారుకదా !

(నెయ్యుణ్ణోమ్ పాలుణ్ణోమ్) - దేహాన్ని పోషించడంకోసంకదా నేతిని, పాలను భుజించడం. ముముక్షువులై, ఆత్మోజ్జీవనంలోనే ఊనికను (మిక్కిలి శ్రద్ధను) కల్గిన వారికి **"కణైనాణిల్ ఓవా త్తొழிల్ శార్ఙ్గన్ తొల్శీరై నన్నెఞ్జే ! ఓవాద ఊణాక ఉణ్"** (నారినుండి నిరంతరం బాణాలను వర్షించే కృత్యాన్ని కల శార్ఙ్గమనే వింటిని కలవాని సహజకల్యాణగుణాలను, ఓ మనసా!, అన్నంగా భుజించు) (పెరియ తిరువన్దాది) అనే రీతిలో భగవద్గుణాలే నిరంతరం అనుభవించదగినవి- అని తెలుపబడింది. **"ఉణ్ణుమ్ శోఱు పరుకు నీర్ తిన్నుమ్ వెఱ్ఱిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్"** (భుజించే అన్నం, తాగే నీరు, ఆస్వాదించే తాంబూలం- అన్నీ శ్రీకృష్ణుడే) అనే రీతిలో మనవంటివారు ఉండలేకపోయినా, ఆ విధంగా ఉండాలని ఆశపడవచ్చు కదా!

"నాట్కాలే నీరాడుకై" (ప్రాతఃకాలంలో స్నానం) చేయాలి అని అనడం- నిత్యనైమిత్తికాలైన సకల కర్మలను చేయాలని తెలుపడమే. **"కుళిత్తు మూన్ఱనలై యోమ్బుమ్ కుఱికొళ్ అన్దణమైతన్నై ఒళిత్తిట్టు"** (నిత్యం స్నానం చేసి, త్రేతాగ్నులను ఆరాధించి, ఏలోటు లేకుండా రక్షింపదగిన బ్రాహ్మణ్యాన్ని వ్యర్థం చేసికొని) కాకుండా, **"ఇరుముప్పొఴుతేత్తి ఎల్లై యిల్లా త్తొన్నెఱి క్కణ్ నిలైనిన్ఱ తొణ్డరాన అఱుఅన్దికఴు మన్దణవర్"** (పంచ కాలాలలో సేవించి, అనాది అయిన, ప్రాచీనమైన సంప్రదాయంలో స్థిరంగా ఉండే భక్తులైన, కరుణ నిండిన శ్రీవైష్ణవులు) (పెరుమాళ్ తిరు-1-7) అని కులశేఖరాఴ్వార్లు పల్కిన రీతిలో పంచకాలపరాయణులై ఉండవలసిన రీతిని తెలుపడం.

"మైయిట్టెఴుతోమ్ మలరిట్టు నామ్ ముడియోమ్" -కాటుకను పెట్టుకోవడం, పూవులను ముడుచుకోవడం దేహాలంకారంలోకి చేరుతాయి. **"అరఙ్గనార్క్కు ఆట్చెయ్యాదే పుఱమ్ శువర్ కోలమ్ శెయ్తు పుట్కవ్వ క్కిడక్కిన్ఱీరే"** (శ్రీరంగనాథునకు కైంకర్యం చేయకుండా, బాహ్యమైన గోడవంటి శరీరానికి అలంకారం చేసి, కాకులు గద్దలు పొడిచి తినేటట్లుగా నశిస్తున్నారే!) (తిరుమాలై-6) అనే రీతిలో బయట గోడకు అలంకారం చేయడం - అనే దేహాలంకారం చేసికోవడమనే అవధిలో నిలువకుండా, ఆత్మాలంకారమైన శమదమాద్యాత్మ గుణాలను సంపాదించుకోవడంలోనే మిక్కిలి శ్రద్ధను కల్గి ఉండడం- అని తాత్పర్యం.

(శెయ్యాదన శెయ్యోమ్) - ఉపదేశరత్తినమాలై ప్రబంధంలో **"ఆశారియర్కళ్ అనైవరుమ్ మున్నాశరిత్త ఆశారన్దన్నై యఱియాదార్, పేశుకిన్ఱ వార్త్తైకళై క్కేట్టు మరుళాదే పూరువర్కళ్ శీర్త్త నిలైతన్నై నెఞ్జే! శేర్"** (ఆచార్యులు అందఱు పూర్వం ఆచరించిన ఆచారాన్ని తెలియనివారు పలికే మాటలను విని భ్రమించకుండా, పూర్వులు ఆదరించిన గొప్ప స్థితిని, ఓమనసా! చేరు) అని పల్కిన రీతిలో శాస్త్రాలలో విధింపబడినవే అయినా, సారాసారవివేచనలో కుశలులైన మన పూర్వులు అనుష్ఠించని కర్మలను మనం అనుష్ఠించబోము - అని భావం. ఏకాదశీశ్రాద్ధం, అసకృత్ ప్రణామం, అష్టకాన్వష్టకా శ్రాద్ధం, మహాలయతర్పణం, అదృష్టాన్ని ఆచరించడం- మొదలైన "చేయకూడనివానిని చేయము''- అనేవి "శెయ్యాదన శెయ్యోమ్" అనే సూక్తిలో అంతర్భవిస్తాయి. ఉపనిషత్తుకూడా **"అథ యది తే కర్మవిచికిత్సా వా వృత్తవిచికిత్సా వా స్యాత్, యే తత్ర బ్రాహ్మణా సంమర్శినః, అలూక్షా ధర్మకామాః స్యుః, యథా తే తత్ర వర్తేరన్, తథా తత్ర వర్తేథాః"** (ఒక వేళ నీకు

కర్తవ్యాలలోగాని, వృత్తంలో కాని విచికిత్స కల్గితే, అపుడు, ఏ బ్రాహ్మణులు చక్కగా విమర్శించి తెలియదగినవారై ఉంటారో, పక్షపాతరహితులై, ధర్మాన్ని ఆదరించేవారై ఉంటారో, వారు ఏయే కర్మలలో, వృత్తాలలో ఏవిధంగా వర్తిస్తారో, ఆయా కర్మలలో, వృత్తాలలో ఆవిధంగా వర్తించు.) అని పల్కింది. భగవద్గీతలో కూడా **"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః, స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే"** (శ్రేష్ఠుడైన వాడు ఏయే కర్మను ఎంతవరకు ఆచరిస్తాడో, సామాన్యుడు కూడా ఆయా కర్మను అంతవరకు ఆచరిస్తాడు.) అని చెప్పబడింది. **"ధర్మజ్ఞసమయః ప్రమాణమ్"** (ధర్మజ్ఞుల ఆచారం ప్రమాణం) అని ఆపస్తంబుడుకూడా అన్నాడు. శాస్త్రవిహితాలను చేయడంకంటే పెద్దలు చేయనివానిని చేయకపోవడం ముఖ్యం- అనేదానిని తెలుపడంకోసమే "శెయ్యాదన శెయ్యోమ్" (చేయకూడని వానిని చేయము) అని ప్రత్యేకించి చెప్పబడింది- **"మఱన్దుమ్ పుఱన్తొఴా మాన్దర్"** (మఱచిపోయి కూడా అన్యదేవతలను కొలువని సోమరులు) అనే రీతిలో.

(తీక్కుఱళై శెన్ఱు ఓదోమ్) - **"తీక్కుఱళై చ్చెన్ఱోదోమ్"** అని పలువురి పాఠం త్యాజ్యం. సంధిలో ద్విత్వం రాదు. (ఇక్కడ **"కుఱళ్"** అనేది పదరూపం కాదు, **"కుఱళై"** అనేదే పదరూపం) కొండెపు మాటలు, నింద, వ్యర్థప్రలాపం, అసత్యభాషణం- వీటికి **"తీక్కుఱళై"** అని పేరు. తనవద్ద చెడ్డగుణాలు నిండుగా ఉన్నా, తనను మహాగుణశాలిగా పొగడుకొని పల్కడం, ఇతరువద్ద పలు సద్గుణాలు ఉన్నా, వాటిని విడచిపెట్టి, వారిలో ఉండే ఏవో కొన్ని చిన్న దోషాలను విస్తరించి పల్కడం, గుణాలను దోషాలుగా చేసి పల్కడం, సత్యం, భూతహితం కాని మాటలను పల్కడం, ప్రాప్తవిషయాన్ని స్తుతించడంకోసం ఉండే జిహ్వతో అప్రాప్తవిషయాలను స్తుతించడం, నిష్కారణంగా పెద్దలను నిందించడం -మొదలైన చెడ్డ కార్యాలను విడచిపెట్టాలి- అని ఇక్కడ శిక్షింపబడింది.

(ఐయముమ్ పిచ్చైయుమ్ ఆన్దనైయుమ్ కైకాట్టి) - నమ్మాఴ్వార్ల తిరువాయ్మొఴిలో **"ఞానక్కై తా కాలక్కఴివు శెయ్యేలే"** (జ్ఞానహస్తాన్ని అనుగ్రహించు. ఇక ఆలస్యం చేయకు.) అని పల్కడంవల్ల జ్ఞానోపదేశాన్ని చేయడమే- **"కైకాట్టుకై"**. **"ఐయమ్"** అంటే -సందేహం. సందేహం ఉన్నంతవరకు (అది తీరేటట్లు) జ్ఞానోపదేశాన్ని చేస్తారు, కొందఱు. **"పిచ్చై"** అంటే - నోఱు తెఱచి అడగడం. శిష్యులు నోఱు తెరచి అడిగితే విషయాలను తెలుపుతారు, కొందఱు. ఈవిధంగా **"ఐయమ్ ఆన్దనైయుమ్ కాట్టుకై, పిచ్చై ఆన్దనైయుమ్ కాట్టుకై"**- అని రెండు

విధాలు. (శిష్యుల సందేహాలను తీరేవరకు బోధించడం, శిష్యుల ప్రార్థనపై వారికి విషయాలను బోధించడం) శిష్యుల సందేహాలను తామే తెలిసికొని వాటిని పరిహరించే ఆచార్యులున్నారు. శిష్యులు, తమకు గల సందేహాలను తామే నోరు తెఱచి అడిగిన తరువాత వాటిని తీర్చే ఆచార్యులున్నారు. ఈ రెండు వర్గాలవారు ఇక్కడ తెలుపబడ్డారు. అటువంటి ఆచార్యులు-

(కైకాట్టి ఉయ్యుమాఱు) -జ్ఞానోపదేశాన్ని చేసి, ఉజ్జీవింపజేసే రీతిని.

(ఎణ్ణి ఉకన్దు) - చింతించి, ఆనందించడం శిష్యకృత్యం- అని భావం. **"ఉయ్‌విక్కుమాఱు"** (ఉజ్జీవింపజేసే క్రమం) అనే అర్థంలో **"ఉయ్యుమాఱు"** (ఉజ్జీవించే క్రమం) అనే ప్రయోగం ప్రేరణార్థంలోని స్వార్థప్రయోగం.

(ఉయ్యుమ్ ఆఱు ఎణ్ణి) - **"ఆఱు"** అనే పదం **"ఆఱు"** అనే సంఖ్యను తెల్పుతున్నదని గ్రహించి, భగవద్రామానుజులకు తిరుక్కచ్చినంబి వరదరాజస్వామి వద్ద తెలిసికొని, ప్రకటించిన ఆఱు వార్తలను మనం స్మరించి, ఉజ్జీవించడం సూచింపబడింది- అని చెప్పవచ్చు. ఈ విధంగా అర్థాన్ని సూచించే సందర్భాలలో ముద్రాలంకారం భావించదగినది. **"సూచ్యార్థసూచనం ముద్రా ప్రకృతార్థపరైః పదైః"** (ప్రకృతార్థాన్ని తెలిపే పదాలను సూచ్యార్థాన్ని సూచించడం ముద్రాలంకారం.) అనేది ఆ అలంకారంయొక్క లక్షణం. తిరుక్కచ్చినంబి ఆఱు వార్తలు ఏవి? అంటే (1) శ్రీమన్నారాయణుడే పరతత్త్వం, (2) జీవాత్మ పరమాత్మల భేదం, (3) ప్రపత్తియే మోక్షోపాయం. (4) పెరియనంబిని ఆశ్రయించాలి, (5)దేహావసానంలో మోక్షం, (6) అంతిమస్మృతి ఆవశ్యకం కాదు- అనేవి. వాటిని తెలిపే ప్రాచీన శ్లోకం ఈవిధంగా ఉన్నది- **"అహమేవ పరం తత్త్వం దర్శనం భేద ఏవ చ, మోక్షోపాయః ప్రపత్తిః స్యాత్ పూర్ణాచార్యసమాశ్రయః, దేహావసానే ముక్తిః స్యాదంతిమస్మృతివర్జనమ్"** (నేనే పరతత్త్వాన్ని, భేదమే దర్శనం, ప్రపత్తి మోక్షోపాయం, పూర్ణాచార్యులను ఆశ్రయించాలి, శరీరావసానంలో ముక్తి కల్గుతుంది. చరమదశలో స్మృతి ఆవశ్యకం కాదు.)

3. ఓఙ్గి ఉలకళన్ద ఉత్తమన్ పేర్ పాడి
నాఙ్గళ్ నమ్పావైక్కు చ్చాత్ర్రి నీరాడినాల్
తీఙ్గిన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారి పెయ్దు
ఓఙ్గు పెరుమ్ శెన్నెల్ ఊడు కయల్ ఉకళ

పూఙ్గువళై ప్పోదిల్ పొఱి వణ్డు కణ్ పడుప్ప
తేఙ్గాదే పుక్కిరున్దు శీర్‌త్త ములై పఱ్ఱి
వాఙ్గ క్కుడమ్ నిఱైక్కుమ్ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్
నీఙ్గాద శెల్వమ్ నిఱైన్దు ఏలోర్ ఎమ్బావాయ్.

మొదటి పాశురంలో "ఆచార్యగుణానుభవానికి వచ్చేవారంతా రండి" అని పిలచి, వారు శాస్త్రవశ్యులుగా ఉండడం వారికి ముఖ్యమైన యోగ్యత - అని రెండవపాశురంలో తెలిపి, ఇక ఈ పాశురంలో, ఆచార్యకులంలో మనం అవగాహించగల్గితే, ప్రపన్న సంతానంలో ముముక్షువులకు అందఱికి గొప్ప శ్రేయస్సు కల్గుతుంది- అని తెలుపబడుతున్నది.

(ఓఙ్గి ఉలకళన్ద ఉత్తమన్) - ఉత్తముడంటే ఆచార్యశ్రేష్ఠుడని భావం. ఏవిధంగా? అంటే, **"ఓఙ్గి"**- భగవానుని కంటే ఉన్నతుడై, **"ఉలకళన్ద"** లోకాలను అన్నిటిని స్వాధీనం చేసికొన్న, **"ఉత్తమన్"** గొప్పవాడు- అని ప్రతిపదార్థం. ఆచార్యుడు భగవానునికంటే గొప్పవాడు- అనేది ఇరామానుశనూఱ్ఱన్దాదిలోని పలు పాశురాలలో తెలుపబడింది. వాటిలో, **"మణ్మిశైయోనికళ్ తోఱుమ్ పిఱన్దు"** (భూమిలో అన్ని జాతులలో పుట్టి) (41) అనే పాశురం తిలకమై భాసిస్తున్నది. భగవానుడు పలు పలు జాతులలో పలు రీతులలోని జన్మలు జన్మించి, నేత్రగోచరుడై, ఉపదేశాదులతో స్వస్వరూపాన్ని తెలియజేసినప్పటికీ, ఎవరూ అతని లెక్కపెట్టలేదు. **"అవజానంతి మాం మూఢాః"** (గీత-9-11) (మూఢులు నన్ను అవమానం చేస్తున్నారు) అని తానే పల్కి కన్నీరు విడచిపెట్టవలసి వచ్చింది. అందువల్ల భగవానుని అవతారాలు ఫలించలేదు. ఆచార్యసార్వభౌముల అవతారం అయితే, మిక్కిలి ఫలవంతం అయినది. ఆచార్యుడు భగవానునివలె "నన్ను నమస్కరించు, నన్నే సేవించు" అని తన గొప్పతనాన్నిగూర్చి పలుకకుండా, **"తిరునారణన్‌తాళ్ కాలమ్పెఱ చ్చిన్దిత్తుయ్‌మినో"** (శ్రీమన్నారాయణుని చరణాలను సర్వకాలం ధ్యానించి ఉజ్జీవించండి.) అని, **"అఃతే ఉయ్య ప్పుకుమాఱు"** (అదే ఉజ్జీవించే ఉపాయం) అని అతని (భగవానుని) గొప్పతనాన్నిగూర్చి పల్కి, అతని శ్రీచరణాలనే రక్షకంగా చూపించినందువల్ల, ఆచార్యుని ఉపదేశం త్వరగా, ఋజువుగా ఫలించింది. అందువల్ల, భగవానునికంటే ఆచార్యుడు ఉత్తముడు. భగవానుడు రామకృష్ణాదిరూపాలలో అవతరించిన కాలాలలో వశిష్ఠ-సాందీపని ప్రభృతులను తనకు ఆచార్యునిగా వరించినందువల్ల కూడా ఆచార్యుడు భగవానుని

కంటే ఉత్తముడు. గీతాచార్యుడు **"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా, ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః" (4-34)** (నమస్కారం వల్ల, ప్రశ్నించడం వల్ల, సేవవల్ల, తత్త్వాన్ని దర్శించిన జ్ఞానులు ఉపదేశిస్తారని తెలిసికో) అని స్వయంగా ఆచార్యుని గొప్పతనాన్ని గొప్పగా పల్కినందువల్లకూడా ఆచార్యుడే ఉన్నతుడు. అంతేకాక, **"నమంతి సంతః త్రైలోక్యాదపి లబ్ధుం సమున్నతిమ్"** (సత్పురుషులు, ముల్లోకాలకంటే ఔన్నత్యాన్ని పొందడం కోసం నమస్కరిస్తారు.) అనే రీతిలో వంగి, వంగి ఉన్నతులై ఉంటారు, ఆచార్యులు.

(ఉలకళన్ద) - భగవానుడు తన గొప్పతనాన్ని మఱచిపోయి, వామనరూపాన్ని పరిగ్రహించి, ఒక అసురునివద్దకు వచ్చి, మూడడుగుల నేలను యాచించినట్లే, ఆచార్యుడు తన గొప్పతనాన్ని అంతటినీ లేకుండా చేసికొని, మనుష్య సజాతీయుడై, మనుష్యులవలె అన్నపానాదులనే ధారకంగా కల్గినవానివలె ప్రవర్తించి, చిన్నవాడై, ఆసురప్రకృతిని కలవారైన సంసారులవద్దకు వచ్చి, "రహస్యత్రయాన్ని వినండి, తత్త్వత్రయాన్ని వినండి, షట్కత్రయాన్ని వినండి, తత్త్వహితపురుషార్థాలను వినండి'', అని ఈ రీతిలో మూడింటినిగూర్చియే అర్థించేవాడై ఉంటాడు. "భగవానుడు పొందేవాడు- ఆచార్యుడు ఇచ్చేవాడు''- అనేదే ఇక్కడ తారతమ్యం. ఇంతేకాక, త్రివిక్రముడు **"కుణ్డై కొణ్డు నాన్ముకన్ కుణ్డికైనీర్ పెయ్దు మఱైకొణ్డ మన్దిరత్తాల్ వాఴ్త్తి, క్కఱైకొణ్డ కణ్డత్తాన్ శెన్నిమేల్ ఏఱ క్కుఴువినాన్, అణ్డత్తాన్ శేవడియై యాణ్డు"** (నైచ్యానుసంధానం చేస్తూ చతుర్ముఖుడు కమండలులోని తీర్థాన్ని పోసి, పురుష సూక్తాది వేదమంత్రాలతో మంగళాశాసనం చేసి శివుని తలపై పడేటట్లుగా ఆ సర్వేశ్వరుని శ్రీచరణాలను అభిషేకించాడు) అని, **"కజ్ఞై పోదర క్కాల్ నిమిర్త్తరుళియ కణ్ణన్"** (గంగానది ప్రవహించేటట్లు శ్రీచరణాలను చాచిన సర్వేశ్వరుడు) అని పలికిన రీతిలో శ్రీపాదతీర్థాన్ని అనుగ్రహించి లోకాన్ని, ఉజ్జీవింప జేసినట్లుగా, ఆచార్యుడుకూడా **"తతః స్వచరణాంభోజస్పర్శసంపన్నసౌరభైః, పావనైరర్థినస్తీర్థైః భావయంతం భజామి తమ్"** (తరువాత, తన శ్రీచరణ పద్మాల స్పర్శవల్ల పరిమళాన్ని పొందిన, పవిత్రాలైన శ్రీపాదతీర్థాలతో నన్ను సంభావించే వారిని) అని అంటూ శ్రీవరవరముని దినచర్యలో పల్కిన రీతిలో శ్రీపాదతీర్థాన్ని అనుగ్రహించి, శిష్యోజ్జీవనాన్ని కల్గిస్తారు.

(ఉత్తమన్) - కర్మకాండమైన వేదభాగాన్ని బోధించే, మధ్యమాచార్యుడు కాకుండా, శృంగారరసప్రధానమైన కావ్యనాటకాదులను బోధించే అధమగురువు కాకుండా, **"పులైయఱ మాకినిన్ఱ పుత్తొడు శమణమెల్లామ్ కలైయఱ క్కఱ్ఱ**

మాన్దర్ కాణ్బరో కేట్పరోదాన్" (వేదబాహ్యాలైన, అనాది అయిన బౌద్ధమతంతో పాటు జైనమతాన్ని, ఇంకా ఇతర మతాలను- వైదిక మతాన్ని చక్కగా అభ్యసించిన వారు కంటితో చూస్తారా? వింటారా?) అని తిరుమాలైలో చాలా తక్కువదిగా నిందింపబడ్డ జైన బౌద్ధాది గ్రంథాలను బోధించి అధమాధమగురువు కాకుండా, అధ్యాత్మసంప్రదాయ శాస్త్రాలను బోధించి ఉత్తమగురుస్థానాన్ని పొందేవారు. అనువృత్తి నిర్బంధాల కారణంగా క్లేశపెట్టి ఉపదేశించే మధ్యమగురువు కాకుండా, ఎంతగా అనువర్తించినా ఏమీ ఉపదేశించని అధమగురువు కాకుండా, స్వయంగానో, అనువృత్తి ప్రపన్నులుగానో ఉపదేశించేటపుడు ఉత్తమగతికి తగిన అర్థాలను ఉపదేశించకుండా, విప్రలిప్స మొదలైన కారణాలవల్ల అధోగతికి కారణమవుతున్న అర్థాలను పల్కి చెడగొట్టే అధమాధమగురువు కాకుండా, శిష్యుల అనర్థాలను చూచి, వారి అనువృత్తి మొదలైన నిర్బంధాలు లేకుండా, **"పయనన్ఱాకిలుమ్ పాఙ్గల్లరాకిలుమ్ శెయల్ నన్ఱాక తిరుత్తి ప్పణికొళ్వాన్"** (ఏ ప్రయోజనం లేకపోయినా, ఏమంచి లేకపోయినా నన్ను చక్కగా సంస్కరించి నా నుండి కైంకర్యం గ్రహించడం కోసం) అనే రీతిలో తమ పరమకృపకారణంగానే సాత్త్వికాలైన మహార్థాలను ఉపదేశించి, ఉత్తమాచార్యస్థానాన్ని వహించేవారు - అని కూడా చెప్పవచ్చు. జ్ఞానం లేకుండా అనుష్ఠానాన్ని మాత్రమే కల మధ్యమ గురువుకాకుండా, అనుష్ఠానం కొంచెంకూడా లేకుండా, జ్ఞానంమాత్రం కల అధమగురువు కాకుండా, జ్ఞానం, అనుష్ఠానం రెండూ లేని అధమాధమ గురువు కాకుండా, జ్ఞానం, అనుష్ఠానం- అనే ఈ రెండిటిని కలవారైన ఉత్తమగురువు- అనికూడా భావం.

(ఉత్తమన్ పేర్ పాడి) - ఇటువంటి ఉత్తమాచార్యుల తిరునామసంకీర్తనమే కాలక్షేపంగా కల్గి ఉండి- అని భావం. ముముక్షువులకు గురుపరంపరానుసంధానమే కదా ముఖ్యకర్తవ్యం. **"గురోర్నామ సదా జపేత్"** (గురునామాన్ని సదా జపించాలి) అని చెప్పబడుతున్నది కదా! ఆళవందార్, కూరేశులు, భట్టర్- మొదలైన ఆచార్యులు భగవానుని స్తుతించాలని ప్రయత్నించినా, ఆచార్యులనే కదా మునుముందు ఉపశ్లోకించారు. దివ్యప్రబంధాలను అనుసంధించాలని ఆరంభించే టపుడుకూడా ఆచార్యుల తనియన్‌లే కదా ముందుగా మనం అనుసంధిస్తున్నాము.

(నాఙ్గళ్ నమ్ పావైక్కు చ్చాఱ్ఱి నీరాడినాల్)

(నాఙ్గళ్) - భగవద్వైభవంకంటే గొప్పదైన భాగవతవైభవాన్ని చక్కగా గ్రహించి, ఆ భాగవతులనే రక్షకంగా కల్గి ఉండే మనం - అని భావం.

(నమ్ పావైక్కు చ్చాఱ్ఱి) - పావై అంటే- వ్రతం. ఇటువంటి అధికారుల వ్రతం ఏది? అని అంటే- శత్రుఘ్నాళ్వాన్, మధురకవులు, తిరువరఙ్గత్తముదనార్ వంటివారు స్వీకరించిన వ్రతమే. శ్రీరామభక్తులలో గొప్పవాడైన భరతాళ్వాన్‌ను తప్ప ఇంకొకరిని శత్రుఘ్నాళ్వాన్ తెలియడు. నమ్మాళ్వార్లను తప్ప ఇంకొక దైవాన్ని మధురకవులు తెలియరు. భగవద్రామానుజులను, కూరేశులను తప్ప ఇంకొకరిని తెలియరు- తిరువరంగత్తముదనార్. ఇటువంటి విలక్షణమైన వ్రతమే **"నమ్‌పావై"**అనే పదం ద్వారా ఉద్దేశింపబడుతున్నది. ఈ వ్రతానికి అంగంగా - **(నీరాడినాల్)** మంచి రేవులో అవగాహిస్తే- అని అర్థం. **"కాలై నన్‌ఞానత్తుఱై పడిన్దాడి"** (33) (ప్రాతఃకాలంలో సాత్త్వికమైన జ్ఞానఘట్టంలో అవగాహించి) అనే తిరువిరుత్త పాశురానుగుణంగా, సత్త్వోత్తరమైన కాలంలో సాత్త్విక జ్ఞానరాశులై ఉండే తీర్థాలలో (భాగవతులలో) అవగాహించగల్గితే-

(తీఙ్గిన్ఱి నాడెల్లామ్ ఇత్యాది) - ఇక్కడినుండి ఆఱు పాదాలలో (పాశురం మొత్తం) దేశానికి కలిగే గొప్పతనం వివరంగా చెప్పబడుతున్నది. దేశక్షేమానికి ఆవశ్యకాలైన సమృద్ధులు అన్యాపదేశార్థంలో గమనించవచ్చు. ఆత్మక్షేమానికి కావలసిన సమృద్ధిని స్వాపదేశార్థంలో గమనించాలి. దానిని క్రమంగా వివరిస్తాను.

(నాడెల్లామ్ తీఙ్గు ఇన్ఱి) - **"అతివృష్టిరనావృష్టిః"** అని ఈ రీతిలో ప్రారంభించి **"షడేతా ఈతయః స్మృతాః"** అని ఆఱు బాధలు ఈతి బాధలని,అవి దేహక్షేమానికి విరోధులని శాస్త్రాలలో చెప్పబడ్డాయి. ఈ రీతిలోనే ఆత్మక్షేమ విరోధులుకూడా ఆఱు ఉన్నాయి. అవి భట్టర్ అనుగ్రహించిన అష్టశ్లోకిలో- **"దేహాసక్తాత్మబుద్ధిర్యది భవతి"** (4) (దేహాత్మభ్రాంతిని కల్గి ఉంటే) ఇత్యాది శ్లోకంలో పరిహారక్రమ పూర్వకంగా చూపబడ్డాయి. 1. దేహమే ఆత్మ; అని భ్రమించడం, 2.దేహంకంటే ఆత్మవిలక్షణమైనదని గ్రహించినా, ఆ ఆత్మను స్వతంత్రంగా భ్రమించడం, 3.భగవానునకు శేషమై ఉండడమే ఆత్మస్వరూపమని తెలిసినా, అతనికివలెనే ఇతరులకుకూడా ఆత్మ శేషమని భ్రమించడం, 4. తనను రక్షించుకోవడంకోసం తానే ప్రయత్నించడంలో తనకు బాధ్యత ఉన్నదని భ్రమించడం, 5. **"కొణ్డ పెణ్డిర్ మక్కళుఱ్ఱార్ శుఱ్ఱత్తవర్ పిఱర్"** (కాంతలు, సంతానం, బంధువులు, ఇతరులు) అనే ఆభాసబంధువుల విషయంలో వ్యామోహాన్ని కల్గి ఉండడం. 6.భగవదనుభవంలో తనను భోక్తగా భ్రమించడం- అని ఈ రీతిలో ఉండే ఆఱు బాధలు **"కాలైనన్ ఞానత్తుఱై పడిన్దు"** (సాత్త్విక కాలంలో జ్ఞానఘట్టంలో ప్రవేశించి) అవగాహించేవారికి కల్గుతాయికదా. ఆ బాధలు అన్నీ క్రమంగా తొలగిపోతాయి.

"యత్రాష్టాక్షరసంసిద్ధో మహాభాగో మహీయతే, న తత్ర సంచరిష్యంతి వ్యాధిదుర్భిక్ష తస్కరాః" (ఎక్కడ అష్టాక్షరి మహామంత్రంలో సిద్ధిని పొందిన మహాత్ముడు ప్రకాశిస్తున్నాడో, అక్కడ వ్యాధి, దుర్భిక్షం, తస్కరులు సంచరించరు.) అనే శ్లోకంలో పల్కిన రీతిలో బాధలు నశించిపోతాయి - అని కూడా చెప్పవచ్చు. **"కొన్ఱు యిరుణ్ణుమ్ విశాతి పకై పశి తీయన వెల్లామ్ నిన్ఱివ్వులకమ్ కడివాన్ నేమిప్పిరాన్ తమర్ పోన్దార్"** (జీవులను చంపి తినే విజాతులు, పగ, ఆకలి మొదలైన చెడ్డలను అంతటినీ ఈలోకంలో లేకుండా చేయడం కోసం శ్రీసుదర్శనధారి భక్తులు వచ్చారు.) అనే తిరువాయ్‌మొళ్ళి పాశురంలో కూడా ఇది పొసగుతుంది.

(తిఙ్గళ్ ముమ్మారి పెయ్‌దు) - **"వేద మోదియ వేదియర్క్కోర్ మళ్ళై, నీది నన్నెఱి యన్నవర్క్కోర్ మళ్ళై, మాదర్ మఱ్ఱైయర్ కఱ్పినుక్కోర్ మళ్ళై, మాద మూన్ఱు మళ్ళైయెన ప్పెయ్యుమే"** (వేదాన్ని అభ్యసించే వైదికుల కోసం ఒక వర్షం, నీతిని అనుసరించి పాలించే ప్రభులకోసం ఒక వర్షం, ఒద్దికతనంతో వర్తించే స్త్రీలకోసం ఒక వర్షం-) అనే రీతిలో మూడు హితాలకోసం ప్రతినెల మూడు వర్షాలు కురుస్తాయి)- అని శాస్త్రవచనం. స్వాపదేశార్థంలో వర్షం కురవడం అంటే- ఆచార్యుడు శ్రీసూక్తులను వర్షించడమే. వైదికులు స్వాధ్యాయ- ప్రవచనాలను ఏకొఱత లేకుండా నిర్వహించడం, ప్రభువులు తమ ఆజ్ఞాదండాన్ని చెడకుండా చెలాయించడం, పాలన చేయడం, స్త్రీలు తమ అణకువతనం పెంపొందించు కోవడం- అనే వీటివల్ల హితాలు కల్గుతాయి- అని తెలుపబడింది; ఆచార్యుడు ఉపన్యసించే అర్థవిశేషాలలో ఇవి అన్నీ అంతర్భూతాలే కనుక. లేక, **"ముమ్మారి పెయ్‌తు"** - మూడు విధాలైన వర్షాలు-అని భావం. మొదట తిరుమంత్రాన్ని చెవిలో ఉపదేశించడం, తరువాత గ్రంథకాలక్షేపాన్ని అనుగ్రహించడం, దానికి పిమ్మట చింతనను చేయడం- అనే ఈ మూడు **"ముమ్మారి"** వర్షించడం. రహస్యత్రయం, తత్త్వత్రయం, ఆకారత్రయం, షట్కత్రయం, తత్త్వహిత పురుషార్థాలనే త్రయం, ప్రస్థానత్రయం- అనే ఈ రీతిలో తెలియదగిన విషయాలు. మూడు మూడుగా ఉన్నందున, వాటిని ఉపదేశించడాన్నిగూర్చి **"ముమ్మారి పెయ్‌తు"** అని అనబడింది- అనికూడా చెప్పవచ్చు.

(తిఙ్గళ్ ముమ్మారి) - చంద్రునివలె చాలా చల్లని అర్థాలను అనుగ్రహించడాన్ని ఈ ప్రయోగం తెల్పుతుంది. **"నవో నవో భవతి జాయమానః"** (చంద్రుడు ప్రతినెల నిత్యనూతనంగా ఉదయిస్తాడు) అనే వేదవాక్యానుసారం ప్రతినెల చంద్రుడు నవనవంగా ప్రకాశిస్తాడు కనుక, అదే రీతిలో, **"ఎప్పొళ్ళుదుమ్ నాళ్ తిఙ్గళ్ ఆణ్డూళ్ళి**

యూ౯ఱితొఱుమ్ అప్పొ౨ుదై క్కప్పొ౨ుదు ఎన్నారావముదమ్" (ఏ సమయంలో అయినా, ప్రతిదినం, ప్రతినెలా, ప్రతి సంవత్సరం, కల్పాలతరబడి-ఎప్పటికపుడు నాకు తృప్తిని కలిగించని అమృతం) అయిన అర్థవిశేషా లను వర్షించే విషయాన్ని ఇది తెల్పుతున్నది - అనికూడా చెప్పవచ్చు. సంస్కృ తవేదాంతార్థాలు, ద్రావిడ వేదాంతార్థాలు, ఇంకా, ఇతిహాస- పురాణాది ఉపబృంహణ గ్రంథాలలో ఉండే అర్థాలు- అనే ఈ రీతిలో మూడు విధాలైన అర్థాలను వర్షించడం **"ముమ్మారి పెయ్‌తు"** అని చెప్పబడిందనికూడా భావించవచ్చు.

(ఓఙ్గు పెరుమ్ శెన్నెల్ ఊడుకయలుకళ) -ఊకతో, తవుడుతో కూడిన బియ్యం "నెల్" (ధాన్యం) - అని చెప్పబడుతుంది. స్థూలదేహంతో, సూక్ష్మదేహంతో జీవాత్మను ఇది (నెల్-అనేపదం) తెల్పుతుంది. స్థూలదేహంస్థానంలో ఊక, సూక్ష్మదేహం స్థానంలో తవుడు, సారభూతమైన ఆత్మస్థానంలో బియ్యం- అని తెలియాలి. పరమపదానికి చేరగానే, **"అహ మన్న మహ మన్న మహ మన్నమ్"** (నేను భగవానునకు అన్నాన్ని, అన్నాన్ని, అన్నాన్ని) అని పలికేవాడు- ఈ ఆత్మ. ఇతడు స్థూలదేహాన్ని ఇక్కడే విడిచి, సూక్ష్మదేహాన్ని విరజానదిలో విడచిపెట్టి, అప్రాకృతదివ్యదేహంతో కూడినవాడై, భగవానునకు అన్నం (భోగ్యభూతుడు) అవుతున్నాడు. ఈ విభూతిలో ఉన్నంతవరకు ప్రాకృతదేహవిశిష్టుడుగానే ఉండడంవల్ల ఇతడు "నెల్" (ధాన్యం)గా చెప్పబడడం యుక్తం. జ్ఞానంతోను, ఇంకా పలు గుణాలలోను ఉన్నతుడై ఉండే గొప్పతనాన్ని కల్గి ఉండడాన్నిబట్టి **"ఓఙ్గు పెరుమ్ శెన్నెల్"** (ఉన్నతంగా పెరిగిన గొప్ప ధాన్యం) అని అనబడింది. **"వరమ్బుఱ్ఱ కతిర్‌శెన్నెల్ తాళ్ శాయ్‌త్తు త్తలైవణక్కుమ్ తణ్ణరఙ్గమే"** (అవధి లేకుండా పెరిగే ధ్యానపు కంకులు తలవాల్చి నమస్కరించే చల్లని శ్రీరంగం) (4-9-8) అనే పెరియాళ్వార్ తిరుమొ౨ిలోని రస్యార్థాలు ఇక్కడ గ్రహించాలి. ఎట్టని పైరు పండగానే నిటారుగా ఉండలేక, తలవాల్చేటట్లే, భాగవతులుకూడా **"నమంతి సంతః త్రైలోక్యాదపి లబ్ధుం సమున్నతిమ్"** (ముల్లోకాలకంటే ఔన్నత్యాన్ని పొందడం కోసం సత్పురుషులు వంగి నమస్కరిస్తారు.) అనే రీతిలో తలను వంచి నిలుస్తారు. **"సోఽహమ్"**అనే స్థితి తొలగి, **"దాసోఽహమ్"** అనే స్థితిని పొందుతారు. ఇదే **"ఓఙ్గు పెరుమ్"** అనే పదాల తాత్పర్యం.

(శెన్నెల్ ఊడు కయల్ ఉకళ) -**"కయల్"**- మత్స్యం. కంటిని మత్స్యంతో పోల్చడం కవిసంప్రదాయమే (సమయమే) కనుక, దేహ విశిష్టుడై ఆత్మపట్ల దృష్టిని ప్రసరింపజేయడం దీనిద్వారా తెలుపబడింది. ఇక్కడ, ఈలోకంలో ఉన్నంతవరకు

మనం దేహాన్నికూడా రక్షించుకోవాలి; ఆత్మను రక్షించుకోవాలి. దేహాన్ని రక్షించుకోవడం అంటే ఏమి ? అని అంటే, వర్ణాశ్రమాలు దేహం అవధిలో నిలిచేవి కనుక, **"వర్ణాశ్రమాచారవతా పురుషేణ పరః పుమాన్, విష్ణురారాధ్యతే పంథాః నాన్య స్తత్తోషకారకః"** (వర్ణాశ్రమాచారానుగుణంగా వర్తించే పురుషునిచే పరమపురుషుడు అయిన విష్ణువు ఆరాధింపబడుతున్నాడు. ఇంతకంటే అతనికి సంతోషాన్ని కల్గించేది ఇంకొకటి లేదు.) అనే ప్రమాణంలోని శ్రద్ధతో వర్ణాశ్రమ ధర్మానుష్ఠానాలలో ఏ లోటు లేకుండా వర్తించడమే. ఆత్మను రక్షించడం అంటే - శేషత్వ, పారతంత్ర్యాలు వర్ధిల్లేటట్లు వర్తించడం. **"తిఙ్గళ్ ముమ్మారు"** వర్షించినందు వల్ల కలిగే ఫలం కదా ఇది.

(పూఙ్కువళై ప్పోదిల్ పొరు వణ్డు కణ్ పడుప్ప) - పురుషుల నేత్రాలను తామరలుగా, స్త్రీల నేత్రాలను కలువ పూలుగా వర్ణిస్తారు. స్త్రీలను తామరలవంటి కన్నులను కలవారుగా వర్ణించడం కూడా కొన్నిచోట్ల కన్పిస్తున్నా, స్త్రీలను కలువల వంటి నేత్రాలను కలవారని వర్ణించడమే ప్రచురంగా ఉండే అలవాటు; సంప్రదాయం. అందువల్ల, ఇక్కడ **"పూమ్‌కువళైప్పోదు"** అని లక్ష్మీకటాక్షం సూచింప బడింది. **"శ్రేయో న హ్యరవిందలోచనమనఃకాంతా ప్రసాదాదృతే సంసృత్యక్షర వైష్ణవాధ్వసు నృణాం సంభావ్యతే కర్హిచిత్"** (లక్ష్మీదేవి అనుగ్రహం కంటే ఇంకొక శ్రేయస్సు ఈలోకంలో, కైవల్యంలో, పరమపదంలోను లేదు) అనే ఆళవందార్ సూక్తికూడా ఇక్కడ అనుసంధేయం. **"పొఱి వణ్డు"**, **"పొరు వణ్డు"** అనేవి పాఠభేదాలు. క్రమంగా- అందమైన తుమ్మెద -అని, స్పర్ధించే తుమ్మెద- అని అర్థం. **"ఉళఙ్కనిన్దిరుక్కు మడియవర్ తఙ్గళుళ్ళత్తుళూఱియ తేన్"** (మనస్సులోపల పండిన దాసుల హృదయాలలో ఊటిన తేనె) అని తిరుమఙ్గైయాళ్వార్ అనుగ్రహించిన రీతిలో తేనెవలె మధురస్వరూపుడైన భగవానుని అనుభవించి ఆనందించే భాగవతులే ఇక్కడ తుమ్మెదలు. **"పొరువణ్డు"** అనే పాఠంలో ఈ తుమ్మెదలు స్పర్ధించడం అంటే ఏమి? అని అంటే, **"పిణఙ్గి యమరర్ పిదఱ్ఱుమ్ కుణమ్"** (నిత్యసూరులు పరస్పరం స్పర్ధించి, పలవరించే భగవానుని కల్యాణ గుణాలు) అని నమ్మాళ్వార్లు అనుగ్రహించిన రీతిలో, ఒక కల్యాణ గుణంయొక్క ఔన్నత్యాన్నిగూర్చి ఒకరు పల్కగా, దానిని కాదంటూ ఇంకొకరు ఇంకొక భగవానుని కల్యాణగుణాన్ని ఉన్నతంగా పలుకగా - ఈవిధంగా వివాదం వృద్ధి చెందడమే. భగవద్భక్తులకు ఇటువంటి వాద-వివాద కేళికూడా ఒక విధమైన వైలక్షణ్యాన్ని కల్గిస్తుంది కదా! **"పిణఙ్గి యమరర్ పిదఱ్ఱుమ్"** (నిత్యసూరులు స్పర్ధిస్తూ కల్యాణగుణాలను అనుసంధించే) అనే పాశురంలో పరమపదంలోకూడా ఈ

రీతిలో వివాదం ఉన్నట్లుగాకదా నమ్మాళ్వార్లు అనుగ్రహించారు. శ్రీదేశికులుకూడా గోదాస్తుతిలో **"వాచాలయంతి వసుధే! రసికా స్త్రిలోకీమ్ న్యూనాధికత్వసమతా విషయైః వివాదైః"** (గోదాదేవీ! మీదివ్యదంపతులు ఇద్దఱియొక్క గుణాలలోని హెచ్చు తగ్గుల వివాదాలతో రసికులు ముల్లోకాలను ప్రతిధ్వనింపజేస్తున్నారు.) అని అన్నారు.

(కణ్ పడుప్ప)-"కణ్‌పడుత్తల్" అంటే - నిద్రించడం. నిర్విచారంగా శయనించడం. పురుషకారభూతుడైన లక్ష్మీదేవియొక్క కటాక్షాన్ని పొంది నిర్విచారంగా గుండెలపై చేయి పెట్టుకొని నిద్రించే రీతి దీనిద్వారా తెలుపబడింది. **"కణ్‌పడుత్తల్"** అంటే- నిద్ర. ఇది నిర్విచారంగా ఉండేవానికేకదా కల్గుతుంది.

ఇక, **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్ నీఙ్గాద శెల్వమ్ నిఱైన్దు"** అనే ప్రయోగం వివరింపబడుతున్నది. ప్రత్యుపకారాన్ని ఆశించకుండా మహార్థాలను అనుగ్రహించడం వల్ల మహోదారులై ఉండేవారు **"వళ్ళల్"** అని అనబడతారు. **"గవా మంగేషు తిష్ఠంతి భువనాని చతుర్దశ"** (గోవు అంగాలలో పదునాల్గు లోకాలు ఉన్నాయి) అనే రీతిలో పదునాల్గు లోకాలను తమలో కల్గి ఉండే పశువులవలె పదునాల్గు విద్యలను తమలో ధరించి ఉండేవారై, పంచగవ్యం వంటి అర్థపంచకంతో సకలాత్మలను పునీతులను చేసేవారైన మహాచార్యులు ఇక్కడ వివక్షితులు. వీరిచే **"నీఙ్గాద శెల్వమ్ నిఱైన్దు"** అంటే - అధ్యాత్మవిద్య, దాని ఫలమైన భక్తి ఏనాడూ లోటు లేకుండా ఇంకా ఇంకా పెరిగి వృద్ధి చెందుతుంది- అని భావం. **"నిఱైన్దు"** అనే పదం **"నిఱైన్దిడుమ్"** (నిండుతుంది) అనే అర్థాన్ని ఇస్తుంది. లోకంలో సంపద అని భావింపబడేది కొన్ని ఉపాధి విశేషాలవల్ల నశిస్తుంది. ఇక్కడ తెలుపబడ్డ సంపదయే ఏనాటికి తొలగిపోని నిత్యసంపద.

ఈ **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్"** (ఉదారమైన గొప్ప పశువులు) ఎటువంటివి? అని అంటే, **"తేఙ్గాతే పుక్కిరున్దు శీర్‌త్త ములై పఱ్ఱి వాఙ్గ కుడల్ నిఱైక్కుమ్"** - (సంశయించకుండా ప్రవేశించి పొదుగును పితుకగా కుండలను పాలతో నిండించే) పశువులు. **"తేఙ్గుతల్", "తయఙ్గుదల్", "తియఙ్గుతల్"** - అనేవి పర్యాయపదాలు ఆచార్యుని తిరుమాళిగలో సందేహించకుండా ప్రవేశించాలి. సంవత్సరాల తరబడి వాసం చేయడంలోను **"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా"** (నమస్కారం చేత, ప్రశ్నించడంచేత, సేవచేత జ్ఞానులు ఉపదేశిస్తారని తెలిసికో) అని గీతాచార్యుడు విధించిన నియమాలను నెఱవేర్చడంలోను జంకకుండా గురుకులవాసాన్ని చేయాలి.

(శీర్‌త్త ములై పఱ్ఱి వాఙ్గ)- గోవులు నాల్గు స్తనాలద్వారా పాలను స్రవిస్తాయి. అదే రీతిలో ఆచార్యులు కూడా నాల్గు హేతువులవల్ల గొప్ప అర్థాలను వెలువరిస్తారు. (1) భగవానుడు వీరిని ఈ లోకానికి పంపడం శిష్యోజ్జీవనార్థమే కనుక, భగవదాజ్ఞా పరిపాలనమనే భావన. (2) శిష్యులు శ్రమించి వేడడం, (3) వారు ప్రార్థించక పోయినా, వారి దుర్గతిని చూచి సహించలేకపోవడం, (4) తాము నోఱుతెరచి వాటిని తెలుపకపోతే తాము నిలువలేకపోవడం. ఈ విధంగా నాల్గు హేతువుల ద్వారా ప్రవచనాన్ని చేయవలసినవారు కనుక, ఇవి (ఈ హేతువులు) "శీర్‌త్త ములై" అనబడుతున్నవి.

(పఱ్ఱి వాఙ్గ కుడల్ నిఱైక్కుమ్)- అర్జునుడు **"శిష్యస్తేఽహం శాధి మాం త్వాం ప్రపన్నమ్"** (నేను నీ శిష్యుడను. ప్రపన్నుడనైన నన్ను శాసించు) అని ఒక మాటను పల్కి ప్రార్థించగానే అధ్యాయాల తరబడి ఉపదేశించిన గీతాచార్యునివలె- **"నారదం పరిపప్రచ్ఛ వాల్మీకిర్మునిపుంగవమ్"** (మునిపుంగవుడైన నారదుని వాల్మీకి ప్రశ్నించాడు.) అనే విధంగా వాల్మీకిమహర్షి అడుగగానే శ్రీరామాయణామృతాన్ని స్రవించిన నారదమహర్షివలె, **"మైత్రేయః పరిపప్రచ్ఛ ప్రణిపత్యాభివాద్య చ"** (పరాశరుని మైత్రేయుడు నమస్కరించి, అభివాదం చేసి ప్రశ్నించాడు.) అనే రీతిలో మైత్రేయుడు ప్రశ్నించగానే **"చిదచిదీశ్వర తత్స్వభావభోగాపవర్గ తదుపాయగతీః"** (చిత్తు, అచిత్తు, ఈశ్వరులనే తత్త్వాలను, భోగ-అపవర్గాలను, వాటి ఉపాయాలను స్వరూపాన్ని)లను ఉపదేశించిన (స్రవించిన) పరాశరమహర్షివలె, ''హితాన్ని అనుగ్రహించాలి'' అని ప్రార్థించగానే, **"కడల్ వాయ్‌చ్చెన్ఱు మేకమ్ కవిఴ్‌న్దిఱఙ్గి క్కదువాయ్ పడ నీర్ ముకన్దేతి యెఙ్గుమ్ పడనిన్ఱు మఴై పొழியుమ్"** (సముద్రం లోకి పోయి మేఘం, పూర్ణంగా నీటిని తాగి, పైకి వచ్చి అంతట వ్యాపించి వర్షిస్తుంది) అనే రీతిలో ధారలు ధారలుగా వర్షించి కుండలు కుండలుగా నిండిస్తారు, మహాచార్యులు. **"కుడమ్"** - అంటే పాత్రమనే అర్థాన్ని గ్రహించి, ఆచార్య దయాపాత్రభూతులైన సచ్ఛిష్యులు దీనిచే తెలుపబడుతున్నారని చెప్పవచ్చు. వీరిని నిండించడమంటే - తమతో సమానమైన జ్ఞానపూర్తిని కలవారినిగా చేయడమే. ఈ విధంగా చేయగల్గిన **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్"** (మహాచార్యుల) చేత తొలగిపోని సంపద నిండుతుంది - అని తాత్పర్యం.

4. ఆఴి మఴైక్కణ్ణా! ఒన్ఱు నీ కైకరవేల్
ఆఴియుళ్ పుక్కు ముకన్దు కొడు ఆర్‌త్తేఱి

ఊఴిముదల్వన్ ఉరువమ్పోల్ మెయ్ కఱుత్తు
ప్పాఴియమ్ తోళుడై ప్పఱ్పనాబన్ కైయిల్
ఆఴిపోల్ మిన్ని వలమ్బురిపోల్ నిన్ఱదిర్న్దు
తాఴాదే శార్ఙ్గమ్ ఉదైత్త శరమఴైపోల్
వాఴ ఉలకినిల్ పెయ్దిడాయ్ నాఙ్గళుమ్
మార్గఴి నీరాడ మకిఴ్న్దు ఏలోర్ ఎమ్బావాయ్

మార్గఴి నీరాట్టవ్రతాన్ని నోచాలని ప్రయత్నించిన గోపికలు వర్షదేవతను ఉద్దేశించి వర్షాన్ని కురవమని ఆజ్ఞాపిస్తున్నట్లుగా రచింపబడింది- ఈ పాశురం. ఇది పైపైన గమనిస్తే కన్పించే అర్థం. ఎందుకు? అంటే, మొదటి పాశురంలో **"నీరాడ ప్పోదువీర్ పోదుమినో నేరిழైయీర్ !"** (అందమైన ఆభరణాన్ని కలవారలారా! స్నానం చేయగోరినవారు రండి) అని ఆహ్వానించినవారికి ఉద్దేశ్యం వాస్తవంగా స్నానమాడడంకోసంగా పోవడమే అయితే, వీరందఱు కలిసి ఒక చెఱువు తీరానికి వెళ్ళాలి. కాని ఆరీతిలో వెళ్ళినట్లుగా కన్పించదు. **"శిఱ్ఱమ్ శిఱుకాలే వన్దున్నై చ్చేవిత్తు ఉన్ పోఱ్ఱామరైయడియే పోఱ్ఱుమ్ పొరుళ్ కేళాయ్"** (అత్యంత ప్రాతః కాలంలో వచ్చి నిన్ను సేవించి, నీ బంగారువంటి స్పృహణీయ శ్రీచరణాలను కీర్తించడంలోని ప్రయోజనాన్ని విను.) అని నేరుగా భగవానుని వద్దకు పోయి చేరి, అంతరంగకైంకర్యాన్ని పరిగ్రహించమని ప్రార్థించినట్లుగాకదా కన్పిస్తున్నది. అందువల్ల ఇక్కడ వర్షదేవతను ఉద్దేశించి **"నాఙ్గళుమ్ మార్గఴి నీరాడ ఉలకినిల్ పెయ్దిడాయ్"** (మేము కూడా మార్గశీర్షస్నానం చేసేటట్లుగా వర్షించు) అని అనడం ఇంకొక స్వాపదేశార్థాన్ని కల్గినదిగా ఉండి ఉండాలి - అనేది స్పష్టం. చేతనుని భగవానుని వద్దకు కొనిపోయి చేర్చే ఆచార్యుడు పలు పలు హేతువులవల్ల మేఘమని చెప్పదగినవాడు కనుక, ఆచార్యుడే ఇక్కడ మేఘంగా మఱుగుపరచి చెప్పబడినట్లుగా గ్రహించాలి. ఆచార్యహృదయంలో (3-6) **"పూణ్డ నాళ్ శీర్క్కడలై యుట్కొణ్డు"** అని ప్రారంభమవుతున్న చూర్ణికలో **"పరసమృద్ధియే పేఱాక అన్బుకూరు మడియవర్ ఉఱ్ఱైయిలిడాదవర్ .... మేకమెన్నుమ్"** (ఇతరుల సమృద్ధినే ప్రయోజనంగా కల్గిన, గొప్ప ప్రేమను కల ముదలాఴ్వార్లు, తిరుమఙ్గైయాఴ్వార్, శ్రీరామానుజులు, భక్తిసారముని మొదలైనవారు మేఘమని) అని అంటూ, ముదలాఴ్వార్, తిరుమఴిశైయాఴ్వార్లు, తిరుమఙ్గైమన్నన్, భగవద్రామానుజులు వంటివారు మేఘంగా చెప్పబడుతున్నారు- అని పల్కడం గమనించాలి.

ఆచార్యులకు మేఘానికి పలు రీతులలో సామ్యమున్నది. పది రీతులలో ఆ సామ్యాన్ని ఇక్కడ నిరూపిస్తాము.

1. మేఘం, లవణసముద్రంలో ఉండే క్షీరజలాన్ని తాను తాగి, దానిని చాలా మధురంగా చేసి వర్షిస్తున్నది. అదే రీతిలో, ఆచార్యులు కూడా నాల్గు వేదాలలో ఉండేవి, మందబుద్ధులకు దురవగాహంగా ఉండేవి, అభోగ్యాలు అయిన అర్థాలను తమ వాగ్వైభవంతో పరమభోగ్యాలుగా చేసి ఉపకరిస్తారు.

2. మేఘం, **"ఉయిరళిప్పాన్ మాకఙ్గళెల్లామ్ తిరిన్దు"** (లోకాన్ని రక్షించడంకోసం విశాలమైన ఆకాశాన్ని అంతటా తిరిగి) (తిరువిరుత్త-32) అని పల్కినట్లుగా, లోకరక్షణార్థంగా వర్షించవలసిన చోట్లకు పోయి వర్షించేటట్లుగానే, ఆచార్యులు కూడా **"ఎణ్దిశైయుమ్ పేర్త్తకర నాన్గుడైయాన్ పేరోది ప్పేదైకాళ్! తీర్త్తకరరామిన్ తిరిన్దు"** (ఎనిమిది దిక్కులలోను చతుర్భుజుని నామాలను పల్కి, సంచరించి, ఓ అజ్ఞులారా! ఈ భూమిని పవిత్రం చేసేవారు కండి)అనే పూదత్తాఴ్వార్ల నియమనాను సారంగా **"శ్రీరంగం కరిశైలమంజనగిరిం తార్క్ష్యాద్రిసింహాచలౌ శ్రీకూర్మం ఓ పేదలారా పురుషోత్తమం చ బదరీనారాయణం నైమిశమ్, శ్రీమద్వారవతీ ప్రయాగ మధురా యోధ్యా గయాపుష్కరం సాలగ్రామగిరిం నిషేవ్య రమతే రామానుజోఽ యం మునిః"** (శ్రీరంగం, కంచి, తిరుమల, యాదవాద్రి, సింహాచలం, శ్రీకూర్మం, పురుషోత్తమం, బదరి, నైమిశారణ్యం, ద్వారక, ప్రయాగ, మధుర, అయోధ్య, గయ, పుష్కరం, సాలగ్రామం- అనే ఈ దివ్యదేశాలను సేవించిన ఈ రామానుజముని ఆనందిస్తున్నారు.) అనే రీతిలో సకలదివ్యదేశాలలోను, సకలక్షేత్రాల లోను వేంచేసి ఉండి, ఆత్మోజ్జీవనార్థంగా అర్థవిశేషాలను వర్షిస్తారు.

3. మేఘం, వర్షాన్ని కురిసి, పల్లంగా ఉండే ప్రదేశాలను నిండించేటట్లే, ఆచార్యుడు కూడా సదుపదేశ వృష్టులను వర్షించి, జ్ఞానంలో తక్కువవారిని ఉన్నతులుగా చేస్తారు.

4. మేఘం సదా వర్షించదు. కాలవిశేషాలలోనే వర్షిస్తుంది. ఈ విధంగానే, ఆచార్యులు కూడా కొన్ని సమయవిశేషాలను లక్ష్యంగా చేసికొని సదుపదేశ వృష్టులను కురిపిస్తారు.

5. మేఘం తగిన సమయాలలో కురవకపోతే లోకంలో పలు విధాలైన పీడలు కల్గుతాయి. అదే విధంగా ఆచార్యులు సమయాలలో సదుపదేశాలను చేయకపోతే, దేహాత్మభ్రమ, - స్వాతంత్రభ్రమః - అన్యశేషత్వభ్రమ - స్వరక్షణంలో తనకు అన్వయ

యోగ్యత ఉన్నదనే భ్రమ, బాంధవాభాసలోలత్వం, విషయప్రావణ్యం మొదలైన పలు పీడలు ఏర్పడతాయి.

6. మేఘం ఎంతగా వర్షించినా తృప్తిని పొందదు. ప్రత్యుపకారాన్ని ఆశించదు. అదే రీతిలో ఆచార్యులుకూడా ప్రత్యుపకృతిని దేనినీ కోరకుండా ఎంత ఉపదేశించినా తృప్తిని పొందకుండా ఇంకా ఇంకా ఉపదేశిస్తూనే ఉంటారు.

7. మేఘం కొన్ని కాలాలలో కొన్ని నీటిబిందువులను మాత్రం కురిసి విరమిస్తుంది. ఇంకొకసారి, **“చాలు చాలు”** అనే రీతిలో అపరిమితంగా వర్షిస్తుంది. ఇదేవిధంగా ఆచార్యులు కూడా కొన్ని సమయాలలో మంత్రోపదేశమని శిష్యుల చెవులలో కొన్ని అక్షరాలనుమాత్రం పల్కి ఊరకుంటారు. ఇంకొకసారి (కాలక్షేపగ్రంథ ప్రవచనాన్ని చేసేటపుడు) శ్రుతిస్మృతీతిహాస పురాణోభయవేదాంత రహస్యసారార్థాలను అపరిమితంగా వర్షించి, “ఇదేమి మహావృష్టి!” అని విస్మయపరుస్తారు.

8. మేఘం వీథులలో వర్షించి, జలాన్ని నిష్ఫలం చేస్తుంది. ముత్యపు చిప్పలలో వర్షించి ముత్యాలను సృష్టించి రత్నభూషణాలకు ఉపకరిస్తుంది. అదే రీతిలో ఆచార్యులచే కూడా కొందఱు వ్యక్తులకు ఉపదేశింపబడే అర్థాలు వినేవారి అనవధానంవల్ల, విస్మృతివల్ల అప్రయోజనాలు అవుతున్నాయి. కొందఱు మేధావుల విషయంలో అయితే విశేషమైన పుష్టిని పొంది, శ్రీవచనభూషణం, ఉపదేశరత్తిన మాలై - అనే పేర్లతో ఆత్మాలంకార హేతువులవుతున్నాయి.

9. మేఘం కురిసిన నీరు నదులలో, చెఱువులలో, బావులలో చేరి సర్వోపజీవ్య మవుతున్నది. మఱికొన్ని చోట్లలో చేరి ఎవరికి ఉపయోపడనిదిగా అవుతున్నది. అదేవిధంగా ఆచార్యులు సత్పాత్రుల విషయంలో వర్షించే అర్థవిశేషాలు ఆచార్యపరంపరగా గ్రహించి అనుభవించదగినవి గాను, అపాత్రుల విషయంలో ఉపదేశించిన విషయాలు బాగా కాచిన ఇనుముపై పడిన నీరువలె అసత్కల్పాలు గాను అవుతున్నాయి.

10. మేఘం, **“ఎత్తనైయుమ్ వాన్ మఱన్ద కాలత్తుమ్ పైఙ్కూళ్కళ్, మైత్తెళున్ద మాముకిలే పార్త్తిరుక్కుమ్”** (ఎంతకాలం వర్షం కురవకపోయినా, సస్యాలు నల్లని వర్షించే మేఘంకోసమే ఎదురుచూస్తాయి.) (పెరుమాళ్ తిరుమొళి) అనే రీతిలో పైరు, చాతకపక్షి మొదలైన అనన్యగతులైనవారిచే ఎదురుచూడబడి, వాటికి ఉపకారకంగాను, **“నీర్ కాలత్తు ఎరుక్కిలమ్ పళవిలైపోల్ వీళ్వేనై”** (వర్షాకాలం లోని అలర్క (జిల్లేడు) పత్రాలవలె పతనం చెందేదానసై) (నాచ్చియార్ తిరుమొళి)-

అనే రీతిలో (అలర్కవృక్షాలు) జిల్లేడు చెట్లపై కురిసి, నష్టాన్ని కల్గించేదిగాను అవుతున్నది. అదే రీతిలో ఆచార్యదివ్యసూక్తి అనన్యగతికులచే కుతూహలంతో ఎదురుచూడబడి ఉపయోగింపబడదగినది అవుతుంది. ఇతరులవద్ద విషయంలో, **“శారువాక మద నీఱు శెయ్తు శమణచ్చెడి క్కనల్ కొళుత్తియే శాక్కియ క్కలై వఴ్ఴువిత్తు మికు శాఙ్కియక్కిరి ముఱిత్తిడ”** (చార్వాకమతాన్ని భస్మం చేసి, జైనమతానికి నిప్పుపెట్టావు. శాక్యమతాన్ని ఎండగట్టి, సాంఖ్యమతాన్ని భగ్నం చేశావు.) (ఆర్తిప్రబంధం) అనే రీతిలో అనర్థహేతువులై పర్యవసిస్తాయి. ఈ విధంగా ఇంకా పలు రీతులలోని సామ్యాలు గమనించదగినవి.

పూర్వాచార్యులు అనుగ్రహించిన ఒక అద్భుతమైన శ్లోకరత్నం ఇక్కడ అనుసంధేయం. అది ఏమి? అంటే - **“లక్ష్మీనాథాఖ్యసింధౌ శఠరిపుజలదః ప్రాప్య కారుణ్యనీరం నాథాద్రా వభ్యషించత్ తదను రఘువరాంభోజ చక్షుర్ఝరాభ్యామ్, గత్వా తాం యామునాఖ్యాం సరిత మథ యతీంద్రాఖ్యపద్మాకరేంద్రం సంపూర్య ప్రాణిసస్యే ప్రవహతి సతతం దేశికేంద్రభ్రమోఘైః”** అనేది. దీని అర్థం ఏమంటే- నమ్మాళ్వార్లు అనే కాలమేఘం శ్రియఃపతి అనే సముద్రంలో ప్రవేశించి, కరుణ అనే నీటిని తాగి, శ్రీమన్నాథమునులు అనే పర్వతశిఖరంపై వర్షించగా, ఆ వర్షం ఉయ్యక్కొణ్డార్, మణక్కాల్‌నమ్బి- అనే రెండు ప్రవాహాలద్వారా ప్రవహించి, ఆళవందార్ అనే నదిలోకి చేరి, అక్కడనుండి ప్రవహించి భగవద్రామానుజులు అనే తటాకంలో నిండి, అక్కడ తేట పడిన ఆ తీర్థం డెబ్బైనాల్గు పంట కాలువల ద్వారా ప్రవహించి, పలు ఊళ్ళలోని క్షేత్రాలలోకి ప్రవహించినట్లుగా, డెబ్బైనాల్గు మంది సింహాసనాధిపతులద్వారా సంసారిచేతనులవద్దకు నిరంతరం ప్రవహిస్తున్నది - అని. **“ఆళిమళైక్కణ్ణా!”** అనే ఈ పాశురం ద్వారా భగవద్రామానుజులను సంబోధించి- “దేవరవారు ఉభయవేదాంతప్రవర్తకాచార్య లనే బిరుదు వర్ధిల్లేటట్లుగా ఉభయవేదాంతార్థాలను సర్వలోకోజ్జీవనం కలిగేటట్లుగా వర్షించాలి- అని ప్రార్థించడం గాని, నియమించడం గాని చేయబడుతున్నదని గ్రహించాలి. దీనికి తగిన వివరణాన్ని గమనించండి.

(ఆళిమళైక్కణ్ణా !) దీనికి పలు రీతులలో అర్థాన్ని చెప్పవచ్చు. **“కణ్ణా!”** అంటే నిర్వాహకుడా !” అని అర్థం. ఆచార్యుడు ఒకవిధమైన వర్షానికి నిర్వాహకుడు. **“త్వదీక్షణసుధాసింధువీచివిక్షేపశీకరైః, కారుణ్యమారుతానీతైః శీతలైరభిషించ మామ్”** (చల్లనివి, కరుణ అనే వాయువుచే తీసికొని రాబడినవి అయిన నీ కటాక్షాలు అనే అమృతసముద్రంలోని కెరటాల విక్షేపాలనుండి పుట్టిన తుంపు

రులతో నన్ను అభిషేకించు) అని తిరుక్కచ్చినంబి, **"హస్తీశ! దృష్ట్యమృతవృష్టిభి రాభజేథాః"** (ఓ వరదరాజ స్వామీ! నీ కటాక్షాలు అనే అమృతవర్షాలతో నన్ను అనుగ్రహించు) అనే కూరేశులు అనుగ్రహించిన భగవత్కటాక్షమనే అమృతవృష్టికి ఆచార్యుడేకదా నిర్వాహకుడు. "భగవానుని దివ్యకటాక్షామృతధారను వర్షింపజేసే భగవద్రామానుజా!"- అని తాత్పర్యం. వర్షాన్ని నేత్రంలో కలవాడా! - అనే అర్థాన్ని కూడా గ్రహించవచ్చు. **"ఆహ్లాద శీతనేత్రాంబుః"** (ఆనందంవల్ల చల్లని కన్నీటిని కలవాడు) అని, **"వణ్పొన్ని ప్పేరాఱుపోల్ వరుమ్ కణ్ణనీర్ కొణ్డు అరజ్గన్ కోయిల్ తిరుము*ఱ్ఱ*మ్ శేఱు శెయ్ తొణ్డర్"** (గొప్పదైన కావేరీ నదీ ప్రవాహంవలె వచ్చే ఆనంద బాష్పాలతో శ్రీరంగనాథుని కోవెల ముంగిలిని బురదగాచేసే భక్తులు) అని పలికే రీతిలో భగవద్గుణ చేష్టితాలను భావించి, కన్నీరు మున్నీరుగా స్రవింపజేసే వారా!'' అని భావం.

"ఆ*ళ్రి*మ*ళ్రై*క్కు అణ్ణా !" అని విభాగించి అర్థాన్ని చెప్పవచ్చు. **"పెరుమ్బూదూర్ మామునిక్కు ప్పిన్నానాళ్"** (శ్రీపెరుంబూదూర్‌లోని మునికి చెల్లెలు) అయిన ఆణ్డాళ్ తన అన్నగారిని **"అణ్ణా !"** అని సంబోధించడం యుక్తమేకదా! **"ఆ*ళ్రి*మ*ళ్రై*క్కు స్వామియానవరే !"** అనే అర్థం దీనివల్ల స్ఫురిస్తుంది.

(నీ ఒన్ఱుమ్ కై కరవేల్) - సంసారులకు చేయూతనివ్వాలి; సర్వేశ్వరునకు చేయూతనివ్వాలి - అనే అర్థం దీనివల్ల స్పష్టపడుతున్నది. **"ఞానక్కై త్తా"** (జ్ఞానహస్తాన్ని ఇవ్వాలి) అని ఆ*ళ్వా*ర్లు అనుగ్రహించిన రీతిలో, **"మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా"** (కరుణ కారణంగా శాస్త్రమనే చేతితో సంసారంలో మునిగినవారిని ఉద్ధరిస్తున్నాడు) అని మహర్షులు వచించిన రీతిలో సంసారులకు చేయూతను ఇవ్వడం సహజం. సర్వేశ్వరునకు వీరు చేయూత నివ్వడం అంటే ఏమి? అని అంటే, దీనినిగూర్చి దేశికులు యతిరాజసప్తతిలో అనుగ్రహించారు. ఏవిధంగా? అంటే- **"కుదృష్టికుహనాముఖే నిపతతః పరబ్రహ్మణః కరగ్రహవిచక్షణో జయతి లక్ష్మణోఽయం మునిః"** (కుదృష్టుల మోసంలో పడే పరబ్రహ్మను చేయిపట్టుకొని లేవనెత్తడంలో సమర్థుడైన శ్రీరామానుజులు వర్ధిల్లుతున్నారు.) అని అన్నారు - కుదృష్టివాదులు మాయావాదకోలాహలాన్ని చేయగానే, వాటిని పరిహరించగల్గినవారు ఎవరూ లేరు కనుక, భగవానుడు అధఃపాతాళంలో పడిపోయాడట. అటువంటి భగవానుని చేయూతనిచ్చి పైకి లేవనెత్తారట- భగవద్రామానుజులు. అందువల్ల, సంసారులకు చేయూతనిచ్చినట్లే, సర్వేశ్వరునకు

కూడా చేయూతను ఇచ్చారు, శ్రీరామానుజులు - అని అనడంలో అడ్డు లేదు. దీనిని గోదాదేవి ముందుగానే తెలిసికొని పలికారు.

పైన ఉదాహరించిన యతిరాజసప్తతిశ్లోకవిషయంలోని ఒక ఐతిహ్యాన్ని వినండి. అప్పయ్యదీక్షితులనే అద్వైతవిద్వాంసుడు కాంచీపురంలో **"తుమ్పైవనమ్"** అనేచోట నివసించే సమయంలో, ఉంఛవృత్తితో జీవించే ఒకానొక శ్రీవైష్ణవుడు యతిరాజ సప్తతిని అనుసంధిస్తూ ఆ వీథిలోకి భిక్షకోసం వచ్చేవారట. ఒకనాడు ఆ వైష్ణవుడు అప్పయ్యదీక్షితుల ఇంటివాకిటిలోకి వచ్చినపుడు ఈ యతిరాజసప్తతి శ్లోకాన్ని అనుసంధించాడు. "కరగ్రహవిచక్షణో **జయతి లక్ష్మణోఽయం మునిః**" అనే ఈ శ్లోక సూక్తిని వినగానే దీక్షితులు "స్వామీ! ఇక్కడకు రండి. "కరగ్రహవిచక్షణః" అని దేశికులు పల్కి ఉండరు. అది ప్రాసకు పొసగదు. "కచగ్రహవిచక్షణః" అని వారు అనుగ్రహించి ఉండవచ్చు. ఇదే ప్రాసకు పొసగుతుంది. అర్థానికి ఒప్పుతుంది. నీటిలో మునిగినవానిని తల జుట్టులో పట్టుకొని పైకి లేవనెత్తడం అంతటా కన్పించే విషయం కనుక, "కుదృష్టికుహనాముఖే నిపతతః పరబ్రహ్మణః" అనే ప్రయోగానికి అనుగుణంగా "కచగ్రహవిచక్షణః" అని ఉండాలి. ఇకపై ఈ రీతిలోనే చెప్పండి''. అని పాఠాన్ని మార్చారట. ఉంఛవృత్తిని చేసికొనే ఆ వైష్ణవుడు విశేషజ్ఞుడు కానందు వల్ల, మహాపండితులుగా ప్రసిద్ధి చెందిన దీక్షితుల సూక్తిపట్ల గల గౌరవాతిశయం చేత, ఆ విధంగానే పాఠాన్ని మార్చి, **"కచగ్రహవిచక్షణః"** అని అనుసంధించేవారు. తరువాత దానిని కొందఱు శ్రీవైష్ణవవిద్వాంసులు విని, "ఏమి స్వామీ! ఇదేదో నూతనపాఠంగా ఉన్నదే? దీనిని ఎక్కడ విన్నారు?''- అని అడిగారు. దానికి ఆ శ్రీవైష్ణవ యాచకుడు దీక్షితుల మాటలను పల్కి, ఆయన పల్కిన పాఠం ఇది- అని అన్నారు. అపుడు ఆ శ్రీవైష్ణవవిద్వాంసులు పల్కిన సమాధానం ఏమంటే- "దీక్షితులు విద్వాంసులే కాని, రసికులు కారు. ప్రాసకు ఆశపడి అర్థస్వారస్యాన్ని చెడగొట్టకూడదు. నీటిలో మునిగినవాని జుట్టు దొరకడానికి ముందే అతని చేతులే కదా దొరుకుతాయి. నన్ను పైకి లేవనెత్తే వారెవరైనా ఉన్నారా ? అని అతడు తన రెండు చేతులను పైకి ఎత్తుతాడు. అందువల్ల అతని చేతులే సులభంగా అందుతాయి. కనుక **"కరగ్రహ"** అనే పాఠమే మిక్కిలి రసమైనది''- అని. తరువాత ఈమాటను దీక్షితులు విని, "అర్థస్వారస్యాన్ని తెలియడానికి శ్రీవైష్ణవులే పెట్టి పుట్టారు సుమా!'' అని ప్రశంసించి, **"కరగ్రహ"** అనేదే యుక్తమైన పాఠమని అంటూ తలపంకించారట. **"కైకరవేల్"** అనే ఈ సందర్భానికి ఆ శ్లోకం చాలా పొసగుతుంది. అందువల్ల "ఆచార్యా! సంసారులకు,సర్వేశ్వరునకు చేయూతనివ్వండి'' అనే అర్థంలో **"ఒన్ఱుమ్ నీ కై కరవేల్"** అని ప్రయోగింపబడింది.

(అణ్ణా! నీ ఒన్టుమ్ కై కరవేల్) - అన్నగారైన ఓ భగవద్రామానుజా ! మీకు ముందున్న ఆళవందార్ మొదలైన ఆచార్యులు పలువురు- **"ఓరాణ్ వழிయాయ్ ఉపదేశిత్తార్ మున్నోర్"** (అద్వితీయమైన మహాపథం మూలంగా పూర్వాచార్యులు ఉపదేశించారు.) అనే రీతిలో తమ ఔదార్యాన్ని మఱచిపోయారు. మీరు ఆ రీతిలో మఱచిపోకుండా, **"ఏరార్ ఎతిరాశర్ ఇన్నరుళాల్ పారులకిల్ ఆశైయుడైయోర్ క్కెల్లామ్ ఆరియర్కాళ్! కూఱు మెన్టు పేశి వరమ్బుఱుత్తార్ పిన్"** (ఔదార్యాన్ని నిండుగా కల యతిరాజులు నిర్హేతుకకృపతో - ఈలోకంలో ఆశకల్గినవారికి అందఱికి, ఓ ఆచార్యులారా! ఉపదేశించండి - అని ఆహద్దును ఛేదించారు.) అనే రీతిలోని మీ ఔదార్యాన్ని **"నాడుమ్ నకరముమ్ నన్గఱియ"** - ప్రకాశింప జేయండి- అనేది ఇక్కడ తాత్పర్యం.

(ఆழிయుళ్ పుక్కు ముకన్దుకొడు) - **"ఆழி"** అంటే సముద్రం **"నిర్మథ్య శ్రుతిసాగరాత్"** అనబడే సంస్కృతవేదసాగరం, **"నమామ్యహం ద్రావిడవేద సాగరమ్"** అనబడే ద్రావిడవేదసాగరం - అనే ఉభయవేదసాగరాలలోను అవగాహించి, వాటిలో ఉండే అర్థవిశేషాలను గ్రహించింది - అని భావం. **"ఆழிయిల్ పుక్కు"** (సముద్రంలో ప్రవేశించి) అని అనకుండా, **"ఆழி ఉళ్ పుక్కు"** (సముద్రం లోలోపల ప్రవేశించి) అని అనడంవల్ల భగవద్రామానుజులు శాస్త్రసాగరాలలో పైపైన చూడడం కాకుండా, చాలా లోతుగా దృష్టిని కలవారై, సముద్రంలోపల ప్రవేశించి మణిమాణిక్యాలను గ్రహించి వచ్చేవారివలె, గొప్ప గొప్ప అర్థాలను గ్రహించి వర్షిస్తారని స్ఫురిస్తుంది. శ్రీభాష్యారంభంలో **"పారాశర్యవచః సుధాముపనిషద్దుగ్ధాబ్ధి మధ్యోద్ధృతామ్.... భౌమాః పిబంత్వన్వహమ్"** (ఉపనిషత్తులనే సముద్రం మధ్యనుండి వెలికి తీయబడిన వ్యాససూత్రాలనే అమృతాన్ని, ఓ మానవులారా ! పానం చేయండి) అని శ్రీరామానుజులు స్వయంగా పల్కినందువల్ల **"ఆழிయుళ్ పుక్కు"** అనేదానికి ఇక్కడ వివరింపబడ్డ అర్థం వారి మనస్సులోపల ఉన్నదే -అని గ్రహించవచ్చు.

(ఆర్త్తు) - గర్జించి - అని అర్థం. సింహం గర్జించేటట్లే గర్జిస్తూకదా శ్రీరామానుజులు అర్థాలను వర్షిస్తారు.

(ఏఱి) -"భజతి యతిపతౌ భద్రవేదీం త్రివేదీమ్" - అని యతిరాజసప్తతిలో దేశికులు పల్కిన రీతిలో, దివ్యసింహాసనంపై వేంచేసి - అని అర్థం. లేక, తిరుక్కోట్టియూర్ నంబివద్ద నిధివలె పొందిన అర్థవిశేషాలను ఆ ఊరిలోని కోవెలలోని పై అంతరాళంలోకి ఎక్కి వర్షించే వృత్తాంతాన్ని ఇది సూచిస్తున్నది- అని చెప్పవచ్చు.

(ఊழிముదల్వనురువమ్పోల్ మెయ్ కరుత్తు) - దీనివల్ల శ్రీరామానుజుల అవతారరహస్యం సూచింపబడుతున్నది. శ్రీరామానుజులు తాము ఆదిశేషుల అవతారం కనుక, **"దుగ్ధోదన్వద్ధవళమధురం శుద్ధసత్త్వైకరూపం రూపం యస్య స్ఫుటయతి తరాం యః ఫణీంద్రావతారమ్"** (శ్రీవరవరమునుల పాలసముద్రంవలె తెల్లని, మధురమైన శుద్ధసాత్త్వికరూపం, వారు ఆదిశేషులు అవతారమని వ్యక్తం చేస్తున్నదో) అనే రీతిలో పాలవంటి తిరుమేనిని కలవారై ఉంటారు. ఆ విధంగా ఉన్నా, **"తేవపిరానుడై క్కరియ కోల త్తిరువురువును"** (దేవాధిదేవుని నల్లని అందమైన రూపాన్ని) తమలో నిలుపుకొన్నందువల్ల ఆ నీలమేనియొక్క ప్రతిఫలనం కారణంగా శ్రీరామానుజుల తిరుమేని కూడా **"ముడివిల్లదోరెழிల్ నీలమేని"** (అంతులేని అద్వితీయమైన కాంతిని కల నీలమేని) గానే భక్తులకు దర్శనమివ్వాలని తెలుపబడింది. భట్టర్ శ్రీరంగరాజస్తవంలో **"అపి ఫణిపతిభావాత్ శుభ్రమంతః శయాళోః మరకతసుకుమారైః రంగభర్తుర్మయూఖైః, సకలజలధిపాన శ్యామజీమూతజైత్రం పులకయతి విమానం పావనం లోచనే నః"** (ఆదిశేషుని రూపమైనందున తెల్లగా ఉన్నప్పటికీ, లోపల శయనించి ఉండే శ్రీరంగనాథుని యొక్క, మరకతమణి కాంతుల వలె సుకుమారాలైన, కాంతులతో సముద్రంలోని నీటిని అంతటిని పానం చేసినందున నల్లగా ఉండే మేఘాన్ని సైతం జయించే పావనమైన శ్రీరంగవిమానం మన కన్నులకు ఆనందంవల్ల గగుర్పాటును కల్గిస్తున్నది.) అని అనుగ్రహించారు. శ్లోకంలోని భావం ఏమంటే - ఆదిశేషుడు శ్రీరంగవిమానంగా రూపొందినందువల్ల ఆ ఆదిశేషుని వర్ణం తెల్లనిది కనుక ఈ విమానంకూడా తెల్లనిదే అయినా, లోపల శయనించి ఉండే కాలమేఘరూపుడైన శ్రీరంగనాథుని తిరుమేనిచ్ఛాయ ప్రతిఫలించినందున నల్లగా కన్పిస్తున్నది- అని భావం. అందువల్ల "మా అగ్రజా! మీరు పాలవంటి తిరుమేనితో అవతరించినా, **"మున్నీర్ ఞాలమ్ పడైత్త ఎమ్ముకిల్ వణ్ణన్"** (మున్నీటిని సృష్టించిన నా మేఘ వర్ణుడు!) అయిన **"ఊழிముదల్వన్"** (జగత్కారణ భూతుని) యొక్క రూపాన్ని లోపల నిలుపుకొని, ఆ తిరుమేని వర్ణంతో సాధర్మ్యాన్ని పొందారు'' అని భావం.

(పాழிయమ్ తోళుడై ప్పఱ్పనాబన్ కైయిల్ ఆழிపోల్ మిన్ని వలమ్బురిపోల్ నిన్టదిర్న్దు) - దీనివల్ల కూడా భగవద్రామానుజుల అవతార రహస్యమే సూచింప బడింది. ఇరామానుశనూற்றన్దాదిలో, **"అడైయార్కమలత్తలర్ మకళ్ కేళ్వన్ కైయాழி యెన్నుమ్ పడైయోడు"** (దళాలతో నిండి ఉండే కమలాన్ని నివాసంగా కల లక్ష్మికి వల్లభుడైన స్వామి చేతిలోని చక్రం అనే ఆయుధంతో) అనే పాశురంవల్ల,

యతిరాజసప్తతిలోని **"ప్రథయన్ విమతేషు తీక్ష్ణభావమ్"** (శత్రువులపట్ల తీక్ష్ణ భావాన్ని ప్రదర్శిస్తూ) అనే శ్లోకంలోని, **"వవృధే పంచభి రాయుధైర్మురారేః"** (భగవానుని పంచాయుధాలతో వర్ధిల్లాడు) అని అన్నందువల్ల శ్రీరామానుజులు పంచాయుధాల అవతార రూపులు అనే విషయం చెప్పబడింది, ఆ విషయం ఇక్కడ సూచింపబడింది. పూర్వం తెల్పిన నూర్ఱన్దాది పాశురంలో **"కైయాళి యెన్నుమ్ పడైయోడు"** అనే శ్రీసుదర్శనాన్ని ముందుగా పల్కి, **"పుడైయార్ పురి శఙ్గముమ్"** అని పాంచజన్యాన్ని చివరలో పల్కినందులకు తగినట్లుగా ఇక్కడకూడా ప్రత్యాహారన్యాయంతో **"కైయిలాళిపోల్... వలమ్బురిపోల్"** అని ముందు శ్రీసుదర్శనం, తరువాత శ్రీపాంచజన్యం ప్రస్తావింపబడినది చెప్పవచ్చు.

దీనికి ఇంకొక రీతిలోకూడా అర్థాన్ని చెప్పవచ్చు. శ్రీసుదర్శనాళ్వాన్, విరోధులుండే అన్ని చోట్లకు పోయి వ్యాపించి, **"కాశీవిప్లోషచైద్యక్షపణధరణిజ ధ్వంససూర్యాపిధాన గ్రాహద్వేధాత్వమాలిత్రుటనముఖకథాః"** (కాశీ నగరదాహం, శిశుపాలవధ, నరకాసురసంహారం, సూర్యుని ఆచ్ఛాదించడం, మొసలిని ఖండించడం, మాలి త్రుంచడం- మొదలైన గాథలను) (సుదర్శనశతకమ్) అనే శ్లోకంలోను, **"కీళులకిల్ అశురర్కళై కిళ్గ్గిరున్దు కిళరామే ఆళి విడుత్తవరుడైయ కరువళిత్త వళిప్పన్"** (పాతాళలోకంలోని అసురులు సమూలంగా నశించేటట్లుగా సుదర్శనాన్ని ప్రయోగించిన) ఇత్యాది పాశురాలలోను పల్కిన రీతిలో విరోధి నిరసనాలను చేసేటట్లే, శ్రీరామానుజులుకూడా పాషండ- చార్వాక- జైన- బౌద్ధ- మాయావాది ప్రభృతులైన బాహ్యులు, కుదృష్టులు ఉండే చోట్లకు వేంచేసి, కఠినమైన తర్కవాదాలను చేసి, జయించి వచ్చిన రీతిని తెలుపుతున్నదని చెప్పవచ్చు. **"అరుళార్ తిరుచ్చక్కరత్తాల్ అకల్ విశుమ్బుమ్ నిలనుమ్ ఇరుళార్ వినై కెడ చ్చెఙ్గోల్ నడావుదిర్"** (దయ నిండుగా ఉండే శ్రీసుదర్శనంతో విశాలమైన భూమిని, పరమపదాన్ని అజ్ఞానాన్ని కల్గించే దుష్కర్మలు నశించేటట్లుగా పాలనను సాగిస్తున్నారు) (తిరువిరుత్తమ్) - అనే రీతిలో శ్రీసుదర్శనం ఉభయవిభూతి నిర్వాహకమై ఉండేటట్లే, శ్రీరామానుజులుకూడా "ఉభయవిభూతులను తమ చేతులలో కలవారు'' అనే అర్థంలో **"ఉడైయవర్"** అనే తిరునామాన్ని పొందిన గౌరవం ఇక్కడ అనుసంధింపబడినదని చెప్పవచ్చు.

(వలమ్బురిపోల్ నిన్ఱదిర్న్దు) - భారతయుద్ధారంభంలో **"పడైపోర్ పుక్కు ముళఙ్గుమ్ అప్పాఞ్జశన్నియమ్"** (యుద్ధరంగంలోని కౌరవసేనలో ప్రవేశించి ధ్వనించే పాంచజన్యం) అనే రీతిలో శంఖం ధ్వనించగా, ఆ ధ్వనిని విన్న అందఱు

"స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్" (ఆ పాంచజన్యధ్వని కౌరవుల హృదయాలను భగ్నం చేసింది) అనే రీతిలో గుండెలు పగిలి చనిపోయినట్లుగా, శ్రీరామానుజుల కంఠధ్వని వినగానే, **"తఱ్కచ్చమణరుమ్ శాక్కియ పేయ్‌కళుమ్... శౌఱ్ఱ శోమ్బరుమ్ శూనియవాదరుమ్ నాన్మఱైయుమ్ నిఱ్క క్కురుమ్బు శెయ్ నీశరుమ్ మాణ్డనర్"** (తర్కాలను చేసే జైనులు, బౌద్ధులనే మొండిపట్టుదల గల పిశాచాలు, పాశుపతులు, శూన్యవాదులు, నాల్గు వేదాలకు అపార్థాలు పలికే మాయావాదులు నశించారు.) కనుక, ఆ గొప్పతనం తెలుపబడింది- అని చెప్పవచ్చు. లేక, **"ఉణ్బదు శొల్లిల్ ఉలకళన్దాన్ వాయముదమ్ కణ్పడై కొళ్ళిల్ కడల్‌వణ్ణన్‌కైత్తలత్తే"** (నీవు భుజించే దానిని గూర్చి పల్కితే, లోకాలను కొలిచినవాని అధరామృతాన్ని నీవు ఎక్కడ గ్రహిస్తున్నావు? అంటే ఆసముద్రవర్ణుని శ్రీహస్తం లోనే) అని అంటూ ఈ గోదాదేవియే అనుగ్రహించిన రీతిలో భగవానుని కరతలాన్ని ఒక క్షణం అయినా విడువకుండా ఉంటూ, అధరామృతాన్ని ఆస్వాదించే పాంచజన్యంవలె, **"ద్వయమర్థానుసంధానేన సహ సదైవం వక్తా శ్రీరంగే సుఖమాస్వ"** (ద్వయాన్ని అర్థానుసంధానంతో పాటు సదా ఉచ్చరిస్తూ, ఇక్కడే శ్రీరంగంలో సుఖంగా ఉండండి) అనే శ్రీరంగనాథుని అనుగ్రహాన్ని పొంది, ఆ స్వామి పరిసరంలోనే దివ్యదంపతులను విడువకుండా వేంచేసి ఉండి, దివ్యామృతాన్ని ఆస్వాదించి ఆస్వాదించి ఆనందిస్తారు- భగవద్రామానుజులు- అనే విషయం ఇక్కడ తెలుపబడింది.

(తాళాదే శార్‌ఙ్గమ్ ఉదైత్త శరమళైపోల్ పెయ్‌దిడాయ్- వాళప్పెయ్‌దిడాయ్) -అని రెండు వాక్యాలుగా అన్వయించాలి. కురిసే వర్షంవల్ల మంచి కలుగవచ్చు; చెడ్డకూడా కలుగవచ్చు. కొందఱికి మంచి కల్గుతుంది; మఱి కొందఱికి చెడ్డ కల్గుతుంది. భగవద్రామానుజుల దివ్యసూక్తివర్షంవల్ల ఉజ్జీవించేవారున్నారు; నశించిపోయేవారున్నారు. **"నారణనై క్కాట్టియ వేదమ్ కళిప్పుఱ్ఱతు తెన్‌కురుకై వళ్ళల్ వాట్టమిలా వణ్డమిళ్ మఱై వాళ్న్దదు"** (నారాయణుని పరతత్త్వమని తెలిపే వేదం గర్వాన్ని పొందింది. నమ్మాళ్వార్ల ఏ కొఱఁత లేని ఉదారమైన ద్రావిడ వేదం ఉజ్జీవించింది.) అని అముదనార్ అనుగ్రహించిన రీతిలో ఉభయ వేదాలు, వాటిలో సమర్థులైన విద్వాంసులు ఉజ్జీవించగా, **"నాట్టియ నీశచ్చమయఙ్గళ్ మాణ్డన"** (స్థాపింపబడిన నీచమతాలు నశించాయి) అనే రీతిలో **"పులయఱ మాకి నిన్ఱ పుత్తొడు శమణమెల్లామ్"** (బాహ్యాలైన బౌద్ధ, జైనాలు అన్నీ నశించాయి.) భస్మమైపోయాయి. **"శార్‌ఙ్గ ముదైత్త శరమళై"** (శార్‌ఙ్గం వర్షించిన శరవర్షం) అంటే-

అసురరాక్షసులను సమూలచ్ఛేదం చేసినట్లే, అసురులు, రాక్షసులవంటి బాహ్యకుదృష్టులను శ్రీరామానుజులు శ్రీసూక్తి వర్షం నశింపజేసింది. **"తం దృష్ట్వా శత్రుహంతారమ్"** (శత్రువులను సంహరించిన అతనిని చూచి) అని అనగానే **"మహర్షీణాం సుఖావహమ్"** (మహర్షులకు సుఖాన్ని కల్గించినవాడు) అని పల్కిన రీతిలో విరోధులు నశిస్తే సత్పురుషులు ఉజ్జీవించడం సంభవిస్తుంది కనుక, ఇక్కడకూడా ఆ రెండు చెప్పబడ్డాయి. శ్రీభాష్యప్రవచనం ద్వారా విరోధినిరసనాన్ని, భగవద్విషయప్రవచనం ద్వారా ఆశ్రితసజ్జన సముజ్జీవనాన్ని చేస్తూ వేంచేసి ఉండడం ఇక్కడ తెలుపబడింది.

(శార్ఙ్గ ముదైత్త శరమ*ళై*) - శరవర్షం శార్ఙ్గ ధనుస్సునుండి వెలువడడం సహజం. ప్రకృతంలో, ఇంతకుముందే ఉదాహరించిన **"అడైయార్కమలత్తు"** అనే పాశురోక్తక్రమంలో భగవద్రామానుజులే శార్ఙ్గ ధనుస్సుగా చెప్పబడ్డారని గ్రహించాలి. ఆ నూ*ఱ్ఱ*న్దాదిపాశురంలో **"ఒణ్ శార్ఙ్గ విల్లుమ్"** (అందమైన శార్ఙ్గ ధనుస్సు) అనే పదంతో శార్ఙ్గధనుస్సుగా చెప్పబడడాన్ని గ్రహించాలి. లేక, **"తన్ కైచ్చార్ఙ్గ మదువేపోల్ పురువ వట్ట మ*ళు*కియ"** (తన చేతిలోని శార్ఙ్గంవలె గుండ్రని కనుబొమలతో అందమైన) (నాచ్చియార్ తిరుమొ*ళి*) అని గోదాదేవి స్వయంగా పల్కినందువల్ల ఇక్కడ శార్ఙ్గమంటే కనుబొమలు- అని అర్థం. **"పురువముదైత్త శరమ*ళై*"** అంటే - భగవద్రామానుజులు తాము కూరేశులు, దాశరథి (ఆ*ళ్వా*న్, ఆణ్డాన్) మొదలైనవారిని చూచి తమ కనుబొమలను స్పందింపజేస్తే, వెంటనే వారు బాణవర్షంవంటి వాదాలను చేస్తారుకదా - ఆ వాగ్వర్షం ఇక్కడ సూచింప బడింది.

(ఉలకినిల్ వా*ళ* ప్పెయ్‌దిడాయ్) - **"ఉలకమెన్బదు ఉయర్న్దోర్‌మాట్టే"** (**"ఉలకమ్"** అనే పదం లోకంలోనివారిని ఉద్దేశిస్తుంది.) అని ద్రావిడభాషా సమయం కనుక, గొప్ప అధికారులు ఉజ్జీవించేటట్లు చేయాలి -అని భావం.

(తా*ళా*దే పెయ్‌దిడాయ్) - ఏకకాలంలో వేలాది దుర్వాదులు కూడి ఎదిరించినా ఏమాత్రం వెనుకంజవేయరు కదా, శ్రీరామానుజులు. **"కొణ్డలనైయ వణ్మై ఏరార్ కుణత్తు ఎమ్మిరామానుశన్ అవ్వొ*ళి*ల్ మఱైయిల్ శేరాదవరై చ్చిదైప్పదు అప్పోదొరు శిన్దై శెయ్‌దే"** (మేఘంవలె ఔదార్యగుణాన్ని కల శ్రీరామానుజులు ఆ వేదమార్గాన్ని అనుసరించనివారిని అప్పటికప్పుడు తాము చింతించే యుక్తులతో అవలీలగా ఖండిస్తారు.) అనే నూ*ఱ్ఱ*న్దాది పాశురం కూడా ఇక్కడ అనుసంధేయం.

(నాఙ్గళుమ్ మార్గ*ళి* నీరాడ) - తిరుప్పావైలో మార్గ*ళి*నీరాట్ట మనేదానికి గల స్వాపదేశార్థం మొదటి పాశురవ్యాఖ్యలోనే వివరింపబడింది. మార్గశీర్షావ గాహనమే మార్గ*ళి* నీరాట్టమ్. మార్గాలలో- ఉపాయాలలో శీర్షం- గొప్పది మార్గశీర్షం. అందులో అవగాహించడమే మార్గశీర్షస్నానం. ఆచార్యాభిమానమనే గొప్ప ఉపాయాన్ని మనం దృఢంగా ఆశ్రయించి, ఆనందించి ఉజ్జీవించే రీతిలో, ఓ మా అగ్రజా! అనుగ్రహించండి- అని అన్నట్లయింది.

5. మాయనై మన్ను వడమదురై మైన్దనై
తూయ పెరు నీర్ యమునై త్తుఱైవనై
ఆయర్ కులత్తినిల్ తోన్ఱు మణివిళక్కై
తాయైక్కుడల్ విళక్కమ్ శెయ్‌ద దామోదరనై
త్తూయోమాయ్ వన్దు నామ్ తూ మలర్ తూవి త్తొ*ళు*దు
వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క
పోయ పి*ళై*యుమ్ పుకుతరువాన్ నిన్ఱనవుమ్
తీయినిల్ తూశాకుమ్ శెప్పు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలో ఆచార్యుడనే కాలమేఘాన్ని సంబోధించి, ఉజ్జీవన హేతువైన సందర్భాలను వర్షించాలని ప్రార్థించబడింది. ఇది మహత్కార్యం. గొప్ప అదృష్టవంతులకే అరుదైన తపఃఫలంగా లభిస్తుంది. ఇంతకంటే గొప్ప శ్రేయస్సు ఇంకొకటి లేదు. లోకంలో సామాన్యంగా చెప్పే ఒక మాట ఉన్నది. **"శ్రేయాంసి బహు విఘ్నాని భవంతి మహతా మపి, అశ్రేయసి ప్రపన్నే తు క్వాపి యాంతి విఘాతకాః"** (మహాత్ములకు కూడా వారుచేసే మంచి కార్యాలకు పలు విఘ్నాలు కల్గుతాయి. కాని, చెడ్డ కార్యాలను చేసే వారి విషయంలో ఈ విఘ్నాలు ఎక్కడికి పోతున్నాయి?) అనేదే ఆ వచనం. మహాత్ములుకూడా గొప్ప కార్యాలలో ప్రయత్నం చేస్తే వారికి ఆటంకాలు అనేకం ఎదురు అవుతాయి - అని, చెడ్డ కార్యాలనుగూర్చి అయితే, అవి ఏ ఆటంకం లేకుండా సుఖంగా నెఱవేరుతాయి - అని దీనివల్ల తెలుపబడింది. దీనిని తెలిసిన కొందఱు "మనం మిక్కిలిగా ఆశపడుతున్నాము. అయినా, మన ప్రబలపాపాలచేత మన మనోరథం అడ్డగింపబడి భంగాన్ని పొందకుండా ఉండాలి కదా!'' అని ప్రస్తావించగా, ఆ మహాగోష్ఠిలో మహాత్ములొకరు సమాధానాన్ని ఈవిధంగా పలికారు- "మనం ప్రయత్నించే కార్యాన్ని త్రికరణశుద్ధితో ప్రయత్నిస్తే, ఆటంకాలకు మూలం అయిన మన సకలపాపాలు తీరిపోతాయి''- అని అంటూ

లోకంలో శుభకార్యాలను చేయాలని ప్రయత్నించినపుడు **"ప్రారిప్సితస్య కర్మణో నిర్విఘ్నపరిసమాప్త్యర్థ మాదౌ విష్వక్సేనపూజాం కరిష్యే"** (ప్రారంభించ గోరిన కార్యం నిర్విఘ్నంగా నెరవేరడంకోసం ఆరంభంలో విష్వక్సేనారాధనను చేస్తున్నాను.) అని సంకల్పిస్తూ విష్వక్సేనారాధనాన్ని చేయడం అలవాటు. ఆ విష్వక్సేనారాధనం ఆటంకం లేకుండా నెఱవేరడానికి వేఱొక అనుష్ఠానాన్ని చేయవలసి ఉన్నదా? అని చూస్తే, అటువంటిది ఏదీ లేదని తెలుస్తున్నది. అదే రీతిలోనే ఇక్కడకూడా గ్రహించాలి. **"తామోతరనై నామ్ తూయోమాయ్ త్తూమలర్ తూవి.. వాయినాఱ్పాడి మనత్తినాల్ శిన్దిక్క"** (దామోదరుని మనం మనస్సులో పరిశుద్ధిని కలవారమై, మంచి పూలను సమర్పించి, నోటితో కీర్తించి, మనస్సులో ధ్యానిస్తే) అంతమాత్రం లోనే భూత-భవిష్యత్ పాపాలు అన్నీ అగ్నిలో వేసిన దూదివలె అవుతాయి'' అని చెప్పబడుతున్నది. **"తామోతరనై"** అనే నామం ఏవిధంగా శ్రీకృష్ణునకు వాచకమో, ఆ విధంగానే ఆచార్యునకుకూడా వాచకం. దామాన్ని ఉదరంలో కలవాడు దామోదరుడు. **"కణ్ణినుణ్ శిఱుత్తామ్బినాల్ కట్టుణ్ణప్పణ్ణియ పెరుమాయన్"** (ముడులను కల, సన్నని, చిన్నదారంతో కట్టుబడిన గొప్ప ఆశ్చర్యచేష్టితుడు) కనుక, యశోదాదేవి కట్టిన దారాన్ని నడుములో కలవాడు- శ్రీకృష్ణుడు. ఇక, ఆచార్యుడు కూడా ఉదరంలో దామాన్ని కలవాడనే విషయాన్ని నిరూపిస్తాను. తిరుమழிశైప్పిరాన్ తిరుచ్చన్దవిరుత్తప్రబంధంలో **"ఎట్టినోడిరణ్డెనుమ్ కయిற்றினాల్ మనన్దనై క్కట్టి"** (ఎనిమిది, రెండు- అంటే- పత్తు- అంటే- భక్తి అనే దారంతో మనస్సును బంధించి) అని పలికారు. ఎనిమిదిని రెండును కలిపితే పది (పత్తు) అవుతుంది. **"పత్తు"** అంటే భక్తి. దానికి ఆశాపాశమనే పేరు కూడా ఉన్నది. భగవద్విషయంలోని ఆశాపాశమే **"పత్తు"** అని అనబడుతున్నది. అది మనవంటి వారికి ఉదరంలో గట్టిగా కట్టబడకుండా, పైపైన (కృత్రిమంగా) ఉంటుంది. ఆచార్యులకు వారి ఉదరం పరిమాణంలో ఊఱి (నిండుగా) ఉంటుంది. అందువల్ల ఆచార్యుడు **"దామోదరుడు"** అని అనడం పొసగుతుంది.

ఇక, "మాయనై" అనే పదం నుండి గల అయిదు విశేషణాలు ఆచార్యుని విషయంలో చాలా రస్యంగా పొసగుతాయి - అనే విషయం క్రమంగా నిరూపింప బడుతున్నది.

(మాయనై)- "మాయ" అంటే- ఆశ్చర్యం. ఆశ్చర్యం కల్గించేవానికి **"మాయన్"** అని పేరు. కృత్రిమం చేసేవానికి కూడా **"మాయన్"** అని పేరున్నది. కృత్రిమం చేయడానికి **"పిత్తలాటకమ్"** చేయడమని లోకం వ్యవహరిస్తున్నది. **"పిత్తలమ్"**,

"ఆడకమ్" అనే రెండు పదాలు చేరి **"పిత్తలాటకమ్"** అనే రూపాన్ని పొందుతున్నది. **"పిత్తలమ్"** అంటే- ఇత్తడి. **"ఆటకమ్"** అంటే- హాటకం. అంటే -బంగారు. ఇత్తడిని బంగారంగా చూపడమే **"పిత్తలాటకమ్"**. బంగారం కంటే ఎన్ని రెట్లో నిహీనమైన ఇత్తడిని బంగారంగా చూపడం చాలా కృత్రిమమే కాగలదు. ఇత్తడిస్థానంలో భావించదగిన అజ్ఞానిసంసారిచేతనులను ఆచార్యుడు తన ఉపదేశ- అనుష్ఠానాల ద్వారా సంస్కరించి, పరిష్కరించి వాస్తవంగానే బంగారంగా చేయడం కృత్రిమం కాదు. ఆశ్చర్యం. "ఇనుమును బంగారంగా చేసేవారు ఆచార్యులు'' అనే విషయం గ్రంథాలలోని ప్రసిద్ధమైన విషయం. **"పొయ్ న్నిన్ఱ ఞానముమ్ పొల్లా వొழுక్కుమ్ అழுక్కుడమ్బు"** (అసత్యమైన జ్ఞానం, తగని వర్తనం, మురికి శరీరం) గా ఉండే మనలను మిక్కిలి గొప్పజ్ఞానాన్ని కలవారినిగా చేయడం చాలా ఆశ్చర్యకరమైన విషయం కదా! **"ఇవై ఎమ్మిరామానుశన్ శెయ్యుమఱ్పుతమే"** (ఇవి మా శ్రీరామానుజుల చేసే అద్భుతాలు) అని నూற்றన్దాదిలో అముదనార్ పల్కిన అద్భుతాలు ఇక్కడ అనుసంధేయాలు.

(మాయనై) -**"శూట్టు నన్ మాలైకళ్ తూయన వేన్ది విణ్ణోర్కళ్ నన్నీరాట్టి అన్దూపమ్ తరా నిఱ్కవే అఙ్గు, ఓర్ మాయైయినాల్ ఈట్టియ వెణ్ణెయ్ తొడువుణ్ణప్పోన్దు"** (ఆ పరమపదంలో కూర్చిన చక్కని పరిశుద్ధమైన పూమాలికలను గ్రహించి, నిత్యసూరులు గొప్ప జలంతో అభిషేకాన్ని చేసి, మంచి ధూపాన్ని సమర్పిస్తూ ఉండగా, అద్వితీయమైన మాయతో చేర్చి పెట్టిన వెన్నను దొంగిలించి, ఆరగించి, పరమపదానికి తిరిగి వేంచేసి) (తిరువిరుత్తమ్-21) అనే పాశురంలో ఆழ்వార్లు భగవానుని విషయంలో అనుసంధించిన మాయాచేష్టితం ఆచార్యుని విషయంలోకూడా అనుసంధేయం. ఇద్దఱు పరమపదంనుండి ఇక్కడకు వచ్చి కొన్ని దినాలే ఉండి, చేసిన మాయాచేష్టితాలు కదా, ఇవి.

(మన్ను వడమదురైమైన్దనై) - **"ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవనికేతనః, నాగపర్యంకముత్సృజ్య హ్యాగతో మధురాం పురీమ్"** (క్షీరాబ్ధినివాసుడైన ఈ శ్రీమన్నారాయణుడు ఆదిశేషపర్యంకాన్ని వీడి మధురానగరానికి వచ్చాడు.) అనే రీతిలో భగవానుని పాలకడలిని వీడి తన వద్దకు వచ్చేటట్లు చేసింది- ఉత్తరమధుర. అదే రీతిలో, ఈ లీలావిభూతి, ఆచార్యులను నిత్యవిభూతిని విడచి ఇక్కడకు వచ్చేటట్లు చేసిన చోటు. **"మైన్దన్"** అనే పదానికి పలు అర్థాలున్నాయి. ఆశను కలవాడనే అర్థం ఇక్కడ గ్రాహ్యం. "సంసారులను ఉజ్జీవింపజేయడానికి తగిన చోటు ఇదేకదా.'' అని ఈ లోకానికి ఆశతో వచ్చి వర్తిస్తారు, ఆచార్యులు. ఇంతేకాక,

పరమపదనాథునిలో అనుభవించడానికి లభ్యం కాని కల్యాణగుణాలు అనేకం ఇక్కడ దివ్యదేశాలలో భోగ్యంగా అనుభవించడానికి లభిస్తున్నందువల్ల, ఇక్కడే ఉండి అనుభవించడంలోనే రాసిక్యాన్ని కలవారు- అనే అర్థంకూడా గ్రాహ్యం.

(తూయ పెరునీర్ యమునైత్తుఱైవనై) - భగవానుడు ఏ చోట ఉన్నా, ఒక నదిని ఆశ్రయించి ఉంటాడు. అక్కడ పరమపదంలో విరజానది. ఇక్కడ లీలావిభూతిలో సరయు, యమున, గంగ మొదలైన నదులు పరమభోగ్యాలుగా నిలచాయి. ఆచార్యులుకూడా ప్రాయికంగా నదీతీరాలలోనే అవతరించారు. ఈ విషయం శ్రీభాగవతంలో 11వ స్కంధం 5వ అధ్యాయంలో 38,39,40వ శ్లోకాలలో స్పష్టంగా తెలుపబడింది. **"కృతాదిషు నరా రాజన్! కలా విచ్ఛంతి సంభవమ్, కలౌ ఖలు భవిష్యంతి నారాయణపరాయణాః, క్వచిత్ క్వచిత్ మహాభాగాః ద్రమిడేషు చ భూరిశః, తామ్రపర్ణీ నదీ యత్ర కృతమాలా పయస్వినీ, కావేరీ చ మహాపుణ్యా ప్రతీచీ చ మహానదీ"** (రాజా! కృతాదియుగాలలోని నరులు కలియుగంలో జన్మలను కోరుతారు. కలియుగంలో శ్రీమన్నారాయణుని భక్తులు అక్కడక్కడ జన్మించ గలరు. ద్రావిడదేశంలో అయితే ప్రచురంగా అవతరిస్తారు. తామ్రపర్ణి నది, కృతమాల, పయస్విని, గొప్పనది అయిన కావేరినది ప్రవహించే చోట్ల ప్రచురంగా జన్మిస్తారు.) ఇత్యాది శ్లోకాలలో ఈ విషయాన్ని గమనించవచ్చు. ఈ శ్లోకాలలో సూచింపబడ్డ తామ్రపర్ణి, కృతమాల, పాలాఱు, కావేరి - అనే ఈ నదుల తీరాలలోనేకదా మన ఆచార్యసార్వభౌములు అందఱు ఇంచుమించుగా అవతరించారు. అందువల్ల, ఇక్కడ యమునను ప్రస్తావించడం అనేక నదులకు ఉపలక్షణమై, ఆచార్యుల అవతారస్థల విశేషాలను తెలిపినట్లయింది.

(ఆయర్కులత్తినిల్ తోన్ఱుమ్ అణివిళక్కై) - **"అణివిళక్కు"** అనే ఈ ప్రయోగం సూర్యుని తెల్పుతున్నది. **"తతోఽఖిలజగత్పద్మబోధాయాచ్యుత భానునా, దేవకీపూర్వసంధ్యాయా మావిర్భూతం మహాత్మనా"** (అపుడు జగత్తు అనే పద్మం వికసించడంకోసం మహాత్ముడైన అచ్యుత భగవానుడు దేవకి అనే పూర్వసంధ్యలో అవతరించాడు.) (శ్రీవిష్ణుపురాణమ్) అని శ్రీపరాశరమహర్షి పల్కిన అచ్యుతభానుడు శ్రీకృష్ణుడనే సూర్యుడు గోపాలకులంలో అవతరించిన గొప్పతనాన్ని కలవాడు. **"తస్మై నమో వకుళభూషణభాస్కరాయ"** (ఆ వకుళ భూషణులనే సూర్యునకు నమస్కారం), **"కలయామి కలిధ్వంసం కవిం లోకది వాకరమ్"** (లోకానికి సూర్యునివంటివారైన కలివైరికవిని-తిరుమంగై మన్ననను భావిస్తున్నాను) **"శ్రీమానావిరభూత్ భూమౌ రామానుజదివాకరః"** (కైంకర్యలక్ష్మిని

కల శ్రీరామానుజులనే సూర్యుడు ఉదయించాడు) అని సూర్యులుగానే చెప్పబడే మన ఆచార్యులు గోపాలకులంలో అవతరించలేదుకదా! అని కొందఱు భావించ వచ్చు. పశువులు వర్తించే కులమేకదా గొల్లకులమనబడుతుంది. **"నృపశుః"** అని భగవద్యామునులు, **"వృత్త్యా పశుః నరవపుః"** (ప్రవర్తనలో పశువు, రూపంలో మానవుడు) అని శ్రీవరవరమునులు అనుగ్రహించిన రీతిలో జ్ఞానహీనులమై, ఆచారశూన్యులమై, అందువల్లనే పశుప్రాయులమైన మనం పుట్టిన కులాలలోనే వారుకూడా అవతరించినందువల్ల, **"ఆయర్కులంలో"** (గొల్లకులంలో) అవతరించి నట్లుగా పల్కడంలో లోటు లేదు కదా! శ్రీకృష్ణుడు గొల్లకులంలో గొప్ప దీపంగా అవతరించి చేసిన కార్యాలు ఏవి ? అని అంటే, ఆ కులానికి పూర్వం లేని అతిశయం కల్గించడమే కదా ! అదే రీతిలో, మన ఆచార్యులుకూడా అజ్ఞానులు ప్రచురంగా ఉండే ఈ సంసారంలో అవతరించి, దీనిని పరమపదంకంటే గొప్పదిగా చేయడం గమనిస్తున్నాము. ఆళ్వార్లు, భగవద్రామానుజులు, శ్రీవరవరమునుల వంటి మహాచార్యులు అవతరించినందువల్లనేకదా, ఈ అజ్ఞానమయమైన భూలోకం కూడా అతిశయాన్ని పొంది వెల్గుతున్నది.

(తాయైక్కుడల్ విళక్కమ్ శెయ్ద దామోదరనై) - **"తాయ్"** (తల్లి) అంటే- గాయత్రి. **"గాయత్రీ చ్ఛందసాం మాతా"** అని వేదంలో గాయత్రి ఛందస్సులకు తల్లి అని చెప్పబడినందున, ఇక్కడ **"తాయ్"**- అంటే గాయత్రి. ఆమె కడుపును ప్రకాశింపజేయడం అంటే- గర్భమంటే మధ్యభాగం; గాయత్రిలో మధ్యభాగం **"భర్గో దేవస్య ధీమహి"** అనేది. ఇదేకదా ఇందులో ప్రాణస్థానీయమైన భాగం. దీనిని ప్రకాశింపజేయడం అంటే- బ్రహ్మవర్చస్సును పొందేటట్లు చేయడం. ఇక, తిరుమఙ్గైయాళ్వార్లు **"కులమ్ తరుమ్ శెల్వమ్ తన్దిడుమ్"** (కులాన్ని ఇస్తుంది, సంపద ఇస్తుంది.) అనే పాశురంలో **"పెఱ్ఱతాయినుమ్ ఆయిన శెయ్యుమ్"** (తల్లి చేసేవానిని అన్నిటిని చేస్తుంది) అని అనుగ్రహించినందువల్ల, అష్టాక్షరీ మహా మంత్రాన్ని తల్లిగా **(తాయ్)** గ్రహించవచ్చు. శ్రీకృష్ణునకు దేవకీదేవి ఒక తల్లి; యశోదాదేవి ఇంకొక తల్లి. దేవకీదేవికంటే యశోదాదేవి గొప్పతల్లి అని కీర్తింపబడు తున్నది. అదే రీతిలో, శ్రీవైష్ణవసంతానంలోకూడా గాయత్రికంటే అష్టాక్షరియే చాలా గొప్పదిగా కీర్తింపబడుతున్నది. ఆచార్యహృదయంలో **"ఛందసాం మాతావాలుమ్, అతుక్కు త్తాయాయ్ త్తాయినుమాయిన శెయ్యుమత్తాలుమ్ పిఱప్పిక్కుమదు ఇరువర్క్కుమ్ శ్రేష్ఠజన్మమ్"** అనే చూర్ణిక ఇక్కడ అనుసంధేయం. అష్టాక్షరీమహా మంత్రంలో మధ్యభాగం నమస్సు. దానిని ప్రకాశింపజేసేవారు, ఆచార్యులు.

స్వరూపవిరోధి, ఉపాయవిరోధి, ప్రాప్యవిరోధి -అనే మూడు విధాలైన విరోధులను తీర్చేదికదా నమస్సు. స్వరూపాంశంలోను, ఉపాయాంశంలోను, ఉపేయాంశంలోను తాము ఉజ్జ్వలులై ఉండడమేకాక, తమను ఆశ్రయించినవారిని కూడా ఉజ్జ్వలులుగా చేసేవారే - **“తాయైక్కుడల్ విళక్కమ్”** (తల్లి కడుపును ప్రకాశింప) చేసేవారని తాత్పర్యం.

దామోదరనామానికి ఇతఃపూర్వమే అర్థం తెలుపబడింది. ఇపుడు ఇంకొక అర్థాన్ని కూడా వినండి. శ్రీకృష్ణుడు దారంతో బంధింపబడడం తన ఇచ్ఛతోనే తప్ప, కర్మ కారణంగా కాదు. అంతమాత్రమే కాకుండా, ఆ దామబంధం అతనికి తేజస్కరంగాకూడా ఉన్నది. అదే రీతిలో, ఆచార్యులుకూడా ఈ భూలోకంలోని బద్ధసంసారులలో చేరినవారై, బంధానికి లోనై ఉండడం కర్మకారణంగా కాకుండా, భగవదిచ్ఛవల్లనే. అదేకదా వారికి తేజస్కరంగాకూడా అవుతున్నది. అందువల్ల, ఈ స్వభావాన్నిబట్టికూడా ఆచార్యుని దామోదరుడని అనడంలో అడ్డు లేదు. కనుక, అద్భుతకృత్యాలను చేసేవారు, క్షీరాబ్ధిమొదలైనవానిని విడచి భగవానుడు తమవద్దకు వచ్చి నివసించిన భాగ్యాన్ని పొందినవారు, తామ్రపర్ణి- కావేరి మొదలైన నదులను నిరూపకంగా కలవారు, పశుప్రాయులమైన మనలను అందఱిని ఉద్ధరించాలని అవతరించినవారు, గాయత్రిని, తిరుమంత్రాన్ని ప్రకాశింపజేసేవారు, కర్మకృత బంధంలేకుండా పరమభక్తియే మూర్తీభవించినవారైన ఆచార్యులను- అని తాత్పర్యం.

(నామ్ తూయోమాయ్ వన్దు) -ఆచార్యుని విషయంలో మనకు ఉండదగిన పవిత్రత ఏమంటే- సంసారులలో వారుకూడా ఒకరై ఉన్నప్పటికీ, నిత్యముక్తులలో ఒకరు - అని భావించడం, సర్వేశ్వరునికంటే గొప్పవారని భావించడమే. వారి వాక్కునుండి వెలువడే సామాన్యవచనాలనుకూడా వేదాలతో సమానంగా గ్రహించడంకూడా పవిత్రతయే.

(తూమలర్ తూవి త్తొழுదు) - “తూమలర్కళ్ తూయ్ త్తొழுదు” (పరిశుద్ధాలైన పుష్పాలను సమర్పించి) అనే పాఠంకూడా ఉన్నది. అష్టవిధపుష్పాలు శాస్త్రాలలో చెప్పబడ్డాయి. **“అహింసా ప్రథమం పుష్పం పుష్పమింద్రియనిగ్రహః, సర్వభూతదయా పుష్పం క్షమా పుష్పం విశేషతః, జ్ఞానం పుష్పం తపః పుష్పం ధ్యానం పుష్పం తథైవ చ, సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్”** (అహింస మొదటి పుష్పం, ఇంద్రియనిగ్రహం ఒక పుష్పం, సర్వభూతదయ ఒక పుష్పం, క్షమ విశేషమైన ఒక పుష్పం, జ్ఞానం ఒక పుష్పం, తపస్సు ఒక పుష్పం, ధ్యానం

ఒక పుష్పం, అదే రీతిలో సత్యం అనేది ఎనిమిదవ పుష్పం ఇవి అన్ని విష్ణువునకు ప్రీతిని కల్గిస్తాయి.) అనే రీతిలో అహింస, ఇంద్రియనిగ్రహం, సర్వభూతదయ, క్షమ, జ్ఞానం, తమస్సు, సత్యం, ధ్యానం - అనే ఇవి పవిత్రాలైన పుష్పాలు. వాటిని సమర్పించి, నమస్కరించడం అంటే - ఇవి అన్నీ ఆచార్యకటాక్షమూలంగా కలగాలి- అని అనుసంధించి, ఉపసత్తిని చేయడమే.

(వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క) - “పాడి శిన్దిక్క” - అని అంటేనే చాలి ఉండగా, **“వాయినాల్”** అని, **“మనత్తినాల్”** అని అనడం పునరుక్తిగా తోస్తుంది. కాని పునరుక్తి కాదు. ఆచార్యగుణాలను కీర్తించడమే జిహ్వను కల్గి ఉన్నందులకు ఫలం- అని భావిస్తూ కీర్తించాలి అని, ఆచార్యవైభవాన్ని చింతించడమే మనస్సును కల్గి ఉన్నందులకు ఫలం- అని భావిస్తూ చింతించాలి- అని దీనిద్వారా తెలుప బడింది. ఈ విధంగా పాడడం, చింతించడం చేస్తే-

(పోయ పిழைయుమ్ పుకుతరువా నిన్ఱనవుమ్ తీయినిల్ తూశాకుమ్) - ఆచార్యసమాశ్రయణం పొందడానికి ముందే సంభవించిన పాపాలు **“పోయ పిழை”** అని అనబడతాయి. ఆచార్యుని సమాశ్రయించిన తరువాత బుద్ధిపూర్వకంగా పాపాలు సంభవించే ప్రసక్తి లేదు. ప్రకృతిస్వభావంచేత, సహవాసదోషాల చేత ప్రామాదికంగా కొన్ని తప్పులు సంభవిస్తాయి. అవి **“పుకుతరువా నిన్ఱ పిழை”** అనబడతాయి. (రాబోయే పాపాలు) ఈవిధంగా, ఈ రెండు రీతులలోని అపచారాలు నిప్పులో పడిన దూదివలె రూపు మాసిపోతాయి- అని భావం.

“వేద మనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదైతమిழ் ఐయైన్దు మైన్దుమ్” (గోదాదేవి తిరుప్పావైలోని ముప్పై పాశురాలు వేదానికి అంతటికి విత్తు) అనే రీతిలో తిరుప్పావై వేదం అంతటికీ విత్తు కనుక, **“తదధిగమ ఉత్తరపూర్వాఘయో రశ్లేషవినాశౌ, తద్వ్యపదేశాత్”** (ప్రపన్నునకు పూర్వాఘం నశిస్తుంది, ప్రామాదికమైన ఉత్తరాఘం అంటదు, ఆవిధంగా వేదంలో చెప్పబడినందున) అనే బ్రహ్మసూత్రంలో వివరింపబడిన వేదాంతసారార్థం ఈ పాశురంలో చక్కగా ప్రకాశించే రీతి గమనార్హం. ఇది మా దివ్యార్థదీపికావ్యాఖ్యలో విశదంగా వివరింపబడింది.

6. పుళ్ళుమ్ శిలమ్బిన కాణ్ పుళ్ళరైయన్ కోయిలిల్
వెళ్ళై విళి శఙ్గిన్ పేరరవమ్ కేట్టిలైయో?
పిళ్ళాయ్! ఎழுన్దిరాయ్ పేయ్ములై నఞ్జుణ్డు
కళ్ళచ్చకడమ్ కలక్కழிయ కాలోచ్చి

వెళ్ళత్తరవిల్ తుయిల్ అమర్న్ద విత్తినై
ఉళ్ళత్తు క్కొణ్డు మునివర్‌కళుమ్ యోగికళుమ్
మెళ్ళ ఎ*ழு*న్దు అరి ఎన్ఱ పేరరవమ్
ఉళ్ళమ్ పుకున్దు కుళిర్న్దు ఏలోర్ ఎమ్బావాయ్

“నీళాతుంగస్తనగిరితటీసుప్త ముద్బోధ్య కృష్ణమ్” (నీళాదేవియొక్క ఉన్నతాలైన స్తనాలనే గిరులపై నిద్రించిన శ్రీకృష్ణుని ప్రబోధించి) అనే తనియన్ శ్లోకానికి తగినట్లు **“నప్పిన్నైకొఙ్గై మేల్ వైత్తు క్కిడన్ద మలర్‌మార్బన్”** (నీళాదేవి స్తనాలపై పరుండి ఉండే వికసించిన వక్షఃస్థలాన్ని కలవాడు) అయిన శ్రీకృష్ణుని మేల్కొలుపు పాడడమే ప్రధానంగా కల్గిన ఈ తిరుప్పావైలో ఈ ఆఱవ పాశురంనుండి 15వ పాశురంవరకు పది పాశురాలలో పదిమంది భాగవతులు మేల్కొలుప బడుతున్నారు. **“ఏకః స్వాదు న భుంజీత భుంజీత దశభి స్సహ”** (ఒంటరిగా మంచి వస్తువును అనుభవించరాదు. పదిమందితో కలసి భుజించాలి) అనే శాస్త్రం పరమభోగ్యమైన వస్తువును ఒంటరిగా అనుభవించరాదని, పదిమందితో కలసియే అనుభవించాలని చెప్పబడినందువల్ల, గొప్ప సమూహంగా కూడి అనుభవించాలని ఆశపడుతున్నారు. పరత్వమనే ఒక కల్యాణగుణంమాత్రం విశేషంగా ప్రకాశించే పరమపదనాథుని అనుభవించడానికి పలుకోట్లమంది గుమిగూడేటపుడు అన్ని కల్యాణగుణాలు కలిసి ప్రకాశించే ఈ చోటులో అనుభోక్తలు అంతకంటే మించి ఉండాలికదా!- అనే ఆశకూడా వీరికి ఉన్నది. మహాప్రవాహంలో దిగేవారు గుంపులు గుంపులుగా కలిసి దిగేటట్లుగా, **“ఆ*ழி*యానెన్నుమ్ ఆ*ழ*మో*ழై*యిల్”** (శ్రీసుదర్శన ధారి అనే గంభీరమైన ప్రవాహంలో) ని పెరియా*ழ்*వార్లు అనుగ్రహించిన రీతిలో అగాధప్రవాహమైన ఈ విషయంలో పలువురు కూడి ఉండడం ధైర్యానికి హేతువు అవుతుంది కదా! నమ్మా*ழ்*వార్లు తిరువాయ్‌మొ*ழి*లో **“అడియార్‌కళ్ కు*ழ*ాఙ్గళై ఉడన్‌కూడువదు ఎన్ఱుకొలో !”** (భగవద్భక్తుల సమూహంతో కలసి ఉండేది ఎపుడో కదా!) అని భాగవతగోష్ఠిలో చేరగల్గడమే పురుషార్థమని పల్కి, చివరలో **“వన్దవర్ ఎదిర్ కొళ్ళ మామునిమణ్డపత్తు, అన్దమిల్ పేరిన్బత్తు అడియరోడు ఇరున్దమై”** (భగవానుడే వచ్చి స్వాగతం పలుకగా, మహామణి మండపంలో అంతులేని ఆనందనాన్ని కల భగవద్భక్తులతో కలసి ఉండడం.) అని ఆ ప్రాప్యాన్ని పొందినట్లుగా పల్కినందువల్ల, భగవదనుభవంకంటే భాగవతగోష్ఠిలో అన్వయమే పరమ పురుషార్థంగా స్పష్టపడుతున్నందువల్ల, ఈవిధంగా పది పాశురాల గ్రథనం చాలా యుక్తం. ఇక్కడ ముఖ్యంగా భావించదగిన విషయం ఒకటి ఉన్నది. అది ఏమంటే-

విభీషణా*ழ்*వాన్ శ్రీరామునివద్దకు ఆశ్రయించాలని వచ్చినపుడు ఎటువంటి కావలి, అడ్డు లేకుండా నేరుగా శ్రీరాముని వద్దకు వచ్చి ఆశ్రయించ దగినట్లుగా ఉన్నా, ఆ రీతిలో చేయకుండా, **“వేదమ్ వల్లార్‌కళై క్కొణ్డు విణ్ణోర్ పెరుమాన్ తిరుప్పాదమ్ పణిన్దు”** (వేదంలో సమర్థులైనవారిని పురస్కరించుకొని, నిత్యసూరినాథుని శ్రీచరణాలను సేవించి) అనే శాస్త్రార్థాన్ని నెరవేర్చడం కోసం వానరవీరులను పురస్కరించుకొని ఆశ్రయించినట్లే, వీరు కూడా భాగవతోత్తములను పురస్కరించుకొని శాస్త్రార్థ పరిపాలనాన్ని చేస్తున్నారు- అనేదే ఆ విషయం.

భగవదనుభవంలోని ఆర్తి అందఱికి సమానమైనపుడు, కొందఱు లోపల పరుండి నిద్రిస్తున్నట్లు, కొందఱు బయట సంచరిస్తూ, మేల్కొలుపు పల్కుతున్నట్లు పాశురం పల్కితే, ఇది తగినదా! లోపల పరుండి నిద్రించేవారికి ఆర్తి తక్కువగా ఉన్నది అని, బయట నిలచి మేల్కొలుపు పలికేవారికి ఆర్తి అధికమని వ్యక్తమవుతున్నదికదా!- అని అంటే- సమాధానం వినండి. శ్రీకృష్ణుని కల్యాణగుణాలు, దివ్యచేష్టితాలు శ్రీరామభాణాలవలె కొందఱిని సమ్మోహనపఱుస్తాయి. కొందఱిని తొందరపడేటట్లు చేస్తాయి. లోపల పరుండి ఉండేవారు వ్యామోహాన్ని పొందినవారి గోష్ఠిలో చేరినవారు. బయట నిలచి నిద్ర లేపేవారు తత్తరపడేవారి గోష్ఠిలో చేరినవారు. అందువల్ల అందఱు భగవద్గుణానుభవంలో అభినివేశాన్ని పొందినవారే -అని అనడంలో అడ్డు లేదు.

ఈ పాశురంలో **“పిళ్ళాయ్ !”** అనే ఒక సంబోధన ఉన్నది. “చిన్నబాలికా”- అని దీని అర్థం. **“కళ్ళవి*ழ்*శోలై క్కణపురమ్ కైతొ*ழு*మ్ పిళ్ళైయై ప్పిళ్ళై ఎన్ఱెణ్ణప్పెఱువరే”** (తేనె స్రవించే తోటలను కల్గిన తిరుక్కణ్ణపురాన్ని చేతులను జోడించి నమస్కరించే బాలికను **“పిళ్ళై”** (బాలిక) అని అనడం తగునా?) (పెరియతిరుమొ*ழி*-8-2-9) అని చెప్పబడగా, **“పిళ్ళాయ్!”** అని సంబోధించ వచ్చునా! అనే సందేహం కలుగవచ్చు. **“పాండిత్యం నిర్విద్య బాల్యేన తిష్ఠాసేత్”** (పాండిత్యాన్ని పూర్ణంగా పొంది, బాలునివలె వర్తించాలి.) అనే శ్రుతిని అనుసరించి ఈ విధంగా సంబోధించబడింది. చిన్నపిల్లలకు అబద్ధం చెప్పడం తెలియదు. అందువల్లనే న్యాయస్థానాలలోకూడా చిన్నపిల్లల సాక్ష్యాన్ని మెచ్చుతున్నారు. అటువంటి గుణాధిక్యాన్ని పురస్కరించుకొని **“పిళ్ళాయ్!”** అని సంబోధించబడింది. **“పిళ్ళై”** అంటే ఇక్కడ నిర్దేశింపబడినది. మాతృస్తన్యపానాన్ని చేసే బిడ్డకాదు **“బాలానాం సుఖబోధాయ క్రియతే తర్కసంగ్రహః”** (బాలుర సుఖబోధకోసం తర్కసంగ్రహం రచింపబడుతున్నది.) అనే ప్రయోగంలోని బాలశబ్దం **“గ్రహణధారణపటుర్బాలః”** (విషయాన్ని

గ్రహించడంలో, ధరించడంలో, దానిని వృద్ధి చేయడంలో సమర్థుడు -బాలుడు అనబడుతున్నాడు.) అనే రీతిలో విశేషాలను గ్రహించడంలోను, ధరించడంలోను, ఇంకా ఇంకా వాటిని వృద్ధి చేయడంలోను సామర్థ్యాన్ని కలవారిని ఈ పదం నిర్దేశిస్తుంది కనుక, అటువంటి అధికారినే ఇక్కడ **"పిళ్ళాయ్ !"** అని సంబోధించడం జరిగింది. మన పూర్వాచార్యశిఖామణులైన నంబిళ్ళై, పెరియ వాచ్చాన్‌పిళ్ళై, వడక్కుత్తిరువీదిప్పిళ్ళై, తిరువాయ్‌మొ*ళి*ప్పిళ్ళై- అని ఈవిధంగా **"పిళ్ళై"** శబ్దంతోనే కదా ప్రకాశిస్తున్నారు.

ఈ పాశురంలో పొద్దు పొడిచిన విషయాన్ని తెలిపే మూడు గుర్తులు చెప్పబడుతున్నాయి. 1. పక్షిసమూహాల ధ్వనులు, 2. తెల్లని శంఖంయొక్క గొప్ప ధ్వని, 3. **"హరిః హరిః"** అనే కంఠధ్వని- అనేవి ఈ మూడు. వాటిలో, పక్షిసమూహాలు ధ్వనించడం చాలా సామాన్యమైనది. దీనిని మునుముందుగా ఎందుకు ప్రస్తావించడం? అని కొందఱు భావించవచ్చు. **"శేర్ప్పారై ప్పక్షికళాక్కి జ్ఞానకర్మఙ్గళై చ్చిఱకెన్ఱు గురుసబ్రహ్మచారిపుత్రశిష్యస్థానే పేశుమ్"** (చేర్చేవారిని పక్షులుగా చేసి, జన్మకర్మలను రెక్కలుగా, గురు, సబ్రహ్మచారి, పుత్ర, శిష్యులను పక్షులుగా పల్కుతారు) అని అంటున్నది ఆచార్యహృదయం. నమ్మా*ళ్వా*ర్ తమ మొదటి ప్రబంధంలో దూతలుగా పంపే తుమ్మెదలను పిలిచేటపుడు **"ఎమ్మీశర్ విణ్ణోర్ పిరానార్ మాశిన్ మలరడిక్కీ*ళ్* ఎమ్మై చ్చేర్‌విక్కుమ్ వణ్డుకళే !"** (మాకు ప్రభువు అయిన నిత్యసూరినాథుని ఏదోషంలేని పాదపద్మాలలో మమ్ములను చేర్చే తుమ్మెదలారా!) అని అన్నారు. ఇందువల్ల ఘటకకృత్యాన్ని చేసి, భగవానుని శ్రీచరణాల వద్దకు తీసికొని పోయి చేర్చే పురుషకారభూతులైన మహానుభావులే పక్షులుగా మఱుగుపరచి చెప్పబడ్డారు- అనే విషయం విశదం. దానికి తరువాతి పాశురంలో కూడా నమ్మా*ళ్వా*ర్లు **"వణ్డుకళో! వమ్మిన్ నీర్‌పూ నిలప్పూ మరత్తిలొణ్‌పూ ఉణ్డు కళిత్తు*ళ*ల్‌వీర్క్కు"** (తుమ్మెదలారా! రండి! నీటిలోని పూవు అయిన క్షీరాబ్ధినాథుడు, నేలమీద పూవు అయిన అర్చారూపం, వృక్షంపై పూవు అయిన పరమపదనాథుడు అనే - వీరిని అనుభవించి ఆనందించి తిరిగే మీకు) అని అన్నారు. జలపుష్పాలు అయిన తామర, ఎఱ్ఱకలువ మొదలైనవానిలోను, స్థలపుష్పాలైన మల్లె, మాధవి మొదలైనవానిలోను, వృక్షాలలోని పుష్పాలు పున్నాగ, పాదిరి సంపెంగ మొదలైనవానిలోను తుమ్మెదలు పరిభ్రమించడాన్నిమాత్రం తెలుపడంలో ఇక్కడ ఉద్దేశ్యం కాదు. స్థలపుష్పమైన క్షీరాబ్ధినాథుని, జలపుష్పమైన శ్రీరామకృష్ణాది విభవమూర్తులను, అర్చామూర్తులను, వృక్షాలలోని పూలు అయిన

"శేణుయర్ వానత్తిరుక్కుమ్ దేవపిరాన్" (ఉన్నతమైన పరమపదంలో ఉండే దేవదేవుడు) అయిన పరమపదనాథుని శ్రుతిస్మృతీతిహాస పురాణదివ్యప్రబంధాదుల మూలంగా అనుభవించి, ఆనందించేవారే ఇక్కడ ముఖ్యంగా తెలుపబడ్డారు. కనుక ఇటువంటి మహానుభావులే **"పుళ్ళుమ్"** అనే పదం ద్వారా వివక్షింపబడ్డారు.

ఇంతేకాక, శారీరకమీమాంసలో **"శుగస్య తదనాదర శ్రవణాత్తదాద్రవణాత్ సూచ్యతే హి" (1-3-33)** (ఈ జానశ్రుతికి ఆ హంసల అనాదరద్యోతకమైన వాక్యాలను వినడం వల్ల దుఃఖం కల్గింది. అపుడు ఆచార్యుని వేగంగా పొందడంవల్ల పూర్వం అతనికి హంసలవల్ల కల్గిన దుఃఖం సూచింపబడింది కదా !) అనే సూత్రం యొక్క భాష్యంలో ఉపనిషత్ ప్రసిద్ధమైన జానశ్రుతియొక్క ఇతిహాసం వివరింపబడింది. జానశ్రుతి అనే మహాప్రభువు గొప్ప ధార్మికాగ్రేసరుడైనా, బ్రహ్మజ్ఞానసంపదను లేనివాడై ఉండేవాడు. అతనికి బ్రహ్మజిజ్ఞాసను కల్గించడం కోసం ఇద్దఱు మహాత్ములు హంసల రూపాన్ని పొంది రాత్రివేళ ఆ ప్రభువు వద్దకు ఎగిరివస్తూ, పరస్పరం సంభాషించేటపుడు, అతనికి బ్రహ్మజ్ఞానం లేని లోటును, రైక్వుడనే మునివద్ద ఆ జ్ఞానం ఉండే ఔన్నత్యాన్ని తెలుపుతూ పోయారని, దానిని విన్న జానశ్రుతికి బ్రహ్మజ్ఞానంలో రుచి కల్గి, రైక్వుని వెదకి, అతని వద్దకు పోయి, విశేషమైన గురుదక్షిణను అతనికి సమర్పించి, అతనివద్ద బ్రహ్మజ్ఞానాన్ని పొందగలిగాడనేది ఉపనిషత్తులోని ఇతిహాసం. ఇందువల్ల బ్రహ్మజ్ఞానసంపాదనకు హంసరూపపక్షి విశేషాల ధ్వనులే కారణమైనదనే విషయం గమనించదగినది. అది ఇక్కడ స్మరింపజేయబడింది.

(పుళ్ళరైయన్ కోయిలిల్ వెళ్ళై విళి శఙ్గిన్ పేరరవమ్ కేట్టిలైయో) - "పుళ్ళరైయన్" అనే పదం పక్షిరాజును తెల్పుతుంది. అతని కోవెల అనేది వేదాన్ని తెల్పుతుంది. **"వేదాత్మా విహగేశ్వరః"** (గరుడుడు వేదస్వరూపి) అని ఆళవన్దార్‌కూడా అన్నారు. **"సుపర్ణోఽసి గరుత్మాన్ త్రివృత్తే శిరో గాయత్రం చక్షుః"** (గరుత్మంతుడా! నీవు సుపర్ణుడవు. త్రివృత్ నీ శిరస్సు, గాయత్రం నీ కన్నులు) ఇత్యాది వేదవాక్యం కూడా ఇక్కడ అనుసంధేయం. అందువల్ల **"పుళ్ళరైయన్ కోయిల్"** అయిన వేదంలోని **"వెళ్ళై విళి శఙ్గు"** అంటే -ప్రణవం. శంఖం ప్రణవాకారంగా ఉన్నందువల్ల (లేక) ప్రణవం శంఖంవలె ఉన్నందువల్ల ఇక్కడ ప్రణవాన్ని శంఖమని నిర్దేశించడంలో ఔచిత్యమున్నది. **"వెళ్ళై"** అనేది **"ఎన్నై వెళ్ళుయిరాక్కవల్ల"** (నన్ను పరిశుద్ధునిగా చేయగల్గిన) అనే రీతిలో తనవద్ద ఉండే అర్థాన్ని తెలుపడం ద్వారా సంసారులను శుద్ధస్వభావులుగా చేయగల్గినది- అనే అర్థాన్ని ఇస్తుంది. ఇటువంటి

ప్రణవంయొక్క, "అరవమ్" (ధ్వని) ఒకటి, "పేరరవమ్" ఇంకొకటి. "రవః" అనే సంస్కృతపదం "అరవ" మని మాఱుతుంది. ధ్వని- అని దీని అర్థం. ప్రణవంలో అకార- ఉకార- మకారాలు ఉన్నాయి. అకారం భగవానుని తెల్పుతుంది. మకారం జీవుని తెల్పుతుంది. ఉకారం అవధారణార్థాన్ని తెల్పుతుంది."జీవాత్మ భగవానునకు శేషభూతుడు'' అనే విషయం ఇందులో ఎక్కడ చెప్పబడింది? అని అంటే- **"ఇతిలే చతుర్థి ఏఱి క్కళ్లియుమ్"** (దీనిపై చతుర్థీవిభక్తి వచ్చి లోపిస్తుంది) అనే రీతిలో లుప్తచతుర్థిద్వారా ఈ శేషత్వం చెప్పబడినట్లు గ్రహిస్తున్నాము. భగవచ్ఛేషత్వంతో నిలువకుండా, "నిన్ తిరువెట్టెழுత్తుమ్ కఱ్ఱు నానుఱ్ఱతుమ్ ఉన్నడియార్క్కడిమై" (నీ అష్టాక్షరిని అభ్యసించి, నేను గ్రహించినది- నీ దాసులకు దాస్యం చేయడం) అనే రీతిలో భాగవతశేషత్వ పర్యంతంగా అనుసంధింప బడుతున్నది. ఈవిధంగా శంఖంయొక్క "అరవమ్"-భగవచ్ఛేషత్వం. "పేరరవమ్"- భాగవతశేషత్వం. ఈ అర్థవిశేషాలను అన్నిటిని ఆలకించవద్దా !- అని ఆహ్వానించి నట్లయింది.

ఇక, మూడవ గుర్తు "అరి ఎన్ఱ పేరరవమ్ ఉళ్ళమ్ పుకున్దు కుళిర్న్దు" ("హరి" అనే గొప్పధ్వని లోపల ప్రవేశించి చల్లగా) అనేది "హరిః హరిః" అని పలికేవారెవరు? అంటే-

(మునివర్కళుమ్ యోగికళుమ్) - కొందఱు గుణానుభవమే కాలక్షేపంగా కల్గి ఉంటారు. కొందఱు కైంకర్యాన్ని చేయడంలోనే కుతూహలాన్ని కల్గి ఉంటారు. ఈ రెండు విధాలైన అధికారులు ఇక్కడ తెలుపబడ్డారు. వారు ఎటువంటివారు? అని అంటే- "విత్తినై ఉళ్ళత్తు క్కొణ్డవర్కళ్" (జగత్కారణుని మనస్సులో నిలుపుకొన్నవారు) అని తెలుపబడుతున్నది. "విత్తు" - ముక్తి మూలమని భావం. ఆచార్యుడే ముక్తిబీజం కనుక, ఆ ఆచార్యుని నిరంతరం మనస్సులో ధ్యానించేవారని పై ప్రయోగంలోని భావం. ఆ ఆచార్యులు ఎటువంటివారు ? అంటే, **"పేయ్ములై నఞ్జుణ్డవన్, కళ్ళచ్చకడమ్ కలక్కழிయ క్కాలోచ్చినవన్, వెళ్ళత్తు అరవిల్ తుయిల్ అమర్న్దవన్"** (పిశాచిస్తన్యంలోని విషాన్ని భుజించినవాడు, మాయాశకటం సంధిబంధాలు ఊడేటట్లుగా పాదాన్ని చూచినవాడు, క్షీరాబ్ధిలోని ఆదిశేషునిపై పరుండి తూగేవాడు). ఈ మూడు విశేషణాలు క్రమంగా వివరింపబడుతున్నాయి.

శ్రీకృష్ణుడు పెరిగే చోటకు దుష్టబుద్ధి అయిన కంసునిచేత పంపబడ్డ పూతన యశోదరూపంలో వేషాన్ని ధరించి, విషాన్ని పూసిన స్తన్యాన్ని తాగడానికి ఇచ్చి, శ్రీకృష్ణుని చంపాలని ప్రయత్నించి, తానే ముగిసిపోయింది- అనేది **"పేయ్ములై**

నఞ్జుణ్డ" వృత్తాంతం. ఈ పూతనావృత్తాంతాన్ని ప్రస్తావించే శ్రీదేశికులు యాదవాభ్యుదయంలో - **"కంసప్రయుక్తా కిల కాఽపి మాయా"** (కంసునిచే నియోగింపబడిన ఒకానొక మాయ) అని అంటూ మాయాశబ్దంతో నిర్దేశించారు. **"మాయా"** అని మూలప్రకృతికి పేరు. (నిజానికి అది విషయమైనా), **"భగవత్ స్వరూపతిరోధానకరీం విపరీతజ్ఞానజననీం స్వవిషయాయాశ్చ భోగ్యబుద్ధేర్జననీం... దైవీం గుణమయీం మాయామ్"** (భగవత్స్వరూపాన్ని ఆచ్ఛాదించేది, విపరీత జ్ఞానాన్ని కల్గించేది, తన విషయంలో భోగ్యబుద్ధిని కల్గించేది.... భగవానుని యొక్క త్రిగుణాత్మకమైన మాయను) అనే శరణాగతిగద్య సూక్తి ప్రకారం, తనపట్ల భోగ్యబుద్ధిని కల్గించి, తన విషయంలో అభినివేశాన్ని కల్గించి, మనవంటివారిని నశింపజేసేటట్లే, ఆచార్యునికూడా నశింపజేయాలని చూస్తే, ఆ విధంగా వారిని నశింపజేయలేక, వారి అంతు లేని గొప్పతనంవల్ల తానే ముగిసిపోతుంది. ఈవిధంగా **"పేయ్ములై నఞ్జుణ్డవర్"** (పిశాచి స్తన్యంలోని విషాన్ని భుజించినవారు) ఆచార్యులు. శ్రీకృష్ణుడు అసురావేశాన్ని పొందిన ఒక శకటాన్ని తన శ్రీచరణస్పర్శతో భగ్నం చేసి నశింపజేశాడు- అనేది **"కళ్ళచ్చకడమ్ కలక్కழிయ క్కాలోచ్చిన"** (మాయా శకటాన్ని భగ్నం చేసిన) కథ. ఆచార్యులుకూడా తమ శ్రీచరణస్పర్శతో శకటభంగాన్ని చేస్తారు. ఏవిధంగా? అంటే, ఒకచోటినుండి ఇంకొక చోటికి తీసికొని పోయే సాధనం శకటమనబడుతుంది. ఇక్కడ నుండి మనం పరలోకానికి పోవడానికి పలు దారులున్నాయి. నరకం, స్వర్గం మొదలైన దారులలో తీసికొని పోయేది-**"కళ్ళచ్చకడమ్"**. ఆచార్యుల శ్రీచరణసంబంధంతో అది నశించిపోతుంది. అర్చిరాది మార్గమనే సన్మార్గంలో పయనించే సాధనమే గొప్పది. తగని చెడ్డదారులలో పోయే సాధనం భగ్నమైపోయింది- అని భావం. ఈ రీతిలో **"కళ్ళచ్చకడమ్ కలక్కழிయ క్కాలోచ్చినవన్"** - ఆచార్యుడు. **"వెళ్ళమ్"** -అంటే సంసారసాగరం. ఇందులో **"అరవమ్"** అంటే - **"విషయవిషధరవ్రజవ్యాకులే"** (లౌకిక విషయాలు అనే సర్పసమూహాలచేత వ్యాకులమైన) అనే కూరేశుల సూక్తి ప్రకారం విషయాంతరాలు అనేవి సర్పాలు. వానిని కన్నెత్తికూడా చూడనివారు ఆచార్యులు. ఈ సందర్భంలో **"యా నిశా సర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ, యస్యాం జాగ్రతి భూతాని సా నిశా పశ్యతో మునేః"** (సమస్త జీవులకు రాత్రి అయిన వేళలో సంయమి మెలకువతో ఉంటాడు. అన్ని భూతాలు మెలకువగా ఉండే సమయం మునికి రాత్రి) అనే గీతాశ్లోకం అనుసంధేయం. అందువల్ల, ఇటువంటి **"విత్తినై"** - మోక్షబీజభూతుడైన ఆచార్యుని, **"ఉళత్తుక్కొణ్డవర్"**- (మనస్సులో

ధ్యానించేవారు), మెల్లగా లేస్తున్నారట. ఈ ఆచార్యుల గుణగణాలలో అభినివేశాన్ని పొందినవారు. “తేవు మఱ్ఱఱియేన్” (వేఱే దైవాన్ని తెలియను) అని తలచే అధికారులు. కనుక, భగవద్విషయంలో అభినివేశాన్ని పొందడానికి రుచిని కలవారు కారు. అయినా, ఆచార్యుని మానసోల్లాసంకోసం అదికూడా మనకు అవర్జనీయమని భావించి, మెల్లగా పైకి లేస్తున్నారు- అని భావం.

(అరియెన్ఱ పేరరవమ్) - ఇక్కడ “అరి” అనే పదాన్ని “హరి” అనియేకాక, “అరి” అని కూడా గ్రహించవచ్చు. “అరి” అనేది సంస్కృతంలో శత్రువాచకం. మనకు అంతరంగశత్రువులైన అహంకార మమకారాలను పోగొట్టాలి, పోగొట్టాలి - అని పెద్దగా ఆక్రందిస్తూ ఉంటారు- అనే విషయం ఇక్కడ తెలుపబడింది. స్వరూపవిరోధి అని, ఉపాయవిరోధి అని, ప్రాప్య (ఉపేయ) విరోధి - అని విరోధులు మూడు ఉన్నవి కనుక, వాటిని తొలగించాలి-అని అంటున్నారని కూడా భావం.“నమ ఇత్యేవవాదినః” (శ్వేతద్వీపవాసులు “నమః” అనియే పల్కుతున్నారు) అని కదా సూక్తి.

7. కీశు కీశు ఎన్ఱు ఎఙ్గుమ్ ఆనైచ్చాత్తన్ కలన్దు
పేశిన పేచ్చరవమ్ కేట్టిలైయో? పేయ్ ప్పెణ్ణే!
కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప క్కై పేర్త్తు
వాశ నఱుఙ్కుఴల్ ఆయ్చ్చియర్ మత్తినాల్
ఓశై పడుత్త త్తయిరరవమ్ కేట్టిలైయో?
నాయక ప్పెణ్ పిళ్ళాయ్! నారాయణన్ మూర్త్తి
కేశవనై ప్పాడవుమ్ నీ కేట్టే కిడత్తియో?
తేశముడైయాయ్ తిఱ ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురంలో ప్రబోధింపబడే గోపికకు మూడు సంబోధనలున్నాయి. **“పేయ్ప్పెణ్ణే ! నాయకప్పెణ్ పిళ్ళాయ్ ! తేశముడైయాయ్ !”** అనే ఈమూడు సంబోధనలు ఒక దానికంటే ఇంకొకటి గొప్పవి. **“పేయ్ప్పెణ్ణే !”** అనే సంబోధన హేళన కాదు. **“అత్తా ! అరియే ! యెన్ఱు ఉన్నై యఴైక్క పిత్తా ! ఎన్ఱు పేశుకిన్ఱార్ పిఱర్ ఎన్నై”** (స్వామీ! హరీ! అని నిన్ను పిలువగా, “పిచ్చివాడా!” అని నన్ను ఇతరులు అంటున్నారు.) (పెరియ తిరు-7-1-8) అనే తిరుమఙ్గైయాఴ్వార్ పాశురక్రమంలో, “పామరులు చేయి విడిచేటట్లుగా భగవద్విషయంలో అత్యంతం అభినివేశాన్ని కల ఓ అధికారీ!”- అని గౌరవంతో పలికే తీరు ఇది. **“ఎన్నత్తన్ అచ్చన్ అరఙ్గనుక్కడియార్కళాకి అవనుక్కే పిత్తరామవర్ పిత్తరల్లర్కళ్, మఱ్ఱై**

యార్ మఱ్ఱుమ్ పిత్తరే” (నాస్వామి అయిన శ్రీరంగనాథునకు దాసులై, అతని విషయంలో వ్యామోహాన్ని కలవారు పిచ్చివారు కారు. ఆవిధంగా ఉండనివారే పిచ్చివారు.) (పెరుమాళ్ తిరు-2-9) అనే కులశేఖరాఴ్వార్ల పాశురం ప్రకృతంలో అనుసంధేయం.

(నాయక ప్పెణ్ప్పిళ్ళాయ్ !) పెద్దదైన ఒక ముక్తాహారానికి మధ్య మణివంటి ఒక ఆభరణ విశేషం (పతకంవంటిది) మిక్కిలి అందాన్ని కల్గించేటట్లే, భగవద్గోష్ఠికి అంతటికి మధ్యనాయకమణిగా ఉండి, ప్రకాశింపజేసే ఓ ఉత్తమాధికారీ!- అని దీని భావం.

(తేశముడైయాయ్ !) - **“తేజస్”** అనే సంస్కృతపదం ద్రావిడంలో **‘తేశమ్”** అనే వికృతిని పొందుతుంది. **“దేశః”** అనే సంస్కృతపదంకూడా **“తేశమ్”** అని మాఱుతుంది. “రూపమేవాస్యైతన్మహిమానం వ్యాచష్టే” (రూపమే ఇతని గొప్పతనాన్ని తెల్పుతున్నది) అనే శ్రుతిక్రమంలోను, **“అకత్తినఴకు ముకత్తిలే తెఱియుమ్”** (మనస్సులోని సౌందర్యం ముఖంలో తెలుస్తుంది.) అనే లోకోక్తిక్రమంలోను లోపల ఉండే గొప్పతనాన్ని అంతా ప్రస్ఫుటం చేస్తున్న ముఖకాంతిని కల్గిన విలక్షణాధికారీ!- అని దీని భావం. లేక, సకలదేశాలను కైవసం చేసికొన్నదానా ! అనికూడా భావం. వీరు, ఇటువంటివారు- అనే భేదం లేకుండా సకలదేశస్థులను తన గుణాలతో అభినివిష్టులను చేసిన విషయం దీని ద్వారా తెలుపబడింది.

ముందు (పూర్వ)పాశురంలో **“పుళ్ళుమ్ శిలమ్బిన”** అని పక్షిసామాన్య వాచకమైన పదం ఉన్నది. **“ఆనైచ్చాత్తమ్”** అంటే - కాటుకపిట్ట. ఈ పక్షి నేత్ర సౌందర్యాన్ని కల్గి ఉండే వారికి దృష్టాంతంగా చెప్పబడుతుంది. సంస్కృతభాషలో **“ఖంజరీటః”** అని, **“ఖంజనః”** అని వ్యవహరింపబడుతున్నది. దీనిద్వారా జ్ఞాననేత్రంలో వైలక్షణ్యాన్ని కల్గిన మహాజ్ఞాతలు తెలుపబడ్డారు. ఈ పక్షికి సంస్కృతంలో భరద్వాజపక్షి- అనే నామమున్నదని అనేవారున్నారు. భరద్వాజ మహర్షివలె సకలవేద పారంగతులు దీనిద్వారా తెలుపబడినట్లు గ్రహించవచ్చు. **“కీశు కీశు”** అని అన్నందువల్ల విలక్షణాధికారియొక్క పరమభోగ్య మైన కంఠధ్వని కూడా ఉద్దేశ్యమని సూచింపబడింది.

“ఆనైచ్చాత్తమ్ కలన్దు పేశిన పేచ్చు కేట్టిలైయో ?” (కాటుక పిట్టలు కలసి పల్కిన మాటను వినలేదా) అని అంటేనే చాలి ఉండగా, **“పేచ్చరవమ్ కేట్టిలైయో?”** (మాటలోని ధ్వనిని వినలేదా) అని అనడంలో ఒక విశేషమున్నది. **“రవః”** అనే

సంస్కృతపదమే "అరవ"మని మాఱుతుంది. దీనికి ధ్వని- అని అర్థం. మహాను భావుల శ్రీసూక్తులలో శబ్దలభ్యమైన వాచ్యార్థంలో మాత్రమే నిలువకుండా, ధ్వన్యర్థమనబడే స్వాపదేశార్థంకూడా గ్రహించదగినది- అని సూచింపబడుతున్నది. **"తిరుప్పావైలో స్వాపదేశార్థాన్ని వినకుండా కేవలం శబ్దార్థాన్ని మాత్రమేనా వినడం?"** అనే గోదాదేవి స్వయంగానే తెల్పినట్లు గ్రహించాలి. ఇందులో **"కలన్దు పేశిన పేచ్చు"** (కలసి పల్కిన మాట) అనేదానిలో పలు విశేషాలు స్ఫురిస్తాయి. పరస్పర విరోధంలేకుండా పల్కడం **"కలన్దు పేశుకై"** అనబడుతుంది. జైమినిమహర్షి వ్యాసుని శిష్యుడైనా, ఆచార్యుడైన వ్యాసుని అభిప్రాయానికి అనుగుణంగా పలుకకుండా వేఱుగా పలికాడు. ఈ విషయం **"గురుశిష్య గ్రంథవిరోధజ్గళై"** అని ప్రారంభమయే ఆచార్యహృదయచూర్ణిక యొక్క వ్యాఖ్యానంలో గమనించాలి. మన పూర్వాచార్యులు ఆ విధంగా కాకుండా, **"పేశి*గ్రగ్రే* పేశుమ్ ఏకకంఠర్‌కళ్"** (పల్కిన విషయాలనే పలికే ఏకగ్రీవులు) అనే విశేషం **"కలన్దు పేశిన పేచ్చు"** (కలసి పల్కిన మాట) అనే ప్రయోగంలో ధ్వనిస్తుంది. అంతేకాక, ఇతరులు రచించే గ్రంథాలలో శ్రుతిస్మృతీతిహాసపురాణ పంచరాత్ర దివ్యప్రబంధ పూర్వాచార్య శ్రీసూక్తులనే అన్నిటిని కలిపి ఏకకంఠంగా పల్కడం కన్పించదు. ఈ అతిశయం మన ఆచార్యులకే అసాధారణమనేది ఈడు ముప్పత్తాఱాయిరప్పడి మొదలైన వ్యాఖ్యానగ్రంథాల వల్ల, ఆచార్యహృదయం, అష్టాదశరహస్యాలు మొదలైన మూలగ్రంథాలవల్ల సువిశదమవుతున్నది. అందువల్ల **"కలన్దు పేశిన పేచ్చు"** అనేదానికి- పలు ప్రమాణాలను కలిపి పల్కిన సూక్తి -అని కూడా భావం.

(కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప)- **"కాశు"** అని, **"పిఱప్పు"** అని అంటూ ఆభరణ విశేషాలు తెలుపబడ్డాయి. గొల్లజాతికి తగిన ఆభరణాలు ఇవి. స్వాపదేశంలో శమం, దమం- అనే ముఖ్యమైన ఆత్మభూషణాలను రెండిటిని గ్రహించాలి. ఇవి **"కలకలప్ప"** అంటే- శరీరంలో స్ఫురించేటట్లుగా ఉండడం. **"కైపేర్‌త్తు"** అంటే - కేవలం ఉపదేశంతో మాత్రం ఉపచారం చేసి పోకుండా, అనంతరకాలంలో ఉండేవారుకూడా ఉజ్జీవించేటట్లుగా, మూలగ్రంథాలను, వ్యాఖ్యానగ్రంథాలను చేతులు నొప్పి పుట్టేటట్లుగాను వ్రాసిన మహోపకారకుల రీతిని స్మరింపజేస్తున్నది.

(వాశ నఱుఙ్కు*ழ*లాచ్చియర్) - గోపికలు ఏవిధంగా భగవానునకు పరమప్రీతి పాత్రులో, ఆవిధంగా ఉండే పరమభాగవతులు ఇక్కడ వివక్షితులు (తెలుపబడు తున్నారు). వీరి కేశపరిమళం అతిశయించి ఉన్నదని అనడంచేత వారి వినయ

సంపద అతిశయించి, తలవంచి నిలచిన రీతి దీనిచేత తెలుపబడింది. వీరు **"మత్తినాల్ ఓశై పడుత్త"** అంటే -**"మఱైప్పాఱ్కడలై త్తిరునావిన్ మన్దరత్తాల్ కడైన్దు"** (వేదమనే పాలసముద్రాన్ని జిహ్వ అనే మందరంతో చిలికి) అని పిళ్ళైప్పెరుమాళ్ అయ్యంగార్ పల్కిన రీతిలో జిహ్వను శ్రమ పెట్టి, పరమగంభీరమైన కంఠధ్వనిని వెలువరించడం.

(తయిరరవమ్ కేట్టిలైయో ?) - పెరుగును చిలకడం - వెన్నను తీయడం కోసమే కనుక, సారమైన అర్థాలను ఉద్ధరించి ఉపకారం చేసే రీతినిగూర్చి దీనిద్వారా తెలిపి, దీనిని చెవి ఒగ్గి విని ఆనందించవలసి ఉండగా, వినకుండా ఉండడం తగునా? అని పల్కిన రీతి ఇది.

(నారాయణన్ మూర్‌త్తి కేశవనై ప్పాడవుమ్) - శ్రీకృష్ణుడు, అశ్వరూపాన్ని ధరించి వచ్చిన కేశి అనే అసురుని వధించి, కేశవుడనే పేరును పొందినట్లుగా, ఆచార్యులు, **"ఇంద్రియాణి హయాన్యాహుః"** (ఇంద్రియాలను హయాలుగా పల్కుతారు) అనే రీతిలో అశ్వాలుగా చెప్పబడే ఇంద్రియాలను జయించి, జితేంద్రియులనే పేరును పొందినవారు. **"సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీం తనుమ్, మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా"** (దేవుడైన శ్రీమన్నారాయణుడు సాక్షాత్తుగా మానవరూపాన్ని దాల్చి సంసారంలో మునిగిన జీవులను కరుణతో శాస్త్రమనే చేతితో ఉద్ధరిస్తాడు.) అనే రీతిలో ఆ ఆచార్యులు సాక్షాత్తు నారాయణుడే కనుక, **"నారాయణన్‌మూర్‌త్తి"** అనే సూక్తి ఆచార్యపరంగా మిక్కిలి పొసగుతుంది.

(కేట్టే నీ కిడత్తియో?) - **"పురుషార్థోఽయమేవైకః యత్ కథాశ్రవణం హరేః"** (హరికథా శ్రవణం అనేది ఒక్కటే పరమపురుషార్థం) అనే శ్రవణానందాన్ని పొందడమే పరమపురుషార్థమని తెలిసినా, ఈవిధంగా ఉపేక్షించి ఉండవచ్చునా?- అని దీని ద్వారా తెలుపబడింది.

(తిఱ) - చూపులను తెఱు. నోటిని తెఱు, తలుపులను తెఱు.

8. కీ*ழ*్ వానమ్ వెళ్ళెన్ఱు ఎరుమై శిఱు వీడు
మేయ్‌వాన్ పరన్దన కాణ్ మిక్కుళ్ళ పిళ్ళైకళుమ్
పోవాన్ పోకిన్ఱారై ప్పోకామల్ కాత్తు ఉన్నై
క్కూవువాన్ వన్దు నిన్ఱోమ్ కోతుకలముడైయ

పావాయ్! ఎళున్దిరాయ్ పాడి ప్పఱై కొణ్డు
మావాయ్ పిళన్దానై మల్లరై మాట్టియ
దేవాదిదేవనై చ్చెన్ఱు నామ్ శేవిత్తాల్
ఆవా ఎన్ఱు ఆరాయ్న్దు అరుళ్ ఏలోర్ ఎమ్బావాయ్.

ఈ పాశురంలో **"కోతుకల ముడైయ పావాయ్!"** అనేది సంబోధన. (కొందఱు **"కోదుకులముడైయ పావాయ్!"** అని పఠిస్తారు. అది గ్రాహ్యమైన పాఠం కాదు) **"కౌతూహలమ్"** అనే సంస్కృతపదమే ద్రావిడంలో **"కోతుకలమ్"** అనే వికృతిని పొందుతుంది. కుతూహలమని దీని అర్థం. "కుతూహలాన్ని కల్గిన ఓ బాలికా!" అని చేసే ఈ సంబోధనకు రెండు రీతులలో అర్థాన్ని చెప్పవచ్చు. తన కుతూహలాన్ని భగవానునిపట్ల కల్గినదానా!, అని, భగవానుని కుతూహలాన్ని తన విషయంలో కల్గినదానా! -అనే రెండు రీతులలోని అర్థాన్ని ఈ పదం సహిస్తుంది. భగవద్గీతలో **"ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః"** (జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టమైనవాడను కదా! నాకు కూడా అతడు చాలా ఇష్టమైనవాడు) అని అంటూ భగవానుడే స్వయంగా అన్నాడు. తన కుతూహలం జ్ఞానిపట్ల ఉన్నదని ఇందులో చెప్పబడింది. నమ్మాళ్వార్లుకూడా తిరువాయ్మొళిలో (5-1-7) **"మెయ్మ్మాలా యొళిన్దేన్ ఎమ్బిరానుమెన్ మేలానే"** (భగవానుని పట్ల నేను గొప్ప వ్యామోహాన్ని పొందాను. అతడు కూడా నాపట్ల మిక్కిలి వ్యామోహాన్ని కలవాడయ్యాడు.) అనే పాశురంలో ఈ అర్థాన్నే అనుగ్రహించారు. భగవానుని పట్ల మనం ప్రీతి కల్గి ఉండడం గొప్పదా? అతడు మనపట్ల ప్రీతిని కల్గి ఉండడం గొప్పదా? అని ఒకరు ప్రశ్నిస్తే, దానికి ఇంకొకరు బదులిస్తూ - "ఈవిధంగా ప్రశ్నించడంలో ప్రయోజనం లేదు. భగవానుని విషయంలో మనం కల్గి ఉండే ప్రీతి అధికమా? లేక, అతడు మనపట్ల కల్గి ఉండే ప్రీతి అధికమా?- అనే ప్రశ్నను అడగాలి'' అని అన్నారట. ఈ ప్రశ్నకు సమాధానం పల్కడం ఎవరికి సాధ్యం? భగవానునిపట్ల మనం కల్గి ఉండే ప్రీతియొక్క అవధిని మనం తెలిసికొనగలమే తప్ప, అతడు మనపట్ల కల్గి ఉండే ప్రీతియొక్క అవధిని మనం ఏవిధంగా తెలిసికోవడానికి సాధ్యం? - అని కొందఱు అంటారు. గీత మొదలైన వానిలో అతడు తానే పల్కిన దానినిబట్టి దానిని మనం తెలిసికోవడంలో ఏమి కష్టం? పూర్వం ఉదాహరించిన **"ప్రియో హి జ్ఞానినోఽత్యర్థ మహం స చ మమ ప్రియః"** (జ్ఞానికి నేను చాలా ఇష్టమైనవాడను. అతడు కూడా నాకు ఇష్టమైనవాడు.) అనే శ్లోకమే అతని ప్రీతియొక్క పరిమితిని తెల్పుతున్నది. ఆ శ్లోకంలోని 'అత్యర్థమ్"

అనే పదానికి **"వాచామగోచరమ్"** అని అర్థమని గీతాభాష్యంలో వివరింపబడింది. ఈ పదాన్ని రెండుచోట్ల అన్వయించవచ్చు. **"జ్ఞానినః అహమత్యర్థం ప్రియః"** (జ్ఞానికి నేను మిక్కిలి ఇష్టుడను) అనేది గీతాభాష్యంలో గ్రహింపబడిన యోజన. గీతాభాష్యానికి పిమ్మట అనుగ్రహించిన శ్రీభాష్యంలో అయితే, **"సః (జ్ఞానీ) మమ అత్యర్థం ప్రియః"** అనే అన్వయం గ్రహింపబడింది. **"అనావృత్తిః శబ్దాత్"** అనే సూత్రం భాష్యంలో **"అత్యర్థప్రియం జ్ఞానినమ్"** (నాకు మిక్కిలి ఇష్టుడైన జ్ఞానిని) అనే సూక్తి కన్పిస్తున్నందున ఈ విధమైన అన్వయాన్ని గ్రహించారని దీనివల్ల స్పష్టమవుతున్నది. జ్ఞానిపట్ల భగవానుడు కల్గి ఉండే ప్రీతియొక్క అవధియే అధికమని దీనివల్ల తెలుపబడింది. ఈ విధంగా భగవత్ప్రీతిని తనపట్ల అధికంగా కల్గి ఉండే ఒక గొప్ప వ్యక్తియే ఇక్కడ **"కోతుకలముడైయ పావాయ్!"** అని సంబోధింపబడ్డారని గ్రహించాలి.

(కీళ్వానమ్ వెళ్ళెన్ఱు) - ఈ ప్రయోగానికి పలు రీతులలో స్వాపదేశార్థాలను గ్రహించవచ్చు. **"వానమ్"** అంటే - ఆకాశం. **"దహర ఉత్తరేభ్యః"** అనే బ్రహ్మ సూత్రాన్ని అనుసరించిన కూరేశులు సుందరబాహుస్తవంలో -**"యం తం విదుః దహర మష్టగుణోపజుష్ట మాకాశమ్ ఔషనిషదీషు సరస్వతీషు"** (అతనిని గుణాష్టకాన్ని కల్గిన దహరశబ్ద వాచ్యునిగా ఉపనిషద్వాక్యాలలో తెలిసికొంటున్నారు.) అని పలికారు. **"దభ్రం విపాప్మం పరవేశ్మభూతం యత్పుండరీకం పురమధ్య సంస్థమ్, తత్రాపి దభ్రం గహనం విశోక స్తస్మిన్ యదంతః తదుపాసితవ్యమ్"** (శరీరం మధ్యలో ఉన్నది, దోషం లేనిది, పరమాత్మకు నివాసస్థానమైనది అయిన చిన్నహృదయమనే కమలం ఏది ఉన్నదో, అందులో చాలాచిన్నవాడు, ఏ దుఃఖ స్పర్శలేనివాడు, దహరాకాశ శబ్దవాచ్యుడైన నారాయణుడు ఉన్నాడు. అతనిలో ఉండే కల్యాణగుణాలు ఉపాసించదగినవి) అనే ఉపనిషద్వాక్యం స్మరణీయం. మనలోపల దహరాకాశమని రెండు ఉన్నాయి. పైన ప్రస్తావించిన ఉపనిషత్తులో **"పరవేశ్మభూతమ్"** అని పల్కిన రీతిలో పరమ పురుషునకు ఆధారమైన దహరపుండరీకం. **"కీళ్వాన"**మన బడుతున్నది. అందులో వేంచేసి ఉండే భగవానుడుకూడా దహరకాశ శబ్దవాచ్యుడు కనుక అతనిని **"మేల్వానమ్"** అని, అతనికి ఆధారమైన దహరాన్ని **"కీళ్వాన"**మని గ్రహించాలి. ఆ **"కీళ్వానమ్"** పరిశుద్ధంగా ఉంటే తప్ప **"మేల్వానమ్"** అనబడే భగవానుడు అందులో వేంచేసి ఉండడు. కనుక, **"కీళ్వానమ్"** తెల్లగా, పరిశుద్ధంగా ఉండాలని భావం. **"వెళ్ళెన్ఱు"** అనేది **"ఆశంసాయాం భూతవచ్చ"** అనే సంస్కృత వ్యాకరణ న్యాయానుసారం

"వెళ్ళెన్లాకవేణుమ్" (పరిశుద్ధం కావాలి) అని ఆశంసింప బడుతున్నదనే అర్థాన్ని ఇస్తుంది.

లేక, **"మేల్‌వానమ్"** అనే పదానికి ప్రతికోటి **"కీళ్‌వానమ్"**. **"మేల్‌వానమ్"** అంటే- నిత్యవిభూతి. **"కీళ్‌వానమ్"** అంటే - లీలావిభూతి. **"ఉఱైక్కవల్లార్‌క్కు వైకున్దమాకుమ్ తమ్ ఊరెల్లామ్"** (అభ్యసించగల్గినవారికి తమ ఊరు వైకుంఠం కాగలదు.) (తిరువాయ్‌మొళ్ళి-5-3-1) అని ఆళ్వార్లు అనుగ్రహించిన రీతిలో, లీలావిభూతికూడా ఒక విధంగా వైకుంఠం అవుతుంది కనుక, దీనిని **"కీళ్‌వానమ్"** అని అనడంలో అడ్డు లేదు. ఇది ఆచార్యుని సన్నిధానంవల్ల సంభవిస్తుంది. **"ఇరుళ్ తరు మాఞాలమ్"** (అజ్ఞాన ప్రదమైన విశాలభూమి) కాకుండా, **"వెళ్ళెన్టు"** అయినది- అంటే- శుద్ధసత్త్వమయంగా గోచరిస్తున్నది- అని తాత్పర్యం.

లేక, **"వానమ్"** అంటే మేఘానికి కూడా పేరు కనుక, **"మేల్‌వానమ్"** అని అంటూ పరమపదంలోని మేఘాన్ని తెల్పినట్లుగా భావించి, **'కీళ్‌వానమ్"** అనేది లీలావిభూతిలోని ఆచార్యుడనే మేఘాన్ని తెల్పినట్లుగా చెప్పవచ్చు. మేఘం తన దగ్గర ఉండే నీటిని బాగా వర్షించి, తెల్లబడేటట్లే, ఈ ఆచార్యమేఘమనే **"కీళ్‌వానమ్"** కూడా తన దగ్గర ఉండే సకలార్థతీర్థాలను వర్షించి తెల్లబడాలని భావం. లేక, "తూర్పు తెల్లబడినది'' అనే అర్థాన్నే గ్రహించి, **"ప్రాచీ సంధ్యా కాచిదంతర్నిశాయాః ప్రజ్ఞాదృష్టే రంజనశ్రీ రపూర్వా"** (ఆంతరమైన రాత్రి-అంటే- అజ్ఞానాన్ని తీర్చే అద్వితీయమైన తూర్పుదెసలోని సంధ్య, ప్రజ్ఞ అనే నేత్రానికి అపూర్వమైన అంజనశోభ) అనే హయగ్రీవస్తోత్ర సూక్తి రీతిలో అర్థాన్ని గ్రహించ వచ్చు. తూర్పు తెల్లబడే కాలంలో ఎక్కువ భాగం తెల్లగాను, కొంచెం భాగం నల్లగాను ఉంటుంది కదా! ఆచార్యుని ఉపదేశం ఆలకించేటపుడు, **"ఎన్నై వెళ్ళుయిరాక్కవల్ల"** (నన్ను సత్త్వగుణాన్ని కల్గిన వానినిగా చేయగల్గిన) అనే రీతిలో తెల్లగా ఉంటుంది. ఆచార్యుని సన్నిధిని వీడిపోగానే అజ్ఞానం తోస్తుంది.

(ఎరుమై శిఱు వీడు మేయ్‌వాన్ పరన్దనకాణ్) - "ఎరుమై" అనే పదం తామసప్రకృతిని కలవారిని తెల్పుతుంది. **"శిఱు వీడు"** అంటే - అల్పానందం. తామసప్రకృతిని కలవారు అల్పానందానుభవంలో ఆసక్తులై ఉన్నారే! అయ్యో! **(కాణ్)** - వారిని కటాక్షించాలి - అని భావం. **"ఎరుమై"** (ఎనుబోతు)యొక్క స్వభావాన్నిగూర్చి తిరుమంగై ఆళ్వార్లు తిరునాంగూర్ దివ్యదేశదశకాలలోని ఒక దశకంలో, **"ఓఙ్గు పైన్దాళ్ కణ్ణార్ కరుమ్బిన్ కళై తిన్టు వైకి క్కళునీరిన్ మూళ్కి చ్చెళునీర్‌త్తడత్తు మూళ్కి మణ్ణేన్దిన మేదికళ్ వైకు నాఙ్గూర్"** (పచ్చని మొదళ్ళను కల్గినవి, కణుపులతో నిండినవి, సారంలేనివి అయిన చెఱకు గడలను తిని కదలలేక అక్కడే పడి ఉండి, తరువాత ఎఱ్ఱతామరపూవులతో కూడిన, అందమైన, నీటితో నిండిన తటాకంలో మునిగి, కొమ్ములకు మన్నును పూసుకొని పైకొచ్చే ఎనుములు ఒడ్డును చేరలేక అక్కడే పడి ఉండే తిరునాఙ్గూర్) అని వర్ణించారు. ఎనుబోతులు చెఱకును తినకుండా చెఱకులో సారం లేని గడలను తినే రీతిలోనే, **"కళ్వా! కడన్‌మల్లై క్కిడన్ద కరుమ్బే!"** (చోరుడా! కడల్‌మల్లైలోని చెఱకువంటివాడా!) అని చెఱకుగా చెప్పబడ్డ భగవద్విషయాన్ని అనుభవించలేకుండా, హేయవిషయా లలో లగ్నమై తిరిగేవారు ఇక్కడ **"ఎరుమై"** అనే పదంద్వారా వివక్షితులు. **"నీలతయా స్థూలతయా దూరతయా దానలోలుపైః మధుపైః, ధావిత మిభరాజతయా హంతాసీదంతతో మహిషః"** (నల్లగా ఉన్నందున, స్థూలంగా ఉన్నందున, దూరంలో ఉన్నందున మదజలం పట్ల ఆసక్తిని కల తుమ్మెదలు మదగజమనే భావనతో పరుగుతీశాయి. కాని, అయ్యో! చివరకు అది ఏనుగు కాదు. దున్నపోతు) అని అన్నాడు పండితరాజు. ఈవిధంగా అజ్ఞానులు వ్యాపించి ఉండే ఈ భూమిలోని వారినికూడా **"ఎరుమై"** గా గ్రహించవచ్చు.

"మిక్కుళ్ళ పిళ్ళైకళుమ్" ఇత్యాదిప్రయోగంద్వారా చాలా గొప్ప విశేషార్థం ఒకటి అనుసంధేయం. అది ఏమంటే - **"అర్వాంచో యద్పదసరసిజద్వంద్వ మాశ్రిత్య పూర్వే మూర్ధ్నా యస్యాన్వయ ముపగతా దేశికా ముక్తిమాపుః, సోఽ యం రామానుజమునిరపి"** (ఏ శ్రీరామానుజులకు తరువాత జన్మించిన ఆచార్యులు - వారి పాదకమల ద్వంద్వాన్ని ఆశ్రయించి, ముందు జన్మించినవారు- శిరఃసంబంధం వల్ల ముక్తిని పొందారో, ఆ శ్రీరామానుజులు కూడా.) అనే శ్లోకంలో తెలుపబడ్డ రీతిలోనే ఇతఃపూర్వమే కాలం చేసినవారిని, అపుడు పరమపదాన్ని చేరకుండా నిలిపి, తాము అవతరించిన తరువాత తమ కిరీటసంబంధంతో వారిని ఉత్తీర్ణులుగా చేయగల్గిన గొప్పతనం భగవద్రామానుజులకు ఒక్కరికే అసాధారణంగా చెప్పబడింది. దీనిని వేదాంత దేశికులుకూడా న్యాయపరిశుద్ధిప్రారంభంలోని మంగళశ్లోకంలో **"తత్పాదకోటీరయోః సంబంధేన సమిధ్యమానవిభవాన్"** (శ్రీరామానుజుల పాదాలతో, శిరస్సుతో సంబంధంచేత ప్రకాశించే వైభవాన్ని కలవారిని) అని పల్కడం ద్వారా తెలియజేశారు. "భగవద్రామానుజులు తమకు ముందున్నవారిని తమ కిరీటసంబంధంతో ఉత్తీర్ణులను చేశారు. తమకు తరువాత జన్మించినవారిని తమ శ్రీచరణ సంబంధంలో ఉత్తీర్ణులను చేశారు'' అని ప్రసిద్ధంగా

చెప్పబడే మాట ఉన్నది కదా! ఈ అర్థవిశేషం "పోవాన్ పోకిన్డ్రారై పోకామల్ కాత్తు నిన్డ్రోమ్" (పోవడమే ప్రయోజనంగా భావించి పోయేవారిని పోనివ్వకుండా నిలిపాము) అనే ప్రయోగంలో అనుసంధించడం యుక్తమనే విషయాన్ని గ్రహించాలి.

(మావాయ్ పిళన్దానై) - "మా" అనే పదం గుఱ్ఱాన్ని తెలిపేటట్లే, మృగసామాన్య వాచకంకూడా. నాల్గు కాళ్ళను కల్గిన జంతువులన్నీ "మా" అనే పేరుతో వ్యవహరింప బడతాయి. "జ్ఞానేన హీనః పశుభిః సమానః" (జ్ఞానం లేనివాడు పశువుతో సమానం) అనే రీతిలో జ్ఞానహీనతవల్ల పశుప్రాయులమై ఉండే అస్మదాదులే "మా" అనే పదానికి అర్థం. ఇటువంటి నరపశువులమైన మనం నోటిని తెఱువలేక మూగవారమై ఉండగా, "వాయ్ పిళన్దాన్"- ఆచార్యులు మన నోటిని తెఱిపించారు. నోటిని తెఱచి చక్కగా పలుకగలిగేటట్లు చేశారని భావం.

(మల్లరై మాట్టియ) - శ్రీకృష్ణుడు చాణూరముష్టికులనే ఇద్దఱు మల్లులను వధించినట్లుగా, ఆచార్యులు "నీర్ నుమదు ఎన్డివై వేర్ ముదల్ మాయ్ త్తు" (నేను, నాది అనే వీనిని సమూలంగా పోగొట్టుకొని) అనే రీతిలో అహంకార-మమకారాలనే ప్రబలవిరోధులను ఇద్దఱిని సమూలంగా నిరసించారు.

(దేవాదిదేవన్) - దేవునికంటే అధికుడైన దేవుడు ఆచార్యుడు. "ఆచార్యాది హ దేవతాం సమధికా మన్యాం న మన్యామహే" (ఆచార్యుని కంటే గొప్ప దైవాన్ని ఇంకొకటిని భావింపను.) అనే దేశికసూక్తిని గమనించాలి. ఇటువంటి మహాచార్యుని,

(శెన్డు నామ్ శేవిత్తాల్)- "స గురుమేవాభిగచ్ఛేత్" (ముముక్షువైన అతడు గురువునే ఆశ్రయించాలి) అని, "ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా" (నమస్కారంతో, ప్రశ్నతో, సేవతో) అని చెప్పబడే రీతిలో మనం పోయి సేవిస్తే,

(ఆ వా ఎన్డు ఆరాయ్న్దు అరుళ్) - "హా !" అని దయ చూపి, "వా" (రా) అని పల్కి, ప్రేమతో పిలచి, శిష్యలక్షణపూర్తి ఉన్నదా ?- అని పరిశీలించి చూచి, అది ఉన్నదని తెలియగానే సకలార్థాలను పరమకృపతో అనుగ్రహిస్తారు.

9. తూమణి మాడత్తు శుఱ్ఱుమ్ విళక్కెరియ
తూపమ్ కమழ் తుయిలణైమేల్ కణ్ వళరుమ్
మామాన్ మకళే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్
మామీర్! అవళై ఎழుప్పీరో! ఉన్ మకళ్తాన్

ఊమైయో? అన్డి చ్చెవిడో? అనన్దలో?
ఏమ ప్పెరున్దుయిల్ మన్దిర ప్పట్టాళో?
మామాయన్ మాదవన్ వైకున్దన్ ఎన్డెన్డు
నామమ్ పలవుమ్ నవిన్డు ఏలోర్ ఎమ్బావాయ్.

ఈ పాశురంలో "మామాన్మకళే!" (మామ కూతురా!) అనే సంబోధన దేహసంబంధంలోని దృష్టితో చేసినట్లు కన్పిస్తుంది. దేహబంధువులు ఆభాస బంధువులని, బాంధవాభాసులని పల్కి, వారు విడువదగినవారిగా తెల్పుతున్నది శాస్త్రం. నమ్మాழ్వార్లుకూడా తిరువాయ్మొழிలో- "కొణ్డపెణ్డిర్ మక్కళుఱ్ఱార్" (పరిగ్రహించిన స్త్రీలు, సంతానం, బంధువులు) అనే దశకంలో దేహబంధువులను విడచిపెట్టాలని ఉపదేశించారు. ఆ విధంగా ఉండగా, ఇక్కడ "మామాన్ మకళే!" అని దేహబంధుత్వాన్ని పురస్కరించుకొని సంబోధించినందువల్ల ఒక సూక్ష్మమైన శాస్త్రార్థం తెలుపబడుతున్నది. దేహబంధువులు సర్వాత్మనా త్యజింపదగినవారు- అని చెప్పనక్కరలేదు. నమ్మాழ్వార్లు కూడా "నల్లపదత్తాల్ మనైవాழ్వార్ కొణ్డపెణ్డిర్ మక్కళే" (మంచి స్థితిలో భార్యాపుత్రులు సుఖిస్తారు) అని పలికారు, స్వయంగా భగవద్భాగవత కైంకర్యాలకు ప్రతికూలురైన బంధువులు విడువదగినవారే తప్ప, అనుకూలురైన బంధువులు చాలా ఆదరించదగినవారు. పూర్వాచార్యుల పలువురి తనియన్‌లలో "శ్రీవత్సాంకసుతః శ్రీమాన్" (కైంకర్య సిరిని కల శ్రీవత్సాంక సుతులు) అని, "కృష్ణపాదస్య సూనవే" (శ్రీకృష్ణపాదుల కుమారులు) అని, "ఆచార్యపౌత్ర మభిరామవరాభిధానమ్" (అభిరామవరులనే పేరును కల ఆచార్యపౌత్రులు) అని దేహసంబంధాన్ని పురస్కరించుకొని నిర్దేశం చేయబడడం గమనార్హం. ఎమ్బార్, ముదలియాణ్డాన్ మొదలైన కొందఱు ఆచార్యులకు భగవద్రామానుజులతో దేహసంబంధం ఉన్నది. కూరత్తాழ్వాన్‌కు అది లేదు. అందువల్ల కూరేశులు మాటిమాటికి "అయ్యో ! నాకు శ్రీరామానుజులతో ఏవిధమైన దేహసంబంధం లేకుండపోయిందే'' అని నిర్వేదం పొందేవారట. ఆళవందార్ "పితామహం నాథమునిం విలోక్య" (పితామహులైన నాథమునులను చూచి) అని శ్రీమన్నాథమునులను దేహసంబంధాన్ని పురస్కరించుకొని పలికారు. తైత్తిరీయోపనిషత్తులో "భృగుర్వై వారుణిః వరుణం పితర ముపససార, అధీహి భగవో బ్రహ్మేతి" (భృగువు వరుణుని పుత్రుడు. తండ్రి అయిన వరుణుని సమీపించి "భగవన్! బ్రహ్మను గూర్చి ఉపదేశించండి'' - అని అడిగాడు.) అని వరుణపుత్రుడైన భృగువు తమ తండ్రి వరుణునివద్దనే బ్రహ్మవిద్యను అధికరించి

నట్లుగా చెప్పబడింది. ఈ విధంగా పలుపలు అంశాలను పరిశీలించినపుడు దేహానుబంధులు పూర్తిగా సర్వాత్మనా త్యజింపదగినవారు కారని, హేతువిశేషంచేత ఉపాదేయులుకూడా కావచ్చునని తెలుస్తున్నది. ఈవిషయాన్ని తెలుపగోరిన గోదాదేవి **"మామాన్ మకళే!"**అని సంబోధించింది.

(తూమణి మాడత్తు) - ఏచోటనుండి నిలచి చూస్తే అన్ని వస్తువులు చక్కగా కన్పిస్తాయో ఆ చోటు మాడమని చెప్పబడుతుంది. ప్రజ్ఞాప్రాసాదమని మహర్షులు కూడా అంటారు. **"మణిమాడమ్"** -అంటే నవరత్నాలు పొదిగిన ప్రజ్ఞాప్రాసాదమని అర్థం. నవవిధసంబంధాలే ఇక్కడ నవరత్నాలు. పితృపుత్రభావం, రక్ష్యరక్షకభావం, శేషశేషిభావం, భర్తృభార్యాభావం, జ్ఞాతృజ్ఞేయభావం, స్వస్వామిభావం, ఆధారాధేయ భావం, శరీరాత్మభావం, భోక్తృభోగ్యభావం- అనే తిరుమంత్రార్థమైన ఈ నవవిధసంబంధాలను చక్కగా గ్రహించిన ప్రజ్ఞావిశేషమే ఈ **"తూమణిమాడమ్"**.

(శు*ఱ్ఱు*మ్ విళక్కెరియ) - **"ఞానచ్చుడర్ విళక్కే*ఱ్ఱి*నేన్"** (జ్ఞాన దీపాన్ని వెలిగించాను.) అని, **"ఉయ్త్తుణర్వెన్ను మొ*ழி*కొళ్ విళక్కే*ఱ్ఱి*"** (జ్ఞానమనే ప్రకాశించే దీపాన్ని వెలిగించి) అని ఈ రీతిలో ఉండే పాశురాలు జ్ఞానాన్ని దీపంగా తెల్పుతున్నాయి. **"వేదాన్త వి*ழு*ప్పొరుళిన్ మేలిరున్ద విళక్కు"** (వేదాంతాలలోని గొప్ప అర్థాలలో ఉండే దీపం) అని, **"మిక్క ఞానమూర్త్తియాయ వేదవిళక్కు"** (గొప్ప జ్ఞానమూర్తి అయిన వేదదీపం) అని, **"నన్దావిళక్కే"** (ఏనాడో ఆరని దీపమా) అని ఈ విధంగా ఉండే పాశురాలు భగవానుని దీపంగా తెల్పుతున్నాయి. **"మానం ప్రదీప మివ కారుణికో దదాతి"** (వేదాన్ని గొప్ప దీపంవలె కరుణాళువు అయిన భగవానుడు ఇచ్చాడు.) అనే భట్టర్‌శ్రీసూక్తి శాస్త్రార్థాలను దీపంగా తెల్పుతున్నది. **"మిక్కానై మఱైయాయ్ విరిన్ద విళక్కై"** (సర్వాధికుని, వేదమై విస్తరించిన దీపం వంటి వానిని) అని, **"తోన్ఱు శోది మూన్ఱుమాయ్ త్తుళక్కమిల్ విళక్కమాయ్"** (ప్రకాశించే అకార, ఉకార, మకారాలనే జ్యోతిస్సులు మూడై, దోషం లేని అకారమనే దీపమై) అని ఈ రీతిలో ఉండే పాశురాలు సకలార్థ బీజభూతమైన అకారాన్ని దీపంగా తెల్పుతున్నాయి. ఇవి అన్నీ **"శు*ఱ్ఱు*మ్ విళక్కు"** అనే పదం ద్వారా వివక్షితాలు. **"తూమణిమాడమ్"** యొక్క అధికారికి ఈ దీపాలు అన్నీ జ్వలిస్తూనే ఉండే రీతిని ఈ సూక్తి తెల్పుతున్నది.

(తూపమ్ కమ*ழ*) - ఇంతకుముందు జ్ఞానవిశేషం తెలుపబడింది. ఇందులో పరిమళవిశేషం తెలుపబడుతున్నది. జ్ఞానం పరిమళించడం అనుష్ఠానంవల్లనే. **"ఞాన మనుట్టాన మివై నన్ఱాకవే యుడైయనాన"** (జ్ఞానం, అనుష్ఠానం- అనే వీటిని చక్కగా కల్గిన) గురువునుకదా ఆశ్రయించాలి. అనుష్ఠానం లేకుండా జ్ఞానంమాత్రం కలవాడు కుంటివానివంటివాడు. జ్ఞానం లేకుండా కేవల అనుష్ఠానం కలవాడు గుడ్డివానితో సమానుడు. ఈ ఇద్దఱు ఇతరుల సహాయం లేకుండా నడువలేరు. సద్గతికి రెండు కావాలి. ఈ రెండిటిని కల్గి ఉండడం తెలుపబడింది ఇక్కడ.

(తుయిలణైమేల్ కణ్వళరుమ్) - తిండిని, నిద్రను మాత్రమే కాలక్షేపంగా కల్గిన ప్రాకృతులు తమ ఆనందానుభవానికి తగిన ఆశ్రయంగా గ్రహింపబడే సాధనం **"తుయిలణై"**. ఆనందానుభవమనేది వారి వారి అభిరుచికి తగిన రీతిలో వేఱు వేఱుగా ఉంటుంది. మహాజ్ఞానులు ఆనందానుభవం పొందే **"తుయిలణై"** (రెండు దిండ్లు) ఏవి? అంటే - శ్రీభాష్యభగవద్విషయాలే. వాటిలో, **"కణ్వళరుమ్"** ఇంకా ఇంకా దృష్టిని పెట్టినవారని భావం. ఈ ఉపధానద్వయంచేత, **(మేల్ కణ్ వళరుమ్)** గొప్పదైన నేత్ర- జ్ఞాననేత్రం, అది బాగా వికసించి, వృద్ధిని పొందిన వారనికూడా భావం.

(మామాన్ మకళే!) - (ఈప్రయోగంలో) దేహబంధుత్వంలో కాని, ఆత్మ బంధుత్వంలో కాని వివక్ష ఉన్నదని చెప్పవచ్చు. శ్రీవచనభూషణంలోని ప్రపన్న దినచర్యాప్రకరణంలో **"ఇప్పడి సర్వప్రకారత్తాలుమ్ నాశహేతువాన అహంకారత్తుక్కుమ్ విళైనిలమ్ తానాకైయాలే, తన్నై క్కణ్డాల్ శత్రువై క్కణ్డాప్పోలేయుమ్, అవ*ఱ్ఱు*క్కు వర్ధకరాన సంసారికళై క్కణ్డాల్ సర్పత్తై క్కణ్డాప్పోలేయుమ్, అవ*ఱ్ఱు*క్కు నివర్తకరాన శ్రీవైష్ణవర్కళై క్కణ్డాల్ బంధుక్కళై క్కణ్డాప్పోలేయుమ్"** (ఈవిధంగా అన్ని రీతులలో నాశహేతువైన అహంకారానికి జన్మభూమి తానే కనుక, తనను చూస్తే శత్రువును చూచినట్లుగా, వాటిని పెంపొందించే సంసారులను చూస్తే పామును చూచినట్లుగా, వాటిని నివర్తింప చేసే శ్రీవైష్ణవులను చూస్తే బంధువులను చూచినట్లుగా) అనేచోట శ్రీమణవాళమహామునుల వ్యాఖ్యాన శ్రీసూక్తులను అనుసంధించాలి. ఇటువంటి ఆప్తబంధువుల స్వభావాన్ని కల్గినవారిని ఈ పదం తెల్పుతున్నది.

(మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్) - లోపల చాలా గొప్ప వస్తువులను ఉంచిన చోటుకే మణికవాటాలను పెడతారు. ఆచార్యుల మనస్సులో సురక్షితంగా పదిలపరచబడి ఉండే అర్థవిశేషాలను, జలాశయం తలుపులను తెఱచి నీటిని ప్రవహింప జేసినట్లుగా, తెఱచి వ్యక్తంచేయాలని వారిని ప్రార్థించిన తీరు ఇది.

(మామీర్! అవళై ఎ ఝుప్పీరో)- అనే ప్రయోగం ప్రాచార్యుల పురస్సరంగా ఆచార్యానుగ్రహాన్ని అభివృద్ధి చేసికోవాలి- అని తెల్పుతున్నది.

(ఉన్ మకళ్తాన్ ఊమైయో?) - అని ఆరంభించి ఆచార్యుని అప్రమేయ ప్రభావాలు ప్రాచార్యసన్నిధానంలో విజ్ఞాపించబడుతున్నవి. **"పరీవాదేషు యే మూకా బధిరాశ్చ పరోక్తిషు, పరరంధ్రేషు జాత్యంధాః తైర్జితం భువనత్రయమ్"** (ఇతరుల నిందల పట్ల మూగవార్లై, ఇతరుల మాటలను గూర్చి చెవిటివార్లై, ఇతరుల లోపాలను గూర్చి పుట్టుగుడ్డివార్లై ఎవరుంటారో, వారు ముల్లోకాలను జయించినవారు.) అనేది నీతిశాస్త్రవచనం. ఇతరులనుగూర్చి నిందలను పల్కడంలో మూగవారిగా, ఇతరుల మంచినిగూర్చి తక్కువగా పలికే మాటలపట్ల చెవిటివారిగా, ఇతరుల దోషాలను, లోపాలను చూడడంలో గుడ్డివారిగా ఉండేవారు ముల్లోకాలను జయించేవారు కాగలరు- అనేది పైన ప్రస్తావించిన శ్లోకంయొక్క భావం. పాశురంలోని **"ఊమైయో? శెవిడో ?"** (మూగయా? చెవిటియా?) అనే దానితోపాటుగా,**"కురుడో ?"** (గుడ్డిదా) అనే పదాన్ని కూడా అధ్యాహరించుకోవడం తగినది. ఈ రీతిలో పరదూషణలను చేయకపోవడం, ఇరులు చేసే నిందలపట్ల చెవి ఒగ్గకపోవడం, ఇతరుల దోషాలను, లోపాలను చూడకపోవడం- అనే గొప్పతనాలను నిండుగా కలవారని ప్రకృతభావం.

(అనన్దలో?) -**"అనన్దల్"** అనే పదం సోమరితనానికి పేరు. తిరుమాలై ప్రబంధంలో **"కావ్బుఅత్తలై శిరైత్తు ఉన్ కడైత్తలై యిరున్దు వాఝుమ్ శోమ్బరై యుకత్తిపోలుమ్ శూఝ్పునలరఙ్గత్తానే!"** (కావేరి నదిని చుట్టూ కలిగిన శ్రీరంగంలో శయనించి ఉండేవాడా! ఉపాయాంతరాలలోని సంబంధం లేకుండా చేసుకొని, తమవద్ద ఉండే పాపాలను పోగొట్టుకొని నీ ముంగిటలో పడిఉండి, తరించే సోమరులను చూచి నీవు సంతోషిస్తావు) అని నిర్దేశింపబడ్డ ఉత్తమాధికారి- అని దీని భావం. **"అనన్దల్"** - అంటే మైకమనికూడా చెప్పవచ్చు. అందువల్ల వ్యామోహమా? అని కూడా అర్థం.

(ఏమప్పెరున్తుయిల్ మన్దిరప్పట్టాళో?) - **"మన్దిరమ్"** అంటే అష్టాక్షరీమహా మంత్రం. అందులో చక్కగా అభినివేశాన్ని పొందితే **"ఏమప్పెరున్తుయిల్"** కల్గుతుంది. స్వరక్షణే స్వాన్వయనివృత్తి బాగా కల్గడమే **"ఏమప్పెరున్తుయిల్"**ను బాగా పొందడం.

"మామాయన్ మాదవన్ వైకున్దన్" అనేవి ఆచార్యునకు చాలా పొసగే తిరునామాలు. **"మామాయన్"** - ఇనుమును బంగారంగా చేసేటట్లుగా చాలా ఆశ్చర్యకరమైన కృత్యాలను చేసేవారు. **"మాదవన్"** -మహాతపస్వి అని భావం. **"తపఃస్వాధ్యాయనిరతం తపస్వీ"** (తపస్సులో, స్వాధ్యాయంలో నిరతుడైన నారదుని, తపఃశీలి అయిన వాల్మీకి మహర్షి) అనేచోట వివక్షితమైన అర్థం ఇక్కడ స్మరణీయం. **"వైకున్దన్"** - వైకుంఠప్రదుడని తాత్పర్యం.

10. నోర్ఱ్ు చ్చువర్క్కమ్ పుకుకిన్ఱ అమ్మనాయ్!

మార్ఱముమ్ తారారో వాశల్ తిఱవాదార్

నార్ఱత్తుఝాయ్ ముడి నారాయణన్, నమ్మాల్

పోర్ఱ ప్పఱై తరుమ్ పుణ్ణియనాల్, పణ్డొరునాళ్

కూర్ఱత్తిన్ వాయ్ వీఝ్న్ద కుమ్బకరణనుమ్

తోర్ఱుమునక్కే పెరున్తుయల్తాన్ తన్దానో?

ఆర్ఱ వనన్దలుడైయాయ్! అరుఙ్గలమే!

తేర్ఱమాయ్ వన్దు తిఱ ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురప్రారంభంలో ఉండే **"నోర్ఱ్ు చ్చువర్క్కమ్ పుకుకిన్ఱ అమ్మనాయ్!"** అనే సంబోధన, చివరలోని **"అరుఙ్కలమే !"** (అరుదైన అలంకరణమా!) అనే సంబోధన చాలా గమనించతగినవి. **"అరుఙ్కలమే!"** అనే పదానికి మూడర్థాలున్నాయి. **"కల"**మంటే పాత్ర అని. భూషణం అని అర్థాలు. అరుదైన పాత్రమా ! సత్పాత్రమా !- అని ఒక అర్థం. **"అనుత్తమం పాత్రమిదం దయాయాః"** (ఇతడు దయకు గొప్పపాత్రం) అని ఆళవందార్ అనుగ్రహించిన రీతిలో భగవానుని కరుణను పొందడానికి తగిన సత్పాత్రమని భావం. ఇక, భూషణమనే అర్థంలో "అరుదైన భూషణమై ఉండేదానా!" అని, "అరుదైన భూషణాలను కల్గినదానా" అని రెండు విధాలైన అర్థాలు గ్రహించే అవకాశం ఉన్నది. భూషణాలవల్ల శోభ అతిశయించేటట్లే, ఈ గోపికవల్ల గోపికల గోష్ఠికే అపూర్వమైన ఒక శోభ కలిగేటట్లు ఉంటుంది - అని భావం. ఈమె భూషణాలను కల్గినది- అనే అర్థంలో **"పరావరకురుక్కళ్ పూట్టు మాత్మభూషణఙ్గళ్"** (గురువులు ధరించే ఆత్మాలంకారాలు) అనే ఆచార్యహృదయ శ్రీసూక్తిక్రమంలో సుశిక్షితమైన ఆత్మాలంకారాలను కల్గినదానా!- అనే భావం స్ఫురిస్తుంది.

(నోర్ఱ్ు చ్చువర్క్కమ్ పుకుకిన్ఱ అమ్మనాయ్ !)- ఇది హేళనగా పలికే మాట కావచ్చు; పొగడ్తగా చెప్పే మాట కావచ్చు. "అమ్మా! నీవు ఈ విధంగా నిద్రించినట్లయితే చాలా బాగా నోము నోచి ముగించి, ఆనందానుభవాన్ని పొందవచ్చుకదా!

అనే అర్థాన్ని గ్రహిస్తే, హేళన అవుతుంది. "నీవు మావలె ఇక పైనోము నోచనక్కఱ లేకుండా, నోము నోచి పూర్తిచేసి, ఆనందానుభవాన్ని పొందుతున్నావు కదా!'' అని అంటున్నట్లుగా భావిస్తే పొగడ్త అవుతుంది. **"స్వర్గ"**మనే సంస్కృతపదం **"శువర్క్కమ్"** అనే వికృతిని పొందుతుంది. శ్రీరామాయణంలో సీతాదేవి శ్రీరాముని చూచి పలికేటపుడు **"యస్త్వయా సహ స స్వర్గో నిరయో యస్త్వయా వినా"** (నీతో కలసి ఉండడం స్వర్గం, నీవు లేకుండా ఉండడం నరకం) అని అనడంద్వారా స్వర్గ - నరకశబ్దాలకు అర్థాన్ని తెలిపింది. భగవానునితో కలసి జీవించడమే స్వర్గమని, అతనిని విశ్లేషించి, క్లేశాన్ని పొందడమే నరకమని దీనివల్ల తెలుపబడింది. శాస్త్రాలలో **"కృతకృత్య"**డనే ఒక ఉత్తమాధికారి తెలుపబడ్డాడు. అతని స్వభావాన్ని **"విదుః కృష్ణం బ్రాహ్మణా స్తత్త్వతో యే తేషాం రాజన్! సర్వయజ్ఞాః సమాప్తాః"** (రాజా! శ్రీకృష్ణుని యథాతథంగా-సాక్షాత్ ధర్మంగా-తెలిసికొన్న బ్రాహ్మణుల సమస్తయజ్ఞాలు పూర్తి అయినవి.) అనే ప్రమాణం చక్కగా నిరూపిస్తున్నది. ఆచార్యహృదయంలో - **"శాస్త్రికళ్ తెప్పక్కైయరైప్పోలే ఇరణ్డైయు మిడుక్కి ప్పిఱవి క్కడలై నీన్ద, సారజ్ఞర్ విట్టత్తిలిరుప్పారైప్పోలే ఇరుకైయుమ్ విట్టు కరై కుఱుజ్కాల మెణ్ణువర్కళ్"** (తెప్పతో నదిని దాటేవారు ఒకచేతితో తెప్పను పట్టుకొని ఇంకొక చేతితో ఆ తెప్పను తెడ్డుతో నడిపేరీతిలో, శాస్త్రాలలో అభినివేశాన్ని కలవారు, స్వప్రయత్నాన్ని, భగవానుని కృపను - రెండింటిని అవలంభించి సంసార సముద్రాన్ని దాటాలని చూడగా, ఓడను ఎక్కినవారు తెప్పను, తమ ప్రయత్నాన్ని విడచిపెట్టి, ఆ ఓడ తీరం చేరే సమయంకోసం వేచిఉండేటట్లే, అష్టాక్షరీ మంత్రార్థ సారాన్ని గ్రహించినవారు, స్వప్రయత్నరూపమైన ఉపాసనాదులను, తత్సాధ్యమైన భగవత్కృపను విడచిపెట్టి, కేవలం భగవానుని నిర్హేతుక కృపయే ఉత్తారకమని తలచి, భగవత్ప్రాప్తిసమయంకోసం వేచి దానినే లెక్కిస్తారు.) అనే చూర్ణికయొక్క వ్యాఖ్యానాన్ని స్మరించాలి. అందులో **"సారజ్ఞర్"** అనబడే అధికారియే ఈ పాశురంలో చెప్పబడ్డాడని గ్రహించాలి. తిరుమాలైలో **"మెమ్పొరుళ్ పోకవిట్టు మెయ్మ్మైయే మిక వుణర్న్దు, అమ్బురిశటిన్దు కొణ్డు ఐమ్బులనకత్తడక్కి, కామ్బఱత్తలై శిరైత్తు ఉన్కడైత్తలై యిరున్దు వాழுమ్ శోమ్బర్"** (గొప్పవైన ప్రాకృత వస్తువులను పూర్తిగా విడచి, ఆత్మవస్తువును యథాతథంగా తెలిసి, గొప్ప పురుషార్థమైన కైంకర్యాన్ని గూర్చి గ్రహించి పంచేంద్రియాలను నియంత్రించి, ఉపాయాంతార సంబంధాన్ని లేకుండా చేసికొని, తమ వద్దగల పాపాలను తీర్చుకొని, నీ గడప వాకిటిలో పడి ఉండే సోమరిపోతులను) అని నిర్దేశింపబడిన అధికారియే ఇతడు. ఇతడే **"అరుజ్కలమ్"** - ఉత్తమ సత్పాత్రమని అర్థం.

ఈ విధంగా, ఈ అర్థవిశేషాలను మనస్సులో దృఢంగా నిలుపుకొని పాశురాన్ని గమనిస్తే, దీనికి అనుగుణమైన అర్థాలు చక్కగా బోధపడతాయి.

(నోఱ్ఱు) -కృతకృత్యాధికారి- అని భావం.

(శువర్క్కమ్ పుకుకిన్ఱ) - **"శువర్క్కమ్"** అనే పదాన్ని **"శు+వర్క్కమ్"**అని విడదీస్తే, మంచి గోష్ఠి- అనే అర్థం వస్తుంది. పెరియాళ్వార్లు శ్రీకృష్ణుని వేణుగాన విషయంగా ఒక దశకాన్ని (**"నావలమ్ పెరియ తీవినిల్ వాழுమ్"** అనే దశకాన్ని) పాడి చివరలో దానికి ఫలశ్రుతిని తెలిపేటపుడు **"కుழలై వెన్ఱ కుళిర్ వాయినరోడు శాదుక్కోట్టియుట్కొళ్ళప్పడువారే"** (పిల్లనగ్రోవిని జయించిన చల్లని కంఠాన్ని కలవారితో పాటుగా సాధువుల గోష్ఠిలో గ్రహింపబడతారు.) అని అనుగ్రహించారు. ఆ గోష్ఠియే **"శువర్క్క"** మనబడుతున్నది. సుష్ఠు అయిన - చక్కని - వర్గమని భావం. ఆ సాధువర్గంలో చేరినవారు సామాన్యజనులతో సంభాషించరు. వారిని దగ్గరకు పిలువరు- అనే అర్థం - **"మాఱ్ఱముమ్ తారారో వాశల్ తిఱవాదార్?"** (వాకిలిని తెరువని వారు బదులైనా పలుకరా?) అనే ప్రయోగంవల్ల స్ఫురిస్తుంది.

"ప్రహర్షేణావరుద్ధా సా వ్యాజహార న కించన" (సీతాదేవి సంతోషాతిశయంచేత ఉక్కిరిబిక్కిరియై ఏమీ పలుక లేదు)అనే రీతిలో భగవదనుభవజనిత హర్షప్రకర్షంవల్ల నోటుతెఱచి ఏమీ మాట్లాడలేని స్థితి తెలుపబడుతున్నది, **"మాఱ్ఱముమ్ తారారో?"** అనే ప్రయోగంద్వారా. రహస్యార్థవిశేషాలు అనధికారుల చెవిలో పడకూడదు- అని వాకిటి తలుపులకు తాళం వేసి ఏకాంతంగా ఉపదేశించేవారి రీతిని స్మరింప జేస్తున్నది - **"వాశల్ తిఱవాదార్"** అనే ప్రయోగం.

(నాఱ్ఱ త్తుழாయ్ముడి ఇత్యాది)- **"తోళిణైమేలుమ్ నన్మార్పిల్ మేలుమ్ శుడర్ ముడిమేలుమ్ తాళిణైమేలుమ్ పునైన్ద తణ్ణన్తుழாయ్ముడి యమ్మాన్"** (భుజాలపై, వక్షఃస్థలంపై, ప్రకాశించే కిరీటంపై, శ్రీచరణాలపై అలంకరింపబడిన చల్లని అందమైన తులసీ మాలను కల స్వామి) అనే రీతిలో భగవానుని కిరీటంలో తులసి అసాధారణంగా ప్రకాశించేటట్లే, **"తొడుత్త తుழாయ్మలర్ శూడి క్కళైన్దన శూడు మిత్తొణ్డర్కళోమ్"** (కూర్చిన తులసీమాలను నీవు అలంకరించుకొని విడువగా దానిని అలంకరించుకొనే దాసులము) అనే రీతిలో భాగవతోత్తముల కిరీటంలో కూడా భగవానుడు అలంకరించుకొని విడచిన తులసి అలంకరింపబడి వెలుగుతుంది కనుక, **"నాఱ్ఱత్తుழாయ్ముడి"** అనే విశేషణం స్వాపదేశార్థలక్ష్య భూమిలో పొసగడంలో లోటు లేదు. ఈ విధంగానే **"నారాయణు"**డనే పదం

కూడా పొసగుతుంది. **"సాక్షాన్నారాయణో దేవః కృత్వా మర్త్యమయీం తనుమ్, మగ్నానుద్ధరతే లోకాన్ కారుణ్యాచ్ఛాస్త్రపాణినా"** (సాక్షాత్తు దేవదేవుడైన నారాయణుడు ఆచార్యునిగా మానవరూపాన్ని ధరించి, శాస్త్రపాణియై సంసారంలో మునిగినవారిని ఉద్ధరిస్తాడు.) అనే ప్రమాణానుసారం, **"పీతకవాడై పిరానార్ పిరమకురువాకి వన్దు"** (పీతాంబరధారి పరమాచార్యుడై అవతరించి) అనే పెరియాఴ్వార్ శ్రీసూక్తి ప్రకారం నారాయణుడే కదా మనుష్యరూపంలో అవతరిస్తున్నాడు. **"శేమమ్ కురుకైయో? శెయ్య తిరుప్పాఱ్కడలో? నామమ్ పరాఙ్కుశమో? నారణమో? తామమ్ తుళవో? వకుళమో? తోళిరణ్డో? నాన్గు ముళదో పెరుమానుక్కు"** (భగవానుని నివాసం కురుకాపురియా? పాల సముద్రమా? అతని పేరు పరాంకుశులా? నారాయణుడా? అతని మాలిక వకుళమాలికా? లేక, తులసీ మాలయా? అతనికి చేతులు రెండా? లేక నాలుగా?) అని అంటూ నమ్మాఴ్వార్లను ఉద్దేశించి పెద్దలు ఒకరు పల్కిన పాశురం ప్రకృతంలో అనుసంధేయం.

(నమ్మాల్ పోఱ్ఱ ప్పడై తరుమ్ పుణ్ణియన్)- "ఏఱ్ఱి మనత్తెఴిల్ ఞానవిళక్కై యిరుళనైత్తుమ్ మాఱ్ఱినవర్క్కొరు కైమ్మాఱు మాయనుమ్ కాణకిల్లాన్, పోఱ్ఱి యుకప్పతుమ్ పున్దియిల్ కొళ్వదుమ్ పొఙ్గు పుకఴ్ శాఱ్ఱి వళర్ప్పదుమ్ శఱ్ఱల్లవో మున్నమ్ పెఱ్ఱదఱ్కే" (మనస్సులో ప్రకాశించే జ్ఞానదీపాన్ని వెల్గించి, అజ్ఞానాన్ని అంతటిని పోగొట్టినవారికి ఏ ప్రత్యుపకారాన్ని చూడలేదు. కీర్తించి సంతోషించడం, మనస్సులో నిలుపుకొని ధ్యానించడం, గొప్ప కీర్తిని కల్గించి వృద్ధిచేయడం- అనే ఇవి అన్నీ పూర్వం తాము పొందినదానితో పోలిస్తే తక్కువే కదా!) అని దేశికులు పల్కిన రీతిలో ఆచార్యుని కీర్తించడం శిష్యకృత్యం కనుక, స్వరూపజ్ఞులైన శిష్యులచేత కీర్తింపబడి, **"పడై తరుమ్ పుణ్ణియన్"** - మనకు ఉద్దేశ్యమైన పురుషార్థాన్ని అనుగ్రహించేవారైన పరమపావనులు - అని భావం. **"పునాతీతి పుణ్యః"** (పవిత్రం చేస్తుంది కనుక పుణ్యం) పరిశుద్ధులైన, పరమ పవిత్రాలైన అర్థాలను ఉపదేశించి, శిష్యుల సకలకల్మషాలను పోగొట్టి పరిశుద్ధిని కల్గించేవారని భావం. ముద్రాలంకారశైలిలో అర్థం గ్రహించినపుడు విభక్తి అవివక్షితం. అందువల్ల **"పుణ్ణియనాల్"** అనే తృతీయావిభక్తికి ఎక్కడ అన్వయం?'' అని చూడనక్కరలేదు. ఆయా శబ్దాలవల్ల లభించే అర్థవిశేషాలే అనుభావ్యాలు.

"పణ్డొరునాళ్" - అని ఆరంభించి కుంభకర్ణుని నిద్రకంటే గొప్ప నిద్ర ఈ విలక్షణవ్యక్తిలో ఉన్నదని చెప్పబడుతున్నది. రజస్తమోగుణకార్యమాన నిద్ర

కుంభకర్ణుని నిద్ర. అది కాదు ఇక్కడ చెప్పబడే నిద్ర. **"పెరున్తుయిల్"** అనేది గొప్పతనాన్ని కల్గిన నిద్ర - అనే అర్థాన్ని తెల్పి, సత్త్వగుణప్రాచుర్యం స్ఫురించే నిద్రను తెలుపుతున్నది. నిద్ర అనేది రజస్తమోగుణకార్యంగా ఉంటుందే తప్ప, సత్త్వగుణనిబంధనమైన నిద్ర అనేది కూడా ఉంటుందా? అని ప్రశ్నించనక్కరలేదు. బాహ్యవిషయాలను వేనినీ తెలియక పోవడమేకదా నిద్ర అనబడుతుంది. **"యత్ర నాన్యత్ పశ్యతి నాన్యత్ శ్రుణోతి నాన్యత్ విజానాతి స భూమా"** (ఏ పరమాత్మను దర్శించిన తరువాత ఇంకొక విషయాన్ని చూడడో, వినడో, తెలియడో ఆ పరమాత్మ భూమాశబ్ద వాచ్యుడు) అనే రీతిలో బాహ్యవిషయాలలో ఏ ఇంద్రియం ప్రసరించని భగవద్విషయమననంలోనే లగ్నమై ఉండేవారు నిద్రించేవారితో సమానులు. ఈ నిద్ర పరమవిలక్షణమైనది. ఇది పరమసాత్త్వికమైనది.

(కూఱ్ఱత్తిన్ వాయ్ వీఴ్న్దు) - శరీరాన్ని -ప్రాణాలను విడదీసేవాడు కనుక **"కూఱ్ఱ"** మని యమధర్మరాజుకు పేరు. యముని నిర్దేశించడం ద్వారా యముని దిక్కు అయిన దక్షిణదిక్కు నిర్దేశింపబడింది. **"కుమ్భకరణన్"** అనేది కుంభాన్ని కారణంగా (జన్మభూమిగా) కల్గిన అగస్త్యమునిని తెల్పుతున్నది. **"దక్షిణా దిక్ కృతా యేన శరణ్యా పుణ్యకర్మణా"** (పుణ్యకర్ముడైన ఏ అగస్త్యమునిచేత దక్షిణ దిక్కు ఆశ్రయించదగినదిగా చేయబడిందో) అనే శ్రీరామాయణశ్లోకాను సారం దక్షిణ దిక్కుకు మంచిని పొందించిన, **"వణ్తమిఴ్మాముని"** (గొప్పవాడైన ద్రావిడమహాముని) అనబడే అగస్త్యమునితో సమానుడైన మహాత్ముడు తెలుప బడ్డాడు.

(తేఱ్ఱమాయ్ వన్దు తిఱ) - మేము స్పష్టతను పొందేటట్లు నోటిని తెఱచి శ్రీసూక్తులను పలకాలి- అని దీని భావం.

11. కఱ్ఱు క్కఱవై క్కణఙ్గళ్ పల కఱన్దు
శెఱ్ఱార్ తిఱలఴియ చ్చెన్ఱు శెరుచ్చెయ్యుమ్
కుఱ్ఱమొన్ఱిల్లాద కోవలర్ తమ్ పొఱ్కొడియే!
పుఱ్ఱరవల్కుల్ పునమయిలే! పోదరాయ్
శుఱ్ఱత్తు త్తోఴిమార్ ఎల్లారుమ్ వన్దు నిన్
ముఱ్ఱమ్ పుకున్దు ముకిల్ ఒణ్ణన్ పేర్ పాడ
శిఱ్ఱాదే పేశాదే శెల్వప్పెణ్డాట్టి! నీ
ఎఱ్ఱుక్కుఱఙ్గుమ్ పొరుళ్ ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురంలో **"కోవలర్‌తమ్ పొఱ్కొడియే!, పుత్ఱరవల్‌కుల్ పునమయిలే!, శెల్వప్పెణ్డాట్టి !"** అనే సంబోధనలు ముందుగా గ్రహించదగినవి. **"కోవలర్"** అనే పదం గొల్లలను తెలిపేటట్లే, విద్వాంసులను కూడా తెల్పుతుంది. **"గో"** అనే సంస్కృత శబ్దమేకదా ద్రావిడంలో **"కో"** అని మారింది. ఆ ద్రావిడపదానికి గల పలు అర్థాలలో వాక్కు అనేది కూడా ఒక అర్థం కనుక, వాక్కులో సమర్థులు- **"కోవలర్"**, వారి వద్ద సేవించి, ఉజ్జీవించేవారి **"పొఱ్కొడి"** -అని ప్రకృతంలో భావం. ఇక, **"కో+అలర్"**అని విడదీసి కూడా అర్థాన్ని చెప్పవచ్చు. ప్రభువులకు **"కో"** అని పేరు. స్వాతంత్ర్యాన్ని కల్గినవారని అర్థం. **"కో"** కాని వారు **"కో+అలర్" ="కోవలర్"** అంటే- స్వాతంత్ర్య గంధం ఏమాత్రం లేకుండా, పారతంత్ర్యమే పరిమళించేవారు- అని భావం. వారిలో **"పొఱ్కొడి" -"కొడి"** అనేది ఒక ఉపఘ్నాన్ని ఆశ్రయించియే జీవించేటట్లు, పరతంత్రులలో అత్యంతపారతంత్ర్యాన్ని రూపుగా కల్గిన ఉత్తమాధికారి ఈ పదంచేత చెప్పబడ్డాడని చెప్పవచ్చు.

(పుత్ఱరవల్‌కుల్) - సర్పం బయట సంచరించేటపుడు చాలా పెద్ద దేహాన్ని కల్గినది అయినా, అది పుట్టలోకి దూరేటపుడు ఆ పెద్ద రూపాన్ని చాలా చిన్నదిగా చేసికొంటుంది. అదే రీతిలో "సూక్ష్మమైన నడుమును కల్గినది'' అని నడుము అందాన్ని తెల్పి కీర్తించినట్లయినది. **"జ్ఞాన, భక్తి, విరక్తు"**లనే మూడిటిలో, మధ్యలో ఉండే భక్తియొక్క అతిశయం దీనిద్వారా తెలుపబడింది. భక్తి విశేషంగా కల్గి ఉంటే, అది అంతకుముందే ఉండే జ్ఞానాన్ని, తరువాత కలిగే విరక్తిని సాధిస్తుంది. **"మాయాం న సేవే భద్రం తే న వృథా ధర్మమాచరే, శుద్ధభావం గతో భక్త్యా శాస్త్రాద్వేద్మి జనార్దనమ్"** (మాయను - అంటే- మోసాన్ని అవలంబించను. నీకు శుభమగుగాక! భక్తిపూర్వకంగా శాస్త్రం ద్వారా జనార్దనుని తెలిసికొంటున్నాను.) అని ధృతరాష్ట్రుని చూచి సంజయుడు పల్కిన మాటవల్ల భక్తి జ్ఞానసాధకమనే విషయం తెలుస్తున్నది. **"పరమాత్మని యో రక్తో విరక్తో పరమాత్మని"** (పరమాత్మ విషయంలో ఆసక్తిని కలవాడై, తనపట్ల మిక్కిలి విరక్తిని కలవాడైన వాడెవడో), **"మాల్పాల్ మనమ్ శుళిప్ప మజ్గైయర్‌తోళ్ కైవిట్టు"** (శ్రియఃపతిపట్ల మనస్సు లగ్నం కాగా, కాంతలతో గల సంగాన్ని విడచి) ఇత్యాది ప్రమాణాలవల్ల భక్తి విరక్తికి సాధనమవుతుంది అనేది తెలుస్తున్నది. శ్రీమన్నాథమునులను స్తుతించే ఆళవందార్- **"నమోఽచింత్యాద్భుతాక్లిష్ట జ్ఞానవైరాగ్యరాశయే, నాథాయ మునయేఽగాథ భగవద్భక్తిసింధవే"** (ఊహించడానికి సాధ్యం కాని, ఆశ్చర్యకరమైన, సహజమైన

జ్ఞాన వైరాగ్యాల రాశి, అగాధ భగవద్భక్తికి సముద్రంవంటివారైన నాథమునులకు నమస్కారం.) అనే శ్లోకంలో భక్తిసాధ్యాలైన జ్ఞానవైరాగ్యాలను ఒక రాశిగా పల్కి, వాటికి సాధనమైన భక్తిని ప్రత్యేకంగా పలికారు. కనుక, జ్ఞానభక్తి విరక్తులలో మధ్యలో ఉండే భక్తియొక్క వైలక్షణ్యం **"పుత్ఱరవల్‌కుల్"** అనే పదంతో తెలుపబడినట్లయింది.

(పునమయిలే !) - నెమలికి ఆచార్యునకు పలు రీతులలో సామ్యాలున్నాయి.

1. నెమలి ఉండే చోట్లలో విషజంతువులు సంచరించవు. అదే రీతిలో **"యత్రాష్టాక్షరసంసిద్ధో మహాభాగో మహీయతే, న తత్ర సంచరిష్యంతి వ్యాధిదుర్భిక్ష తస్కరాః"** (అష్టాక్షరీ మంత్రంలో సిద్ధిని పొందిన మహానుభావుడు ఎక్కడ ఉన్నాడో, అక్కడ వ్యాధి, దుర్భిక్షం, చోరులు సంచరించరు.), **"కొన్డుయిరుణ్ణుమ్ విశాది పకై పశి తీయన ఎల్లామ్ నిన్డువ్వులకమ్ కడివాన్ నేమిప్పిరాన్‌తమర్ పోన్దార్"** (ప్రాణులను చంపి తినే రాక్షసులు మొదలైన విజాతులు, పగ, ఆకలి మొదలైన చెడ్డలు ఏవీ ఈ లోకంలో లేకుండా చేయడంకోసం శ్రీసుదర్శనధారి భక్తులు వచ్చారు) అనే రీతిలో మహానుభావులు ఉండే చోట ఏవిధమైన దోషం సంభవించదు.

2. నెమలికి సంతోషం కల్గిన కాలంలో అది పురిని విప్పి నాట్యమాడుతుంది. మహాత్ములు కూడా బ్రహ్మానందం తలమునకలు అయినపుడు తమ జ్ఞాన వికాసాన్ని చూపుతూ నడయాడుతారు.

3. "నెమలీ! ఓ నెమలీ! పింఛాన్ని వదలి పెట్టు'' అని అన్నంతలో నెమలి తన పింఛాన్ని విడువదు. దానిని శ్రమపెట్టినపుడే పింఛాన్ని సంపాదించాలి. అదే రీతిలో అనువృత్తిప్రపన్నాచార్యులైన మహాత్ములను **"మైత్రేయః పరిపప్రచ్ఛ ప్రణిపత్యాభివాద్య చ"** (మైత్రేయుడు నమస్కరించి, అభివాదన చేసి ప్రశ్నించాడు.) అని, **"ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా"** (నమస్కారం చేయడం ద్వారా, ప్రశ్నించడం ద్వారా, సేవించడం ద్వారా) అని పలికే రీతిలో మిక్కిలిగా అనువర్తించియే వారివల్ల జ్ఞానసంపాదనం చేయవచ్చు.

4. **"కరుజ్కణ్‌తోకైమయిల్పీలి యణిన్దు"** (నల్లని నెమలి పింఛాన్ని అలంకరించుకొని)అని, **"మకుటాలంబి మయూరపింఛమాలా"** (కిరీటంలో కూడా నెమలిపింఛాన్ని కలవాడు) ఇత్యాది క్రమంలో నెమలిలోని ఏకదేశమైన పింఛం భగవానుని కిరీటాన్ని అధిరోహించి ప్రకాశిస్తుంది. అదే రీతిలో, భగవానుడు ఆళ్వార్ల, ఆచార్యుల శ్రీసూక్తులను విని, తలను పంకించి శ్లాఘిస్తాడు.

5. నెమలి మేఘాన్ని చూడగానే ఆనందించి నాట్యం చేస్తుంది. మహాత్ములు కూడా **"కార్‌ముకిల్ పోల్ వణ్ణన్ కణ్ణన్ ఎమ్మానై చ్చొల్లి పాడి ఎఴున్దుమ్ పరన్దుమ్"** (నల్లని మేఘంవంటి వర్ణాన్ని కల స్వామిని గూర్చి పల్కి, పాడి, అంతటా వ్యాపించి తిరిగి) ఆనందంతో తుళ్ళిపడతారు.

6. నెమలిని చూడగానే సర్పాలు భయపడి పరుగుతీస్తాయి. మహానుభావులను చూడగానే కుటిలప్రవర్తనను కలవారు భయపడి, జంకి అక్కడ నుండి తొలగిపోతారు. ఈ విధంగా ఇంకా పలు సామ్యాలు భావ్యాలు.

(శెల్వప్పెణ్డాట్టి) - "కులమ్ తరుమ్ శెల్వమ్ తన్దిడుమ్" (కులాన్ని ఇస్తుంది, సంపదను ఇస్తుంది.) అనే చోట శెల్వపదానికి వివక్షితమైన భక్తి సంపదను కల్గి ఉండడం, "న స్త్రీ స్వాతంత్ర్య మర్హతి" (స్త్రీ స్వాతంత్ర్యానికి అర్హురాలు కాదు) అనే రీతిలో స్త్రీలవలె పారతంత్ర్యమే రూపుదిద్దుకొన్నట్లుండడం - దీనివల్ల చెప్పబడ్డాయి. ఇక, పాశురాన్ని మొదటినుండి అనుభవిద్దాం.

(కఱ్ఱుక్కఱవై) - **"కన్ఱు-కఱవై"** అని ఈ పదాన్ని విభజించవచ్చు. లేక, **"కఱ్ఱు+కఱవై"** అని విడదీయవచ్చు. **"కఱ్ఱు"**- **"గురుకులక్లిష్టో మురారిః కవిః"** (గురుకులవాసంలో శ్రమించి జ్ఞానాన్ని పొందిన మురారికవి) అనే రీతిలో గురుకులంలో చిరకాలం నివసించి, క్రమానుసారం విద్యలను అధికరించి- అని అర్థం. **"అంగుష్ఠాగ్రపరీణాహి జిహ్వాగ్రాయాసభీరవః, సర్వాంగీణ పరిక్లేశం సహంతే హంత! సంతతమ్"** (బొటనవేలు అగ్రమంత పరిమాణంలోని జిహ్వాగ్రాన్ని శ్రమపెట్టడానికి భయపడేవారు తరువాతి కాలంలో, తమ సమస్తమైన శరీరంయొక్క క్లేశాన్ని, అయ్యో! నిరంతరం సహిస్తున్నారు.) అని ఒక మహాకవి పలికాడు. బొటనవేలు అగ్రభాగం పరిమాణంలోని జిహ్వాగ్రాన్ని చిన్నవయస్సులో శ్రమపెట్ట డానికి జంకేవారు తరువాతి కాలంలో జీవితాంతం అన్ని అవయవాలను కష్టపెట్టి జీవించవలసి ఉంటుంది- అనేది ఈ శ్లోక భావం. అందువల్ల చిన్నతనంలో విద్య లను అభ్యసించాలని భావం.

(కఱవై) - కామధేనువువలె సకలార్థాలను స్రవించగల్గిన మహాత్ముల సన్నిధిలో -అని అర్థం.

(కణఙ్గళ్ పల కఱన్దు) - **"కణ"** మంటే చాలా చిన్న భాగానికి పేరు. ఒకేదినంలో విద్వాంసుడు కాలేడు. కొంచెం కొంచెం గానే విద్యను ఆర్జించాలి. **"క్షణః"** అనే

సంస్కృతపదంకూడా **"కణ"** మని కూఱుతుంది. **"క్షణశః కణశశ్చైవ విద్యామర్థం చ సాధయేత్"** (ప్రతిక్షణం, ప్రతికణం విద్యను, ధనాన్ని ఆర్జించాలి) అనే సూక్తిని స్మరించాలి.

(శెఱ్ఱార్ తిఱలఴియ చ్చెన్ఱు శెరుచ్చెయ్యుమ్) - నిరీశ్వరవాదం చేసేవారు, నిర్గుణబ్రహ్మవాదాన్ని చేసేవారు, భిక్షుకుని పరదైవమనే వారు, వేదాలను- అప్రమాణం అనేవారు, ఈశ్వరుడు అనుమానగమ్యుడనేవారు- ఈరీతిలోని దుర్వాదాలను చేసేవారు **"శెఱ్ఱార్"** అని అనబడతారు. అటువంటివారుండే చోటికి వెళ్ళి వాదయుద్ధాలను చేసి, సిద్ధాంతస్థాపనాన్ని చేయాలి- అని తెలిపిన రీతి ఇది.

(కుఱ్ఱ మొన్ఱిల్లాద) - ఆ విధంగా వాదయుద్ధాన్ని చేసేటపుడు దోషం ఒకటి సంభవిస్తుంది. అది ఏమి? అంటే- **"గురుం త్వంకృత్య హుంకృత్య విప్రం నిర్జిత్య వాదతః, శ్మశానే జాయతే వృక్షః కంకగృధ్రాదిసేవితః"** (గురువుతో "నీవంటే నీవు" అని వాదించి, హుంకరించి, విప్రుని వాదంలో నిర్జించి, తత్ఫలంగా శ్మశానంలో గద్దలు, రాబందులు మొదలైనవి వాలే చెట్టుగా జన్మిస్తాడు.) అనబడే ఒక దోషం సంభవిస్తుంది. ఈ దోషానికి ఏమాత్రం అవకాశం లేని రీతిలో వాదయుద్ధాన్ని చేసి- అని భావం. దర్శనస్థాపనార్థంగా చేసే వాదయుద్ధాలలో ఈ దోషం సంక్రమించదు- అని అంటారు ఒక వర్గంవారు. ఆచార్యపీఠాన్ని అధిరోహించినవారు తాము నేరుగా వాదయుద్ధాన్ని చేయకుండా (దశరథపుత్రుల ద్వారా విరోధి నిరసనం చేసిన విశ్వామిత్రమహర్షివలె) తమ శిష్యులను పురస్కరించుకొని దుర్వాది నిరసనాన్ని చేసే రీతి దీనిద్వారా తెలుపబడింది. ఈ క్రమం సంకల్ప సూర్యోదయంలో దేశికులచేత విశదీకరింపబడింది. **(మా సభాభుజంగీసర్వస్వ** మనే గ్రంథంలో దీనిని విశదంగా గమనించవచ్చు.)

(శుఱ్ఱత్తు త్తోழிమార్ ఎల్లారుమ్ వన్దు) - మహాత్ములు ఉండే చోట దేహబంధువులు, ఆత్మబంధువులు చేరి గుమిగూడి ఉంటారని భావం. దీనిని భగవద్రామానుజుల విషయంలో గమనించవచ్చు. ఎమ్బార్, ముదలియాణ్డాన్ వంటివారు స్వామికి దేహబంధువులు. కూరేశులు, కిడాంబి ఆచ్చాన్ వంటివారు ఆత్మబంధువులు.

(నిన్ ముఱ్ఱమ్ పుకున్దు ముకిల్‌వణ్ణన్ పేర్ పాడ) - **"ముఱ్ఱమ్"** (ముంగిలి) అనే పదం భాగవతోత్తములు సంచరించే చోటును తెల్పుతుంది. **"అణియరఙ్గన్ తిరుముఱ్ఱత్తడియార్‌తఙ్గళ్ ఇన్బమికు పెరుఙ్కుழுవు కణ్డు"**

(అందమైన శ్రీరంగంలోని స్వామి ఆలయం ముంగిటిలోని ఆనందాన్ని అనుభవించే భక్తుల గొప్ప గుంపును దర్శించి) అనే పెరుమాళ్ తిరుమొఴి శ్రీసూక్తిని గమనించవచ్చు.

(శిన్ఱాదే పేశాదే) - "శిన్ఱ వేణ్డా శిన్దిప్పే యమైయుమ్" (సందేహించవద్దు. భగవానుని ధ్యానమే చాలు.) (తిరువాయ్-9-1-7) అనే నమ్మాఴ్వార్ల ఆజ్ఞను సారంగా ఉండే స్థితి దీనిచే తెలుపబడింది.

12. కనైత్తిళఙ్గన్ఱెరుమై కన్టుక్కిరఙ్గి
నినైత్తు ములైవఴియే నిన్టు పాల్ శోర
ననైత్తిల్లమ్ శేఱాక్కుమ్ నఱ్చెల్వన్ తఙ్గాయ్!
పని త్తలై వీఴ నిన్ వాశల్కడై పఱ్ఱి
శినత్తినాల్ తెన్నిలఙ్గై క్కోమానై చ్చెఱ్ఱ
మనత్తుక్కినియానై ప్పాడవుమ్ నీ వాయ్ తిఱవాయ్!
ఇనిత్తాన్ ఎఴున్దిరాయ్ ఈదెన్న పేరుఱక్కమ్?
అనైత్తిల్లత్తారుమ్ అఱిన్దు ఏలోర్ ఎమ్బావాయ్

"కన్ఱు క్కఱవై" అనే పదకొండవ పాశురాన్ని "కనైత్తిళఙ్గత్తెరుమై" అనే ఈ పన్నెండవ పాశురాన్ని కలిపి చూస్తే ఒక విలక్షణమైన శాస్త్రార్థం వ్యక్తమవుతుంది. "కన్ఱుక్కఱవై" పాశురంలో "కఱవై క్కణఙ్గళ్ పల కఱన్దు" (పాలిచ్చే పశువుల గణాలను పెక్కింటిని పితికి) అని గోపాలుర కృత్యమైన పాలు తీయడమనే పని చేయబడినట్లుగా చెప్పబడింది. "కనైత్తిళఙ్గత్తు" అనే పాశురంలో ఆ కృత్యం చేయబడలేదని తెలుపబడింది. అది ఏ వాక్యంద్వారా తెలుపబడింది? అని అంటే, "కనైత్తిళఙ్గన్ఱెరుమై కన్టుక్కిరఙ్గి నినైత్తు ములై వఴియే నిన్టు పాల్ శోర ననైత్తిల్లమ్ శేఱాక్కుమ్" అనే సూక్తిద్వారా ఎనుముల వద్ద పాలను తీసేవారెవ్వరూ లేరని, దూడలను కట్టు విప్పేవారెవ్వరూ లేనందున దూడ నోటినుండి కాకుండా, పాలను పితికేవారి చేతినుండి కాకుండా, ఎనుములు తమ స్తనాల ద్వారానే పాలను స్రవిస్తూ, ఇంటిని అంతటిని తడిపి, బురద అయేటట్లు చేస్తున్నవి- అని తెలుపబడింది. పాలను పితుకవలసినవారు ఎందువల్ల పితుకలేదు? అనే ప్రశ్న ఇక్కడ వస్తుంది. దానికి సమాధానమే "నఱ్చెల్వన్" అనేది. నఱ్చెల్వన్" (గొప్ప సంపద కలవాడు) ఎవరు? అంటే- "శ్రీకృష్ణుని ఒకక్షణం అయినా విడిచి ఉండలేక, అనవరతం

శ్రీకృష్ణునితోకూడి సంచరించేవాడు. పెరియాఴ్వార్ తిరుమొఴిలో (3-4-3) **"శురికైయుమ్ తెఱివిల్లుమ్ శెణ్డుకోలుమ్ మేలాడైయుమ్ తోఴన్మార్ కొణ్డోడ, ఒరుకైయాల్ ఒరువన్తన్ తోళై యూన్ఱి"** (చురకత్తిని, వింటిని, ముల్లుకర్రను, ఉత్తరీయాన్ని తన స్నేహితుడు తీసికొని రాగా, ఒక చేతితో ఒకని భుజాన్ని ఆలంబనంగా చేసికొని) అని అనుగ్రహించారు. శ్రీకృష్ణుడు తనకు అంతరంగ ప్రియుడైన ఒక గోపాల బాలకుని బాహువులను ఆలంబనగా చేసికొని సంచరిస్తాడు- అని పలికారు. అతడు సదా, సర్వదా శ్రీకృష్ణునితో కలిగే ఉంటూ కాలక్షేపాన్ని చేసేవాడు కనుక, అతనికి తన జాతికి తగిన కృత్యమైన పాలను తీయడమనే వృత్తిని చేయడానికి ప్రసక్తి లేకుండా పోయింది- అని ఇక్కడ సూచింపబడింది. ఈ విధంగా, గడచిన పాశురంలో, పాలను తీయడమనే జాతికి తగిన కృత్యాన్ని చేసే రీతిని పల్కి, ఈ పాశురంలో అది చేయని క్రమం తెల్పినందు వల్ల, లోకంలో రెండు విధాలైన అధికారులున్నారని తెలుపబడినట్లయింది. కర్మానుష్ఠానంలోనే ఊనికను కలవారు కొందఱు; భగవత్కైంకర్యనిష్ఠచేత కర్మానుష్ఠానానికి అవకాశం పొందనందువల్ల దానిని చేయకుండా ఉండేవారు కొందఱు. ముందు చెప్పబడిన అధికారులు- **"కన్ఱు క్కఱవై"** పాశురంలో చెప్పబడినవారు. తరువాత చెప్పబడిన అధికారులు- ఈ పాశురంలో తెలుపబడిన వారు. ఆచార్యహృదయంలో - **"జాత్యాశ్రమ దీక్షైకళిల్ భేదిక్కుమ్ ధర్మఙ్గళ్పోలే అత్తాణి చ్చేవకత్తిల్ పొదువానదు నఴువుమ్"** (జాత్యాశ్రమదీక్షలలో భేదించే ధర్మాలవలె, అంతరంగకైంకర్యం నుండి సామాన్యమైన సేవ తొలగిపోతుంది) అనే చూర్ణికకు మణవాళమహామునులు కృపజేసిన వ్యాఖ్యానం స్మరణీయం.

శ్రీవిష్ణుపురాణంలో **"యది శక్నోషి గచ్ఛ త్వ మతిచంచల చేష్టిత!, ఇత్యుక్త్వాథ నిజం కర్మ సా చకార కుటుంబినీ"** (మిక్కిలి అల్లరి చేసేవాడా! ఇక నీకు సాధ్యమైతే ఇక్కడనుండి వెళ్ళు చూస్తాను- అని పల్కి, తరువాత ఆ గృహిణి అయిన యశోద తన గృహకార్యాలను నిర్వర్తించింది.) అనే శ్లోకానికి ఒక విశేషార్థాన్ని పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు. అది ఏమంటే- యశోదాదేవి శ్రీకృష్ణుని సంచరించలేని రీతిలో బంధించి, తరువాత ఆమె తన కృత్యాలను చేయడానికి పోయింది - అని ఈ శ్లోకంలో చెప్పబడడం - మన పూర్వాచార్యులు భగవానుని తిరువీథి ఉత్సవ సమయంలోని అనువృత్తిచేత నిత్యకర్మానుష్ఠానాన్ని విడచి, భగవానుని తిరువీథి ఉత్సవం ముగిసి, స్వస్థానం చేరిన తరువాత నిత్యకర్మా నుష్ఠానాన్ని అనుష్ఠించారు- అనేదానికి ఇది సూచనం- అని. ఈ విషయాన్ని ఇక్కడ గమనించాలి.

ఈ పాశురం, అనువృత్తిప్రసన్నాచార్యులుగా కాకుండా, కృపామాత్ర ప్రసన్నాచార్యులై ఉండే రీతిని తెల్పుతున్నది. లేత వయస్సులోని దూడలను కల ఎనుము తనదూడపట్ల కరుణించి (ఆ దూడ తన దగ్గర లేకపోయినా, భావనాప్రకర్షవల్ల తనవద్దనే ఉన్నట్లుగా) దానిని భావించి స్తనాలద్వారా పాలను స్రవించే రీతిలోనే, చిన్న చిన్న శిష్యులను కల్గిన ఆచార్యులు తమను ఆ శిష్యులు అనువర్తించక పోయినా, **"నణ్ణాదార్ మెయ్యిలూనాశై నిర్వేదత్తోడే ...తాయ్క్కుమ్, మకనుక్కుమ్, తమ్బిక్కుమ్, ఇవర్క్కుమ్, ఇవర్ అడిపణిన్దవర్క్కుమే ఇవై యుళ్ళదు"** (భగద్విముఖమైన లోకయాత్రలో, మురికి శరీరంలో, కర్మల వల్ల ఏర్పడే దేహానుబంధాలలో కలదోషాలను చూచి, దానివల్ల కలిగిన నిర్వేదంతో ఉపదేశించడం అనే స్వభావం.... జగన్మాత అయిన లక్ష్మీదేవికి, ప్రహ్లాదునకు, విభీషణునకు, నమ్మాళ్వార్లకు, ఆళ్వార్ల శ్రీచరణాలను ఆశ్రయించిన భగవద్రామానుజులకే ఉన్నది.) అనే ఆచార్యహృదయచూర్ణికలో అనుగ్రహించిన రీతిలోనే తామే స్వయంగా పరమకృపను చూపి, తమ అవతార ప్రయోజనాన్నిగూర్చి భావించి, పాలవంటి అర్థవిశేషాలను వెలువరిస్తారు- అనేది ఈ సందర్భంలోని స్వాపదేశార్థం. ఇక్కడ "ఎరుమై" అనేపదం "మహిషి" అనే అర్థాన్ని ఇస్తుంది కనుక, లక్షితలక్షణాప్రక్రియలో దేవదేవదివ్య మహిషీతుల్యులైన ఆచార్యులను ఈ పదం స్మరింపజేస్తుంది.

(ములై వழியే నిన్రు పాల్ శోర) - పాలిచ్చే పశువులు తమ నాల్గు స్తనాల ద్వారా పాలను స్రవించేటట్లే, ఆచార్యులుకూడా శ్రీభాష్యం, గీతాభాష్యం, భగవద్విషయం, రహస్యగ్రంథాలనే గ్రంథచతుష్టయంద్వారా అర్థాలను స్రవిస్తారు.

(నిన్రు పాల్ శోర) - "నిన్రు" -నిరంతరం ఎడతెరపి లేకుండా-అని అర్థం. వాల్మీకి భగవానుడు నారదమహర్షిని చూచి, కొన్ని కల్యాణగుణాలను ప్రస్తావించి, వీటిని కల్గిన ఒక మహాపురుషునిగూర్చి చెప్పాలి- అని అనగానే, **"ఇక్ష్వాకువంశప్రభవో రామో నామ జనైః శ్రుతః"** (ఇక్ష్వాకువంశానికి ప్రభువు, రాముడని జనులకు ప్రసిద్ధుడు) అని ప్రారంభించి వర్ణించాడు, నారద భగవానుడు. ఈ రీతిలోనే శ్రీవిష్ణుపురాణం, భగవద్గీతలు అల్పప్రార్థనతోనే అపరిమితక్షీరధారగా అవతరించడం ఇక్కడ అనుసంధేయం.

(ననైత్తు ఇల్లమ్ శేఱాక్కుమ్) - **"ఏఱడర్త్తతుమ్ ఏనమాయ్ నిలమ్ కీణ్డదుమ్ మున్ ఇరామనాయ్ మాఱడర్త్తదుమ్ మణ్ణళన్దదుమ్ శొల్లి ప్పాడి, వణ్పొన్ని ప్పేరాఱుపోల్ వరుమ్ కణ్ణ నీర్కొణ్డు అరఙ్గన్ కోయిల్ తిరుముఱ్ఱమ్ శేఱు శెయ్ తొణ్డర్"** (ఏడు ఎద్దులను మర్దించడం, వరాహమై భూమిని కొలువడం - పూర్వం శ్రీరాముడై శత్రువధను చేయడం, భూమిని కొలువడం - అనే ఈ లీలలను అనుసంధించి పాడి, కావేరీనదివలె ప్రవహించే కన్నీటితో, శ్రీరంగనాథుని ఆలయం ముంగిలిని బురదగా చేసే భక్తులు) (పెరుమాళ్ తిరు-2-3) అనే రీతిలోనే భగవద్గుణానుభవజనిత బాష్పధారలతో తాముండే చోటును బురద చేయడమే కదా పరమభాగవతులకు పని. **"కఙ్గులుమ్ పకలుమ్ కణ్తుయిల్ అఱియాళ్ కణ్ణనీర్ కైకళాలిఱైక్కుమ్"** (రాత్రి పగలు నిద్రించడం తెలియదు. కన్నీటిని చేతితో తుడుచుకుంటున్నది.) అని అన్నారు నమ్మాళ్వార్లు, **"పంకదిగ్ధస్తు జటిలో భరతః"** (కన్నీటివల్ల ఏర్పడిన పంకంలో పూయబడినవాడు, జటలను కలవాడు భరతుడు) అనబడే భరతాళ్వాన్ వలె ఉండే అనుభవరసికులను ఈ ప్రయోగం తెల్పుతున్నది.

(నఱ్చెల్వన్) - ఈ విధంగా ఉండడమేకదా విలక్షణమైన సంపద.

(తఙ్గాయ్!) - **"జ్యేష్ఠా"** అనే ప్రసిద్ధిని పొందిన దేవేరి రజస్తమోగుణాలు మూర్తీభవించినది. ఆమెకు **"తఙ్గై"**- చెల్లెలు అని మహాలక్ష్మికి ప్రసిద్ధి. పురుషకార కృత్యంలో ఈమెతో సాటి వచ్చేవారని ప్రకృత భావం.

"తఙ్గాయ్!" అనే చోట విలక్షణమైన ఒక అర్థాన్ని ఆలకించండి. కృష్ణ యజుర్వేదం మొదటి కాండ ఎనిమిదవ ప్రశ్నలో- **"ఏష తే రుద్ర భాగః సహ స్వస్రాఽంబికయా జుషస్వ"** అని అధ్యయనం చేయబడుతున్నది. (ఓ రుద్రా! తోబుట్టువు అయిన అంబికతో పాటు ఈ భాగాన్ని అనుభవించు) అనేది దీని అర్థం. **"స్వస్రా అంబికయా"** అని ఇక్కడ మూలంలో ఉన్నది. సంస్కృతంలో **"స్వసా"** అనే పదం చెల్లెలికి పేరు. రుద్రునకు అంబిక ఏవిధంగా చెల్లెలు అయినది? అనే సందేహం ఇక్కడ కల్గుతుంది. భట్టభాస్కరభాష్యంలో పలు రీతులలో దీనికి పొసగే సమాధానాలు చెప్పబడడం గమనించవచ్చు. వాటిలో ఒక సమాధానాన్ని వినండి. **"లక్షితలక్షణా"** అనే శాస్త్రమర్యాదానుసారం **"స్వసా"** అనే పదం తత్సమానార్థకమైన **"భగినీ"** అనే పదాన్ని తెలుపుతుంది. ఆ (భగినీ) పదానికి సౌభాగ్యవతి అనే అర్థం ఉన్నది. ఆ అర్థమే ఇక్కడ వివక్షితమై, "సౌభాగ్యవతి అయిన అంబికతో పాటు అనుభవించు'' **(సౌభాగ్యవత్యా అంబికయా సహ జుషస్వ)**- అని భట్టభాష్యంలో వివరింపబడింది- సౌభాగ్యవతి అనే అర్థం - **"స్వసా"** అనే పదానికి సాక్షాత్తుగా సంభవించకపోయినా, పూర్వం ఉపపాదించిన లక్షితలక్షణాక్రమంలో సంభవిస్తుంది.

ఈ క్రమాన్ని దివ్యప్రబంధాలలోకూడా స్పృశించిన సందర్భాలున్నాయి. ఇరణ్డామ్ తిరువన్దాది అనే ప్రబంధంలో **"కూన్దల్ వాయ్ కీణ్డానై"** అని పూదత్తాழ்వార్లు అనుగ్రహించారుకదా! **"కూన్దల్"** అనే ద్రావిడపదం కేశమనే సంస్కృతపదాన్ని స్మరింపజేయగా, తద్ద్వారా **"కేశిహంతా"** అనే అర్థం పర్యవసిస్తున్నది కదా ! కనుక, ఈ లక్షితలక్షణాక్రమం శాస్త్రీయం, సర్వసంప్రతిపన్నం అని గ్రహించాలి. **"తజ్గాయ్!"** అనే సందర్భంలో కూడా ఈ క్రమంలో అర్థం చూపడం శాస్త్రీయమే కాగలదు- అని తెలియాలి.

(పనిత్తలై వీழ நిన్ వాశల్ కడై పற்றி) - **"అటివై యెన్ను మముదవాటు తలైప్పற்றி వాయ్క్కొణ్డదే"** (జ్ఞానమనే అమృత ప్రవాహం ప్రవహిస్తున్నది) అనే పెరియాழ்వార్ తిరుమొழிసూక్తిని ఇక్కడ స్మరించాలి. ఆచార్యుని తిరుమాళిగ వాకిలిని ఆశ్రయించి ఉంటే జ్ఞానమనే అమృత ప్రవాహం ప్రవహిస్తుంది- అనేదానిలో సందేహం ఉన్నదా?

(శినత్తినాల్ ఇత్యాది) - **"శిన్నమ్"** అనే పదానికి **"శినమ్"** అనేది వర్ణలోపాన్ని పొందిన రూపం. **"శిన్నమ్"** అంటే గుర్తు. చిహ్నం. చిహ్నమనే సంస్కృతపదవికృతి. పంచసంస్కార క్రమంలో చిహ్నాలను ముద్రించి- అని అర్థం. **"తీయిల్ పొలిగిన్ఱ శెఞ్జుడరాழி తికழ் తిరుచ్చక్కరత్తిన్ కోయిల్ పొఱియాలే ఒற்றுణ్డు"** (సూర్య చంద్రులకంటే మిక్కిలిగా ప్రకాశించే ఎర్రని కాంతితో వెలిగే శ్రీసుదర్శనుడు వేంచేసిఉండే స్థానమై, ఆ చిహ్నంతో ముద్రింపబడి) ఉండేటట్లు చేసి - అని అర్థం.

(తెన్నిలజ్గై క్కోమానై చ్చెற்ற)- రావణుడు అనగానే **"న నమేయమ్"** (ఎవరికీ నమస్కరించను) అనేదే స్మరణకు వస్తుంది. **"వణఙ్గలిల్ అరక్కన్"** (నమస్కారం చేయని రక్కసుడు) అని, **"వణఙ్గా మన్ననాయ్ త్తోన్ఱి"** (నమస్కరించని ప్రభువై) అని అనుగ్రహించారు కదా!, తిరుమఙ్గైయాழ்వార్లు కూడా. అటువంటి అహంభావాన్ని పోగొట్టిన రీతి ఇక్కడ తెలుపబడింది.

(మనత్తుక్కు ఇనియాన్) - **"మననమ్"** అనే పదం **"కడైక్కుఱై"** (చివరి అక్షరం లోపించడం) అనే మార్పును పొంది మనమని రూపాన్ని పొందుతుంది. మననం చేయడానికి పరమభోగ్యులై ఉంటారు ఆచార్యులు. మనస్సు లోపల చేసిన చింతన బహిర్గతమై పాటగా పరిణమించి వెలువడినందున **"పాడవుమ్"** అని అనబడింది.

(నీ వాయ్ తిఱవాయ్) - అందఱు పాడడం సాధ్యమా ! కొందఱు పాడితే దానిని వినడానికి కొందఱు అధికారులు కావాలి కదా !

(ఇనిత్తాన్ ఇత్యాది) - సదాచార్యులు లభించిన తరువాతకూడా - అనిభావం. **"అనాది మాయయా సుప్తః"** (అనాదియైన మాయతో నిదురించినవాడై) అనే రీతిలో ఉండాలా? మాయానిద్ర నశించిపోయే కాలం సమీపించింది - అని ఆనందించాలి కదా! - అని తాత్పర్యం.

(అనైత్తిల్లత్తారుమ్ అఱిన్దు) - ఆచార్యులొక్కరిచే లోకం అంతా జ్ఞానాన్ని పొందేటట్లుగాకదా ఉన్నది. మూవాయిరప్పడి వ్యాఖ్యలో **"ఎమ్బెరుమానార్ తిరువవతరిత్తాప్పోలే కాణుమ్ ఇప్పెణ్ పిళ్ళైయుమ్"** (భగవద్రామానుజులు అవతరించినట్లుగా కదా, ఈ గోపిక ఉన్నది) అని పెరియవాచ్చాన్పిళ్ళై ఇక్కడ భగవద్రామానుజులను ప్రస్తావించడంకూడా గమనార్హం.

13. పుళ్ళిన్ వాయ్ కీణ్డానై ప్పొల్లా అరక్కనై
క్కిళ్ళి క్కళైన్దానై క్కీర్త్తిమై పాడి ప్పోయ్
పిళ్ళైకళ్ ఎల్లారుమ్ పావైక్కళమ్ పుక్కార్
వెళ్ళి ఎழுన్దు వియాழழమ్ ఉఱఙ్గిற்று
పుళ్ళుమ్ శిలమ్బిన కాణ్ పోదరి క్కణ్ణినాయ్!
కుళ్ళ క్కుళిర క్కుడైన్దు నీరాడాదే
పళ్ళిక్కిడత్తియో పావాయ్! నీ నన్నాళాల్
కళ్ళమ్ తవిర్న్దు కలన్దు ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురంలోని రస్యమైన ఒక అర్థాన్ని ముందుగా అనుభవిద్దాం. గడచిన పాశురంలో **"శినత్తినాల్ తెన్నిలజ్గై క్కోమానై చ్చెற்ற మనత్తుక్కినియానై ప్పాడవుమ్ నీ వాయ్ తిఱవాయ్"** (కోపంతో దక్షిణదిక్కులోని లంకానగరాధీశుని సంహరించిన, మనస్సుకు భోగ్యుడైన శ్రీరాముని కీర్తించినా నీవు నోఱు తెరవడం లేదే) అని శ్రీకృష్ణుని ప్రస్తావం ఏమీ లేకుండా శ్రీరాముని కీర్తించడంవల్ల, రేపల్లెలో ఒక పెద్ద కలకలం రేగింది. (అది ఏమంటే) శ్రీకృష్ణునకు అసాధారణస్థలమైన రేపల్లెలో శ్రీరాముని పేరును ఉచ్చరించడం దేవతాంతరనామాన్ని ఉచ్చరించడంతో సమానం కదా! **"రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాః"** (రాముడు, రాముడు, రాముడు - అని అయోధ్యలోని ప్రజలకు రామునిగూర్చిన కథనాలే అయినవి)

అనే రీతిలో అయోధ్యలో శ్రీకృష్ణుని నామాన్ని పల్కితే అక్కడ ఉండేవారు సహించి ఉండగలరా? రేపల్లెలో రామనామాన్ని ఎవరైనా పలుకాలని కోరితే బలరాముని నామాన్ని పలుకవచ్చునే తప్ప, "**తెన్నిలఙ్గై క్కోమానై చ్చెట్ర**" (దక్షిణదిక్కులోని లంకకు ప్రభువు రావణుని సంహరించిన) శ్రీరాముని పేరును ఇక్కడ చెప్ప వచ్చునా? అందులోను, రాముని "**మనత్తుక్కినియాన్**" (మనస్సుకు తీయనివాడు) అని అన్నందువల్ల, మన శ్రీకృష్ణుడు మనస్సుకు భోగ్యుడు కాడు - అని కదా స్ఫురిస్తున్నది. ఒక వ్యక్తి మనస్సుకు భోగ్యుడుగా కావాలి అంటే- దేహగుణావల్లగాని, ఆత్మగుణాలవల్ల కాని భోగ్యుడై ఉండాలి. ఈ రెండు గుణాలలోను శ్రీకృష్ణుడు ఉన్నతుడా? శ్రీరాముడు ఉన్నతుడా?- అని పరిశీలించి చూచినపుడు, శ్రీకృష్ణుడే చాలా గొప్పవాడు. మెడలో రాయబారపత్రాన్ని కట్టి, దూతగా పొమ్మని అనగానే, దూత్యాన్ని చేసిన మహాగుణం, "**మణివిడంబిని తస్య మనోహరే వపుషి మగ్నమనా ముని మండలీ, జప మముంచత, హోమ మముంచత వ్రత మముంచత వేద మముంచత**" (మణిని పోలిన ఆ మనోహరమైన శ్రీకృష్ణుని రూపంలో లగ్నమైన మనస్సును కల మునిసమూహం జపాన్ని విడచింది; హోమాన్ని విడచింది; వ్రతాన్ని విడచింది; వేదాన్ని విడచింది.) అని, "**యథార్హం కేశవే వృత్తి మవశాః ప్రతిపేదిరే**" (అవశులై తమకు తగిన రీతిలో కేశవునకు కైంకర్యాన్ని చేశారు) అని కీర్తింపబడే గుణం శ్రీరామునకు ఉన్నదా? "**ఎమ్మళకనార్ అణియాచ్చియర్ శిన్దైయుళ్ కుళకనార్**" (మన అందగాడు, అందమైన గోపికల మనస్సులలోని సుందరుడు) అని కీర్తింపబడే అతిశయంకూడా మన శ్రీకృష్ణునకేకదా అసాధారణం! గీతాచార్యుడైన అతిశయంకూడా అనితరసాధారణంకదా! లేక, శ్రీరాముడే "**మనత్తుక్కు ఇనియాన్**" (మనస్సుకు భోగ్యుడు) కానివ్వండి. మన భర్త కురూపి, మూర్ఖుడు- అనే కారణంచేత సుందరుడు, మేధావి అయిన పరమపురుషుని ప్రేమించడం తగునా!- అని అంటూ ఈ విధంగా రేపల్లెలో వివాదాల కోలాహలం వృద్ధి చెందింది. మర్మాన్ని తెలిసినవారు- "అయ్యో! ఇదేమి వ్యర్థమైన వివాదం! "శ్రీరాముడు వేఱు; శ్రీకృష్ణుడు వేఱు'' అనే ఈ అయుక్తమైన భావన మీకు ఏవిధంగా కల్గింది? యశోద శ్రీకృష్ణుని పిలిచేటపుడు "**వరుక వరుక ఇఙ్గే వామననమ్బీ! వరుక ఇఙ్గే !**" (ఇక్కడకు రా రా, ఓ వామనమూర్తీ ఇక్కడకు రా) అని పలుమార్లు పిలువడం మీరు వినలేదా? ఓ గోపికలారా! మీరు కూడా మీ పిచ్చుక గూండ్లను కట్టుకొన్నపుడు వాటిని శ్రీకృష్ణుడు కూలగొట్టగా, "**శీదైవాయముదముణ్డాయ్! ఎఙ్గళ్ శిట్రిల్ నీ శిదైయేల్**" (సీతాదేవి అధరాన్ని ఆస్వాదించినవాడా! మా గుజ్జన

గూళ్ళను నీవు చిదిపివేయకు) అని అనలేదా! సరసీతటంలో శ్రీకృష్ణుడు మీ వస్త్రాలను అపహరించినపుడు "**ఇరక్కమేలొన్రు మిలాదాయ్! ఇలఙ్గై యళిత్త పిరానే!**" (ఏమాత్రం దయ లేనివాడా! లంకను నాశనం చేసినవాడా) అని మీరు అనలేదా! అని ఈ విధంగా పలు మాటలు పల్కి సమాధానపఱచగా, ఒక విధంగా సమాధానపడిన గోపికలు, "శ్రీకృష్ణుడు, శ్రీరాముడు - అనే ఇద్దఱిని కీర్తిద్దాం. శ్రీకృష్ణుడే మనకు కులదైవం కనుక అతనిని ముందుగా పాడి, తరువాత శ్రీరాముని పాడుదాం'' అని పల్కి, ఆ రీతిలోనే "**పుళ్ళిన్‌వాయ్ కీణ్డ**" (బకాసురుని నోటిని చీల్చిన) శ్రీకృష్ణుని కీర్తిని పాడేవారు ముందు గోష్ఠిగాను, "**పొల్లా అరక్కనై క్కిళ్ళి క్కళైన్ద**" (దుష్ట రాక్షసుని గిల్లి పారవేసిన) శ్రీరాముని కీర్తిని పాడేవారు తరువాత గల గోష్ఠిగాను అమరి ఉండి పాడుతూ, భగవన్నామానుసంధానాన్ని చేశారనే అర్థస్వారస్యం ఈ పాశురంలో అనుసంధేయం.

ఈ పాశురంలో "**పోదరి క్కణ్ణినాయ్, పావాయ్**" అనే రెండు సంబోధనలు ముందుగా గమనించదగినవి. "**బోధః**" అనే సంస్కృతపదం "**పోదు**" అని మాఱుతుంది. "**పోదిఱ్కమల వన్నెఙ్జమ్**" అనే పెరియాళ్వార్ తిరుమొళిలో కూడా ఇది ప్రయోగింపబడింది. బోధమంటే జ్ఞానం. దానిని హరించడంలో దృష్టిని కల ఒక విలక్షణాధికారి ఈ పదంతో సంబోధింపబడ్డారు. "జిజ్ఞాసువైన ఓ అధికారీ!'' అని సంబోధించినట్లయింది. "**పావాయ్**" - "**పావై**" అని బొమ్మకు పేరు. అది పెట్టిన చోటులోనే ఉంటుంది. అదే రీతిలో పారతంత్ర్యమే స్వరూపంగా ఉండే ఓ అధికారీ!- అని ఇక్కడ భావం.

(పిళ్ళైకళ్ ఎల్లారుమ్ పావైక్కళమ్ పుక్కార్) - "**పావైక్కళమ్**" అని కాలక్షేపం చేసే కూటానికి (కేంద్రానికి) పేరు. "**పిళ్ళైకళ్**" అనే పదం సబ్రహ్మచారులను తెల్పుతుంది. 'మనవారు అందఱు కాలక్షేపస్థలానికి పోయి చేరారు.' అని దీనిచే తెలిపినట్లయింది. పోయినవారికి పాథేయం ఏదో అది ముందు రెండు పాదాలలో తెలుపబడింది.

"**పుళ్ళిన్‌వాయ్ కీణ్డాన్**" (బకాసురుని నోటిని చీల్చినవాని) కీర్తిని పాడుతూ పోయారు. "**పొల్లా అరక్కనై క్కిళ్ళి క్కళైన్దాన్**" (దుష్టరాక్షసుని అవలీలగా సంహరించినవాని) కీర్తిని పాడుతూ పోయారు- అని అంటున్నారు. శ్రీకృష్ణుడు "**పళ్ళత్తిల్ మేయుమ్ పఱవై యురుక్కొణ్డు కళ్ళవశురన్ వరువానై తాన్ కణ్డు, పుళ్ళిదు వెన్రు పాదుక్కోవాయ్ క్కొన్డు**" (జలప్రదేశంలో ఆహారాన్ని వెదుకుతూ

తిరిగే కొంగరూపాన్ని దాల్చి కపటాన్ని కల అసురుడు రావడం గమనించి, శ్రీకృష్ణుడు, "ఇది ఒక పక్షి'' - అని అంటూ శీఘ్రంగా వధించాడు.) ఇటువంటి ఆసురప్రకృతిని కలవారై, ప్రచ్ఛన్న బౌద్ధులనే ప్రసిద్ధి పొందినవారిని నోరు తెరువనీయకుండా వారి నోరు మూసికొనేటట్లు చేసినవారైన ఆచార్యసార్వభౌముల గొప్పతనం దీనిద్వారా తెలుపబడింది. మూలంలో బకాసురుని తెలుపడం ఉపలక్షణంగా గ్రహించి, ఆ అసురునివంటివారిని ఇంకా పలువురిని గ్రహించవచ్చు. కనుక, అంతరార్థంలో కూడా **"తఱ్కచ్చమణరుమ్ శాక్కియ ప్పేయ్కళుమ్ తాఴ్శడైయోన్ శొల్ కఱ్ఱ శోమ్బరుమ్ శూనియవాదరుమ్ నాన్మఱైయుమ్ నిఱ్కక్కుఱుమ్బు శెయ్ నీశరుమ్"** (కుతర్కాలను చేసే తార్కికులు, పిశాచాల వంటి బౌద్ధులు, రుద్రుని సూక్తులను అభ్యసించే శైవులు, శూన్యవాదులు, నాల్గు వేదాలకు అపార్థాలను పలికే మాయావాదులైన నీచులు) అనే పలువురు ఆసుర ప్రకృతి కలవారిని గ్రహించడం యుక్తం. కృత్రిమబుద్ధితో ఎదిరించి వచ్చే వారందఱిని నోరు మూసికొనేటట్లు చేసిన రీతి దీనిద్వారా సూచింపబడింది.

(పొల్లా అరక్కనై క్కిళ్ళి క్కళైన్దానై క్కీర్తిమై పాడి) - శ్రీకృష్ణావతారంలో అసురులు, శ్రీరామావతారంలో రాక్షసురులు ఎదిర్చి నశించిపోయినట్లు ఇతిహాసాల వల్ల తెలిసికొంటున్నాము. ఆ అసుర - రాక్షసులనే రెండు వర్గాలకు చెందినవారు ఆచార్యుల కాలంలో ఎదిర్చి నశించిపోయారు. ఆళ్వార్లు **"పొలిక పొలిక పొలిక"** దశకంలో **"అశురర్ అరక్కర్ పిఱన్దీర్ ఉళ్ళీరేల్ ఉయ్యుమ్ వకై యిల్లై తొణ్డీర్"** (దాసులారా! అసురులు, రాక్షసులు జన్మించి ఉంటే వారికి ఉజ్జీవించే దారి లేదు సుమా!) అని పల్కడం భగవద్రామానుజుల కాలంలో జరుగబోయే సంఘటనను ముందుగా దర్శించి అనుగ్రహించిన సూక్తి కనుక, ఆ పాశురంలో పల్కిన అసుర-రాక్షసనాశాన్ని ఆచార్యసార్వభౌములు నిర్వహించినట్లుగా గ్రహించడంలో ఏ కొఱత లేదు. ఇటువంటి గొప్పతనాన్ని కల్గిన ఆచార్యుల దివ్య కీర్తిని అనుసంధానం చేస్తూ పలువురు భక్తులు కాలక్షేపగోష్ఠికి వచ్చి చేరిన సంగతి తెలుపబడింది.

(వెళ్ళి ఎழுన్దు వియాழమ్ ఉఱఙ్గిఱ్ఱు) - దీనిద్వారా సుప్రభాతలక్షణం తెలుపబడింది. అజ్ఞానాంధకారం తొలగి చక్కని జ్ఞానోదయం కలిగే కాలం సమీపించింది- అని సూచింపబడిన రీతి ఇది.

(పుళ్ళుమ్ శిలమ్బిన) - కోకిల, కొంగ, హంస, గరుడపక్షి- అనే ఈ నాల్గు పక్షులను ప్రస్తావించి, పరమభాగవతులకు వాటిలో ఒక్కొక్కటితో సాటి పల్కడం

సంప్రదాయం. కంఠధ్వనిలో కోకిలవంటివారు, ఏకాగ్రచిత్తతలో కొంగవంటివారు, సారగ్రహణంలో హంసతో పోలినవారు, **"దాస స్సఖా వాహన మాసనం ధ్వజః"** (దాసుడు సఖుడు, వాహనం, ఆసనం, ధ్వజం) ఇత్యాదిగా భగవానునకు పలు రీతులలోని దాస్యాలను చేయడంలో పక్షిరాజువంటివారు ఇక్కడ స్మరణీయులు. అటువంటి వారు గొప్ప సంరంభం చేస్తూ బయలుదేరారు- అని భావం.

(కుళ్ళక్కుళిర ఇత్యాది)- నీరాడడం అంటే -జ్ఞానఘట్టంలో ప్రవేశించి అవగాహించడం- అంటే భగవదనుభవం. **"కుడైన్దు నీరాడుకై"**- అంటే లోపల మూలలో గుప్తంగా ఉండే అర్థవిశేషాలలో దేనినీ విడువకుండా పరిపూర్ణావగాహనం చేయడం. దీనివల్ల సకల తాపాలు తీరి, ఆత్మపర్యంతమైన చల్లదనం కల్గుతుంది కనుక, అది స్ఫురించేటట్లుగా **"కుళ్ళక్కుళిర"** అని పలుకబడింది. ఈ రీతిలో అవగాహించాలని తెలుపబడినట్లయింది.

(పళ్ళిక్కిడత్తియో) - **"పళ్ళి"**- అంటే విద్య. దానిలో ఊనికను, ప్రాధాన్యాన్ని కల్గి ఉండడమే **"పళ్ళి క్కిడత్తల్"**. **"ఓ"** అనేది ఇక్కడ ఆశ్చర్యాన్ని సూచిస్తున్నది.

(నన్నాళ్) ఇటువంటి ఉత్తమాధికారిని సేవించగల్గినందులకు ఆనందించి, "అద్య మే సఫలం జన్మ సుప్రభాతా చ మే నిశా" (ఈనాడు నా జన్మ సఫలం అయినది; నా రాత్రి తెల్లవారింది) అని అనుసంధించిన రీతి ఇది.

(కళ్ళమ్ తవిర్న్దు కలన్దు) - పరమభోగ్యమైన విషయాన్ని ఏకాంతంగా, ఒంటరిగా అనుభవించడం దొంగతనం. దానిని మాని అందఱితో కలసి, కూడి అనుభవించడం సంభవించాలి- అని భావం.

14. ఉఙ్గళ్ పుழైక్కడై తోట్టత్తు వావియుళ్
శెఙ్గழுనీర్ వాయ్ నెకిழ்న్దు ఆమ్బల్వాయ్ కూమ్బినకాణ్
శెఙ్గల్ పొడిక్కూఱై వెణ్ పల్ తవత్తవర్
తఙ్గళ్ తిరుక్కోయిల్ శఙ్గిడువాన్ పోకిన్ఱార్
ఎఙ్గళై మున్నమ్ ఎழுప్పువాన్ వాయ్ పేశుమ్
నఙ్గాయ్! ఎழுన్దిరాయ్! నాణాదాయ్! నావుడైయాయ్
శఙ్గొడు శక్కరమ్ ఏన్దుమ్ తడక్కైయన్
పఙ్గయక్కణ్ణానై ప్పాడ ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురంలో “**నజ్ఞాయ్, నాణాదాయ్, నావుడైయాయ్**” అనే మూడు సంబోధనలు ఆచార్యసార్వభౌముల గొప్పతనానికి తగిన సంబోధనలు. ఉత్తమపురుషులను “నమ్బి” అని, ఉత్తమస్త్రీలను “నజ్జై” అని వ్యవహరించడం సంప్రదాయం. అన్ని విధాలైన పూర్ణతలను కలవారినే ఈ పదాలతో నిర్దేశిస్తారు. **“శొల్లార్ తమిழ்ఒరు మూన్రుమ్ శురుదికళ్ నాన్గుమ్ ఎల్లై యిల్లా అఱ నెఱి యావుమ్ తెరిన్దవన్”** (ఇయల్, ఇశై, నాటకమ్- అనే విభాగాలతో పూర్ణమైన ద్రావిడభాషను, నాల్గు వేదాలను, అంతులేని ధర్మశాస్త్రాలను అన్నిటినీ తెలిసినవారు, శ్రీరామానుజులు) అని ఇరామానుశ నూఱ్ఱన్దాదిలో పల్కిన రీతిలోనే సకలవిధ పాండిత్యాలను నిండుగా కల, అనుష్ఠానసంపద పరిపూర్ణంగా కల శ్రీరామానుజుల యొక్క గొప్పతనాన్ని “నజ్ఞాయ్!” (గుణపూర్ణా) అనే సంబోధనద్వారా తెలిపినట్లయింది.

(నాణాదాయ్!) -“నాణ్” అనేది లజ్జకు వాచకమైనట్లే, అహంకారానికికూడా పేరు. దేశికులు అమృతాస్వాదినీ అనే ప్రబంధంలో చివరలో **“కాణ్బనవు మురైప్పనవు మఱ్ఱొన్రిన్రి”** అనే పాశురంలో **“నాణ్‌పెరియోమల్లోమ్”** అనే ప్రయోగాన్ని చేయడాన్ని గమనించాలి. ‘‘మేము అహంకారాన్ని మిక్కిలిగా కల్గినవారం కాము’’ అన్నదే కదా దీని భావం. అందువల్ల **“నాణాదాయ్”** అంటే - అహంకారం లేనిదానా !- అని అర్థం. ఇది మమకారరాహిత్యానికికూడా ఉపలక్షణం. **“నీర్ నుమదు ఎన్రివై వేర్‌ముదల్ మాయ్‌త్త”** (అహంకారమమకారాలను సమూలంగా పోగొట్టుకొనిన) వారిలో గొప్పవారని - అనియే భావం.

(నావుడైయాయ్!) - లోకంలో ఎవరికి జిహ్వా ఉండదు? అందఱికీ ఉంటుంది. ఎవరి జిహ్వావల్ల లోకం అంతా ఉజ్జీవిస్తున్నదో, వారే నిజంగా జిహ్వాను కలవారు. సీతాదేవి హనుమానుని చూచి, **“వాచా ధర్మమవాప్నుహి”** (వాక్కుతో ధర్మాన్ని పొందు) అని అన్నది. జిహ్వాను కల్గి ఉన్నందుకు ప్రయోజనాన్ని పొందుదువుగాక !- అని అన్నది. **“సా జిహ్వా యా హరిం స్తౌతి”** (హరిని స్తుతించేదే నాలుక)అని అన్నారు, ఒకరు. **“సా జిహ్వా స్యాత్ యయా సర్వే జీవంతి ప్రాణినో భువి”** (ఏ జిహ్వావల్ల అన్ని ప్రాణులు భూమిలో జీవిస్తున్నాయో, అదే జిహ్వా) అని అన్నారు, ఇంకొకరు. **“సా జిహ్వా యత్ర రాజంతే విద్యా హృద్యా శ్చతుర్దశ”** (అందమైన పదునాల్గు విద్యలు అందంగా ఏ జిహ్వాలో ప్రకాశిస్తున్నాయో, అదే జిహ్వా) అని అన్నారు, మఱి ఒకరు. వీటివల్ల తెలిసినదేమి? భగవానుని స్తుతించే జిహ్వాయే జిహ్వా. లోకానికి అంతటికి ఉపకారం చేసే జిహ్వాయే జిహ్వా. పదునాల్గు విద్యలను

తనలో కల్గి ఉండే జిహ్వాయే జిహ్వా- అని వీటివల్ల తెలిసినది. ఇటువంటి జిహ్వాను కల్గి ఉండడాన్ని భగవద్రామానుజుల విషయంలో దర్శించవచ్చు. (1) శరణాగతి గద్యం మొదలైనవానితో భగవానుని అద్భుతంగా స్తుతించిన జిహ్వాను కలవారు (2) **“ఉక్త్యా ధనంజయవిభీషణలక్ష్యయా తే ప్రత్యాయ్య లక్ష్మణమునేః భవతా వితీర్ణమ్, శ్రుత్వా వరం తదనుబంధిమదావలిప్తే నిత్యం ప్రసీద భగవన్! మయి రంగనాథ!”** (ఓ రంగనాథస్వామీ! అర్జునుని, విభీషణుని ఉద్దేశించి నీవు పల్కిన నీ మాటచే నమ్మికను పొందింపబడి, శ్రీరామానుజులకు నీచే అనుగ్రహింప బడిన సూక్తిని విని తెలిసి, వారి సంబంధంచే గర్వాన్ని- గొప్ప నమ్మికను- నిండుగా కల నా విషయంలో ఎల్లప్పుడు అనుగ్రహించు.) అని న్యాసతిలకంలో దేశికులు. **“కాలత్రయేఽపి కరణత్రయనిర్మితాతిపాపక్రియస్య శరణం భగవత్ క్షమైవ, సా చ త్వయైవ కమలారమణేఽర్థితా యత్ క్షేమ స్స ఏవ హి యతీంద్ర! భవచ్ఛ్రితానామ్”** (మూడు కాలాలలోను త్రికరణాల ద్వారా పలు విధాలైన అంతు లేని పాపాలను చేసినవానికి భగవానుని దయ ఒక్కటే శరణం. ఆ దయను నీవు మా కోసం శ్రీరంగనాథుని వద్ద వేడావు. యతీంద్రా! నీభక్తులందఱికి అది ఒక్కటేకదా క్షేమం) అని యతిరాజవింశతిలో మణవాళమహామునులు అనుగ్రహించిన రీతిలో వరాన్ని పొంది, శ్రీవైష్ణవలోకాన్ని అంతటిని ఉజ్జీవింపజేసిన జిహ్వాను కలవారు. శ్రీమద్రహస్యత్రయసారంలో ఎనిమిదవ అధికారమైన అధికారవిభాగాధికారంలో- **“ఒరు మలైయిల్ నిన్రుమ్ ఒరు మలైయిల్ తావుమ్ సింహశరీరత్తిల్ జన్తుక్కళ్‌పోలే, భాష్యకారర్ సంసారలంఘనమ్ పణ్ణ, అవరోడుణ్డాన కుడల్‌తుడక్కాలే నామ్ ఉత్తీర్ణరావుదోమ్ - ఎన్రు ముదలియాణ్డాన్ అరుళిచ్చెయ్‌ద పాశురమ్”** (ఒక పర్వతం నుండి ఇంకొక పర్వతానికి దూకే సింహశరీరంలోని జంతువులవలె, శ్రీభాష్యకారులు సంసారలంఘనం చేయగా వారితో కల గర్భసంబంధం (దేహసంబంధం) వల్ల మనం ఉత్తీర్ణులమైనాము- అని ముదలియాణ్డాన్ శ్రీసూక్తి) ఇక్కడ విశేషించి అనుసంధేయం. **(3) “జయతి సకలవిద్యావాహినీజన్మశైలః”** (సమస్త విద్యలనే నదులు పుట్టే పర్వతమైన శ్రీరామానుజులు వర్ధిల్లాలి) అనే రీతిలో సకల విద్యలు పరిమళించే జిహ్వాను కలవారు శ్రీరామానుజులే. కనుక, **“నజ్ఞాయ్, నాణాదాయ్, “నావుడైయాయ్”** అనే మూడు సంబోధనలు భగవద్రామానుజులకు పొసగేవి. ఇక, పాశురంలో మిగిలిన పదాలు అన్నీ శ్రీరామానుజులకే పొసగే రీతిని వివరిస్తాము.

(ఉజ్గళ్ పుழக్కడై త్తోట్టత్తు ఇత్యాది) - పాంచరాత్రశాస్త్రంలో భగవానునకు చేసే తిరువారాధనక్రమాలనుగూర్చి తెలిపే సందర్భంలో “భగవానునకే చేసే

ఉపచారాలను మహారాజుకు చేసే ఉపచారాలవలె భావించి చేయాలి'' అని చెప్పబడింది. **"తమేవ మత్వా పరవాసుదేవం రంగేశయం రాజవదర్హణీయమ్"** (పరవాసుదేవుడు, ప్రభువువలె పూజింపదగినవాడుగా శ్రీరంగనాథుని తలచి) అనే తిరుప్పళ్ళియెழுచ్చి తనియన్‌కూడా దానినే బలపఱుస్తున్నది. లోకంలో పరిపాలన సాగిస్తున్న రాజువలె భగవానుడు **"అరుళార్ తిరుచ్చక్కరత్తాల్ అకల్ విశుమ్బుమ్ నిలనుమ్ ఇరుళార్ వినై కెడ చ్చెఙ్గోల్ నడావుదిర్"** (దయను పూర్ణంగా కల్గిన శ్రీసుదర్శనంతో పరమపదాన్ని, భూలోకాన్ని ఏవిధమైన దుఃఖం కలుగకుండా పాలనను సాగిస్తున్నారు) అని నమ్మాழ்వార్ల శ్రీసూక్తి రీతిలోను, **"పాఙ్గోదమ్ శూழ்న్ద పువనియుమ్ విణ్ణులకుమ్ అఙ్గాదుమ్ శోరామే ఆళ్కిన్ఱ ఎమ్బెరుమాన్ శెఙ్గోలుడైయ తిరువరఙ్గచ్చెల్వనార్"** (సముద్ర పరివేష్టితమైన భూమి, పరమపదం- అనే వీటిలో ఏదీ జారకుండా ఏలోటు లేకుండా పాలించే స్వామి రాజదండాన్ని కల శ్రీరంగ నాథుడు) అనే గోదాదేవి పాశురరీతిలోను శాసనదండాన్ని నిర్వహించే క్రమంలో, **"తిరువుడై మన్నరై క్కాణిల్ తిరుమాలై కణ్డేనే ఎన్నుమ్"** (సంపదను కల ప్రభువులను చూస్తే "శ్రియఃపతిని చూచాను'' అని అంటున్నది) అనే తిరువాయ్ మొழி పాశురానికి తగినట్లుగా ప్రభువుయొక్క స్వభావాలు, భగవానుని స్వభావాలు చాలా పోలికను కల్గి ఉంటాయి- అనే విషయాన్ని గమనించవచ్చు. ఏవిధంగా? అంటే, ప్రభువుయొక్క పద్ధతులను అయిదు విధాలుగా గమనిస్తున్నాము.

1. ప్రభువు పగటి సమయంలో సకలపరిజనసేవితుడై, తన ఠీవి ప్రకాశించేటట్లుగా న్యాయాసనంలో వేంచేసి ఉండి, దర్శనాన్ని ఇచ్చి, నీతిని ప్రవర్తింపజేస్తాడు.

2. రాజ్యంలోఉండేవారి గుణదోషాలను తెలిసికోవడంకోసం రాత్రివేళ ఇతరులు గుర్తించకుండా ఉండేటట్లు నల్లని దుస్తులను ధరించి నగరశోధనాన్ని చేస్తాడు.

3. రాజ్యంలో శిక్ష, రక్షణల కోసం తాను ఒంటరిగా కార్యవిచారాలను చేస్తాడు.

4. దుష్టమృగాలను నిరసించడంకోసంగా వేటాడతాడు.

5. తాను వేటాడిన శ్రమ తీరేటట్లు పూదోటలలో ఇష్టజనంతో క్రీడిస్తాడు.

ఈ విధంగా ఈ అయిదు లోకంలో కన్పించే ప్రభువులకు తగిన స్థితులు. **"పారళన్ద పేరరశే! ఎమ్ విశుమ్బరశే! ఎమ్మై నీత్తు వఞ్జిత్త ఓరరశే!"** (భూమిని కొలిచిన ఓ గొప్ప ప్రభూ ! పరమపదాన్ని ఏలే మా ప్రభూ! మమ్ములను వంచించిన ఓ అద్వితీయప్రభూ!)(తిరువిరుత్తమ్)అని పలుకబడిన యువరాజైన సర్వేశ్వరునకు కూడా ఇటువంటి అయిదు స్థితులు ఉన్నాయి. అవి ఏవిధంగా అంటే-

1. ప్రభువులు పగటివేళ పరిజనపరివారసేవితుడై **"శీరియ శిఙ్గాశనమ్"** (అందమైన సింహాసనం) లో వేంచేసి ఉండేటట్లే, భగవానుడు కూడా చీకటి కలవని పగలువలె ప్రకాశించే పరమపదంలో **"వైకుంఠే తు పరే లోకే శ్రియా సార్ధం జగత్పతిః, ఆస్తే విష్ణురచింత్యాత్మా భక్తైర్భాగవతైస్సహ"** (గొప్ప లోకమైన వైకుంఠంలో జగత్పతి అయిన విష్ణువు లక్ష్మీదేవితో పాటు భక్తులతో భాగవతులలో కలసి ఉన్నాడు)అనే రీతిలో నిత్యులు, ముక్తులు సేవిస్తూ ఉండగా తన దేవేరులతో పాటు ఏకచ్ఛత్రాధిపత్యాన్ని చెలాయిస్తాడు.

2. ప్రభువు రాత్రివేళ ఇతరులకు తెలియనట్లుగా నల్ల దుస్తులను ధరించి నగరశోధనాన్ని చేసేటట్లే, భగవానుడు కూడా **"ఇవఱ్ఱుళ్ ఎఙ్గుమ్ మఱైన్దుఱైవాయ్"** (ఈప్రాణులన్నిటిలో గుప్తంగా - అంతర్యామిగా - ఉన్నావు) (తిరువాయ్మొழி) అనే రీతిలో జీవులలో మఱుగున ఉండి, **"ఉళ్ళువారుళ్ళిఱ్ఱెల్లామ్"** (ఆరాధించేవారి మనస్సులలో ఉండే అన్నిటిని) తెలిసికొంటాడు.

3. ప్రభువు తన రాజ్యంలో శిక్షను అమలు చేయడంకోసం, రక్షించడంకోసం ఏకాంతంగాను, అంతరంగులతోను కలసి కార్యవిచారాన్ని చేసేటట్లే, భగవానుడు కూడా **"పాఱ్కడల్ యోగనిద్దిరై శిన్దై శెయ్‌త ఎన్దాయ్ !"** (క్షీరాబ్ధిలో యోగనిద్రను చేసే తండ్రీ!) అనేటట్లు వాసుదేవ- సంకర్షణ- ప్రద్యుమ్న- అనిరుద్ధులనే వ్యూహ రూపాలను పొంది, **"ఉఱఙ్గువాన్ పోల్ యోగు"** (నిద్రించేవానివలె యోగనిద్రను) చేస్తాడు.

4. రాజు దుష్టసత్త్వనిరసనార్థంగా వేటను ఆడేటట్లే, భగవానుడుకూడా **"కాట్టై నాడి త్తేనుకనుమ్ కళిఱుమ్ పుళ్ళుముడన్ మడియ వేట్టై యాడి వరువానై విరున్దావనత్తే కణ్డోమే"** (అరణ్యంలో అన్వేషించి ధేనుకాసురుడు, కువలాయాపీడం, బకాసురుడు మరణించేటట్లు వేటాడి వచ్చేవానిని) అనే రీతిలో ఆశ్రితవిరోధులైన ధేనుకాసురుడు, ప్రలంబుడు, కాళియుడు మొదలైన దుష్టసత్త్వాలను పూర్తిగా నిర్జించాడు.

5. ప్రభువు వేటాడిన శ్రమ తీరడంకోసం పూదోటలలో అభిమతజనంతో కలసి క్రీడించేటట్లే, భగవానుడుకూడా విరోధినిరసనశ్రమం తీరేటట్లుగా **"ఆరామమ్ శూழ்న్ద అరఙ్గమ్ కణమఙ్గై క్కారార్ మణినిఱ క్కణ్ణనూర్ విణ్ణగరమ్ శీరార్ కణపురమ్ శేఱై తిరువழுన్దూర్ కారార్ కుడన్దై కడిగై కడల్‌మల్లై ఏరార్ పొழிల్**

శూழ் ఇడవెన్దై నీర్మలై శీరారుమ్ మాలిరుమ్శోలై తిరుమోకూర్... పుకழுమ్ వదరి వడమదురై" (తోటలచే పరివేష్ఠితమైన శ్రీరంగం, తిరుక్కణ్ణమజ్గై, నీలమణివలె ప్రకాశించే శ్రీకృష్ణుడు వేంచేసి ఉన్న ఊరు తిరువిణ్ణగరమ్, సంపద నిండిన తిరుక్కణ్ణపురం, తిరుచ్చేఱై, తిరువళున్దూర్, నల్లని మేఘాలు సంచరించే తిరుక్కుడన్దై- అంటే- కుంభఘోణక్షేత్రం ఘటికాచలం, తిరుక్కడల్మల్లై, అందమైన తోటలు నిండి ఉండే తిరువిడవెన్దై, తిరునీర్మలై, అందం నిండుగా ఉండే తిరుమాలిరుమ్ శోలై, తిరుమోకూర్... పొగడబడే బదరి, ఉత్తరమధుర) మొదలైన తిరుపతులలో ఆనందంగా వేంచేసి ఉంటాడు.

ఈ రీతిగానే స్వామి భగవద్రామానుజులకుకూడా అయిదు స్థితులున్నాయి. అవి ఏవి ? - అంటే-

1. **"భజతి యతిపతౌ భద్రవేదీం త్రివేదీమ్"** (భద్రపీఠమైన త్రివేదిలో శ్రీరామానుజులు వేంచేసి ఉండగా) (యతిరాజసప్తతి) అని స్తుతింపబడే రీతిలో **"కోప్పుడైయ శీరియ శిఙ్గాశనమ్"** (అలంకారాన్ని కల గొప్ప సింహాసనం) లో వేంచేసి ఉండి సకలభక్తులు కన్నులారా సేవించేటట్లు వేంచేసి ఉంటారు.

2. **"ఉణర్న్ద మెయ్ ఞానియర్ యోగన్దొఱుమ్... పుక్కు నిఱ్కుమ్ ఇరామానుశన్"** (ఉద్బుద్ధమైన జ్ఞానాన్ని కలవారు కలసి ఉండేచోట్లలో అంతటా, శ్రీరామానుజులు ప్రవేశించి నిలచి ఉంటారు) అని నూఱ్ఱన్దాదిలో పల్కినట్లుగా అంతరంగ భక్తుల హృదయాలలో ఇతరులకు కన్పించనట్లుగా ఆదరంతో వేంచేసి ఉంటారు.

3. ఉభయవేదాంతగ్రంథనిర్వాహాలకోసం ఏకాంతంగా ఒంటరిగా ఉండి, కూరేశులు, ముదలియాణ్డాన్, ఎమ్బార్, పిళ్ళాన్‌వంటివారైన పండితులతో కలసి ఉండి దివ్యప్రబంధ విచారాలను చేస్తారు.

4. **"నాట్టియ నీశచ్చమయఙ్గళ్ మాణ్డన"** (లోకంలో నీచమతాలు నశించాయి) అనే రీతిలో శంకర-భాస్కర- యాదవ-భాట్ట- ప్రాభాకర మతాలు నశించేటట్లుగా (వాదాలతో) వేటాడతారు.

5. పూలు, పళ్ళు సమృద్ధిగా ఉండే ఉద్యానవనాలవంటి ఉభయవేదాంత గ్రంథప్రవచనంలో అవగాహించి, ఆనందిస్తారు. పైన తెల్పిన ఇన్ని విషయాలను మనస్సులో తేటపఱచుకోలేకపోయినా, అయిదవ అంశంగా చెప్పబడిన ఒక్క

విషయాన్ని మాత్రం అయినా దృఢంగా మనస్సులో నిలుపుకొంటే, **"ఉఙ్గళ్ పుழைక్కడై త్తోట్టత్తు వావియుళ్"** (మీ పెరటి తోటలోని బావిలో) ఇత్యాదులకు ఇక్కడ తెలుపబడే స్వాపదేశార్థాలు మనస్సులో బాగా నిలుస్తాయి.

ప్రభువు ఉద్యానవనాలలో విహరించేటట్లు, ముల్లోకాల ప్రభువు **"ఆరామశూழ்న్ద"** (ఉద్యానవనాలతో పరివేష్ఠితమైనది), **"వణ్డిన మురలుమ్ శోలై మయిలిన మాలుమ్ శోలై కొణ్డల్ మీదణవుమ్ శోలై కుయిలినమ్ కూవుమ్ శోలై అణ్డర్కోన్ అమరుమ్ శోలై అణి తిరువరఙ్గమ్"** (తుమ్మెదలు ధ్వనించే తోట, నెమళ్ళు వ్యామోహంతో ఉండే తోట, మేఘాలు పైన సంచరించే తోట, కోయిలల గుంపులు కూసే తోట ఏది? అంటే, జగత్పతి అమరి ఉండే తోట- అందమైన శ్రీరంగం.) మొదలైన దివ్యదేశాలలో **"విహరతి హరౌ లక్ష్మ్యా"** (లక్ష్మితో హరి విహరిస్తూ ఉండగా) అనే రీతిలో విహరించేటట్లు, భగవద్రామానుజులు విహరించే తోట రెండు విధాలుగా ఉంటుంది. శ్రీభాష్య- గీతాభాష్య- వేదార్థసంగ్రహాదులు ఒక విధమైన తోట. దివ్యప్రబంధ రహస్యత్రయాదులు ఇంకొక విధమైన తోట. లోకంలో మహాధనికులు అంతరంగోద్యానమని, బహిరంగోద్యానమని రెండు విధాలైన తోటలను నిర్మించుకోవడం అలవాటు. సర్వసాధారణాలైన పుష్పఫలద్రుమాలను పెంచే తోట బహిరంగోద్యానం. భగవదారాధనకు తగిన తులసి, సంపెంగ, మల్లె, ఇరువాట్చి **"శెణ్బగ మల్లిగైయోడు శెఙ్గழுనీర్ ఇరువాట్చి"** (సంపెంగ, మల్లికతో పాటు, ఎఱ్ఱ తామరలు, ఇరువాట్చి) మొదలైనవానిని పెంచే తోట అంతరం గోద్యానం. ఇదే **"పుழைక్కడైత్తోట్టమ్"** (పెరటితోట) గా కూడా వ్యవహరింప బడుతుంది. ఇదే రీతిలో, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత, ఉపనిషత్తులు మొదలైనవి సర్వసాధారణమైన తోటగాను, దివ్యప్రబంధరహస్యత్రయాదులు అసాధారణో ద్యానంగాను ఆచార్యులచేత సంభావింపబడుతున్నాయి. బ్రహ్మసూత్రాదులలో తెలుపబడే అర్థాలకంటే భగవద్విషయరహస్యార్థాలు చాలా అంతరంగమైనవి. వీనినిగూర్చి వివరంగా నిరూపించవలసి ఉన్నా, ఇక్కడ సంగ్రహంగా తెల్పుతున్నాను. వినండి. బ్రహ్మసూత్రాలలో నాల్గు అధ్యాయాలు, పదహాఱు పాదాలు, అయిదు వందలకు మించిన సూత్రాలున్నాయి కదా ! వీటిలో ఏ సూత్రంలోను భగవానుడు అవతారాలను ఎత్తుతాడనే విషయం చెప్పబడలేదు. అవతారచేష్టితాలను గూర్చి పల్కడానికి అందులో ప్రసక్తి లేదు. అతడు లక్ష్మీపతి అనే విషయంకూడా చెప్పబడలేదు. ప్రపత్తి వ్యక్తంగా తెలుపబడలేదు. మంగళాశాసనమే స్వరూపాను రూపకైంకర్యమనేదీ చెప్పబడలేదు. ఈ విధంగా వాటికి పలు కొఱతలున్నాయి.

దివ్యప్రబంధాలకు ఇటువంటి కొఱతలు ఏవీ చెప్పడానికి వీలు లేదు. ఆళ్వార్లు పాశురాన్ని ఆరంభించినపుడే **"ఎన్నిన్ఱ యోనియుమాయ్ పిఱన్దాయ్ ఇమైయోర్ తలైవా!"** (ఎన్నెన్ని జాతులలో అవతరించావో కదా, ఓ నిత్యసూరి నాథా!) అని అవతారాన్నే ప్రస్తావించారు. **"పిఱన్ద వాఱుమ్"** (పుట్టిన రీతి) అని పల్కి, **"ఎత్తిఱమ్ ఉరలినోడు ఇణైన్దిరున్దేఙ్గియ వెళివే"** (రోలుతో కట్టబడి, వెక్కివెక్కి ఏడ్చిన సౌలభ్య గుణం ఎంత గొప్పదో కదా) అని పల్కి ప్రతిపాదంలోను మోహాన్ని పొందారు. **"తిరువిల్లా త్తేవరై త్తేఱేల్మిన్ తేవు"** (లక్ష్మీదేవి లేని దేవతలను పరదేవతగా ఆరాధించకండి) అని లక్ష్మీసంబంధం లేని దైవాన్ని దైవంగానే భావించవద్దు- అని అన్నారు. **"నెఱి కాట్టి నీక్కుదియో?"** (బాహ్యామార్గాలను చూపి నన్ను దూరం చేస్తావా?) అని ఉపాయాంతరాల అనర్థావహత్వాన్నిగూర్చి మొఱపెట్టి ప్రపత్తిని గూర్చి నొక్కి వక్కాణించారు. **"ఆట్చెయ్‌దు ఆళ్పిప్పిరానై చ్చేర్న్దవన్"** (శ్రీసుదర్శన ధారికి కైంకర్యం చేసి, దరిచేరిన శఠకోపులు) అని, **"ఉఱ్ఱేన్ ఉకన్దు పణి శెయ్‌తు ఉన్ పాదమ్ పెఱ్ఱేన్"** (నిన్ను పొందాను, ఆనందించి సేవచేసి నీ శ్రీపాదాలను పొందాను) అని, **"ఒళివిల్ కాలమెల్లాముడనాయ్ మన్ని వళువిలా అడిమై శెయ్యవేణ్డుమ్ నామ్"** (విచ్ఛేదం లేని కాలం అంతా వెంటనే నిలకడగా ఉండి నిరంతరమైన కైంకర్యాన్ని మనం చేయాలి) అని కైంకర్యమే పరమపురుషార్థమని నిర్ణయించారు. తమ దివ్యప్రబంధాలను మంగళాశాసన మయంగానే చేశారు. శ్రీరామానుజదర్శనమనే శ్రీవైష్ణవసంప్రదాయానికి ఇవియే ప్రాణస్థానీయాలైన దివ్యార్థాలు కనుక, ఇటువంటి పుష్పాలు, ఫలాలు పండే దివ్యశాస్త్రాలే శ్రీరామానుజులకు **"పుఴైక్కడై త్తోట్టమ్"**. ఇవి భగవద్రామానుజుల కాలానికి ముందు ప్రచారాన్ని పొందకుండా **"త్రాతం సమ్యగ్యతీంద్రైః"** (యతీంద్రులచే చక్కగా రక్షింపబడినదై) అని దేశికులు అనుగ్రహించిన రీతిలో భగవద్రామానుజులు అవతరించిన తరువాతనే మిక్కిలి ప్రకాశాన్ని పొందినందువల్ల **"ఉఙ్గళ్ పుఴైక్కడైత్తోట్టమ్"** అని అనబడింది. మీచే విశేషించి కృషి చేయబడి పెంచబడిన తోట- అని భావం.

(తోట్టత్తు వావియుళ్) - **"వాపీ"** అనే సంస్కృతపదం **"వావి"** (బావి) అనే వికృతిని పొందింది. నీటిప్రదేశమని భావం. నీటిప్రదేశాలు లేని తోట ఏపుగా పెరగదు. తోటలో పూచే పూలు, ఫలాలు ఏపుగా పెరగడానికి బావియే కారణం. సదాచార్యోపదేశమే ఇక్కడ బావి- అని రహస్యంగా తెలుపబడింది. **"శాస్త్రజ్ఞానం బహుక్లేశం బుద్ధేశ్చలన కారణమ్, ఉపదేశాత్ హరిం బుద్ధ్వా విరమేత్ సర్వకర్మసు"** (శాస్త్రజ్ఞానం చాలా శ్రమతో కూడినది. బుద్ధిని చలింపజేస్తుంది. అందువల్ల

ఆచార్యోపదేశంతో హరిని తెలిసి అన్ని కర్మలనుండి విరమించాలి) అనే రీతిలో సదాచార్యోపదేశం లేనపుడు గొప్ప అర్థాలను గ్రహించడం, పెంపొందించడం వీలు కాదు. కనుక, బావిస్థానంలో సదాచార్యోపదేశాన్ని గ్రహించవచ్చు. పంచాచార్య పదాశ్రితులైన శ్రీరామానుజులు సదాచార్యోపదేశాలను చక్కగా పొందినవారు.

(శెఙ్గళునీర్ వాయ్ నికళ్న్దు ఆమ్బల్ వాయ్ కూమ్బిన కాణ్) -సూర్యకాంతిని చూచి పూచే పూలు శెఙ్గళునీర్ - (ఎఱ్ఱతామరలు), చీకటిని చూచి వికసించే పూలు ఆమ్బల్. (కలువలు) "స్వామీ దేవరవారి ఉపదేశపరంపరతో తామసాలైన అర్థాలు తలవంచి, సాత్త్వికాలైన అర్థాలు వికాసాన్ని పొందాయి- అని దీనిభావం. కలియుగధర్మాలు తలవంచి కృతయుగధర్మాలు తల ఎత్తి వర్ధిల్లాయి- అని సారం. **"పొలిక పొలిక పొలిక పోయిఱ్ఱు వల్లుయిర్చ్చాపమ్, నలియుమ్ నరకముమ్ నైన్ద, నమనుక్కిఙ్గు యాదొన్ఱు మిల్లై, కలియుమ్ కెడుమ్ కణ్డుకొణ్మిన్"** (మంగళం, మంగళం, మంగళం. జీవుల బలమైన శాపం నశించింది. బాధించే నరకం తీరింది. యమునకు ఇక ఏమీ పని లేదు. కలి కూడా నశిస్తుంది, చూడండి.) అనే పాశురం, దానికి సంబంధించిన ఐతిహ్యం ఇక్కడ అనుసంధేయాలు.

(శెఙ్గల్ పొడిక్కూఱై- ఇత్యాది) పైన **"తఙ్గళ్‌తిరుక్కోయిల్ శఙ్గిడువాన్ పోకిన్ఱార్"** (తమ ఆలయాలలో కుంచకోలను - బీగపుచెవిని పెట్టి తీయడంకోసం- శంఖధ్వనిని చేయడం కోసం-పోతున్నారు) అని దివ్యదేశ కైంకర్యనిష్ఠులయాత్రను గూర్చి పలకాలని భావించి, **"శెఙ్గల్ పొడిక్కూఱై"** అని కాషాయాంబర శోభితులైన యతులను ఇక్కడ ప్రస్తావించినందువల్ల, భగవద్రామానుజులు దివ్యదేశకైంకర్యాభివృద్ధికోసం అక్కడక్కడ యతులను మఠాధిపతులుగా నియమించి దివ్యదేశ కైంకర్యనిర్వాహసామ్రాజ్యాన్ని వారి బాధ్యతగా చేసిన విషయం తెలుపబడుతున్నది. సన్న్యాసులు గ్రామైకరాత్రంగా సంచరించే యోగులై ఉండవలసి ఉండగా, వారిని మఠాధిపతులుగా చేసి, భగవత్సన్నిధులలో కైంకర్యాలను ఏ కొఱత లేకుండా నిర్వహించేటట్లు నియమించినవారు స్వామి భగవద్రామానుజులే కదా! **"మఠాపత్యం యతిః కుర్యాత్ విష్ణుపూజాభివృద్ధయే"** (యతి విష్ణుపూజాభివృద్ధి కోసం మఠాధిపత్యాన్ని నిర్వహించాలి) అనే భగవచ్ఛాస్త్రవచనంకూడా స్వామికి సహాయపడింది.

(వెణ్‌పల్ తవత్తవర్) - అటువంటి భగవద్రామానుజ శిష్యుల గొప్పతనాన్ని ఇది తెల్పుతుంది. దంతాల తెల్లదనాన్ని తెలుపడంద్వారా **"యత్తస్మై తిష్ఠతేఽన్యః**

కృపణ మశరణో దర్శయన్ దంతపంక్తీః" (దరిద్రుడు, ఏ గతి లేనివాడై తన పళ్ళవరుసను చూపిస్తూ ధనికుని ప్రార్థిస్తాడు.) (శ్రీగుణరత్నకోశమ్) అని భట్టర్ అనుగ్రహించిన రీతిలో క్షుద్రుల వద్దకు పోయి, దంతాలను చూపించి నవ్వుతూ, యాచించకుండా, "**తృణీకృతవిరించాదినిరంకుశవిభూతయః, రామానుజపదాంభోజ సమాశ్రయణశాలినః**" (శ్రీరామానుజుల శ్రీచరణ పద్మాలను ఆశ్రయించే స్వభావాన్ని కలవారు బ్రహ్మాదుల అధికారాలనుకూడా తృణంగా భావిస్తారు) అనే రీతిలో విరించాది విభూతులను కూడా భగవద్రామానుజుల శిష్యులు తృణీకరిస్తారు- అని తెలుపబడింది. "**క్షోణీకోణశతాంశపాలనకలా దుర్వారగర్వానలక్షుభ్యత్ క్షుద్రనరేంద్రచాటురచనాధన్యాన్ న మన్యామహే**" (3) (వైరాగ్యపంచకమ్) (భూమిలోని ఒక మూలలోని శతాంశాన్ని మాత్రం పాలించే సామర్థ్యంలో అత్యంతాల్ప భాగాన్ని కల్గి ఉన్నంతమాత్రంలోనే వారించడానికి సాధ్యంకాని గర్వమనే అగ్ని కారణంగా క్షోభిల్లే క్షుద్రనరేంద్రులను స్తుతించే చాటువులను రచించి తమను ధన్యులని భావించేవారిని మేము గౌరవించబోము) అని దేశికులు అనుగ్రహించిన రీతిలో క్షుద్రప్రభువులవద్ద ప్రదర్శింపబడని దంతాలేకదా తెల్లని దంతాలు. "**మదనకదనైః న క్లిశ్యంతే యతీశ్వరసంశ్రయాః**" (యతీశ్వరుని ఆశ్రయించినవారు మన్మథునివల్ల బాధను పొందరు.) అని, "**కామాదిదోషహర మాత్మపదాశ్రితానామ్ యతిపతిమ్**" (తన పాదాలను ఆశ్రయించినవారి కామాది దోషాలను పోగొట్టే శ్రీరామానుజలను) అని పలికే రీతిలో కామాదిదోషదూరులైన భగవద్రామానుజ శిష్యులు భగవానునివద్దకూడా తమ దంతాలను చూపరు- అని అంటే, ఇతరులవద్ద తమ పళ్ళను చూపించరు (అర్థించరు)- అనే దానిని వేఱే చెప్పాలా? "**వెణ్‌పల్**" అనేదాని భావం ఇదే!

(తవత్తవర్) తపోధనులు- అని భావం. వీరికి ఏది తపస్సు? అని అంటే, "**స్వాధ్యాయప్రవచనే ఏవేతి నాకో మౌద్గల్యః, తద్ధి తప స్తద్ధి తపః**" (స్వాధ్యాయం, ప్రవచనం- అనేవి మాత్రమే తపస్సు- అని ముద్గలమహర్షి కుమారుడు నాకుడు అన్నాడు. అదేకదా తపస్సు. అదే కదా తపస్సు.) అనే తైత్తిరీయోపనిషత్ సూక్తినిబట్టి స్వాధ్యాయప్రవచనాలే వీరికి తపస్సు. లేక, "**తవత్తవర్**" -"**మమ**" అని అనకుండా, "**తవ తవ**" (నీకోసం నీకోసం) అనేవారు- "**తవత్తవర్**", "**కారియమ్ నల్లనకళ్ కాణిల్ ఎన్ కణ్ణనుక్కెన్ఱు ఈఱియా ఇరుప్పాళ్**" (మంచి వస్తువులనే చూస్తే అవి నా శ్రీకృష్ణుని కోసం -అనే ప్రేమను కల్గి ఉంటుంది) (తిరువాయ్‌మొழி) అనే

రీతిలో ఏది అయినా భగవానునకే- అనే భావించేవారే తప్ప, తమకోసం- అని భావించేవారు కాదని భావం. "**తవ**" -(నీకు) అనేవారు "**తవత్తవర్**".

(తజ్గళ్‌తిరుక్కోయిల్ శజ్గిడువాన్ పోకిన్ఱార్)- పూర్వం తెల్పిన ఉత్తమాధికారులు భగవత్సన్నిధులలో కైంకర్యం చేయడంకోసం పోతున్నారు- అనే అర్థమే కాకుండా వేఱొక అర్థం కూడా ఇక్కడ జ్ఞాతవ్యమై ఉన్నది. "**తజ్గళ్ ఇల్, తిరు ఇల్, కో ఇల్**" అని మూడు విధాలుగా విడదీసి, రహస్యత్రయాన్ని ఇది తెల్పుతున్నదని గ్రహించాలి. తిరుమంత్రం అనేది "**తజ్గళ్ ఇల్**"; ద్వయమంత్రం "**తిరు ఇల్**"; చరమశ్లోకం "**కో ఇల్**". దీనిని కొంచెం వివరిస్తాను. తిరుమంత్రార్థంలో అనన్యార్హశేషత్వ- అనన్యశరణత్వ- అనన్య భోగ్యత్వాలనే ఆత్మస్వరూపం చక్కగా శిక్షింప (బోధింప)బడుతున్నది కనుక, అది చేతనులకోసమైన "**ఇల్**". అంటే- "**తజ్గళ్ ఇల్**". ద్వయంలో- లక్ష్మీదేవి పురుషకారంతోతప్ప భగవానుడు కార్యాన్ని చేయడు అనే రీతిలోని లక్ష్మీదేవియొక్క గొప్పతనం చెప్పబడడంచేత అది లక్ష్మీదేవియొక్క "**ఇల్**"- అంటే - "**తిరు ఇల్**". చరమశ్లోకంలో "**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి**" (నేను నిన్ను అన్ని పాపాల నుండి విడిపిస్తాను) అని భగవానుడు తాను కార్యాన్ని సఫలం చేసి, పూర్తిచేస్తానని చెప్పడం వల్ల అది "**కో**"(స్వామి) అయిన భగవానుని "**ఇల్**" అంటే- "**కో ఇల్**". అందువల్ల "**తజ్గళ్ తిరుక్కోయిల్**" అనే ప్రయోగంచేత రహస్యత్రయం చాలా చక్కని రీతిలో తెలుపబడినట్లయింది. అందులో, "**శజ్గు ఇడువాన్ పోకిన్ఱాన్**" అనేటపుడు- "**శజ్గు**" అనే పదం కుంచె కోలకు పేరు. రహస్యత్రయమనే పేటికను తాళపు చెవితో (బీగంతో) తెఱచి, భక్తులకు తెలుపబోతున్నారు- అని భావం.

(ఎజ్గళై మున్నమ్ ఎழுప్పువాన్ వాయ్ పేశుమ్ నజ్గాయ్ !) - "**ఎழுప్పువాన్**" - అనే పదానికి "**ఎழுప్పుదఱ్కాక**" (ప్రబోధించడంకోసం, నిద్రలేపడంకోసం) అని అర్థం. "**అనాదిమాయయా సుప్తః**" (అనాదిమాయచేత నిదురించినవాడు) అనే రీతిలో అనాది అయిన మాయచేత నిద్రిస్తూ పడి ఉండే మనలను తమ ఉపదేశాలతో ప్రతిబోధనం పొందినవారినిగా చేయడంకోసం,

(మున్నమ్ వాయ్ పేశుమ్) - "**ఓరాణ్ వழிయాయ్ ఉపదేశిత్తార్ మున్నోర్, ఏరార్ ఎతిరాశర్ ఇన్నరుళాల్, పారులకిల్ ఆశైయుడైయోర్క్కెల్లామ్ ఆరియర్కాళ్! కూఱుమ్ ఎన్ఱు పేశి వరమ్బుఱుత్తార్ పిన్**" (శ్రీరామానుజులకు ముందు ఉండే ఆచార్యులు ఈప్రపత్తిని అద్వితీయమైన మహాపథం మూలంగా ఒక్కొక్కరు

ఒక్కొక్కరికి ఉపదేశించి ప్రవర్తింపజేశారు. గొప్ప దయను కల శ్రీరామానుజులు, "ఈ లోకంలో ఆశను కలవారికి అందటికీ ఉపదేశించండి"- అని అంటూ ఆ నియమాన్ని ఛేదించారు.) (ఉపదేశరత్తినమాలై) అనే రీతిలోని నియమనవార్తను పూర్వం పల్కిన ఓపరమకృపానిధీ !- అని భావం.

(శఙ్గొడు శక్కరమ్ ఏన్దుమ్ తడక్కైయన్) - భగవద్రామానుజుల చరిత్రలో ఇది చాలా గొప్ప మర్మమైన విషయం. **"అప్పనుక్కు చ్చఙ్గాழி అళిత్తరుళుమ్ పెరుమాళ్"** (అప్పన్‌కు - అంటే - వేంకటేశ్వరునకు శంఖచక్రాలను అనుగ్రహించిన పెరుమాళ్) అనే రీతిలో శ్రీవేంకటేశ్వరునకు శంఖచక్రాలను అనుగ్రహించిన విశాలబాహువులను కలవారుకదా భగవద్రామానుజులు.

(పఙ్గయ క్కణ్ణానై) - యాదవప్రకాశులవద్ద వేదాంతశ్రవణం చేసేటపుడు, **"తస్య యథా కప్యాసం పుండరీకమేవ మక్షిణీ"** (భగవానుని కన్నులు నీటిలో వికసించిన తామరలవంటివి) అనే శ్రుతికి వారు అపార్థాన్ని చెప్పగా, దానిని విని సహించలేక కన్నీరు కార్చి, **"గంభీరాంభఃసముద్భూత సుమృష్టనాళ రవికరవికసిత పుండరీకదళామలాయతేక్షణః"** (లోతైన నీటిలో పుట్టిన, బలమైన కాడలను కల, సూర్యుని కిరణాలతో వికసించిన పుండరీక దళాల వలె విశాలనేత్రాలను కలవాడు) అని పరమరస్యమైన అర్థాన్ని పల్కి, **"పఙ్గయ క్కణ్ణానై"** (పంకజనేత్రుని) సేవించిన ఇతిహాసాన్ని ఇది స్మరింపజేస్తున్నది.

ఈ పాశురంలో ప్రమాణనిర్ధారణరూపమైన శాస్త్రార్థాన్ని వివేకించి గ్రహించాలి. **"శెఙ్గழுనీర్ వాయ్ నెకழ்న్దు ఆమ్బల్ వాయ్ కూమ్బిన"** (ఎఱ్ఱతామరలు పూచాయి, నల్లకలువలు ముకుళించాయి) అని ఒక ప్రభాతకాలిక లక్షణాన్ని పలికారు. **"ఎఙ్గుమ్ తోట్టత్తు వావియుళ్"** (అంతటా తోటలలోని బావులలో) అని చెప్పవలసి ఉండగా, ఆ రీతిలో పలుకకుండా, **"ఉఙ్గళ్ పుழைక్కడై త్తోట్టత్తు వావియుళ్"** (మీ పెరటితోటలోని బావిలో) అని అంటున్నారు. పూర్వం, **"కీశు కీశెన్ఱు ఎఙ్గుమ్ ఆనైచ్చాత్తమ్ కలన్దు పేశిన"** (కీచుకీచుమని అంతట భరద్వాజ పక్షులు కలిసి ధ్వనించాయి) అనే ఒక ప్రభాతచిహ్నాన్ని పలికారు. ఇకపైకూడ **"వన్దు ఎఙ్గుమ్ కోழி అழைత్తనకాణ్"** (కోళ్ళు అంతట వచ్చి చేరి కూశాయి.) అని చెప్పబోతున్నారు. అదే రీతిలోనేకదా ఇక్కడ కూడా **"ఎఙ్గుమ్"** అని చెప్పాలి. లోపలకు పోవడానికి దారిని పొందలేక, వాకిటిలోనే నిలచి బాధపడే వీరు, **"ఉఙ్గళ్ పుழைక్కడై త్తోట్టత్తు వావియుళ్"** (మీ పెరటి తోటలోని బావిలో) అని పల్కడం తగినది కాదు కదా ! అని అంటే,

(సమాధానాన్ని) వినండి. ప్రత్యక్షం మొదలైన ఎనిమిది ప్రమాణాలను గ్రహిస్తారు కొందఱు. ప్రత్యక్షం ఒక్కటే ప్రమాణమని అంటారు కొందఱు. ఈవిధంగా కాకుండా, ప్రత్యక్షం - అనుమానం - శబ్దం (అంటే- శాస్త్రం) అనే మూడిటినే ప్రమాణాలుగా గ్రహించారు వేదాంతులు. ఈ మూడు ప్రమాణాలు ఈ పాశురంలో తెలుపబడుతున్నాయి. **"ఉఙ్గళ్ పుழைక్కడై"** ఇత్యాదిగా చెప్పబడే విషయం అనుమాన సిద్ధమే కనుక, అనుమానంకూడా ప్రమాణమని తెలుపబడింది. **"తవత్తవర్ తఙ్గళ్ తిరుక్కోయిల్ శఙ్గు ఇడువాన్ పోకిన్ఱార్"** (తపస్వి జనులు తమ కోవెలను బీగాన్ని పెట్టి తీయడంకోసం వెడుతున్నారు.) అనేది అందఱు ప్రత్యక్షంగా చూచే విషయాన్ని తెలుపుతున్నది కనుక, ప్రత్యక్షం ప్రమాణమని చెప్పబడింది. **"ఎఙ్గళై మున్నమ్ ఎழுప్పువాన్ వాయ్ పేశుమ్"** (మమ్మలను ముందుగానే నిద్రలేపుతాను- అని పల్కిన) అని ఆప్తవాక్యమైన మాటను ప్రస్తావించినందున, ఆప్తవాక్యమనే శాస్త్రం ప్రమాణమని చెప్పబడింది. ఈ రీతిలోని ఈ పాశురంలోని ఈ శాస్త్రార్థం సహృదయహృదయానుభావ్యం.

15. ఎల్లే! ఇళఙ్కిళియే! ఇన్నమ్ ఉఱఙ్గుదియో!

శిల్లెన్ఱు అழைయేన్మిన్ నఙ్గైమీర్! పోదరుకిన్ఱేన్

వల్లై యున్ కట్టురైకళ్ పణ్డే ఉన్ వాయఱిదుమ్

వల్లీర్‌కళ్ నీఙ్గళే నానేదాన్ ఆయిడుగ

ఒల్లై నీ పోదాయ్ ఉనక్కెన్న వేఱుడైయై

ఎల్లారుమ్ పోన్దారో? పోన్దార్ పోన్దు ఎణ్ణిక్కొళ్

వల్లానై కొన్ఱానై మాఱ్ఱారై మాఱ్ఱழிక్క

వల్లానై మాయనై ప్పాడ ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురం గోపికల పరస్పరసంభాషణరూపంగా ఉన్నది. ఒక పాదం బయట వేచి ఉండే గోపికల మాటగా, ఇంకొక పాదం లోపల ఉండే గోపికయొక్క వచనంగా - ఈ రీతిలో మాఱి మాఱి పలికే రీతిలో అనుగ్రహింపబడింది. ఈ పాశురంలో **"నానే తాన్ ఆయిడుక"** (నేనే కానివ్వండి) అనేదే ప్రాణస్థానీయం. లోకంలో చాలా మంది తాము చేసిన తప్పులను ఒప్పుకోకుండా వాటిని మఱుగు పరుస్తారు. కొందఱు వాటిని చాలా శ్రమపడి ఒప్పుకొంటారు. కొందఱు తప్పులను కప్పిపుచ్చుకోవడం వెంటనే అంగీకరిస్తారు. తప్పులను చేసి, చేయలేదని

కప్పిపుచ్చుకోవడంకంటే, "అవును; ఈ తప్పును చేశాను" అని వెంటనే వెంటనే మాఱు పలుకకుండా అంగీకరించడం గొప్పదే అయినా, నిజానికి తాను చేయని ఒక తప్పును సైతం తాను చేసినట్లుగా ఇతరులు పల్కినట్లయితే, దానినికూడా కాదనకుండా వెంటనే అంగీకరించడమనేది చాలా చాలా గొప్ప విషయం. ఇదే ఉత్తమశ్రీవైష్ణవ లక్షణం. మనలను దోషులుగా పెద్దలు పల్కితే, నిజానికి మనం తప్పును చేయకపోయినా, "పెద్దల మాట అసత్యం కారాదు"- అనే నిశ్చయంతో "నేను దోషినే" అని అంగీకరించడమే ఉత్తమశ్రీవైష్ణవలక్షణం. ఈ విషయాన్నిగూర్చి ఈ పాశురం చాలా అద్భుతంగా బోధిస్తున్నది. మనం మాటలాడేటపుడు - "దాసుడనైన నేను ఏమీ చదుకోనివాడను. ఎందులోను ఏ విధమైన పాండిత్యం లేనివాడను. దాసుని నోటినుండి వచ్చే మాటలన్నీ దోషభూయిష్ఠాలుగా ఉంటాయి. పెద్దలు సహించాలి" అని చెప్పవచ్చు. ఉపన్యాసాన్ని ముగించిన తరువాత ఒకరు లేచి - "ఇంతవరకు వీరు చెప్పినది అంతా అబద్ధం- చాలా అసంబద్ధం. ఏమాత్రం విద్య లేనివారు వీరు" అని అంటే, వారిని మనం నిందిస్తాము. "దాసుని నా అయోగ్యతను ఆరంభంలోనే విజ్ఞాపనచేశాను కదా! మీరు పల్కినది నిజమే" అని సంతోషంతో పలికేవారు మనకు ఒక్కరు కూడా కన్పించరు. అది శ్రీవైష్ణవలక్షణం కాదు. శ్రీభరతాళ్వాన్ **"మత్పాపమేవాత్ర నిమిత్త మాసీత్ వనప్రవేశే రఘునందనస్య"** (శ్రీరాముని వనవాసానికి నేను చేసిన పాపమే కారణం) అని పల్కినట్లే, తమ తప్పు కానిదానిని కూడ తమ దోషంగా అంగీకరించడమే ఉత్తమశ్రీవైష్ణవలక్షణమని ఈ పాశురంలో చాలా అందంగా తెలుపబడింది. ఇందుకోసమే ఈ పాశురం పరస్పర సంభాషణరూపంగా రూపొందించబడింది. సంభాషణరూపంగాకాకుండా ఈ అర్థాన్ని తెలుపడం సాధ్యం కాదా ?- అని అంటే, ఉపదేశరూపంగా తెలుపవచ్చునే తప్ప, స్వానుష్ఠానరూపంగా చూపడం సాధ్యం కాదనే విషయం నిశ్చయం. ఉపదేశంకంటే అనుష్ఠానమే గొప్పది కనుక, ఈ పరమార్థాన్ని అనుష్ఠానరూపంలోనే తెలియజేయాలని భావించిన గోదాదేవి ఈ పాశురాన్ని సంభాషణ రూపంగా మలచి అనుగ్రహించారు. లోపల ఉండే గోపిక **"వల్లీర్‌కళ్ నీఙ్గళే"** (మీరే సమర్థులు)అని అన్నది, దీనికి తరువాత వీథిలో ఉండేవారు రోషభాషణం మళ్ళీ చేయకుండా ఉండేటట్లుగా **"నానేదాన్ ఆయిడుక"** (నేనే కానివ్వండి) అని అంటూ తన దోషాన్ని అంగీకరిస్తూ సంభాషణను ఆమె ముగించడం పరమహృద్యం.

"ఎల్లే! ఇళమ్ కిళియే! ఇన్నమ్ ఉఱఙ్గుదియో?" (ఓ లేత చిలుకా! ఇంకా నిద్రిస్తున్నావా?) అని బయట ఉండే గోపికలు అనగానే, **"శిల్లెన్ఱళైయేన్మిన్"** (చివుక్కుమని అనేటట్లు పిలువకండి) అని లోపల ఉండే గోపిక అన్నది. దీనివల్ల బయట ఉండేవారి మాట లోపల ఉండే గోపికకు కోపాన్ని కల్గించింది - అని తెలుస్తున్నది. మొదటి పాదంలో కోపహేతువైన మాట ఏమి ఉన్నది? అనే విషయాన్ని గమనించాలి. లోకంలో కొందఱిని ఉన్నతంగా పల్కితే అది కోపహేతువు అవుతుంది. కొందఱిని తక్కువగా పల్కితే అది కోపహేతువు అవుతుంది. ఇక్కడ ఈ రెండూ ఉన్నాయి. **"ఇళఙ్కిళియే!"** (లేత వయస్సులోని చిలుకా) అనే సంబోధన గౌరవం స్ఫురించేటట్లు పల్కినది కనుక, దీనివల్ల కోపం కలుగవచ్చు. "ఇంకా నిద్రిస్తున్నావా?" **ఇన్నమ్ కణ్‌వళరుతియో?"** అని అనకుండా **"ఇన్నమ్ ఉఱఙ్గుదియో?"** అని అమర్యాద స్ఫురించేటట్లు పల్కినందువల్ల, దానివల్లకూడ కోపం కలుగవచ్చు. ఏదో ఒక కారణంచేత లోపల ఉండే గోపికకు కోపం కల్గింది- అనే విషయం రెండవ పాదంవల్ల తెలుస్తున్నది. ఆ రెండవ పాదాన్ని బయట ఉండే సఖులు **"వల్లై, ఉన్ కట్టురైకళ్, పణ్డే ఉన్ వాయఱితుమ్"** (సరే, నీచతుర వచనాలను, నీ నోటిని ముందే మేము ఎఱుగుదుము) అని అన్నారు. వీరు ఈ రీతిలో కఠినంగా పలుకవలసి వచ్చిన కారణం ఏమి? అంటే, లోపల ఉండే గోపిక **"తోழிకాళ్ !"** అని సంబోధించి పలుకవలసి ఉండగా, **"నఙ్గైమీర్ !"** (గుణపూర్ణులారా!) అని సంబోధించడమే కారణమని గ్రహించాలి. **"వల్లై ఉన్ కట్టురైకళ్ పణ్డే ఉన్ వాయఱితుమ్"** అని బయట ఉండే చెలికత్తెలు పల్కిన మాటను విని, ఆమె వెంటనే **"వల్లీర్‌కళ్ నీఙ్గళే"** (వాక్ చాతుర్యాన్ని కలవారు మీరే) అని విసరికొట్టిన రీతిలో కఠినంగా పల్కింది. దీనికి పిమ్మట వాక్కలహం సంభవించి ఉండాలి. ఆ విధంగా వాగ్వాదం పెరుగకుండా లోపల ఉండే గోపిక **"నానేదాన్ ఆయిడుక"** అని వినయంగా, మధురంగా పల్కి, కలహాన్ని ఉపశమింపజేయడమే ఇక్కడి విశేషం. దోషాన్ని తనదిగానే అంగీకరించి, పల్కడం స్వరూపజ్ఞానానికి పరమావధి. లోపల ఉండే గోపిక **"వల్లీర్‌కళ్ నీఙ్గళే"** అని అనగానే బయట ఉండే గోపికలు **"యామేదాన్ ఆయిడుక"** (మేమే కానీ) అని పల్కినట్లుగాకూడా పాశురాన్ని పాడి ఉండవచ్చు. ఆ రీతిలో రచించి పాడకుండా, దోషాన్ని తనదిగానే ఒప్పుకోవడాన్ని లోపల ఉండే గోపిక మాటలద్వారా పల్కినందువల్ల, ఇటువంటి ఉత్తమాధికారి లోకంలో పలువురు ఉండడం అరుదు, **"ఓర్ ఇరువర్ ఉణ్డాకిల్"** (ఒకరిద్దరు ఉంటే) ఉండవచ్చు అనే రీతిలో ఒకరో ఇద్దఱో కనబడవచ్చు- అనే విషయం తెలుపబడినట్లయింది.

"నానేదాన్ ఆయిడుక" (నేనే కానివ్వండి) అని పల్కిన తర్వాత వాక్కలహం శాంతించినందున, తిరిగి వివాదాన్ని లేవడం యుక్తం కాదు. అయినా, బయట ఉండేవారు తిరిగి తగవును లేపే రీతిలో "ఒల్లై నీ పోదాయ్" అని మాత్రమే పలుకకుండా, "ఉనక్కెన్న వేఱుడైయై" (నీకేమి ప్రత్యేకమైన అనుభవం?) అని అధికంగా ఇంకొక మాటను కూడా పలికారు. దీనిని ఎందుకోసం పలికారు? అని అంటే, "ఈమె మళ్ళీ స్వస్వరూపాన్ని మఱచిపోయి వివాదానికి సిద్ధపడు తుందా? లేదా? చూడాలి" అని పరీక్షించడంకోసమే. ఇక, లోపల ఉండే గోపిక అయితే, స్వరూపజ్ఞానంలో నిశ్చయాన్ని కల్గినదై ఈ పరీక్షలో భంగాన్ని పొందలేదు. "ఎల్లారుమ్ పోన్దారో!" (అందఱు వెళ్ళారా?) అని ప్రశ్నించడం ద్వారా భక్తుల సమూహాన్ని దర్శించాలనే కుతూహలాన్ని తాను కల్గి ఉండే విషయాన్ని వ్యక్తం చేసింది. ఈవిధంగా పలుకడంలో గల ఉద్దేశ్యం ఏమి? అంటే - వచ్చి లెక్కించే టపుడు ఒక్కొక్క వ్యక్తిని వేలుతో తాకడం, కంటితో దర్శించడం సంభవిస్తుంది కనుక, **"యం యం స్పృశతి పాణిభ్యాం యం యం పశ్యతి చక్షుషా, స్థావరాణ్యపి ముచ్యంతే కిం పునః బాంధవా జనాః"** (పరమభాగవతుడు ఎవరెవరిని చేతితో స్పృశిస్తాడో, ఎవరెవరిని కంటితో చూస్తాడో, అవి స్థావరాలైనా ముక్తిని పొందుతాయి. ఇక బంధుజనాలనుగూర్చి చెప్పవలసినది ఏమున్నది?) అనే రీతిలో విలక్షణమైన ఒక శ్రేయస్సును పొందవచ్చును- అనే ఉద్దేశ్యంతో.

"వల్లానై కొన్ఱానై" - (బలమైన కువలయాపీడాన్ని వధించినవాడు) అనే ప్రయోగానికి స్వాపదేశార్థమేమి? అంటే, **"వారి శురుక్కి మదక్కళిఱు ఐన్దినైయుమ్ శేరి తిరియామల్"** (మదగజాలనే ఇంద్రియాలను అయిదింటిని యథేచ్ఛగా సంచరించనీయకుండా) అని పొయ్కై ఆఴ్వార్లు పల్కిన రీతిలో ఇంద్రియాలనే మదగజాన్ని వధించేవాడు, సదాచార్యుడు. **"మాఱ్ఱారై మాఱ్ఱఴిక్కవల్లాన్"** - (శత్రువుల బలాన్ని అణచగలవాడు) అంటే దుర్వాదాలను చేసేవారి మాటలు తల ఎత్తకుండా ఉండేటట్లు ఖండించే గొప్పతనం కలవారని అర్థం. **"మాయన్"** - ఇనుమును బంగారంగా చేసినట్లుగా నిత్యసంసారిని నిత్యసూరిగోష్ఠిలో నిలుపడం- అనే ఆశ్చర్యకరచేష్టితాన్ని చేసేవాడు. ఇటువంటి ఆచార్యసార్వభౌముని సంకీర్తనం వల్ల ఈ స్వరూపనిష్ఠ కల్గింది- అని తెలుపబడినట్లయింది.

ఈ పాశురంలో నిద్ర లేపబడే గోపికను (వ్యక్తిని) **"కిళియే!"** (చిలుకా!) అని పిలిచినందున, **"మున్నోర్ మొఴిన్ద ముఱై తప్పామల్ కేట్టు పిన్నోర్న్దు తామదనై పేశుమ్"** (పూర్వులు పల్కిన క్రమాన్ని తప్పకుండా విని పిమ్మట దానిని అనుసరించి పలికే) రీతిని కల్గిఉండాలని శిక్షించినట్లయింది.

16. నాయకనాయ్ నిన్ఱ నన్దగోపనుడైయ
కోయిల్ కాప్పానే! కొడిత్తోన్ఱుమ్ తోరణ
వాశల్ కాప్పానే! మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్
ఆయర్ శిఱుమియరోముక్కు అఱై పఱై
మాయన్ మణివణ్ణన్ నెన్నలే వాయ్ నేర్న్దాన్
తూయోమాయ్ వన్దోమ్ తుయిలెఴ ప్పాడువాన్
వాయాల్ మున్నమున్నమ్ మాఱ్ఱాదేయమ్మా! నీ
నేశ నిలైక్కదవమ్ నీక్కు ఏలోర్ ఎమ్బావాయ్

తిరుప్పావైలో "నీరాట్టమ్" (నీరాడడం) అనే ప్రస్తావం అయిదు పాశురాలలో కన్పిస్తుంది. మొదటి పాశురంలో **"నీరాడ ప్పోదువీర్ పోదుమినో!"** (స్నానం చేయడానికి వచ్చేవారు రండి!) అని ఉన్నది. మూడవ పాశురంలో **"నాజ్గళ్ నమ్ పావైక్కు చ్చాఱ్ఱి నీరాడినాల్"** (మనం కూడా మన వ్రతంకోసం నీరాడితే) అని ఉన్నది. నాల్గవ పాశురంలో **"నాజ్గళుమ్ మార్గఴి నీరాడ"** (మేము కూడా మార్గఴి స్నానం చేసేటట్లు) అని ఉన్నది. ఇరవైయవ పాశురంలో **"ఇప్పోదే ఎమ్మై నీరాట్టు"** (ఇపుడే మమ్ములను స్నానం చేయించు) అని ఉన్నది. ఈవిధంగా వీటిద్వారా నీరాడడం గోపికలకు ఉద్దేశ్యమని తెలుస్తున్నా, స్నానం చేసే చోటు అయిన యమునకు కాని, వేఱొక సరస్తీరానికి కాని వీరు వెళ్ళలేదు. అయినా, స్వాపదేశార్థ ప్రక్రియలో స్నానం చేసే చోటు ఏదో అక్కడికే పోయి చేరారని గమనించవచ్చు. స్వాపదేశంలో, స్నానం చేసే చోటు ఇది- అనే విషయాన్ని అవతారికలోను, మొదటి పాశురవ్యాఖ్యలోను వివరంగా తెలిపాము. శ్రీకృష్ణుడు అనే **"తామరైనీళ్ వాశత్తడమ్"** (విశాలమైన, సువాసనను కల తామర తటాకం)లో అవగాహించాలని (స్నానం చేయాలని, అనుభవించాలని) గోపికలు వెడుతున్నారు- అని స్ఫుటమవుతున్నది. శ్రీకృష్ణుని ఉద్దేశించి వచ్చిన వీరు **"శ్రీకృష్ణా !"**- అని పిలిచి ఉండవచ్చు. లేక, శ్రీకృష్ణుడు **"నందగోపన్ కుమరన్"** (నందగోపుని కుమారుడు)గాను, **"యశోదై ఇళమ్ శిజ్గమ్"** (యశోద బాలసింహం) గాను **"బలదేవఱ్కోర్ కీఴ్కన్ఱు"** (బలదేవునకు పిమ్మట జన్మించిన లేగదూడవంటివాడు) గాను పెరిగినందువల్ల,

వారిని పురస్కరించుకొని పిలవాలి - అని వారికి తోచినందున "నన్దగోపాలా!" అని వారిని ముందుగా పిలిచి ఉండవచ్చు. ఆ రీతిలో కూడా కాకుండా, **"నన్దగోపనుడైయ కోయిల్ కాప్పానే!"** (నందగోపాలుని ఆలయాన్ని కాచేవాడా) అని ద్వారపాలకులను లేపి, వారి అనుగ్రహాన్ని ప్రార్థిస్తున్నట్లుగా ఈ పాశురం కూర్చబడినది. రేపల్లెలో నందగోపాలుడు గోపాలురకు నాయకుడు - అని భావించినా, ఆయన గృహం సామాన్యంగా ఉండి ఉంటుందే తప్ప, **"కోయిల్ కాప్పాన్"** (తోరణం ద్వారాన్ని కాచేవానిని), **"తోరణవాశల్ కాప్పానై"**ను కల్గి ఉన్నదిగా భావించడంలో ఔచిత్యం లేదుకదా! అంతేకాక, గోపికలు శ్రీకృష్ణుని పరదైవంగా భావించినవారు కనుక, **"నాయకన్ మువ్వు ఏఴులకుక్కుమ్ నాతన్"** (నాయకుడు, ఏడు లోకాలకు నాథుడు) అనే రీతిలో అతనినే నాయకునిగా పలుకవలసి ఉండగా, నందగోపాలుని నాయకునిగా పల్కడంలోకూడా ఔచిత్యం లేదు కదా- అని కొందఱు భావించవచ్చు. శ్రీరాముడు రావణసంహారాన్ని చేసి, పుష్పకవిమానాన్ని ఎక్కి, లంకానగరంనుండి అయోధ్యకు తిరిగి వచ్చేటపుడు సీతకు పలు ప్రదేశాలను చూపుతూ వస్తూ, అయోధ్యను చూపేటపుడు **"ఏషా సా దృశ్యతే సీతే! రాజధానీ పితుర్మమ"** (సీతా! ఇదిగో, నా తండ్రియొక్క రాజధాని అయిన అయోధ్య కనబడు తున్నది) అని అన్నాడు. "ఇదిగో మన నగరం సమీపించింది. చూడు'' అని అనకుండా, పద్నాలుగు ఏండ్లకు ముందు మరణించిన తండ్రిని ప్రస్తావించి, "ఆయన ఊరు వచ్చింది చూడు'' - అని పల్కినందువల్ల తండ్రికి గొప్పతనాన్ని పల్కడమే శ్రీరామునకు ఆనందకరం - అనే విషయం తెలుస్తున్నది. శ్రీకృష్ణుని మనస్సుకూడా ఇటువంటిదే - అని తెలిసికొనిన గోపికలు, నన్దగోపాలుని నాయకునిగా చేసి పల్కడం తగును. ఇక, **కోయిల్ కాప్పాన్, వాశల్ కాప్పాన్** (ఆలయరక్షకుడు, ద్వారపాలకుడు) లేకపోయినా, వారిని సంబోధించి పిలిచి, వారి అనుమతిని కోరడం- అర్చావతారసమాధిని అనుసరించి- అని తెలియాలి. గోపికల అనుభవం విభవావతారంలోనే అయినా, గోదాదేవి అనుభవం అర్చావతారంలోనే ప్రవర్తిస్తున్నది. దివ్యదేశాలను సేవించాలని పోయేవారు అనుసంధించవలసిన పాశురాలను భట్టర్ శ్రీరంగరాజస్తవంలో **"విదధతు సుఖం విష్వక్సేనస్య తే ప్రథమే భటాః, కరిముఖజయత్సేనౌ కాలాహ్వసింహముఖౌ చ నః"** (కరిముఖుడు, జయత్సేనుడు, కాలుడు, సింహముఖుడు - అనే విష్వక్సేనుని ప్రథమభటులు మనకు సుఖాన్ని కల్గించాలి) అని, **"ప్రహరణపరివార వాహనాఢ్యాన్ కుముదముఖాన్ గణనాయకాన్ నమామి"** (ఆయుధాలతో, పరివారంతో కూడిన కుముదుడు

మొదలైన గణనాయకులను నమస్కరిస్తున్నాను) అని, **"చండప్రచండముఖతః ప్రణమామి రంగద్వారావలీషు చతస్పృష్వధికారభాజః"** (శ్రీరంగనాథుని ఆలయం లోని నాల్గు ద్వారాలలో అధికారాన్ని కల్గిఉండే చండప్రచండాదులను నమస్కరిస్తు న్నాను) అని మూడు శ్లోకాలతో అనుగ్రహించారు. కరిముఖుడు, జయత్సేనుడు, కాలుడు, సింహముఖుడు- అనే ఈ నల్గురు క్షేత్రపాలకులు. కుముద, కుముదాక్ష, పుండరీక, వామన, శంఖకర్ణ, సర్పనేత్ర, సుముఖ, సుప్రతిష్ఠితులనే ఎనిమిదిమంది నగరపరిపాలకులు. చండ, ప్రచండ, జయ, విజయ, భద్ర, సుభద్ర, ధాత, విధాతలు ఎనిమిదిమంది ద్వారపాలకులు. ఈ రీతిలో వీరి అనుమతిని పొంది, మంగళా శాసనం చేయడంకోసం లోపలకు ప్రవేశించాలనే శాస్త్రార్థం ఈ పాశురంలో సూచిత మవుతున్నది. **"మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్"** (మణికవాటాల తాళాన్ని తెరు) అనే ప్రార్థనను కోవెలను రక్షించే **"కోయిల్ కాప్పాన్"** (కోవెలను కాచేవాడు) వద్ద, **"తోరణవాశల్ కాప్పాన్"** (తోరణం వాకిలిని కాచేవాడు) వద్ద చేయబడిందని గ్రహించాలి. ఇక్కడ రెండు సంబోధనలు ఉన్నా, రెండు వాక్యాలతోను ద్వారపాలక వ్యక్తి ఒక్కరే ప్రబోధింపబడుతున్నారని కూడా గ్రహించవచ్చు. లేక, ఇద్దఱు వ్యక్తులు అని కూడా గ్రహించవచ్చు.

(కొడి త్తోన్ఱుమ్ తోరణవాశల్ కాప్పానే!) - రేపల్లెలోని అన్ని భవనాలు వ్యత్యాసం లేకుండా ఉన్నందున, చీకటిలో త్వరగా వచ్చే గోపికలు భ్రమించకుండా తెలిసికోవడంకోసం ధ్వజం, తోరణం- అనే గుర్తులు పెట్టబడ్డాయని వివరిస్తారు కొందఱు. ఎండాకాలంలో అక్కడక్కడ చలువ పందిళ్ళను వేసేవారు ఈ రీతిలో గుర్తులను పెట్టడం ఉన్నది కదా! **"ధన్వన్నివ ప్రపా అస్మి"** (ఎడారిలోని చలువ పందిరివలె తాపాన్ని తీర్చేవాడనై ఉన్నాను) అని వేదంలో భగవానుడు మరుకాంతారానికి ఒక గొప్ప చలువపందిరిగా చెప్పబడినందువల్ల ఇక్కడకూడా చలువపందిరికే చిహ్నం ఏర్పాటుచేయబడింది.

"మణిక్కతవమ్ తాళ్" - (మణికవాటం తాళాలను) తెఱవాలని ప్రార్థింపబడిన ద్వారపాలకుడు ఈ గోపికల అమృతసదృశాలైన మృదువచనాలను చెవులారా వినాలని కోరి, తాను కొన్ని మాటలను పల్కడం, దానికి గోపికలు మాఱు పల్కడం అనే క్రమంలో ప్రవర్తించిన సంభాషణను ఇక్కడ కొంచెం వివరిస్తాను.

ద్వారపాలకుడు : అన్ని విధాలుగాను భయపడవలసిన చోటు అయిన ఈ రేపల్లెలో అకాలంలో వచ్చి తలుపులను తెఱువమని అంటున్నారు ఎవరు?

గోపికలు : అయ్యా ! ఇది భయపడవలసిన చోటు అంటున్నావే! ఇది తగునా? **“భయం భయానా మపహారిణి స్థితే మనస్యనంతే మమ కుత్ర తిష్ఠతి?”** (భయాలను తీర్చే అనంతుడు నా మనస్సులో ఉండగా, నాకు ఇక భయం ఎక్కడ ఉంటుంది ?) అని ప్రహ్లాదాళ్వాన్ పల్కిన మాటను నీవు విని తెలియలేదా? భయనాశకుడైన భగవానుడు ఉండే చోట భయపడవలసినది ఉన్నదా?

ద్వారపాలకుడు : ఓ గోపికలారా ! మీరు పల్కినది చాలా బాగున్నదే. ఇపుడు శ్రీరామావతారసమయమని అనుకుంటున్నారా? శ్రీరాముడు అవతరించినది కృతయుగానికి అత్యంతం చేరువలో ఉండే త్రేతాయుగంలో కనుక, కాలం మంచిది. తండ్రి -శంబరాంతకుడనే పేరును పొందిన మహాశూరుడు, పది దిక్కులలో రథాన్ని నడువగల్గిన దశరథుడు. పుత్రులు- మహావీరులు, శూరులు. వారు దారిలో నేరుగా పోయి వచ్చే సాధువులు. ఊరు అయోధ్య అనే పేరును పొంది, ఎవరికీ ఆక్రమించడానికి సాధ్యం కాని చోటు పురోహితులు- వశిష్ఠుడు మొదలైన మహాజ్ఞానాధికులు. ఊరిలో ఉండే జనులు- **“స్త్రియో వృద్ధా స్తరుణ్యాశ్చ సాయం ప్రాత స్సమాహితాః, సర్వాన్ దేవాన్ నమస్యంతి రామస్యార్థే యశస్వినః”** (స్త్రీలు, వృద్ధులు, యువతులు నిత్యం ఉదయం, సాయంకాలం శ్రద్ధను కలవారై, శ్రీరాముని కోసం దేవతలందఱికి నమస్కరిస్తారు.) అనే రీతిలో రామునిపట్ల చాలా గొప్ప ప్రీతిని కలవారు. ఆ కాలంలో అచేతనాలైన వృక్షతృణాదులు సైతం **“విషయే తే మహారాజ! రామవ్యసనకర్శితాః, అపి వృక్షాః పరిమ్లానాః సపుష్పాంకురకోరకాః”** (మహారాజా! రాముని విరహంవల్ల క్లేశాన్ని పొందిన నీ రాజ్యంలోని వృక్షాలు కూడా పూలు, చిగుళ్ళు, మొగ్గలతో పాటుగా వాడిపోయాయి.) అనే సుమంత్రవచనాను సారం రామునిపై ప్రేమ మూర్తీభవించినట్లున్నవి. అందువల్ల శ్రీరామావతార కాలంలో నావుగింజ అంత అయినా భయపడనక్కరలేనట్లున్నది. ఈ అవతారంలో చూస్తే - కలికాలానికి చాలా సమీపంలో ఉండే ద్వాపరాంతం. తండ్రి- పచ్చగడ్డిని సైతం తొక్కని పరమసాధువైన నందగోపుడు. కుమారుడు- **“నిచ్చలుమ్ తీమైకళ్”** (నిత్యం దుష్టకార్యాలను) చేసి, తుంటరి పనులను చేసే శ్రీకృష్ణుడు. ఊరు - **“అఱివొన్ఱు మిల్లాద”** (ఏ జ్ఞానం లేని) గోకులం. దుష్టబుద్ధిని కల కంసునకు సమీపంలో ఉన్నది. ఈ స్థితిలో భయపడకుండా ఉండగలమా?

గోపికలు : అయ్యా! నీవు చెప్పినది అంతా నిజమే. కాని, మేము స్త్రీలం కదా అబలలం కదా! మావల్ల భయశంక పొందవచ్చునా?

ద్వారపాలకుడు : నిజమే, శూర్పణఖ స్త్రీయే కదా. ఈనాటికీ ఆమెను తలిస్తే... **“అఞ్జువన్ వెమ్‌శొల్ నఙ్గాయ్! అరక్కర్ కులప్పావైతన్నై”** (పెరియ తిరు-3-7-3) (ఆదరించదగిన మాటలను పలికే కాంతా ! రాక్షసకులకాంత అయిన శూర్పణఖను గూర్చి భయపడుతున్నాను.) అని అనవలసివచ్చిందికదా! పంచవటిలో ద్వారపాలకుడు లేనందువల్లనేకదా ఆ శూర్పణఖవల్ల వాచామగోచరమైన అనర్థం సంభవించింది.

గోపికలు : ఆమె రాక్షసి, మేము గోపికలం. ఆమెతో సమానంగా మమ్ములను ఎంచడం నీకు తగునా?

ద్వారపాలకుడు : రాక్షసి- అని, గోపిక- అని జాతిలో భేదం ఉన్నదా? పూతన అనే పిశాచి గోపికగాకదా వచ్చింది. **“కఞ్జన్ కఱుక్కొణ్డు నిన్‌మేల్ కఱునిఱ చ్చెమ్మయిర్ ప్పేయై వఞ్జిప్పదఱ్కు విడుత్తాన్ ఎన్బదోర్ వార్తైయు ముణ్డు”** (కంసుడు ద్వేషాన్ని కల్గి, నీపైకి నల్లని రంగును కల, ఎఱ్ఱని క్లేశాలను కల పిశాచి అయిన పూతనను నిన్ను వంచించడంకోసం పంపించాడనే మాట ఉన్నది.) అని అంటున్నారు. ఆ పరమపాపిష్ఠుడు కంసుడు ఇంకా ఎంతమందిని పంపుతున్నాడో, నేను తెలియగలనా?

గోపికలు : మహాప్రభూ! ఆ పూతన వయస్సు ముదిరినది. **“కరునిఱ చ్చెమ్మయిర్ ప్పేయ్”** అని నీవే పలికే రీతిలో ఎఱ్ఱని కేశాలను కల ఆమెతో నల్లని కేశాలను కల్గిన మమ్ములను సమానంగా ఎంచవచ్చునా? మేము చిన్న గోపికలం కదా! మా రూపాన్ని చూడు. మమ్ములను చూచి నీవు భయపడుతున్నావా? చాలా బాగున్నదే ! ఆలస్యం చేయకుండా మమ్ములను లోపలకు అనుమతించు స్వామీ!

ద్వారపాలకుడు : ఇవి అన్నీ ఉండనివ్వండి. మీరు ఈ సమయంలో ఎందుకోసం వచ్చారు ? లోపలకు పోయి ఏమి చేయబోతున్నారు ! దానిని చెప్పండి.

గోపికలు : నాయనా! ఇపుడు నీవు అడిగిన ఈ ప్రశ్న చాలా బాగున్నది. ఇది అడుగవలసిన విషయమే. చెబుతున్నాము విను. మేము ఒక పురుషార్థవిశేషాన్ని పొందడంకోసం వచ్చాము. నిన్న సాయంకాలం మేము శ్రీకృష్ణుని దర్శించి ప్రార్థించాము. అతడు కూడా- “వేకువజాములో రండి. ఇస్తాను”. అని పల్కినందున మేము లోపలకు పోగల్గినపుడే దానిని పొందగలం. స్వామీ ! మమ్ములను లోపలకు అనుమతించు.

ద్వారపాలకుడు : ఓ గోపికలారా! శ్రీకృష్ణుడు నిన్న మీకు ఏదో మాట ఇచ్చినట్లుగా చెబుతున్నారు కదా! ఇది నాకు వాస్తవంగా తోచడం లేదు. ఆయన మిమ్మలను ఈ సమయం కాని సమయంలో రమ్మని చెప్పి ఉంటే, ఆ విషయాన్ని నా దగ్గరకూడా చెప్పి ఉంటారు. వారు దీనినిగూర్చి నా వద్ద ఏ ప్రస్తావాన్ని చేయలేదు. నేను ద్వారపాలకుడను. వచ్చేవారిని అందఱిని నిరర్గళంగా లోపలకు వెళ్ళడానికి అనుమతించడం కోసమా నేను ఇక్కడ కూర్చుండబెట్టబడ్డాను! మంచిది! మంచిది! మీ అంతఃకరణశుద్ధిని తెలిసికోకుండా మిమ్మలను నేను లోపలకు వెళ్ళడానికి అనుమతించను. పొద్దు విడిచేవరకు ఆ విధంగానే వేచి ఉండండి. ఆ తరువాత చూస్తాను.

గోపికలు : నాయనా! నీవు ఈ విధంగా కఠినంగా పల్కడం తగదు. మా అంతఃకరణశుద్ధిని నూతనంగా నీవు పరీక్షించవలసి ఉన్నదా? మేము అన్ని విధాలుగాను పవిత్రతను కల్గినవారం. ఉపాయాంతరప్రావణ్యాన్ని కాని, ఉపేయాంతర ప్రావణ్యాన్ని కాని, లేక, ఇటువంటి దోషాలు కాని, ఏమీ మావద్ద కొంచెం కూడా లేవు. మేము మంగళాశాసనపరులం - అనే విషయాన్ని దృఢంగా నమ్మాలి నాయనా!

ద్వారపాలకుడు : ఆ విధంగా అయితే యథార్థాన్ని పల్కండి. మీరు లోపలకు పోయి చేయదలచిన కార్యమేమి? దానిని చెప్పండి. దానినిబట్టి నేను మీ రీతిని తెలిసికొంటాను.

గోపికలు : తిరుప్పళ్ళి యెழுచ్చిని పాడడంగూర్చి- (సుప్రభాతాన్ని పాడడాన్నిగూర్చి)- నీవు తెలియలేదా? అది మావంటివారి కృత్యమే. దానినే మేము చేయబోతున్నాము. **"ఉమ్బర్ కోమానే ! ఉఱఙ్గాదు ఎழுన్దిరాయ్"** (నిత్యసూరినాథా! నిద్రించకుండా మేలుకో) అని, **"అరవణైయాయ్ ! ఆయరేఱే ! అరుళ్ పురియ త్తుయిలెழாయే"** (నాగశయనా! గోపాలశ్రేష్ఠా ! మమ్మలను అనుగ్రహించడం కోసం నిద్ర లే)అని ఈ రీతిలో పల్కుతూ కీర్తిస్తాము. అంతకుమించి వేఱేమీ చేయము.

ద్వారపాలకులు - గోపికలారా ! మీరు చెప్పినది చాలా బాగున్నదే ! ప్రభువులు నిద్రించేటపుడు లోపలకు పోవడానికి అనుమతించడమే అపచారం. అందులోను, లోపలకు పోయి నిద్ర లేపడం ఇంకా మహాపచారం. చిత్రకూటంలో **"శిఱుకాక్కై ములై తీణ్డప్పెన్ఱ"** (కాకాసురునిచే స్తనాలలో గాయం చేయబడ్డ) సీతాదేవి

శయనించి ఉన్న శ్రీరాముని నిద్ర లేపి, **"స మయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః"** (తమ ఒడిలో సుఖంగా నిద్రించినవాడు, శత్రువులను తపింపజేసేవాడు, శయనకాలికసౌందర్యంతో శోభిల్లే ఆ శ్రీరాముడు నాచే మేల్కొలుపబడ్డాడు) అని తరువాత ఎంతగానో పరితపించింది - అనే విషయం మీకు తెలుసునని అనుకుంటున్నాను. "నిద్రించే సమయంలోని అందాన్ని దర్శించాలని లోపలకు పోతున్నాము''- అని పల్కినా తప్పు లేదు. "నిద్రలేపడానికి పోతున్నాము''- అని మీరు అనడం గొప్ప అపచారం. మీరు లోపలకు పోవడం తగనే తగదు.

గోపికలు : అయ్యా ! ఈ విధంగా మమ్మలను నీవు అడ్డుకోవడం తగనే తగదు. శ్రీరామాయణంలో నీకు పరిపూర్ణమైన ప్రవేశం లేదని అనుకుంటున్నాము. శ్రీరామలక్ష్మణులను పిలుచుకొని పోయిన విశ్వామిత్రముని **"కౌసల్యాసుప్రజా! రామ! పూర్వా సంధ్యా ప్రవర్తతే, ఉత్తిష్ఠ నరశార్దూల!"** (కౌసల్యాదేవి సత్పుత్రుడా! శ్రీరామా! తూర్పు సంధ్య ప్రవర్తిస్తున్నది. మానవశ్రేష్ఠా! నిద్ర లే) అని పల్కి సుప్రభాతాన్ని పాడడం నీకు తెలుసు- అని అనుకుంటాను. మా జనకులు కూడా **"అరవణైయాయ్ ! ఆయరేఱే ! అమ్మముణ్ణ త్తుయిలెழாయే"** (నాగశయనా ! గోపాల శ్రేష్ఠా ! నాయనా ! భుజించాలి. ఇక నిద్రలే) అని, **"అరఙ్గత్తమ్మా ! పళ్ళి ఎழுన్దరుళాయే!"** (శ్రీరంగనాథా! మేలుకో) అని పల్కి నిద్ర లేపారు. నిజంగా నిద్రించినవారిని నిద్రలేపడం అపచారం తప్ప, **"ఉఱఙ్గువాన్ పోల్ యోగు శెయ్ద పెరుమానై"** (నిద్రించేవానివలె యోగనిద్రను చేసే స్వామి)ని ప్రబోధించడం ఉపచారమే కాగలదు. నాయనా! ఈ శాస్త్రార్థవిచారం మనకు ఇపుడు వద్దు. దయచూపి మమ్మలను లోపలకు అనుమతించు.

ద్వారపాలకుడు : (మనస్సులో దయను కలవాడై) గోపికలారా! మీ ఆర్తి అపరిమితంగా కన్పిస్తున్నందున నేను అడ్డు పెట్టకుండా అనుమతిస్తున్నాను. లోపలకు వెళ్ళండి. తలుపును మీరే తెఱచుకొని పొండి- అని అన్నాడు. దానిని విన్న గోపికలు - "మేమే స్వయంగా తలుపును తెఱచుకొనిపోవడం అనేది స్వరూపానురూపం కాదు. నీవే తలుపులు తెఱచి మమ్మలను లోపలకు విడువాలి'' అని అన్నారు. అడ్డుపెట్టినవాడే తన చేతులతో లోపలకు పంపిస్తే కదా వీరికి ఆనందం కల్గుతుంది. శ్రీరాముని గోష్ఠిలోకి ప్రవేశించాలని వచ్చిన విభీషణాழ்వాన్‌ను అడ్డు పెట్టినవాడు, సుగ్రీవుడు. అడ్డు పెట్టకూడదని పల్కినవాడు తిరువడి (హనుమానుడు). శ్రీరాముడు విభీషణుని అంగీకరించాలని నిశ్చయించినపుడు,

పూర్వం అడ్డుపెట్టిన సుగ్రీవ మహారాజునే ఆజ్ఞాపించి, **"ఆనయైనం హరిశ్రేష్ఠ"** (వానరరాజా ! ఇతనిని పిలుచుకొని రా) అని పలికాడే తప్ప, స్నేహభావాన్ని కల్గిన హనుమానుని ఆజ్ఞాపించలేదు కదా! అడ్డుపెట్టినవానిద్వారానే స్వీకరించేటట్లు చేయడం రసవత్తరమని దీని తాత్పర్యం. ఆ రీతిలోనే సంభవించింది ఇక్కడకూడా.

ఇతఃపూర్వం **"పుళ్ళుమ్ శిలమ్బిన కాణ్"** (పక్షులు కూడా ధ్వనించాయి సుమా) అనే పాశురంనుండి పలు పాశురాలలో ఆళ్వార్లు పదిమందిని నిద్ర లేపిన రీతిని ఒక్కొక్క పాశురంలో ఉండే విశిష్టపదప్రయోగాలద్వారా చాలా యుక్తంగా నిర్వహించిన వైఖరిలోనే ఇందులోకూడా భగవద్రామానుజులు ప్రబోధింపబడుతున్నారు- అనే విషయం గమనించదగినది. **"భూతం సరశ్చ"** అని భగవద్రామానుజులు ఆళ్వార్లతో పాటు పరిగణింపబడడం గమనించవచ్చు. **"పరాంకుశపరకాల తయతివర"** అనే ఆచార్యహృదయశ్రీసూక్తి కూడ గమనార్హం.

(నాయకనాయ్ నిన్ఱ) - ఆచార్యగోష్ఠిలో నాయకమణిగా భాసించేవారు, భగవద్రామానుజులు- అని దీని ద్వారా సూచింపబడింది. **"అమునా తపనాతిశాయి భూమ్నా యతిరాజేన నిబద్ధనాయకశ్రీః"** (సూర్యుని మించిన తేజస్సును కల ఈ యతిరాజ సూర్యునిచే నాయకమణిగా పొదగబడి కాంతిని కల ఆచార్యరత్నహారం) అనే యతిరాజసప్తతిశ్రీసూక్తినికూడా గమనించండి.

(నన్దగోపన్) - భగవానుని పుత్రునిగా పొందిన విషయంలో భగవద్రామానుజులకు నందగోపాలునితో సాధర్మ్యం ఉన్నది. యతిరాజ సంపత్కుమారులని వ్యవహరింపబడే శెల్వప్పిళ్ళైను శ్రీకృష్ణకిశోరస్థానీయునిగా గమనించాలి.

(ఉడైయ) ఈ పదంద్వారా శ్రీరామానుజులకు గల **"ఉడైయవర్"** (సొత్తు దారుడు) అనే తిరునామం సూచింపబడింది.

(కోయిల్‌కాప్పాన్) - కోయిల్ అనే పదం శ్రీరంగంలోని ఆలయాన్ని మాత్రం తెలుపుతున్నదని గ్రహించవచ్చు. లేక, ఇంకా అనేక ఆలయాలను తెల్పుతున్నదని కూడా చెప్పవచ్చు. **"తెన్నరఙ్గర్‌శెల్వమ్ ముర్ఱ్రుమ్ తిరుత్తువైత్తాన్ వాళ్ళియే"** (దక్షిణ దిక్కులోని శ్రీరంగనాథుని సంపదను అంతటిని సంస్కరించిన వారికి మంగళం) అని, **"శ్రీమన్ ! శ్రీరంగశ్రియ మనుపద్రవా మనుదినం సంవర్ధయ"** (శ్రీమన్ ! రామానుజా ! శ్రీరంగంలోని సిరిని ఏ ఉపద్రవం లేకుండా నిత్యం వర్ధిల్లజేయాలి) అని పలికే రీతిలో శ్రీరంగాలయ సంపదను రక్షించినవారని మొదటి

భావం. **"మన్నియ తెన్ అరఙ్గాపురి మామలై మర్ఱ్రు ముపన్దిడునాళ్"** (స్థిరంగా నిలచి ఉండే దక్షిణ దిక్కులోని శ్రీరంగం, తిరుమల, ఇంకా మిగిలిన అన్నీ ఆనందించే దినం) అనేటట్లుగా సకలదివ్యదేశాలను ఉద్ధరించినవారు శ్రీరామానుజులే కనుక, శ్రీవైష్ణవాలయాలను అన్నిటిని సంరక్షించినవారు శ్రీరామానుజులు - అనే విషయం కూడా యుక్తమే.

(కోడి తోన్ఱుమ్ తోరణవాశల్ కాప్పానే !) - కొడియణి నెడుమదిళ్ కోపురమ్ **కుఱుకినర్"** (ధ్వజాలతో అలంకరింపబడిన గొప్ప ప్రాకారాలను, గోపురాలను సమీపించారు) అని, **"నెడువరై తోరణమ్ నిరైత్తు ఎఙ్గుమ్ తొழுదనర్ ఉలకే"** (వైకుంఠంలోనివారు, ఎత్తైన పర్వతాలవంటి తోరణాలతో అంతటా అలంకరించి, నిండించి, నమస్కరించారు) అని పలికే రీతిలో ధ్వజాన్ని తోరణాన్ని కల్గిన వాకిలి పరమపద వాకిలి. దానిని శ్రీరామానుజులు తమ పాలనలో నిలిపి నిర్వహిస్తున్నారని భావం. శ్రీరామానుజుల కరుణను పొందనివారికి ఆ వాకిటిలోకి ప్రవేశించడం అరుదు- అనే ప్రసిద్ధి తెలుపబడిన రీతి ఇది.

(మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్) - మణి అంటే - రత్నం. నవరత్నాలని చెప్పబడడంచేత రత్నాలు తొమ్మిది అనేది ప్రసిద్ధం. నవరత్నాలవంటి తొమ్మిది దివ్యగ్రంథాలను అనుగ్రహించినవారు శ్రీరామానుజులు. శ్రీభాష్యం, వేదాంతదీపం, వేదాంతసారం, వేదార్థసంగ్రహం, నిత్యగ్రంథం, గీతాభాష్యం, శరణాగతిగద్యం, శ్రీరంగగద్యం, శ్రీవైకుంఠగద్యం - అనే తొమ్మిది దివ్యగ్రంథాలే ఇక్కడ **"మణిక్కదవమ్"** అని చెప్పబడ్డాయి. తలుపులు ఏవిధంగా లోపల ఉండే పదార్థాలకు రక్షకమో, ఆ రీతిలోనే ఈ దివ్యగ్రంథాలుకూడా శాస్త్రార్థాలకు రక్షకంగా అమరి ఉన్నాయి. కనుక వానిని **"కదవు"** (కవాటం) అని అనడం చాలా యుక్తం. **(కదవు, కదవమ్-** అనే పదాలు పర్యాయాలే) "ఈ గ్రంథాలలో ఉండే అర్థాలను మేము అనుభవించేటట్లుగా చేయాలి''- అనేది **"తాళ్ తిఱవాయ్"** అనే ప్రయోగంలోని తాత్పర్యం. **"ఆయర్ శిఱుమియరోముక్కు మణిక్కదవమ్ తాళ్ తిఱవాయ్"** అని అన్వయించాలి. జ్ఞానహీనలమైన మాకు తెలిసేటట్లుగా వాటిని అను గ్రహించాలి - అని భావం.

(మాయన్ మణివణ్ణన్ నెన్నలే వాయ్ నేర్న్దాన్) - భగవానుడు తన గ్రంథాలలో ఇంతకు ముందే మిమ్ములను (శ్రీరామానుజులను) గూర్చి నోరు తెఱచి పలికారు- అని భావం. **"కలౌ రామానుజః స్మృతః"** (కలియుగంలో శ్రీరామానుజులుగా

అవతరించారు), "కలౌ కశ్చిద్భవిష్యతి" (కలియుగంలో ఒక గొప్ప వ్యక్తి జన్మించ గలడు), "ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానిన స్తత్త్వదర్శినః" (తత్త్వాన్ని దర్శించిన ఆ జ్ఞానులు జ్ఞానాన్ని ఉపదేశిస్తారు) ఇత్యాది ప్రమాణాలు ఇక్కడ అనుసంధేయాలు.

(తూయోమాయ్ వన్దోమ్) - "ఆచార్యాదిహ దేవతా సమధికా మన్యాం న మన్యామహే" అనే రీతిలో ఆచార్యులకు మించిన దైవం లేదు- అనే భావశుద్ధితోనే వచ్చాము - అని భావం. "తూయోమాక వన్దోమ్" అనికూడా గ్రహించవచ్చు. సకలార్థాలను మేము తెలుసుకొని పవిత్రులం అయేటట్లుగా వచ్చాము - అని భావం.

(తుయిలెழ్పాడువాన్ వన్దోమ్) - "అనాదిమాయయా సుప్తః" (అనాది అయిన మాయచే నిద్రించేవాడు) అనే రీతిలో అనాది అయిన మాయచేత నిద్రిస్తూ పడి ఉండే మేము ఆ నిద్రను విడచి, ప్రబోధాన్ని పొందడంకోసం, "ఏతత్ సామ గాయన్నాస్తే" (ఈ సామాన్ని గానం చేస్తూ ఉంటాడు) అనే రీతిలో సామగానం చేస్తూ ఉండడం కోసం వచ్చాము.

(వాయాల్ మున్న మున్నమ్ మాற்றாదే యమ్మా!) - "నాసంవత్సరవాసినే ప్రబ్రూయాత్" (సంవత్సరకాలం వాసం చేసి సేవచేయనివానికి ఉపదేశించ రాదు) ఇత్యాది నియమాలను పల్కి మమ్ములను కాదనకుండా అంగీకరించాలి- అని భావం.

(నీ నేశనిలై క్కదవుమ్ నీక్కు) తలుపులు జంటగా ఉండేటట్లే, తిరుమంత్రం, ద్వయం, చరమశ్లోకం జంటగా ఉండడంచేత వాటిని తలుపులుగా రూపించి, వాటి అర్థాలను ఉపదేశించాలని అంటున్నారు. తిరుమంత్రంలో - ప్రణవం, మంత్రశేషమనే జంట, ద్వయంలో- పూర్వవాక్యం, ఉత్తరవాక్యమనే జంట, చరమశ్లోకంలో- పూర్వార్ధం, ఉత్తరార్ధం అనే జంట- ఇవే ఇక్కడ "నేశనిలై క్కదవు" గా చెప్పబడ్డాయి. వీటిని తెఱవడం అంటే- వీటి అర్థాలను వివరించడమే.

17. అమ్బరమే తణ్ణీరే శోఱే అఱమ్ శెయ్యుమ్
ఎమ్బెరుమాన్! నందగోపాలా! ఎழுన్దిరాయ్
కొమ్బనార్కెల్లామ్ కొழுన్దే! కులవిళక్కే!
ఎమ్బెరుమాట్టి యశోదాయ్! అఱివుఱాయ్

అమ్బరమూడఱుత్తు ఓఙ్గి యులకళన్ద
ఉమ్బర్ కోమానే! ఉఱఙ్గాదు ఎழுన్దిరాయ్
శెమ్బొఱ్కழలడి చ్చెల్వా! బలదేవా!
ఉమ్బియుమ్ నీయుమ్ ఉఱఙ్గు ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురంలో నందగోపాలుడు, యశోద, శ్రీకృష్ణుడు, బలరాముడు- అనే నల్గురు వ్యక్తులు ప్రబోధింపబడుతున్నారు. నందగోపాలుడు ఔదార్యంలో చాలా గొప్పవాడని కీర్తింపబడుతున్నాడు. ఈ ప్రబంధంలో నందగోపాలుని ప్రస్తావం 1,16,17,18,21- అనే అయిదు పాశురాలలో కన్పిస్తుంది. మొదటి పాశురంలో "కూర్వేల్ కొழுన్దొழிలన్ నన్దగోపన్" (పదునైన వేలాయుధంతో క్రూరమైన వ్యాపారాన్ని చేసేవాడు) అని అన్నందువల్ల అతని మంగళాశాసనపరత్వం చెప్పబడింది. పదహాఱవ పాశురమైన గడచిన పాశురంలో ఆయన రేపల్లెలో అంతటికి నాయకుడు - అనే గొప్పతనం తెలుపబడింది. రాబోయే పాశురంలో సాటి లేని బలాన్ని కలవాడనేది, ఇరవై ఒకటవ పాశురంలో ఔదార్యాన్ని కల్గిన గొప్ప గొప్ప గోవులను విశేషంగా కలవాడనేది తెలుపబడింది. ఇందులో అతడు వస్త్రదానాన్ని చేసేవాడు, తీర్థదానాన్ని చేసేవాడు, అన్నదానాన్ని చేసేవాడని చెప్పబడుతున్నది. నందగోపాలుడు ఇటువంటి దానాలను చేసేవాడుగా ఏ పురాణాలలోను చెప్పబడలేదే ! అయితే, యాదవాభ్యుదయ కావ్యంలో "అధిచకార వదాన్యమణేః శ్రియం వ్యథితకల్పతరో రనుకల్పతామ్" (కల్పవృక్షాన్ని మించిన ఔదార్యాన్ని కల గొప్ప వదాన్యుడయిన నందగోపాలునితో సామ్యాన్ని పొందాడు) అని అంటూ శ్రీకృష్ణుడు తనకు కుమారుడుగా జన్మించిన ఆనందవల్ల చింతామణి వలె, కల్పవృక్షంవలె నందగోపాలుడు దానాలను చేసినట్లు చెప్పబడింది. ఒక విశేషసమయంలో దానం చేయడం లోకంలో ఎవరికైనా ఉండే విషయమే కనుక, దానిని పురస్కరించుకొని "అమ్బరమే తణ్ణీరే శోఱే అఱమ్ శెయ్యుమ్" (వస్త్రాన్నే, అన్నాన్నే, నీటినే దానం చేసే) అని అన్నారు- అని అనడం అందమైనది కాదు. అయితే, పాశురంలోని నందగోపాలుని ఔదార్యాన్ని ఏ విధంగా నిర్వహించాలి? అని అంటే, వినండి. వస్త్రదానం, తీర్థదానం, అన్నదానం- అని ఇక్కడ చెప్పబడిన మూడు దానాలు, నందగోపాలుని కుమారునివద్ద ప్రసిద్ధంగా ఉన్నవి. "కారణగుణాః కార్యే సంక్రామంతి" (కారణంలోని గుణాలు దాని కార్యంలో సంక్రమిస్తాయి) అనే న్యాయంతో కారణభూతుడైన నందగోపాలుని వద్దనుండే కార్యభూతుడైన

శ్రీకృష్ణునిలో ఇవి సంక్రమించాయి కాబోలు - అని భావించి ఈ విధంగా గోదాదేవి పలికారని భావం. శ్రీకృష్ణుడు వస్త్రదానాన్ని చేయడం ద్రౌపది విషయంలో ప్రసిద్ధం. తీర్థదానాన్ని చేయడం పెరియాఴ్వార్ తిరుమొఴిలోని **"మన్నర్ మఱుక మైత్తునన్ మార్క్కొరు తేరిన్ మేల్ మున్నజ్గు నిన్టుమోఴై ఎఴువిత్తవన్"** (4-2-7) (ప్రభువులందఱు ఇతని జయించగలమా?'' అని భయపడేటట్లు బావమఱదులైన పాండవులకోసం గొప్ప రథంపై ఎక్కి, అపుడు వారుణాస్త్రంతో భూగర్భజలాన్ని ఉప్పొంగి వచ్చేటట్లు చేసినవాడు) అనే పాశురంలో గమనించవచ్చు. భారతయుద్ధం కోసం కురుక్షేత్రానికి పాండవులు తాను కలసి పోయేటపుడు అర్జునుని రథాశ్వాలు తాగే నీరు లేక బాగా దాహాన్ని పొందాయి. అప్పుడు అర్జునుడు వాటి దాహాన్ని తీర్చమని ప్రార్థించగా, శ్రీకృష్ణుడు, కఠినమైన స్థలంలోసైతం నీరుండే చోటును తెలిసినవాడు కనుక, అక్కడ వారుణాస్త్రాన్ని ప్రయోగించి భూమిలోపల ఉండే నీటిని బయటకు రప్పించి, అశ్వాల దాహాన్ని, పాండవుల దాహాన్ని తీర్చాడనే ఇతిహాసం పైన ప్రస్తావించిన పెరియాఴ్వార్ తిరుమొఴి పాశురంలో అనుసంధింప బడింది. ఇటువంటి తీర్థదానమే కాకుండా, **"ఇట్టమాన పశుక్కళై ఇనిదు మఱిత్తు నీరూట్టి"** (తనకు ఇష్టమైన గోవులను ప్రేమతో దువ్వి, నీటిని తాగించి) అనే ఆణ్డాళ్ పాశురంవల్ల తెలిసే నిత్యతీర్థదానమొకటి ఉన్నది. ఇక, శ్రీకృష్ణుడు అన్నదానాన్ని చేసినట్లు ఎక్కడ ఉన్నది ? అని అంటే, **"వేర్త్తు ప్పశిత్తు వయిఱశైన్దు వేణ్డడిశిల్ ఉణ్ణుమ్బోదు, ఈదెన్ఱు పార్త్తిరున్ద నెడు నోక్కుక్కొళ్ళుమ్ పత్తవిలోచనత్తు"** (పశువులను మేపడంవల్ల అలసటను పొంది, ఆకలివల్ల బాధపడి కడుపు తల్లడిల్లినపుడు, కోరిన ప్రసాదం భుజించే సమయం ఇది- అని ఋషిపత్నుల రాకకోసం ఎదురుచూచే చోటు బద్ధవిలోచనం) అని ఆణ్డాళ్ పల్కిన బద్ధవిలోచనంనుండి మహర్షిపత్నులు నిత్యం తీసికొని వచ్చి సమర్పించిన వంటకాలను **"తన్నేరాయిరమ్ పిళ్ళైకళోడు"** (తనతో సాటి వచ్చే వేయిమంది గోపబాలకులకు) దానం చేయడం అనేది ఉన్నది. కనుక, ఈ రీతిలో వస్త్ర-తీర్థ-అన్నదానాలు శ్రీకృష్ణునివద్ద దర్శించి, వానిని నందగోపాలునిలో ఆరోపించి పల్కినట్లుగాకూడా చెప్పవచ్చు. లేక, గోపికలకు వస్త్రాలు, నీరు, అన్నం- అనేవి అన్నీ శ్రీకృష్ణుడే కనుక, అతనిని నందగోపాలుడు అనుగ్రహించినందువల్ల **"అమ్బరమే తణ్ణీరే శోఱే అఱమ్ శెయ్యుమ్"** (జలమే, అన్నమే, వస్త్రమే దానం చేసే) అని పల్కినట్లుగా కూడా గ్రహించవచ్చు.

"ఎమ్బెరుమాన్" అనే తిరునామం భగవానునకు ఒక్కనికే అసాధారణమై ఉండగా, దానిని నందగోపాలునిపై ఆరోపించి **"ఎమ్బెరుమాన్! నన్దగోపాలా!"** (స్వామీ! నందగోపాలా) అని పలుకవచ్చునా? అని అంటే, సర్వనియామకుడైన ఆ భగవానునికూడ నియమించేవాడుగా నందగోపాలుడు ఉండడంవల్ల, ప్రకృతంలో అతనిని "ఎమ్బెరుమాన్" అని అనడంలో ఏలోటు లేదు.

తరువాత యశోదాదేవి ప్రబోధింపబడుతున్నది - **"కొమ్బనార్క్కెల్లామ్"** అని ప్రారంభించింది. **"కొమ్బనార్"** అనే పదాన్ని **"కొమ్బు అన్నారు"** అనే విభాగం చేసి, ప్రబ్బలితీగవంటి మృదువైన, మధ్యభాగాన్ని కలవారు- అనే కారణంచేత, ఈ పదం స్త్రీలను తెల్పుతున్నదని చెప్పవచ్చు. (తెలుగులో కూడా **"కొమ్మ"** - అనేపదం స్త్రీవాచకం) ఈ పదం ఇక్కడ సామాన్యస్త్రీలను తెలిపే పదం కాదు. భగవానుని కుమారునిగా పొందగల్గిన భాగ్యవతి అయిన కౌసల్య, దేవకి మొదలైన స్త్రీరత్నాలను తెల్పుతున్నది. ఇటువంటి భగవానుని తల్లులలో చాలా గొప్పదానవైన ఓ యశోదాదేవీ! అని సంబోధించిన రీతి ఇది. కౌసల్యాదులు భగవానుని కుమారునిగా పొందారే తప్ప, **"ఞాలత్తు ప్పుత్తిరనై ప్పెఱ్ఱార్ నజ్గైమీర్! నానే మఱ్ఱారుమిల్లై"** (ఓ అందమైన వనితలారా! ఈ భూమిలో పుత్రులను పొందిన తల్లిని నేనే; ఇంకెవరూ లేరు) అని యశోదాదేవితానే పల్కిన రీతిలో స్వయంగా పలుకదగిన గొప్పతనంలో ఏకదేశం కూడా మిగిలినవారికి లేదుకదా! దేవకీదేవికూడా, **"తిరువిలేన్ ఒన్ఱుమ్ పెఱ్ఱిలేన్, ఎల్లామ్ దెయ్వనజ్గై యశోదై పెఱ్ఱాళే"** (అదృష్టం లేని నేను ఏ భాగ్యాన్ని పొందలేదు. అన్నిటిని ఆ దైవకాంత యశోద పొందింది కదా!) అని పలికే రీతిలోని గొప్ప ఫలాన్నికదా యశోద పొందింది.

(కులవిళక్కే) - రేపల్లెకు మణిదీపమా! అని అర్థం. **"ఆయర్కులత్తినిల్ తోన్ఱు మణివిళక్కై"** (గోకులంలో అవతరించిన కులదీపం) అని గోపాలకుల దీపంగా చెప్పబడిన శ్రీకృష్ణుని కూడా ప్రకాశింపజేసిన దీపంకదా యశోద. **"అఱివొన్ఱు మిల్లాద ఆయ్క్కులమ్"** (ఏ జ్ఞానం లేని గోకులం) అని తక్కువజేసి చెప్పబడ్డ గోపాలకులం ఈమెవల్ల కదా ప్రకాశాన్ని పొందింది.

(ఎమ్బెరుమాట్టి ! యశోదాయ్ !) నందగోపాలుడు "ఎమ్బెరుమాన్" (స్వామి) అయినపుడు, అతని పత్ని అయిన యశోద "ఎమ్బెరుమాట్టి" (స్వామిని) కావడంలో కొఱతలేదు కదా! నందగోపాల-యశోదలనే భగవానుడు పిరాట్టిగా భావించి పల్కిన రీతి ఇది. మాకు అందఱికి గొప్పతనాన్ని, అతిశయాన్ని కల్గించినదానా! అని దీని భావం.

ఇకపై గోపికలు **"అశోదై ఇళమ్ శిజ్గమ్"** (యశోద బాలసింహం) అయిన శ్రీకృష్ణుని ప్రబోధిస్తున్నారు. **"నన్దగోపాలన్ కుమరా! ఎళ్ళున్దిరాయ్"** (నంద గోపాలుని కుమారా! నిద్రలే) అని గాని, **"నారాయణా! ఎళ్ళున్దిరాయ్"** అని గాని పలుకవలసి ఉండగా, ఆ రీతిలో పలుకకుండా, **"ఓజ్గి ఉలకళన్ద ఉమ్బర్‌కోమానే!"** (విజృంభించి లోకాలను కొలిచిన నిత్యసూరినాథా!) అని సంబోధించి ప్రబోధించడం- సౌలభ్యంలో శ్రీకృష్ణునకు, త్రివిక్రమమూర్తికి గల సామ్యాన్ని పురస్కరించుకొని. **"శిఱియన్ ఎన్ఱు ఎన్నిళమ్ శిజ్గత్తై ఇకళ్ళేల్ కణ్డాయ్, శిఱుమైయిన్ వార్‌త్తైయై మావలియిడై చ్చెన్ఱు కేళ్"** (చిన్నవాడు అని ఈ బాల సింహాన్ని నిందించకు సుమా! ఈ చిన్న బాలుని సంగతిని గూర్చి మహాబలి దగ్గరకు వెళ్ళి అడుగు) అనేది యశోదాదేవివచనం. ముప్పై పాశురాలను కల తిరుప్పావైలోని మూడు దశకాలలోను శ్రీకృష్ణుని త్రివిక్రమమూర్తిగా పల్కడం గుర్తించదగినది. మొదటి దశకంలో **"ఓజ్గి ఉలకళన్ద ఉత్తమన్"** అనేది, ఈ దశకంలో ఈ పాశురం, రాబోయే దశకంలోని **"అన్ఱివ్వులకమ్ అళన్దాయ్ అడి పోఱ్ఱి"** (ఆనాడు లోకాలను కొలిచిన శ్రీపాదానికి మంగళం) అనేది. (ఆ పాశురాలు) **"తావి యన్ఱులకమెల్లామ్ తలై విళాక్కొణ్డ ఎన్దై"** (ఆనాడు స్పృశించి జనులందఱి తలలను శ్రీపాదాలతో ఆవరించిన తండ్రి) అయిన త్రివిక్రమునివలె శ్రీకృష్ణుడుకూడా "వీరు, ఇటువంటి వారు''- అనే భేదాన్ని చూడకుండా అందఱితో కలసి వర్తించే స్వభావాన్ని కలవాడు కనుక, శ్రీకృష్ణుడు, త్రివిక్రమమూర్తి -అనే ఇద్దఱు ఒకరితో ఒకరు సామ్యాన్ని కల్గి ఉన్నారు.

శ్రీకృష్ణుని ప్రబోధించినప్పటికీ అతడు నోరు తెఱవనందున, అగ్రజుని ప్రబోధించిన తరువాతే తనను ప్రబోధించాలి- అని శ్రీకృష్ణుడు భావించినట్లుగా గోపికలు తలచి, తరువాత బలరాముని ప్రబోధిస్తున్నారు, బలదేవుని **"శెమ్పొఱ్కళ లడి చ్చెల్వా !"** (అందమైన బంగారు కడియాలను ధరించిన పాదాలను కల బలదేవా !) అని విశేషించి నిద్రలేపడం చాలా సుందరమైనది. **"మక్కళ్ అఱువరై క్కల్లిడై మోద ఇళ్ళన్దవళ్ తన్‌వయిఱ్ఱిల్ శిక్కన వన్దు పిఱన్దు నిన్ఱాయ్"** (పెరియాళ్వార్ తిరుమొళి- 5-3-1) (ఆఱుగురు పుత్రులను కంసుడు రాతిపై మోదగా వారిని కోల్పోయిన దేవకిగర్భంలో శీఘ్రంగా వచ్చి జన్మించావు) అనే రీతిలో దేవకీదేవి గర్భంలో జన్మించిన శిశువులు ఆఱుగురు కంసునిచే రాతిపై మోదబడి మరణించిన తరువాత జన్మించిన శ్రీకృష్ణునకు ఆ విధంగా ఏ ఆపద

కలుగని రీతిలో బలరాముడు ముందుగా అవతరించాడుకదా! శ్రీకృష్ణునకు ఏ ఆపద లేకపోవడానికి కారణం బలరాముని బంగారు పాదంయొక్క ప్రభావమే- అని భావించిన గోపికలు- **"శెమ్పొఱ్కళలడి చ్చెల్వా!"** (అందమైన, బంగారు కడియాలను కల బలదేవా !) అని సంబోధించి పిలువడం తగినదేకదా. లోకంలో. ఒక ఇంటికి కోడలు వస్తే, ఆమె వచ్చినప్పటినుండి కుటుంబంలో మంచి మిక్కిలిగా కల్గినట్లయితే అత్తగారు, మామగారు ఆమె కాలు పెట్టిన మంచినిగూర్చి ఆమెను పొగడి పల్కడం, ఆ విధంగా కాకుండా చెడ్డ మిక్కిలిగా సంభవిస్తే, "ఈమె ఏనాడు ఈ ఇంటిలో తన చెడ్డ పాదం పెట్టిందో, అప్పటినుండి ఇంటికి శని పట్టింది'' అని నిందిస్తూ పల్కడం సహజం కదా. ఇక్కడ **"శీర్ మల్‌కుమ్ ఆయ్‌ప్పాడి చ్చెల్వా!"** (సిరి నిండుగా కల రేపల్లెకు సంపదవంటివాడా!) నికి అంతటికి మూలకందం బలరాముని పాదప్రభావమే- అని భావించడం చాలా తగినది. ఈ విధంగా బలరాముని నిద్రలేపి, **"ఉమ్బియుమ్ నీయుమ్ ఉఱజ్గేల్"** (నీ తమ్ముడు, నీవు నిద్రించకండి) అని అంటున్నారు. మీరు ఇద్దరు కలసి మమ్ములను కటాక్షించి రక్షించాలి- అని భావం. **"సందేశైః సామమధురైః ప్రేమగర్భై రగర్వితైః, రామేణాశ్వాసితా గోప్యః"** (అనునయించేవి, మధురమైనవి, ప్రేమతో కూడినవి, గర్వాన్ని లేనివి అయిన మాటలతో బలరామునిచే గోపికలు ఊరడింపబడ్డారు.) అనే శ్రీవిష్ణుపురాణ వచనరీతివల్ల, **"దూత్యేనాపి చ యస్య గోపవనితాః కృష్ణాగసాం వ్యస్మరన్"** (ఎవని దూత్యంచేత గోపికలు శ్రీకృష్ణుని అపరాధాలను విస్మరించారో) అనే భట్టర్‌శ్రీసూక్తి. వైఖరివల్ల బలరాముడు మాటలలో నేర్పరి- అనేది వ్యక్తమవుతున్నందున, ఇతడు తన వాజ్మాధుర్యంతో శ్రీకృష్ణుని తమకు వశం చేయాలనే ఉద్దేశ్యంతో **"నీ ఎళ్ళున్దిరాయ్"** (నీవు నిద్రలే) అని అనడంతో నిలువకుండా, **"ఉమ్బియుమ్ నీయుమ్ ఉఱజ్గేల్"** (తమ్ముడు, నీవు నిద్రలేవండి) అని అంటున్నారు.

ఈ పాశురంలో నందగోపాలుడు, యశోద, శ్రీకృష్ణుడు, బలరాముడు- అనే నల్గురి వ్యాజంతో క్రమంగా ఆచార్యుడు, తిరుమంత్రం, తిరుమంత్రార్థం, తిరుమంత్రార్థసారం -అనే ఈ నాల్గు తగిన పదాలలో తెలుపబడ్డాయి. ఏవిధంగా ? అంటే- నందగోపాలుడు వస్త్రాలను, తీర్థాన్ని, అన్నాన్ని ధర్మం చేసేవాడుగా చెప్పబడింది. ఈ మూడిటిని ఆచార్యుడే ధర్మం చేయడాన్ని గమనిస్తాము. అమ్బరమంటే ఆకాశం. పరమాకాశశబ్దవాచ్యమైన **"నలమన్ద మిల్లైదోర్ నాడు"** (అంతు లేని ఆనందాన్ని కల అద్వితీయమైన దేశం) అనబడే శ్రీవైకుంఠాన్ని

పొందించడమే, అంబరాన్ని దానం చేయడం. తణ్ణీర్ అంటే - విరజానది. విరజానదీ స్నానాన్ని చేయించేవాడని భావం. అన్నం అంటే -"అన్నం బ్రహ్మేతి వ్యజానాత్" (అన్నాన్ని బ్రహ్మగా తెలిసికొన్నాడు) అనే ఉపనిషత్తులో అన్నంగా చెప్పబడిన పరబ్రహ్మమే. "అహమన్నాదోఽహమన్నాదోఽహమన్నాదః" (అన్నంవలె పరభోగ్యుడైన పరమాత్మను నేను అనుభవిస్తున్నాను) అని అంటూ సామగానాన్ని చేస్తూ బ్రహ్మానుభవాన్ని పొందేటట్లు చేసేవాడు ఆచార్యుడు. నందగోపాలుడు - అని అనడం కూడా ఆచార్యుని విషయంలో పొసగుతుంది. "ఎడుత్త పేరాళన్ నన్దగోపన్" (గొప్ప నిధిని పొందిన అదృష్టశాలి నందగోపుడు) అని నమ్మాళ్వార్లు అనుగ్రహించిన రీతిలో నందగోపాలుడు నిధిని పొంది, పరిపూర్ణానుభవాన్ని పొందినవాడు. ఆచార్యుడుకూడా అటువంటివాడేకదా! (భగవానుడనే గొప్ప నిధిని పొంది, దాని అనుభవాన్ని పొందేవాడుకదా.)

ఇక, "కొమ్బునార్క్కెల్లామ్" అని ప్రారంభించి, రెండు పాదాలతో భగవానుని పుత్రునిగా పొందిన తల్లులలో చాలా గొప్పదానా! అని సంబోధించి యశోదాదేవిని ప్రబోధిస్తున్నారు. "మంత్రో మాతా గురుః పితా" (మంత్రం తల్లి, గురువు తండ్రి) అనే ప్రమాణవచనానుసారం తల్లిగా మంత్రం చెప్పబడుతున్నది. తల్లి బిడ్డను తన కడుపులో ఉంచుకొని కాపాడేటట్లే, మంత్రంకూడా తనలో భగవానుని అంతర్భావింపజేసికొని ఉంటుంది కదా! భగవానుని తల్లులలో యశోద - "ఞాలత్తు పుత్తిరనై ప్పెఱ్ఱార్ నఙ్గైమీర్ ! నానే మఱ్ఱారు మిల్లై" (ఈ భూమిలో పుత్రుని పొందినదానను నేనే! ఓ గుణపూర్ణులారా! ఇంకెవరూ లేరు) అనే రీతిలో గొప్పతనాన్ని కల్గినట్లు తిరు అష్టాక్షరీమహామంత్రం మిగిలిన మంత్రాలకంటే గొప్పదికదా! ముముక్షుప్పడిలో "భగవన్మంత్రఙ్గళ్‌తాన్ అనేకఙ్గళ్, అవైతాన్ వ్యాపకఙ్గళెన్ఱుమ్, అవ్యాపకఙ్గళెన్ఱుమ్ ఇరణ్డు వర్గమ్. అవ్యాపకఙ్గళిల్ వ్యాపకఙ్గళ్, మూన్ఱుమ్ శ్రేష్ఠఙ్గళ్. ఇవై మూన్ఱిలుమ్ వైత్తుక్కొణ్డు పెరియతిరుమంత్రమ్ ప్రధానమ్" (భగవానుని తెలిపే మంత్రాలు అనేకం. అవి వ్యాపకాలని, అవ్యాపకాలని రెండు వర్గాలు. అవ్యాపకాలకంటే వ్యాపక మంత్రాలు మూడు గొప్పవి. ఈ మూడిటిలోను కూడా అష్టాక్షరీమహామంత్రం ప్రధానం) అని పల్కిన సూక్తి ఇక్కడ అనుసంధేయం.

దీనికి పిమ్మట, "అమ్బరమ్ ఊడఱుత్తు ఓఙ్గి ఉలకళన్ద" (ఆకాశం అంతటా వ్యాపించి విజృంభించి లోకాలను కొలిచిన) ఇత్యాది సూక్తిద్వారా తిరుమంత్రార్థం అనుసంధింపబడింది. భగవానుడు సర్వవ్యాపకుడు అనేదే నారాయణ మంత్రార్థం

కనుక, ఆ సర్వవ్యాపకత్వమే ఇక్కడ అనుసంధింపబడుతున్నది. తిరుమఙ్గై యాళ్వార్లు కూడా తిరునెడున్దాణ్డకంలో "మన్దిరత్తై మన్దిరత్తాల్ మఱవాదెన్ఱుమ్ వాళ్ఱుతియేల్" (పరమంత్రమైన భగవానుని తిరుమంత్రంతో నిరంతరం అనుభవిస్తే) అని తిరుమంత్ర ప్రస్తావాన్ని చేసి వెంటనే, "ఒణ్మిదియిల్ పునలరువి" (అందంగా ఒక్క పాదాన్ని పెట్టడంద్వారా ఆవరణజలాన్ని సైతం దాటి) అనే అనంతర పాశురంతో తిరుమంత్రార్థమైన త్రివిక్రమవతార వృత్తాంతాన్నే కదా అనుసంధించారు. ఆ తరువాత, "శెమ్బొఱ్కళడి చ్చెల్వా ! బలదేవా !" (అందమైన బంగారు కడియాలను కల్గిన శ్రీపాదాలను కల బలదేవా!) ఇత్యాదిగా భాగవతోత్తముడైన బలరాముని సంబోధించడం ద్వారా "ఉన్నడియార్క్కాడిమై" (నీ భక్తుల దాస్యం) అని తిరుమఙ్గైయాళ్వార్లు తిరుమంత్రంయొక్క సారార్థంగా ప్రస్తావించినది. భాగవతశేషత్వమే కనుక, అది ఇక్కడ సూచింపబడింది. ఇక్కడ "ఉమ్బియుమ్ నీయుమ్ ఉఱఙ్గేల్" (నీవు, నీ తమ్ముడు మేల్కొనండి) అని ఇద్దఱిని ఒకటిగా చేర్చి పల్కడం - భగవచ్ఛేషత్వం, భాగవత శేషత్వం అనేవి. ఒకదానిని విడిచి ఇంకొకటి ఉండదు - అనే తత్త్వానికి స్మారకం.

18. ఉన్దు మదకళిఱ్ఱన్ ఓడాద తోళ్‌వలియన్

నన్దగోపాలన్ మరుమకళే! నప్పిన్నాయ్!

కన్దమ్ కమళుమ్ కుళలీ! కడై తిఱవాయ్

వన్దు ఎఙ్గుమ్ కోళి యళైత్తన కాణ్! మాదవి

ప్పన్దల్‌మేల్ పల్ కాల్ కుయిలినఙ్గళ్ కూవిన కాణ్

పన్దార్‌విరలి! ఉన్ మైత్తునన్ పేర్ పాడ

శెన్దామరై క్కై యాల్ శీరార్ వళై యొలిప్ప

వన్దు తిఱవాయ్ మకిళ్న్దు ఏలోర్ ఎమ్బావాయ్

ఈ పాశురంలో శ్రీకృష్ణుని దివ్యమహిషి అయిన నీళాదేవిని గోపికలు ప్రబోధిస్తున్నారు.

శ్రీకృష్ణావతారంలో శ్రీకృష్ణునకు నీళాదేవి ప్రధానమహిషిగా కీర్తింపబడుతున్నది. అర్చావతారాలలో శ్రీకృష్ణునకు రుక్మిణీదేవియే ప్రధానమహిషిగా దివ్యదేశాలలో అన్నిటిలో సేవను అనుగ్రహించినా, ఆళ్వార్ల దివ్యసూక్తులలో రుక్మిణీదేవినిగూర్చిన ప్రస్తావం మూడు నాల్గు సందర్భాలలో మాత్రమే కన్పిస్తుంది.

నీళాదేవినిగూర్చియే అనేకవందల సందర్భాలలో ఉన్నది. దీనికి ఏమి కారణం? అనే విషయాన్ని గూర్చి కూరేశులు సుందరబాహుస్తవంలోని **"హే సుందరైకజన్మని కృష్ణభావే"** ఇత్యాది శ్లోకంలో పలికారు. తిరుమఴిశైప్పిరాన్ తిరుచ్ఛందవిరుత్త ప్రబంధంలో **"ఆయనాకి ఆయర్మఙ్గై వేయతోళ్ విరుమ్బినాయ్"** (గోపాలుడవై, గోపకన్యక అయిన నీళాదేవియొక్క వెదుళ్ళవంటి సున్నితమైన బాహువులను అపేక్షించావు.) అని అనుగ్రహించిన సూక్తిని ఆధారంగా చేసికొని పూర్వం ప్రస్తావించిన కూరేశుల శ్లోకం అవతరించిందని తెలియాలి. యదుకులోద్భవుడైన శ్రీకృష్ణునకు గోపకులమే విశేషించి ఆదరాస్పదం కనుక, ఆ కులానికి తగిన దివ్యమహిషి అయిన నీళాదేవియే అతని పరమప్రీతికి లక్ష్యభూతురాలు కావడానికి తగినది- అని భావించియే ఆఴ్వార్లు ఆమెనుగూర్చి మాటిమాటికి పలికారు. అయితే, శ్రీవిష్ణుపురాణం, శ్రీభాగవతం మొదలైన గ్రంథాలలో నీళాదేవినిగూర్చిన ప్రస్తావమే కన్పించదు. శ్రీకృష్ణునిగూర్చిన ఎన్నో కావ్యాలను కవులు రచించారుకదా! వారు నీళాదేవినిగూర్చి కొంచెంకూడా పలుకలేదు. ఆఴ్వార్ల దివ్యప్రబంధాలోను, వీటిని అనుసరించి పుట్టిన మిగిలిన ద్రావిడగ్రంథాలలోను ఈ దివ్యదేవేరినిగూర్చి ప్రస్తావించడాన్ని గమనించవచ్చు. శ్రీదేశికుల యాదవాభ్యుదయంలో ఉన్నదనే విషయాన్ని పలుమార్లు నీళాదేవి ప్రస్తావన తెలుపబడింది. దివ్యప్రబంధాలలో **"పిన్నై"** అని పలుచోట్ల, **"నప్పిన్నై"** అని కొన్నిచోట్ల వ్యవహరింపబడడం గమనించవచ్చు. ఇది ద్రావిడనామం. దీనికి తగిన సంస్కృతనామం ఏమి? అని విచారించినపుడు మన పూర్వాచార్యుల దివ్యసూక్తుల వల్ల **"నీళా"** అనేది సంస్కృత నామమని తెలియవస్తున్నది. భట్టర్ అనుగ్రహించిన **"నీళాతుంగస్తనగిరితటీ"** ఇత్యాది తిరుప్పావై తనియన్‌లోను, పైన చూపిన కూరేశుల శ్లోకంలోను, యాదవాభ్యుదయ శ్లోకంలోను నప్పిన్నైనే **"నీళా"** అని పల్కినందువల్ల, ఇదే ఈమె సంస్కృతనామం మని నిశ్చయించుకోవచ్చు.

ఈ దేవేరికి ఈ తిరునామం రూఢినామమా? లేక, యోగరూఢమా? అని పరిశీలించినపుడు, నా పరిశీలనలో తోచినదానిని తెలియజేస్తాను. భగవానుడు పరమపదంలో శ్రీదేవి, భూదేవి, నీళాదేవి -అనే ముగ్గురు దివ్యమహిషులతో కూడి ఉంటాడని భగవచ్ఛాస్త్రాలవల్ల తెలుస్తున్నది. శ్రీరామాయణంలో సముద్రశరణాగతి ప్రకరణంలో ఉండే **"భుజైః పరమనారీణా మభిమృష్ట మనేకథా"** (దివ్యకాంతలచే అనేక విధాలుగా సంవహనం చేయబడినది) అనే శ్లోకంయొక్క వ్యాఖ్యానంలోకూడా ఇది స్పష్టపడుతున్నది. కూరేశులుకూడా శ్రీవైకుంఠస్తవంలో (73వ శ్లోకంనుండి)

అయిదు శ్లోకాలలో ఆ ముగ్గురు దివ్యదేవేరులను ప్రస్తావించారు. ఆఴ్వార్ల దివ్యప్రబంధాలలో **"ఉడనమర్ కాదల్ మకళిర్ తిరుమకళ్ మణ్మకళ్ ఆయర్మడమకళ్ ఎన్టివర్ మూవర్"** (వెంటగా ఉండే ప్రియకాంతలైన లక్ష్మీదేవి, భూదేవి, నీళాదేవి- అనే ఈ ముగ్గురు) అని, **"కూన్దల్ మలర్మఙ్గైక్కుమ్ మణ్మడన్దైక్కుమ్ కులవాయర్ కొఴున్దుక్కుమ్ కేళ్వన్‌తన్నై"** (చక్కని కేశపాశాన్ని కల లక్ష్మీదేవికి, భూదేవికి, కులకాంత నీళాదేవికి వల్లభుడు) ఇత్యాది పాశురాలు అనేకం. ఈ పాశురాలలో **"నీళై"** అనే పదం ప్రయోగించవలసిన చోట్లలో ఆ పేరును ప్రయోగించకుండా **"ఆయర్మడమకళ్"** అని, **"కులవాయర్కొఴున్దు"** అని మాత్రమే పల్కిన దానినిబట్టియే ఆచార్యులు నప్పిన్నైను నీళాదేవిగా గ్రహించారని తెలుస్తున్నది. ఈ భావనను నేను పలు గ్రంథాలో వివరించాను. నా దివ్యప్రబంధ దివ్యార్థదీపికలోను పంచస్తవాదిస్తోత్రవ్యాఖ్యానాలలోను గమనించ వచ్చు.

ఈ నీళాదేవి కుంభుని పుత్రిక కనుక, **"ఓ కుంభుని పుత్రికా !"** అని సంబోధించవలసి ఉండగా, ఆ విధంగా పిలువకుండా **"నన్దగోపాలన్ మరుమకళే!"** (నందగోపాలుని కోడలా!) అని పిలువడం ఎందుకోసం ? అని అంటే, స్త్రీలకు పుట్టినింటి సంబంధంకంటే మెట్టినింటి సంబంధమే మిక్కిలి ఆదరణీయమై ఉంటుంది. అందువల్లనే అశోకవనంలో సీతాదేవి హనుమానునకు తననుగూర్చి తెలియజేసేటపుడు **"స్నుషా దశరథస్యాహమ్"** (దశరథమహారాజుకు నేను కోడలును) అని ముందుగా పల్కి, ఆ పిమ్మటనే **"దుహితా జనకస్యాహం వైదేహస్య మహాత్మనః"** (మహాత్ముడైన "జనకచక్రవర్తికి కుమార్తెను నేను") అని అన్నది. దీనిని అనుసరించియే ఇక్కడకూడా **"నన్దగోపాలన్ మరుమకళే!"** అని సంబోధింపబడింది. నందగోపాలునకు **"ఉన్దు మదకళిఱ్ఱన్"** (మదగజాలను కలవాడు) అని ఒక విశేషణం ప్రయోగింపబడింది. దీనికి మూడు విధాలైన అర్థాలను చెప్పే అవకాశం ఉన్నది. **"ముదమున్దు కళిఱ్ఱన్"** - మదం స్రవించే గజాలను కలవాడు- అనేది ఒక అర్థం, **"మదకళిఱ్ఱై ఉన్దువన్"** మదగజాలతో పోరాడి వాటిని పడదోయగల్గినవాడు- అని ఇంకొక అర్థం. **"మదమున్దు కళిఱ్ఱై పోన్టవన్"** -మదగజంవంటివాడు- అనేది మూడవ అర్థం.

ఈ అర్థాలను క్రమంగా వివరిస్తాను. మదజలం స్రవించే గజాలను కలవాడు- అనికదా మొదటి అర్థం తెలుపబడింది. రేపల్లెలో (మేకలు) పశువులు, గోవులు,

ఎనుములు ఉంటాయి తప్ప, అక్కడ ఏనుగుల ప్రసక్తి ఎక్కడ? నందగోపాలుడు ఏనుగులను కల్గిఉన్నట్లుగా ఎక్కడా చెప్పబడలేదే! -అని సందేహపడనక్కర లేదు. **"తొడర్ శజ్గిలికై శలార్ పిలారెన్న త్తూజ్గ పొన్‌మణి యొలిప్ప, పడుముమ్మదప్పునల్ శేరా కారణమ్ పైయ నిన్నూర్‌వదుపోల్, ఉడన్‌కూడి క్కిజ్కిణి యారవారిప్ప ఉడైమణి పఱై కఱజ్గ త్తడన్దాళిణై కొణ్డు శార్‌జ్గపాణి తళర్‌నడై నడవానో"** (శార్‌జ్గమనే వింటిని శ్రీహస్తంలో కలవాడు తన కడియాలు మధురంగా ధ్వనించేటట్లు, బంగారు నూలులో వేలాడే మణులు శబ్దించేటట్లు, గుహ్యాంగం నుండి జలం స్రవించేటట్లు, గజం మెల్లగా నడచేటట్లు శ్రీచరణాలలో అలంకరించిన నూపురాలు, కలిసి ధ్వనించేటట్లు, నడుములో కట్టిన మణి వాద్యం వలె శబ్దించేటట్లు బలమైన పాదాలతో తప్పటడుగులు నడవాలి) (పెరియాళ్వార్ తిరుమొళి-1-7-1) అని యశోదాదేవి శ్రీకృష్ణుని మదం స్రవించే గజంగానే పల్కినందువల్ల శ్రీకృష్ణుడనే మదగజాన్ని కలవాడని అనడంలో అడ్డు లేదు. ఆళ్వార్లు పలు సందర్భాలలో భగవానుని గజంవంటివాడని పలికారు. **"తెన్నానాయ్! వడవానాయ్! కుడపాలానాయ్! కుణపాలమదయానాయ్!"** (దక్షిణదిక్కులోని గజమా! ఉత్తరదిక్కులోని గజమా! పడమటిదిశలోని గజమా! తూర్పుదిక్కులోని గజమా!), (తిరునెడున్దాణ్డకమ్-10) అని నాల్గు దిక్కులలోని నాల్గు గజాలుగాకదా తిరుమజ్గైయాళ్వార్ భగవానునిగూర్చి అనుసంధించారు.

గజానికి, భగవానునకు పలు రీతులలో పోలిక ఉన్నది. కొన్ని రీతులు ఇక్కడ తెలుపబడుతున్నాయి.

1. ఏనుగును ఎన్నిసార్లు చూచినా, చూచినపుడు అంతా అపూర్వమైనదిగానే తోస్తూ పరమానందాన్ని కల్గిస్తుంది. భగవానుడు కూడా, **"ఎప్పొళుదుమ్ నాళ్ తిజ్గళ్ ఆణ్డూళి యూళితొఱుమ్ అప్పొళుదైక్కప్పొళుదు ఎన్ ఆరావముదమే"** (ఏ సమయంలో అయినా, దినాలు, మాసాలు, సంవత్సరాలు, కల్పాలు కల్పాల తరబడి ఎప్పటికప్పుడు నా పర్యాప్తామృతమా!) అనే రీతిలో అపూర్వవత్ విస్మయాన్ని కల్గించేవాడై ఉంటాడు.

2. ఏనుగు, తనపైకి ఎక్కగోరినవానికి తన పాదాన్నే ఆధారంగా ఇస్తుంది. భగవానుడుకూడా, తనను పొందగోరినవారికి **"అడిక్కీళ్ అమర్‌న్దు పుకున్దు అడియీర్! వాళ్‌మిన్ ఎన్తరుళ్ కొడుక్కుమ్"** (నా శ్రీచరణాల వద్ద అమరి ఉండి, ఓభక్తులారా! ఉజ్జీవించండి) స్వామి కనుక తన శ్రీచరణాలనే ఉపాయంగా అనుగ్రహిస్తాడు.

3. ఏనుగు తనను కట్టడంకోసం కావలసిన దారాన్ని తానే ఇస్తుంది. **"ఎట్టినోడు ఇరణ్డెనుమ్ కయిఱ్ఱినాల్"** (ఎనిమిది, రెండు - అంటే- పది- పత్తు- అంటే - భక్తి అనే దారంతో, (లేక) అష్టాక్షరి, ద్వయం అనే దారంతో) అనే తిరుచ్ఛన్దవిరుత్త పాశురక్రమంలో భగవానుని కట్టివేసే భక్తి అనే దారాన్ని అతడే ఇస్తాడు. **"భగవన్! భక్తిమపి ప్రయచ్ఛ మే"** (భగవన్! నాకు భక్తిని కూడా అనుగ్రహించు), **"మదినల మరుళినన్"** (భక్తిరూపాపన్న జ్ఞానాన్ని ఇచ్చాడు) అనే సూక్తులు ప్రమాణాలు.

4. ఏనుగును స్నానం చేయించినా, **"కలభం క ఏవ స్నాత్వాఽపి ధూళీరసికం నిషేద్ధా?"** (స్నానం చేసినా ధూళిని పూసికోవడం ఆసక్తిని కల గున్న ఏనుగును ఎవరు నిషేధిస్తారు?) అని భట్టర్ పల్కినట్లుగా మఱుక్షణంలో బురదను పూసికొంటుంది. అదేరీతిలో, భగవానుడుకూడా శుద్ధసత్త్వమయుడై, పరమపవిత్రుడై ఉన్నా, **"పొల్లా వొళుక్కుమ్ అళుక్కుడమ్బుమ్"** (తగని వర్తనాన్ని, మురికి శరీరాన్ని) కల్గిన మనవంటివారితో కలసి వర్తించాలని, తన వాత్సల్యగుణాతి శయంతో ఆశపడతాడు.

5. మగఏనుగును బంధించాలని అనుకుంటే, ఆడ ఏనుగును పురస్కరించుకొనే బంధించవలసి ఉంటుంది. భగవానుని వశీకరించుకోవాలి అంటే లక్ష్మీదేవిని ముందుంచుకొనే వశం చేసికోవాలి.

6. ఏనుగు, మావటివాని అనుమతి లేకుండా తనవద్దకు వచ్చేవానిని దూరంగా గెంటివేస్తుంది. భగవానుడు కూడా **"వేదమ్ వల్లార్‌కళై క్కొణ్డు విణ్ణోర్‌పెరుమాన్ తిరుప్పాదమ్ పణిన్దు"** (వేదవిదులను పురస్కరించుకొని, పరమపదనాథుని శ్రీచరణాలను ఆశ్రయించి) అనే రీతిలో వైదికోత్తములను పురస్కరించుకోకుండా స్వయంగా తన దరి చేరేవారిని దూరం చేస్తాడు.

7. ఏనుగుభాష ఏనుగును నడిపే మావటివానికిమాత్రమే తెలుస్తుంది. భగవానుని భాష తిరుక్కచ్చినంబివంటివారికే తెలుస్తుంది.

8. నిలిచి ఉండడం, కూర్చుని ఉండడం, పరుండి ఉండడం, సంచరించడం- అనే వ్యాపారాలు అన్నీ ఏనుగు చేసే మావటివాని అధీనంలో ఉంటాయి. భగవానుడు కూడా **"కణికణ్ణన్ పోకిన్ఱాన్ కామరుపూమ్ కచ్చి మణివణ్ణా! నీ కిడక్కవేణ్డా ... ఉన్ఱన్ పైన్నాకప్పాయ్ శురుట్టిక్కొళ్"** (కణికణ్ణన్ వెళ్ళిపోతున్నాడు.

అందమైన పూలను కల కంచిలోని మణివర్ణా! నీవు ఉండవద్దు.... నీ నాగశయనాన్ని చుట్టుకొని రా) అని, 'నీ కిడక్కవేణ్డుమ్... ఉష్టన్ పైన్నాకప్పాయ్ విరిత్తుక్కొళ్" (నీవు నిలచి ఉండాలి. నీ నాగశయాన్ని పఱుచుకో) అని, **"కిడన్దవాఱు ఎழுన్దిరున్దు పేశు"** (నీవు పరుండి ఉడే రీతిని పైకి లేచి పల్కు) అని పలికే తిరుమழிశైప్పిరాన్ వంటివారికి సర్వాత్మనా విధేయుడై ఉంటాడు.

9. ఏనుగు భుజించి విడచిన బియ్యం పలుకోట్ల వందల చీమలకు ఆహారం అవుతున్నది. అదే రీతిలో, భగవానుడు స్వీకరించగా మిగిలిన ప్రసాదంతో పలుకోట్ల భక్తజనాలు ఉజ్జీవిస్తారు.

10. ఏనుగు చాలా పొడుగైన తొండాన్ని కల్గి ఉంటుంది. భగవానుడుకూడా **"అలమ్ పురిన్ద నెడుమ్ తడక్కై"** (ఇక చాలు - అని అనిపించే చాలా గొప్ప ఉదారమైన చేతిని) ను కలవాడు.

11. ఏనుగు తాను చనిపోయిన తరువాతకూడా సహాయపడుతుంది. భగవానుడు కూడా అవతారసమాప్తి చేసి, వైకుంఠాన్ని చేరినతరువాతకూడా ఇతిహాసపురాణాల, ఆழ்వార్ల దివ్యసూక్తుల మూలంగా తన చరిత్రను తెలిపి సహాయపడతాడు.

12. ఏనుగుకు ఒక్క కరమే (తొండమే) ఉన్నది. భగవానుడుకూడా **"వేణ్డిన్ఱెల్లామ్ తరుమ్ కోదిల్ వళ్ళల్"** (అడిగిన దానిని అంతటినీ ఇచ్చే ఏ దోషం లేని ఉదారుడు) కనుక, ఇచ్చే చేతిని తప్ప, గ్రహించే చేతిని కలవాడు కాడు. **"కొళ్వన్ నాన్ మావలి! మూవడి తా"** (నేను దానాన్ని పరిగ్రహిస్తాను. ఓ మహబలీ! మూడడుగులు దానమియ్యి) అని పల్కడంకూడా మాయయే కదా. అదికూడా స్వార్థంకోసం కాదు కదా! **"దైత్యౌదార్యేంద్రయాచ్ఞా విహృతి మపనయన్ వామనోஉర్థిత్వ మాసీః"** (దైత్యులకు ప్రభువైన బలిని ఔదార్యగుణానికి, ఇంద్రుని యాచనకు మధ్య విరోధాన్ని తీరుస్తూ నీవు వామనుడవై యాచకుడవు అయినావు.) అనే భట్టర్ శ్రీసూక్తిని గమనించాలి.

13. ఏనుగు మావటివానికి జీవనాన్ని సంపాదించి పెడుతుంది. భగవానుడు కూడా తన అర్చక - పరిచారకులకు, కాలక్షేపపరులకు జీవన - ఉజ్జీవనాలను అనుగ్రహిస్తాడు. ఈ విధంగా ఇంకా పలు సామ్యాలను గమనించవచ్చు. ఈ విధంగా గజవంటి శ్రీకృష్ణభగవానుని కలవాడు నందగోపాలుడు.

"మదకళిత్తై ఉన్దుమవన్" (మదగజాన్ని జయించి గెంటి వేయగల్గినవాడు) **"మదమున్దు కళిఱుపోన్ఱవన్"** (మదం స్రవించే గజం వంటివాడు) అనే మిగిలిన

రెండు అర్థాలలో భావం ఒకటే. తామరను జయించినవాడు కృష్ణుడు- అని పల్కినా, తామరవంటివాడు కృష్ణుడు- అని పల్కినా తాత్పర్యం సమానమేకదా ! అదే రీతిలో, మదగజంవంటి బలాన్ని కలవాడు నందగోపాలుడని తాత్పర్యం. వేదంలో భగవానునిగూర్చి **"య ఆత్మదా బలదాః"** (ఆత్మను ఇచ్చేవాడు, తనను అనుభవించడానికి కావలసిన బలాన్ని ఇచ్చేవాడు) అని తెలుపబడింది. తనను అనుగ్రహించేవాడు, తనను అనుభవించడానికి కావలసిన బలాన్ని ఇచ్చేవాడు కూడా, భగవానుడే. తరువాత గల **"ఓడాద తోళ్వలియన్"** (పరాజయం లేని బాహుబలాన్ని కలవాడు) అనే విశేషణంద్వారాకూడా ఈ అర్థమే వివరింపబడింది.

ఇక, ఆచార్యపరమైన స్వాపదేశార్థాన్ని గమనించినపుడు,

(ఉన్దు మదకళిత్తన్) - **"మదక్కళిఱు ఐన్దినైయుమ్ శేరి తిరియామల్"** (పంచేంద్రియాలనే అయిదు మదగజాలతో చేరి పరిభ్రమించకుండా) అనే పాయ్కై ఆழ்వార్ల పాశురక్రమంలో మదగజంవంటి పంచేంద్రియాలను నిరోధించి, బంధించేవాడు- జితేంద్రియుడని భావం.

(ఓడాద తోళ్ వలియన్) - **"తోళ్"** - అంటే - చేయి అని అర్థం. ఇక్కడ చేయి అంటే - జ్ఞానహస్తం. వాదులను గాని, ప్రతివాదులను గాని చూచి వెనుకంజ వేయనక్కఱలేకుండా, విద్వద్గోష్ఠులలో ముందుశ్రేణిలో నిలిచే ఆచార్యులను ఈ ప్రయోగం తెల్పుతున్నది. లేక, అస్మదాదులు సంసారమరుకాంతారాలలో పరిభ్రమించకుండా చేసే బలిమిని కలవాడనికూడా అర్థం.

(నన్దగోపాలన్ మరుమకళే) - ఆచార్యులు భగవానునకు ప్రాణవల్లభులై ఉండే రీతిని ఇది తెల్పుతున్నది. భగవానుడు పిరాట్టివాక్కును మీఱి ప్రవర్తించని రీతిలోనే, అతనికి పత్నివంటివారైన ఆచార్యుల మాటను దాటడు.

(నప్పిన్నాయ్ !) - ఏడు ఎద్దులు- అనే విరోధులను నిరసించి, చేపట్టబడినది నప్పిన్నై. ఈరీతిలోనే, కామక్రోధలోభ మోహమదమాత్సర్యాసూయలనే పలు విరోధులను నిరసించి, భగవానునిచే చేజిక్కించుకోబడినవారు ఆచార్యులు.

(కన్దమ్ కమழுమ్ కుழలీ !) - వనితలు, **"శెణ్బక మల్లికై యోడు శెఙ్గழுనీర్ ఇరువాట్చి ఎణ్పకర్ పూక్కళై"** (సంపెంగలు, మల్లెలతో, ఎఱ్ఱతామరలు, ఇరువాట్చి- ఇత్యాది ఎనిమిది వికసించిన పూలను) కేశాలలో అలంకరించుకొని సువాసనను కల్గి ఉంటారు. ఆచార్యులుకూడా, **"అహింసా ప్రథమం పుష్పం క్షమాపుష్పం విశేషతః,**

ధ్యానం పుష్పం తపః పుష్పం జ్ఞానం పుష్పం తథైవ చ.... సత్యమష్టవిధం పుష్పం విష్ణోః ప్రీతికరం భవేత్" (అహింస మొదటి పుష్పం, విశేషించి క్షమ అనేది ఒక పుష్పం, ధ్యానమనేది ఒక పుష్పం, తపస్సు అనేది ఒక పుష్పం, జ్ఞానమనేది ఒక పుష్పం.... ఆవిధంగానే సత్యమనేది ఎనిమిదవ పుష్పం. ఈ ఎనిమిది పూలు మిక్కిలి ఆనందాన్ని కలిగిస్తాయి) అని చెప్పబడిన పుష్పాలతో సుగంధాన్ని పొందుతారు. వీరి తిరుమేని అంతా సుగంధం వీస్తున్నా, ముఖ్యంగా శిరస్సుపై దీనిని గమనించవచ్చు. **"వణఙ్గా ముడి మన్నర్"** (నమస్కరించని శిరస్సుగా కల ప్రభువు) గా కాకుండా, శిరస్సుతో నమస్కరించే స్వభావాన్ని కల్గి ఉండడాన్ని ఇది తెల్పుతున్నది.

(కడై తిఱవాయ్) - "కడై" అనే పదానికి అంగడి అనే అర్థమే స్వాపదేశంలో గ్రహించదగినది. "సర్వవిద్యానిషద్యా" (సకలవిద్యలకు అంగడి) అనికదా మహాత్ములు పల్కుతారు. వారు వారు ఎదురు చూచే సకలార్థాలు లభించే అంగడి- కాలక్షేపగోష్ఠి. అందులోకి మమ్ములను ప్రవేశింపజేయాలి - అని అపేక్షించి నట్లయినది.

(వన్దెఙ్గుమ్ కోழி యழைత్తన కాణ్) - కోడి, కుప్పలో ఉండే రత్నాలను తన ముక్కుతో తీసి పైకి తీసికొని వస్తుంది- అని లోకప్రసిద్ధం. శ్రీవైష్ణవలక్షణంలో- **"కొక్కైప్పోలిరుక్కుమ్, కోழிయైప్పోలిరుక్కుమ్"** (శ్రీవైష్ణవులు కొంగవలె ఉంటారు, కోడివలె ఉంటారు) అనేది ప్రసిద్ధమైన సూక్తి. సారగ్రాహులైన సచ్ఛిష్యుల పలుచోట్లనుండి మిమ్ములను ప్రార్థించడంకోసం వచ్చారు- అని భావం.

(మాతవిప్పన్దల్ మేల్ పల్కాల్ మయిలినఙ్గళ్ కూవిన కాణ్) - "మాధవీం మాధవప్రియామ్" అనే శ్రుతిక్రమంలో మాధవదివ్యమహిషి అయిన లక్ష్మీదేవి మాధవి అనబడుతున్నది. **"పన్దల్"** అనేది నీడను ఇచ్చే చోటును తెల్పుతున్నది. లక్ష్మీదేవి అభిమానచ్ఛాయలో ఒదిగి ఉండే కోయిలలు- అని ఈ ప్రయోగంయొక్క అర్థం. కోకిలలు పరభృతాలనే పేరును కల్గినవి. అదేరీతిలో, **"ఉప త్వా నేష్యే"** అని గ్రహించే ఆచార్యునిచే పోషింపబడేవారు ఇక్కడ కోయిలలుగా వివక్షింపబడ్డారు. **"పికః కూజతి పంచమమ్"** (కోయిలపంచమ రాగం కూస్తుంది) అనే విధంగా కోయిల కూసే రాగం పంచమరాగ మనబడుతుంది. ఆచార్యులు పలికే సూక్తులు. "ఇవి అయిదవ వేదమా?'' అనే రీతిలో ఉంటాయి. **"మామ్బొழிల్ తళిర్ కోదియ మడక్కుయిల్ వాయతు తువర్ప్పెయ్ద తీమ్బలఙ్కని తేనదు నుకర్ తిరువెళ్ళరై"**

(మామిడి తోటలలోని లేత చిగుళ్ళను కొరికితినే అందమైన కోయిలలు తమ నోరు వగరుకాగా, తియ్యని పనసపండ్లలోని తేనెను తాగే తిరువెళ్ళరై అనే దివ్యక్షేత్రం) అనే రీతిలో మొదట మామిడి చిగుళ్ళను తిని, దాని ద్వారా గొంతు వగరును పొందగా, తీయని పనసపండ్ల తేనెను తాగి ఆనందిస్తాయి, కోయిలలు. అదే రీతిలో, మొదట కావ్యనాటకాదులలో, సామాన్యశాస్త్రాలలో కాలక్షేపం చేసి, వాటిని విడచి, తరువాత రహస్యరహస్యార్థసేవలో అభిలాషను కల్గి ఉండేవారు కోయిలలుగా ఇక్కడ చెప్పబడ్డారు.

(పన్దార్ విరలి) -"హరే! విహరసి క్రీడాకందుకైరివ జంతుభిః" (హరీ! క్రీడాకందు కాలతో వలె, నీవు జీవులతో విహరిస్తున్నావు) అనే రీతిలో లీలోపకరణా లైన ఉండే జీవులే ఇక్కడ బంతిగా తెలుపబడ్డారు. వారిని చేతిలో పెట్టుకొని, వారితో కాలక్షేపం చేస్తారు ఆచార్యులు.

(శెన్దామరైక్కైయాల్) - యతిరాజసప్తతిలో **"ఉన్నిద్రపద్మసుభగా ముపదేశ ముద్రామ్"** (వికసించిన తామర వలె అందమైన ఉపదేశముద్రను) అని పల్కిన సూక్తి స్మరణీయం. ఉపదేశముద్రను కల్గిన శ్రీహస్తంతో - అని అర్థం.

(శీరార్ వళై యొలిప్ప వన్దు తిఱవాయ్) - ధ్వన్యర్థాలు నిండి ఉండేటట్లుగా ఉపదేశించాలి.

(మకిழ்న్దు) - మా నిర్బంధంవల్ల కాకుండా, తమ ప్రయోజనంగా ఆనందించి ఉపదేశించాలని భావం.

ఇక్కడ అంతరంగమైన ఒక స్వాపదేశార్థాన్ని ఆలకించండి. **"తక్కార్ పలర్ దేవిమార్ శాల ఉడైయార్"** (తగిన పలువురు దేవేరులను కల్గినవారు) అని, **"పల్లాయిరమ్ పెరున్దేవిమారోడు"** (పలువేలమంది గొప్ప దేవేరులతో) అని పలికే రీతిలో శ్రీకృష్ణునకు ఈ అవతారంలో పలువురు దేవేరులు ఉన్నా, రేపల్లెలో నప్పిన్నైప్పిరాట్టియే చాలా గొప్ప మహిషి. ఇదే రీతిలో, భగవానునకు అభిమత విషయభూతులైన ఆచార్యులు పలువురు ఉన్నప్పటికీ, భగవద్రామానుజులొక్కరే **"తస్మిన్ రామానుజార్యే గురురితి చ పదం భాతి నాన్యత్ర"** (ఆ శ్రీరామానుజార్యులలోనే గురువు అనే పదం ప్రకాశిస్తున్నది, వేఱొకరిలో ప్రకాశించడం లేదు) అనే రీతిలో భగవానుడు మిక్కిలిగా అభిమానించే మహాచార్యులు. ఎవరికీ లొంగని ఏడు వృషభాలను బలంగా అణచి, శ్రీకృష్ణుడు నప్పిన్నైప్పిరాట్టిని వివాహమాడాడు.

భగవానుడు, భగవద్రామానుజులను పరిగ్రహించి, ఎవరికీ లోబడని వృషభాలవంటి ఏడు విరోధులను నిరసించాడు. ఆ ఏడుగురు విరోధులు ఏవి? అంటే, **"అఱు శమయచ్చెడియదనై యడి యఱుత్తాన్ వాఴియే"** (ఆఱు బాహ్యమతాలనే వృక్షాలమూలాన్ని ఖండించిన వారికి మంగళం) అనే సూక్తిలో తెలుపబడిన ఆర్గురు, **"శెఱు కలియై చ్చిఱిదు మఱ త్తీర్త్తువిట్టాన్ వాఴియే"** (లోకాన్ని పాడుచేసే కలిని పూర్తిగా నిరసించిన వారికి మంగళం) అనే దానిలో చెప్పబడిన కలిపురుషుడు- మొత్తం ఏడుగురు విరోధులు. ఈ నప్పిన్నైను- **"కన్దమ్ కమఴుమ్ కుఴలీ!"** (సువాసన పరిమళించే కేశాలను కలదానా!) అని అంటూ కేశపాశంయొక్క అందాన్ని పురస్కరించుకొని పల్కడం, భగవద్రామానుజులు మతాంతరయతులవలె కేశాలను పూర్తిగా తొలగించుకోకుండా, **"కమనీయశిఖానివేశమ్"** (అందని శిఖయొక్క తీరు) అని, **"శిఖయా శేఖరిణం పతిం యతీనామ్"** (శిఖతో అలంకరింపబడిన శిరస్సును కలవారు, యతులకు పతి) అని, **"కారిశుతన్కఴల్ శూడియ ముడియుమ్ కననచ్చికై ముడియుమ్"** (కారిసూనులైన నమ్మాఴ్వార్ల పాదాలను అలంకరించుకొన్న శిరస్సు, గొప్పదైన చక్కని శిఖ, కిరీటం) అని చెప్పబడే రీతిలో శిఖాబంధసౌందర్యంతో వేంచేసి ఉండే రీతిని స్మరింపజేస్తుంది. **"పన్దార్ విరలి !"** అనే ప్రయోగంకూడా భగవద్రామానుజులకు చాలా పొసగుతుంది. **"పన్దు"** అనేది ఆచార్యహృదయంలో **"పన్దు కఴఱ్పావై... పొఱ్ణైమ్బులనిల్ భోగ్యాది సమూహమ్"** (బంతి, గచ్చకాయలు, బొమ్మలు.... ఇవి లీలావిభూతిలోని భోగ్యవస్తువులు) అని అనుగ్రహించే రీతిలో లీలావిభూతిని అంతటిని తెల్పుతుంది. ఇది నిత్యవిభూతికూడా ఉపలక్షణం. శ్రీరామానుజులకు **"ఉడైయవర్"** (సొత్తును కల స్వామి) అని పేరు. ఉభయవిభూతులను తమ చేతిలో కలవారని -దీని అర్థం. ఇదే **"పన్దార్ విరలి!"** (బంతిని చేతి వేళ్ళలో కల్గినదానా!) అనే సంబోధనతో సూచింపబడింది.

19. కుత్తువిళక్కెరియ కోట్టుక్కాల్ కట్టిల్ మేల్
మెత్తెన్ఱ పఞ్జశయనత్తిన్ మేలేఱి
కొత్తలర్ పూఙ్కుఴల్ నప్పిన్నై కొఙ్గైమేల్
వైత్తు క్కిడన్ద మలర్ మార్బా! వాయ్ తిఱవాయ్
మైత్తడమ్ కణ్ణినాయ్! నీ ఉన్ మణాళనై
ఎత్తనై పోదుమ్ తుయిలెఴ ఒట్టాయ్ కాణ్!

ఎత్తనైయేలుమ్ పిరివు ఆఱ్ఱకిల్లాయాల్
తత్తువమన్ఱు తగవు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలో ప్రబోధింపబడిన నీళాదేవి గోపికలపట్ల దయ చూపి, "వీరికోసం మనం తలుపులు తెఱవడం ఆవశ్యకమే'' అని తలచి, తాను లేచి తలుపులు తెఱువబోగా, దానిని చూచిన శ్రీకృష్ణుడు "వీరు ముందుగా **"ఉమ్బర్ కోమానే ! ఉఱఙ్గాదు ఎఴున్దిరాయ్"** (నిత్యసూరినాథా ! నిద్రపోకుండా మేలుకో) అని నన్నుకదా నిద్ర లేపారు. నేనే కదా ముందుగా వీరి కార్యాన్ని పూర్తిచేయాలి. ఈమె ముందుగా ప్రయత్నించడం ఏమి?'' అని ఆమెను లేవనివ్వకుండా అడ్డుకొని, తానే లేవడానికి ప్రయత్నించాడు. అపుడామె శ్రీకృష్ణుని చూచి, "స్వామీ! నీ వ్యర్థంగా తగవుకు రావడం న్యాయం కాదు. నిన్ను ప్రబోధించగానే నీవు లేచి కార్యాన్ని పూర్తి చేసినట్లయితే, ఇది తగినదే. అపుడు నీవు ఊరికే ఉండిపోయావు. నన్ను ప్రబోధించినపుడు, నేను లేచి తలుపు తీయాలని ప్రయత్నిస్తే, నన్ను నీవు అడ్డుకోవడం న్యాయం కాదు సుమా!'' అని అన్నది. దానికి శ్రీకృష్ణుడు- "నీవు శాస్త్రార్థాన్ని గ్రహించకుండా వ్యర్థంగా తగాదా పడడం సరి కాదు. ఎల్లప్పుడు నీకు పురుషకారకృత్యంలోమాత్రమే అన్వయం తప్ప, కార్యాన్ని చేయడంలో నాకు మాత్రమే బాధ్యత ఉన్నది; నీకు లేదు'' అని అన్నాడు. దానిని విని నీళాదేవి- "మోక్షాన్ని ప్రదానం చేయడమనే గొప్ప కార్యంలో నాకు యోగ్యత లేకపోయినా, తలుపులను తెఱవడమనే ఈ చిన్న పనిలోకూడా యోగ్యత లేదా? వ్యర్థంగా అక్కఱ లేని మాటలను పలుకవద్దు. నన్ను పిలిచినవారికి నేనే తలుపులు తెఱుస్తాను'' అని పల్కి బలాత్కారంగా లేవడానికి ప్రయత్నించింది. "నా భక్తులకు నేనే కార్యాన్ని చేస్తాను'' అని పల్కి ఆమెను మళ్ళీ అడ్డుకొన్నాడు శ్రీకృష్ణుడు. ఈ విధంగా లోపల ఈ ఇద్దఱు ఒకరితో ఇంకొకరు తగవులాడుకొంటున్న సంగతిని గవాక్షాల సందులద్వారా చూచిన గోపికలు ఆ దివ్యదంపతులు ఇద్దఱి పాదాలలో వాలి ప్రార్థిస్తున్నారు- ఈ పాశురంలో. ఈ ప్రబంధానికి తనియన్ అనుగ్రహించే భట్టర్ ఈ పాశురాన్నే దృష్టిలో పెట్టుకొని "నీళాతుంగస్తనగిరితటీసుప్తమ్" ఇత్యాది శ్లోకాన్ని కృపజేశారు.

"కుత్తు విళక్కెరియ" అని ప్రారంభమవుతున్న మాటలలో రోషభాషణాలు కూడా తోస్తున్నాయి. "అమ్మా! మేము చీకటిలో అన్వేషిస్తూ, రాళ్ళు, ముళ్ళు నిండిన దారిలో వేగంగా పరుగు తీసి, ఇసుకతిన్నెల పై నిలచి ఉండి, "కూర్మఴై పోల్

పనిక్కు ఊడలెయ్‌ది కూశి నడుఙ్గి యమునైయాఱ్ఱిల్ వార్‌మణఱ్కున్ఱిల్ పులర నిన్ఱేన్ వాశుదేవా! ఉన్ వరవు పార్‌త్తే" (వర్షం వలె కురిసే మంచులో ప్రణయరోషాన్ని పొంది జంకుతో యమునానదీ తీరంలోని ఇసుకతిన్నెలలో, వాసుదేవా!, నీ రాకకోసం ఎదురుచూచాను) అని వంచనను పొంది, క్లేశంతో ఉండగా, "నీభాగ్యం ఎటువంటిది? **"కుత్తువిళక్కు"** (మంగళదీపాలు) ప్రకాశిస్తూ ఉండగా పరుండే రీతిలోనిది కదా నీ భోగం! పర్యంకంపై పంచశయనంపైకదా నీ శయనం!'' అని అంటూ ప్రణయరోషం స్ఫురించేటట్లు పల్కుతున్నారని చెప్పవచ్చు.

ఈ పాశురం ఉన్న రీతిని గమనిస్తే, ఇది సభకు తగిన పాశురం కాదనే రీతిలో తోస్తుంది. వాస్తవానికి వేదాంతసారార్థాలు నిండిన పాశురం ఇది.

(నప్పిన్నై కొఙ్గైమేల్ వైత్తు క్కిడన్ద మలర్‌మార్బా! వాయ్ తిఱవాయ్) - రేపల్లెలోని గోపికలలో నీళాదేవి ఏవిధంగా విలక్షణ అయినదో, ఆ రీతిలోనే శిష్యవర్గంలో చాలా గొప్పగా వెలిగే ఒక జ్ఞానాధికారియొక్క జ్ఞానభక్తులను చూచి ఆశ్చర్యాన్ని పొందుతున్న ఓ ఆచార్యసార్వభౌమా! నోటిని తెఱచి, ఉపదేశాలను అనుగ్రహించాలి- అని ప్రార్థించిన తీరు ఇది. ఈ శిష్యాచార్యుల వాసస్థానం ఏది? అని అంటే-

(మెత్తెన్ఱ పఞ్చశయనమ్) - మార్దవం, శైత్యం, సుగంధం, ధావళ్యం, విస్తృతి- అనే అయిదు విధాలైన వైలక్షణ్యాలు నిండిన పడుకకు పంచశయనమని పేరు. ఈ అయిదు విధాలైన వైలక్షణ్యాలలో **"మెత్తెన్ఱ"** అనే విశేషణాన్ని ప్రయోగించడం, అది ముఖ్యమై ఉండడాన్ని సూచించడం కోసమే. **"ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః"** (పొందదగినవాడైన పరమాత్మయొక్క, పొందేవాడైన జీవునియొక్క) ఇత్యాది శ్లోకాలతోను, **"మిక్క ఇఱైనిలైయుమ్ మెయ్యా ముయిర్ నిలైయుమ్"** (గొప్పదైన భగవానుని స్థితి, వాస్తవమైన జీవుని స్వరూపం) ఇత్యాది పాశురాలతోను తెలుపబడిన అర్థపంచకమే ఇక్కడ **"మెత్తెన్ఱ పఞ్చశయనమ్"** (మెత్తని పంచశయనం) గా వివక్షితం. ఆ అర్థపంచకం ఎక్కడ ఉన్నది ? అని అంటే,

(కోట్టు క్కాల్ కట్టిల్ మేల్) - ఇక్కడ శాస్త్రాలే మంచంగా వివక్షితం. మంచాన్ని నాల్గు కాళ్ళు మోసేటట్లే, శాస్త్రప్రమేయాలన్నీ నాల్గు రీతులలో ఉంటాయని గ్రహించాలి. **"చతుర్విధమాన దేహవర్ణాశ్రమాధికార ఫలమోక్షసాధనగతి యుగధర్మ వ్యూహరూపక్రియాదికళై యఱివిక్కిఱ"** (నాల్గు విధాలైన దేహవర్ణాశ్రమాధికారుల ఫలమోక్ష సాధన గతులను, యుగధర్మ వ్యూహరూప క్రియాదులను తెలిపే) ఇత్యాది ఆచార్యహృదయ చూర్ణికయొక్క వ్యాఖ్యానాన్ని సేవించాలి. శాస్త్రాలు ఎందుకోసం ఏర్పడ్డాయి? అని అంటే,

(కుత్తువిళక్కెరియ) -జ్ఞానప్రకాశాన్ని కల్గించడంకోసం.

(కోట్టుక్కాల్) - "కోడు" అని ఏనుగు దంతానికి పేరు. **"కాట్టై నాడి త్తేనుకనుమ్ కళిఱుమ్ పుళ్ళు ముడన్ మడియ వేట్టై యాడి"** (అరణ్యంలో వెదకి ధేనుకాసురుడు కువలయాపీడం, బకాసురడు నశించేటట్లు వేటాడి) వచ్చిన శ్రీకృష్ణుడు ఏనుగును చంపి తీసికొని వచ్చిన దంతాలతో నీళాదేవికి మంచాన్ని నిర్మింపజేసి ఇచ్చినట్లుగా, ఆచార్యుడు పరసిద్ధాంతవాదులనే మదగజాలను జయించి, ఆ విజయం స్ఫురించేటట్లు వేంచేసి ఉండే సన్నివేశంలోని అతిశయం ఇక్కడ అనుసంధేయం.

(మైత్తడమ్ కణ్ణినాయ్!) - ఆచార్యసార్వభౌముని విశేషాభిమానానికి పాత్రమైన విలక్షణుడైన శిష్యుని స్వభావం దానిద్వారా తెలుపబడింది. **"మెయ్"** -అంటే కాటుక. అంటే- సిద్ధాంజనం. **"మనసి విలసితాక్ష్ణా భక్తిసిద్ధాంజనేన"** (భక్తి అనే సిద్ధాంజనంచేత మనస్సులో విలసిల్లే జ్ఞాన నేత్రంతో) అని భట్టర్, **"సిద్ధాంజనేన భవతైవ విభూషితాక్షాః"** (నీచేతనే సిద్ధాంజనంతో అలంకరింపబడిన నేత్రాలను కలవారై) అని దేశికులు పల్కిన రీతిలో భక్తిసిద్ధాంజనంచేత అలంకరింపబడి, అందువల్ల జ్ఞానవికాసాన్ని పొందిన ఆచార్యా!'' -అని భావం.

(నీ యున్ మణాళనై ఎత్తనైపోదుమ్ తుయిలెழవొట్టాయ్) - **"మణాళన్"** అని ఆచార్యులు నిర్దేశింపబడ్డారు. వారు కళ్ళను తెఱచి మమ్మలను కటాక్షించాలని తలచినా మాపై కటాక్షవీక్షణం ప్రసరించనట్లుగా నీవు నీవైపు తిప్పుకొన్నావే !- అని భావం. ఈ విధంగా ఉండడమేకదా సచ్ఛిష్యునియొక్క గొప్పతనం. **"ఎత్తనైపోదుమ్ తుయిలెழవొట్టాయ్"** (కొంచెం సేపు కూడా పడుకనుండి లేవనీయవా!) అని అన్నందువల్ల ఆ గొప్పతనం చూపబడింది.

(ఎత్తనైయేనుమ్ పిరివాఱ్ఱకిల్లాయ్) - **"ఆశారియన్ శెయ్‌ద ఉపకారమానతు తూయదాక నెఞ్జుతన్నిల్ తోన్ఱుమేల్, దేశాన్తరత్తిల్ ఇరుక్క మనన్దాన్ పొరున్ద మాట్టాతు"** (ఆచార్యుడు చేసిన ఉపకారం పవిత్రంగా మనస్సులో తోస్తే, వారిని విడచి దేశాంతరంలో ఉండడానికి మనస్సు అంగీకరించదు) అనే రీతిలో ఆచార్యుని క్షణకాలం విడచి విశ్లేషించడం సచ్ఛిష్యునకు అసహ్యమై ఉంటుంది.

(తత్తువ మన్టు తకవు) - **"తత్తువమ్ తకవు అన్టు"** అని భావం. ఇందులో పరమగుహ్యమైన వేదాంతసారార్థాన్ని సూక్ష్మంగా గ్రహించాలి. అద్వైతులు **"తత్త్వమసి"** అనే వాక్యాన్నే ఆధారంగా చేసికొని అద్వైతవాదాన్ని దృఢపఱచు కొంటున్నారు. వారు చెప్పే అర్థాన్ని మన ఆచార్యులు అయుక్తమని ఖండిస్తున్నారు. ఇక్కడ **"తత్తువమ్ తకవన్టు"** (తత్త్వం కాదు, తగినది కాదు) అనేది **"తత్త్వమసి"** అనే వాక్యానికి ఇతరులు పలికే అర్థం తగనిది- అని సూచిస్తున్నది. ఈ పాశురంలో ఇంకా సూక్ష్మమైన పలు విశేషార్థాలను గమనించవచ్చు. వాటినికూడా కొంచెం వివరిస్తాను.

"తోరణవిళక్కు" అని, **"కుత్తువిళక్కు"** అని దీపాలలో రెండు రీతులున్నాయి. **"తోరణవిళక్కు"**- స్థిరంగా ఉన్నదై, ఒకచోటనుండి ఇంకొక చోటికి తీసికొని పోవడానికి వీలుకాకుండా ఉంటుంది. **"కుత్తువిళక్కు"** -అనేది ఎక్కడికైనా తీసికొని పోవడానికి వీలుగా ఉంటుంది. తోరణవిళక్కు స్థానంలో తిరుక్కోట్టియూర్‌నంబిని, కుత్తువిళక్కు స్థానంలో భగవద్రామానుజులను గ్రహించాలి. తిరుక్కోట్టియూర్‌నంబి తమ ఊరిలోనే తమ ఇంటిలోనే ఉండేవారు. స్వామి అంతటా సంచరించేవారు. **"కోట్టుక్కాల్ కట్టిల్‌మేల్"** అనే చోట **"ఏకదేశవికృతం అన్యతమత్ భవతి"** అనే సంస్కృతవ్యాకరణశాస్త్రజ్ఞుల వైఖరి ప్రకారం **"కోట్టు"** అనేదానిని **"కోట్టి"** అని గ్రహించాలి. అపుడు **"కోట్టియూర్"** **"తిరుక్కోట్టియూర్"** అని అయినది. **"కుత్తువిళక్కు"** అని నిరూపించదగిన శ్రీరామానుజులు,

(ఎరియ) - జ్ఞానదీపాన్ని పొందడంకోసం, (రహస్యార్థజ్ఞానవిశేషశ్రవణం కోసం) తిరుక్కోట్టియూర్‌కు శ్రీరామానుజులు వేంచేసిన వృత్తాంతం దీనిద్వారా సూచింపబడింది. అక్కడ తిరుక్కోట్టియూర్‌నంబి శ్రీరామానుజులకు విశేషార్థాలను ఉపదేశించినపుడు "దీనిని ఎవరికి చెప్పను'' అని తమ శ్రీచరణాలపై ప్రమాణం చేయించి నియమించారు. ఆ సంగతి **"కాల్‌కట్టిల్"** అనే దానివల్ల సూచితం. **"కాల్"** అంటే శ్రీచరణాలు. **"కట్టు"** - ఆన- శపథం. ఆ తరువాత శ్రీరామానుజులు చేసిన పని ఏమి? అని అంటే, ఆ రీతిలోనే శపథం చేసి, కొందఱు విలక్షణాధికారులకు ఉపదేశించడంకోసం ఆలయం పైకి ఎక్కారు. ఆ సంగతి **"మేలేఱి"** అనే దానివల్ల సూచింపబడింది. ఆ విధంగా వారు ఆచార్యనియమనాన్ని అతిక్రమించి వర్తించడానికి హేతువు వారి హృదయవైశాల్యమే కనుక అది **"మలర్‌మార్పా !"** అని అనడం ద్వారా సూచింపబడింది. **"మలర్"**- విశాలమైన,

"మార్పా!" - హృదయాన్ని కల్గిన స్వామీ!- అని అర్థం. పాశురంలో మిగిలిన శబ్దసందర్భాలనుకూడా ఈ రీతిలోనే పొసగేటట్లు గమనించవచ్చు.

20. ముప్పత్తు మూవర్ అమరర్క్కు మున్ శెన్టు
కప్పమ్ తవిర్క్కుమ్ కలియే! తుయిలెழாయ్
శెప్ప ముడైయాయ్! తిఱలుడైయాయ్! శెற்றார్క్కు
వెప్పమ్ కొడుక్కుమ్ విమలా! తుయిలెழாయ్
శెప్పన్న మెన్‌ములై చ్చెవ్వాయ్ శిఱు మరుఙ్గుల్
నప్పిన్నై నఙ్గాయ్! తిరువే! తుయిలెழாయ్
ఉక్కముమ్ తట్టొళియుమ్ తన్దు ఉన్ మణాళనై
ఇప్పోదే ఎమ్మై నీరాట్టు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలోవలెనే ఈ పాశురంలోకూడా శ్రీకృష్ణుడు, నప్పిన్నైప్పిరాట్టి అనే దివ్యదంపతులనే ప్రబోధిస్తున్నారు. గడచిన పాశురంలో శ్రీకృష్ణుని రాసిక్యాన్ని (శృంగారరసవిదగ్ధుడై ఉండే స్వభావాన్ని) గూర్చి పల్కి, ఆనందించారు. ఈ పాశురంలో అతని గొప్ప బలిమినిగూర్చి పల్కి ఆనందిస్తున్నారు- అనేది తేడా.

(ముప్పత్తుమూవర్ అమరర్క్కు మున్ శెన్టు కప్పమ్ తవిర్క్కుమ్ కలియే!)- అనే సంబోధనలో ఎనిమిది విధాలైన (రస్య) భావాలు ధ్వనిస్తాయి.

1. ముప్పై మూడు : **("ముప్పత్తు మూవర్")** అనేది ముప్పైమూడు కోట్లమంది దేవతలను తెల్పుతుంది. కనుక గొప్ప సంఖ్య అయిన ముప్పై మూడు కోట్లమంది దేవతలనే రక్షిస్తాను. అంతకంటే చిన్నసంఖ్య అయిన అయిదు లక్షలమంది గోపికలను రక్షించాను - అని భావమా?

2. మగవారికి కలిగే ఆపదలనే పోగొడతాను; ఆడవారికి సంభవించే ఆపదలను పోగొట్టను- అనే వ్రతాన్ని చేపట్టావా?

3. గొప్ప శక్తిని కలవారికి కలిగే క్లేశాలనే పోగొట్టగలను. అబలలకు కలిగే క్లేశాలను పోగొట్టను- అనే అభిప్రాయమా?

4. **"సోఽహమ్"** అనే అహంకారం కల్గి, గుండెలను ఉప్పొంగించుకొని అహంకరించే వారి క్లేశాలనే పోగొడతాను. **"దాసోఽహమ్"** అనే వినయాన్ని కల్గినవారికి బాధలను పోగొట్టలేను- అని భావించావా?

5. క్షుద్రపురుషార్థాలను ఆశపడి వచ్చి సేవించేవారి కార్యాన్నే చేస్తాను. పరమ పురుషార్థాన్ని కోరి వచ్చేవారి కార్యాలను చేయను- అనే భావనను కల్గి ఉన్నవా?

6. **"జీవనగ్రహణే నమ్రాః గృహీత్వా పునరున్నతాః"** (జీవనాన్ని స్వీకరించేటపుడు వంగినవారై, దానిని గ్రహించిన తరువాత తిరిగి తల ఎత్తేవారై) అనే రీతిలో ప్రార్థించేటపుడు కాళ్ళను పట్టుకొని, ప్రార్థన నెఱవేరిన తరువాత ఎదురు బాణాలను సంధించే దేవతలవంటి వారికే కార్యాన్ని చేస్తాను. సాధనదశలో, సాధ్యం చేజిక్కిన దశతో తేడా లేకుండా **"నిన్ శేవడి శెవ్వి తిరుక్కాప్పు"** (నీ ఎఱ్ఱని అందమైన చరణాల శోభను మంగళం) అనే సూక్తి తప్ప వేఱొక మాటను తెలియనివారికి కార్యం చేయలేను-అనే భావనను కల్గి ఉన్నావా?

7. నీ దివ్యమంగళరూపాన్ని శ్రమపెట్టి, తమ కార్యాన్ని సాధించుకోవాలని చూచేవారికే మనోరథపూర్తిని చేయాలి - అని, నీ తిరుమేనికి రక్షను పెట్టడమే (మంగళాశాసనం చేయడమే) పనిగా కలవారి మనోరథపూర్తిని చేయకూడదు- అని భావించావా?

8. నశ్వరమైన శరీరానికి కల్గిన ఆపదను పోగొట్టాలి- అని ప్రార్థించేవారి కార్యాన్నే సఫలం చేయాలి. శాశ్వతమైన ఆత్మను రక్షించాలి- అని ప్రార్థించేవారి కార్యాన్ని చేయకూడదు- అనే అభిప్రాయమున్నదా? - అని ఈ విధంగా ఇంకా పలు భావాలను అభ్యూహించవచ్చు.

(మున్ శెన్ఱు కప్పమ్ తవిర్క్కుమ్) - **"మున్"** అనే పదాన్ని గూర్చి తమిళులు **"ఇడమున్", "కాలమున్"** (దేశాన్నిబట్టి ముందు, కాలాన్ని బట్టి ముందు) అని రెండుగా పల్కుతారు. **"ఇడమున్"** అయితే "వారికి ముందు వారు ఉండే చోటికి పోయి'' - అని ప్రకృతంలో అర్థం. **"కాలమున్"** అయితే "వారికి దుఃఖం కల్గడానికి ముందే వెళ్ళి'' అని అర్థం. పలువురు యుద్ధరంగంలో అగ్రభాగంలో నిలువడానికి భయపడి వెనుకకు పోవడానికి ప్రయత్నిస్తారు. శ్రీకృష్ణుడు మహాభారతయుద్ధంలో **"పఱ్ఱలర్ వీయ క్కోల్ కైయిల్ కొణ్డు పార్త్తన్ తన్ తేర్ మున్ నిన్ఱానై"** (శత్రువులు నశించేటట్లు ముల్లుకర్రను చేతిలో ధరించి పార్థుని రథంలో ముందు నిలుచున్న వానిని) అనే రీతిలో సారథియై అగ్రభాగంలో నిలచి కార్యాన్ని నిర్వహించాడు. శత్రువులు విడిచే అస్త్రశస్త్రాలను తన వక్షస్సులో భరించగల్గిన సామర్థ్యాన్ని కల్గి ఉన్నందువల్ల ఈ విధంగా చేశాడు. ఇక, కాలాన్నిబట్టి ముందు- అనే అర్థాన్ని గ్రహిస్తే, భక్తులకు ఆపద వచ్చిన తరువాత దానికి పరిహారాన్ని చేయడంకంటే,

అది రావడానికి ముందే పరిహరించగల్గినవాడు- అనే వైలక్షణ్యం స్ఫురిస్తుంది. ప్రహ్లాదాళ్వాన్, గజేంద్రాళ్వాన్, ద్రౌపదివంటివారికి ఆపద వచ్చిన తరువాతకదా దానికి పరిహారం చేశాడు- అని సాహసంతో ఆక్షేపించకూడదు. మనం చేసిన పాపాలకు ప్రతిక్షణం మనకు ఆపదలు కల్గవలసి ఉన్నా, ఆ విధంగా కల్గకుండా ఉండడం ఆ భగవానుని అనుగ్రహంవల్లనే- అని అనుసంధించాలి.

"కప్పమ్" అనే పదాన్ని సంస్కృతపదవికారంగా- గ్రహించవచ్చు, ద్రావిడ పదంగాను గ్రహించవచ్చు. **"కంపః"** అనే సంస్కృతపదానికి "వణకు''- అని అర్థం. ఆ పదం **"కప్పమ్"** అనే వికారాన్ని పొందింది - అని తలిస్తే, దేవతలకు ఉండే కంపాన్ని పోగొట్టేవాడు- అనే అర్థం వస్తుంది. ఓడినవారు గెలిచినవారికి కప్పం చెల్లిస్తారు కదా. దానిని ఈ పదం తెల్పుతున్నదని కూడా చెప్పవచ్చు. యశోదాదేవి **"కఞ్జన్ కడియన్ కఱవెట్టు నాళిల్ ఎన్ కైవలత్తాదుమిల్లై"** (పెరియ తిరుమొళి- 10-7-10) అని అన్నది. "కంసుడు దుష్టుడు, అతనికి ఎనిమిది దినాల లోపల కప్పం కట్టవలసి ఉన్నది. నాచేతిలో చూస్తే ఏమీ లేదు'' అని యశోద బాధపడి పల్కింది. **(కఱవు- కప్పం)** ఈ విధంగా కప్పాన్ని చెల్లించవలసిన అక్కఱ లేకుండా చేశాడు, శ్రీకృష్ణుడు.

(ముప్పత్తు మూవర్ అమరర్) - వేదంలో మాటిమాటికి **"త్రయ స్త్రింశద్వై దేవాః"** అని దేవతలు ముప్పైమూడుమందిగా చెప్పబడుతున్నారు. అష్టవసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, అశ్వినీదేవతలు ఇద్దఱు- అని వేదమే వివరణాన్ని ఇచ్చింది. పొయ్కై ఆళ్వార్ **"ఎణ్మర్ పదినొరువర్ ఈరఱువర్ ఓరిరువర్"** (ఎనిమిదిమంది వసువులు, ఏకాదశరుద్రులు, ద్వాదశాదిత్యులు, ఇద్దఱు అశ్వినీదేవతలు) అని, నమ్మాళ్వార్ పెరియతిరువన్దాదిలో - **"ఇరు నాల్వర్ ఈరైన్దిన్ మేలొరువర్ ఎట్టోడొరు నాల్వర్ ఓరిరువర్"** అని అనుగ్రహించిన పాశురాలు స్మరణీయాలు. స్వాపదేశార్థంలో **"ముప్పత్తు మూవర్"** అనే దానికి "మూడు విధాలైన భక్తులను కల ముగ్గురు అమరులు'' అని అర్థం. పరభక్తి-పరజ్ఞాన- పరమభక్తులు అనేవి మూడు విధాలైన భక్తులు. ముగ్గురు ఎవరు? అంటే, **"అఙ్గమరుమ్ జ్ఞానాధికరుమ్, భక్తిపరవశరుమ్"** అని శ్రీవచనభూషణంలో అనుగ్రహింపబడిన ముగ్గురు. వీరు ఏ విధంగా అమరులు? అని అంటే, **"అజరా మరవత్ ప్రాజ్ఞో విద్యామర్థం చ సాధయేత్, గృహీత ఇవ కేశేషు మృత్యునా ధర్మమాచరేత్"** - (ప్రాజ్ఞుడు, ముసలితనం, మరణం లేనివానివలె విద్యను, ధనాన్ని ఆర్జించాలి,

మృత్యువు కేశాలను పట్టుకొని తీసికొనిపోతున్నట్లుగా తలచి ధర్మాన్ని ఆచరించాలి) అనే శ్లోకక్రమంలో **"అమరర్"** అనే పదానికి చావు లేనివారని అర్థం. **"మిన్నిన్నిలై యిల మన్నుయిరాక్కైకళ్"** (మెఱపు తీగ అంతటి నిలుకడను కూడా జీవుల శరీరాలు కల్గి ఉండవు) అనేదానిని, **"తటిచ్చంచల మాయూష్యమ్"** (ఆయుస్సు మెఱుపువలె చంచలం) అనేదానిని తెలిసినా, విద్యను అభ్యసించేటపుడు, ధనాన్ని సంపాదించేటపుడు తమను అమరులమని - చావులేనివారమని భావించాలి. లేకపోతే అభ్యసించడంలోను, డబ్బును సంపాదించడంలోను ప్రవృత్తియే కలుగదు. అందువల్ల, అజ్ఞులై, జ్ఞానాధికులై, భక్తిని కలవారై, విద్యను అభ్యసించడంలో చాలా ఉత్సాహాన్ని కలవారై ఉండేవారికి అపేక్షానిరపేక్షంగా పోయి ఉపదేశించే ఆచార్యుడు ఇక్కడ తెలుపబడుతున్నాడు. ఆళవందార్‌కోసం మణక్కాల్‌నమ్బి వారిని అనువర్తించికదా ఉపదేశించారు. **"కలియే!"** - గొప్ప బలిమిని కలవారా! - అని భావం.

(శెప్ప ముడైయాయ్!) - ఆర్జవమనే గుణానికి "శెప్ప"మని పేరు. **"మనస్యన్యత్ వచస్యన్యత్ కర్మణ్యన్యత్ దురాత్మనామ్"**, (దురాత్ములకు మనస్సులో ఒకటి, మాటలో ఇంకొకటి, చేతలో ఇంకొకటి) అనే రీతిలో ఉండడం ఈ గుణానికి వ్యతిరేకం. అది కౌటిల్యమనబడుతుంది. **"మనస్యేకం వచస్యేకం కర్మణ్యేకం మహాత్మనామ్"** (మహాత్ములకు మనస్సులోను, మాటలోను, చేతలోను ఒకటే) అనే రీతిలో ఉండడమే ఋజుత్వం. అదే "శెప్ప" మని, "శెమ్మై" అని చెప్పబడు తున్నది. స్తోత్రరత్నంలో "వశీ వదాన్యో గుణవాన్" అని పల్కిన తరువాత **"ఋజుః"** అని ప్రయోగింపబడడాన్ని గమనించవచ్చు. ఆచార్యుని విషయంలో ఋజుత్వ మనేది- ప్రమాణవచనాలకు అర్థాన్ని చెప్పేటపుడు మనస్సుకు తోచిన రీతిలో చెప్పకుండా, **"భగవద్బోధాయనకృతాం విస్తీర్ణాం బ్రహ్మసూత్రవృత్తిం పూర్వాచార్యాః సంచిక్షిపుః, అథ తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే"** (భగవానుడైన బోధాయన మహర్షిచేత విస్తృతంగా రచింపబడిన బ్రహ్మసూత్రాల వృత్తిని పూర్వాచార్యులు సంక్షేపించారు. తన్మతానుసారంగా బ్రహ్మసూత్రాక్షరాలు వ్యాఖ్యానింపబడుతున్నాయి.) అని శ్రీభాష్యప్రారంభంలో అనుగ్రహించినట్లుగా **"మున్నోర్ మొழிన్ద ముఱై తప్పామల్ కేట్టు ప్పిన్ ఓర్న్దు తామదనై ప్పేశాదే"** (పూర్వులు పల్కిన క్రమాన్ని తప్పకుండా విని దానిని అనుసరించి పల్కకుండా) ఉండడం.

(తిఱముడైయాయ్!) - భగవానుడు సౌందర్యవీర్యపరాక్రమనిధిగా చెప్పబడు తున్నాడు. ఆచార్యుని విషయంలో "తిఱల్". ఎంతమంది దుర్వాదాలు చేసినా, వారిని అనాయాసంగా ఎదుర్కో గల్గిన శక్తి విశేషమే.

(శెఱ్ఱార్‌క్కు వెప్పమ్ కొడుక్కుమ్)- "శెఱ్ఱార్"- శత్రువులు. భగవానునకు శత్రువులు ఎవరూ లేరు. **"ద్విషదన్నం న భోక్తవ్యం ద్విషంతం నైవ భోజయేత్, పాండవాన్ ద్విషసే రాజన్! మమ ప్రాణా హి పాండవాః"** (శత్రువుల అన్నాన్ని భుజించరాదు, శత్రువుకు భోజనం పెట్టరాదు. రాజా! నీవు పాండవులను ద్వేషిస్తున్నావు. పాండవులు నా ప్రాణాలు కదా!) అనే భగవద్వచనానుసారం భాగవతవిరోధులనే తన శత్రువులుగా అతడు భావిస్తాడు. అటువంటివారికి భీతిని కల్గించేవాడు- అని అర్థం. భగవానుని స్వరూపరూపగుణవిభూతి విగ్రహచేష్టితాలపట్ల విప్రతిపత్తిని కలవారు ఆచార్యులకు శత్రువులు. వారిని నిరసనం చేసేవారు ఆచార్యులు.

(విమలా!) - భగవానునకు అఖిలహేయప్రత్యనీకుడనే బిరుదు ఉన్నది. దోష భూయిష్ఠులైనవానితో చేరి ఉన్నప్పటికీ తనకు కొంచెంకూడా దోషం సంక్రమించని వాడని దీని భావం. ఆచార్యునకు విమలత్వమంటే- సంసారుల మధ్యలో తాము కూడా ఒక సంసారిగా సంచరిస్తున్నా, సంసారులకు ఉండే దోషాల (కామ క్రోధాదులు) స్పర్శ లేకపోవడం.

"శెప్పెన్న మెన్ములై" (బరిణెవంటి మెత్తని స్తనాలను కల్గినది) అని ప్రారంభించి నీళాదేవియొక్క అవయవసౌందర్యాతిశయం తెలుపబడుతున్నది. శ్రీవచన భూషణంలో - "పిరాట్టి చేతనులను సంస్కరిస్తుంది. భగవానుని మాఱుస్తుంది''- అని పలికే సందర్భంలో **"ఇరువరైయుమ్ తిరుత్తువదు ముపదేశత్తాలే. ఉపదేశత్తాలే మీళాదపోదు చేతననై అరుళాలే తిరుత్తుమ్, ఈశ్వరనై అழகాలే తిరుత్తుమ్"** (ఇద్దఱిని ఉపదేశంతో సంస్కరిస్తుంది. వారు ఉపదేశంతో మాఱనపుడు, చేతనుని తన కృపతో సంస్కరిస్తుంది. ఈశ్వరుని తన అందంతో సంస్కరిస్తుంది.) అని పల్కినందువల్ల, భగవానుని అస్మదాదులపట్ల అభిముఖునిగా చేయడంకోసం ఉపయోగపడేది రూపసౌందర్యం కనుక, ఇక్కడ అది వర్ణింపబడు తున్నది. శ్రీవచనభూషణంలో అనుగ్రహించినది శ్రీమహాలక్ష్మిని గూర్చియే తప్ప, నీళాదేవినిగూర్చి కాదుకదా- అనే సందేహపడనక్కరలేనట్లుగా **"నప్పిన్నై నఙ్గాయ్!**

తిరువే !" (పూర్ణురాలైన నీళాదేవీ! లక్ష్మీరూపిణీ !) అని (అభేదంగా) చెప్పబడింది. ఆమెనుకూడా లక్ష్మీదేవి అంశభూతురాలుగా భావించాలి- అని భావం.

ఆచార్యపరమైన స్వాపదేశార్థంలో, "ఆశారియన్ శిచ్చన్ ఆరుయిరై ప్పేణు మవన్, తేశారుమ్ శిచ్చన్ అవన్ శీర్‌వడివై" (ఆచార్యుడు, శిష్యుని గొప్పదైన ఆత్మను ఆదరించాలి. తేజస్సు నిండుగా కల్గిన శిష్యుడు, అతని గొప్పదేహాన్ని ఆదరించాలి.) అనే ఉపదేశరత్తినమాలై సూక్తి క్రమంలో శిష్యులకు ఆచార్యుని దివ్యమంగళవిగ్రహమే పరమోద్దేశ్యమనే శాస్త్రార్థం ఇక్కడ తెలుపబడింది. "శీరారు మెతిరాశర్ తిరువడికళ్ వాఴి" (కల్యాణగుణాలు నిండుగా కల యతిరాజుల శ్రీచరణాలకు మంగళం) అని, "శెయ్యతామరై త్తాళిణై వాఴియే" (ఎఱ్ఱని అందమైన తామరలవంటి శ్రీవరవరమునుల పాదాల జంటకు మంగళం) అని మనం నిత్యం అనుసంధించడం దానినిగూర్చేకదా!

(ఉక్కముమ్ తట్టొళియుమ్ - ఇత్యాది) - "ఉక్కముమ్" అంటే- విసనకఱ్ఱ "తట్టొళి"- అంటే అద్దం. ఇక్కడ ఈ రెండిటిని పల్కడం మిగిలిన అన్ని కైంకర్యోప కరణాలకు ఉపలక్షణం. భగవత్సన్నిధిలో, ఆచార్యసన్నిధిలో కైంకర్యమే పరమ పురుషార్థమని తెలుపబడినట్లయినది.

21. ఏఱ్ఱ కలఙ్గళ్ ఎదిర్ పొఙ్గి మీదళిప్ప
మాఱ్ఱాదే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్
ఆఱ్ఱప్పడైత్తాన్ మకనే! అఱివుఱాయ్!
ఊఱ్ఱముడైయాయ్! పెరియాయ్! ఉలకినిల్
తోఱ్ఱమాయ్ నిన్ఱ శుడరే! తుయిలెఴాయ్
మాఱ్ఱార్ ఉనక్కు వలి తొలైన్దు ఉన్ వాశఱ్కణ్
ఆఱ్ఱాదు వన్దు ఉన్ అడి పణియుమాపోలే
పోఱ్ఱి యామ్ వన్దోమ్ పుకఴ్న్దు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలోని ఉత్తరార్ధంలో గల పాదాలలో తెలుపబడిన నీళాదేవి గభాలున లేచి, "నేను మీలో ఒకతెనుకదా. మీకు కావలసినవానిని చేయడంకోసం కాచుకొని ఉన్నాను'' అని పల్కి వీరి గోష్ఠిలో కలిసింది. అపుడు అందఱు కలసి శ్రీకృష్ణుని ఈపాశురంలో స్తుతిస్తున్నారు - నందగోపాలుని బాల్యస్మృతిని పొగడుతూ, అతని కుమారుడా! అని అంటూ శ్రీకృష్ణునకు ముఖోల్లాసాన్ని కల్గిస్తున్నారు.

"ఏఱ్ఱ కలఙ్గళ్ ఎదిర్ పొఙ్గి మీదళిప్ప మాఱ్ఱాతే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్ ఆఱ్ఱ ప్పడైత్తాన్ మకనే !" (పెట్టిన పాత్రలు నిండి ఉప్పొంగి పొర్లుతున్నా, ఆగకుండా పాలను సేవించే గొప్ప ఉదారాలైన, పెద్ద పెద్ద పశువులను సమృద్ధిగా కల్గినవాని కుమారా!) అని శ్రీకృష్ణుని పిలవడం అన్యాపదేశార్థం. పితికిన పాలను గ్రహించడంకోసం పెట్టబడిన పాత్రలు ఒక్కక్షణంలో నిండి, పొంగిపొర్లి, బయటకు ప్రవహించే రీతిలో నిరంతరం పాలను స్రవించే ఉదారత్వాన్ని కల్గిన గొప్ప గొప్ప పశువులు అధికంగా కల్గిన నందగోపాలుని కుమారా! - అని దీని అర్థం. ఇక, స్వాపదేశంలో అయితే- శిష్యలక్షణ సంపన్నులైన సచ్ఛిష్యులను "వీరు ఆచార్యులకంటే గొప్పవారు'' అని లోకం అంతా పొగడే రీతిలో గొప్ప యోగ్యతను పొందేటట్లు పాలవంటి మహార్థాలను నిరంతరంగా వర్షించే ఆచార్యులను పలువురను నిర్మించిన ఒక గొప్ప మహాచార్యుని "ఆఱ్ఱప్పడైత్తాన్" (సమృద్ధిగా కల్గినవాని) అనే పదంద్వారా పల్కి, ఆ ఆచార్యులపట్ల సర్వాత్మనా విధేయులై ఉండే ఒక ఉత్తమ శిష్యుని- "మకనే !" అని సంబోధిస్తున్నారు. కూరేశులు, ముదలి యాణ్డాన్, ఎమ్బార్, పిళ్ళాన్ మొదలైనవారు ఆచార్యులకంటే అతిశయాన్ని కల్గినవారు కనుక, వారు "ఎదిర్ పొఙ్గి మీదళిక్కుమ్ ఏఱ్ఱక్కలఙ్గళ్"గా భావించదగినవారు. వీరు ఇటువంటివారు అయే రీతిలో నిరంతరం "పాల్ శొరికిన్ఱ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్" (పాలను స్రవించే గొప్ప ఉదారమైన పశువు - గోవు) భగవద్రామానుజులే. (ఇక్కడి బహువచనం పూజాయాం బహువచనం) "వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్ ఆఱ్ఱప్పడైత్తాన్"- (ఉదారమైన గొప్ప పశువులను సమృద్ధిగా కలవారు) ఆళవందార్ అని గ్రహించి. వారికి "మకన్" వంటివారైన పెరియనమ్బి, తిరుమలైనంబి, తిరుక్కోట్టియూర్‌నంబి, తిరుమాలై యాణ్డాన్, తిరువరఙ్గ ప్పెరుమాళ్ అరైయర్ మొదలైనవారిలో ఒకరు "మకనే !" అని పిలువబడుతున్నారు- అని చెప్పవచ్చు.

లేక, "ఎదిర్ పొఙ్గి మీదళిక్కుమ్ ఏఱ్ఱ కలమ్" (నిండుగా ఉప్పొంగే తగిన పాత్ర) ఎవరంటే -భగవద్రామానుజులే. వీరు పంచాచార్య పదాశ్రితులు కనుక, పెరియనంబి మొదలైన ఆ ఆచార్యులు "మాఱ్ఱాదే పాల్ శొరియుమ్ వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్" (మాఱకుండా పాలను వర్షించే ఉదారమైన పశువులు) ఆ పశువులను "ఆఱ్ఱప్పడైత్తాన్" ఆళవందార్. వారికి "మకన్" భగవద్రామానుజులు- అని చెప్పవచ్చు. ఇదికూడా చాలా యుక్తమైన నిర్వాహం.

(ఏ*ఱ్ఱ* కలజ్గళ్) - ఆచార్యులు ఉపదేశించే అర్థవిశేషాలను - **"అఱివిత్తేన్ ఆ*ఴ్*పొరుళై చ్చిన్దామల్ కొణ్మినీర్ తేర్న్దు"** (గంభీరాలైన అర్థాలను తెలిపాను. అవి చిందిపోకుండా మనస్సు తేటపఱచుకొని గ్రహించండి) అని తిరుమ*ఴి*శైప్పిరాన్ పల్కిన రీతిలో **"శిన్దామల్"** (చెదరిపోకుండా) గ్రహించగల్గిన పాత్రులు శిష్యులే కనుక, వారు **"కలజ్గళ్"** అనే పదంద్వారా వివక్షితులు. **"ఏ*ఱ్ఱ* కలజ్గళ్"** అంటే -ఆచార్యునకు తగిన శిష్యులు - అని భావం. వేదాంతదేశికులు న్యాసవింశతిలో **"సిద్ధం సత్సంప్రదాయే"** అనే శ్లోకం ద్వారా ఆచార్యలక్షణాన్ని, **"సద్బుద్ధి స్సాధుసేవీ"** అనే శ్లోకంద్వారా శిష్యలక్షణాన్ని అనుగ్రహించారు. ఈ విధంగా సదాచార్యలక్షణాన్ని కల్గిన గురువులకు తగిన రీతిలో సచ్ఛిష్యలక్షణాన్ని కల్గినవారై వచ్చి చేరిన అంతేవాసులు ఇక్కడ **'ఏ*ఱ్ఱ* కలజ్గళ్"** అని నిర్దేశింపబడుతున్నారు. తైత్తిరీయ ఆరణ్యకంలో **"నైవం విదుషాచార్యాన్తేవాసినౌ అన్యోన్యస్మై ద్రుహ్యేతామ్"** అని చెప్పబడినదానిని చక్కగా గ్రహించి, ఆచార్యులు వర్తించగా, దానికి తగినట్లుగా నడచుకొనే శిష్యులే **"ఏ*ఱ్ఱ* కలజ్గళ్"**.

(ఎదిర్ పొజ్గి మీదళిప్ప) - **"పుత్రాదిచ్ఛేత్ పరాజయమ్"** (పుత్రుని వల్ల పరాజయాన్ని కోరాలి), **"శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్"** (శిష్యునివల్ల పరాజయాన్ని కోరాలి) అని అంటారు. తండ్రి తన కుమారునివల్ల పరాజయాన్ని పొందాలని కోరాలి. ఆచార్యుడు తన శిష్యునివల్ల పరాజయాన్ని పొందాలని కోరాలి. అంటే- ఆచార్యుడు తనకంటే మిక్కిలి సమర్థుడై, తనకుకూడా జ్ఞానాన్ని కల్గించే సమర్థుడైన శిష్యుని పొంది, అసూయపడకుండా, మిక్కిలి ఆనందిస్తాడు- అని భావం. భగవద్రామానుజులు, తిరుమాలైయాణ్డాన్‌వద్ద తిరువాయ్‌మొ*ఴి*ని ఆలకించేటపుడు, ఆళవందార్‌మనస్సులో ఉండే అర్థవిశేషాలను తాము తెలియగల్గి, వాటిని ఆ ఆచార్యులకుకూడా తెలియజేశారు- అనే సంగతి ప్రసిద్ధం. కూరేశులు, బోధాయన వృత్తిగ్రంథాన్ని అంతటిని తమ మనస్సులో నిలుపుకొని, భగవద్రామానుజులు సైతం ఆశ్చర్యపడే రీతిలోని మేథాప్రతిభావికాసశాలియై వెలిగారు- అనే వృత్తాంతం ప్రసిద్ధం. దీపంలో వెలిగించిన దివ్వెటీవలె కూరేశులకు మించి భట్టర్, భట్టర్‌ను మించి నంజీయర్, నంజీయర్‌ను మించి నంబిళ్ళై జ్ఞాననిధులై ప్రకాశించారుకదా! వీరు అందఱు విశేషసమయాలలో స్వాచార్యులకుకూడా ఉద్బోధనం చేసి, **"వళర్త్తదనాల్ పయన్‌పెఱ్ఱేన్ వరుక వెన్ఱు మడక్కిళియై కైకూప్పి వణజ్గినాళే"** (నిన్ను పెంచినందులకు తగిన ఫలాన్ని పొందాను. రా ! అని అందమైన చిలుకను

పిలిచి, నమస్కరించింది) అనే తిరునెడున్దాణ్డక పాశురానికి లక్ష్యంగా ప్రకాశించారు- అనే సంగతి ఐతిహ్యాలవల్ల తెలుస్తున్నది. **"ఏ*ఱ్ఱ* కలజ్గళ్ ఎదిర్ పొజ్గి మీదళిక్కుమ్"** అనే ప్రయోగంలోని తాత్పర్యం ఇదే.

(మా*ఱ్ఱా*దే పాల్ శొరియుమ్) - పైన వివరించిన రీతిలోని అతిశయాన్ని శిష్యులు పొందే రీతిలో ఆచార్యులు చేయడం ఇదే. **"ఉనదు పాలేపోల్ శీరిల్ ప*ఴు*త్తొ*ఴి*న్దేన్"** (పాలవంటి నీ కల్యాణగుణాల అనుభవంలో మగ్నమయ్యాను) (పెరియ తిరువన్దాది) అని ఆ*ఴ్*వార్లు భగవద్గుణాలను పాలుగా పల్కినందువల్ల, **"పాల్ శొరియుమ్"** అనేది భగవద్గుణాలను ధారలు ధారలుగా వర్షించే రీతి ఈ విధంగా తెలుపబడింది. **"మా*ఱ్ఱా*దే"** (మారకుండా) అనే పదానికి పలు రీతులలో అర్థాన్ని చెప్పవచ్చు. **"మున్నోర్ మొ*ఴి*న్ద ముఱై తప్పామల్ కేట్టు ప్పిన్నోర్న్దు తామదనై ప్పేశుకై"** (పూర్వులు పల్కిన సూక్తి క్రమాన్ని తప్పకుండా విని అనుసరించి, తాము దానిని పల్కడం) సరి అయిన క్రమమై ఉండగా, ఆ క్రమాన్ని కాదని వారు పల్కిన అర్థాలను మార్చి పలికేవారు కొందఱు. ఆ రీతిలో మాఱుగా పల్కకుండా, **"భగవద్బోధాయనకృతాం విస్తీర్ణాం బ్రహ్మసూత్రవృత్తిం పూర్వాచార్యాః సంచిక్షిపుః తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే"** (భగవద్బోధాయనులు రచించిన విస్తారమైన బ్రహ్మసూత్ర వివరణాన్ని పూర్వాచార్యులు సంక్షేపించారు. ఇపుడు వారి మతానుసారంగా బ్రహ్మసూత్రాక్షరాలు వ్యాఖ్యానింపబడుతున్నాయి.) అని శ్రీభాష్యకారులు, **"ఎన్దై తిరువాయ్‌మొ*ఴి*ప్పిళ్ళై యిన్నరుళాల్ వన్ద ఉపదేశమార్గత్తై చ్చిన్దై శెయ్‌తు"** (తండ్రి అయిన తిరువాయ్‌మొ*ఴి*ప్పిళ్ళై యొక్క మధురమైన కృపతో వెలువడిన ఉపదేశక్రమాన్ని చింతిచి) అని మణవాళ మహామునులు పల్కిన రీతిలో, పూర్వుల క్రమాన్ని మార్చకుండా- అనేది మొదటి అర్థం.

ఒక వ్యవస్థలో నిష్ఠను లేకుండా పలికేవారు, తమ మనస్సులో తోచిన రీతిలో ఈనాడు ఒక అర్థాన్ని పల్కి, మఱునాడు అందులో అనుపపత్తిని తామే గ్రహించి, "నిన్న తప్పుగా పలికాను. దానిని గ్రహించవద్దు. ఈనాడు యథార్థాన్ని పల్కుతున్నాను. దీనిని గ్రహించండి" - అని అనడం, మఱునాడు దానినికూడా తామే కాదని, ఇంకొక అర్థాన్ని పల్కడం సహజం. ఈ విధంగా తమ మాటలను తామే మార్చేవారు - కొందఱు. ఆ రీతిలో కాకుండా, నిష్కృష్టమైన అర్థాన్ని స్థితి చెడకుండా పల్కి- అనేది రెండవ అర్థం. తాము పల్కిన అర్థంలో ఇంకొకరు

ఎవరైనా అనుపపత్తులను పల్కి, అది తప్పు అని ఖండించి, వేఱొక అర్థాన్ని చెప్పనక్కఱలేనట్లు, అందఱు ఆ అర్థాన్నే అధికరించే రీతిలో- అనేది ఇంకొక అర్థం. ఆ అర్థంలో **"మాఱ్ఱాదే"** - అంటే మార్చనక్కఱలేకుండా -అని అర్థం.

బహుశ్రుతత్వసిద్ధికోసం ఇంకొక ఆచార్యులవద్దకు పోకుండా **"యస్మాదేవ మయా సర్వం శాస్త్రమగ్రాహి నాన్యతః"** (ఎవరివల్ల నాచే సమస్తశాస్త్రాలు గ్రహింప బడ్డాయో, ఇంకొకరివల్ల కాదో) అని నాయనాచార్యులవారు పల్కిన రీతిలో సకలార్థాలను ఒక్కరే ఉపదేశించే రీతిని, **"మాఱ్ఱాదే"** అనే పదం తెల్పుతుంది. "ఆచార్యుని మార్చనక్కరలేనట్లుగా'' అని తాత్పర్యం. ఇది నాల్గవ అర్థం.

"మాఱ్ఱాదే" -ఏమార్చకుండా - అనికూడా అర్థం. మానవులలో సంభావ్యాలైన భ్రమ- ప్రమాదాదులలో **"విప్రలిప్స"** అనేది ఒకటి. వంచించాలనే ఇచ్ఛ- అని దీని అర్థం. అసత్యాలైన ప్రమాణాలను, తప్పుడు అర్థాలను పల్కి వంచించాలని భావించకుండా- అని భావం. ఇది అయిదవ అర్థం. నిరంతరం- అని కూడా ఇంకొక అర్థం. (**"సతతం కీర్తయంతో మామ్"** అని గీతాచార్యులు పల్కిన రీతిలో) ఈ విధంగా ఆఱు అర్థాలను చెప్పవచ్చు.

(పాల్ శొరియుమ్) -పాలు తెల్లని రంగులో ఉంటాయి. అదే రీతిలో ఆచార్యులు శుద్ధమైన అర్థాలను వర్షిస్తారు. పుట్టిననాటినుండి మరణించే నాటివరకు పాలు ఉపజీవ్యం. అదే రీతిలో, **"అన్ఱు నాన్ పిఱన్దిలేన్ పిఱన్ద పిన్ మఱన్దిలేన్"** (అపుడు నేను జన్మించలేదు. జన్మించిన తరువాత -సత్తను పొందిన తరువాత- మఱువలేదు) అనే రీతిలో సత్తను పొందిననాటినుండి యావదాత్మభావి ఉపజీవ్యాలు - ఆచార్యులు అనుగ్రహించే అర్థవిశేషాలు. దూడను చూస్తే తప్ప గోవులు పాలను స్రవించవు. పాత్రలో సేకరింపబడిన పాలే పలువురకు ఉపయోగపడతాయి. తాళపత్రాలలో వ్రాయబడే అర్థవిశేషాలే తరువాతి కాలంవారికి ఉపయోగపడతాయి. నంబిళ్ళైవంటివారు ఉపన్యసించిన అర్థవిశేషాలు వడక్కుత్తిరువీధిప్పిళ్ళైవంటివారిచే తాళపత్రాలలో వ్రాయబడినవికదా ఈనాడు మనవంటివారుకూడా ఆస్వాదించి ఆనందించడానికి వీలువుతున్నది. అందువల్ల ఈ రీతిలోని సామ్యాలద్వారా అర్థవిశేషాలే పాలుగా చెప్పబడ్డాయని భావించవచ్చు. చాలా శ్రమపడి ఆలోచించి ఒకటి, రెండు అర్థాలను పలికేవారు ఉంటారుకదా ! ఆ రీతిలో కాకుండా సదాచార్యులు తిరుమలలోని కొండవాగువలె (పుష్కలంగా) స్రవిస్తారు- అని తెల్పుతున్నది- **"శొరియుమ్"** అనే ప్రయోగం.

(వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్) - **"ఉదారః సందర్శయన్ నిరమమీత పురాణ రత్నమ్"** (ఉదారుడైన పరాశరమహర్షి పురాణరత్నమైన విష్ణుపురాణాన్ని అర్థపంచకాన్ని వివరిస్తూ రచించాడు) అని అంటూ ఆళవందార్ పరాశరమహర్షిని **"ఉదారు"** లని అన్నారు. **"త్వాం హి శ్రియః శ్రియ ముదాహు రుదారవాచః"** (గొప్ప వాక్కులను కలవారు నిన్ను లక్ష్మికి కూడా లక్ష్మిగా పలికారు.) అని కూరేశులు తిరుమంగైయాళ్వార్‌ను ఉదారులని అన్నారు. ప్రత్యుపకారాన్ని ఆశించకుండా ఈవిధంగా శ్రీసూక్తిరత్నాలను అనుగ్రహించే ఆచార్యులే ఉదారులు.

(పెరుమ్ పశుక్కళ్) - పశువులుకూడా మృగజాతికి చెందినవి అయినా, మిగిలిన మృగాలు హింసను, క్రూరత్వాన్ని స్వభావంగా కల్గి ఉండగా, పశువులు (గోవులు) మాత్రం పాలను, పెరుగును, వెన్నను ఇచ్చి లోకాన్ని అంతటిని ఉజ్జీవింపజేసేటట్లే, ఆచార్యులుకూడా మనుష్యజాతికి చెందినవారైనా, మిగిలిన మానవులు మానవరూపాన్ని పొందిన నాల్గు కాళ్ళ జంతువులు- అనే రీతిలో ఉండగా, వీరుమాత్రం అమృతతుల్యాలైన అర్థాలను వర్షించి, లోకాన్ని ఉజ్జీవింప జేస్తున్నందువల్ల, ఈ స్వభావంలో భగవానునికంటే గొప్పతనాన్ని కల్గి ఉన్నందున, **"పెరుమ్ పశుక్కళ్"** అని అనడం పొసగుతుంది. పశువులు తినేది ఏది అయినా, అవి మధురమైన క్షీరమే స్రవిస్తాయి. అదే రీతిలో, ఆచార్యులు మనం భుజించేవానినే భుజించినా, అమృతంకంటే మధురాలైన శ్రీసూక్తులే వారి నోటినుండి వెలువడతాయి. పశువులు తమ నాల్గు స్తనాలనునుండి పాలను స్రవించేటట్లే, ఆచార్యులు కూడా **"గ్రంథచతుష్టయమ్"** అని ప్రసిద్ధంగా చెప్పబడే నాల్గు గ్రంథాల ద్వారా దివ్యార్థాలను అనుగ్రహిస్తారు. (గ్రంథచతుష్టయం ఏది? అంటే- శ్రీభాష్యం. గీతాభాష్యం, భగవద్విషయం, రహస్యగ్రంథాలు) పశువులు గృహంలో చివరి స్థానంలో జీవించేటట్లే, ఆచార్యులుకూడా **"సప్తపర్వవ్యవధానతుంగాం శేషత్వకాష్ఠామ్"** (ఏడు పర్వాల వ్యవధానంతో గొప్పదైన శేషత్వదశను) అని పాదుకాసహస్రంలో పల్కిన క్రమంలో **"అడియారడియార్‌తమ్ అడియారడియార్ తమక్కడియారడియార్ తమ్ అడియారడియోజ్గళే"** (భగవానుని దాసులకు దాసులకు దాసులము) అని, **"త్వద్భృత్యభృత్యపరిచారకభృత్య భృత్య భృత్యస్య భృత్యః"** (నీ భృత్యుల భృత్యులకు భృత్యులకు భృత్యులకు భృత్యులకు భృత్యుడు) అని, **"త్వద్దాస దాస గణచారమావధౌ యః తద్దాసతైకరసతాఽవిరతా మమాస్తు"** (నీ దాసుల దాసుల క్రమాన్ని

లెక్కించడంలో చివరి అవధిలోని దాసత్వంలో గల అనుభవం నాకు నిత్యం కలగాలి) అని పర్యంతసీమ అయిన నికర్షాన్ని అనుసంధిస్తారు.

ముమూర్షుదశలో గోదానం గొప్పది. అదే రీతిలో ధర్మదేవతయొక్క ముమూర్షుదశలో ఆచార్యులనబడే **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్"** (ఔదార్యాన్ని కల్గిన గొప్ప గోవులు) భగవానునిచే దానం చేయబడుతున్నారు. ఈ విషయం గీతలోని నాల్గవ అధ్యాయంలో సూచితం. ఏరీతిలో? అంటే, **"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత !, అభ్యుత్థాన మధర్మస్య తదాత్మానం సృజామ్యహమ్"** (ఎపుడెపుడు ధర్మానికి హాని, అధర్మానికి అభ్యుదయం కల్గుతుందో, అర్జునా! అపుడు నా ఆత్మస్థానీయుని అవతరింప జేస్తాను.) అనేది గీతాచార్యుని సూక్తి. ఇందులో **"ఆత్మానం సృజామి"** అనే దానిలో ఉపదేశపరంపరద్వారా వినవలసిన రహస్యార్థం ఒకటి ఉన్నది. అది ఏమంటే- ఆ గీతలోనే ఏడవ అధ్యాయంలో **"జ్ఞానీ త్వాత్మైవ మే మతమ్"** (జ్ఞాని అయితే నాకు ఆత్మ అని నా అభిప్రాయం) అని పల్కినందువల్ల, **"ఆత్మానం సృజామి"** అనే సూక్తికి "జ్ఞానులను సృష్టించి అనుగ్రహిస్తున్నాను" అని భావం. వారిని ఎపుడు అనుగ్రహిస్తాడు ? అంటే, **"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత"** -ధర్మదేవత ముమూర్షువై ఉండే కాలంలో- అని భావం.

ఈ విధంగా ఇటువంటి పలు పోలికలవల్ల **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్"** అని చెప్పదగినవారు ఆచార్యపదవిని వహించడానికి ముందు చిరకాలం శిష్యపదవిలో ఉజ్జీవించినవారే కనుక, వీరిని **"పడైత్తాన్"** అనే ఒక మహాచార్యులు ఇక్కడ వివక్షింప బడుతున్నారు. ఆళవందార్ **"ఆమ్, ముదల్వన్ ఇవన్"** అని భగవద్రామానుజులను కటాక్షించి, వారి ద్వారా పలు పలు **"వళ్ళమ్ పెరుమ్ పశుక్కళ్"**ను పొందారు కనుక, ఆ ఆళవందార్‌ను ఇక్కడ **"ఆற்ற పడైత్తాన్ !"** అనే ప్రయోగంద్వారా గ్రహింపవచ్చును. వారి **"మకన్"**గా (ఎవరైనా) ఒక ఆచార్యుని గ్రహించవచ్చు. ఈ పాశురంలో నాల్గు తరాలు సూచింపబడ్డాయి. **"ఏற்ற కలఙ్గళ్"** అనేది ఒక తరం. **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్"** ఇంకొక తరం. **"ఆற்ற పడైత్తాన్"** మూడవ తరం. **"మకనే"** అనేది ఇంకొక తరం. దీనివల్ల **"యస్య వేద శ్చ వేదీ చ విచ్ఛిద్యేతే త్రిపూరుషమ్, స వై దుర్బ్రాహ్మణో జ్ఞేయ స్సర్వకర్మబహిష్కృతః"** (మూడు తరాలపాటు వేదాధ్యయనాన్ని లేనివాడు దుర్బ్రాహ్మణుడు. ఏ కర్మను అనుష్ఠించే

యోగ్యత అతనికి లేదు) అనే దోషం లేని ప్రపన్నజనసంతాన శుద్ధి సూచింప బడినదని గ్రహించాలి.

(అటివుజాయ్) - దాసులమైన మాకు ఉపదేశాలను అనుగ్రహించి, జ్ఞానాన్ని వృద్ధి చేయాలి - అని భావం. దాసులమైన మమ్ములను నీ మనస్సులో నిలుపు కోవాలి- అని ప్రార్థించే రీతికూడా కావచ్చు.

(ఊற்ற ముడైయాయ్ !) - స్థిరమైన ప్రమాణంచేత సిద్ధించేవాడా! అని భావం. **"ఆచార్యవాన్ పురుషో వేద"** (ఆచార్యుని కలవాడే పురుషుడని తెలిసికో) అని, **"పాపిష్ఠః క్షత్రబంధుశ్చ పుండరీకశ్చ పుణ్యకృత్, ఆచార్యవత్తయా ముక్తౌ తస్మాదాచార్యవాన్ భవేత్"** (పాపిష్ఠివాడైన క్షత్రబంధువు, పుణ్యాత్ముడైన పుండరీకుడు కూడా ఆచార్యుని కల్గిన వారైనందున ముక్తిని పొందారు. అందువల్ల ఆచార్యుని కలవాడు కావాలి.) ఇత్యాదిగా ఉండే పలు ప్రమాణాలు ఇక్కడ గ్రాహ్యాలు. సదా సర్వదా శిష్యులను ఉజ్జీవింపజేయడంలోనే ఆసక్తిని కలవాడా!- అనికూడా భావం.

(పెరియాయ్!) - **"పువనియుమ్ ఇరువిశుమ్బుమ్ నిన్నకత్త నీ యెన్ శెవియిన్ వழி పుకున్దు ఎన్నుళ్ళాయ్, ఆవివిన్ద యాన్ పెరియన్ నీ పెరియై యెన్బదనై యారఱివార్? ఊన్‌పరుకు నేమియాయ్! ఉళ్ళు"** (భూలోకం, విశాలమైన పరమపదం నీలో ఉన్నాయి. నీవు నా చెవిద్వారా లోపలకు ప్రవేశించి నాలో ఉన్నావు. అందువల్ల నీవు పెద్దవా? లేక, నేను పెద్దవాడనా? అనే విషయాన్ని ఎవరు తెలియ గలరు? శత్రువుల రక్తాన్ని పానం చేసే చక్రాన్ని దాల్చినవాడా ! ఆలోచించి పల్కు.) అనే పెరియతిరువన్దాది సూక్తి ప్రకారం భగవానునికంటే గొప్పవాడా! - అని భావం. ఉభయవిభూతినాథుడైన భగవానుని తమలో ఇముడ్చుకొని ఉండేవారు భగవానునికంటే గొప్పవారుగానే కదా ఉండాలి.

(ఉలకినిల్ తోற்றమాయ్ నిన్ద శుడరే !) - **"ప్రాదుర్భావైః సురనరసమో దేవదేవస్త్వదీయైః"** (దేవదేవా ! సురనరతిర్యక్కులతో సమానమైన నీ అవతారాలతో) అనే ప్రమాణవచనాన్ని పురస్కరించుకొని దీనిని అనుగ్రహించారు. భగవానుడు పలు పలు జాతులలో పుట్టినా, **"స ఉ శ్రేయాన్ భవతి జాయమానః"** (భగవానుడు అవతరించినవాడై శ్రేయస్సును-కాంతిని- కలవాడవుతున్నాడు.) అనే శ్రుత్యను సారం తన తేజస్సు కొంచెంకూడా తగ్గకుండా ఇంకా ఇంకా అభివృద్ధి చెందుతుంది.

కనుక, ఆ స్వామి దాసులుకూడా పలు పలు జాతులలో జన్మించినా వారి కులం దాసకులమై, కాంతి తగ్గకుండా, ప్రకాశాన్ని పొందుతారు- అనేది పైన ప్రస్తావించిన ప్రమాణంలోని తాత్పర్యం. అందువల్ల **"ఉలకినిల్ తోన్ఱ్రమాయ్ నిన్ఱ శుడరే!"** (లోకంలో అవతరించిన జ్యోతిస్స్వరూపా!) అనే సంబోధన భగవానునకువలెనే భాగవతులకుకూడా చాలా పొసగుతుంది.

(తుయిలెழ్హాయ్) - "అనాదిమాయయా సుప్తః" (అనాది అయిన మాయచే నిదురించినవాడు) అనే రీతిలో ఉండే మమ్ములను ప్రబోధించాలి- అని దీని తాత్పర్యం. నీవు కన్నులను తెఱచి, దాసులమైన మమ్ములను కటాక్షించాలి- అనికూడా భావం. అటువంటి భాగవతోత్తముల తిరుమాళిగకు తాము వచ్చిన రీతిని దృష్టాంతపూర్వకంగా పల్కుతున్నారు- ఇకపై గల మూడు పాదాలద్వారా

(మాఱ్ఱారునక్కు వలి తొలైన్దు ఇత్యాది) - **"మాఱ్ఱార్"** -మార్పును పొందినవారు. శత్రువులని అర్థం. ప్రమాణాలను, ప్రమేయాలను, ప్రమాతలను దూషిస్తూ వేఱుగా ఉండే మతాంతరస్థులు ప్రకృతంలో **"మాఱ్ఱార్"** అని అనబడుతున్నారు. వారు వచ్చి వాదించి, బలాన్ని కోల్పోయి పాదాక్రాంతులయ్యారు. అనేది ఆళవన్దార్, ఎమ్బెరుమానార్, భట్టర్, నమ్బిళ్ళైమొదలైనవారి చరిత్రలలో విశదం. యాదవప్రకాశులు, యజ్ఞమూర్తి మొదలైనవారు తమ సామర్థ్యాన్ని కోల్పోయి, భగవద్రామానుజుల శ్రీచరణాలను ఆశ్రయించారు. **"తఞ్జైరై ఞానియర్కళ్ తామ్ పుకழుమ్ వేదాన్తి"** (గొప్పజ్ఞానులు పొగడే వేదాంతి) నఞ్జీయర్‌గా మాఱి, భట్టర్ శ్రీచరణసన్నిధికి వచ్చి, ఆశ్రయించడం, **"తున్ను పుకழ్ కన్దాడై త్తోழప్పర్"**, **"నడువిల్ తిరువీధిప్పిళ్ళై భట్టర్** మొదలైనవారు నమ్బిళ్ళై శ్రీచరణాల సన్నిధికి వచ్చి ఆశ్రయించడంకూడా ప్రసిద్ధం. వారి వారి గుణాలకు జితులై, కీర్తిస్తూ వచ్చినట్లుగానే, దాసులమైన మేముకూడా వచ్చి నీ సన్నిధిని చేరాము. మమ్ములను కూడా నీ సేవకులుగా పరిగ్రహించాలి- అని ప్రార్థించిన రీతి ఇది. అద్వేషులుగాను, అనుకూలురుగాను ఉండేవారు వచ్చి సేవించడంకంటే, ద్వేషులై ఉండేవారు తమ మాత్సర్యాన్ని పోగొట్టుకొని వచ్చి సేవించడం విశేషం కనుక, అది ఇక్కడ ప్రస్తావించ బడింది.

22. అఙ్గణ్ మాఞాలత్తు అరశర్ అబిమాన
పఙ్గమాయ్ వన్దు నిన్ పళ్ళిక్కట్టిల్ కీழే

శఙ్గమిరుప్పార్ పోల్ వన్దు తలై ప్పెయ్‌దోమ్
కిఙ్కిణి వాయ్ చ్చెయ్‌ద తామరై ప్పూప్పోలే
శెఙ్గణ్ శిఱుచ్చిఱిదే ఎమ్మేల్ విழியావో
తిఙ్గళుమ్ ఆదిత్తియనుమ్ ఎழுన్దాఱ్పోల్
అఙ్గణ్ ఇరణ్డుఙ్కొణ్డు ఎఙ్గళ్‌మేల్ నోక్కుదియేల్
ఎఙ్గళ్ మేల్ శాపమిழிన్దు ఏలోర్ ఎమ్బావాయ్

శ్రీకృష్ణుడు పర్యంకంపై శయనించి ఉండి, "ఓ గోపికలారా ! మీరు ఎందుకోసం వచ్చారు? నావల్ల మీకు ఏమి పని కావాలి? చెప్పండి'' అని అనగా, "మేము నీవు తప్ప వేఱు గతి లేనివారమై వచ్చాము'' అనేది మనస్సులో తోచినా, మాపై నీ కటాక్షవీక్షణం పడలేదే! **"తొణ్డరోర్క్కరుళి చ్చోదివాయ్ తిఱన్దు ఉన్ తామరైక్కణ్ గళాల్ నోక్కాయ్"** (దాసులమైన మమ్ములను అనుగ్రహించి, ప్రకాశించే నీ నోటిని తెఱచి పల్కి, నీ తామరలవంటి నేత్రాలతో కటాక్షించు) అని ప్రార్థించే వంశంలో కదా మేము జన్మించాము. నీ కటాక్షప్రసరణం మాపై పడాలి- అనే ఇంతమాత్రం ఆశను కల్గి వచ్చినవారం మేము. నీ తిరునేత్రాలను తెఱచి మమ్ములను కటాక్షించకుండానే, "ఎందుకు వచ్చారు? ఏమి విశేషం?'' అని ఈ విధంగా ప్రశ్నించడం నీకు కొత్త అలవాటుగా కన్పిస్తున్నదే! ఎల్లప్పుడు నీతో కలసి ఉండగోరిన మేము నిన్ను విశ్లేషించి ఉండడం ఏదో ఒక శాపవిశేషం కదా! ఆశాపం తీరడంకోసం నీ కటాక్షవీక్షణాలనే ప్రార్థించ వచ్చాము, మేము. వేఱు దేనినీ కోరి వచ్చినవారం కాము. తిరునేత్రాలను మెల్ల మెల్లగా తెఱచి కొంచెం కటాక్షించు''- అని అంటున్నారు. గడచిన పాశురంలోని **"మాఱ్ఱారు నక్కు వలి తొలైన్దు"** ఇత్యాదులను ఈ పాశురంలోని ముందు పాదాలు వివరిస్తున్నవి.

భగవానుని విభవావతారాలలోను, అర్చావతారాలలోను పలువురు ప్రభువులు అహంకారం తీరి, భగవత్పాదారవిందాల సన్నిధికి వచ్చి చేరిన రీతిని ఇందులో తెల్పుతున్నారు. మొట్టమొదటగా, ప్రభువులు అనే పేరును కల్గి ఉండడమే భగవానుని కృపయొక్క లవలేశంవల్ల సంభవిస్తుంది- అని శాస్త్రాలు తెల్పుతున్నాయి. **"యుగకోటిసహస్రాణి విష్ణుమారాధ్య పద్మభూః, పునస్త్రైలోక్యధాతృత్వం ప్రాప్త వానితి శుశ్రుమ"** (వేయికోట్ల యుగాలకాలం విష్ణువును ఆరాధించి బ్రహ్మ మళ్ళీ తన బ్రహ్మపదవిని పొందాడని వింటున్నాము) అనేది ప్రసిద్ధమైన మహర్షి వచనం. చతుర్ముఖుడు యుగకోటి సహస్రాలకాలం విష్ణువును ఆరాధించి, తిరిగి తన

పదవిని పొందాడని ఈ ప్రమాణంలో తెలుపబడింది. పూదత్తాళ్వార్లు తమ ఇరణ్డామ్ తిరువన్దాదిలో **"కోవాకి మానిలమ్ కాత్తు నఙ్కణ్ ముకప్పే మావేకి చ్చెల్కిన్ఱ మన్నవరుమ్, పూమేవుమ్ శెఙ్గమల నాబియాన్ శేవడిక్కే యేళ్ పిఱప్పుమ్, తణ్కమల మేయ్న్దార్ తమర్"** (లోకంలో ప్రభువులై, విశాలమైన భూమిని పాలించి మన కళ్ళముందే నశించే ప్రభువులు కూడా పద్మనాభుని శ్రీచరణాలకు ఏడేడు జన్మలపాటు తామరపూవులతో అర్చించిన దాసులే.) అని అనుగ్రహించిన పాశురంవల్ల, ఇపుడు ఉండే ప్రభువులు అందఱు ఎంతోకాలం భగవానుని ఆరాధించే ప్రభులయ్యారు- అని తెలుపబడుతున్నది. **"అష్టాభిర్లోకపాలానాం మాత్రాభిః నిర్మితో నృపః"** (ఎనిమిదిమంది లోకపాలకుల అంశలతో రాజు నిర్మింపబడ్డాడు) **"నావిష్ణుః పృథివీపతిః"** (విష్ణువు కానివాడు రాజు కాలేడు) ఇత్యాది ప్రమాణాలు కూడా గమనించదగినవి. నమ్మాళ్వార్లు కూడా తిరువాయ్మొళిలో **"తిరువుడై మన్నరై క్కాణిల్ తిరుమాలై క్కణ్డేనే ఎన్నుమ్"** (సంపదను కల ప్రభువులను చూస్తే శ్రియఃపతిని చూచాను- అని అంటున్నది) అని అన్నారు. ప్రభువులను చూస్తే భగవానుని దర్శించినట్లుగా చెప్పడంలో ఏమి కారణం? అని అంటే, వీరు చిరకాలం భగవానుని ఆరాధించినవారు - అనేదే. ఈ విధంగా అపరిమితమైన కాలం భగవానుని ఆరాధించి, ప్రభువులు అయినవారు పదవిని పొందగానే **"జీవనగ్రహణే నమ్రాః గృహీత్వా పునరున్నతాః"** (జీవనాన్ని గ్రహించేటపుడు వంగినవారై, తరువాత మళ్ళీ తల ఎత్తినవారై) అనే రీతిలో అహంకారులై, తలవంచని ప్రభువులై పోతారు. వారుకూడా కాలగమనంలో తమ గర్వం అంతా తీరగా, భగవానుని శ్రీచరణ సన్నిధికి వచ్చి సేవిస్తారు. అందఱు ఆవిధంగా అహంకారులై ఉంటారని భావించరాదు. అహంకారులై ఉండేవారు వారి అహంకారాన్ని పోగొట్టుకొంటారు. కొందఱు అహంకారాన్ని పొందకుండానే ఉంటారు. **"అభిమాన పఙ్గమాయ్"** అనే దానిలో ఈ రెండు అర్థాలను గ్రహించ వచ్చు; **"అపహతపాప్మా"** అనే సూక్తిలోవలె.

అర్చావతారవిషయంలో పలు ప్రభువులు అక్కడక్కడ దివ్యదేశాలకు వచ్చి, కైంకర్యం చేయడం దివ్యప్రబంధాలలో స్పష్టపడుతున్నది. **"తెన్నన్ తొణ్డైయర్ కోన్ శెయ్ద నన్మయిలై త్తిరువల్లిక్కేణి"** (పాండ్యప్రభువైన తొండమాన్ చక్రవర్తి నిర్మించిన, అందమైన మయిలాపురికి తర్వాతగల తిరువల్లిక్కేణి దివ్యక్షేత్రం), **"మన్నవన్ తొణ్డైయర్కోన్ వణఙ్గుమ్ నీణ్ముడిమాలై వయిరమేకన్తన్ వలితన్**

పుకళ్ శూళ్న్ద కచ్చి యట్టపుయకరత్తు" (తొండమండలంలోని వారికి ప్రభువైన రాజుచే సేవింపబడినవాడు, ఎత్తైన కిరీటాన్ని కల్గినవాడు, వయిరమేకన్ అనే పేరును గల ప్రభువు యొక్క పరాక్రమం, కీర్తి నిండిన కాంచీపురంలోని అట్టపుయకరమ్ అనే దివ్యక్షేత్రమ్) **"పల్లవన్ విల్లవనెన్ఱులకిల్ పలరాయ్ ప్పలవేన్దర్ వణఙ్గు కళల్పల్లవన్ మల్లైయర్కోన్ పణిన్ద పరమేచ్చుర విణ్ణగరమ్"** (పల్లవుడని, విల్లవుడని పలుపేర్లతో వ్యవహరింపబడే ప్రభువులచే సేవింపబడిన పాదాలను కలవాడు, మహాబలిపురం అనే తిరుక్కడల్ మల్లై అనే క్షేత్రంలోనివారికి ప్రభువైన పల్లవరాజుచే కైంకర్యం చేయబడిన పరమేచ్చుర విణ్ణకరమ్ అనే క్షేత్రం) **"శెమ్బియన్ చ్చెఙ్గణాన్ కో శేర్న్ద కోయిల్ తిరునఱైయూర్ మణిమాడమ్"** (శెమ్బియన్ కో చ్చెఙ్గణాన్ అనే చోళరాజు కైంకర్యం చేసిన తిరునఱయూర్ లోని కోవెల) అనే ఈ సూక్తులు తిరుమఙ్గైయాళ్వార్లు అనుగ్రహించినవి.

స్వాపదేశార్థంలో, **"అఙ్గణ్ మాఞాలమ్"** అంటే - పాంచభౌతికపిండమైన శరీరం. అందులో ప్రభువు జీవాత్మ. అతడు అవివేకంవల్ల అహంకారమమకారాలను పొందినపుడు, **"సత్సంగాత్ భవనిస్పృహో గురుముఖాత్ శ్రీశం ప్రపద్యాత్మవాన్"** (సత్పురుషుని సంబంధంవల్ల సంసారంపట్ల విరక్తి కల్గి, ఆచార్యుల ద్వారా శ్రియఃపతిని శరణాగతి చేసి,సత్తను పొందినవాడై) అని నడాదూర్ అమ్మాళ్ అనుగ్రహించిన రీతిలో యాదృచ్ఛికసత్సంగంవల్ల ఆ అహంకారమమకారాలు తొలగిపోయి, సదాచారసన్నిధికి వచ్చి చేరగల్గుతాడు - అని అర్థం.

(శఙ్గమిడుప్పార్) - శంఖంవలె సర్వజ్ఞత్వాన్ని పొందడానికి- అని భావం. ధ్రువునకు దర్శనమిచ్చిన భగవానుడు అతనిని తన శంఖంతో స్పృశించగానే అతడు సర్వజ్ఞుడయ్యాడని పురాణకథనం.

(తలైప్పెయ్దోమ్) - దరిచేరాము- అనే అర్థంలో ఇది ఒకే పదం. **"తలై"**- తలను, **"పెయ్దోమ్"**- ఇచ్చాము - అనే అర్థాన్ని స్వాపదేశంలో గ్రహించవచ్చు. **"తలైయల్లాల్ కైమ్మాఱు ఇలేన్"** (శిరసా అభివాదం తప్ప ఇంకొక ప్రత్యుపకృతి లేదు) అనే రీతిలో ఉండడం.

ఇక, "తమకు అపేక్షితం ఇది''- అని తెలుపబడుతున్నది - **"కిఙ్కిణి వాయ్ చ్చెయ్ద"** అని ప్రార్థించడంద్వారా. చిన్నబిడ్డలకు నడుమున అలంకరించడంకోసం నిర్మించిన ఆభరణానికి **"కిఙ్కిణి"** (మువ్వలు) అని పేరు. అది **"మాతుళమ్పూ"**

వలె సగం ముడుచుకొని, సగం విడుచుకొని ఉంటుంది. భగవానుడు చేయవలసిన కటాక్షానికి దానిని ఇక్కడ ఉపమానంగా పల్కడంవల్ల, ప్రారంభంలోనే పరిపూర్ణకటాక్షాన్ని భరించలేనందువల్ల, కొంచెం కొంచెంగా కటాక్షించాలి-అనేది వ్యక్తమవుతుంది. **"శెఙ్గణ్ శిఱుచ్చిఱిదే"** (అందమైన నేత్రాలను మెల్లమెల్లగా) అని వ్యక్తంగా కూడా అది చెప్పబడింది. దీనికి తగినట్లుగానే **"తిఙ్గళు మాదిత్తియనుమ్ ఎ<u>ழు</u>న్దాఱ్పోల్"** (సూర్యుడు చంద్రుడు ఉదయించినట్లుగా) అని చెప్పబడుతున్నది. ఇది అభూతోపమ. (**"ఇల్ పొరుళువమై"** అని దీనికి ద్రావిడాలంకారశాస్త్రంలో పేరు) ఒకే కాలంలో చంద్రుడు, సూర్యుడు ఉదయించడం -అనేది అసంభావితం. తామరపూవు సూర్యుని చూస్తే వికసిస్తుంది. చంద్రుని చూస్తే ముడుచుకొంటుంది. ఇక్కడ **"ఆఙ్గు మలరుమ్ కువియుమ్ మాలున్దివాయ్ ఓఙ్గు కమలత్తినొణ్పోదు, ఆఙ్గై త్తికిరి శుడరెన్ఱుమ్ వెణ్శఙ్గమ్ వానిల్పుకరు మది యెన్ఱుమ్ పార్త్తు"** (భగవానుని నాభీకమలం, ఆ స్వామి అందమైన చేతులలో గల సూర్యునివంటి చక్రాన్ని, చంద్రునివంటి శంఖాన్ని చూచి వికసిస్తున్నది, ముడుచుకొంటున్నది) అనే పేయా<u>ழ்</u>వార్ల పాశురం ఇక్కడ సంభావ్యం. మన దోషాలను భావించగానే స్వామి నేత్రాలు మూసికొంటాయి. తన సహజకరుణను భావించగానే వికసిస్తాయి.

ఆచార్యులు శిష్యునకు గంభీరాలైన అర్థవిశేషాలను ప్రారంభంలోనే వర్ణించడానికి సాధ్యం కాదు కదా! పెరియ తిరుమొ<u>ழి</u>లో (5-1-2) **"పుళ్ళై ప్పిళ్ళైక్కు ఇరై తేడుమ్"** (పక్షి తన పిల్లకు తగిన ఎరను అన్వేషిస్తున్నది) అనేచోట భట్టర్ అనుగ్రహించిన సూక్తి స్మరణీయం. చిన్న చిన్న విషయాలుగా అనుగ్రహించి గ్రహించేటట్లు చేయడం ఆచార్యకృత్యం. అది ఇక్కడ తెలుపబడింది.

(తిఙ్గళుమ్ ఆదిత్తియనుమ్ ఎ<u>ழు</u>న్దాఱ్పోల్) - భగవద్విషయ రహస్యగ్రంథాల లోని అర్థాలను ఉపదేశించేటపుడు ఆచార్యుడు చంద్రునివలె చల్లగా ప్రకాశిస్తాడు. శ్రీభాష్యం, శతదూషణి మొదలైనవానిని వివరించేటపుడు సూర్యునివలె తాపాన్ని కలుగజేస్తాడు ఇందువల్ల ఉభయవేదాంతార్థాలను మాకు ఉపదేశించాలి- అని ప్రార్థించినట్లయింది. ఆచార్యుని బాహ్యనేత్రం, ఆంతరనేత్రం **"యం యం స్పృశతి పాణిభ్యాం యం యం పశ్యతి చక్షుషా"** (ఎవరెవరిని చేతితో తాకుతాడో, ఎవరెవరిని కంటితో కటాక్షిస్తాడో) అనే రీతిలో సదాచార్యులు బాహ్యనేత్రంతో కటాక్షిస్తే చాలు. ఆళవందార్ భగవద్రామానుజులను **"ఆమ్ ముదల్వన్ ఇవన్"** (దర్శన నిర్వాహకుడే ఇతడే) అని ఆంతరనేత్రంతో అనుగ్రహించినట్లే, అనుగ్రహించినా చాలు. ఇక

రెండు కటాక్షాలు కలిస్తే చెప్పవలసినది ఏమున్నది? ఇక్కడ **"ఏకయైవ గురోః దృష్ట్యా ద్వాభ్యాం వాఽపి లభేత యత్, స తత్ తిసృభి రష్టాభి స్సహస్రేణాపి కస్యచిత్"** (ఆచార్యుని కటాక్షంవల్ల కలిగే ఫలం, శివునివల్లగాని, చతుర్ముఖునివల్ల కాని, భగవానుని వల్లకాని లభించదు.) అనే సుభాషితనీవీశ్లోకరత్నం అనుసంధేయం. దీని అర్థమేమంటే -ఆచార్యుడు బాహ్యనేత్రంతోగాని, లేక, ఆంతరనేత్రాన్నికూడా కలిపి రెండు నేత్రాలతోగాని కటాక్షిస్తే, దానివల్ల కలిగే ప్రయోజనం, త్రినేత్రుని మూడు నేత్రాలవల్ల, చతుర్ముఖుని ఎనిమిది నేత్రాలవల్ల, **"తుణైమలర్ క్కణ్గళ్ ఆయిరత్తాయ్"** (వికసించే తామరలవంటి వేయి నేత్రాలను కలవాడా?) అని, **"సహస్రశీర్షా పురుష సహస్రాక్ష స్సహస్రపాత్"** అనే సహస్రాక్షునిగా కీర్తింబడే శ్రీమన్నారాయణుని వేయి నేత్రాలవల్లకూడా కలుగదు. "కటాక్షించాలి" అని అనకుండా **"నోక్కుదియేల్"** (కటాక్షిస్తే) అని అన్నందువల్ల అతని సహజ కరుణ మూలంగా కలిగే కటాక్షమే గొప్పది - అని, మన నిర్బంధం కారణంగా కలిగే కటాక్షం విరసమైనది- అని తెలుపబడింది.

ఈ పాశురంలోని అయిదవ పాదంలో **"ఎమ్మేల్"** అని, ఏడవ పాశురంలో, **"ఎఙ్గళ్ మేల్"** అని, ఎనిమిదవ పాదంలో **"ఎఙ్గళ్మేల్"** అని - ఈ విధంగా మూడు మార్లు ప్రయోగించడం తమ దయనీయదశను మాటిమాటికి తెలుపడమే. పెరియా<u>ழ்</u>వార్ తిరుమొ<u>ழి</u>లో (3-7-1) **"ఐయపు<u>ழு</u>ది"** పాశురంలో **"ఇవళ్ ఇవళ్ ఇవళ్"** అని - మూడుసార్లు ప్రయోగించడంతో ఇది పోలి ఉన్నది.

(ఎఙ్గళ్ శాపమ్ ఇ<u>ழி</u>న్దు) -"ఇ<u>ழி</u>న్దు" అనేది అసమాపక క్రియగా కన్పించినా **"ఇ<u>ழி</u>న్దిడుమ్"** అనే ఆశంసార్థకంగా గ్రహించవచ్చు. ఈక్రమాన్ని గడచిన, రాబోయే పాశురాలలో కూడా గమనించవచ్చు. గోపికలు **"ఎఙ్గళ్మేల్ శాపమ్"** అని అంటున్నారు కదా! వీరికి ఏవిధమైన శాపం ఉన్నది? ఎవరు ఇచ్చిన శాపం? ఎపుడు ఇచ్చిన శాపం? అని అడుగనక్కరలేదు. అవశ్యం అనుభవించి తీరవలసిన పాపమే శాపమనబడుతుంది. భగవానుని విశ్లేషించి ఉండడమనేది ప్రబలపాపంయొక్క ఫలం కనుక, అదే ఇక్కడ శాపమనబడుతున్నది. అది అతని (భగవానుని) తిరునేత్రాల కటాక్షం పడగానే తీరిపోతుంది - అని భావం. ఇక్కడ **"శ్రమణీవిదుర ఋషిపత్నికళై ప్పూతరాక్కిన పుణ్డరీకాక్షన్నెడునోక్కు శాపమి<u>ழி</u>న్దెన్న ప్పణ్ణుమితే"** (శబరిని, విదురుని, ఋషిపత్నులను పవిత్రంచేసిన పుండరీకాక్షుని గొప్ప కటాక్షం **"శాపమి<u>ழி</u>న్దు"**అని అనేటట్లు చేస్తుంది కదా) అనే ఆచార్యహృదయ చూర్ణిక,

వ్యాఖ్యానంతో పాటు అనుసంధేయం. భగవానుని ఒక్కొక్క దివ్యాంగం ఒక్కొక్కరి శాపాన్ని తీర్చింది. ముంగాళ్ళు కుబేరపుత్రులైన నలకుబేరులశాపం తీర్చింది. (యమళార్జున భంగవృత్తాంతం స్మరణీయం) ఊరువులు మధుకైటభుల శాపం తీర్చాయి. (**"పిష్టదుష్టమధుకైటభకీటౌ"**) - ఇత్యాది సుందరబాహుస్తవసూక్తిని స్మరించాలి) రుద్రుని శాపాన్ని వక్షస్సులోని స్వేదం తీర్చింది. దుర్వాసుని శాపం వక్షఃస్థలంలో ఉండే లక్ష్మిచే తీరింది. ఇక్కడ తిరునేత్రాలద్వారా ఇంకొక శాపం తీరింది.

భగవానుని తిరుమేనిలో మూడు దివ్యావయవాలు భక్తులకు ముఖ్యమైనది. వాటిలో, మొదటి దివ్యాంగం తిరునేత్రాలు. **"జాయమానం హి పురుషం యం పశ్యేన్మధుసూధనః, సాత్త్వికః స తు విజ్ఞేయః స వై మోక్షార్థచింతకః"** (ఎవనిని అతని జనన సమయంలో మధుసూదనుడు కటాక్షిస్తాడో, అతడు సాత్త్వికుడుగా తెలియదగినవాడు. అతడే మోక్షాన్ని గూర్చి చింతను కల్గిఉంటాడు.) అనే రీతిలో జాయమాన కాలంలోనే కటాక్షించి, సాత్త్వికత్వాన్ని కల్గించగల్గినది కదా ఇది. ఈ విధంగా కటాక్షింపబడేవారికి శ్రీచరణాలే రక్షకం కనుక, అది రెండవ దివ్యాంగం. ఆ విధంగా శ్రీచరణాలలో వాలినవారు **"అఞ్జేల్ ఎన్రు కై కవియాయ్"** (భయపడకు- అని అభయహస్తాన్ని చూపు) అని అభయప్రదానాన్నే ఆశిస్తారు కనుక, అభయ ముద్రాంచితమైన హస్తం మూడవ దివ్యాంగం.

23. మారి మలై ము*ళ*ఞ్జిల్ మన్ని క్కిడన్దుఱఙ్గుమ్
శీరియ శిఙ్గమ్ అఱివుఱ్ఱు త్తీ వి*ళి*త్తు
వేరిమయిర్ పొఙ్గ ఎప్పాడుమ్ పేర్న్దుదఱి
మూరి నిమిర్న్దు ము*ళ*ఙ్గి ప్పుఱప్పట్టు
పోదరుమాపోలే నీ పూవైప్పూవణ్ణా! ఉన్
కోయిల్ నిన్రు ఇఙ్గనే పోన్దరుళి కోప్పుడైయ
శీరియ శిఙ్గాశనత్తిరున్దు యామ్ వన్ద
కారియమ్ ఆరాయ్ న్దు అరుళ్ ఏలోర్ ఎమ్బావాయ్

శ్రీకృష్ణుడు శయనాగారంలోనుండి లేచి, సింహపుపిల్లవలె బయలుదేరి గమన సౌందర్యాన్ని ప్రదర్శిస్తూ నడచి వచ్చి, సింహాసనంపై వేంచేసి ఉండగా, గోపికలు తాము వచ్చిన కార్యాన్ని గమనించి అనుగ్రహించాలి- అని ప్రార్థించే రీతిలో ఈ పాశురసన్నివేశం ఉన్నది.

శ్రీకృష్ణునకు **"రామానుజ"** అనే ఒక తిరునామమున్నది కదా! ఇక్కడ **"రామ"** శబ్దం బలరాముని తెల్పుతుంది. అతని తమ్ముడు శ్రీకృష్ణుడు అనే కారణం చేత శ్రీకృష్ణుడు రామానుజుడనబడుతున్నాడు. అందువల్లనే ముకుందమాలలో **"హే రామానుజ!"** అని శ్రీకృష్ణభగవానుడు సంబోధింపబడ్డాడు. అందువల్ల రామానుజుడైన శ్రీకృష్ణుని ఉద్దేశించిన ఇక్కడి ప్రార్థన రామానుజులైన భగవద్రామా నుజులనుకూడా ఉద్దేశించినదే- అని భావించడంలో ఔచిత్యమున్నది. పాశురంలో ఉండే పదాలు అన్నీ భగవద్రామానుజుల పరమైన అర్థంలో చక్కగా పొసగే రీతిని వివరిస్తాను.

ఈ పాశురంలో **"పూవైప్పూ వణ్ణా !"** అనేది ఒక సంబోధన. "అతసీపుష్పవర్ణం వంటి వర్ణాన్ని కల్గిన శ్రీకృష్ణా!'' అని అన్యాపదేశంలో అర్థం. స్వాపదేశంలో- **"పూవైప్పూ అణ్ణా !"** అని విడదీసి, **"అతసీపుష్పంవంటి ఓ అగ్రజా!"** అనే అర్థాన్ని గ్రహించాలి. భగవద్రామానుజులు గోదాదేవికి అణ్ణన్‌గా చెప్పబడుతున్నందున **"అణ్ణా!"** అని సంబోధించడం యుక్తం. వారు అతసీపుష్పంవలె ఉన్నవారు అంటే- పుష్పం అనేది తన చుట్టూ పలు వేల తుమ్మెదలు చేరి ధ్వనిస్తూ ఉండేటట్లే, శ్రీరామానుజులు కూడా రసికులైన పలువురు శిష్యులచే పరివేష్టింపబడి, నిండి ఉంటారు. **"పోన్దరు ఎన్నెఞ్జమ్‌పొన్‌వణ్డు ఉనదడిప్పోదిల్ ఒణ్ శీరాన్దెళి తేనుణ్డు అమర్న్దిడవేణ్డి"** (నా మనస్సు అనే బంగారు తుమ్మెద మీ శ్రీచరణపద్మాలలోని గొప్ప కల్యాణగుణాలనే తేనెను ఆస్వాదించి అక్కడే ఉండాలని పోయినది.) అనే ఇరామానుశనూ*ఱ్ఱ*న్దాది పాశురంలో పల్కిన రీతిలో తిరువరఙ్గత్తముదనార్‌వంటి పలు పలు తుమ్మెదలు ఝుంకారం చేస్తూ ఉండే పూవు భగవద్రామానుజులు- అని భావం. **"పూవైప్పూ"** (అగిసె పూవు) అని అంటూ విశేషించి ఒక పుష్పాన్ని పల్కడం పుష్పసామాన్య వివక్షతో. లేక, పూవైప్పూ అనబడే అతసీసుమాన్ని గ్రహించినా లోటు లేదు. శ్రీరామానుజులు అతసీసుమవర్ణాన్ని కల శ్రీకృష్ణుని మనస్సులో నిరంతరంగా కల్గి ఉన్నందున, ఆ శ్రీకృష్ణుని తిరుమేనియొక్క కాంతిప్రసరణంచేత శ్రీరామానుజుల తిరుమేనికూడా. అతసీసుమంవలె అంతరంగ భక్తులకు నల్లగా దర్శనమిస్తున్నదని భావం. ఈ సందర్భంలో **"అపి ఫణిపతిభావాత్ శుభ్రమంత శ్శ్రియాళోః"** ఇత్యాదిగా శ్రీరంగరాజస్తవంలో భట్టర్ పల్కిన సూక్తిని అనుసంధించాలి.

భగవద్రామానుజులను "శీరియ శిఙ్గాశనమ్" పై వేంచేసి ఉండాలని ప్రార్థించడం చాలా యుక్తమైనది. ధాటీపంచకంలోని మొదటి శ్లోకంలో **"జైనేభ కంఠీరవః"** (జైనులనే ఏనుగులను సింహం) అని అంటూ శ్రీరామానుజులు సింహంగా చెప్పబడ్డారు. ఇరామానుశ నూ*ఱ్ఱ*న్దాదిలో కూడా **"కలిమిక్క శెన్నెల్ క*ళ*ని క్కుఱైయల్ కలైపెరుమా నొలిమిక్కపాడలై యుణ్డు తన్నుళ్ళమ్ తడిత్తు అదనాల్ వలిమిక్క శీయమ్ ఇరామానుశన్"** (మిక్కిలి సారం కల్గిన సస్యక్షేత్రాలను కల తిరుక్కుఱైయలూర్‌లో అవతరించిన స్వామి తిరుమంగై ఆ*ళ్వా*ర్ అనుగ్రహించిన ధన్వర్థాలను నిండుగా కల పాశురాలను గ్రహించి, మనస్సులో ఆనందించి, దానివల్ల మిక్కిలి బలాన్ని కల సింహం శ్రీరామానుజులు) అని అంటూ గొప్ప విలక్షణమైన సింహంగా చెప్పబడ్డారు.

ఇక, పాశురంలోని పాదాలలో ఉండే ఒక్కొక్క పదాన్ని గ్రహించి వివరిస్తాను.

(మారి) - వర్షాకాలంలో - అని అర్థం. సింహం వర్షాకాలంలో కొండగుహలో పరుండి నిద్రిస్తుంది. భగవద్రామానుజులనే సింహానికి ఏది పర్వతం? ఏది కొండగుహ? అనే దానినిగూర్చి తరువాత వివరిస్తాను. వర్షాకాలం అంటే ఏమిటో ముందుగా వినండి. లోకంలో కోరదగిన వర్షం ఒకటి ఉన్నది. గర్హించదగిన వర్షం కూడా ఉన్నది. ఆ రీతిలోనే ఇక్కడకూడా గ్రహించాలి. ఆశించదగిన వర్షాన్ని గూర్చి తిరుక్కచ్చినమ్బి, కూరేశులు అనుగ్రహించారు. గర్హించదగిన వర్షాన్నిగూర్చి ఆళవన్దార్ అనుగ్రహించారు. ఏవిధంగా అంటే - దేవరాజాష్టకంలో **"దేవరాజ! దయాసింధో! దేవదేవ! జగత్పతే!, త్వదీక్షణసుధాసింధువీచి విక్షేపశీకరైః, కారుణ్యమారుతానీతైః శీతలై రభిషించ మామ్"** (దేవరాజా ! దయకు సముద్రం వంటివాడా! దేవదేవా! లోకాధిపతీ! దయ అనే గాలిచే కొని రాబడిన చల్లని నీ కటాక్షాలనే అమృతసముద్రంలోని కెరటాల విక్షేపాల తుంపురులతో నన్ను అభిషేకించు) అని అంటూ తిరుక్కచ్చినమ్బి పల్కిన వర్షం కోరదగిన వర్షం. భగవానుని దివ్యకటాక్షామృతవర్షమే ఇక్కడ చెప్పబడిన వర్షం. కూరత్తా*ళ్వా*న్‌కూడా వరదరాజస్తవంలో **"హస్తీశ! దృష్ట్యమృతవృష్టిభి రాభజేథాః"** (హస్తిగిరినాథా! నీ కటాక్షాలనే అమృతవృష్టితో అనుగ్రహించు) అని అంటూ ఈ వర్షాన్నే ప్రస్తావించారు. ఇక, గర్హించదగిన వర్షాన్ని గూర్చి ఆళవందార్ ఏవిధంగా ప్రస్తావించారు? అంటే, స్తోత్రరత్నంలోని **"అవివేకఘనాంతదిఙ్ముఖే బహుధా సంతతదుఃఖవర్షిణి, భగవన్! భవదుర్దినే"** (భగవన్! అవివేకమనే మబ్బులచే

ఆవరింపబడిన దిక్కుల ముఖాలను కల్గినది, అనేక విధాలుగా నిరంతరదుఃఖమనే వర్షాన్ని కురిసేది అయిన సంసారమనే దుర్దినంలో) అనే సూక్తిని గమనించాలి. అవివేకమనే మబ్బులచే ఆవరించబడి దారి ఏదో తెలియక తికమకపడి, అటూ ఇటూ దిక్కుతోచక పరిభ్రమించే రీతిలో పలు విధాలైన క్లేశాలు నిరంతరం వర్షించేటట్లుగా ఉంటుంది- సంసారమనే దుర్దినం. (వర్షాకాలంలో మబ్బులు మూసి, సూర్యుడు కన్పించని దినం దుర్దినం) ఈ విధంగా ఉద్దేశ్యమైన వర్షాన్ని కురిపించడంలోను, గర్హించదగిన వర్షాన్ని అడ్డుకోవడంలోను సమర్థులు, భగవద్రామానుజులని తెలియాలి.

(మలైము*ళ*ఞ్జిల్) - వేదంలోని కాఠకమనబడే ఒక బ్రాహ్మణభాగంలో **"భరద్వాజో హ వై త్రిభిరాయుభి ర్బ్రహ్మచర్య మువాస"** అని ప్రారంభించి, ఒక ఉపాఖ్యానం తెలుపబడింది. భరద్వాజమహర్షి మూడువందల ఏండ్లు జీవించ గలిగే వరాన్ని పొంది, ఆ ఆయుష్కాలం మొత్తం వేదాలనే అధ్యయనం చేస్తూ గడిపారు. ఆయుస్సు ముగిసిన తరువాత, దేవేంద్రుడు వచ్చి సాక్షాత్కారాన్ని అనుగ్రహించి, "మునివరా! ఇంకా మీకు ఒక నూటేండ్ల కాలం ఆయుస్సును ఇస్తాను. పరిగ్రహిస్తారా? ఆ ఆయుష్కాలంలో ఏమి చేయాలని అనుకుంటున్నారు?" అని అడిగాడు. "ఆ ఆయుష్కాలంలోకూడా వేదాలను అభ్యసించి చతుర్వేద పారంగతుడను కాగలను'' అని ఆ ముని అన్నాడు. అంతవరకు ఆ ముని నేర్చిన వేదాల పరిమితిని అతనికి తెలియజేయాలని భావించిన ఇంద్రుడు, ఇతఃపూర్వం ఎక్కడా చూడని మూడు పెద్ద పర్వతాలను ఆ ముని ఎదుట చూపించి, ఆ మూడు పర్వతాలనుండి మూడు పిడికిళ్ళ మన్నును గ్రహించి ఎత్తి, "ఓ భరద్వాజ మహర్షీ! మూడు వందల సంవత్సరాల కాలంగా మీరు అధ్యయనం చేసిన వేదం ఈ మూడు పిడికిళ్ళ మన్నుతో సాటి వస్తుంది. అదిగో! కన్పించే మూడు పర్వతాల పరిమితిలోని వేదాలు మీరు అధ్యయనం చేయని వేదభాగాలు.'' అని పల్కినట్లుగా ఆ ఉపాఖ్యానంలో ఉన్నది. ఈ రీతిలో వేదాలే ఈ పాశురంలో పర్వతంగా చెప్పబడింది. **"వేదమనైత్తుక్కుమ్ విత్తాకుమ్"** (వేదానికి అంతటికి బీజం) కదా గోదాదేవి ద్రావిడప్రబంధం.

మహాభారతంలో, యక్షుని ప్రశ్నలకు సమాధానాన్ని పలికే ధర్మపుత్రుడు- **"శ్రుతి ర్విభిన్నా స్మృతయో విభిన్నాః నైకో మునిః యస్య మతం ప్రమాణమ్, ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతః స పంథాః"** (వేదాలు

అనేకం, స్మృతులు అనేకం. ఏ ఋషిమతం కూడా ప్రమాణం కాదు. ధర్మతత్త్వం నిగూఢంగా ఉంటుంది, గొప్పవారు అనుసరించినదే మార్గం) అని పల్కిన శ్లోకం ప్రసిద్ధమైనది. దీనినిబట్టి ధర్మసూక్ష్మం నిలచి ఉండే చోటే ఆ వేదపర్వతగుహ. **"తత్త్వం నిహితం గుహాయామ్"** అనికదా శ్లోకంలో చెప్పబడింది. శ్రీరామాయణంలో, వాలిని చూచి శ్రీరాముడు పల్కుతూ **"సూక్ష్మః పరమ దుర్జ్ఞేయ స్సతాం ధర్మః ప్లవంగమ!"** (వానరా! సత్పురుషుల ధర్మం తెలిసికోవడానికి మిక్కిలి కష్టమైనది. సూక్ష్మమైనది) అనే సూక్తికూడా దీనికి అనుగుణమైనది. ఇందువల్ల వేదాలలోని ధర్మసూక్ష్మం నిలచి ఉండే చోట్లు **"మలైముழைఇజ్జు"** అని చెప్పబడుతున్నది. ఇందులో **"మన్ని క్కిడన్దు ఉఱజ్గుమ్ శీరియశిఙ్గమ్"** భగవద్రామానుజులు. **"మన్ని క్కిడన్దు ఉఱజ్గుమ్"** (నిలకడగా నిలచి ఉండి నిద్రించే) అంటే - **"అస్తమితాన్యభావమ్"** అనే రీతిలో వేఱొక విషయంలో దేనిలోను కొంచెంకూడా మనస్సు నిలుపకుండా, అందులోనే మనస్సును నిలకడగా నిలిపి, అందులోని సూక్ష్మాలైన అర్థవిశేషాలను గ్రహించి ఆనందించడం. నిద్రించే కాలంలో దుఃఖలేశం కొంచెం అయినా స్ఫురించకుండా **"సుఖమహ మస్వాప్సమ్"** (నేను సుఖంగా నిద్రించాను) అనే రీతిలో ఆనందానుభవంగానే ఉంటుంది కనుక, నిద్రించడం, ఆనందించడం పర్యాయాలుగా చెప్పవచ్చు. **"వేదోత్తంసగుహావిహారపటునా శ్రీశైలశృంగోల్లసత్ మాయాకేసరిమానితేన గహనన్యాయాటవీచారిణా, గంభీరేణ పరాత్మభేదనమహానా దేన మే గుప్తోఽహం యతిసార్వభౌమహరిణా వర్తే భృశం నిర్భయః"** (వేదాంతాలనే గుహలలో విహరించడంలో సమర్థమైనది, తిరుమల శిఖరంలో ప్రకాశించే మాయా సింహమైన శ్రీనివాసునిచే గౌరవింపబడినది, దుర్గమాలైన న్యాయాలనే అరణ్యంలో సంచరించేది, గంభీరమైన, ఇతరుల ఆత్మలను భేదించడంలో- ఆత్మపరమాత్మల మధ్యగల భేదాన్ని స్థాపించడంలో-సమర్థమైన సింహనాదాన్ని- సిద్ధాంతాన్ని - కల్గినది అయిన యతిరాజులనే సింహంచే రక్షింపబడిన నేను మిక్కిలి నిర్భయంగా ఉన్నాను.) అనే శ్లోకరత్నాన్ని ఇక్కడ అనుసంధించాలి.

(అఱివుఱ్ఱు) - మాయావాదిమత్త కంఠీరవమైన శ్రీరామానుజులు తాము అతరించిన ప్రయోజనాన్ని గ్రహించి- అని అర్థం. అంటే - "దుర్మతనిరసనంకోసం, సన్మతస్థాపనం కోసం కదా నేను ఇక్కడకు వచ్చి అవతరించాను'' అని భావించి, అని తాత్పర్యం. శిష్యోజ్జీవనమే నాకు పని అని తెలిసికొని- అనికూడా చెప్పవచ్చు.

(తీ విழித్తు) - **"బుద్ధిర్మనీషా ధిషణా ధీః ప్రజ్ఞాః శేముషీ మతిః"** అనే అమరకోశ వచనానుసారం బుద్ధివాచకమైన "ధీః" అనే పదమే ఇక్కడ "తీ" అని వికృతిని పొందింది. అందువల్ల "తీ విழித్తు" అంటే- బుద్ధివికాసాన్ని పొంది- అని అర్థం. భగవద్రామానుజులు బుద్ధిలో సంకోచావస్థ కొంచెంకూడా లేకుండా సర్వదా వికాసావస్థనే కల్గి ఉండడం దీనిద్వారా తెలుపబడింది.

(వేరి మయిర్ పొజ్గ)- ఇతరమతాలకు చెందినవారు సన్న్యాసస్వీకారాన్ని చేసేటపుడు తలలో కేశాలు ఉండకూడదు- అని ముండనాన్ని చేయించుకొంటారు. (కేశాలను తీసివేస్తారు) శ్రీరామానుజులు ఆ రీతిలో కాకుండా, **"కమనీయశిఖా నివేశమ్"**, (అందమైన శిఖాసన్నివేశం) **"శిఖయా శేఖరిణం పతిం యతీనామ్"** (శిఖను శిరస్సుపై కలవారు, యతులకు పతి), **"కననచ్చికై ముడియుమ్"** (గొప్ప శిఖాబంధం, కిరీటం) అనే రీతిలో శిఖాబంధాన్ని అందంగా కల్గి ఉండడాన్ని ఈ ప్రయోగం తెల్పుతున్నది.

(ఎప్పొడుమ్ పేర్న్దు)- **"శ్రీరంగం కరిశైలమంజనగిరిం తార్క్ష్యాద్రి సింహాచలౌ శ్రీకూర్మం పురుషోత్తమం చ బదరీనారాయణం నైమిశమ్, శ్రీమద్ద్వారవతీ ప్రయాగమధురాఽయోధ్యాగయా పుష్కరం సాలగ్రామఖనిం నిషేవ్య రమతే రామానుజోఽయం మునిః"** (శ్రీరంగం, కంచి, తిరనుమల, యాదవాద్రి, సింహాచలం, శ్రీకూర్మం, పురుషోత్తమం, బదరి, నైమిశారణ్యం, ద్వారక, ప్రయాగ, మధుర, అయోధ్య, గయ, పుష్కరం, సాలగ్రామం- అనే ఈ దివ్యదేశాలను సేవించి ఈ శ్రీరామానుజముని ఆనందిస్తున్నారు) అనే రీతిలో ఉత్తర-దక్షిణ ప్రాంతాలలోని దివ్యక్షేత్రాలను, తీర్థాలను పర్యటించి యాత్రను చేసిన రీతిని ఈ ప్రయోగం తెల్పుతున్నది.

(ఉదఱి) - **"శారువాక మత నీఱు శెయ్తు శమణచ్చెడి క్కనల్ కొழுత్తియే, శాక్కియక్కడలై వఱ్ఱువిత్తు మికు శాఙ్గియక్కిఱి ముఱిత్తిడ, మాఱు శెయ్దిడు కణాదవాదియర్కళ్ వాయ్ తకర్త్తు అఱ మికుత్తు మేల్ వన్ద పాశుపతర్ శిన్ది యోడుమ్ పకైవాదు శెయ్ద ఎతిరాశనార్, కూఱుమా కురుమతత్తోడొఙ్గియ కుమారిలన్ మత మవఱ్ఱిన్మేల్, కొడియ తర్క్కశరమ్ విట్టపిన్ కుఱుకి మాయవాది యరై వెన్డిడ, మీఱి వాదిల్ వరు పాఱ్కరన్ మతవిలక్కడిక్కొడి ఎఱిన్దు పోయ్, మిక్క యాదవమతత్తై మాయ్త్త పెరువీరర్ నాళుమ్ మిక వాழிయే"** (చార్వాక మతాన్ని భస్మం చేసి, జైనమతమనే వృక్షానికి నిప్పు పెట్టారు. బౌద్ధ

మతమనే సముద్రాన్ని ఇంకింపజేసి, సాంఖ్యమతాన్ని భగ్నం చేసి తనను ఎదురించే కణాదమతాన్ని నోరుమూయించి, వాదంలో మీదకు వచ్చిన పాశుపతులను ఓడిపోయి పారిపోయేటట్లు చేసి యతిరాజులు వాదించారు. గొప్పదైన గురుమతంపై - భాట్టమతంపై, దానితోపాటు కుమారిలభట్టు మతంపై కఠినమైన తర్కాలు అనే బాణాలను విడచి ఓడించి, మాయావాదులను జయించి, వాదంలో మించి వచ్చే భాస్కరుని మతం సమూలంగా నశించిపోయేటట్లుగా, గొప్పదైన యాదవ మతం ఒడిపోయేటట్లుగా చేసిన గొప్ప వీరులైన యతిరాజులు వర్ధిల్లాలి) అని ఆర్తి ప్రబంధంలో శ్రీమణవాళమహామునులు అనుగ్రహించిన రీతిలో, **“గాథా తాథాగతానాం గళతి గమనికా కాపిలీ క్వాపి లీనా”** (బౌద్ధుల వాదం జారిపోతున్నది. సాంఖ్యమతం ఎక్కడో లీనమైనది) అని యతిరాజ సప్తతిలో శ్రీదేశికులు అనుగ్రహించిన రీతిని, **“తఴ్క్కచ్చమణరుమ్ శాక్కియ పేయ్కళుమ్ తాఴ్శడైయోన్ శొఴ్కుఱ్ఱ శోమ్బరుమ్ శూనియవాదరుమ్ నాన్మఱైయుమ్ నిఴ్క క్కుఴుమ్బు శెయ్ నీశరుమ్ మాణ్డనర్”** (తర్కాలను చేసే జైనులు, పిశాచాల వంటి బౌద్ధులు, జటలను కల శివుడు పల్కిన సూక్తులను అధ్యయనం చేసిన సోమరులైన శైవులు, శూన్యవాదులు, నాల్గు వేదాలున్నా, వాటికి అపార్థాలను పలికే నీచులైన కుదృష్టులు నశించారు) అని ఇరామానుశనూఱ్ఱన్దాదిలో అముదనార్ అనుగ్రహించిన క్రమంలో షణ్మతాలనే వృక్షాలను సమూలంగా చ్ఛేదించిన క్రమాన్ని **“ఉదటి”**- అనే పదం ద్వారా తెలిపినట్లయింది. వాలి, రావణుని తన తోకతో కట్టి తీసికొనిపోయి కిష్కింధలో విదల్చివేసినట్లుగా, పరవాదులను అవలీలగా విదల్చిన క్రమం తెలుపబడింది.

(మూరి నిమిర్న్దు) - **“మూరి”** అని సోమరితనానికి పేరు. సోమరితనం- బద్ధకం- తీరేటట్లుగా శరీరాన్ని విఱుచుకొని- అంటే- బద్ధకం కొంచెంకూడా లేకుండా పూర్తిగా తీరిన రీతిలో దానిని పోగొట్టుకొన్న తీరు చెప్పబడింది. నిత్యనైమిత్తిక కర్మానుష్ఠానాలను సోమరితనంతో. అంశతః విడచిపెట్టడం, గౌణపక్షావలంబనంతో కర్మలను సంకుచితంగా అనుష్ఠించడం- అనేది లేకుండా, ముఖ్యకల్పంగానే అనుష్ఠించేవారిలో శ్రీరామానుజులు ప్రముఖులు- అని భావం. శ్రీమద్రహస్య త్రయసారంలోని చరమశ్లోకాధికారంలో - **“భాష్యకారర్ అంతిమదశైయిలుమ్ వరున్ది ఎఴున్దిరున్దు సంధ్యాకాలత్తిలే జలాంజలిప్రక్షేపమ్ పణ్ణి యరుళినార్”** (శ్రీరామానుజులు తమ చివరికాలంలో కూడా శ్రమపడి లేచి, సంధ్యాసమయంలో జలాంజలిని విడిచారు) అని పల్కిన వాక్యం ఇక్కడ అనుసంధేయం.

(ముఴఙ్గి పుఱప్పట్టు పోదరుమ్) - భగవద్రామానుజులు తమ దిగ్విజయ యాత్రలో అంతటా సింహగర్జన రీతిలోనే పల్కిన క్రమాన్ని తెల్పుతున్నది. యతిరాజస్తపతిలో **“కార్యః కథాహవకుతూహలిభిః పరేషాం కర్ణే స ఏష కవితార్కిక సింహనాదః”** (వాదాన్ని చేయాలనే కుతూహలాన్ని కలవారిచే ప్రత్యర్థుల చెవిలో ఈ కవితార్కిక సింహనాదం చేయబడాలి) అని చెప్పబడింది. శ్రీరామానుజుల శ్రీచరణాలను ఆశ్రయించినవారు చేసేదే సింహగర్జన అయితే, ఇక భగవద్రామానుజులనుగూర్చి చెప్పవలసి ఉన్నదా? అది కింపునర్న్యాయసిద్ధం కదా! **“పోతరుమాపోలే”** అని ఇక్కడ ఉపమాన పూర్వకంగా పల్కినా, ఉపమానార్థాలకు ఉపమేయంలోనే ఉపసంహారమని గ్రహించాలి. **“ఇందురిందు రివ శ్రీమాన్”** (చంద్రుడు చంద్రునివలె కాంతివంతుడు), **“గగనం గగనాకారం సాగరః సాగరోపమః, రామరావణయోర్యుద్ధం రామరావణయోరివ”** (ఆకాశం ఆకాశం వంటి ఆకారాన్ని కల్గినది. సాగరం సాగరం వంటిది. రామరావణయుద్ధం రామరావణయుద్ధం వంటిది.) అనే సూక్తికూడా గమనించదగినది. ఇది అనన్వయాలంకార ప్రక్రియ.

(ఉన్‌కోయిల్ నిన్ఱు ఇఙ్గనే పోన్దరుళి) - **“ఉన్‌కోయిల్”** అని అంటూ భగవద్రామానుజుల అవతారస్థలమైన శ్రీపెరుంబుదూర్ వివక్షింపబడుతున్నది. అక్కడనుండి **“పెరుమాళ్‌కోయిల్”** అనబడే కాంచీపురానికి వేంచేసి, తిరుమలకు వేంచేసి, శ్రీరంగానికి వేంచేసి, తిరునారాయణపురానికి వేంచేసి... ఈవిధంగా వారు వేంచేసిన క్రమం ఇక్కడ తెలుపబడింది.

(కోప్పుడైయ శీరియ శిఙ్గాశనత్తిరున్దు) - **“శిఙ్గాశనమ్, శీరియ శిఙ్గాశనమ్, కోప్పుడైయ శీరియ శిఙ్గాశనమ్”** అని మూడు విధాలైన ఆసనాలుగా గ్రహించాలి. యతిరాజసప్తతిలో **“గాథా తాథాగతానాం గళతి”** (బౌద్ధులవాదం నశించింది) అనే శ్లోకం చివరలో **“భజతి యతిపతౌ భద్రవేదీం త్రివేదీమ్”** (యతిరాజులు మంగళవేది అయిన త్రివేదిని పొందగా) అని అంటూ భగవద్రామానుజులు త్రివేది అనే సింహాసనంలో వేంచేసి ఉన్నట్లు తెలుపబడింది. దీని అర్థాన్ని ఏ వ్యాఖ్యాత యథాతథంగా తెలుపలేదు. **“త్రయాణాం వేదానాం సమాహారః- త్రివేదీ”** -మూడు వేదాలు అని అర్థం. ఋగ్వేద-యజుర్వేద- సామవేదాలనే మూడు వేదాలు భగవద్రామానుజులకు సింహాసనంగా అమరి ఉన్నవి- అని వివరించడం గొప్ప వివరణం కాదు. భేదశ్రుతి, అభేదశ్రుతి, ఘటకశ్రుతి- అనే మూడు రీతులలోని శ్రుతులే త్రివేది - అని వేదాంతదేశికులకు వివక్షితం. అద్వైతులకు అద్వైతశ్రుతులు

మాత్రమే ఆసనమైనది. మన శ్రీరామానుజులకు అయితే ఆ రెండు విధాలైన శ్రుతులతో పాటు, ఘటకశ్రుతికూడా ఆసనమైనది. అంటే- శ్రీరామానుజులు ఏశ్రుతిని కాదనకుండా మూడు విధాలైన శ్రుతులను ముఖ్యార్థాలుగానే గ్రహించి, విశిష్టాద్వైతదర్శన నిర్వాహాన్ని చేసినందువల్ల, వీరికి ఆ మూడు వేదభాగాలు **“శీరియ శిఙ్గాసనమ్”** అయినవి- అని భావం. ఇటువంటి ఆచార్యసార్వభౌములవద్దకు వచ్చి చేరిన శిష్యులు **“యామ్ వన్ద కారియమ్ ఆరాయ్న్దరుళ్”** (మేము వచ్చిన కార్యాన్ని విచారించు) అని ప్రార్థించిన క్రమం ఈ పాశురంలో తెలుపబడింది.

24. అన్ఱివ్వులకమ్ అళన్దాయ్! అడి పోఱ్ఱి
శెన్ఱఙ్గు త్తెన్నిలఙ్గై శెఱ్ఱాయ్! తిఱల్ పోఱ్ఱి
పొన్ఱ చ్చకడముదైత్తాయ్! పుకఴ్ పోఱ్ఱి
కన్ఱు కుణిలా ఎఱిన్దాయ్! కఴల్ పోఱ్ఱి
కున్ఱు కుడైయా ఎడుత్తాయ్ కుణమ్ పోఱ్ఱి
వెన్ఱు పకై కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పోఱ్ఱి
ఎన్ఱెన్ఱు ఉన్ శేవకమే ఏత్తి ప్పఱైకొళ్వాన్
ఇన్ఱు యామ్ వన్దోమ్ ఇరఙ్గు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలో “నిన్ కోయిల్ నిన్ఱు ఇఙ్గనే పోన్దరుళి క్కోప్పుడైయ శీరియ శిఙ్గాశనత్తిరున్దు” (నీ ఆలయం నుండి ఈవిధంగా వేంచేసి, అలంకారాన్ని కల గొప్ప సింహాసనంలో వేంచేసి ఉండి) అని శ్రీకృష్ణుని ఆజ్ఞాపించారు- గోపికలు. అతనిని సర్వనియామకుడని తెలిసినవారు అతని ఉద్దేశించి ‘‘ఈ విధంగా చేయాలి’’ అని నియమించడం తగునా? అని అంటే, తగినదే. అతడు తన స్వరూపాన్ని సర్వనియామకత్వరూపంలో తెల్పినట్లే, భక్తనియామకత్వరూపంగా కూడా దర్శింపచేశాడు కదా ! సహస్రనామంలో **“విజితాత్మా విధేయాత్మా”** అనేచోట **“అవిధేయాత్మా”** అని కొందఱు పద విభాగాన్ని చేసినా, **“విధేయాత్మా”** అనే కదా పరాశరభట్టర్ వ్యాఖ్యానించారు. **“ఇమౌ స్మ మునిశార్దూల! కింకరౌ సముపస్థితౌ, ఆజ్ఞాపయ యథేష్టం వై శాసనం కరవామ కిమ్”** (మునిశార్దూలా! ఇదిగో! మేమిద్దరం నీ సేవకులం. నీవద్దకు వచ్చాము యథేష్టంగా మమ్ములను ఆజ్ఞాపించు. నీకేమి సేవను చేయగలము?) అని శ్రీరామావతారంలోని సూక్తి. **“సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత!”**(అచ్యుతా! నా రథాన్ని రెండు సేనల నడుమ నిలుపు)

అని అర్జునుడు “అచ్యుతా! రెండు సేనల నడుమ రథాన్ని తోలుకొని పోయి నిలుపు’’ అని ఆజ్ఞాపించగా, ఆ రీతిలోనే చేసిన శ్రీకృష్ణుడు గోపకన్యకల వేడికోలును కాదనలేడు కనుక, వారి ప్రార్థనకు అంగీకరించి, “కన్యకలారా! ఇదిగో! బయలుదేరి వస్తున్నాను ఉండండి’’ అని పల్కి శయనాగారంనుండి దివ్యసింహాసనం వరకు రావడానికి ప్రారంభించగా, అతనిని దర్శించిన గోపికలు, పూర్వం దండకారణ్యవాసులైన ఋషులు శ్రీరాముని దర్శించగానే, “రాక్షసులవల్ల తమకు కల్గిన పరిభవాలనుగూర్చి మొఱపెట్టుకోవాలి’’ అని అంతవరకు ఎదురు చూచినవారే, **“రూపసంహననం లక్ష్మీం సౌకుమార్యం సువేషతాం, దదృశుర్విస్మితా కారాః”** (శ్రీరాముని రూప సౌందర్యాన్ని, శోభను, సౌకుమార్యాన్ని, అవయవాల పొందికను దర్శించి మునులు ఆశ్చర్యాన్ని పొందారు.) అనే రీతిలో శ్రీరాముని దర్శించగానే రాక్షసులవల్ల తాము పొందిన పరాభవాలను మఱచిపోయి, మంగళాశాసనాన్ని చేయడం ఆరంభించినట్లే, వీరుకూడా తమ మనోరథాలను అన్నిటిని మఱచి, “పరమ సుకుమారమైన ఈ శ్రీచరణాలతోనే ఇతనిని మనం నడచిరమ్మని పలికామే! అయ్యో!’’ అని బాధపడి, ఆ శ్రీచరణాలను గ్రహించి శిరస్సుపై ధరించి, కన్నులకు అద్దుకొని, పూర్వం అతడు లోకాలను కొలిచిన వృత్తాంతాన్ని, శకటాసురుని భగ్నం చేసిన వృత్తాంతాన్ని భావించి, మిక్కిలి భీతిల్లి, “ఈ శ్రీచరణాలకు ఏవిధమైన ఆపద కలుగకుండా ఉండాలి’’ అని అంటూ మంగళాశాసనాన్ని చేస్తున్నారు, ఈ పాశురంలో.

(అన్ఱు ఇవ్వులకమ్ అళన్దాయ్ అడి పోఱ్ఱి) - “లోకాలను కొలిచిన స్వామి, దక్షిణ దిక్కులోని లంకను ధ్వంసం చేసిన స్వామి, శ్రీకృష్ణుడు వేఱు వేఱు మూర్తులు కారు; ఒకే మూర్తి’’ -అనే అధ్యవసాయాన్ని చక్కగా వ్యక్తం చేస్తున్నారు, గోపికలు ఈ పాశురంలో. మొదట, త్రివిక్రముడై అవతరించి, తరువాత శ్రీరాముడై అవతరించి, ఇపుడు శ్రీకృష్ణుడుగా అవతరించాడు- అనే విషయాన్ని క్రమంగా తెల్పుతున్నారు. లోకాలను కొలిచిన కాలంలో మహాబలి నష్టం పొంది పోయాడు. దేవతలు తమకు ప్రయోజనం సిద్ధించింది - అని ఆనందించి పోయారు. శుక్రుడు నేత్రాన్ని కోల్పోయాడు. నముచి ఆకాశంలోకి తిప్పి విసరి వేయబడ్డాడు. ఈ విధంగా ఆ యా వ్యక్తులు లాభనష్టాలను పొందారు. “ఈ సుకుమారశ్రీచరణాలతో అరణ్యాలను, కొండలను ఎత్తు పల్లాలను కొలువడమా!’’ అని భీతిల్లి, ఈ శ్రీచరణాలకు అపుడు మంగళాశాసనం చేసేవారెవ్వరూ లేరు. ఆ కొఱత తీరేటట్లుగా

ఇపుడు ఈ గోపికామతల్లులు మంగళాశాసనాన్ని చేస్తున్నారు. **"ఇవ్వులకమ్"** అనే పదప్రయోగసామర్థ్యంచేత- "పరమసుకుమారమైన శ్రీహస్తాలను కల లక్ష్మీదేవికూడ సంవాహనం చేయడానికి సందేహించి జంకే రీతిలో పుష్పహాస సుకుమారతరమైన ఈ శ్రీచరణాలు ఎక్కడ! చాలా కఠినాలైన, మిక్కిలి పదునైన శిలలతో కూడిన అరణ్యప్రాంతాలు ఎక్కడ ?- అని గోపికలు పరితపించిన తీరు ఇక్కడ స్ఫురిస్తుంది. **"పోఱ్ఱి, వాழி, పల్లాణ్డు"** -అనే ఇవి పర్యాయవాచకాలు.

దీనికి ఆచార్యపరమైన స్వాపదేశార్థం ఏమి? అంటే- భగవానుడు తన గొప్పతనాలను అన్నిటినీ మఱుగుపరచుకొని, లఘుత్వాన్ని ఆరోపించుకొని, ఒక అసురునివద్దకు వచ్చి, మూడడుగుల నేలను అడిగి పొంది, ముల్లోకాలను కొలిచి, **"కజై పోదర క్కాల్ నిమిర్త్తరుళియ కణ్ణన్"** (గంగ ప్రవహించేటట్లు పాదాలను చాచిన సర్వేశ్వరుడు) అనే రీతిలో శ్రీపాదతీర్థాన్ని అనుగ్రహించాడు- అనేది త్రివిక్రముని ఇతిహాసం. ఆచార్యులుకూడా తమవద్ద ఉండే నిత్యసూరిత్వ కాంతికమైన మహిమలను అన్నిటిని మఱుగుపరచుకొని, మనవంటివారివలె చిన్నవారు- అనే రీతిలో లఘుత్వాన్ని ఆరోపించుకొని వచ్చి అవతరిస్తారు. భగవానుడు అసురునివద్దకు పోయినట్లే, ఆచార్యులుకూడా **"అరక్కర్ అశురర్ పిఱన్దీరుళ్ళీరేల్"** (రాక్షసులు అసురులు జన్మిస్తే) అనే రీతిలో అసురప్రకృతిని కల మనవంటివారివద్దకు వస్తారు. అతడు మూడడగులను యాచించి పొందినట్లే, ఆచార్యులుకూడా, "రహస్యత్రయాన్ని ఆలకించకూడదా? తత్త్వత్రయాన్ని వినకూడదా? షట్కత్రయాన్ని వినకూడదా? అని అడుగుతారు. అతడు దిక్కులను అన్నిటినీ తన శ్రీచరణాలతో స్పృశించినట్లే, వీరుకూడా లోకసంరక్షణార్థంగా సకలక్షేత్ర- తీర్థాలలో సంచరిస్తారు. అతడు తన శ్రీపాదతీర్థాన్ని ఒక తామస దేవతకు ఇచ్చాడు. వీరు తమ శ్రీపాదతీర్థాన్ని పరమసాత్త్వికులకు అనుగ్రహిస్తారు. ఈ రీతులలో త్రివిక్రమమూర్తి, ఆచార్యులు పరస్పరం పోలి ఉంటారు. ఇటువంటి ఆచార్యుల శ్రీచరణాలకు మంగళాశాసనం ఇక్కడ చేయబడింది.

(శెన్ఱఙ్గు త్తెన్నిలజై శెఱ్ఱాయ్!) - శ్రీరామావతారంలో మంగళాశాసనాలు విశేషంగా చేయబడినా, లంకను ధ్వంసం చేసిన తరువాత (రావణవధానంతరం) మంగళాశాసనాన్ని చేసినవారు లేరు- అనే కొఱత తీరేటట్లుగా, వీరు ఆ వృత్తాంతానికి మంగళం పాడుతున్నారు. ఇక్కడ ఆచార్యపరమైన స్వాపదేశార్థాన్ని విశేషంగా గమనించవచ్చు. శ్రీరాముడు- **"వెమ్ కదిరోన్ కులత్తుక్కు ఓర్ విళక్కాయ్ త్తోన్జి"** (సూర్యవంశానికి అద్వితీయ దీపమై ఆవిర్భవించి) అనే రీతిలో సూర్యవంశంలో అవతరించాడు. ఆచార్యులు, **"తస్మై నమో వకుళభూషణ భాస్కరాయ"** (ఆ వకుళ భూషణులనే సూర్యునకు నమస్కారం) అని, **"కలయామి కలిధ్వంసం కవిం లోకదివాకరమ్"** (లోకదివాకరులు, కవులైన కలివైరిని భావిస్తున్నాను) అని, **"శ్రీమానావిరభూత్ భూమౌ రామానుజ దివాకరః"** (గొప్ప కైంకర్యసిరిని కల రామానుజులనే సూర్యులు భూమిలో అవతరించారు) అని పలికే రీతిలో స్వయం సూర్యునిగానే అవతరించి, మనలను అందఱిని సూర్యవంశ్యులుగా చేశారు. శ్రీరాముడు పితృవాక్యపరిపాలనకోసం అరణ్యాలకు వెళ్ళినట్లే, ఆచార్యులుకూడా సర్వలోకపిత అయిన భగవానుని ఆజ్ఞతో **"సంసారమరుకాంతారే"** అనే రీతిలో ఈ సంసారమనే అరణ్యానికి వేంచేశారు. శ్రీరాముడు విరాధ-కబంధ-వాలి ప్రభృతులను నిరసించి, గుహ-శబరీ-మారుతి- సుగ్రీవ- విభీషణాదులను ఉజ్జీవింపజేసినట్లే, ఆచార్యులుకూడా శంకర-భాస్కర- యాదవ- ప్రభాకరాదుల మతాలను నిరసించి, చతుర్వేదాలను, చతుర్వేదాలలో సమర్థులైనవారిని ఉజ్జీవింపజేశారు. శ్రీరాముడు జ్ఞానవైరాగ్యనిధి అయిన హనుమానుని సహాయంగా చేసికొని, తన కార్యాలను నెఱవేర్చుకొన్నట్లే, ఆచార్యశిఖామణికూడా జ్ఞాన-భక్తి-విరక్తి సంపన్నులైన కూరేశులు, దాశరథి, గోవిందభట్టర్ మొదలైనవారిని గొని తమ ఉద్దేశ్యాలను అన్నిటిని నెఱవేర్చుకొన్నారు. శ్రీరాముడు- **"సాగరం శోషయిష్యామి"** (సముద్రాన్ని ఇంకింపజేస్తాను) అని సముద్రాన్ని ఇంకింపజేస్తాననే మాటను మాత్రం పలికాడు. ఆచార్యులు- **"పిఱవి ఎన్నుమ్ కడలుమ్ వఱ్ఱి ప్పెరుమ్ పదమాకిన్దదాల్"** (జన్మ అనే సముద్రం కూడా ఇంకిపోయి, పరమ పదమవుతున్నది. ఆహా!) అనే రీతిలోని సంసారసాగరాన్ని ఇంకింపజేశారు. శ్రీరాముడు **"న నమేయం తు కస్యచిత్"** (ఎవరికీ నమస్కరించను) అని ఎవరికీ లొంగని ప్రభువైన రావణుని వధించినట్లే, ఆచార్యులు అహంకార- మమకార పరిపూర్ణులను అందఱిని పీచమణచారు. శ్రీరాముడు తిరిగి అయోధ్యానగరానికి చేరినట్లే, ఆచార్యులుకూడా **"దేవానాం పూరయోధ్యా"** (దేవతల నగరం అయోధ్య) అనే ఆరణ్యక శ్రుతిని అనుసరించి **"యాఽయోధ్యేత్యపరాజితేతి విదితా నాకం పరేణ స్థితా"** (అయోధ్య అని, అపరాజిత అని ప్రసిద్ధమైనది, స్వర్గానికి ఆవల ఉన్నది) అని భట్టర్ అనుగ్రహించిన రీతిలో అయోధ్య అనబడే పరమపదాన్ని తిరిగి చేరారు.

(పొన్ఱ చ్చకడముదైత్తాయ్! పుక*ళ్* పో*ఱ్ఱి*) - **"తళర్న్దుమ్ ముఱిన్దుమ్ శకడ వశురరుడల్ వేఱా ప్పిళన్దు వీయ తిరుక్కాలాణ్డ పెరుమానే !"** (దొర్లుతూ వేగంగా వచ్చే శకటాసురుని శరీరం భగ్నమైన రీతిలో కాలును చాచిన స్వామీ !) (తిరువాయ్ మొ*ళి*- 6-9-4) అనే రీతిలో కావలిగా పెట్టిన శకటమే ఆసురావేశంచేత శ్రీకృష్ణునకు హానిని కల్గించాలని ప్రయత్నించగా, శ్రీకృష్ణుడు పాలకోసం ఏడ్చే భావనతో చాచిన తన శ్రీచరణంతో శకటాసురుని తన్ని భగ్నం చేసి, వధించిన క్రమాన్ని అనుసంధించి, అపుడు మంగగళాశాసనాన్ని చేస్తున్నారు. **"పొన్ఱ"**- పొడి పొడిగా అయేటట్లు- అని అర్థం. **"పుక*ళ్* పో*ఱ్ఱి*"** అనబడే ఆ కీర్తి ఏమి ? అంటే- కన్నతల్లి కూడా సహాయపడలేని సమయంలో తన బలిమితో తనను రక్షించుకొన్నందువల్ల కల్గిన కీర్తి. అస్మదాదులకు రక్షకమైన శ్రీచరణాలేకదా అతనికూడా రక్షకమైనది -అనే విస్తరించిన కీర్తి. స్వాపదేశంలో- ఆచార్యులుకూడా శకటభంగాన్ని చేసినవారు- అనేది నిరూపింపబడుతున్నది. ఒకచోట నుండి ఇంకొక చోటికి తీసికొనిపోయి చేర్చే సాధనం శకటం. ఈ శరీరంనుండి ఉత్క్రమణాన్ని పొందినవారిని ఒక్కొక్క చోటికి కొని పోయి చేర్చే మార్గాన్ని శకటంగా గ్రహించాలి. **"శుక్లకృష్ణే గతీ హ్యేతే జగతః శాశ్వతీ మతే, ఏకయా యాత్యనావృత్తిమ్ అన్యయాఽఽ వర్తతే పునః"** (శుక్లగతి, కృష్ణగతి- అనే ఈ రెండు జగత్తుకు శాశ్వతమైనవి. కృష్ణగతిద్వారా వెళ్ళినవానికి పునరావృత్తి కల్గుతుంది. శుక్లగతిద్వారా పోయినవానికి పునరావృత్తి లేదు) అని అన్నాడు గీతాచార్యుడు. ఏ మార్గంలో పయనిస్తే పునరావృత్తి లేదో, ఆ మార్గం **"శుక్లగతి"** అనబడుతుంది. పునరావృత్తికి తగిన గతి **"కృష్ణగతి"** అనబడుతుంది. శ్రీకృష్ణుడు భగ్నం చేసినది **"కళ్ళచ్చకడమ్"** (మాయా శకటం) కనుక, దానికి తగినట్లుగానే ఇక్కడ అర్థాన్ని గ్రహించాలి. గర్భగతి- యామ్యగతి- ధూమగతులను పోగొట్టి, అర్చిరాది గతిలో చేర్చే ఆచార్యుల కీర్తికి మంగళాశాసనం చేయబడింది.

(కన్ఱు కుణిలా వెఱిత్తాయ్ !) - వత్సారునితో కపిత్థాసురుని శ్రీకృష్ణుడు వధించడం ముల్లును ముల్లుతో తీయడంవంటిది. ఆచార్యులు ప్రతిపక్ష పక్షప్రతిక్షేపాన్ని చేసేటపుడు వారు చేసే పరస్పరం విరుద్ధమైన భాషణాలను పురస్కరించుకొనే ఆయా మతాల నిరాసాలను చేయడానికి ఇది ఉపమానం.

(కున్ఱు కుడైయా ఎడుత్తాయ్ !) - గోవర్ధనమనే పర్వతాన్ని గొడుగుగా ఎత్తిన చరిత్రలో చాలా గొప్పదైన గుణం ప్రకాశిస్తున్నది. ఇంద్రుడు మేఘాలను పంపి

ఏడు నాళ్ళపాటు ఎడతెగని వర్షాన్ని కురిపించి, రేపల్లెకు పెద్ద హానిని కల్గించిన కాలంలో, ఈ అసహ్యాపచారానికిగా శ్రీకృష్ణుడు ఆ ఇంద్రుని శిరస్సును ఖండించ వలసిన ఉన్నా, "ఇతడు తినే తిండిని కొల్లగొట్టిన మనం ప్రాణాన్నికూడా కొల్లగొట్ట కూడదు. చేయి నొప్పి పుట్టగానే తానే ఈ ప్రయత్నంనుండి ఇతడు విరమిస్తాడు'' అని భావించి, తన కృత్యమైన రక్షణను మాత్రంచేసి ఊరుకున్నాడు కదా ! అదే గొప్ప గుణం. ఇదే రీతిలో, ఆచార్యశిఖామణులుకూడా తమకు ఇతరులు ఎంతగా హాని చేసినా, దానిని లెక్కించకుండా, అందుకోసం వారిని నిగ్రహించ కుండా, "నేను పొందిన ఫలాన్ని నాలూరాన్‌కూడా పొందాలి'' అని ఆశాసించిన కూరేశులవలె, అనుగ్రహించడమే పనిగా కల్గి ఉంటారు- అనేది ఇక్కడ స్వాపదేశార్థం.

(వెన్ఱు పకై కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పో*ఱ్ఱి*) - ఇక్కడ **"వేల్"** అంటే- శ్రీసుదర్శనా*ళ్*వాన్. (కొల్వదు కోల్. వెల్వదు వేల్ - వధించే సాధనం. **"కోల్"**, జయించే సాధనం- **"వేల్"**) శ్రీసుదర్శనాన్ని నిర్దేశించడం శ్రీపాంచజన్యానికి ఉపలక్షణం. ఆచార్యులు శంఖచక్రాలతో ముద్రాంకనం చేసి, మనవంటివారి శేషత్వ విరోధులను అన్నిటిని నిరసించి, **"తీయిల్ పొలిగిన్ఱ శెఙ్జుడరా*ళి* తిక*ళ్* తిరుచ్చక్కరత్తిన్ కోయిల్‌పొఱియాలే ఒ*ఱ్ఱు*ణ్డు నిన్ఱు కుడికుడి యాట్చెయ్ కిన్ఱోమ్"** (సూర్యచంద్రుల కంటే గొప్పగా ప్రకాశించే, ఎర్రని సుదర్శనుని యొక్క ముద్రలతో ముద్రింపబడి, తరతరాలుగా నీకు సేవ చేస్తున్నాము) అని మన నోటితో పలికేటట్లుగా చేస్తారు. ఇక, **"వేల్"** అనే పదానికి సుదర్శనమనే అర్థాన్ని గ్రహించకుండా, **"కూర్‌వేల్ కొ*ళు*న్దొ*ళి*లన్ నన్దగోపన్"** (పదునైన వేలాయుధాన్ని కల్గిన, శత్రువులను వధించే కృత్యాలను చేసే నందగోపాలుడు) అనే సందర్భంలోవలె గొల్లజాతికి తగిన ఒక చేతి ముల్లుకర్ర- అనే అర్థాన్ని గ్రహిస్తే, ఆచార్యుల పరమైన అర్థంలో- **"చారిత్రోద్ధారదండం.... వజ్రదండం త్రిదండమ్"** అనే ధాటీపంచకశ్లోకాన్ని అనుసంధించుకోవాలి.

25. ఒరుత్తి మకనాయ్ ప్పిఱన్దు ఓరిరవిల్
ఒరుత్తి మకనాయ్ ఒళిత్తు వళర
తరిక్కిలానాకి త్తాన్ తీఙ్గు నినైన్ద
కరుత్తై ప్పి*ళ*ైప్పిత్తు క్కఞ్జన్ వయి*ఱ్ఱి*ల్
నెరుప్పెన్న నిన్ఱ నెడుమాలే! ఉన్నై
అరుత్తిత్తు వన్దోమ్, పఱై తరుతియాకిల్

తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్ యామ్ పాడి
వరుత్తముమ్ తీర్న్దు మకిழ்న్దు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలో చేసిన మంగళాశాసనాన్ని ఆలకించిన శ్రీకృష్ణుడు- "గోపికలారా ! ఏకార్యంకోసం మీరు నాదగ్గరకు వచ్చారు ?'' అని అడిగితే గోపికలు "శయనాగారంనుండి దివ్యసింహాసనం పైకి వచ్చి ఆసీనుడవైతే, మేము వచ్చిన కార్యాన్నిగూర్చి విన్నవిస్తాము'' అని అన్నారు. ఆ విధంగానే నేను దివ్యసింహాసనం లోకి వచ్చి కూర్చున్నాను. ఇపుడు వచ్చిన పనిని గూర్చి చెప్పకుండా **"అడి పోఱ్ఱి, తిఱల్ పోఱ్ఱి, పుకழ் పోఱ్ఱి, కుణమ్ పోఱ్ఱి"** (పఱైను పొందాలని ఈనాడు మేము వచ్చాము) అని అంటున్నారు. అంతటితో నిలువకుండా **"పఱై కొళ్వాన్ ఇన్ఱు యామ్ వన్దోమ్"** అని అంటున్నారు. మీరు, నిష్ప్రయోజనంగా వచ్చినవారు కారు. దేనినో పొందాలని వచ్చినవారు - అని స్పష్టంగా తెలుస్తున్నది. దానినిగూర్చి ఇకనైనా తెలుపండి.'' అని అన్నాడు. అంతేకాక, "చిన్నకన్యలైన మీరు ఈ చలిలో లేచి, ఈ చీకటిలో ఏవిధంగా వచ్చారో దానినికూడా చెప్పండి'' అని అన్నాడు. దానికి సమాధానంగా పలికే పాశురం ఇది. "నీ వద్ద ఒక ప్రయోజనాన్ని కోరి వేడి దానిని పొందడానికోసం వచ్చినవారం కాము, మేము. నిన్నే పరమపురుషార్థంగా వేడి వచ్చాము'' అనే విషయాన్ని (**"ఉన్నై అరుత్తిత్తు వన్దోమ్"** అనే సూక్తిద్వారా) తెలుపుతున్నారు. **"ఉన్ తిరుత్తక్క శెల్వముమ్ శేవకముమ్ యామ్"** (లక్ష్మికి తగిన సంపదను శౌర్యాన్ని) మేము కీర్తిస్తూ వచ్చాము. కనుక ఏ శ్రమ లేకుండా పరమానందంగా వచ్చాము'' అని కూడా తెల్పుతున్నారు. "దేవకీపుత్రుడవై జన్మించి, యశోదా తనయుడవై వృద్ధి చెందగా'' అని అనకుండా, **"ఒరుత్తి మకనాయ్ ప్పిఱన్దు ఒరుత్తి మకనాయ్ వళర"** (ఒకతెకు కుమారుడై పుట్టి, ఇంకొకతెకు కుమారుడై వర్ధిల్లగా) అని అనడం దేవకికికంటే యశోదకు గల సాటి లేని మేటి గొప్పతనాన్ని తెల్పుతుంది. చాలా గొప్పతనాన్ని కల్గిన పెద్దలను పేరు పెట్టి నిర్దేశించకూడదు- అనే సంప్రదాయం ఒకటి ఉన్నది కదా! అదే రీతిలో చెప్పబడింది. భట్టర్ శ్రీరంగరాజస్తవంలో -**"ఆకంఠవారిభరమంథరమేఘదేశ్యం పీతాంబరం కమలలోచన పంచహేతి, బ్రహ్మాస్తనంధయ మయాచత దేవకీ త్వాం శ్రీరంగకాంత! సుతకామ్యతి కాలఉపరైవమ్"** (కంఠం వరకు నీటిని నిండుగా తాగి, మెల్లగా సంచరించే మేఘం వంటిది, పీతాంబరాన్ని కల్గినది, పద్మాలవంటి నేత్రాలను, పంచాయుధాలను కల్గినది అయిన పరబ్రహ్మ తనకు శిశువుగా జన్మించాలని దేవకీ దేవి నిన్ను కోరింది. ఇంతకంటే ఎవరు గొప్పగా పుత్రుని పొందాలని కోరుకోగలరు?) అనే

శ్లోకంలో దేవకీదేవి సాటి లేనిది- అని అన్నారు. పరబ్రహ్మమే తనకు పుత్రునిగా జన్మించాలి- అని కోరినదికదా దేవకి. ఈమెకు సాటి ఉన్నదా?- అని అన్నారు. కనుక ఈమె **"ఒరుత్తి"** అని తెలుపబడింది. ఇటువంటి దేవకికూడా **"తిరువిలేన్ ఒన్ఱుమ్ పెఱ్ఱిలేన్ ఎల్లామ్ దెయ్వనఙ్గై యశోదై పెఱ్ఱాళే"** (అదృష్టం లేని నేను దేనినీ పొందలేదు. అన్నిటినీ ఆ దైవకాంత యశోద పొందిందికదా !) అని పల్కిన మహాభాగ్యవతి యశోదాదేవి కనుక, ఆమె కూడా **"ఒరుత్తి"** అని నిర్దేశింపబడింది. రెండుచోట్ల అద్వితీయత్వం అర్థం.

(ఒళిత్తు వళర) - కంసునివల్ల గల భయంచేత రహస్యంగా పెరిగినట్లు బయట ప్రవాదం; అంతే. కూరేశులు అతిమానుషస్తవంలో- **"సా పూతనా శకట మర్జునయోశ్చయుగ్మం బాల్యోచితాన్యపరచేష్టితవిష్ఫులింగే, యస్యా లభంత శలభత్వ మహో ! నిగూఢ స్ప త్వం వ్రజే వవృధిషే కిల కంసభీత్యా"** (ఆ పూతన, శకటం, రెండు మద్దిచెట్టు- బాల్యానికి తగినవి, అన్యపరాలైన లీలలనే నిప్పు నెరసులలో మిడతలై భస్మమయ్యాయి. అటువంటి నీవు కంసభయం వల్ల రేపల్లెలో రహస్యంగా పెరిగావు కదా ! ఇది ఏమి చోద్యం !) అని పలికారు. తొట్టిలో పరుండే వయస్సులో పూతనాశకటార్జున భంగాలను అవలీలగా చేసిన గొప్ప బలశాలి కంసభీతివల్ల భయపడి పెరిగాడు - అని అనగలమా ? అందువల్ల **"ఒళిత్తు"** అనే పదానికి "తన మహిమలను అన్నిటిని మఱుగుపరచుకొని''- అని భావం.

దీనికి స్వాపదేశార్థాన్ని వినండి. శ్రీకృష్ణుడు దేవకికి కుమారుడై పుట్టి, యశోదా తనయుడై పెరిగినట్లే, ఆచార్యుడు గాయత్రిలో పుట్టి, అష్టాక్షరిలో పెరుగుతారు. అంతేకాక, "తిరుమంత్రంలో జన్మించి, ద్వయంలో పెరిగి'' అనే పూర్వాచార్యుల సూక్తి క్రమాన్ని కూడా గ్రహించవచ్చు. **"ఓరిరవిల్ ఒళిత్తు వళర"** అనే శబ్దసందర్భంలో యాదవప్రకాశులతో కలసి గంగాయాత్రకై వెడలిన శ్రీరామానుజులు యాత్రయొక్క వంచనలోని మర్మాన్ని దారిలోనే తెలిసికొని, వింధ్యాటవినుండి తమను మఱుగుపరచుకొని, ఒక రాత్రిలో సత్యవ్రతక్షేత్రానికి (కంచికి) వచ్చి చేరిన వృత్తాంతం సూచింపబడింది.

(తరిక్కిలానాకి త్తాన్ తీఙ్గు నినైన్ద) - శ్రీరామానుజులు యాదవప్రకాశులవద్ద వేదాంతశ్రవణాన్ని చేసేటపుడు, శ్రీరామానుజులు మహామేధావియై ఉండడాన్ని గమనించిన యాదవప్రకాశులు సహించలేనివారై, వారిని గంగలోకి తోసి వధించాలనే కీడును తలపెట్టారు.

(పిழైప్పిత్తు) - దీనికి రెండు అర్థాలు. 1. తప్పి పోయేటట్లుచేసి- అని, 2. ఉజ్జీవింపజేసి -అని, శ్రీరామానుజుల విషయంలో ఈ రెండు అర్థాలు సంగతాలే. 1. తమను వధించాలని తలచిన యాదవప్రకాశుల తలపు తప్పిపోయేటట్లు చేసినవారు- అనేది ప్రసిద్ధం. 2. "స్వబలాదుద్ధృతయాదవప్రకాశః" అనే యతిరాజ సప్తతి సూక్తి క్రమంలో ఆ యాదవప్రకాశులను కూడా తమ శ్రీచరణాలలో చేర్చుకొని ఉజ్జీవింపచేశారు- అనేది కూడా ప్రసిద్ధం.

(నెరుప్పెన్న నిన్ఱ నెడుమాలే !) - **"ఉల్లంఘ్య సింధోః సలిలం సలీలం యశ్శోక వహ్నిం జనకాత్మజాయాః, ఆదాయ తేనైవ దదాహ లంకామ్"** అనే మారుతియొక్క ప్రభావకీర్తన పరమైన శ్లోకంలో సీతాదేవి గర్భంలోని శోకాగ్నిని గ్రహించి, తీసికొని పోయి ఆ అగ్నితోనే హనుమానుడు లంకను భస్మం చేశాడు- అని చెప్పబడింది. ఆ రీతిలోనే రేపల్లెలోని గోపికలయొక్క గర్భంలోని భయాగ్నిని తీసికొనిపోయి శ్రీకృష్ణుడు కంసుని కడుపులో ప్రవేశపెట్టాడు. శ్రీకృష్ణుడే కంసుని గర్భంలోని అగ్నిగా చెప్పడంలోని తాత్పర్యం ఇదే. కంసుని స్థానంలో కలిపురుషుని గ్రహించాలి. కంసుడు శ్రీకృష్ణుని అవతారానికి చాలా కాలం ముందే అశరీరవాణిని విని మృతప్రాయుడయ్యాడు. ఆ రీతిలోనే కలిపురుషుడుకూడా భగవద్రామానుజులు అవతరించడానికి చిరకాలం ముందే **"కలియుమ్ కెడుమ్ కణ్డుకొణ్మిన్"** (కలి నశిస్తుంది, చూడండి) అనే నమ్మాழ్వార్ల శ్రీసూక్తిని విని మృతప్రాయుడయ్యాడు. కంసుడు, శ్రీకృష్ణుడు అవతరించిన తరువాత మరణించినట్లే, కలిపురుషుడు కూడా- **"ఇరామానుశన్ ఇత్తలత్తుదిత్తు ఇఱైన్దదు వెఙ్కలి"** (శ్రీరామానుజులు ఈ భూమిలో ఉదయించగానే క్రూరమైన కలి నశించింది.) అని అముదనార్ పల్కిన రీతిలో శ్రీరామానుజులు అవతరించిన తరువాత మరణించాడు.

(నెరుప్పెన్న నిన్ఱ నెడుమాలే!) - **"పాషండద్రుమషండదావదహనః"** (పాషండులనే వృక్షసమూహాలకు దావాగ్ని) అని, **"పాషండసాగర మహాబడబా ముఖాగ్నిః"** (పాషండులనే సముద్రాన్ని ఎండగట్టే బడబాగ్ని) అని శ్రీరామానుజులు అగ్నిగా చెప్పబడడం (ధాటీపంచకంలో) గమనించవచ్చు.

(నెడుమాలే !) **"మాలాయ్ పిఱన్ద నమ్బి"** (ఆశ్రితవ్యాముగ్ధుడై అవతరించిన గుణపూర్ణుడు), **"మాలే శెయ్యుమ్ మణాళన్"** (ఆశ్రితవ్యామోహాన్ని చూపే స్వామి) అయిన శ్రీకృష్ణుడు భక్తులపట్ల వ్యామోహమే మూర్తీభవించినవాడు. శ్రీరామానుజులు కూడా - **"పొన్నరఙ్గమెన్నిల్ మయలే పెరుకుమ్ ఇరామానుశన్"** (అందమైన శ్రీరంగం అంటే వ్యామోహాన్ని పొందే శ్రీరామానుజులు) అని, **"యో నిత్యమచ్యుత పదాంబుజయుగ్మరుక్మ వ్యామోహతః"** (ఏ రామానుజులు నిత్యం అచ్యుతుని పదాంబుజయుగమనే బంగారంలోని వ్యామోహంవల్ల తృణంగా తలిచారో) అని పలికే రీతిలో భగవద్విషయంలోని వ్యామోహమే రూపుదిద్దు కొన్నవారు.

(ఉన్నై యరుత్తిత్తు వన్దోమ్) - **"అరుత్తిత్తు"** అనే దానికి అర్థించి- ప్రార్థించి అని భావం. **"కైయిల్ కని ఎన్న కణ్ణనై క్కాట్టి త్తరిలుమ్, ఉన్దన్ మెయ్యిల్ పిఱఙ్గియ శీరన్ఱి వేణ్డిలన్ యాన్"** (కరతలామలకంగా శ్రీకృష్ణుని దర్శింపజేసినా, నీ కల్యాణగుణాలను తప్ప వేఱొక విషయాన్ని ఆశించను.) అనే అధ్యవసాయంతో వచ్చాను- అని తాత్పర్యం.

(తిరుత్తక్క శెల్వమ్) -**"తుల్యశీలవయోవృత్తాం తుల్యాభిజనలక్షణామ్, రాఘవోఽర్హతి వైదేహీం తం చేయ మసితేక్షణా"** (సమానమైన శీలాన్ని, వయస్సును, లక్షణాలను కల్గిన, తుల్యమైన ఆభిజాత్య లక్షణాలను కల వైదేహి - శ్రీరామునకు తగినది. శ్రీరాముడు - ఆమెకు తగినవాడు) అని హనుమంతుడు పల్కినట్లే, సీతాదేవికి తగినట్లు శ్రీరాముడు, శ్రీరామునకు తగినది సీతాదేవి- అనే రీతిలో ఉండే తగిన సంపదను కీర్తిస్తూ వచ్చాము- అని అన్యాపదేశంలో అర్థం. స్వాప దేశంలో అయితే- లక్ష్మీదేవితో సమానమైన ఐశ్వర్యాన్ని కలవారు, శ్రీరామానుజులు. మనవంటివారికి పురుషకారకృత్యాన్ని చేసి, భగవానుని శ్రీచరణసన్నిధిని చేర్పించడమే లక్ష్మీదేవికి సంపద. ఇదే భగవద్రామానుజుల సంపదకూడా. వారి శ్రీచరణసంబంధం లేనివారికి మోక్షం లేదు- అనేది సంప్రదాయం.

(శేవకమ్ యామ్ పాడి) - ద్వ్యర్థకపదప్రక్రియలో **"శేవకమ్"** అనే పదం పరత్వ- సౌలభ్యాలను రెండిటిని తెల్పుతుంది. ద్రావిడంలో **"శేవకమ్"** అని వీరత్వానికి కూడా పేరు కనుక, పరత్వం తెలుపబడుతుంది. సంస్కృతశబ్ద వికృతిగా గ్రహిస్తే సేవకావృత్తి చేయడమనే అర్థం ఏర్పడి, సౌలభ్యగుణాన్ని ఈ పదం తెల్పుతున్నది.

(వరుత్తముమ్ తీర్న్దు మకిழ్న్దు) -క్లేశం తీరాలి- అంటే చాలు కదా. ప్రత్యేకంగా **"మకిழ్న్దు"** అని పల్కడం ఎందుకు? అని అంటే, ఇతరుల మతంలో **"ఆత్యంతికదుఃఖధ్వంస ఏవ మోక్షః"** (పూర్తిగా దుఃఖం తీరడమే మోక్షం) అని

క్లేశాలు పూర్తిగా తీరడం మాత్రమే మోక్షంగా చెప్పబడింది. భగవద్రామానుజ సిద్ధాంతంలో ఆ రీతిలో కాకుండా, దుఃఖ ధ్వంసమే కాకుండా, **"ఉఱ్ఱేన్ ఉకన్దు పణి శెయ్తు ఉన పాదమ్ పెఱ్ఱేన్"** (నిన్ను ఆశ్రయించాను. ఆనందించి కైంకర్యం చేసి, నీ పాదాలను పొందాను) అనే ఆఴ్వార్ల శ్రీసూక్తి క్రమంలో కైంకర్యంవల్ల కలిగే ఆనందానుభవంకూడా. చేరినపుడే మోక్షమనబడుతుంది. ఇది కూడా ఇక్కడ సూచితమైనది.

26. మాలే! మణివణ్ణా! మార్గఴి నీరాడువాన్
మేలైయార్ శెయ్వనకళ్ వేణ్డువన కేట్టియేల్
ఞాలత్తై ఎల్లామ్ నడుఙ్గ మురల్వన
పాలన్న వణ్ణత్తు ఉన్ పాఞ్జశన్నియమే
పోల్వన శఙ్గఙ్గళ్ పోయ్ప్పాడుడైయనవే
శాల ప్పెరుమ్ పఱైయే పల్లాణ్డు ఇశైప్పారే
కోలవిళక్కే కొడియే వితానమే
ఆలినిలైయాయ్! అరుళ్ ఏలోర్ ఎమ్బావాయ్

పూర్వం "ఒరుత్తి మకనాయ్" ఇత్యాది పాశురాన్ని ఆలకించిన శ్రీకృష్ణుడు గోపికలను ఉద్దేశించి కొన్ని మాటలను పలికాడు. "గొల్లకన్నియలారా ! ఇపుడు మీరు పల్కిన మాటలనుబట్టి నా మనస్సులో తోచినవానిని చెబుతున్నాను వినండి. వ్యాసుడు శారీరకమీమాంస అనే ఒక గొప్ప శాస్త్రాన్ని రచించారు. అదే బ్రహ్మసూత్రాలని చెప్పబడుతున్నది. అందులో ఏ సూత్రంలోకూడా "నేను జన్మిస్తాను'' అనే విషయాన్ని ఆ మహర్షి చెప్పలేదు. "నేను కారణభూతుడను'' అనేదానిని మాత్రమే రెండు అధ్యాయాలలో తెలిపారు తప్ప, నేను ఎంతగానో ఆశపడి ఈ లోకంలోకి వచ్చి జన్మిస్తాను కదా !, దానినిగూర్చి ఎక్కడా పలుకలేదు. పురాణాలు రచించిన మహర్షులు కూడా **"తతోఽఖిలజగత్పద్మబోధాయాచ్యుత భానునా, దేవకీపూర్వసంధ్యాయా మావిర్భూతం మహాత్మనా"** (అపుడు సమస్త జగత్తు అనే పద్మం వికసించడంకోసం అచ్యుతుడనే సూర్యుడు దేవకి అనే తూర్పు సంధ్యలో ఉదయించాడు.) అని ఏదో పలికారు; అంతే. **"నైష గర్భత్వ మాపేదే న యోన్యా మవసత్ ప్రభుః"** (ఇతడు గర్భవాసాన్ని చేయలేదు. యోనిలో నివసించలేదు.) అని నా మనస్సు పుండుపడే రీతిలో పలికారు. ఇటువంటి నా

కొఱత తీరేటట్లుగా, నమ్మాఴ్వార్లు ఒక్కరే మొదటి ప్రబంధాన్ని పాడడం ఆరంభించినపుడే **"ఉయిరళిప్పాన్ ఎన్నిన్ఱ యోనియుమాయ్ ప్పిఱన్దాయ్ ఇమైయోర్‌తలైవా!"** (లోకసంరక్షణార్థం ఎన్నెన్ని జాతులలో పుట్టావో కదా! ఓ నిత్యసూరినాథా!) అని నా చెవికి చల్లగా ఉండేటట్లు నా జన్మనుగూర్చి పలికారు. వారి వంశంలో జన్మించిన మీరు ఇంతవరకు నా జన్మనుగూర్చి పలుకలేదే! అని చాలా కొఱతపడుతూ ఉన్నాను. **"నన్దగోపన్ కుమరన్"** అని, **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్ ఆఱ్ఱ పడైత్తాన్ మకనే"** (ఔదార్యాన్ని కల గొప్పపశువులను సమృద్ధిగా కలవాని పుత్రుడా!) అని పలికారు తప్ప, **"జన్మ కర్మ చ మే దివ్యమ్"** (నా జన్మకర్మలు దివ్యాలు) అని నా మనస్సు ఉలిక్కిపడే రీతిలోని నా జన్మనుగూర్చి మీరు నోరు తెఱచి పల్కినది **"ఒరుత్తి మకనాయ్ ప్పిఱన్దు"** (దేవకీ దేవికి పుత్రుడుగ పుట్టి) అని ఇపుడే కదా! ఇందువల్ల నా మనస్సుకు కల్గిన ఆనందానికి అవధి లేదు. అంతకుమించి, **"ఒళిత్తు వళర"** (రహస్యంగా వృద్ధిచెందగ) అని కూడా అన్నారు. ఏదో నేను కంసుని భయంవల్ల రహస్యంగా పెరుగుతున్నట్లు మీరు భావిస్తున్నట్లున్నారు. ఇది చాలా తప్పు అయిన భావన. నా తల్లి యశోదకు ఈ విధమైన ఒక అజ్ఞానం ఉన్నది. అందువల్ల ఆమె మాటి మాటికి **"పొఱు తిఱల్ కఞ్జన్ కడియన్ కాప్పారు మిల్లై కడల్ వణ్ణా! ఉన్నై త్తనియే పోయ్ ఎఙ్గుమ్ తిరిది"** (గొప్ప శక్తిని కల కంసుడు కఠినుడు. ఓ సముద్రవర్ణా ! నిన్ను కాపాడేవారెవరు లేరు. నీవు ఒంటరిగా పోయి అంతటా సంచరిస్తున్నావు.) అని, **"అఙ్గువన్ నీ యఙ్గు నిఱ్క ఆఴియఙ్గైయనే! వారాయ్"** (నీవు అక్కడ ఉంటే భయపడు తున్నాను. సుదర్శనాన్ని అందమైన చేతిలో కలవాడా! రా) అని పల్కడం కద్దు. మీరు కూడా ఆ విధంగా భావించడం తగదు. **"కఞ్జన్ వలై వైత్త వన్ఱు వారిరుళెల్లిల్ పిఴైత్తు నెఞ్జు తుక్కమ్ శెయ్యప్పోన్దాయ్ నిన్ఱ ఇక్కన్నియరోమై"** (కంసుడు నిన్ను వధించాలని ప్రయత్నించిన ఆసమయంలో నల్లని చీకటి రాత్రిలో బతికి బయటపడి నిలచి ఉండే లేతవయస్సులోని కన్యలైన మాకు మనస్తాపం కల్గించడం కోసం వచ్చి జన్మించావు) అని మీరే పలికారుకదా! మీతో కాలక్షేపం చేయడంకోసమే నేను ఇక్కడకు వచ్చాను తప్ప, రహస్యంగా పెరగడంకోసం రాలేదు. ఇంతేకాక, **"తరిక్కిలానాకి త్తాన్ తీఙ్గు నినైన్ద కరుత్తై ప్పిఴైప్పిత్తు"** (కంసుడు, భరించలేని వాడై హానిని తలపెట్టగా, అతని భావాన్ని వ్యర్థం చేసి) అని అన్నారు. ఇది చాలాగొప్ప మాట. అతడు పలు పలు హానికార్యాలను చేసినప్పటికీ, మీరు **"తీఙ్గు శెయ్ద కఞ్జన్"** (హాని చేసిన కంసుడు) అని అనకుండా **"తీఙ్గు నినైన్ద కఞ్జన్"** (హాని

తలపెట్టిన కంసుడు) అని అన్నారుకదా! ఇది మర్మాన్ని తెలిసి పల్కినమాట కదా! నా నిగ్రహానుగ్రహాలను నేను ఏవిధంగా నిర్వహిస్తున్నాను? అని అంటే, ఒకడు సత్కార్యాలను చేసినపుడే, అతనిని అనుగ్రహిస్తాను- అనే మాట లేదు. మంచి పనులను చేయాలని మనస్సులో అనుకోకుండా నోటితో పైపైన పల్కినాకూడా, తావన్మాత్రానికే అతనిని అనుగ్రహిస్తాను. ఇదే రీతిలో చెడ్డపనులను చేసేవారు నోటితో అపరాధం చేసినా, కర్మలతో అపరాధం చేసినా, అంతమాత్రంతో నేను నిగ్రహించడం లేదు. ఈ చెడ్డపని వీరి హృదయంలో భావింపబడిందా?- అని చాలా దూరం పరిశీలించి చూచి, హృదయంలో ఉన్నది- అని స్పష్టంగా తెలిసిన తరువాతనే నిగ్రహిస్తాను. ఈ తత్త్వాన్ని మీరు తెలిసికొని, **"తీఙ్గు నినైన్ద కరుత్తై"** (హానిని తలచిన అభిప్రాయాన్ని) అని అన్నారు కదా! ఇది చాలా వెలకట్టలేని మాట. ఇంతకుమించి, **"ఉన్నై యరుత్తిత్తి వన్దోమ్"** (నిన్ను ప్రార్థించి వచ్చాము)అని అంటున్నారే! ఇదికూడా నేను ఇంతవరకు నేను వినని అరుదైన గొప్ప మాట. ఆయా వ్యక్తులు తమ తమ అభీష్టాలను నావద్ద ప్రార్థించి పొందడం కోసం వస్తున్నారే తప్ప, నన్నే అర్థించడంకోసం వచ్చేవారు లేరు. ఈవిధంగా పల్కిన మీరు ఉత్తమాధికారులనే ప్రతిపత్తిని కల్గి ఉన్నాను. మీకు నేను సర్వస్వదానాన్ని చేయవలసిన బాధ్యతనుకూడా కల్గిఉన్నాను. అయినా, మీరు **"పఱై తరుతియాకిల్"** (పఱైను ఇచ్చినట్లయితే) అని ఇంకొక మాటను అన్నారు. ఇదే ఏమిటో నాకు బోధపడలేదు. దీనిని మీరిపుడు విశదంగా చెప్పి తీరాలి'' అని అన్నాడు, శ్రీకృష్ణుడు. దీనికి సమాధానం పల్కుతున్నది ఈ పాశురం.

"మార్గళినీరాట్టమ్" అనే ఒక వ్రతాన్ని అనుష్ఠించే ఆచారం ఉన్నది. ఇది శిష్టాచారసిద్ధం. దీనినే మేమిపుడు అనుష్ఠిస్తున్నాము. దీనికి కావలసిన ఉపకరణాలను విజ్ఞాపిస్తున్నాము. విని, ఆనందంతో వాటిని మాకు అనుగ్రహించాలి- అని అంటున్నారు, ఇందులో గోపికలు.

(మాలే!)- "మాలెన క్కరుమై పెరుమై మైయలుమామ్" అని తమిళ నిఘంటువు తెల్పుతున్నది. నల్లనివాడు, గొప్పవాడు, వ్యామోహాన్ని కలవాడు- అనే మూడు అర్థాలను కల్గినది- **"మాల్"** అనే పదం. "శ్రీకృష్ణుడనే నల్లని దైవమా!, మేము దైవాలమని భావించే అన్ని లోకాలలోని దైవాలకు పరదైవమైనవాడా!, భక్తుల పట్ల వ్యామోహాన్ని కలవాడా! - అని సంబోధించినట్లయింది.

(మణివణ్ణా!) మణి అంటే రత్నం. అది ఎంత గొప్ప విలువను కల్గినది అయినా కొంగులో ముడికట్టుకొనే రీతిలో యథేష్టవినియోగార్హంగా ఉంటుంది. అదే రీతిలో భగవానుడుకూడా ఎంత పరాత్పరుడై ఉన్నా, దాసులకు పరాధీనుడై ఉంటాడు. రత్నం సామాన్యంగా అందఱికి లభించదు. భాగ్యవంతులకు మాత్రమే అది లభిస్తుంది. భగవానుడు కూడా అంతే. రత్నాన్ని కల్గినవానికి నిద్రపట్టదు. భగవానుని పొందినవారుకూడా **"ఉణ్డో కణ్కళ్ తుఞ్జుదలే"** (కన్నులు మూయడం అనేది ఉంటుందా?) అనే రీతిలో నిద్ర లేకుండా ఉంటారు. పదివేల రూపాయల విలువ కల్గిన ఒక రత్నం సముద్రంలో వల విసిరిన ఒక జాలరి చేతికి లభిస్తే, అది ఒక వర్తకుని చేతిలో అల్పమైన విలువకు అమ్మబడుతుంది. దానిని ఆ వర్తకుడు ప్రభువునకు గొప్ప వెలకు అమ్ముతాడు. దానిని కొన్న ప్రభువు జాలరివానివలె అల్పమైన వెలకు అమ్మకుండా, వర్తకునివలె అధికమూల్యానికి కూడా అమ్మకుండా, స్వయంభోగ్యంగా అలంకరించుకొంటాడు. భగవానుని విషయంలోకూడా ఈ రీతిలోనే గమనించవచ్చు. భగవానునివద్ద కొందఱు అల్పఫలాలను కోరతారు. కొందఱు మోక్షరూపమైన గొప్పఫలాన్ని ప్రార్థిస్తారు. కొందఱు **"ఎనక్కు త్తేనే! పాలే ! కన్నలే ! యముదే"** (నాకు తేనె, పాలు, కలకండ, అమృతం వంటివాడా!) అని పల్కి పరమభోగ్యంగా అనుభవిస్తారు. ఈ విధంగా ఇక్కడ ఇంకా మఱి కొన్ని సామ్యాలను అభ్యూహించవచ్చు.

ఈ విధంగా పల్కిన గోపికలను చూచి శ్రీకృష్ణుడు "నన్ను పొగడడం అటు ఉండనివ్వండి. విషయాన్ని తెలుపండి'' అని అనగా, **"మార్గళి నీరాడువాన్"** (మార్గశీర్షస్నానం చేయడంకోసం) అని ఆరంభించారు. ఈమాటను వినగానే శ్రీకృష్ణుడు, "ఇదేమి? అపూర్వమైన మాటగా ఉన్నదే! నేను దీనిని ఇంతవరకు వినలేదే ! ఇది శాస్త్రాలలోకూడా కన్పించడంలేదే!'' అని అన్నాడు. దానికి గోపికలు, **"మేలైయార్ శెయ్వనకళ్"** (పెద్దలు ఆచరించేవి) అని అంటున్నారు. **"స్వామీ! "ధర్మజ్ఞసమయః ప్రమాణమ్"** (ధర్మాన్ని తెలిసినవారి ఆచారం ప్రమాణం)అనే మాటను మఱచిపోయావా! నీవు గీతలో **"యద్యదాచరతి శ్రేష్ఠః తత్తదేవేతరో జనః"** (ఉత్తముడు దేనిని దేనిని ఆచరిస్తున్నాడో, ఇతరుడు కూడా దానినే ఆచరిస్తున్నాడు) అని పల్కిన మాటను మఱచావా ! శాస్త్రాలకంటె శిష్టాచారం పరమప్రమాణం- అనే విషయాన్ని అజ్ఞులమైన మేము తెలిపిన తరువాత జ్ఞానపూర్ణుడవైన **"నిఱైఞానత్తొరు మూర్త్తి"** (జ్ఞానపూర్ణుడైన అద్వితీయ రూపం) అయిన నీవు తెలియవలసి ఉన్నదా ?'' అని అన్నారు.

దానిని విని శ్రీకృష్ణుడు "మంచిది. అయితే, ఈ వ్రతంకోసం మీకు ఏమి కావాలి?'' అని అడిగాడు. **"ఞాలత్తై ఎల్లామ్ నడుఙ్గ మురల్వన"** (లోకంలో అంతా ప్రతిధ్వనించే) అని ఆరంభించి, శంఖాలు, పఱై, పల్లాణ్డును పాడేవారు, కోలవిళక్కు, కొడి, వితానం - అనే వీటిని కావాలి- అని అంటున్నారు, గోపికలు. ఇంతకుముందు శ్రీకృష్ణుడు శయనగృహంనుండి దివ్యసింహాసనంమీదకు వేంచేయడాన్ని దర్శించగోరారు. ఇపుడు అతని తిరువీథి పురప్పాడును దర్శించగోరి ఈవిధంగా ప్రార్థిస్తున్నారు. పురప్పాడుకు పూర్వాంగంగా తిరుచ్చిన్నాలు ధ్వనించాలి. బయలు దేరేటపుడు పఱై ఉపయోగపడుతుంది. బయలుదేరగానే **"మెయ్న్నిన్ఱు కేట్టరుళాయ్ అడియేన్ శెయ్యుమ్ విణ్ణప్పమే"** (దాసుడు చేసే విన్నపాన్ని ఆలకించు) అని పల్కి పల్లాణ్డు పాడే అధ్యాపకులు కావాలి. వారి గోష్ఠికి ప్రకాశం (వెలుతురు) చూపించడంకోసం కోలవిళక్కు (అందమైన కరదీపిక) కావాలి. భక్తులు చాలా దూరంలో ఉన్నా దర్శించి ఆనందించడంకోసం ధ్వజం కావాలి. మంచు తలపై కురవకుండా అడ్డుకోవడంకోసం వితానం (మేల్కట్టు) కావాలి.

ఇంతవరకు ఆలకించిన శ్రీకృష్ణుడు "ఓ గోపికలారా! మీ చాతుర్యమే చాతుర్యం. **"ఉన్నై అరుత్తిత్తు వన్దోమ్"** (నిన్ను ప్రార్థించివచ్చాను) అని నన్నే కోరి వచ్చినట్లుగా పల్కిన మీరు ఇన్ని వస్తువులను ప్రార్థిస్తున్నారే ! వీటిని అన్నిటినీ నేను సంపాదించి ఇవ్వడం సాధ్యమేనా ?'' అని అన్నాడు, దానికి సమాధానంగా-

(ఆలినిలైయాయ్ ! అరుళ్) -అని అంటున్నారు. **"మఞ్జాడు వరై యేழుమ్ కడల్కళేழుమ్ వానకముమ్ మణ్ణకముమ్ మఱ్ఱుమ్ ఎల్లామ్ ఎఞ్జామల్ వయిఱ్ఱడక్కి ఆలిన్ మేలోర్ ఇళన్దళిరిల్ కణ్వళర్న్ద"** (మేఘాలు సంచరించే సప్తకులపర్వతాలను, ఏడు సముద్రాలను, ఆకాశాన్ని, భూమిని, ఇంకా మిగిలిన అన్నిటినీ ఉదరంలో పెట్టుకొని, మఱ్ఱి చిగురుటాకుపై శయనించిన) అఘటిత ఘటనా సమర్థుడవైన నీకు అసాధ్యం అనేది ఉన్నదా? మనస్సులో భావించి కృపజేయాలి- అని పాశురాన్ని ముగించారు.

ఇక, ఆచార్యపరమైన అర్థాన్ని వినండి.

(మాలే !)- భగవానునికంటే అధికుడా!

(మణివణ్ణా !) - **"ఆఘ్రాతం పరిచుంబితం పరిముహూర్లీఢం పునశ్చర్వితం త్యక్తం వా భువి నీరసేన మనసా ..... హే సద్రత్న !"** (వాసన చూడబడినదానవు,

చుంబించబడినదానవు, తిరిగి అంతటా నాక బడినదానవు, మళ్ళీ చప్పరించబడిన దానవు. చివరకు రసం లేనిదని తలచి భూమిపై పారవేయబడిన దానవు అయిన గొప్పరత్నమా!) అని అన్నాడు, ఒక మహాకవి. ఒక కోతిచేతికి రత్నం ఒకటి దొరికినదట. ఆ కోతి అది ఏమో తెలిసికోలేక, మొదట దానిని వాసన చూచినదట. తరువాత ముద్దుపెట్టుకొని చూచినదట. ఆ తరువాత దానిని నాకి చూచినదట. నోటిలోపల పెట్టుకొని కొఱికి చూచిందట. చివరకు అది రసం లేనిది- అని తలచి నేలపై పారవేసిందట. మహానుభావుల గొప్పతనం పామరులకు లవలేశం కూడా తెలియదు- అనేదే దీని స్వాపదేశార్థం. అందువల్ల **"మణివణ్ణా !"** అంటే- పామరులకు అగోచరమైన జ్ఞానప్రకాశాన్ని మెండుగా కలవాడా!- అని భావం.

(మార్గழி నీరాడువాన్ మేలైయార్ శెయ్వనకళ్) - **'మార్గழి నీరాట్టమ్"** అంటే- **"మార్గశీర్షావగాహనం"** అని, **(మార్గ-శీర్ష- అవగాహనమ్)** - అంటే- భగవత్ప్రాప్తి మార్గాలలో గొప్పదైన ఆచార్యాభిమానంలో ఒదిగి ఉండడమే- అని ఇతఃపూర్వమే వివరింపబడింది. అది శిష్టాచారమనే విషయం ఇక్కడ తెలుపబడుతున్నది. ఈ విషయంలో - **"అంధోఽనంధగ్రహణవశగః"** ఇత్యాది న్యాసతిలకదివ్యసూక్తి అనుసంధేయం. **"దత్తే రంగీ నిజమపి పదం దేశికాదేశకాంక్షీ"** (శ్రీరంగనాథుడు, దేశికుల ఆదేశాన్ని కాంక్షించేవాడై తన పదాన్ని ఇస్తున్నాడు) అనే అచటి సూక్తి కూడా ప్రకృతంలో స్మరణీయం. శంఖం మొదలైనవానిని కోరడంలోని అభిప్రాయం ఏమంటే - భావప్రధాననిర్దేశన్యాయంలో తామే శంఖంగా, పఱైగా, పల్లాణ్డును పాడేవారుగా, విళక్కుగా, ధ్వజంగా వితానంగా కావాలి- అని ప్రార్థించే రీతి ఇది. శంఖంవలె శుద్ధసాత్త్వికులం కావాలి; నీ శ్రీహస్తాన్ని విడచి ఉండకుండా ఉండాలి. (గురుకులవాసమే గతిగా కలవారం కావాలి -అని భావం) **"పఱై"**వలె ఆచార్య-ప్రాచార్య - పరమాచార్యుల కీర్తిని ఎనిమిది దిక్కులలో తెలిసేటట్లుగా కీర్తించాలి. భగవానునకు పెరియాழ్వార్లవలె, సదాచార్యుడవైన నీకు మేము పల్లాణ్డు పాడేవారంగా కావాలి. విళక్కు (దీపం) ఏవిధంగా స్వస్మైస్వయంప్రకాశంగా, పరప్రకాశకంగా ఉంటుందో, ఆ విధంగానే మేముకూడా స్వ-పరప్రకాశకులం కావాలి. **"కొడి"** అనేది ధ్వజం. **"శ్రీమల్లక్ష్మణయోగీంద్రసిద్ధాంతవిజయధ్వజమ్"** (శ్రీరామానుజ సిద్ధాంతానికి విజయధ్వజంవంటివారు) అనే బిరుదును పొందినవారం కావాలి - అని భావం. **"దాసస్సఖా వాహనమాసనం ధ్వజో యస్తే వితానం వ్యజనం త్రయీమయః"** (దాసుడుగా, సఖుడుగా, వాహనంగా, ఆసనంగా,

ధ్వజంగా, వితానంగా, విసనకఱ్ఱగా మాఱి వేదమయుడైన గరుడుడు సేవిస్తాడు) అనే స్తోత్రరత్నసూక్తిలో పెరియతిరువడి (గరుడుడు) వితానంగా చెప్పబడ్డాడు. **"తొడుత్తు మేల్ వితానమాయ పౌవనీరరావణై"** (విస్తరించి పైన వితానంగా అయిన ఆదిశేషుడు) అనే తిరుమழிశైయాழ்వార్ల పాశురంలో ఆదిశేషుడు వితానంగా చెప్పబడ్డాడు. కనుక, పెరియ తిరువడివలె, ఆదిశేషునివలె సర్వదేశ-సర్వకాల-సర్వావస్థలలో తగిన అశేషకైంకర్యధురంధరులం కావాలి- అని ప్రార్థించినట్లయింది.

(ఆలినిలైయాయ్!) - **"ఆలిన్ ఇలైయాయ్"** అని విడదీసి పూర్వం అర్థం చెప్పబడింది. ఇపుడు **"ఆలిన్ నిలైయాయ్"** అని గ్రహించాలి. తాటిచెట్టు నీడవలె కాకుండా, మఱ్ఱిచెట్టు నీడలో అనేకులు ఒదిగి సుఖంగా ఉండవచ్చు కనుక, మఱ్ఱిచెట్టువంటి స్థితిని కలవారు - అని సంబోధించడం, ఆచార్యులను ఉద్దేశించియే.

ఈ పాశురంలో **"మేలైయార్ శెయ్‌వనకళ్ వేణ్డువన"** (గొప్పవారు అనుష్ఠించేవానిలో ఆవశ్యకమైనవి) అనేది ప్రాణస్థానీయమైన శబ్దసందర్భం. **"యద్యదాచరతి శ్రేష్ఠ స్తత్తదేవేతరో జనః"** (శ్రేష్ఠుడు దేనిని దేనిని ఆచరిస్తాడో, ఇతడు కూడా దానిని దానిని ఆచరిస్తాడు) అని గీతాచార్యుడు, **"ధర్మజ్ఞసమయః ప్రమాణమ్"** (ధర్మజ్ఞుల ఆచారం ప్రమాణం) అనే మహర్షులు పలికారు. ఈ ప్రమాణాలు శిష్టాచారంయొక్క వైలక్షణ్యాన్ని తెలుపుతున్నవి. దీనిని అనుసరించియే గోదాదేవి ఈ పాశురాన్ని అనుగ్రహించింది. పైన ఉదాహరించిన **"యద్యదాచరతి"** అనే శ్లోకం గీతలో **(3-21)** ఉన్నది. ఈ శ్లోకానికి అర్థం సంస్కృతజ్ఞులకు అనాయాసంగా బోధపడుతుంది. **"స యత్ ప్రమాణం కురుతే లోకః తదనువర్తతే"** (ఆకర్మలను అతడు ఎంతవరకు ఆచరిస్తాడో, లోకం కూడా అంతవరకు ఆచరిస్తుంది.) అని ఉత్తరార్ధానికి భాష్యాన్ని రచించిన ఆదిశంకరాచార్యులవారు **"సః శ్రేష్ఠః, యత్ప్రమాణం కురుతే - లౌకికం వైదికం వా, లోకః తత్ అనువర్తతే, తదేవ ప్రమాణీకరోతీత్యర్థః"**. (శ్రేష్ఠుడు దేనిని ప్రమాణీకరిస్తాడో, అది లౌకికం కాని, వైదికం కాని, లోకం దానిని అనుసరిస్తుంది. దానినే ప్రమాణంగా గ్రహిస్తుందని భావం.) అని వివరించారు. శ్రేష్ఠులు దీనిని ప్రమాణంగా గ్రహిస్తారో, దానినే లోకం ప్రమాణంగా గ్రహిస్తుంది - అనే అర్థం చూపబడింది. మధ్వాచార్యులు ఆనందతీర్థస్వామికూడా ఈ రీతిలోనే అర్థాన్ని తెలిపారు. అందువల్ల **"యత్ ప్రమాణమ్"** అనేచోట పదచ్ఛేదం వీరికి వివక్షితమని తెలుస్తుంది. మన భాష్య

కారులు ఇక్కడ పదచ్ఛేదాన్ని గ్రహించకుండా, **"యత్ప్రమాణమ్"** అని బహువ్రీహిసమాసాన్ని కల ఒకే పదంగా భావించి, భాష్యాన్ని అనుగ్రహించారు. పూర్వార్ధంలో **"శ్రేష్ఠః యత్ యత్ ఆచరతి"** అనే దానికి "శ్రేష్ఠులు ఏయే కర్మలను అనుష్ఠిస్తున్నారో" అని అర్థం కనుక, ఆ కర్మను గూర్చియే ఉత్తరార్ధంకూడా తెలుపుతున్నది- అని గ్రహించడమే ఉచితం- అని శ్రీరామానుజుల అభిప్రాయం. శిష్టులు తాము అనుష్ఠించే కర్మలకు ఎంతవరకు అవధిని పెట్టి ఆచరిస్తున్నారో, అంత అవధినే ఇతరులుకూడా పెట్టి ఆచరిస్తున్నారు- అని దీని భావం. దీనిని దేశికులు తాత్పర్యచంద్రికలో వివరించారు. అక్కడ గమనించవచ్చు. పెద్దలు అనుష్ఠించే కర్మలనే ఇతరులు కూడా అనుష్ఠిస్తున్నారు- అని ఇంతమాత్రం అర్థం గ్రహిస్తే చాలదు. వారు ఆ కర్మలను ఏవిధంగా అనుష్ఠిస్తున్నారో, ఆ విధంగానే ఇతరులుకూడా అనుష్ఠిస్తున్నారు - అని చెప్పడం ఇక్కడ ఆవశ్యకం కనుక, దానికి తగినట్లుగా శ్రీరామానుజుల భాష్యం చాలా యుక్తంగా రచింపబడింది. పెద్దలు దీనిని ప్రమాణంగా గ్రహిస్తున్నారో, దానినే ఇతరులుకూడా ప్రమాణంగా గ్రహిస్తున్నారు- అనేది ప్రకృతంలో అనపేక్షితం కనుక, ఇతర భాష్యకారులను మన శ్రీరామానుజులు అనుసరించలేదు. ఇతర భాష్యకారులకు స్ఫురించని అర్థం శ్రీరామానుజులకు ఏవిధంగా తోచింది? అని అంటే, **"తిరుప్పావై జీయర్"** అనే ప్రసిద్ధిని పొందినందువల్లనే - అని దృఢంగా భావించవచ్చు. ఈ పాశురంలో **"మేలైయార్ శెయ్‌వనకళ్ కేట్టియేల్"** (గొప్పవారు చేసేవానిని గూర్చి అడిగితే) అని అంతమాత్రమే చాలి ఉండగా, **"వేణ్డువన"** (ఆవశ్యకమైనవి) అని ఇంకొక పదాన్ని ప్రయోగించడం గమనించాలి. దానిని ఉద్దేశించియే స్వామి **"యత్ప్ర మాణమ్"** అనే దానిని సమస్తపదంగా గ్రహించి, భాష్యాన్ని అనుగ్రహించారు. శాస్త్రాలలో ఎన్నో కర్మలు అనుష్ఠేయాలుగా చెప్పబడ్డాయి. వాటిని అన్నిటిని శిష్టులు ఆచరించరు. **"క్రియమాణం న కస్మైచిత్ యదర్థాయ ప్రకల్పతే, అక్రియావద నర్థాయ తత్తు కర్మ సమాచరేత్"** (అనుష్ఠింపబడే ఏకర్మ ఏ ప్రయోజనాన్ని ఇవ్వదో, చేయకపోతే అనర్థాన్ని కల్గిస్తుందో, ఆ కర్మను ఆచరించాలి.) అనే వచనాన్ని పెద్దలు చక్కగా తెలిసినవారు కనుక, ఏ కర్మలకు ఏ విధమైన ఫలం లేదో, చేయకపోతే ప్రత్యవాయం కల్గుతుందో, ఆ కర్మలను మాత్రం అవహితులై చేస్తారు. దానినే లోకంకూడా అనుకరిస్తుంది. అక్కఱలేనివానిని విడచి, కావలసినవానిని చేసేవారే **"మేలైయార్"** - అనే ఈ అర్థంలో గోదాదేవియొక్క ఈ పాశురం అవతరించింది. దీనికి తగినట్లు భాష్యాన్ని అనుగ్రహించాలి అనియే-**"శూడిక్కొడుత్తవళ్ తొల్లరుళాల్**

వాళ్కిష్ట వళ్ళల్ ఇరామానుశన్" (శూడిక్కొడుత్త నాచ్చియార్ సహజ కరుణతో ఉజ్జీవించే ఉదారులు శ్రీరామానుజులు) గీతాశ్లోకానికి పెరియాళ్వార్ల శ్రీచరణసన్నిధిలో గోదాదేవి శ్రవణం చేసిన అర్థం ఇదే - అని నిశ్చయించి, ఆణ్డాళ్ చూపించిన అర్థాన్నే తమ భాష్యంలోని తెలిపారు. ఈ విషయాన్ని ఈ పాశురంలోని అపూర్వనిధిగా అనుసంధిచాలి.

27. కూడారై వెల్లుమ్ శీర్ క్కోవిన్దా! ఉన్దన్నై
ప్పాడి ప్పఱై కొణ్డు యామ్ పెఱు శమ్మానమ్
నాడు పుకళుమ్ పరిశినాల్ నన్దాక
శూడకమే తోళ్వళైయే తోడే శెవిప్పూవే
పాడకమే ఎన్ఱనైయ ప్పల్ కలనుమ్ యామణివోమ్
ఆడై యుడుప్పోమ్ అదన్ పిన్నే పాల్ శోఱు
మూడ నెయ్ పెయ్దు ముళఙ్గై వళివార
కూడి యిరున్దు కుళిర్న్దు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురంలో గోపికలు వ్రతానికి అనుగుణంగా శంఖాలు, పఱైవాద్యాలు, పల్లాణ్డు పాడేవారు, కోలవిళక్కులు (మంగళదీపాలు), ధ్వజాలు, వితానం అపేక్షితాలని అన్నారు. దీనిని విన్న శ్రీకృష్ణుడు, **"ఉణ్ణుమ్ శోఱు పరుకు నీర్ తిన్నుమ్ వెఱ్ఱిలైయుమ్ ఎల్లామ్ కణ్ణన్"** (తినే తిండి, తాగే నీరు, ఆస్వాదించే తాంబూలం- అన్నీ శ్రీకృష్ణుడే) అని భావించే ఈగోపికలు మనలను కాకుండా వేఱు దేనినీ ఆశించే ప్రసక్తి లేనందువల్ల పర్యాయంగా నన్నే సపరివారంగా అపేక్షిస్తున్నారు కాబోలు! నేను పాంచజన్యంతోను, కుంభనృత్యాన్ని చేసినపుడు నడుమున కట్టుకొన్న పఱైతోను, పల్లాణ్డు పాడే వారితోను, కోలవిళక్కు అయిన నప్పిన్నైప్పిరాట్టితోను, **"కొడి"** అయిన పెరియతిరువడితోను, నేను మధురనుండి రేపల్లెకు వచ్చేటపుడు నాకు వితానమైన ఆదిశేషునితోను రావాలి- అనే అభిప్రాయాన్నే వీరు వ్యక్తం చేశారు కాబోలు- అని శ్రీకృష్ణుడు భావించాడు. అయినా, గోపికలతో రస్యంగా భాషించాలని తలచి, "గోపికలారా! **"ఉన్ పాఞ్జశన్నియమే పోల్వన శఙ్గఙ్గళ్"** (నీ పాంచజన్యంవంటి పలు శంఖాలు) అనుగ్రహించాలి'' అని అంటున్నారు. నావంటివాడు ఇంకొకడు ఉంటేకదా నా పాంచజన్యంవంటి ఇంకొక శంఖం ఉంటుంది. అటువంటి పలు శంఖాలు కావాలని అంటున్నారు. కానివ్వండి

చూస్తాను. దీనికిమించి, **"శాల ప్పెరుమ్ పఱై"**, (చాలా పెద్ద వాద్యం) కావాలని అంటున్నారు. ఇది గోపాలుర వద్ద సులభంగా లభించగల్గినదే. ఇందులో విచారం లేదు. పల్లాణ్డు పాడేవారు కావాలని అంటున్నారు. మీకు మించిన పల్లాణ్డు పాడేవారున్నారా ! దానికి మీరే చాలు. ఇంతకు మించి **"కోలవిళక్కు"** (అందమైన దీపం), **"కొడి"** (ధ్వజం), **"వితానమ్"** కావాలని అంటున్నారు. ఇవి అరుదైనవి కావే. వాటిని నావద్దనే అడిగి పొందాలనే నిర్బంధం లేదుకదా! అయినా, నావద్దకు వచ్చి కోరే మీకు వీటిని అన్నిటిని చక్కగా ఇస్తాను. వీటివల్ల మీకు పరిపూర్ణమైన తృప్తి కల్గుతుందా! నడురాత్రిలో లేచి, పలువురిని నిద్రలేపి తీసికొనివచ్చి, ఈ బ్రాహ్మముహూర్తంలో ఇక్కడకు వచ్చి చేరిన మీకు నేను ఏదయినా ఇవ్వవలసిన వాడనై ఉన్నాను. ఇంతమాత్రమే ఇస్తే మీరు ఆనందాన్ని పొందుతారా ? చెప్పండి'' అని అన్నాడు. దానికి గోపికలు ఇచ్చిన సమాధానం ఈ పాశురంలో వ్యక్త మవుతున్నది. "స్వామీ! పూర్వం మేము అడిగిన వస్తువులు మార్గళి నోముకు తగినవి. నోము పూర్తి అయితే మీ వద్దనుండి మేము పొందవలసిన సంమానాలు కూడా ఉన్నాయి కదా! వాటినిగూర్చి విన్నపిస్తున్నాము. నీవు ఆలకించి, అనుగ్రహించాలి'' అని అంటున్నారు గోపికాసుందరీమణులు.

గడచిన పాశురంలో ప్రార్థించిన శంఖం, పఱై, పల్లాణ్డు పాడేవారు, మంగళ దీపం, ధ్వజం, వితానం-అనే వీటి ద్వారా పరమపదంలో పొందదగిన సంమానాలు తెలుపబడ్డాయి. తిరువాయ్మొళిలో- **"శూళ్ విశుమ్బు అణిముకిల్"** అనే దశకంలో ఇది అన్నీ పరమపదంలో లభించేవి- అని తెలుపబడ్డాయి. ఏవిధంగా? అంటే, **"కాళఙ్గళ్ వలమ్బురి కలన్దెఙ్గుమ్ ఇశైత్తన"** (కాహళాలు, శంఖాలు అంతటా ధ్వనించాయి.) అని పల్కినందున శంఖం ఊదడం తెలుపబడింది. **"తూరియమ్ ముళక్కిన"** (తూర్యాలు ధ్వనించాయి) అనే దానివల్ల పఱై (భేరీలు) మోగింపబడడం తెలుపబడింది. **"తొడర్ న్దెఙ్గుమ్ తోత్తిరమ్ శొల్లినర్"** (అనుసరించి అంతట స్తుతులు పలికారు), **"వాళ్త్తినర్ మకిళ్న్దే"** (ఆనందంగా మంగళాశాసనం చేశారు) అని అన్నందువల్ల పల్లాణ్డు పాడేవారు తెలుపబడ్డారు. **"నిఱైకుడ విళక్కముమ్ మదిముక మడన్దైయర్ ఏన్దినర్ వన్దే"** (పూర్ణకుంభాలను, దీపాలను చంద్రునివంటి ముఖాన్ని కల సుందరీమణులు తీసికొని వచ్చారు) అని పల్కినందువల్ల మంగళదీపాన్ని ఎత్తి పట్టుకోవడం తెలుపబడింది. **"కొడియణి నెడుమదిళ్"** (ధ్వజాలనే అలంకరింపబడిన గొప్ప ప్రాకారాలు) అన్నందువల్ల ధ్వజం కట్టబడడం చెప్పబడింది. వితానమనేది పైభాగం కన్పించని రీతిలో మఱుగు

పరుస్తుంది. **"మామణిమణ్డపత్తు"** (మహామణి మండపం) అనే దానివల్ల అది తెలుపబడింది.

ఇక, ఈ పాశురంలో ఉపనిషత్సిద్ధాలైన ముక్తభోగావళులే ఆశింపబడుతున్నాయి.

(కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా !) - దీనిద్వారా విముఖులనుకూడా వశం చేసికొన గల్గిన కల్యాణగుణాన్ని కలవాడు, శ్రీకృష్ణుడు- అనేది తెలుపబడింది. లోకంలోని జనులు అభిముఖులని, విముఖులని, ఉదాసీనులని మూడు విధాలుగా ఉండవచ్చు. అభిముఖులంటే -భక్తులు. విముఖులంటే -విరోధులు. ప్రేమ లేకుండా, పగ లేకుండా తటస్థంగా ఉండేవారు ఉదాసీనులనబడతారు. మూలంలో ఉండే **"కూడార్"** అనే పదం ఈ మూడు విధాలైనవారిని తెలుపుతుంది. **"కూడారై"** అనే దానికి "కలవనివారు'' అని అర్థం. విముఖులు, ఉదాసీనులు కూడని వారుగా ఉంటారు తప్ప, అభిముఖులనబడే భక్తులుకూడా కూడనివారు కాగలరా ? అనే సందేహం కల్గుతుంది. సమాధానం వినండి. నమ్మాళ్వార్లు **"వళవేழులకిన్ ముదలాయ"** అనే దశకంలో **"వళమిక్క మాల్పెరుమై మన్నుయిరిన్ తణ్మై, ఉళముఱ్ఱు అజ్కూడురువ వోర్న్దు, తళర్ వుఱ్ఱు నీజ్గ నినైమాలనై"** (గొప్ప శక్తిని కల భగవానుని గొప్పతనాన్ని, మన్నికగా ఉండే జీవాత్మయొక్క నైచ్యాన్ని మనస్సులో భావించి, ఆర్తిని పొంది, దూరంగా తొలగిపోవాలని తలచిన నమ్మాళ్వార్లను) అనే తిరువాయ్మొழి నూఱ్ఱన్దాది పాశురక్రమంలో భగవానుని నిస్సమాభ్యధికమైన గొప్పతనాన్ని, తమ తక్కువదనాన్ని (నైచ్యాన్ని) తలచినవారై, భగవానునితో తాము కలువలేక పోవడాన్నిగుర్చి తెలియజేశారు. వారే, **"మిన్నిడై మడవార్"** అనే దశకంలో **"ఉన్నుడనే కూడేనెన్డ్రుడుమ్ కురుకైయర్కోన్"** (నీతో కలువను - అని ప్రణయ రోషంతో పలికే నమ్మాళ్వార్లు) అనే తిరువాయ్మొழి నూఱ్ఱన్దాది పాశురక్రమంలో ప్రణయరోషం తల ఎత్తి, తలుపులు మూసి అతనిని బయటకు గెంటే గోపికల సమాధిలో అతనితో తాము కలువలేని స్థితినిగూర్చి తెలియజేశారు. అందువల్ల **"కూడార్"** అనే పదంతో అభిముఖులు, విముఖులు, ఉదాసీనులు- అనే తేడా లేకుండా అందఱు గ్రహింపబడడంలో అడ్డు లేదు.

వీరిని జయించడం అంటే - వారి వారి అభిప్రాయాన్నిమార్చి తన స్వాధీనం చేసికోవడమే. అది ఏవిధంగా సాధ్యం? అని అంటే -

(వెల్లుమ్ శీర్) - ఒక్కొక్కగుణంతో ఒక్కొక్కటి సాధ్యమవుతుంది. **"మహతో మందైస్సహ నీరంధ్రేణ సంశ్లేషః శీలమ్"** (గొప్పవాడు తక్కువ వానితో ఏ తేడా లేకుండా సంశ్లేషించడమే శీలం) అనే రీతిలో చాలా గొప్పవాడు చాలా తక్కువవారితో ఏ తేడా లేకుండా కలువడానికి తగినది శీలగుణమే కనుక, ఆ గుణాన్ని చూపి, నైచ్యానుసంధానం చేస్తూ కలువనని అనేవారిని తన శృంగారచేష్టిత చాతుర్యాన్ని చూపి, వశం చేసికొంటాడు. మాత్సర్యంతో కలువనివారైన శత్రువులను అయితే, శౌర్య-వీర్య- పరాక్రమాదిగుణాలను చూపి వశం చేసికొంటాడు. ఉదాసీనులను ఏదో ఒక నెపంతో తనవద్దకు వచ్చేటట్లు చేసి, **"పోదరే! ఎన్ఱు శొల్లి పున్దియిల్ పుకున్దు తన్పాల్ ఆదరమ్ పెరుకవైత్త అழకన్"** (దగ్గరకు రా! అని పల్కి, నా మనస్సులో ప్రవేశించి, తనపట్ల ఆదరాన్ని అభివృద్ధి చేసిన సుందరుడు) అనే రీతిలో సౌందర్యలావణ్యాదులను చూపి ఆకర్షిస్తాడు. **"గోవిన్దా!"** - అనే సంబోధనతో **"అఱివొన్ఱు మిల్లాద ఆయ్క్కులమ్"** (జ్ఞానం ఏమీ లేని గొల్లకులం) లో జన్మించినా, నీకు ఇంతటి సామర్థ్యం ఉన్నదే! అనే ఆశ్చర్యం స్ఫురిస్తుంది.

తిరుప్పావైకు జీవనాడి ఆచార్యపరమైన అర్థమే కనుక, దానినికూడా ఈ సంబోధనలో వివరిస్తాను. **"కూడార్"** అని పల్కినందువల్లనే మాత్సర్యంవల్ల కూడని వారు, ఔదాసీన్యంవల్ల కూడనివారు గ్రహింపబడతారు. అటువంటివారిని కూడా మన పూర్వాచార్యులు తమ పాండిత్యవిశేషాన్ని చూపి, ఆత్మగుణపూర్తిని చూపి తమకు శేషభూతులుగా చేసికొన్నారు. భగవద్రామానుజులు యజ్ఞమూర్తి, యాదవప్రకాశులు మొదలైనవారిని, భట్టర్ నంజీయర్ అనబడే మేల్నాడులోని వేదాంతిని, నమ్బిళ్ళై తున్ను పుకழ్ కన్దాడై తోழప్పర్; నడువిల్ తిరువీదిప్పిళ్ళై భట్టర్ మొదలైనవారిని వశం చేసికొన్న వృత్తాంతాలు ఇక్కడ అనుసంధేయాలు. **"గోవిన్దా!"** అనే సంబోధనకూడా ఆచార్యునకే పొసగుతుంది. పలు అర్థాలను కల గోశబ్దం పశువులనువలె, శ్రీసూక్తులనుకూడా తెలుపగలదు కనుక, గొప్ప సూక్తులను తమ జిహ్వలో కలవారు - అని దీని భావం.

(ఉన్దన్నై ప్పాడి ప్పఱై కొణ్డు) - పాడడం వేఱు, ఆ తరువాత పఱైను పొందడం వేఱు- అని భావించరాదు. పాడడం అనే పరమపురుషార్థాన్ని పొంది- అని దీని అర్థం. "భుజించి ఆకలి తీరినవాడయ్యాడు'' అంటే - తినిన తరువాత ఆకలి తీర్చుకొన్నవాడయ్యాడు- అని అర్థం కాదుకదా. భుజించేటపుడే ఆకలి తీరిపోతుంది కనుక, భుజించడం- ఆకలి తీరడం అనేవి ఒకటే. అదే క్రమాన్ని ఇక్కడ కూడా

గ్రహించాలి. ఇందువల్ల- వ్రతం అనుష్ఠించడం అనేది కేవలం వ్యాజం. గోపాల వృద్ధుల అంగీకారాన్ని పొంది, లోకం అంతా తెలిసేటట్లుగా నిన్ను పాడడమే మాకు పరమపురుషార్థమని భావం. **"గురోర్నామ సదా జపేత్"** (గురువు నామాన్ని సదా జపించాలి) అనే రీతిలో ఆచార్యనామసంకీర్తనంకూడా పరమపురుషార్థమని భావం.

ఇకపై, **"యామ్ పెరు శమ్మానమ్"** (మేము పొందే గొప్ప సంమానం) అని ప్రారంభించి, కొన్ని సమ్మాన విశేషాలను కోరుతున్నారు. ఈ సమ్మానాలు సామాన్యంగా దొరుకనివి. లోకం అంతా కీర్తించేటట్లుగా చక్కగా లభించాలని మునుముందుగా పల్కుతున్నారు. ఖ్యాతిలో గాని, లాభంలో కాని, పూజలో కాని అపేక్షను లేనివారైన పరమైకాంతులు లోకం అంతా పొగడాలి- అని మనస్సులో కూడా భావించే అవకాశం లేదు. చక్రవర్తి త్తిరుమకనార్ (శ్రీరాముడు) మకుటాభిషేకాన్ని స్వీకరించేటపుడు సుగ్రీవ- అంగదాది భక్తులకు బహుమానాలను ఇవ్వడం సామాన్యమైన రీతి. హనుమానునకు బహుమానం ఇచ్చిన రీతి **"నాడు పుకழుమ్ పరిశు"** (లోకం పొగడే బహుమానం) గా చక్కగా సమకూరింది. ఆ ప్రకరణంలో- **"అవముచ్యాత్మనః కంఠాత్ హారం జనకనందినీ, అవైక్షత హరీన్ సర్వాన్ భర్తారం చ ముహుర్ముహుః"** (తన కంఠం నుండి హారాన్ని తీసి జానకీదేవి వానరులు అందఱి వైపు, భర్త వైపు మాటిమాటికి చూసింది) అని పలికేటపుడు **"దదౌ సా వాయుపుత్రాయ తం హారమసితేక్షణా"** (నల్లని కన్నులను కల సీతాదేవి ఆ హారాన్ని వాయుపుత్రునకు ఇచ్చింది) అని అన్నందువల్ల శ్రీరాముడు, సీతాదేవి ఇరువురు కలసి హనుమానునకు బహుమానం ఇచ్చారని తెలుపబడింది. ఆ బహుమాన ప్రదానమే లోకం కీర్తించేటట్లు సమకూడింది. ఇక్కడ కూడా అదే రీతిలో నీళాదేవి, శ్రీకృష్ణుడు కలసి కూడి ఉండి సమ్మానాన్ని అనుగ్రహించాలని తెలుపబడింది.

సంమానవస్తువులను గూర్చి ఇకపై ప్రస్తావిస్తున్నారు.

(శూడకమే తోళ్వళైయే తోడే శెవిప్పూవే పాడకమే) - అని అలంకార బహుమానాలను గూర్చి ప్రస్తావిస్తున్నారు. **"శూడకమ్"** - అంటే చేతి గాజులు. **తోళ్వళై** -భుజభూషణం. **తోడుమ్, శెవిప్పూవు** - కర్ణాభరణవిశేషాలు. **"పాడకమ్-** అనేది పాదకటకం. ఈవిధంగా అయిదు భూషణాలు కోరబడ్డాయి. ఇకపై **"ఆడై యుడుప్పోమ్"** - అని వస్త్రాలంకారం, **"పాల్శోఱు"** - ఇత్యాదిగా మృష్టాన్నభోజనం ఆశింపబడ్డాయి. ఇవి అన్నీ పరమపదంలోని ముక్తులకు లభించే సంమానాలు. ఉపనిషత్తులో - ముక్తులకు పొందింపబడే సంమానాలను గూర్చి పలికేటపుడు,

"తం పంచశతాని అప్సరసాం ప్రతిధావంతి, శతం మాలాహస్తాః శతమంజనహస్తాః, శతం చూర్ణహస్తాః, శతం వాసోహస్తాః, శతం భూషణహస్తాః తం బ్రహ్మాలంకారేణ అలంకుర్వంతి" (ముక్తపురుషుని అయిదువందల మంది అప్సరసలు స్వాగతిస్తారు. నూఱుమంది మాలికలను చేతులతో దాల్చినవారు, నూఱుమంది కాటుకను చేతిలో కలవారు, నూఱుమంది గంధపుపొడిని చేతిలో కలవారు, నూఱుమంది వస్త్రాలను చేతిలో కలవారు, నూఱుమంది భూషణాలను చేతిలో కలవారు, అతనికి బ్రహ్మాలంకారాన్ని చేస్తారు) అని తెలిపింది. అయిదు వందలమంది అప్సరసలు ముక్తులను స్వాగతం (ఎదురుకోలు) పలుకుతూ వస్తారని, వారిలో వందమంది పూలమాలికలను, వందమంది అంజనాన్ని, వందమంది సుగంధచూర్ణాన్ని, వంద మంది దివ్యపీతాంబరాలను, వందమంది దివ్యభూషణాలను చేతులలో ధరించి వస్తారని, ముక్తాత్మలను బ్రహ్మాలంకారంతో అలంకరిస్తారని చెప్పబడింది. ఆ ఫలమే ఇక్కడ పొందాలని ఆశింపబడుతున్నది. సంఖ్యలో అయిదు విధాల భూషణాలు చెప్పబడినందున, ఈ లోకంలో ఆచార్యసన్నిధానంలో పొందబడే సంస్కారాలు అనే అయిదు ఆభరణాలు సూచింపబడ్డాయి. **"తాపః పుండ్రః తథా నామ మంత్రో యాగశ్చ పంచమః, అమీ పరమసంస్కారాః పారమైకాంత్యహేతవః"** (తాపం, పుండ్రం, దాస్యనామం, మంత్రం, అయిదవది యాగం. ఈ అయిదు గొప్ప సంస్కారాలు పరమైకాంతి లక్షణాలు) అనే వచనంవల్ల ఆ పంచసంస్కారాలు అనే పంచ భూషణాలు ఇక్కడ గ్రాహ్యాలు.

"శూడకమే" ఇత్యాదులకు వేఱొక విధమైన వివరణాన్నికూడా గమనించవచ్చు. ఆచార్యహృదయంలో - **"పట్టమ్ శూడకమావన- పరావరకురుక్కళ్ పూట్టుమ్ ఆత్మభూషణఙ్గళ్"** (పట్టం, శూడకం అంటే- గొప్ప గురువులు అలంకరించుకొనే భూషణాలు.) అని అనుగ్రహించిన సూక్తికి అనుగుణమైన వివరణాన్ని వినండి. శూడకమనే కరభూషణం ఏది ? అంటే, అంజలిబంధనమే. **"నిన్ తలైయై త్తాழ்த்తు ఇరుకై కూప్పెన్బాల్ కూప్పాత పాழ்త్త విది"** (నీ తలను తాకించి, చేతులను జోడించు - అంటే జోడించని పాడు విధి) - (పెరియ తిరువన్దాది-84) అని గర్హించనక్కఱ లేకుండా చేతులను జోడించడం కరభూషణం. **"యే బాహుమూలపరిచిహ్నిత శంఖచక్రాః"** (భుజాలలో ముద్రింపబడిన శంఖచక్ర చిహ్నాలను కలవారు) అనే రీతిలో శ్రీసుదర్శనంయొక్క **"కోయిల్పొఱియాలే ఒఱ్ఱుణ్డు నిఱ్కై"** (సుదర్శన లాంఛనంతో ముద్రింపబడి ఉండడం) - భుజభూషణం. ప్రథమోపదేశకాలంలో తెలిసి, తెలియని రీతిలో (వినిపించి, వినిపించని రీతిలో) మంత్రాన్ని చెవిలో

ప్రవేశింపజేయడం (ఉపదేశించడం) **"తోడు"** అనే కర్ణభూషణం. తరువాత, అర్థవిశేషాలను విస్తృతంగా వినిపించడం **"శెవిప్పూ"**. **"ఉలక మేత్తుమ్ కణ్డియూర్ అరఙ్గమ్ మెయ్యమ్ కచ్చి పేర్ మల్లై యెన్ఱు మణ్డినార్ ఉయ్యలల్లాల్ మణ్గిఱైయార్క్కు ఉయ్యలామే"** (లోకం అంతా కీర్తించే తిరుక్కండియూర్, శ్రీరంగం, తిరుమెయ్యమ్, కాంచీపురం, తిరుప్పేర్, తిరుక్కడల్మల్లై- అని అంటూ దివ్యదేశాలను అభిమానించేవారికి తప్ప మిగిలినవారికి ఉజ్జీవనం లేదు.) అనే తిరుమఙ్గైయాళ్వార్ శ్రీసూక్తిని ఆదరించి, **"పదియే పరవి త్తొழుమ్ తొణ్డరామవర్కళ్"** (దివ్యదేశాలలో వ్యాపించి, అభిమానించే భక్తులు) శ్రీచరణాలతో నడచి, దివ్యదేశాలలో యాత్రను చేయడం **"పాడక"**మనే పాదభూషణం. ఈ విధంగానే మిగిలిన అవయవాలకు కూడా ఉచితమైన అలంకారాలు తగినవి కనుక, **"ఎన్ఱు అనైయ పల్కలనుమ్ యామ్ అణివోమ్"** (అనే రీతిలోని పలు ఆభరణాలను అలంకరించుకొటాము) అని అంటున్నారు.

(ఆడై యుడుప్పోమ్) - ఇంతవరకు మీరు వస్త్రాలను ధరించకుండా ఉన్నారా? ఇపుడు **"ఆడై యుడుప్పోమ్"** అనేదాని భావాన్ని వినండి. నడుమున వస్త్రాన్ని ధరించడం అనేది పశువులకు, పక్షులకు లేదు. మానవులకే ఉన్నది. **"జ్ఞానేన హీనః పశుభిః సమానః"** (జ్ఞానం లేనివాడు పశుతో సమానం.) అనే రీతిలో పశుప్రాయులమై వస్త్రాలను ధరించే యోగ్యత లేని మేము, ఓ ఆచార్యవర్యా! తమ అనుగ్రహంతో జ్ఞానప్రకాశాన్ని పొంది, **"వృత్త్యా పశుః నరవపుః"** (ప్రవర్తనలో పశువు, రూపంలో మానవుడను) అనే అపఖ్యాతిని పోగొట్టుకొని, "మీరు వస్త్రాలను ధరించడం తగును'' అని భావింపబడేవారం కాగలము గాక!- అని తాత్పర్యం.

"అదన్ పిన్నే పాల్శోఱు" (పిమ్మట పాయసాన్నం) అనే ప్రయోగంలో **"సోஉశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితేతి"** (ఆ ముక్తపురుషుడు పరబ్రహ్మతో పాటు అన్ని కామాలను పొందుతున్నాడు.) అని ఉపనిషత్తులో చెప్పబడే ఆ అశనమే వివక్షితం. ఊరికే **"శోఱు"** అని అనకుండా **"పాల్శోఱు"** అని పల్కినందువల్ల ఉత్తమమైన అన్నం చెప్పబడినదై, భగవదనుభవంకంటే ఉత్తుంగమైన భాగవతానుభవం తెలుపబడింది. ఆ పిమ్మట **"నెయ్ పెయ్తు"** అని విశేషించి అన్నంలో అధికమైన అతిశయం చెప్పబడినందున, మిక్కిలి గొప్పది అయిన ఆచార్యగుణానుభవం కూడా తెలుపబడుతున్నది. ఈ విధంగా, భగవద్భాగవతాచార్యగుణానుభవంలో ఆసక్తిని కల్గి ఉండాలి- అని తెలుపబడింది.

"ముழఙ్గై వార" (మోచేతి ద్వారా కారగా) అనే ప్రయోగంలో ఉన్నతమైన అర్థం ఇమిడి ఉన్నది. మిక్కిలి దాహాన్ని పొందినవారికి చలువపందిరిలో కరకంతో తీర్థాన్ని పోయగా, ఒకరు రెండు చేతులతో నీటిని గ్రహించి తాగేటపుడు, అతని వెనుక ఉండే దాహార్తులు తమ దాహాతిశయంవల్ల ఆలస్యాన్ని సహించలేక, తమకు ముందు తీర్థాన్ని తాగేవారి ముంజేతిద్వారా స్రవించే చల్లని తీర్థాన్ని తాగుతారు. ఈ విధంగా పరంపరగా అనుభవించాలి- అనే విషయం ఇక్కడ సూచితం. పూర్వం **"పల్ కలనుమ్ యామ్ అణివోమ్"** (పలు ఆభరణాలను మేము అలంకరించు కొంటాము) అని, **"ఆడై యుడుప్పోమ్"** (వస్త్రాలను ధరిస్తాము) అని సంపూర్ణ (సమాపక) క్రియగా పల్కినట్లే ఇక్కడ కూడా **"పాల్శోఱు ఉణ్బోమ్"** (పాయసాన్నాన్ని భుజింస్తాము) అని పలికి ఉండాలి. ఆవిధంగా పలుకక పోవడం భుజించడంలో ముఖ్యమైన ఉద్దేశ్యం లేదు- అని తెలుపడంకోసమే. **"కూడి యిరున్దు కుళిర్న్దు"** (కలసి ఉండి ఆనందించి) అనేదే ముఖ్యమైన ఉద్దేశ్యం.

(కూడి యిరున్దు కుళిర్న్దు)- నమ్మాళ్వార్లు, **"అడియార్కళ్ కుழాఙ్గళై ఉడన్ కూడువతు ఎన్ఱుకొలో"** (భగవద్భక్తుల సమూహాలతో కలిసేది ఎపుడో?) అని ముందు ఆశించిన రీతిలో, చివరలో కూడా **"వన్దవర్ ఎదిర్ కొళ్ళ మామణిమణ్డపత్తు, అన్దమిల్ పేరిన్బత్తు అడియరోడిరున్దమై"** (వచ్చినవారు స్వాగతించగా, తిరుమామణి మండపంలో అంతులేని ఆనందంతో భగవద్భక్తులతో కలసి ఉండే స్థితి) దానిని పొందినట్లు తెలిపారు. ఇందువల్ల భక్తబృందాలతో కూడి ఉండి ఆనందించడమే పరమపురుషార్థం అనేది తెలుపబడింది. అదే ఇక్కడకూడా వివరింపబడింది.

28. కఱవైకళ్ పిన్ శెన్ఱు కానమ్ శేర్న్దుణ్బోమ్
అఱివొన్ఱు మిల్లాద అయ్కులత్తు ఉన్దన్నై
ప్పిఱవి ప్పెఱున్దనై పుణ్ణియమ్ యాముడైయోమ్
కుఱైవొన్ఱుమ్ ఇల్లాద గోవిన్దా! ఉన్దన్నోడు
ఉఱవేల్ నమక్కిఙ్గు ఒழిక్క ఒழియాదు
అఱియాద పిళ్ళైగళోమ్, అన్బినాల్ ఉన్దన్నై
చ్చిఱుపేర్ అழైత్తనవుమ్ శీఱి యరుళాదే
ఇఱైవా! నీ తారాయ్ పఱై ఏలోర్ ఎమ్బావాయ్

"మార్గ*ళి* నీరాడువాన్" (మార్గశీర్ష స్నానం చేయడంకోసం) అని వ్రతాన్నిగూర్చి ప్రస్తావించి, ఆ వ్రతానికి ఉపకరణాలైన శంఖం మొదలైనవానిని, నోము పూర్తి అయిన తరువాత అలంకరించుకోవడానికి ఉపకరణాలైన వస్త్రాభరణాలను, ప్రీతిపరీవాహంగా కలసి, క్షీరాన్నాన్ని భుజించడాన్ని- గత రెండు పాశురాలలో అపేక్షించిన గోపికలను చూచి శ్రీకృష్ణుడు, "ఓ గోపకన్యలారా! మీ ఉద్దేశ్యం ఇంతమాత్రమే - అని నాకు తోచలేదు. మీరు ఇపుడు అపేక్షించినవానిని, ఇంకా ఏమైనా అపేక్షిస్తే వాటిని నేను ఇవ్వాలి- అంటే మీ స్థితిని గ్రహించి ఇవ్వవలసి ఉన్నది. ఫలం మీదైనపుడు, మీరు కూడా కొంచెం ప్రయత్నాన్ని చేసేవారై ఉండాలి కదా! దానికి తగినట్లు మీరు అనుష్ఠించిన ఉపాయం ఏదయినా ఉన్నదా ?''- అని ప్రశ్నించగా, దానిని విన్న గోపికలు- "స్వామీ! మా స్థితిని నీవే స్వయంగా కళ్ళార చూడలేదా ! జ్ఞానవిహీనలం అయిన మేము ప్రత్యేకించి చెప్పవలసినట్లుగా నీవు తెలియనిది ఏదయినా ఉన్నదా? మా స్థితిని బాగా తెలిసిన నీవు, "మీరు అనుష్ఠించిన ఉపాయం ఏదయినా ఉన్నదా?'' అని అడుగడం చాలా ఆశ్చర్యకరంగా ఉన్నదే!'' అని తమ స్వరూపాన్నిగూర్చి తెలిపి, "ఈ గోపికలు కేవలం నీ దయకు పాత్రులని భావించి, నీవు మా కార్యాన్ని సఫలం చేయాలి'' అని విన్నపించే పాశురం ఇది.

పూర్వం, **"పో*ఱ్ఱి* యామ్ వన్దోమ్"** (మంగళాశాసనం చేసి మేము వచ్చాము), **"శెఙ్గణ్ శిఱుచ్చిఱిదే ఎమ్మేల్ వి*ళి*యావో"** (ఎఱ్ఱని నేత్రాలను కొంచెం కొంచెంగా మాపై ప్రసరింపజేయాలి), **"ఉన్నై అఱుత్తిత్తు వన్దోమ్"** (నిన్ను యాచించి వచ్చాము) ఇత్యాది పాశురాలతో గోపికలు ప్రాప్యాన్ని పొందడానికి తగినట్లుగా తమ ఆకించన్యాన్ని, అతని ఉపాయత్వాన్ని వ్యక్తం చేస్తున్నారు, ఈ పాశురంలో.

ఈ గోపికలు పూర్వం **"యామ్ వన్ద కారియమ్ ఆరాయ్న్దరుళ్"** (మేము వచ్చిన కార్యాన్ని గమనించి అనుగ్రహించు) అనగానే, అతడు దానిని విచారించ కుండా, "వీరి మనస్సులో సాధనాంశంగా ఉండేవి ఏమయినా కొన్ని ఉన్నాయా?''- అని పరిశీలించడం ఆరంభించగా, దానిని గ్రహించిన గోపికలు **"స్వామీ! విన్నరుళే పురిన్దిరున్దేన్"** (నీ దయనే ఆశ్రయించి ఉన్నాను) అనే రీతిలో నీ దయనే ఆశ్రయిచ ఉండే మావద్ద, నీవు, ఉన్నవి అని తలచి మమ్ములను విడిచే రీతిలో ఉపాయాలు కొన్ని ఉన్నాయి - అని అనుకుంటున్నావా? **"ఇరఙ్గు"** అని, **"అరుళ్"** అని, మేము అపేక్షించిన దయకు ప్రతిబంధకంగా మావద్ద సాధనాంశమనేది ఏదీ లేదే!'' - అని సర్వజ్ఞునకు తెలిసేటట్లుగా తెలియజేస్తున్నారు.

సాధ్యోపాయాలను విడచి, సిద్ధోపాయాన్ని స్వీకరించే అధికారులకు (1) ప్రాప్యాన్ని పొందడంకోసం ఉపాయానుష్ఠాన రూపమైన ఏ సత్కర్మ ఏదీ లేదని అనడం, (2) ఇకపై చేసే యోగ్యత లేదని తెలుపడంకోసం తమ అపకర్షను అనుసంధించడం, (3) మూలసుకృతమైన ఈశ్వరుని గుణపూర్తిని అనుసంధించడం, (4) సంబంధాన్ని తెలియడం, (5) పూర్వాపరాధాలకు క్షమను అర్థించడం, (6) ఉపాయ భూతుడైన భగవానునిపట్ల ఉపేయాన్ని అపేక్షించడం- అనే ఈ ఆఱు అధికారికి అంగాలు. కనుక, ఈ పాశురంలో ఈ ఆఱు వ్యక్తం చేయబడ్డాయి.

1. మొదటి పాదంలో- పశువులవెంట పోయి తిరిగి శరీరపోషణాన్ని చేసికొనేవారమై ఉన్నాము- అని అనడంవల్ల తమవద్ద సత్కార్యాచరణం ఏదీ లేదని, 2. రెండవ పాదంలో- **"అఱివొన్ఱు మిల్లాద ఆయ్క్కులత్తు"** (ఏ జ్ఞానం లేని గోకులంలో) అని అనడం వల్ల ఇకపై యోగ్యత లేదు అని అనడంకోసం తమ అపకర్షానుసంధానం, 2. నాల్గవ పాదంలో- **"కుఱై వొన్ఱు మిల్లాద గోవిన్దా !"** (ఏ కొఱత లేని గోవిందా !) అని అనడంవల్ల మూలసుకృతమైన ఈశ్వరుని గుణపూర్తియొక్క అనుసంధానం, 4. అయిదవ పాదంలో - **"ఉఱవేల్ నమక్కు ఇఙ్గొ*ళి*క్క వొ*ళి*యాదు"** (సంబంధం మనం లేకుండా చేసికోవడానికి సాధ్యం కాదు) అని అనడంవల్ల సంబంధజ్ఞానం, 5. ఏడవ పాదంలో- **"శీఱి యరుళాదే"** (కోపించకు) అని అనడంవల్ల పూర్వాపరాధాలకు క్షామణం, 6. ఎనిమిదవ పాదంలో- **"ఇఱైవా! నీ తారాయ్ పఱై"** (స్వామీ! పఱై అనుగ్రహించు) అని పల్కడంవల్ల ఉపాయాపేక్షను వ్యక్తం చేయడం గమనించవచ్చు.

"కుఱై ఒన్ఱు మిల్లాద గోవిన్దా"- (ఏ కొఱత లేని గోవిందా!) అనే సూక్తి "నీకొక కొఱత ఉన్నప్పుడుకదా మాకు ఒక కొఱత ఉంటుంది' అనే భావాన్ని వ్యక్తం చేస్తున్నది. **"గోవిన్దా!"** - నిత్యసూరుల సభలో అవాప్తసమస్తకాముడవై ఉండే స్థితి తొలగి, రేపల్లెలో గోవులను మేపడంకోసం జన్మించడం కొఱతలను కల్గిన మమ్ములను పూర్తిని కల్గినవారినిగా చేయడంకోసం కదా! అని భావం. **"గుణతుంగ తయా తవ రంగపతే !"** (శ్రీరంగనాథా! నీవు గుణాలచేత ఉన్నతుడవు అయి నందున) ఇత్యాది భట్టర్ శ్రీసూక్తి ఇక్కడ అనుసంధేయం.

ఇక్కడ **"శిఱు పేర్"** అనేది నారాయణనామాన్ని తెల్పుతుంది. ఇంద్రుడు వచ్చి శ్రీకృష్ణునకు గోవిందపట్టాభిషేకం చేసిన తరువాత అతనిని నారాయణుడని

అనడం దోషమేకదా ! ఒకడు పట్టాభిషేకాన్ని చేసికొన్న తరువాత, అతనిని పూర్వపు నామంతో పిలువడం కంటే మించిన దోషం ఒకటి ఉన్నదా ?

(అ<u>ఱై</u>త్తన) - **"నారాయణన్"** అని ఒక మాట పల్కి ఊరుకోకుండా, **"నారాయణనే నమక్కే పఱై తరువాన్"** (నారాయణుడే మనకే ప్రాప్యాన్ని అనుగ్రహిస్తాడు) అని, **"నా<u>ఱ్ఱ</u> త్తు<u>ఴా</u>య్ముడి నారాయణన్"** (సువాసనను కల తులసిని కిరీటంలో కల్గిన నారాయణుడు) అని, **"నారాయణన్ మూర్త్తి"** అని పలుమార్లు చెప్పినందువల్ల, **"అ<u>ఱై</u>త్తన"** అనే బహువచనం ప్రయోగింపబడింది. "ఉన్ఱన్నై... అ<u>ఱై</u>త్తనవుమ్" అనే చకారానికి ("ఉమ్మై"కు) తాత్పర్యం- మేము మాలో స్నేహపారవశ్యంవల్ల **"పేయ్ప్పెణ్ణే ! ఊమైయా? శెవిడో ! నాణాదాయ్! పణ్డే ఉన్ వాయఱితుమ్"** (పిచ్చిపిల్లా, మూగదా? చెవిటిదా?, లజ్జ లేనిదానా!, ఇంతకుముందే నీ నోటిని గూర్చి తెలుసు) అని పలు రీతులలో పల్కిన సహించాలి- అని.

ఈ విధంగా క్షమించాలి- అని ప్రార్థించిన కన్యలను ఉద్దేశించి శ్రీకృష్ణుడు, "నేను క్షమించదగిన సంబంధం నాతో మీకు ఉన్నప్పటికీ, దోషాలను క్షమించాలి- అని పల్కినా, ఫలాన్ని అనుభవించేవారు మీరైన తరువాత, మీరుకూడా ఏదయినా సాధనానుష్ఠానాన్ని చేయవద్దా! వ్యాజమాత్రంగా అయినా కావాలి కదా! "వీరు దీనిని చేశారు, కనుక ఇతడు దీనిని ఇచ్చాడు'' అని లోకులకు తెలుపడానికి ఒక ఆలంబనం కావాలికదా!'' అని అనగా, దీనిని వినిన గోపికలు - "ఎదుటి వ్యక్తిలో దేనినీ ఎదురు చూచి ఆశించకుండా నీవు కార్యాన్ని చేస్తే, నిన్ను అడ్డుకోగల్గిన వారెవరైనా ఉన్నారా?'' అనే భావం వ్యక్తం అయే రీతిలో **"ఇఱైవా!"** అని సంబోధిస్తున్నారు.

ఈ పాశురంలో "ఉన్ఱన్నై చ్చిఱు పేర<u>ఱై</u>త్తనవుమ్ శీఱి యరుళాదే" (నీ చిన్నపేరుతో నిన్ను పిలిచినా నీవు కోపించకు సుమా) అనేది ప్రాణస్థానీయమైన మాట. విశ్వరూపాన్ని దర్శించిన అర్జునుడు **"సఖేతి మత్వా ప్రసభం యదుక్తం హే కృష్ణ! హే యాదవ! హే సఖేతి, అజానతా మహిమానం తవేదం.... తత్ క్షామయే త్వామ్ అహమప్రమేయమ్"** (నా స్నేహితుడవని తలచి, సాహసంతో కృష్ణా! యాదవా!, సఖా !- అని అంటూ నీ గొప్పతనాన్ని తెలియని నేను ఏది పలికానో, దానిని క్షమించమని గొప్పవాడవైన నిన్ను అర్థిస్తున్నాను.) అని చాలా గొప్ప నామాలైన నారాయణాది నామాలను పెట్టి పిలవకుండా, **"యాదవా ! గోపాలా !"** అనే చిన్న నామాలను పెట్టి పిలిచానే !, ఇది నీ గొప్పతనాన్ని తెలియనందువల్ల చేసిన దోషం.

దీనిని క్షమించాలి'' అని క్షమను అర్థించాడు. గోపికలు శ్రీకృష్ణుని సౌలభ్య-సౌశీల్య వైలక్షణ్యంలో చాలా చాలా అభినివేశాన్ని పొందినందువల్ల వీరి అభిప్రాయానుసారం అతని పరత్వం నిష్ఫలమైనది. అందువల్ల పరత్వానికి ఏకాంతమైన నారాయణ నామాన్ని పల్కడం అపచారంగా వీరికి తోచింది. గోపాలుడు, గోవిందుడు, దామోదరుడు, నవనీతచోరుడువంటి తిరునామాలే చాలా గొప్ప నామాలుగాను, నారాయణనామం చిన్న నామంగాను తోచింది. "అయ్యో ! ఏమి చేశాము ! ఏమి చేశాము ! **"నారాయణనే నమక్కే పఱై తరువాన్"** (నారాయణుడే మనకే ప్రాప్యాన్ని అనుగ్రహిస్తాడు.) అని, **"నా<u>ఱ్ఱ</u>త్తు<u>ఴా</u>య్ ముడి నారాయణన్"** (సువాసనను కల తులసిని కిరీటంలో అలంకరించుకొన్న నారాయణుడు) అని చిన్న పేరును పెట్టి వ్యవహరించామే ! ఈ అపరాధానికి కోపించకుండా నీవు సహించాలి'' అని వేడుకొన్నట్లయినది. నారాయణనామాన్ని చిన్న పేరు అని అంటే, ఇది మహాపచారం కదా ! అని భావిస్తారు అరసికులు. భగవానుని పరాత్పరుడని స్తుతించడం అతనికి సంతోషకరమా ! సులభుడు, సుశీలుడు అని స్తుతించడం సంతోషాన్ని కల్గిస్తుందా? అనే ప్రశ్న వస్తే, పరాత్పరుడై ఉండే (అవతరించిన) స్థితిలో చాలా వెగటు కల్గి, చాలా కిందకు దిగి వచ్చిన స్థితిలో కూడా పరత్వాన్నే పల్కితే, ఇక సంతోషం ఏవిధంగా కల్గుతుంది? కోపమేకదా వస్తుంది. కనుక కోపించవద్దు- అని ప్రార్థించడం కర్తవ్యమైనది. ఈ పాశురంలో **"ఉన్ఱన్నోడుఱవేల్ నమక్కు ఇఙ్గొ<u>ఴి</u>క్క వొ<u>ఴి</u>యాదు"** (నీతో గల సంబంధాన్ని మనం లేకుండా చేసికోవడం సాధ్యం కాదు) అనే వాక్యాన్ని ప్రాణసమానంగా గ్రహించాలి. భగవానునకు, మనకు మధ్య ఉండే సంబంధాన్ని తెలియడంకంటే మించి మనకు కర్తవ్యం ఏదీ లేదు- అనేది ఇక్కడ శాస్త్రార్థం.

ఇక, ఆచార్యపరంగా అర్థాన్ని తెలుపుతున్నాను.

(కుఱై వొన్ఱు మిల్లాద గోవిన్దా !) జ్ఞానంలో గాని, అనుష్ఠానంలో గాని, దేనిలోను కొఱత లేని విద్వన్మణీ ! అని దీని అర్థం.

(కఱవైకళ్ పిన్ శెన్ఱు కానమ్ శేర్న్దు ఉణ్బోమ్) - ఈ శబ్దసందర్భం - శబ్దశ్లేష ద్వారా ఇంతవరకు ఉండే స్థితిని, ఇకపై ఉండగోరిన స్థితిని తెల్పుతుంది. పశుప్రాయులైన పామరజనుల వెంట తిరుగుతూ, సంసారమరుకాంతారంలో పడి ఉండి, తినడం నిద్రించడమే కాలక్షేపంగా కల్గి ఉన్నాము. (ఇకపై ఉండబోయే రీతి ఏమి? అంటే) కామధేనువులైన ఆచార్యులను అనుసరించి, "ఏతత్ సామ

గాయన్నాస్తే" (ముక్త పురుషుడు ఈ సామనుగానం చేస్తూ ఉంటాడు) అనే రీతిలో సామగానం చేసే చోటకు చేరి, "అహమన్నాదోఽహమన్నాదః" (నేను అన్న శబ్దవాచ్యుడైన పరబ్రహ్మను అనుభవించేవాడను.) అని పరబ్రహ్మ అనే అన్నాన్ని అనుభవించి, ఆనందించగలము-అని.

(అఱివొన్ఱు మిల్లాద ఆయ్క్కులత్తు యామ్) - "అఱివిల్లాద, అఱివొన్ఱు ఇల్లాద, అఱివొన్ఱుమ్ ఇల్లాద" -తత్త్వహితపురుషార్థాలలో దేనిలోను జ్ఞానం లేని కుటుంబంలో జన్మించిన మేము.

(ఉన్దన్నై ప్పిఱవి పెఱున్దన్నై పుణ్ణియమ్ యాముడైయోమ్) - "ఉన్దన్నై" -అనే పదానికి "నీచేత" (ఉన్దన్నాల్") అని అర్థం. "స హి విద్యాత స్తం జనయతి తచ్ఛ్రేష్ఠం జన్మ" (ఆచార్యుడు విద్యద్వారా అతనిని జన్మింపజేస్తున్నాడు. అది శ్రేష్ఠమైన జన్మ) అనే రీతిలో నీచే జ్ఞానజన్మను పొందే రీతిలోని భాగ్యాన్ని పొందాము.

(ఉన్దన్నోడుఉఱవేల్ నమక్కు ఇఙ్గొழிక్క ఒழிయాదు) ఆచార్యసంబంధం ఈ విభూతిలో తొలగి పోయేది కాదు. "అత్ర పరత్ర చాపి" (ఈలోకంలో పరమపదంలో కూడా) అని ఆళవన్దార్ అనుగ్రహించిన రీతిలో యావదాత్మభావియై ఉండే సంబంధం, అది. "ఇఙ్గు" అనే దానికి - ఈ విషయంలో- అని అర్థం.

(అఱియాద పిళ్ళైకళోమ్ ఇత్యాది) - ఆచార్యవైభవాన్ని తెలియని మేము చేసిన అపచారాలను అన్నిటిని క్షమించాలి-అని భావం. "అழைత్తనవుమ్" అనే పదంలోని "ఉమ్మై" (చకారం) చేత భగవదపచార- అసహ్యాపచారాలు సముచ్చీకరింపబడ్డాయి.

(ఇఱైవా) మాకు సర్వేశ్వరస్థానంలో ఉండే స్వామీ! - అని భావం.

29. శిఱ్ఱమ్ శిఱుకాలే వన్దు ఉన్నై చ్చేవిత్తు, ఉన్
పొఱ్ఱామరై యడియే పోఱ్ఱుమ్ పొరుళ్ కేళాయ్!
పెఱ్ఱమ్ మేయ్త్తుణ్ణుమ్ కులత్తిల్ పిఱన్ద నీ
కుఱ్ఱేవల్ ఎఙ్గళై క్కొళ్ళామల్ పోకాదు
ఇఱ్ఱైప్పఱై కొళ్వా నన్ఱు కాణ్ గోవిందా!
ఎఱ్ఱైక్కుమ్ ఏழேழ் పిఱవిక్కుమ్ ఉన్దన్నోడు

ఉఱ్ఱోమే యావోమ్ ఉనక్కే నామ్ ఆట్చెయ్వోమ్
మఱ్ఱై నమ్ కామఙ్గళ్ మాఱ్ఱు ఏలోర్ ఎమ్బావాయ్

గడచిన పాశురాలలో అంతటా "పఱై, పఱై" అని పల్కిన గోపికలు, ఆ "పఱై" అంటే ఏమిటో, దాని అర్థాన్ని నిష్కర్షించి విన్నపించే పాశురం, ఇది. లోకుల అంగీకారంకోసం వ్రతం అనేదానిని వ్యాజంగా చేసికొని వచ్చాము; అంతే తప్ప, మాకు ఉద్దేశ్యం నీ శ్రీచరణాలలో నిత్యకైంకర్యాన్ని చేయడమే. ఇక ఒక క్షణం అయినా నిన్ను విడచి మేము ఉండలేము. వేఱు విధమైన మనోరథం మాకు కలుగకుండా ఉండేటట్లు నీవే అనుగ్రహించాలి- అని శ్రీచరణాలను పట్టుకొని వేడుతున్నారు.

(శిఱ్ఱమ్ శిఱుకాలే) - అరుణోదయకాలాన్ని ఈ పదం తెల్పుతున్నది. "శిన్నమ్ శిఱుప్పియన్, శెక్క చ్చివన్ద తలై" అనే ప్రయోగాల వంటిదే, ఈ ప్రయోగం కూడా. "కాలే వన్దు" - అని అనకుండా, "శిఱుకాలే వన్దు" - అని అనకుండా, "శిఱ్ఱమ్ శిఱుకాలే వన్దు" - అని అనడంలో తాత్పర్యం ఏమంటే - మా పరువాన్ని గమనించి చూస్తే పొద్దు పొడిచి పదిహేను గడియలు అయినా చలికి భయపడి ఇంటిని విడిచిన బయలుదేరారు- అని స్ఫురిస్తూ ఉండగా, చలిని ఒక విషయంగా భావించకుండా మేము ఇంత ప్రాతఃకాలంలో రావడం ఎంతటి ఆర్తియొక్క అతిశయంవల్ల అయి ఉంటుంది? అనే విషయాన్ని సర్వజ్ఞుడవైన నీవే గమనించి తెలిసికో- అని.

"ఉన్పొఱ్ఱామరై యడియే పోఱ్ఱుమ్ పొరుళ్ కేళాయ్" (బంగారం వంటి స్పృహణీయాలైన నీ శ్రీచరణాలకు మంగళాశాసనం చేయడంలోని ప్రయోజనాన్ని ఆలకించు) అని అనడం - మేము దేనిని దృష్టిలో పెట్టుకొని నీ దగ్గరకు వచ్చామో, ఆ ఉద్దేశ్యాన్ని వ్యక్తం చేస్తున్నాము. ఆలకించు- అనే భావంతో. ఆ ఉద్దేశ్యాన్ని మిగిలిన పాదాలలో వ్యక్తం చేస్తున్నారు.

(పెఱ్ఱమ్ మేయ్త్తు-ఇత్యాది) నిత్యసూరులమధ్య ఏడు లోకాలను అద్వితీయమైన ఆజ్ఞతో పాలిస్తూ వేంచేసి ఉండే స్థితిని విడచి పెట్టి, ఈ గోపాలకులంలోకి నీవు వచ్చి జన్మించినందుకు ఏదైనా ఒక ప్రయోజనం కలుగ వద్దా? మావద్ద నీవు కైంకర్యాన్ని స్వీకరించకపోతే నీ ఈ జన్మ నిష్ఫలమే కదా!- అని అంటున్నారు. **"కుఱ్ఱేవల్ ఎఙ్గళై క్కొళ్ళామల్ పోకాతు"** (మానుండి నీవు

కైంకర్యాన్ని గ్రహించక తప్పదు) అనే చోట **"కొమ్మైములైకళ్ ఇడర్ తీర క్కోవిన్దర్ క్కోర్ కుర్రేవల్ ఇమ్మై ప్పిఱవి శెయ్యాదే ఇని ప్పోయ్ శెయ్యుమ్ తవన్దానెన్?"** (స్తనాల బాధ తీరేటట్లుగా గోవిందునకు అద్వితీయ కైంకర్యాన్ని ఈ జన్మలో చేయకుండా ఇక పోయి చేసే తపస్సు ఎందుకోసం?) అనే నాచ్చియార్ తిరుమొழి పాశురాన్ని గమనించాలి.

ఈవిధంగా, "మా నుండి కైంకర్యాన్ని స్వీకరించాలి" అని వేడిన గోపికలను చూచి శ్రీకృష్ణుడు, "కన్యకలారా !" అది ఆ విధంగానే జరుగుతుంది. అంతరంగంగా దానిని స్వీకరిస్తాను. మీరు మార్గశీర్షవ్రతానికి ఉపకరణాలుగా అడిగినవానిని ఇస్తాను. తీసికొని వెళ్ళండి" అని అంటూ ఒక పఱైను తీసికొని రాబోయాడు. దానిని చూచిన గోపికలు- 'అయ్యా! మా ఉద్దేశ్యాన్ని గమనించకుండా చేస్తున్నావే, నీవు! మేము **"పఱై"** అని అనడంలోని తాత్పర్యాన్ని వివరిస్తున్నాము. ఆలకించు" అని అంటూ వివరించడం ఆరంభిస్తున్నారు- **"ఇర్ఱై ప్పఱై"** ఇత్యాదిగా. **"ఇన్ఱు+పఱై = ఇర్ఱైప్పఱై"** ఇపుడు నీవు తీసికొని వచ్చి ఇచ్చే పఱైను- అని అర్థం. **"కొళ్వానన్ఱు"** తీసికోవడంకోసం కాదు, మేము ఇక్కడకు వచ్చినది- అని శేషపూరణాన్ని చేయాలి.

"ఎర్ఱైక్కుమ్"- ఎప్పటికైనా - అని అర్థం. **"ఏழ్ఏழ్ పిఱవిక్కుమ్"** (ఏడేడు జన్మలకు)- **"దేవత్వే దేవదేహేయం మనుష్యత్వే చ మానుషీ"** (భగవానుడు - దేవజాతిలో జన్మిస్తే, దేవజాతి దేహాన్ని, మానవుడైనపుడు మానవరూపాన్ని లక్ష్మీదేవి పొందుతున్నది.) అనే క్రమంలో భగవానుని అవతారాలు అన్నిటిలోను వెంట జన్మించే లక్ష్మీదేవివలె, తాముకూడా సమానంగా జన్మించి, కైంకర్యం చేయాలని కోరుతున్నారు. ఆழ్వార్లు అందఱు ఇంచుమించుగా భగవానుని వద్ద వేడినది - జన్మను లేకుండా చేయాలని. **"ఇని ప్పిఱవి యాన్ వేణ్డేన్"** (ఇక జన్మను నేను కోరను) అని, **"ఆదలాల్ పిఱవి వేణ్డేన్"** (అందువల్ల జన్మకోరను) అని ఈ రీతిలోకదా ఆழ్వార్ల శ్రీసూక్తులున్నాయి. ఆణ్డాళ్ ఆ విధంగా పలుకకుండా, **"ఎర్ఱైక్కుమ్ ఏழ్ఏழ్ పిఱవిక్కుమ్"** (ఏనాటికీ, ఏడేడు జన్మలకు) అని అనడంవల్ల అతని అవతారాలు అన్నిటిలో వెంటగా వచ్చి జన్మించే దివ్యదేవేరులలో ఈమె ఒకతె- అనే విషయం తెలుపబడింది, **"ఎర్ఱైక్కుమ్ ఎన్ఱతు తోన్ఱ ప్పిఱన్దు"** ఇత్యాది ఆచార్యహృదయ చూర్ణిక ఇక్కడ అనుసంధేయం.

ఈ పాశురంలో **"మర్ఱై నమ్ కామజ్గళ్ మార్ఱు"** (మా మిగిలిన కోరికలను పోగొట్టు) అనే వాక్యం చాలా సారంగా గ్రహించదగినది. తిరువష్టాక్షరీమహా మంత్రం

లోని మధ్యమపదమైన నమస్సు కాకాక్షిన్యాయంలో దానికి ముందున్న ప్రణవం లోను, తరువాత గల **"నారాయణాయ"** అనే పదంలోను, తనతోను, అన్వయించి మూడు విరోధులను నిరసిస్తున్నది-అని పెద్దలంటారు. దీనిని భట్టర్ అష్టశ్లోకిలోని- **"మంత్రబ్రహ్మణి మధ్యమేన నమసా పుంసః స్వరూపం గతిః"** (అష్టాక్షరిలో మధ్యలో ఉండే నమశ్శబ్దంతో జీవుని స్వరూపం, గతి) ఇత్యాది ద్వితీయ శ్లోకంలో వివరించారు. ముముక్షుప్పడిలో **"నమస్సాలే విరోధియై క్కழிక్కిఱతు"** (నమస్సు విరోధిని తీరుస్తున్నది.) అని పల్కి, **"విరోధితాన్ మూన్ఱు- స్వరూప విరోధియుమ్, ఉపాయవిరోధియుమ్, ప్రాప్యవిరోధియుమ్"** (విరోధి మూడు విధాలు- స్వరూప విరోధి, ఉపాయ విరోధి, ప్రాప్యవిరోధి) అని, ఈ విరోధులు తొలిగిన దశలోని మాట ఏవిధంగా ఉంటుంది? అనే విషయాన్ని తెలియజేసే టపుడు, **"స్వరూపవిరోధి కழிకైయావతు- "యానే నీ ఎన్నుడైమైయుమ్ నీయే- ఎన్ఱిరుక్కై. ఉపాయవిరోధి కழிకైయావతు. 'కళైవాయ్ తున్బమ్ కళైయాదొழிవాయ్ కళైకణ్ మర్ఱిలేన్- ఎన్ఱిరుక్కై. ప్రాప్యవిరోధి కழிకైయావతు- "మర్ఱై నమ్ కామజ్గళ్ మార్ఱు" ఎన్ఱిరుక్కై"** (స్వరూప విరోధి తొలగడం అంటే- నేను నీ వాడను, నా సొత్తు నీదే- అని తలచి ఉండడం. ఉపాయ విరోధి తొలగడం అంటే- నా దుఃఖాలను నీవు తీర్చినా, తీర్చక పోయినా, నీవు తప్ప ఇంకొక రక్షకుడు లేడు- అని తలచి ఉండడం. ప్రాప్యవిరోధి తొలగడం అంటే- మా మిగిలిన కోరికలను అన్నిటినీ లేకుండా చేయాలి- అని తలచి ఉండడం.) అని అనుగ్రహించిన సూక్తి ప్రసిద్ధం. ప్రాప్యవిరోధి తొలగిన దశలోని సూక్తి ఇది- అని సూచింపబడి నట్లయింది. దీనినికొంచెం వివరిస్తాను. ప్రాప్యమంటే ఫలం. ఫలాన్ని అనుభవించే టపుడు ఏర్పడే (ఎదురయ్యే) విరోధులు ఏమి ? అనేదానిని తెలిసికోవాలి. ఫలాన్ని అనుభవించేటపుడు ఆనందం తప్పక కల్గుతుంది. ఈ ఆనందాన్ని తనదిగా భావించడం చాల పెద్ద విరోధి, వెన్నెల, మలయమారుతం, చందనం, పూలు మొదలైనవి, తమకు ఏ ఉపయోగం లేకుండా, ఇతరులకే ఉపయోగపడి, ఇతరులనే ఆనందింపజేస్తున్నాయి. తాము కొంచెంకూడా ఆనందాన్ని పొందడం లేదు. అదే రీతిలో జీవుడు భగవానునకు తాను ఉపయోగపడేటపుడు, దానివల్ల ఆనందపడేవాడు భగవానుడేకదా కావాలి. చేతనలాభం అనేది ఈశ్వరునకే ప్రయోజనం కనుక, ప్రయోజనాన్ని పొందిన వాడేకదా ఆనందించడానికి ప్రాప్తిని కల్గి ఉంటాడు. (యోగ్యత, అవకాశం). అందువల్ల, వెన్నెల, చల్లగాలి, చందనం, పూలు- అని దృష్టాంతాలుగా చూపబడిన వస్తువులు అచేతనాలు కనుక, వాటికి ఆనందం కలిగే అవకాశం లేదు. కాని,

మనం చేతనులం కనుక, చైతన్యం కారణంగా కలుగదగిన ఆనందాన్ని ఏవిధంగా లేకుండా చేసికోగలం? పొందకుండా ఉండడం ఏవిధంగా సాధ్యం? అనే ప్రశ్న కల్గుతుంది. మన కైంకర్యంవల్ల భగవానుడు ఆనందిస్తే, దానిని చూచి మనం ఆనందించడంలో కొఱత లేదు. మనం చేసే కైంకర్యం సాక్షాత్తుగా మన ఆనందానికి హేతువు కారాదు- అనేదే విషయం. ఆళవన్దార్ తమ స్తోత్రరత్నంలో **"కదాఽహమైకాంతికనిత్యకింకరః ప్రహర్షయిష్యామి"** (ఎపుడు నేను ఏకాంతంలో నిత్యమైన కైంకర్యాన్ని చేసేవాడనై సంతోషపెట్ట గలను?) అనే శ్లోకరత్నంతో ఈ తత్త్వార్థాన్ని అనుసంధించారు. ఈ శ్లోకంలో "ప్రహర్షయిష్యామి" అనేది జీవనాడి. ఇందులో - "భగవన్! నీకు నేను కైంకర్యాన్ని చేసి ఎపుడు నేను ఆనందించగలను?'' అని అనకుండా, "నిన్ను ఎపుడు ఆనందింపజేయగలను'' అని పల్కడం **"మఱ్ఱై నమ్ కామఙ్గళ్ మాఱ్ఱు"** (మిగిలిన మా కోరికలను లేకుండా చేయాలి) అనే ఈ సూక్తియొక్క అర్థాన్ని అనుసంధించడమే. వడకట్టిన సత్సంప్రదాయార్థాన్నే ఇది తెల్పుతున్నది.

30. **వఙ్గ క్కడల్ కడైన్ద మాదవనై క్కేశవనై**
త్తిఙ్గళ్ తిరుముకత్తు చ్చేయిఴైయార్ శెన్ఱిఱైఞ్జి
అఙ్గప్పఱై కొణ్డ వాఱ్ఱై అణిపుదువై
ప్పైఙ్గమల త్తణ్దెరియల్ పట్టర్ పిరాన్ కోదై శొన్న
శఙ్గత్తమిఴ్మాలై ముప్పదుమ్ తప్పామే
ఇఙ్గు ఇప్పరిశురైప్పార్ ఈరిరణ్డు మాల్వరైత్తోళ్
శెఙ్గణ్ తిరుముకత్తు చ్చెల్వ త్తిరుమాలాల్
ఎఙ్గుమ్ తిరువరుళ్ పెఱ్ఱు ఇన్బుఱువర్ ఎమ్బావాయ్

మొదటి పాశురంలో, (గోపికలు) కాలాన్ని, అధికారులను, కార్యాన్ని పరిసమాప్తి చేయించే శ్రీకృష్ణుని కీర్తిస్తూ, వ్రతాన్నిగూర్చి ప్రస్తావించారు. రెండవ పాశురంలో- వ్రతానికి అంగాలుగా చేయవలసినవానిని, విడువవలసినవానిని వివరించారు. మూడవ పాశురంలో- మనం భోగ్యంగా నోమునోచేటపుడు, దీనికి అనుమతి ఇచ్చిన లోకులకు ఆనుషంగికంగా వర్షరూపమైన ఫలం సిద్ధిస్తుందని అన్నారు. నాల్గవ పాశురంలో -వర్షదేవత అయిన పర్జన్యుని పిలిచి, లోకంలో అంతటా వర్షాన్ని కురవాలని అతనిని నియమించారు. అయిదవ పాశురంలో - తాము ఆరంభించే

వ్రతానికి ప్రతిబంధకాలైన పాపాలు, భగవానుని మనం నోటితో కీర్తించి, మనస్సుతో చింతిస్తే, అవి తమకు తామే తొలగిపోతాయి - అని నిశ్చయించి, తాము చేయదలచిన కార్యంలో భాగవతగోష్ఠి అంతా అన్వయించాలని కోరారు. ఆఱవ పాశురం నుండి పదిహేనవ పాశురంవరకు గల పది పాశురాలతో తమకు సాటి వచ్చే సమానమైన పరువాన్ని కల్గిన కన్యలను అందఱిని నిద్రలేపి, తరువాత అందఱు కలిసి నందగోపాలుని భవనంలోకి పోయారు. పదహాఱవ పాశురంలో- ద్వారపాలకులను ప్రబోధించి, పదిహేడవ పాశురంలో - నందగోపాలుడు, యశోదాదేవి, శ్రీకృష్ణుడు, బలరాముడు - అనే వీరిని తెలిపే క్రమాలను (సంబంధాలను) విడువకుండా పల్కి, ప్రబోధించారు. పద్దెనిమిదవ పాశురంలో- నీళాదేవిని పలురీతులలో స్తుతించి ప్రబోధించారు. పందొమ్మిదవ పాశురంలోను, ఇరవైయవ పాశురంలోను- శ్రీకృష్ణుని, నీళాదేవిని కలిపి ప్రబోధించారు. ఇరవై ఒకటవ పాశురంలో, ఇరవై రెండవ పాశురంలోను- తాము స్వామి కల్యాణ గుణాలకు జితులై వచ్చి చేరిన రీతిని, తమ అభిమానం భగ్నమై వచ్చిన రీతిని, అతని కటాక్షమే ధారకంగా వచ్చిన క్రమాన్ని శ్రీకృష్ణుని సన్నిధానంలో విన్నపించారు. ఇరవై మూడవ పాశురంలో - మాకోసం బయలుదేరి దివ్యసింహాసనంలో ఆస్థానాన్ని అనుగ్రహించాలని వేడారు. ఇరవై నాల్గవ పాశురంలో- ఆ సన్నివేశానికి మంగళా శాసనం చేశారు. ఇరవై అయిదవ పాశురంలో- తాము ఆర్తులై వచ్చిన విషయాన్ని విన్నపించారు. ఇరవై ఆఱవ పాశురంలో- వ్రతానికి అపేక్షితాలైన ఉపకరణాలు ఇవి- అని పల్కి ప్రార్థించారు. ఇరవై ఏడవ పాశురంలో- వ్రతాన్ని అనుష్ఠించి పూర్తిచేసిన తరువాత పొందగోరిన సంమానాలను అపేక్షించారు. ఇరవై ఎనిమిదవ పాశురంలో -తమ ఉద్దేశ్యంలో ఉన్నవి ఫలించేటట్లుగా తమ నైచ్యాన్ని, అతని పరత్వాన్ని, అతనితో గల సంబంధాన్ని పల్కుతూ తమ దోషాలను క్షమించాలని వేడారు. ఇరవై తొమ్మిదవ పాశురంలో- తమ ఉద్దేశ్యాన్ని ప్రకటంగా పల్కి, ఈ ఉద్దేశ్యాన్ని నీవు తప్పక నెఱవేర్చాలి- అని నిర్బంధిస్తూ ప్రార్థించారు. అపుడు అతడు "ఆవిధంగానే చేస్తాను'' అని తలను ఊగించగా, తమ మనోరథం సఫలమైన రీతిని ప్రాతఃకాలంలో ఆ భావనతోనే, తాము అనుగ్రహించిన ఈ ప్రబంధాన్ని అనుసంధించేవారు భగవానుని కృపకు పాత్రులై ఆనందిస్తారు- అని ప్రబంధపరిసమాప్తిని చేస్తున్న రీతిలో గోదాదేవి పలికే పాశురం, ఈ చివరి పాశురం.

ఆఱాయిరప్పడి వ్యాఖ్యలో - **"సమకాలత్తిలే అనుష్ఠిత్తారోపాదియుమ్, అనన్తర కాలత్తిలే అనుకరిత్తారోపాదియుమ్, పిఱ్పట్ట కాలత్తిల్ కఱ్ఱోర్క్కు ప్పలిక్కుమెన్గై.**

"కన్ఱిళ్ళన్ద తలైనాకు, తోల్కన్ఱై మడుక్క అదుక్కు ఇరఙ్గుమాపోలే, స్నేహికళ్ శొన్న ఇప్పాశురమ్ కొణ్డు పుకవే, అదిల్లాద నమక్కుమ్ ఫలిక్కుమ్- ఎన్ఱు భట్టర్" (సమకాలంలో అనుష్ఠించిన వారివలె (గోపికల వలె), తరువాతి కాలంలో అనుకరించినవారివలె (గోదాదేవి వలె), అనంతరకాలంలో అభ్యసించిన వారికి కూడా ఫలిస్తుందని భావం. దూడను కోల్పోయిన ఆవు, తోలుతో చేసిన దూడను దరికి చేర్చగా, దానిపట్ల దయచూపి పాలను ఇచ్చేటట్లు, స్నేహాన్ని కలవారు పల్కిన ఈ పాశురాలను పల్కుతూ ఆశ్రయిస్తే, అది (స్నేహం) లేని మనకు కూడా ఫలిస్తుంది- అని భట్టర్ అనేవారు.) అని అనుగ్రహింపబడింది.

ఈ పాశురంతో ఈ దివ్యప్రబంధాన్ని అనుసంధించినవారికి కలిగే ఫలం తెలుపబడి పూర్తి చేయబడుతున్నది. పూర్వం **"ఓఙ్గి ఉలకళన్ద"** పాశురంలో, **"తీఙ్గిన్ఱి నాడెల్లామ్ తిఙ్గళ్ ముమ్మారి పెయ్తు నీఙ్గాద శెల్వమ్ నిఱైన్దు"** (ఏ చెడ్డ లేకుండా లోకం అంతా నెలకు మూడుమార్లు వర్షం కురిసి, తరగని సంపద నిండి) అని ఫలాన్ని పల్కడం ద్వారా గోపికలు తాము అనుష్ఠించే వ్రతంవల్ల కలిగే ప్రయోజనాన్ని గూర్చి తెలిపారు. ఈ పాశురం - ఈ తిరుప్పావై అధ్యయనం చేసేవారికి కలిగే ప్రయోజనాన్ని తెల్పుతున్నది. గీతాచార్యుడు గీతలో **"కర్మణ్యేవాధికారస్తే మా ఫలేషు కదాచన"** (నీకు కర్మాచరణలోనే అధికారం ఉన్నది. ప్రయోజనాలలో మాత్రం ఎపుడూ లేదు) అని అంటూ ఏ ఫలాన్ని ఆశించరాదని చెప్పగా, ఇక్కడ ఫలాన్నిగూర్చి పల్కడం తగునా? అని శంకించనక్కఱలేదు. ఫలాన్ని ఆశించకూడదని పల్కిన భగవానునకు- చేసే కార్యం నిష్ఫలమై పోతుందనే అభిప్రాయం కాదుకదా! మనంగా ఏ ఫలాన్ని అయినా కోరితే, క్షుద్రఫలాన్ని ఆశిస్తాము. గొప్ప ఫలాన్ని కోరడం మనకు తెలియదు. అందువల్లనే "ఫలాన్ని నీవు కోరకు'' అని భగవానుడు అన్నాడు. ఇక్కడ తెలుపబడే ఫలం ఎటువంటిది? అనే విషయాన్ని గమనించాలి. **"శెఙ్గణ్ తిరుముకత్తు చ్చెల్వత్తిరుమాలాల్ ఎఙ్గుమ్ తిరువరుళ్ పెఱ్ఱు ఇన్బుఱువర్"** (ఎఱ్ఱని కన్నులను, అందమైన ముఖాన్ని కలవాడైన శ్రియఃపతిచేత అంతట అనుగ్రహింపబడి ఆనందిస్తారు) అని దివ్యదంపతుల దివ్యకృపాలాభమే కదా ఫలంగా చెప్పబడింది. ఇది సాక్షాత్తు పిరాట్టియే అనుగ్రహించిన పాశురమైనందున, తిరుప్పావై అనుసంధానంవల్ల ఉభయవిభూతులలోను మనకు ఆనందం కల్గడం నిస్సందేహం - అని గ్రహించడం యుక్తం. నిగమనపాశురాలలో తమ తిరునామాలను అంకితం చేసినవారు - నమ్మాళ్వార్లు, మధురకవులు, కులశేఖరాళ్వార్లు,

పెరియాళ్వార్లు- అణ్డాళ్, తొణ్డరడిప్పొడి ఆళ్వార్లు, తిరుమఙ్గై ఆళ్వార్లు- అనే వీరే. పొయ్కైయార్, పూదత్తార్, పేయార్, తిరుమళిశై ప్పిరాన్, నఙ్జీయన్ -అనే ఈ అయిదుగురు తమ తిరునామాలను అంకితం చేయలేదు. అంకితం చేసిన ఆళ్వార్లు తమ తిరునామాలను మాత్రమే ఉట్టంకించడం కన్పిస్తుంది. **"కురుకూర్ శడకోపన్ శొన్న"** (కురుకూర్లోని శఠకోపులు పల్కిన), **"మధురకవి శొన్న శొల్"** (మధుకవులు పల్కిన), **"కులశేకరన్ శొన్న"** (కులశేఖరులు పల్కిన); **"విట్టుశిత్తన్ విరిత్త"** (విష్ణుచిత్తులు వివరించిన), **"తొణ్డరడిప్పొడి శొల్"** (తొండరడిప్పొడి పల్కిన), అనియే కదా ఉన్నది. కాని, ఆణ్డాళ్ తననుగూర్చి పలికేటపుడు నియతంగా **"పట్టర్పిరాన్ కోతై"** (భట్టనాథుల గోద) అనియే పలికింది. ఇది తిరుప్పావైలో మాత్రమేకాదు. తరువాత, నాచ్చియార్ తిరుమొళిలో కూడా ప్రతిదశకంలోను దీనిని గమనించవచ్చు. అటువంటి నిర్బంధాన్ని గోదాదేవి ఎందుకోసం పెట్టుకొన్నది?- అని అంటే, **"కొలై యరక్కియై మూక్కరిన్దిట్ట కుమరనార్ శొల్లుమ్ పొయ్యానాల్, నానుమ్ పిఱన్దమై పొయ్యన్డే"** (హింసా ప్రవృత్తిని కల రక్కసి శూర్పణఖ ముక్కును ఖండించిన అందగాడైన శ్రీరాముని పలికే మాట అసత్యమైనా, నా జన్మ అసత్యం కాదు) అని, **"విల్లిపుదువై విట్టు శిత్తర్ తఙ్గళ్ తేవరై వల్లపరిశు వరువిప్పరేల్ అదు కాణ్డుమే"** (శ్రీవిల్లిపుత్తూర్లోని విష్ణుచిత్తులు తమ దైవాన్ని తగిన ఉపాయంతో రప్పిస్తే, అపుడు దర్శించగలము.) అని ఈమే స్వయంగా పల్కినందువల్ల, **"ఆచార్యునివల్లనే పరమపురుషార్థం"** అనే నిశ్చయాన్ని కల్గినది ఈమె- అనే విషయం చక్కగా ప్రకాశిస్తున్నది. ఈ నిశ్చయాన్ని లోకానికి అంతటికీ తెలుపడం కోసమే **"పట్టర్ పిరాన్ కోదై", "విట్టుశిత్తన్ కోతై", "పుదువైయర్ కోన్ కోదై"** అని ఈ రీతిలో ఆచార్యపురస్కారంగానే తనను నిర్దేశించుకొన్నది- అని గ్రహించాలి. దానినిబట్టియే తిరుప్పావైలోని స్వాపదేశం ఆచార్యపరంగానే నిర్వహింపబడింది. కట్టలు తెంచుకొని ప్రవహించే కావేరివలె, మహాప్రవాహమై ఉండే ఆ స్వాపదేశార్థాలు చాలా సూక్ష్మంగా తెలుపబడ్డాయి. అంతే.

ఇపుడు గోపికలు సముద్రాన్ని చిలికిన వృత్తాంతాన్ని ప్రస్తావించడంలోని పరమార్థం ఏమంటే - తమకు ఆశ్రయణీయుడు శ్రీకృష్ణుడే కనుక, ఆ ఆశ్రయణం ఫలపర్యంతం కావడం పిరాట్టి సంబంధంవల్లనే కనుక, ఆ లక్ష్మిని పొందడంకోసం అతడు చేసిన వ్యాపారం అమృతమథనం కనుక, దానిని ప్రస్తావిస్తున్నారు. లేక, "ప్రయోజనాంతరపరులైన దేవతలకోసం తన శరీరం నొప్పి పుట్టేటట్లు అయినా

శ్రమపడి కార్యాన్ని సఫలం చేసినవాడు అనన్యప్రయోజనులైన మన మనోరథాన్ని పూర్తిచేయకుండా ఉండడు'' అనే విషయాన్ని తెలుపడంకోసం కావచ్చు.

ఆశ్రయించిన ఆధికారుల వైలక్షణ్యం తెలుపబడుతున్నది- రెండవ పాదంలో. **"తిజ్గళ్ తిరుముకత్తు"** (చంద్రుని వంటి అందమైన ముఖాన్ని కల్గిన) అని అంటూ వారి సకలకళాపూర్తి, **"శేయి*ఝై*యార్"** - అని జ్ఞానం - విరక్తి అనే భూషణాలను వారు కల్గి ఉండడం తెలుపబడ్డాయి.

(అప్పఱై కొణ్డ వా*ఱ్ఱై*) - **"పఱై కొణ్డ అవ్వా*ఱ్ఱై*"**- **"పఱై"** కు ముందున్న అకరచ్చుట్టు (హ్రస్వ అకారం) **"అ*ఱ్ఱై*"** అనే దానితో కలిపి వివరింపబడింది. లేక, **"అప్పఱై"**- లోకులకోసం చెప్పిన **"పఱై"**ను తొలగించి, **"ఎ*ఱ్ఱై*క్కుమ్ ఏ*ఝేఝ్* పిఱవిక్కుమ్ ఉన్దన్నోడు*ఱ్ఱో*మే యావోమ్"** (ఏనాటికి అయినా, ఏడేడు జన్మలకైనా నీతోనే సంబంధాన్ని కల్గినవారం కాగలము.) అని పల్కిన **"పఱై"**- అని వివరించవచ్చు.

బంగారం, ముత్యాలు, మాణిక్యాలు కలిపి చేసిన ఆభరణంవలె, గోదాదేవి, పెరియా*ఝ్వా*ర్లు, వడపెరుఙ్కోయిలుడైయాన్ (వటపత్రశాయిస్వామి) ఉండే దేశం కనుక, **"అణి పుదువై"** అని చెప్పబడింది.

(పైఙ్కమలత్తణ్తెరియల్) -బ్రాహ్మణులు తామరపూసల మాలను అలంకరించుకోవాలని (శాస్త్రాలలో) విధింపబడడం స్మరించాలి.

(పట్టర్పిరాన్)- బ్రాహ్మణులకు ఉపకారకులైన. పెరియా*ఝ్వా*ర్లు వేదార్థాలను రాజసభలో ఉపన్యసించి, పరతత్త్వనిర్ణయాన్ని చేసినవారు కనుక, వేదాలను సంపదగా కల్గిన బ్రాహ్మణులకు ఉపకారకులయ్యారు. లేక, **"మఱై నాన్గు మున్నోదియ పట్టనై"** (నాల్గు వేదాలను పూర్వం పల్కిన భట్టుని) అని తిరుమఙ్గైయా*ఝ్వా*ర్లు భగవానుని **"పట్టన్" (భట్టః)** అని పల్కినందున, పెరియా*ఝ్వా*ర్ తమ కుమార్తె అయిన గోదాదేవిని భగవానునకు పరిణయం చేసి, ఉపకరించినందున, ఈ కారణాలనుబట్టి **"పట్టర్పిరాన్"** అని చెప్పబడ్డారని అనడం కూడా తగును. భగవానునకు కూడా ఉపకారకులని భావం.

(కోదై)- ఇది **"గోదా"** అనే సంస్కృతశబ్దవికృతి. శ్రీసూక్తులను అనుగ్రహించినది- అని అర్థం.

(శొన్న)- గోపికల దశను పొంది పల్కిన- అని అర్థం.

(శఙ్గత్తమి*ఝ్* మాలై) - **"శఙ్గమ్"**- ఇది సంఘమనే సంస్కృతపదవికృతి. సమూహమని అర్థం. **"శఙ్గమిరుప్పార్ పోల్ వన్దు తలైప్పెయ్దోమ్"** (గుంపులై చేరే రీతిలో వచ్చి ఆశ్రయించాము) అనే రీతిలో అయిదు లక్షల ఇళ్ళలోని గోపికలు కలిసి అనుభవించినట్లుగా, గుంపులు గుంపులుగా కలిసి ఆనందించడం తగును- అని తాత్పర్యం.

(తప్పామే)- ముప్పై పాశురాలలో ఏ పాశురం తప్పకుండా- అని అర్థం. వెలలేని మాణిక్యాలతో చేసిన ఏకావళీహారంలో ఒక మణి జారినా దానికి లోటు కదా!

(ఇప్పరిశురైప్పార్) - రేపల్లెలో గోపికలకు శ్రీకృష్ణుడు సమకాలీనుడు కనుక, శ్రీకృష్ణసాక్షాత్కారం కల్గింది. ఈ సాక్షాత్కారాన్ని తరువాత కాలంలోని గోదాదేవి అనుకరించి పొందింది. ఆమెకు తరువాతి కాలంలోని వారు కూడా ఆ ఫలాన్ని పొందాలి అంటే- ఈ పాశురాల ఉక్తి - (అనుసంధానం) మాత్రమే చాలు - అని భావం.

ఈ పాశురంలో మొదటి రెండు పాదాలకు మాత్రమే స్వాపదేశార్థం వివక్షితం. దానిని వినండి.

(వఙ్గక్కడల్ కడైన్ద) - సంస్కృతవేదసాగరం, ద్రావిడవేదసాగరం- అనే సముద్రాలను చిలికినవారు ఆచార్యులు. ఇక్కడ- **"మఱై ప్పాఱ్కడలై తిరునావిన్ మన్దరత్తాల్ కడైన్దు, తుఱైప్పాల్ పడుత్తి త్తమి*ఝా*యిరత్తిన్ శువైయమి*ఝ్*తమ్, కఱైప్పావ్బణై ప్పళ్ళియాన్ నన్బరీట్టమ్ కళిత్తిరున్ద నిఱైప్పాన్ క*ఝ*లన్టి శన్మవిడాయ్క్కు ని*ఝ*లిల్లైయే"** (వేదాలనే క్షీరాబ్ధిని జిహ్వ అనే మందరంతో చిలికి, వడగట్టి, ద్రావిడ సహస్రంలోని మాధుర్యాన్ని చిహ్నాలను కల ఆదిశేషునిపై శయనించిన వాని భక్తుల సమూహంతో కలసి అనుభవించే ఆచార్యుని శ్రీచరణాలు తప్ప వేఱొక నీడ జన్మవల్ల కల్గిన ఆర్తిని తీర్చగల్గినది లేదు.) అనే పిళ్ళైప్పెరుమాళ్ అయ్యంగార్ పాశురం స్మరణీయం.

(మాతవనై) - మహాతపస్వి- అని అర్థం.

(కేశవనై) - జితేంద్రియుడని అర్థం. ఇటువంటి ఆచార్యుని సేవించిన వారెవరు? అంటే-

(తిజ్గళ్ తిరుముకత్తు చ్చేయిழைయార్) - ఆచార్యసాన్నిధ్యంలో గ్రహింపబడిన తాపహారకాలైన అర్థాలవల్ల సౌమ్యమైన ముఖాలను కలవారై, ఆత్మభూషణాలనే ఆభరణాలతో భూషితులై ఉండేవారు. గోపికలు శ్రీకృష్ణునివల్ల ప్రాప్యాన్ని పొందినట్లుగా, శిష్యులు ఆచార్యసన్నిధిలో ప్రాప్యాన్ని పొందినవారు- అని భావం.

"విడివోజే ఎழுన్దిరున్దు ముప్పదు పాట్టైయుమ్ అనుసంధిత్తల్; మాట్టిర్రిల నాకిల్, శిற్றమ్ శిఱుకాలే"- ఎన్గిఱ పాట్టై అనుసంధిత్తల్; అదువుమ్ మాట్టిర్రిల నాకిల్ నామ్ ఇరున్ద ఇరుప్పై నినైప్పదు" (ప్రాతఃకాలంలో లేచి ముప్పై పాశురాలను అనుసంధించాలి, అది సాధ్యం కాకపోతే, "శిற்றమ్ శిఱుకాలే" అనే పాశురాన్ని అనుసంధించాలి, అదికూడా వీలు కాకపోతే, మేమున్న స్థితిని అనుసంధించాలి.) అని భట్టర్ అనుగ్రహించేవారు. "నామ్ ఇరున్ద ఇరుప్పై" అంటే- మేము ఈ ప్రబంధాన్ని అనుసంధించి అభినివేశాన్ని పొందిన స్థితిని - అని భావం.

ఈ విధంగా గోదాదేవి ఈ పాశురంతో. అధ్యయనం చేసినవారికి కలిగే ఫలాన్ని పల్కి నిగమించారు. ఈ ప్రబంధంయొక్క ఫలాన్ని పలికే ఈ పాశురాన్ని- "తిరునామప్పాట్టు" అని, "ఫలశ్రుతి" అని చెప్పడం తగును. ద్రావిడభాషలో ఇది "తర్చిఱప్పుప్పాయిరమ్" అని అనబడుతుంది. ఇందులో ఆణ్డాళ్ తనను ఇతరుల వలె నిర్దేశించి పల్కినది. ఇది ఒక విధమైన కవిసమయం. కనుక ఆత్మకీర్తనం కాబోదు.

ఈ తిరుప్పావై ముప్పై పాశురాలు - ఎనిమిది పాదాలను కల "నాచ్చేరొరు వికఱ్పుక్కొచ్చక క్కలిప్పా" వృత్తంలో కూర్చబడ్డాయి.

తిరుప్పావైలో దివ్యదేశానుభవం

1. "మార్గழி త్తిజ్గళ్" అనే తిరుప్పావై ప్రబంధంలోని మొదటి పాశురంలో "పరమ పద"మనబడే దివ్యదేశం అనుభవింపబడింది. ఈ పాశురంలో "నారాయణనే" అనే ప్రయోగం ముఖ్యమైనది. "తమసః పరమో ధాతా శంఖచక్రగదాధరః, మానుషం వపు రాస్థాయ విష్ణుః సత్యపరాక్రమః" (రజస్తమస్సులకు అతీతుడు, జగత్తుకు తండ్రి, శంఖం, చక్రం, గదలను ధరించినవాడు, సత్యమైన పరాక్రమాన్ని కలవాడైన విష్ణువు మానవరూపాన్ని ధరించి, శ్రీరాముడై అవతరించాడు.) అని మండోదరిచేత పరమపదనిలయుడైన నారాయణుడుగా కీర్తింపబడ్డ శ్రీరాముడు శంఖచక్రగదాధరుడుగా ఆమె మనస్సులోపల సాక్షాత్కారాన్ని అనుగ్రహించాడు; అంతే. ఆ స్వామియే శ్రీకృష్ణుడుగా అవతరించినపుడు "జాతోఽసి దేవదేవేశ ! శంఖచక్రగదాధర !" (నిత్యసూరినాథా! శంఖం, చక్రం, గదలనే ఆయుధాలను ధరించేవాడా! నీవు అవతరించావు) అనే రీతిలో పరమపదనాథుడే శంఖంతో, చక్రంతో, చిఱునవ్వుతో కూడిన ముఖంతో అవతరించినందున, "నారాయణనే" అనే ప్రయోగంలో పరమపదనాథుని అనుభవం చక్కగా సమన్వయిస్తుంది.

2. "వైయత్తు వాழ்వీర్కాళ్ !" అనే రెండవ పాశురంలో "తిరుప్పాఱ్కడల్" అనే దివ్యదేశం అనుభవింపబడింది. ఈ పాశురంలో "పాఱ్కడలుళ్ పైయత్తుయిన్ద పరమన్" (క్షీరాబ్ధిలో ఆదిశేషశయనంపై యోగనిద్రలో తూగే పరమాత్మ) అనే ప్రయోగం ప్రాణస్థానీయం. క్షీరాబ్ధి అవతారకందమనబడుతుంది. "ఏష నారాయణః శ్రీమాన్ క్షీరార్ణవనికేతనః, నాగపర్యంక ముత్సృజ్య హ్యాగతో మధురాం పురీమ్" (శ్రియఃపతి, క్షీరాబ్ధిని నివాసంగా కలవాడైన ఈ నారాయణుడు ఆదిశేష శయనాన్ని వీడి మధురానగరానికి వచ్చాడు కదా!) అనే ప్రమాణం ప్రసిద్ధం. క్షీరాబ్ధినుండే ఉత్తరమధురానగరానికి వచ్చి, శ్రీకృష్ణుడుగా భగవానుడు అవతరించాడు. అందువల్లనే గోదాదేవి "కణ్ణపిరానడి పాడి" (శ్రీకృష్ణుని శ్రీచరణాలను గూర్చి కీర్తించి) అని పలుకవలసిన సందర్భంలో "పాఱ్కడలుళ్ పైయ త్తుయిన్ద పరమనడి పాడి" (క్షీరాబ్ధిలో ఆదిశేషునిపై తూగే పరమాత్మ శ్రీచరణాలను పాడి) అని అన్నది. శ్రీకృష్ణుని గూర్చియే తమ మనస్సులో భావించిన పెరియాழ்వార్ "అరవత్త మళియినోడుమ్ అழకియ పాఱ్కడలోడుమ్.... పరవైత్తిరై పల మోద" (5-2 10) (ఆదిశేషుడనే పడుకతోను, అలలతో కూడిన అందమైన క్షీరాబ్ధితోను) తమ అంతరంగంలో శయనించి ఆస్వామి ఉన్నట్లు పలికారు. ఆసూక్తి కూడా ప్రకృతంలో అనుసంధేయం.

3. “ఓజ్గి ఉలకళన్ద” అనే మూడవ పాశురంలో “తిరుక్కోవలూర్” -అనే దివ్యదేశం అనుభవింపబడింది. ఈ పాశురం ఆరంభింపబడినపుడే **“ఓజ్గి ఉలకళన్ద ఉత్తమన్”** (ఉన్నతంగా పెరిగి లోకాలను కొలిచిన ఉత్తముడు) అని అంటూ త్రివిక్రమవృత్తాంతం ప్రస్తావింపబడింది. భగవానుడు లోకాలను కొలిచిన త్రివిక్రమమూర్తిగా పలు దివ్యదేశాలలో వేంచేసి ఉన్నా, వాటిలో తిరుక్కోవలూర్‌నే శ్రీవైష్ణవులు ముఖ్యంగా పరిగణిస్తారు. ముదలాళ్వార్లు ముగ్గురు కలిసిన ఈ క్షేత్రంలోని త్రివిక్రముని దర్శనం అత్యద్భుతం. తిరుమజ్తైయాళ్వార్ తిరునెడున్దాణ్డక ప్రబంధంలో **“మన్దిరత్తై మన్దిరత్తాల్ మఱవాదొన్ఱుమ్ వాళుతియేల్” (4)** (తిరుమంత్రంలో పరమంత్రమైన సర్వేశ్వరుని నిరంతరం అనుసంధిస్తే) అని అంటూ అష్టాక్షరీమహామంత్రప్రస్తావం చేసినవెంటనే, దాని ముఖ్యార్థమైన వ్యాప్తినిగూర్చి పలకాలని తలచి, దానిని అయిదవపాశురంలో త్రివిక్రమవృత్తాంతం ద్వారా నిరూపించి, తదనంతర పాశురంలో **“పులమ్ పరన్దు పొన్ విళైక్కుమ్ పొయ్‌కైవేలి ప్పూమ్‌కోవలూర్ తొళుతుమ్ పోదు నెజ్జే !”** (సస్యక్షేత్రాలు వ్యాపించి, బంగారును కొట్టుకొనివచ్చే నీటి ప్రదేశాలను చుట్టూ కల తిరుక్కోవలూర్‌ను, ఓ మనసా! నమస్కరిద్దాం, రా) అని తిరుక్కోవలూర్‌లోనే తమ మనస్సు అభినిష్టమైనట్లు పల్కినందున, ఆళ్వార్లను కీర్తించే కులంలో పుట్టినవారికి లోకాలను కొలిచిన ఉత్తముడైన త్రివిక్రముని తలచినపుడే తిరుక్కోవలూర్ అనుభవమ్ వెనువెంటనే లభిస్తుంది.

4. **“ఆళిమళైక్కణ్ణా!”** అనే నాల్గవ పాశురంలో “తిరువనంతపుర”మనే దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. ఈ పాశురంలో **“పాళియమ్ తోళుడై ప్పఱ్పనాబన్”** అనే చోట అనంతపద్మనాభుని అనుభవించడం యుక్తం. ఇందులో **“వాళ ఉలకినిల్ పెయ్‌దిడాయ్”** (లోకంలో, అందఱు ఉజ్జీవించేటట్లు వర్షించాలి) అని అంటూ లోకం ఉజ్జీవించేటట్లుగా వర్షించాలని పలుకబడింది. లోకం ఉజ్జీవించడం అంటే- కష్టాలన్నీ తీరడమే కదా! అనంతపద్మనాభుని అనుభవించిన వారు నమ్మాళ్వార్లు ఒక్కరే. వారు ఆస్వామిని గూర్చిన పాశురాన్ని ఆరంభించినపుడే “కెడు మిడరాయ ఎల్లామ్” (10-2-1) (కష్టాలన్నీ తీరిపోతాయి) అని, **“ఎళువైయుమ్ ఏదమ్ శారా” (10-2-2)** (దుఃఖాలు ఎపుడూ కలగవు) అని, **“తీరుమ్ నోయ్ వినైకళ్ ఎల్లామ్” (10-2-2)** (వ్యాధులు, కర్మలు అన్నీ తీరిపోతాయి) అని అన్నారు. ఈ విధంగా మనం ఉజ్జీవించే రీతులనుగూర్చి పల్కినందువల్ల “లోకం అంతా ఉజ్జీవించేట్లుగా వర్షించాలి”. అని ప్రార్థించే ఈ పాశురంలో కష్టాలను

అన్నీటినీ తీర్చి, ఉజ్జీవింపజేయడంకోసం ఆవిర్భవించిన అనంతపద్మనాభుని అనుసంధించడం తగినది.

5. “మాయనై మన్ను” అనే అయిదవ పాశురంలో “ఉత్తర మధురా” క్షేత్రానుభవాన్ని దర్శించవచ్చు. ఈ పాశురంలో **“వడమదురైమైన్దనై”** (ఉత్తరమధుర లోని బలశాలిని) అంటూ కంఠోక్తిగానే ఉత్తరమధురాక్షేత్రప్రస్తావన కన్పిస్తుంది. ఈ ఉత్తరమధురాక్షేత్రం విభవావతారాలకు చెందిన క్షేత్రమేకాక, అర్చామూర్తికి చెందిన దివ్యదేశంగాకూడా గ్రహించదగి ఉన్నది. ఏవిధంగా ? అంటే- నమ్మాళ్వార్లు తిరువాయ్‌మొళిలో తొమ్మిదవ శతకంలోని మొదటి దశకం పూర్తిగా **“వడమదురై ప్పిఱన్దవనై”** (మధురలో అవతరించిన వానిని) గూర్చి పల్కడంవల్ల, విభవంతోపాటు అర్చావతారం కూడా కలసిన అనుభవంగా దానిని గ్రహించవచ్చు. ప్రకృతంలో **“మధురా నామ నగరీ పుణ్యా పాపహరీ శుభా, యస్యాం జాతో జగన్నాథః”** (మధుర అనే నగరం పవిత్రమైనది, పాపాలను హరించేది, మంగళకరమైనది. ఈ నగరంలో జగన్నాథుడు అవతరించాడు.) అనే పౌరాణిక సూక్తిభావాన్నికూడా గ్రహించి, ఆనందించడం యుక్తం.

6. **“పుళ్ళుమ్ శిలమ్బిన కాణ్”** అనే ఆఱవ పాశురంలో **“తిరువణ్ వణ్డూర్”** అనే దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. ఈపాశురంలో **“వెళ్ళై విళిశజ్గిన్ పేరరమ్ కేట్టిలైయో !”** (తెల్లని, ధ్వనించే శంఖం యొక్క గొప్పశబ్దాన్ని వినలేదా !) అనే పద సందర్భాన్ని ప్రాణస్థానీయంగా గ్రహించాలి. తిరువణ్‌వణ్డూర్ దివ్యక్షేత్రాన్ని పాడినవారు నమ్మాళ్వార్లు ఒక్కరే. **“వైకల్ పూమ్ కళివాయ్” (6-1)** అనే దశకంలోమాత్రమే ఈ క్షేత్రం ప్రస్తుతింపబడింది. ఇందులో **“అలర్‌మేల్ - అశైయుమ్ అన్నజ్గాళ్” (6-1-9)** (పూలపై కదలాడే హంసలారా !) అని హంసపక్షులను సంబోధించి, తిరువణ్‌వణ్డూర్ క్షేత్రానికి చెందిన చిహ్నాన్నిగూర్చి పలికేటపుడు, **“విడివై శజ్గొలిక్కుమ్ తిరువణ్ వణ్డూర్” (6-1-9)** (ప్రాతఃకాలంలో శంఖం ధ్వనించే తిరువణ్‌వణ్డూర్) అని అంటూ శంఖంయొక్క గొప్ప ధ్వనియే గుర్తుగా ఆళ్వార్లు పలికారు. శంఖం ప్రణవాకారంలో ఉంటుంది. అకార-ఉకార-మకారాలు కలిస్తే **“ఓమ్”** అనే ప్రణవంగా రూపొందుతుంది. తిరువణ్‌వణ్డూర్ దశకంలో **“అడికళ్ కైతొళుతు” (6-1-9)** (శ్రీపాదాలపై అంజలి చేసి) అనే పాశురంలో అకారాన్ని పురస్కరించుకొని, **“ఉణర్‌త్తలూడుణర్న్దు”** అనే పాశురంలో ఉకారాన్ని పురస్కరించుకొని, **“మిన్‌కొళ్ శేర్ పూరినూల్” (6-1-11)** (మెఱుపువలె మెఱిసే యజ్ఞోపవీతం) అనే పాశురంలో మకారాన్ని పురస్కరించుకొని పల్కిన

రీతిలో, ఈ పాశురంలో కూడా **"అరియెన్ఱ పేరరవమ్"** ("హరిః"- అనే గొప్ప ధ్వనిని), **"ఉళ్ళమ్ పుకున్దు"**, **"మునివర్కళుమ్"** అనే ప్రయోగాలలో అకార-ఉకార-మకారాలను చేర్చి పల్కిన రీతిని గమనించాలి. అక్షరక్రమసామ్యాన్ని మాత్రమేకాక, అర్థతః సామ్యాన్నికూడా ఈ రెండిటిలోను మేథావులు గమనించగలరు.

7. **"కీశు కీశు"** అనే ఆఱవ పాశురంలో **"తిరువాయ్ప్పాడి"** (రేపల్లె) అనే దివ్యదేశానుభవం గమనించదగినది. ఇతఃపూర్వమే తిరువాయ్ప్పాడి దివ్యదేశాన్ని కీర్తించిన మహనీయులొకరు **"ఉద్గాయతీనా మరవిందలోచనం వ్రజాంగనానాం దివ మస్పృశద్ధ్వనిః, దధ్నశ్చ నిర్మంథనశబ్దమిశ్రితో నిరస్యతే యేన దిశా మమఙ్గళమ్"** (రేపల్లెలోని స్త్రీలు పెరుగు చిలుకుతూ అరవిందలోచనుడైన శ్రీకృష్ణుని గొంతెత్తి ఉచ్చైః స్వరంతో గానం చేస్తున్నారు. వారు పెరుగు చిలికేటప్పుడు పుట్టిన చప్పుడుతో కూడిన ఆగానధ్వని ఆకాశాన్ని అంటింది. ఆ ధ్వని దిక్కులలోని అశుభాలను పోగొట్టింది.) అని అన్నారు. సుప్రసిద్ధమైన ఈ శ్లోకంలో గొల్లవనితల పాటల ధ్వని, కవ్వంతో పెరుగు చిలికినపుడు పుట్టిన ధ్వని, **"దధ్నశ్చ"** అనే ప్రయోగంలోని అనుక్తసముచ్చయపరమైన చకారం ద్వారా పెరుగును చిలికే వనితల ఆభరణధ్వని - అనే ఈ ధ్వనులు మూడు తెలుపబడ్డాయి. ఆధ్వనులే ఈపాశురంలో కూడా ప్రస్తావింపబడడాన్ని గమనించవచ్చు. **"కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప క్కై పేర్త్తు వాశ నఱుమ్ కుழలాయ్చ్చియర్ మత్తినాల్ ఓశైపడుత్త తయిరరవమ్ కేట్టిలైయో? నాయకప్పెణ్ పిళ్ళాయ్! నారాయణన్ మూర్త్తి కేశవనై ప్పాడవుమ్"** అనే పాశురంలోని సూక్తిలో **"కాశుమ్ పిఱప్పుమ్ కలకలప్ప"** అని అంటూ గొల్లవనితల ఆభరణధ్వని, **"తయిరరవమ్"** (పెరుగు చిలికే చప్పుడు) అని పెరుగు చిలికే ధ్వని, **"కేశవనై ప్పాడవుమ్"** (కేశవుని పాడడాన్ని) అని పాటల ధ్వని- అనే ఈ మూడు ధ్వనులు ప్రస్తావింపబడ్డాయి కదా!

8. **"కీழ్ వానమ్"** అనే ఎనిమిదవ పాశురంలో **"తిరువత్తియూర్"** (హస్తిగిరి) అనే దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. **"తిరువత్తియూర్"**- అంటే శ్రీహస్తిశైలం. ఈ పాశురంలో **"దేవాదిదేవనై శెన్ఱు నామ్ శేవిత్తాల్"** (దేవాధిదేవుని వద్దకు పోయి మనం అతనిని సేవిస్తే) అనేది ముఖ్యమైన సూక్తి. **"దేవాధిదేవు"**డంటే హస్తిగిరి నాథుడే కదా! తిరుప్పావైలో **"పుళ్ళుమ్ శిలమ్బిన కాణ్"** అనే ఆఱవ పాశురం నుండి ఆరంభించి పది పాశురాలలో ఆழ్వార్లు పదిమంది ప్రబోధింపబడిన క్రమాన్ని నిర్వహించేటపుడు, ఈ పాశురంలో నమ్మాழ్వార్లు ప్రబోధింపబడినట్లుగా విస్తృతంగా నిరూపింపబడింది. ఆ నమ్మాழ్వార్లు తిరువిరుత్తమనే తమ మొదటి

ప్రబంధాన్ని **"ఇమైయోర్ తలైవా"(1)** (నిత్యసూరినాథా) అని ఆరంభించినట్లే, తిరువాయ్మొழి అనే చరమప్రబంధాన్ని **"అయర్వఱు అమరర్కళదిపతి" (1-1-1)** (భ్రమ విప్రలంభాది దోషాలులేని జ్ఞానాన్ని కల నిత్యసూరులకు నాథుడు) అని ఆరంభించి శ్రీహస్తిగిరినాథుని గూర్చియే పలికారు- అనే విశదమైన, విలక్షణమైన అనుభవాన్ని ఆస్వాదించవచ్చు.

9. **"తూమణి మాడత్తు"** అనే తొమ్మిదవ పాశురంలో **"తిరుక్కడికై"** (శ్రీఘటికాచలమ్) అనే దివ్యదేశానుభవాన్ని చూడవచ్చు. **"తిరుక్కడికై"** అనే దివ్యదేశం ఘటికాచలమనబడే చోళసింహపురం. ఈ క్షేత్రాన్ని కీర్తించే తిరుమఙ్గైయాழ్వార్, **"మిక్కానై" (8-9-4)** అనే పాశురంలో **"మఱైయాయ్ విరిన్ద విళక్కై"** (వేదంగా విస్తరించిన దీపం వంటివానిని) అని అంటూ భగవానుని దీపంగా కీర్తించారు. కుండలో పెట్టిన దీపం, కొండపై పెట్టిన దీపం (**"కుడత్తిలిట్ట దీపమ్, కున్ఱత్తిల్ ఇట్ట దీపమ్"**) అని ఆచార్యులు (దీపాలను) రెండు విధాలుగా పల్కుతారు. కుండలోపెట్టిన దీపం ప్రకాశించదు. కొండపై పెట్టిన దీపం తాను వెలుగుతూ తన చుట్టూ ప్రకాశాన్ని ప్రసరింపజేస్తుంది. ఈపాశురంలో **"తూమణి మాడత్తు శుఱ్ఱుమ్ విళక్కెరియ"** (శుద్ధమైన మణులు పొదిగిన మేడలో చుట్టూ దీపాలు ప్రకాశించగా) అని ఉన్నందువల్ల ఘటికాద్రి అనే విశాలమైన పర్వతంపై ఔన్నత్యాన్ని కల్గిన వేదమై ప్రకాశించే స్వామిని దీపంగా గ్రహించి అనుభవించిన పాశురం ఇది.

10. **"నోఱ్ఱు చ్చువర్క్కమ్"** అనే పదవ పాశురంలో **"తిరుక్కాట్కరై"** అనే దివ్యదేశం అనుభవింపబడింది. అధికారులు సిద్ధోపాయనిష్ఠులని, సాధ్యోపాయ నిష్ఠులని రెండు విధాలుగా వ్యవహరింపబడతారు. **"నాయమాత్మా"** ఇత్యాది శ్రుతిలో- **"యమేవైష వృణుతే తేన లభ్యః"** (భగవానుడు ఎవరిని వరిస్తాడో అతనికే భగవానుడు లభిస్తాడు) అని తెలుపబడిన రీతిలో పరమపురుషునిచే వరింపబడిన వానికి ప్రాప్యంలో లోటు లేదు. అటువంటివారు ఇక ఏ నోము నోచనక్కఱలేదు. **"విదుః కృష్ణం బ్రాహ్మణా సత్త్వతో యే, తేషాం రాజన్! సర్వయజ్ఞా స్సమాప్తాః"** (రాజా! ఎవరు, శ్రీకృష్ణుని తత్త్వాన్ని యథాతథంగా తెలిసికొన్నారో, వారు అన్ని యజ్ఞాలను పూర్తిచేసినవారు) అని, **"శెయ్ద వేళ్వియర్ వైయత్తేవర్"** (యాగాలు పూర్తిచేసిన భూసురులు) అని పలికే రీతిలో నోము నోచి ముగించి, బ్రహ్మానందానుభవాన్ని పొందేవారు, వారు. ఈ పాశురం మొదటి పాదంలో అదే చెప్పబడింది. **"నోఱ్ఱు"**- కృతకృత్యులై, **"శువర్క్కమ్ పుకుకిన్ఱ"** (స్వర్గంలో ప్రవేశించే) - **"యస్త్వయా సహ స స్వర్గో నిరయో యస్త్వయా వినా"** (నీతో కలసి ఉండడం స్వర్గం,

నీతో విశ్లేషం నరకం) అనే సీతాదేవి వచనం ద్వారా స్పష్టపడే స్వర్గశబ్దార్థమైన నిత్యసంశ్లేషజనితమహానందాన్ని అనుభవించే- అని అర్థం కనుక, పూర్వం తెల్పిన ఉత్తమాధికారిని తెలిపే పాశురమిది. ఇందులో **"తిరుక్కాట్కరై"** దివ్యదేశానుభవం ఏవిధంగా అంటే- ఆ క్షేత్రాన్నిగూర్చి నమ్మాఴ్వార్లు అనుగ్రహించిన దశకంలో **"వారిక్కొణ్డు ఉన్నై విఴుఙ్గువన్ కాణిలెన్ఱు, ఆర్వుఱ్ఱ ఎన్నై యొఴియ ఎన్నిల్ మునృఱమ్ పారిత్తు, తానెన్నై ముఱ్ఱ ప్పరుకినాన్ కారొక్కుమ్ కాట్కరైయప్పన్ కడియనే" (9-6-10)** (ఆశతో పూర్ణంగా గ్రహించి నిన్ను కబళీకరించి అనుభవిస్తాను- అనే అభినివేశాన్ని పొంది, నాకంటే అధికంగా, నాకంటే ముందుగానే ఆశపడి భగవానుడు నన్ను పూర్తిగా అనుభవించాడు. మేఘంవలె ఉదారుడైన తిరుక్కాట్కరై క్షేత్రంలోని స్వామి మిక్కిలి త్వరను కలవాడై ఉన్నాడు) అనే పాశురంలోని మధురభావాన్ని నా దివ్యార్థదీపికలో అనుసంధించవచ్చు. అంతేకాక, **"తెరువెల్లామ్ కావి కమఴ్ తిరుక్కాట్కరై"** (వీథులలో అంతటా నల్లకలువలు పరిమళించే తిరుక్కాట్కరై) అని ఆఴ్వార్లు పల్కిన రీతిలోనే **"తిరుక్కాట్కరై"** అనే క్షేత్రంలో సువాసన అతిశయించి ఉంటుంది. ఈ పాశురం కూడా **"నాఱ్ఱ త్తుఴాయ్ముడి"** (పరిమళించే తులసిని కిరీటంలో కలవాడు) అని పరిమళం వ్యాపించి ఉండడం తెలుపబడింది.

11. **"కఱ్ఱు క్కఱవై"** అనే పదకొండవ పాశురంలో **"తిరుమోకూర్"** అనే దివ్యదేశానుభవాన్ని దర్శించవచ్చు. ఈ పాశురంలో **"ముకిల్ వణ్ణన్ పేర్ పాడ"** (మేఘవర్ణుని నామాన్ని పాడడంకోసమే) అనే ప్రయోగాన్ని ప్రాణస్థానీయంగా గ్రహించాలి. తిరుమోకూర్ దివ్యదేశాన్ని గూర్చిన నమ్మాఴ్వార్లు అనుగ్రహించిన **"తాళతామరై" (10-1)** (కాలమేఘుడు తప్ప వేఱొక గతి లేదు) అనే దశకంలో **"కాలమేకత్తై యన్ఱి మఱ్ఱొన్ఱి ఇలమ్ కతియే" (10-1-1)** (కాలమేఘస్వామిని తప్ప వేఱొక గతిని కల్గినవారము కాము) అని ఉన్నది. ఆక్షేత్రంలోని స్వామికి (మేఘవర్ణుడు) కాలమేఘప్పెరుమాళ్ అనే తిరునామం కనుక, తిరుప్పావైలోని **"ముకిల్వణ్ణన్"** నామాన్ని, తిరుమోకూర్‌లోని కాలమేఘనామాన్ని కలిపి అనుభవించడం రసవత్తరం. మేఘం ఎక్కడ వర్షిస్తుంది? ఎపుడు వర్షిస్తుంది? అనే విషయం ఎవరికీ తెలియదు. **"నాసౌ పురుషకారేణ న చాప్యన్యేన హేతునా, కేవలం స్వేచ్ఛయైవాహం ప్రేక్షే కంచిత్ కదాచన"** (నేను, పురుషకారం వల్లగాని, లేక, ఇంకొక హేతువువల్లగాని ఎవరినీ కటాక్షించను. కేవలం స్వేచ్ఛగానే ఎవరినో ఒకరిని ఎపుడో ఒకప్పుడు కటాక్షిస్తాను) అనే రీతిలో భగవంతుడనే కాలమేఘం

ఏ అధికారిని ఎపుడు అనుగ్రహిస్తాడు? అనే విషయం ఎవరికీ తెలియదు. మేఘం ఒకచోట ప్రకాశిస్తుంది. ఇంకొక చోట వర్షిస్తుంది. శ్రీకృష్ణుడనే మేఘం మధురలో మెఱిసింది. రేపల్లెలో కురిసింది.

12. **"కనైత్తు ఇళమ్ కన్ఱు"** అనే పన్నెండవ పాశురంలో **"తిరుచ్చిత్తిరకూడ"**మనే దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. ఈ పాశురంలో **"శినత్తినాల్ తెన్నిలఙ్గై క్కోమానై చ్చెఱ్ఱ"** (కోపంతో దక్షిణదిక్కులోని లంకకు ప్రభువు రావణుని వధించిన) అనేది ప్రాణస్థానీయమైన పదప్రయోగం. పెరుమాళ్ తిరుమొఴిలో తిరుచ్చిత్తికూడానికి చెందిన **"అఙ్గణెడు మదిళ్ పుడైశూఴ్"** అనే పదవ దశకంలో **"ఎరినాడు వేలరక్కరొడు మిలఙ్గైవేన్దన్ ఉయిర్ కొణ్డు" (10-7)** (శత్రువులను దహించే రీతిలోని వేలాయుధాన్ని కల రాక్షసులకు ప్రభువైన రావణుని ప్రాణాన్ని హరించి) అనే ప్రయోగాన్ని బట్టి **"తెన్నిలఙ్గై క్కోమానై"** (దక్షిణదిక్కులోని లంకకు ప్రభువు రావణుని)ను వధించడాన్ని, **"తిరుమకళోడు ఇనిదమర్న్ద శెల్వన్దన్నై" (10-7)** (సీతాదేవితో కలసి ఆనందంగా వేంచేసి ఉండే విజయలక్ష్మిని కలవానిని) అనే ప్రయోగాన్నిబట్టి **"మనత్తుక్కు ఇనియాన్"** (మనస్సుకు మధురమైనవాడు) అనబడే స్వభావాన్ని మనసార భావించవచ్చు. ఆదశకంలో **"శిన మడఙ్గ మారుదియాల్ శుడువిత్తానై" (10-6)** (తన కోపం చల్లారేటట్లు హనుమానుని ద్వారా లంకను దగ్ధం చేయించినవాడు) అని అంటూ శ్రీరాముని కోపం చల్లారినట్లుగా తెలుపబడింది. కోపం కల్గిన తరువాత కదా అది చల్లారుతుంది. అది తిరుప్పావై **"శినత్తినాల్"** అనే ప్రయోగం ద్వారా సూచింపబడింది.

13. **"పుళ్ళిన్ వాయ్"** అనే పాశురంలోని **"తిరుక్కుడన్దై"** (కుంభఘోణం) దివ్యక్షేత్రానుభవం గమనించదగినది. ఇందులో **"పళ్ళిక్కిడత్తియో !"** (పడుకొని పరుండి ఉన్నావా?) అని అంటూ శయనసన్నివేశం అనుభవింపబడింది. తిరుకుడన్దైలోని **"ఏరార్ కోలమ్ తికఴ క్కిడన్దాయ్" (5-8-1)** (అందం నిండుగా ప్రకాశించగా శయనించావు) అనేది అచటి భగవానుని శయన సన్నివేశాన్నిగూర్చిన పరమాద్భుతమైన అనుభవం. ఇంతేకాక, **"వెంఃకా"** మొదలైన దివ్యతిరుపతులలో కూడా శయనసన్నివేశం ఉన్నా, తిరుమఴిశై ప్పిరాన్ శయన సన్నివేశాలను కల క్షేత్రాలను ఒకటిగా కలిపి పలికేటపుడు, **"నాకత్తణై క్కుడన్దై" (36)** అని అంటూ తిరుక్కుడన్దై క్షేత్రాన్నే మునుముందుగా ప్రస్తావించినందున, ఇది (ఆఴ్వార్ల శ్రీసూక్తి) తిరుక్కుడన్దై స్వామి సమక్షంలో సంభవించిన విన్నపం కనుక, ఈ పాశురంలో తిరుక్కుడన్దై దివ్యదేశానుభవానికే మిక్కిలి ఔచిత్యం ఉన్నది.

14. **"ఉజ్గళ్ పుళైక్కడై"** అనే పాశురంలో **"తిరువళున్దూర్"** అనే దివ్యదేశానుభవం గమనించదగినది. ఈ పాశురంలో **"వావియుళ్ శెఙ్గళునీర్ వాయ్ నికళ్న్దు ఆమ్బల్ వాయ్ కూమ్బిన కాణ్"** (బావులలో ఎఱ్ఱతామరలు వికసించాయి, కలువలు ముడుచుకొన్నాయి, చూడు) అని అంటూ కొన్ని జలపుష్పాల స్వభావం తెలుపబడింది. **"అణియార్ వీది యళున్దూరే"** అనే ఆ దివ్యదేశ దశకంలో **"నెల్లిల్ కువళై కణ్ కాట్ట నీరిల్ కుముదమ్ వాయ్ కాట్ట, అల్లి క్కమలమ్ ముకమ్ కాట్టుమ్ కళని యళున్దూర్" (7-5-10)** (తిరువళున్దూర్ సస్యక్షేత్రాలలోని నల్లకలువలు ఆ ఊరిలోని కాంతల కన్నులవలె ప్రకాశిస్తాయి. నీటిలోని కలువలు వారి నోరు వలె వెలుగుతాయి. వికసించిన పద్మాలు వారి ముఖాలవలె ప్రకాశిస్తాయి.) అని పలుకబడింది. అంతేకాక, ఈ తిరుప్పావై పాశురంలో ప్రబోధింపబడే గోపిక **"నావుడైయాయ్ !"** అని సంబోధింపబడింది. తిరువళున్దూర్‌లో ఉండేవారిని గూర్చి పలికే ఆళ్వార్లు **"శెన్దమిళుమ్ వడకలైయుమ్ తికళ్న్ద నావర్" (7-8-7)** (ద్రావిడవేదం, సంస్కృతవేదం ప్రకాశించే జిహ్వను కలవారు) అని అంటూ వారి వాక్సామర్థ్యాన్ని కీర్తించారు. అంతేకాదు, **"తిరువుక్కుమ్ తిరువాకియ" (7-7)** అనే తిరువళున్దూర్ దశకంలో **"నెయ్యారాళియుమ్ శఙ్గము మేన్దుమ్ నీణ్డ తోళుడైయాయ్" (7-7-3)** (నేతిని పూసినట్లు వెలిగే సుదర్శనాన్ని, శంఖాన్ని ధరించిన దీర్ఘబాహుడు) అని ఉన్నది. ఇక్కడ తిరుప్పావై పాశురంలో **"శఙ్గొడు శక్కర మేన్దుమ్ తడక్కైయన్"** (శంఖం, చక్రం ధరించిన విశాలబాహుడు) అని పలుకబడింది. ఈ విధమైన శబ్దార్థసామ్యాలనుబట్టి ఈ పాశురంలోని తిరువళున్దూర్ అనుభవాన్ని గమనించవచ్చు.

15. **"ఎల్లే ! ఇలఙ్కిళియే !"** అనే పదిహేనవ పాశరంలో **"తిరువల్లిక్కేణి"** అనే దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. **"వల్లానై కొన్దానై మాఱ్ఱారళిక్క వల్లానై మాయనై"** (బలిష్ఠమైన ఏనుగును వధించినవాడు, శత్రువుల బలాన్ని హరించే ఆశ్చర్యభూతుడు) అనే సూక్త్యర్థ్యం **"విఱ్పెరు విళవుమ్ కఞ్జనుమ్ మల్లుమ్ వేళముమ్పాకనుమ్ వీళ" (2-3-1)** (గొప్ప ధనుర్యాగమనే ఉత్సవం, ఆఉత్సవాని నడపిన కంసుడు, బాణూరముష్టికులనే మల్లులు, కువలయాపీడమనే ఏనుగు నశించేటట్లు) అని, **"శన్దమల్ కుళలాళలక్కణ్ నూఱ్ఱవర్ తమ్ పెణ్డిరుమెయ్‌ది నూలిళప్ప" (2-3-6)** (అందమైన, గుండ్రని కేశాలను కల ఆ ద్రౌపది దుఃఖాన్ని నూఱుమంది కౌరవుల పత్నులు పొంది, తమ తాళిని కోల్పోయేటట్లు) ఇత్యాది

తిరువల్లిక్కేణి దశకంలోని పదసందర్భాలను గ్రహించి ఆనందించడం తగినదనే విషయం ఇక్కడ గమనార్హం.

16. **"నాయకనాయ్"** అనే పదహాఱవ పాశురంలో **"తిరుక్కుఱుఙ్గుడి"** అనే దివ్యదేశానుభవం గమనించదగినది. ఈ పాశురంలోని **"తూయోమాయ్ వన్దోమ్ తుయిలెళ ప్పాడువాన్ వాయాల్ మున్నమున్నమ్ మాఱ్ఱాదే యమ్మా!"** (పరిశుద్ధమైన మనస్సును కల్గినవారమై సుప్రభాతం పాడడం కోసం వచ్చాము. నీవు నోటితో మాటిమాటికి వద్దని పలుకకు స్వామీ !) అనే ప్రయోగాన్ని ముఖ్యంగా గ్రహించాలి. **"పాడువాన్"** అనేపదం **"నమ్పాడువాన్"** అనే భక్తుని పేరును స్మరింపజేస్తుంది. అతడు తిరుక్కుఱుఙ్గుడిలోని అర్చామూర్తిని కీర్తించడంకోసం **"వీణా మాదాయ నిర్యయౌ"** (వీణను తీసికొని బయలుదేరాడు) అన్నట్లుగా వీణను గ్రహించి బయలుదేరాడు. దారిమధ్యలో బ్రహ్మరక్షస్సు అతనిని పట్టుకోవాలని వచ్చినపుడు, అడ్డగించవద్దని పలుమార్లు బ్రతిమిలాడాడు. **"వాయాల్ మున్నముమ్ మాఱ్ఱాదే యమ్మా"** (నోటితో మాటి మాటికీ నిషేధించకు) అనే పదసందర్భం దీనిని గుర్తు చేస్తుంది. తన వ్రతానికి భంగాన్ని కల్గించవద్దని ఆబ్రహ్మరక్షస్సు కాలిలో నమ్పాడువాన్ నమస్కరించాడు. తప్పకుండా తిరిగి వస్తానని పలుమార్లు శపథం చేసి తిరుక్కుఱుఙ్గుడికి చేరి, అక్కడ **"నేశ నిలైక్కదవుమ్"** (దగ్గరగా చేరి ఉండే కవాటాలను) తెఱచి, అచటి స్వామిని సేవించి తిరిగి వచ్చాడు.

17. **"అమ్బరమే తణ్ణీరే"** అనే పదిహేడవ పాశురంలో **"కాళిచ్చీరామ విణ్ణగరమ్"** అనే దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. ఈ పాశురంలోని **"అమ్బర మూడఱుత్తు ఓఙ్గి ఉలకళన్ద ఉమ్బర్‌కోమానే !"** (ఆకాశంలో అంతటా వ్యాపించి ఎదిగి లోకాలను కొలచిన నిత్యసూరినాథా!) అనే ప్రయోగాన్ని ప్రాణస్థానీయంగా గ్రహించాలి, దీనికి తగినట్లుగా **"కాళిచ్చీరామవిణ్ణగర్"** దివ్యదేశంలోని అర్చామూర్తిని ఆ దివ్యదేశ దశకంలో **"ఒరు కుఱళాయ్ ఇరునిల మూవడి మణ్ వేణ్డి యులకనైత్తుమ్ ఈరడియాల్ ఎడుక్కిన" (3-4-1)** (అద్వితీయ వామనుడై ఊర్ధ్వ- అధోలోకాలను మూడడుగులు యాచించి, లోకాలను అన్నిటిని రెండు పాదాలతో కొలిచిన) అని తిరుమంగైమన్నన్ కీర్తించిన ప్రయోగంలోని అర్థసామ్యాన్ని సరసంగా భావించవచ్చు.

18. **"ఉన్దు మదకళిఱ్ఱన్"** అనే పద్దెనిమిదవ పాశురంలో **"తిరునఱైయూర్"** అనే దివ్యదేశానుభవం భావ్యం. తిరునఱైయూర్ అనే దివ్యదేశానికి **"నాచ్చియార్ తిరుక్కోయిల్"** అని పేరు. ఈ క్షేత్రస్థలపురాణానుసారం ఇది నాచ్చియార్‌కే

(అమ్మవారికే) ప్రాధాన్యం కల దివ్యదేశం. తిరుమజ్గైయాళ్వార్ పెరియ తిరుమడల్‌లో ఈదివ్యదేశాన్ని గూర్చి **"మన్ను మఱైయోర్ తిరునఱైయూర్ మామలైపోల్ పొన్నియలుమాడక్కవాడమ్ కడన్దు పుక్కు ఎన్నుడైయ కణ్కళిప్ప నోక్కినేన్... మన్ను మరదకక్కున్ఱిన్ మరుజ్గే ఓర్ ఇన్నిన వజ్జిక్కొడి యొన్ఱు నిన్ఱదుదాన్, అన్నమాయ్ మానాయ్ అణిమయిలాయ్ ఆజ్గిడైయే మిన్నా మిళవేయ్ ఇరణ్డాయిణై చ్చెప్పాయ్, మున్నాయ తొణ్డైవాయ్ క్కెణ్డైక్కుల మిరణ్డాయ్, అన్న తిరువురువమ్ నిన్ఱదు"** (వైదికులు నిత్యవాసం చేసే తిరునఱైయూర్ దివ్యదేశంలో గొప్ప పర్వతం వంటిది, స్వర్ణమయమైనది అయిన గర్భగృహం తలుపులను తెఱచి లోపలకు పోయి నా కన్నులు ఆనందించే రీతిలో సేవించాను... అందఱికి ఆశ్రయమైన మరతకపర్వతంవంటివాడైన భగవానుని ప్రక్కవిలక్షణమైన, భోగ్యమైన లేలేత ప్రబ్బలి తీగవంటి లక్ష్మీదేవి ఉన్నది. ఆమె నడకలో హంసవంటిది, చూపులో లేడి వంటిది, కేశపాశంలో అందమైన నెమలివంటిది, నడుములో మెఱుపువంటిది, బాహువులు రెండు వెదుళ్ళవంటివి, స్తనయుగం రెండు కలశాలవంటివి, ప్రత్యక్షంగా కన్పించే అధరం తొండపండువంటిది, నేత్రాలు గొప్పవైన రెండు బేడిస చేపలవంటివి. ఇటువంటి రూపంతో ఆమె నిలచి ఉన్నది.) పల్కిన అనే శ్రీసూక్తి భావం స్మరించదగినది.

"ఉన్దు మదకళిఱు" పాశురం పూర్తిగా నాచ్చియార్ (నీళాదేవి) అనుభవం. ఇందులో **"పన్దార్ విరలి"** అనిఅంటూ బంతినిగూర్చిన ప్రస్తావం చేయబడింది. తిరునఱైయూర్ దశకంలో (పెరియ తిరుమొ*ళ్ధి*-6-6-8) **"పన్దార్ విరలాళ్"** (బంతిని చేతిలో నిండుగా కల్గినది) అనే ప్రయోగాన్ని గమనించవచ్చు. తిరునఱైయూర్‌ను కీర్తించే పలు పాశురాలున్నందున చాలా విరివిగా ఈ విషయాలను హృద్యంగా అనుభవించవచ్చు.

19. "కుత్తువిళక్కు" అనే పందొమ్మిదవ పాశురంలో "తిరువిడవెన్దై" అనే దివ్యదేశానుభవాన్ని చూడవచ్చు. ఈ పాశురంలో **"కొజ్గైమేల్ వైత్తు క్కిడన్ద"** (వక్షస్థలంపై శయనించిన) అనే సూక్తిని ప్రాణస్థానీయంగా గ్రహించవచ్చు. తిరుప్పావైకు తనియన్ అనుగ్రహించిన భట్టర్ ఈ పాశురాన్ని జీవనాడిగా గ్రహించి కదా, **"నీళాతుజ్గస్తనగిరితటీసుప్తమ్"** అనే ప్రయోగాన్ని చేశారు. ఈ సన్నివేశాన్ని ఒక విధంగా అర్చామూర్తిలో దర్శించాలంటే తిరువిడవెన్దైలోనే గమనించవచ్చు. **"తివళుమ్ వెణ్ముదిపోల్ తిరుముకత్తరివై శె*ళ్ధు*జ్కడలముదినిల్పిఱన్దవళుమ్ నిన్నాక త్తిరుప్పదు మఱిన్దుమ్"** (2-7-1) (వెలుగును వెలువరించే తెల్లని చంద్రుని వంటి అందమైన ముఖాన్ని కల్గినది, నిత్యయౌవనాన్ని కల్గినది, లోతైన క్షీరాబ్ధినుండి అమృతంతో పాటు పుట్టినది అయిన లక్ష్మీదేవి నీ వక్షఃస్థలంలో నిత్యవాసం చేస్తున్నదని తెలిసినా) అనే ఆ దివ్యదేశ పాశురాన్ని, **"నప్పిన్నైకొజ్గైమేల్ వైత్తు క్కిడన్ద"** (నీళాదేవి వక్షఃస్థలంపై శయనించిన) అనే ఈ పాశురాన్ని సమన్వయించుకొని అనుభవించగల సమర్థులెవ్వరు!

20. "ముప్పత్తు మూవర్" అనే ఇరవైయవ పాశురంలో "తిరుప్పాడకమ్" అనే దివ్యదేశానుభవాన్ని దర్శించవచ్చు. కాంచీ దివ్యనగరంలో వెలిగే పాండవదూత సన్నిధియే తిరుప్పాడకమ్. ఇక్కడ అర్చామూర్తి యొక్క చాలా గొప్ప పెద్ద తిరుమేనిని దర్శించవచ్చు. పెరియతిరుమొ*ళ్ధి*లో (9-1-8) **"అరవు నీళ్కొడియోనవై యుళ్ ఆశనత్తై అజ్జాదే యిడ అదఱ్కు ప్పెరియ మామేని అణ్డమూడురువ ప్పెరున్దిశై యడజ్గిడ నిమిర్న్దోన్"** (సర్పధ్వజుడైన దుర్యోధనుడు సభలో మోసపు ఆసనాన్ని జంకకుండా పెట్టగా, ఆ కారణంవల్ల గొప్పరూపాన్ని కలవాడై, ఊర్ధ్వలోకాల అంచులు తాకేటట్లు, గొప్ప దిక్కులు తనలో అణగి ఉండేటట్లు పెరిగిన స్వామి) అని అంటూ తిరుమజ్గైయాళ్వార్ అనుసంధించిన ఇతిహాసానికి అనుగుణంగా పల్కిన సన్నివేశం ఇది. అంటే- పాండవులకోసం దూతగా వెళ్ళిన శ్రీకృష్ణుని రాకను తెలిసిన సర్పధ్వజుడైన దుర్యోధనుడు సభామండపంలో ఒక పెద్ద బిలాన్ని తవ్వించి, మోసపు ఆసనాన్ని ఆబిలంపై పెట్టాడు. శ్రీకృష్ణుడు ఆ ఆసనంపై కూర్చొనగానే ఆసనం బిలం లోపలకు ప్రవేశించింది. అపుడు స్వామి విశ్వరూపాన్ని ఎత్తి తన శక్తిని చూపి, అక్కడ ఉండే శత్రువులకు భీతిని కల్గించిన వృత్తాంతం ఈ పాశురంలో అనుభవింపబడింది. తిరుప్పావై పాశురంలోని **"అమరర్క్కు మున్ శెన్ఱు"** (దేవతలకు ముందుగా తానే పోయి) అంటే- దైవీప్రకృతిని కల్గిన పాండవులకోసం ముందుగా తానే వెళ్ళి- అని అర్థం. **"కప్పమ్ తవిర్క్కుమ్"- "కంప"** అనే సంస్కృతపదం **"కప్ప"** మని పరిణమిస్తుంది కనుక, ఆ పాండవుల భయాన్ని తీర్చినవాడనికూడా దీనిద్వారా తెలుపబడింది.

21. **"ఏ*ఱ్ఱ* కలజ్గళ్"** అనే ఇరవై ఒకటవ పాశురంలో **"తిరుక్కణ్ణమజ్గై, తిరునారాయణపురమ్"**- అనే రెండు దివ్యదేశాల అనుభవాన్ని గమనించవచ్చు. ఈ రెండు క్షేత్రాల అనుభవాన్ని క్రమంగా గమనిద్దాం. ఈ పాశురంలో **"పెరియాయ్"** (గొప్పవాడా!) అనే ప్రయోగం ముఖ్యమైనది. తిరుక్కణ్ణమజ్గై దివ్యదేశాన్ని కీర్తించే తిరుమజ్గైయాళ్వార్ ఆరంభంలో **"పెరుమ్ పుఱక్కడలై"**

(7-10-1) (విశాలమైన ప్రదేశాన్ని కల సముద్రంవలె అపరిచ్ఛిన్న స్వరూపస్వభాలను కలవాడు) అని అన్నారు. ఆ గొప్పతనానికి తగినట్లుగా ఆదశకంలోని పాశురాలను పెద్దవిగా అనుగ్రహించారు. ఆ దశకానికి ఫలాన్ని అనుగ్రహించి పూర్తి చేసేటపుడు కూడా "విణ్ణిల్ విణ్ణవరాయ్ మకిழ్వెయ్దువర్" (7-10-10) (పైలోకాలలో దేవతలై ఆనందిస్తారు) అని అంటూ గొప్పవారు కాగలరని అన్నారు. "**మాற்றாரై వలి**" (శత్రువుల బలం) తొలగేటట్లుగా చేసిన శ్రీకృష్ణుడు "**పற்றார్ నడుఙ్గ మున్న పాఞ్జశన్నియత్తై వాయ్ వైత్త పోరేఱే!**" (శత్రువులు జంకేటట్లుగా పాంచజన్యాన్ని కోటిలో పెట్టుకొని ఊదిన పోటెద్దువంటివాడా!) అని, "**స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్**" (ఆపాంచజన్యధ్వని కౌరవుల హృదయాలను భగ్నం చేసింది) అని అంటూ తన శంఖధ్వనితో వారిని నిరసించాడు. తిరుక్కణ్ణమఙ్గై స్వామిని సంబోధించే తిరుమఙ్గైయాழ్వార్ "**వెణ్ శఙ్గ మొన్దేన్దియ కణ్ణా !**" (తెల్లని, అద్వితీయమైన శంఖాన్ని ధరించిన శ్రీకృష్ణా !) అని అన్నారు.

ఇక, తిరునారాయణ పురానికి చెందిన అనుభవాన్ని గమనించినపుడు- "పెరుమ్ పశుక్కళ్ **ఆற்ற** ప్పడైత్తాన్ మకనే!" (గొప్ప పశువులు సమృద్ధిగా కలవాని కుమారా!) అనేది ముఖ్యమైన ప్రయోగం. దీనికి "**యతిరాజ సంపత్కుమారా!**" అని భావం. "పెరుమ్ పశుక్కళ్" (గొప్ప గోవులు) అయిన వివిధ శాస్త్రవిద్వాంసులను, శిష్యులుగా మిక్కిలిగా కలవారు, భగవద్రామానుజులు. అటువంటి శ్రీరామానుజులకు కుమారా!- అని అర్థం. అంతేకాక, "ఉలకినిల్ **తోற்ற**మాయ్ నిన్ఱ శుడరే !" (లోకంలో అవతరించిన జ్యోతిస్స్వరూపా!) అనే ప్రయోగం కూడా తిరునారాయణపురానికి తగినది. పుట్టలో మఱుగుపడి ఉండి, బహిర్గతమైన తిరునారాయణపురం అర్చామూర్తి వృత్తాంతం ప్రకృతంలో స్మరణీయం.

22. "అఙ్గణ్ మాఞాలమ్" అనే ఇరవైరెండవ పాశురంలో "తిరుమాలిరుమ్ శోలై" అనే దివ్యదేశానుభవం గమనార్హం. ఈ పాశురంలో "అరశర్ అబిమాన పఙ్గమాయ్ వన్దు" (ప్రభువులు తమ అభిమానం భగ్నం కాగా వచ్చి) సేవించినట్లుగా తెలుపబడింది. తిరుమాలిరుఞ్జోలైను కీర్తించే పెరియాழ்వార్ (4-2-7) "కొన్నవిల్ కూర్వేల్ కోన్నెడుమాఱన్ తెన్ కూడల్ కోన్ తెన్నన్ కొణ్డాడుమ్ తెన్తిరు మాలిరుమ్ఞ్జోలైయే" (శత్రువధనే వృత్తిగా కల్గిన పదునైన వేలాయుధాన్ని కలవాడు, రాజనీతిని క్రమానుసారంగా నిర్వహించేవాడు, గొప్పవాడు, ధర్మయుద్ధాన్ని చేసేవాడు, అందమైన 'కూడల్' అనే పేరును కల మధురకు ప్రభువు, దక్షిణదిక్కుకు

నాయకుడైన మలయధ్వజుని చేత కీర్తింపబడిన అందమైన వనగిరి) అని అంటూ ప్రభువులు చేసిన సేవనుగూర్చి పలికారు. "**ఇద మిమే శ్రుణుమో మలయధ్వజం నృప మిహ**" (ఈ దివ్యదేశంలో కైంకర్యం చేసిన మలధ్వయజ ప్రభువును గూర్చి వింటున్నాము) అని అన్నారు కూరేశులు కూడా.

23. "మారిమలై ముழఙ్గ" అనే ఇరవై మూడవ పాశురంలో "తిరువరఙ్గమ్ పెరియకోయిల్" అనుభవాన్ని దర్శించవచ్చు. ఈ పాశురంలోని "ఉన్కోయిల్ నిన్ఱు ఇఙ్గనే పోన్దరుళి" (నీ కోవెలనుండి ఈవిధంగా వేంచేసి) అనే ప్రయోగం గ్రాహ్యం. నమ్బెరుమాళ్ సన్నిధికి "కోయిల్" అనియే విలక్షణమైన, ప్రసిద్ధమైన నామం. ఈ పాశురంలో శ్రీకృష్ణుని గమన సౌందర్యాన్ని దర్శించాలనే ఆశ వ్యక్తం చేయబడింది. ఆవిధంగా "నడైయழకు" గమనసౌందర్యాన్ని శ్రీరంగంలోనే దర్శించగలం. తిరువాయ్మొழி దివ్యప్రబంధంలోని (6-9-3) "**ఞాలత్తూడే నడన్దు నిన్ఱుమ్**" (భూమిపై సంచరించి నిలచి) అనే పాశురానికి ఈడువ్యాఖ్యలో ప్రస్తావింపబడ్డ నమ్బెరుమాళ్ (శ్రీరంగనాథుని ఉత్సవమూర్తి) గమనసౌందర్యాన్ని గూర్చిన అద్భుతమైన ఒక ఐతిహ్యాన్ని గమనించవచ్చు.

24. "అన్ఱివ్వులకమ్" అనే ఇరవై నాల్గవ పాశురంలో గోవర్ధనదివ్యదేశానుభవం గమనించదగినది. ఈ పాశురంలో "**కున్ఱు కుడైయా ఎడుత్తాయ్ ! కుణమ్ పోற்ఱి**" (గోవర్ధనాన్ని గొడుగుగా ఎత్తినవాడా ! నీ గుణానికి మంగళం) అనే ప్రయోగాన్ని ప్రాణ స్థానీయంగా గమనించవచ్చు. ఇందులో గోవర్ధనోద్ధరణానికి మంగళాశాసనం చేయబడింది. "**కొడియేఱు శెన్దామరై క్కైవిరల్కళ్ కోలముమழிన్దిల వాడిற்றில, వడివేఱు తిరువుకిర్ నొన్దుమిల మణివణ్ణన్ మలైయుమోర్ శమ్బిరతమ్**" (3-5-10) (ధ్వజాన్ని చేతిలో రేఖల రూపంలో కల్గినవాడైన శ్రీకృష్ణుని యొక్క, ఎఱ్ఱుతామరల వంటి చేతులు, వ్రేళ్ళు ఏడుదినాలపాటు ఒకేరీతిలో గోవర్ధన పర్వతాన్ని ధరించినా, వాటి సహజమైన అందం ఏమాత్రం తగ్గలేదు. వాడలేదు. అందం మిక్కిలిగా ఉండే అతని గోళ్ళు బాధను పొందలేదు. మణివర్ణుడైన శ్రీకృష్ణుడు పర్వతాన్ని ధరించడం ఒక కనికట్టు విద్యవలె ఉన్నది.) అనే పెరియాழ்వార్ తిరుమొழி పాశురాన్ని దృష్టిలో పెట్టుకొని వివరించవచ్చు. గోపాలకులు సంప్రదాయానుసారంగా దేవేంద్రునకు చేసే పూజను శ్రీకృష్ణుడు అడ్డగించినపుడు, "**యో వై స్వాం దేవతా మతియజేత ప్రస్వాయై దేవతాయై చ్యవతే న పరాం ప్రాప్నోతి పాపీయాన్ భవతి**" (ఎవడు, తాను ఆరాధించదగిన దేవతను వదలి అన్యదేవతలను ఆరాధిస్తాడో, అతడు పరగతిని పొందలేడు, పాపిష్ఠివాడవుతున్నాడు)

అనే వేదవాక్యాన్ని పల్కి వివరించిన రీతిని నిగమాంతదేశికులు యాదవాభ్యుదయంలో, **"అతియజేత నిజాం యది దేవతామ్ ఉభయతశ్చ్యవతే జుషతేఽప్యఘమ్, క్షితిభృత్యైవ సదేవతకా వయమ్ వనమిహానవతా కిమహిద్రుహా"** అనే శ్లోకంలో పలికారు. దీనిని కూడా ప్రస్తావించి వివరించవచ్చు.

25. **"ఒరుత్తి మకన్"** అనే ఇరవై అయిదవ పాశురంలో **"తిరుక్కణ్ణపురమ్"** అనే దివ్యదేశానుభవం గమనించవచ్చు. ఈ పాశురంలో **"ఒరుత్తి మకనాయ్ ప్పిఱన్దు ఓరిరవిల్ ఒరుత్తిమకనాయ్ ఒళిత్తు వళర"** అనే విషయాన్ని తిరుక్కణ్ణపుర దివ్యక్షేత్రం పాశురాలలో విస్తృతంగా గమనించవచ్చు. పెరియతిరుమొழిలోని ఎనిమిదవ దశకం అంతా తిరుక్కణ్ణపుర దివ్యదేశమంగళాశాసనమే. **"తన్దైకాలిల్ విలఙ్గఱ వన్దు తోన్ఱియ తోన్ఱల్" (8-5-1)** (తండ్రి కాళ్ళ సంకెళ్ళు వీడేటట్లు అవతరించిన సుతుడు) అనే పాశురం ద్వారా **"ఒరుత్తి మకనాయ్ ప్పిఱన్ద"** వృత్తాంతాన్ని గూర్చి పల్కి, **"మారి మాక్కడల్ వళైవణఱ్కిళైయవన్" (8-5-2)** (మేఘంవంటివాడు, నల్లని సముద్రంవంటివాడు, శంఖంవలె తెల్లనివాడైన బలరామునకు తమ్ముడైన శ్రీకృష్ణుడు) అనే తదనంతరపాశురంలో **"ఒరుత్తి మకనాయ్ వళర్న్ద"** వృత్తాంతాన్ని తెలిపారు. **"తాయెడుత్త శిఱుకోలుక్కు ఉళైనతోడి త్తయిరుణ్డ వాయ్ తుడైత్త మైన్దనుక్కు" (8-3-5)** (తల్లి యశోద చేతితో ఎత్తిన చిన్న కర్రను చూచి భయపడి పరుగెత్తి పెరుగు ఆరగించిన నోటిని తుడుచుకొన్న స్వామికి) ఇత్యాది పాశురాలలో **"ఒరుత్తి మకనాయ్ వళర్న్ద"** అనే సందర్భాన్ని గమనించవచ్చు.

26. **"మాలే మణివణ్ణా!"** అనే ఇరవై ఆఱవ పాశురంలో **"శ్రీవిల్లిపుత్తూర్"** దివ్యదేశానుభవం గమనార్హం. ఈ పాశురంలో **"ఆలినిలైయాయ్ !"** (వటపత్ర శాయీ!) అనే దానిని ప్రాణస్థానీయంగా గ్రహించాలి. శ్రీవిల్లిపుత్తూర్‌లోని అర్చామూర్తి వటపత్రశాయి అనే తిరునామాన్ని కలవాడు కనుక, ఆ భగవానుని ఉద్దేశించి **"ఆలినిలైయాయ్ !"** అని సంబోధన చేయబడింది. శ్రీకృష్ణుని వటపత్రశాయి స్వామిగా గోదాదేవియే కాక, ఆమె జనకులైన పెరియాழ్వార్లు కూడా యశోదాభావనతో అనుభవించేటపుడు, **"పాలకనెన్ఱు పరిపవమ్ శెయ్యేల్, పణ్డొరునాళ్ ఆలినిలై వళర్న్ద శిఱుక్కన్ ఇవన్" (1-4-7)** (చంద్రుడా ! బాలకుడని తక్కువ చేయకు. ఇతడు పూర్వం ఒకనాడు వటపత్రంపై శయనించిన బాలుడు) అని శ్రీకృష్ణుని శ్రీవిల్లిపుత్తూర్‌లోని స్వామిగా అనుభవించారు.

27. **"కూడారై వెల్లుమ్"** ఇరవై ఏడవ పాశురంలో **"తిరువేఙ్గడమ్"** అనబడే శ్రీవేంకటాచలానుభవం దర్శించదగినది. ఈ పాశురంలోని మొదటి పాదాన్ని, చివరి పాదాన్ని ప్రధానంగా గ్రహించాలి. మొదటి పాదంలో విరోధినిరసనం, చివరి పాదంలో అందఱు కలసి ఉండి ఆనందించిన క్రమం తెలుపబడ్డాయి. భగవద్రామానుజుల కాలంలో శ్రీవేంకటేశ్వరుని విషయంలో ప్రబలమైన వివాదం ఏర్పడగా, **"అప్పనుక్కు చ్చఙ్గాழி అళిత్తరుళుమ్ పెరుమాన్"** (స్వామికి శంఖచక్రాలను ప్రదానం చేసిన స్వామి) అయిన భగవద్రామానుజుల ద్వారా విరోధినిరసనం చేయబడిన ఇతిహాసం సుప్రసిద్ధం. **"కూడి యిరున్దు"** అనే ప్రయోగం **"ఒழிవిల్ కాలమెల్లా ఉడనాయ్ మన్ని వழுవిలా అడిమై"** (కాలవిచ్ఛేదం లేకుండా నిలచి ఉండి నిరంతరమైన కైంకర్యాన్ని) చేయాలని ఆழ్వార్లు ఆశపడినది- **"వేఙ్గడత్తెழிల్‌కొళ్ శోది ఎన్దైతన్దై తన్దైక్కే"** (వేంకటాద్రిపై ప్రకాశించే జ్యోతి అయిన నా తండ్రికి తండ్రికి తండ్రి అయిన వేంకటేశ్వరునకే) కదా! **"కుళిర్న్దు"** - అనే పదం **"కుళిరరువి వేఙ్గడమ్"** (చల్లని కొండవాగులను కల వేంకటాద్రి) ఇత్యాది దివ్యసూరిసూక్తులను స్మరింపజేస్తాయి.

28. **"కఱవైకళ్"** ఇరవై ఎనిమిదవ అనే పాశురంలో **"శ్రీబృందావనమ్"** అనే దివ్యదేశానుభవం గమనించదగినది. ఈపాశురంలో **"కానమ్ శేర్న్దు ఉణ్బోమ్"** (అరణ్యాన్ని చేరి భుజిస్తాము) అనే ప్రయోగం ముఖ్యమైనది **"కాననమ్"** అనే సంస్కృతపదం ద్రావిడంలో **"కానమ్"** అనే రూపాన్ని పొందుతుంది. అడవి- అని దీని అర్థం. అదియే ఈ బృందావనం. అక్కడకు చేరి అనుభవిద్దాం- అని భావం. ఏమి అనుభవించాలి? అంటే, **"కానమ్"** అనే పదం ద్రావిభాషలో రెండు అర్థాలను ఇచ్చే పదం. కవర్గలోని తృతీయాక్షరమైన గకారంగా ఈ పదంలోని మొదటి అక్షరాన్ని గ్రహిస్తే **"గానమ్"** అనే రూపాన్ని పొంది, గానమనే అర్థాన్ని ఇస్తుంది. దీనివల్ల వేణుగానగోష్ఠిలో చేరి ఆనందిద్దాం''- అని తాత్పర్యం. ఈ సందర్భంలో, **"ఆసా మహో చరణరేణుజుషా మహం స్యాం బృందావనే కిమపి గుల్మలతౌషధీనామ్"**, (శ్రీకృష్ణుని చరణరేణువులు సోకే, బృందావనంలోని పూపొదలు, లతలు, ఓషధులలో ఏదయినా ఒకటిగా నేను కాగలనా! అయ్యో!), **"శైలోఽగ్నిశ్చ జలాంబభూవ... త్వం తేష్వన్యతమాంబభూవిథ భవద్వేణుక్వణోన్మాథనే"** (నీవు వేణుగానం చేసినపుడు పర్వతాలు, అగ్ని నీరుగా కఱిగిపోయాయి...... నీవు వారిలో ఒకడవు అయ్యావు) (4) ఇత్యాది శ్లోకాలు అనుసంధేయాలు.

29. **"శిగ్గ్రమ్ శిఱుకాలే"** (అత్యంత ప్రాతఃకాలంలో) అనే ఇరవైతొమ్మిదవ పాశురంలో **"ద్వారవతి"** (ద్వారక) అనే దివ్యదేశానుభవం దర్శించదగినది. ఈ పాశురంలో ముఖ్యమైనది- **"ఉనక్కే నామ్ ఆట్చెయ్‌వోమ్"** (నీకే మేము సేవ చేస్తాము) అనే ప్రార్థన. శ్రీకృష్ణుని దివ్యదేవేరులు అందఱు **"దేవిమార్ పణిశెయ్య తువరై ఎన్నుమదిల్ నాయకరాకి వీగ్గ్రిరున్ద మణవాళర్"** (దేవేరులు సేవించగా, ద్వారకానగరంలో నాయకుడై వేంచేసి ఉండే పెండ్లికుమారుడు), **"పల్లాయిరమ్ పెరున్దేవిమారొడు పౌవమెఱి తువరై ఎల్లారుమ్ శూళ్"** (పలువేలమంది దేవేరులతో సముద్రం పరివేష్టితమైన ద్వారకలో అందఱు పరివేష్టించి ఉండగా) ఇత్యాది దివ్యసూరి సూక్తుల భావాలు దీనికి అనుగుణంగా అనుసంధేయాలు.

30. **"వఙ్గక్కడల్"** అనే చివరి పాశురంలో **"శ్రీవిల్లిపుత్తూర్"** దివ్యదేశానుభవాన్ని గమనించవచ్చు. పూర్వం **"మాలే! మణివణ్ణా!"** అనే పాశురంలో వటపత్రశాయియైన **"విల్లిపుత్తూర్ ఉఱైవాన్"** (శ్రీవిల్లిపుత్తూర్‌లో నివసించే స్వామిని) అనుభవించాము. ఇక్కడ **"అణి పుతువై"** అని శ్రీవిల్లిపుత్తూర్ దివ్యదేశాన్నే అనుభవిద్దాం. శ్రీవిల్లిపుత్తూర్‌ను పెరియాళ్వార్లు, ఆణ్డాళ్ మాత్రమే అనుభవించారు. ఆణ్డాళ్ చరిత్రను పల్కి శ్రీపెరియాళ్వార్, పెరియాళ్వార్ కథను పల్కి ఆణ్డాళ్ అనుభవించారు. పెరియాళ్వార్ తిరుమొళిలో (2-2-6) **"మిన్ననైయ నుణ్ణిడైయార్ విరికుళల్‌మేల్ నుళైన్ద వణ్డు ఇన్నిశైక్కుమ్ విల్లిపుత్తూర్"** (మెఱుపువలె చాలా సన్నని నడుమును కల స్త్రీల యొక్క విస్తరించి, దట్టంగా ఉండే కేశపాశంలో ప్రవేశించిన తుమ్మెదలు మధురంగా ధ్వనించే శ్రీవిల్లిపుత్తూరు) అనే (పెరియాళ్వార్ల) పాశురంలో ఆణ్డాళ్ కేశపాశంలో **"తూవియమ్ పుళ్ళుడై ద్దెయ్‌వ వణ్డు"** (పవిత్రమైన అందమైన భగవానుడనే దివ్యషట్పదం) అభినివేశాన్ని పొందిన వృత్తాంతం వ్యక్తం. నాచ్చియార్ తిరుమొళిలో **"మెన్నడై యన్నమ్ పరన్దు విళైయాడుమ్ విల్లిపుత్తూర్"** (5-5) (అందమైన నడకలను కల హంసలు వ్యాపించి క్రీడించే శ్రీవిల్లిపుత్తూరు) అనే పాశురంలో **"వేణ్డియ వేదఙ్గళోది విరైన్దు కిళి యఱుత్త"** (రాజసభలో ఆవశ్యకమైన వేదాలను పల్కి, పందెపు సొమ్ముమాటను ఛేదించిన) పెరియాళ్వార్ కథను గమనించదగినది. **"అన్నమాయ్ అన్ఱఙ్గరుమఱై ప్పయన్దాన్"** (హంసరూపియై అపుడు అరుదైన వేదాలను ఉపదేశించాడు.) అనే రీతిలో భగవానుని హంసావతారం వేదాలను ఉపదేశించగా, విష్ణుచిత్తావతారం **"ప్రాహ వేదాన్ అశేషాన్"** - (వేదాలను అన్నిటిని పలికాడు) అనే రీతిలోనిది. ఈవిధంగా భట్టనాథులద్వారా, గోదాదేవి ద్వారా కల్గిన అతిశయమే శ్రీవిల్లిపుత్తూర్ విషయంలో ఇక్కడ అనుభావ్యం.

తిరుప్పావై - భగవద్రామానుజులు (తిరుప్పావైజీయర్)
అవతారిక

మన సంప్రదాయంలో శ్రీరామానుజులకు **"తిరుప్పావై జీయర్"** అనే సుప్రసిద్ధమైన వ్యవహారం ఉన్నది. ఆ మహనీయులు తిరుప్పావై దివ్యప్రబంధంలో చాలా గొప్ప అభినివేశాన్ని కల్గి, దానిని అనుసంధానంలో మిక్కిలి ఆసక్తిని కల్గినవారై ఉన్నందువల్ల ఆ విధమైన వ్యపదేశం (పేరు) ఏర్పడినది- అనే హేతువే కాకుండా, ఇంకొక గొప్ప హేతువు కూడా ఉన్నది. అది ఏమంటే- తిరుప్పావైలోని ఒక్కొక్క పాశురంలోను భగవద్రామానుజులనుగూర్చి స్మరించే రీతిలోని పదప్రయోగ సన్నివేశం అమరిఉండడమే ఈ హేతువు. ఇది ఆరోపించి బలాత్కారంగా అర్థం చెప్పే రీతిలో కాకుండా, తగినట్లుగా వివరింపబడదగి ఉండడం గమనించదగినది. మీమాంసాశాస్త్రంలోని వినియోగ పృథక్త్వన్యాయం ఈ సందర్భంలో అనుసంధేయం. (తిరుప్పావై ఒక్కొక్క పాశురంలో భగవద్రామానుజుల వైభవం సూచింపబడ్డ తీరును ఇక గమనిద్దాం)

1. **"మది నిఱైన్ద నన్నాళ్"**- అనే ప్రయోగానికి - చంద్రుడు నిండుగా ఉండే మంచి దినాలు- పరిపూర్ణ శుక్లపక్షం- అని అర్థం. **"మది" (మతి)**- జ్ఞానం, అది నిండబోయే మంచిదినం- అనేది పై ప్రయోగంలోని ధ్వన్యర్థం. భగవద్రామానుజులు అవతరించిన దినం- **"ఇరుళ్ తరు మాఞాలమ్"** (అజ్ఞానాన్ని కల్గించే విశాలభూమి)లో జ్ఞానం నిండడానికి హేతువైన మంచి దినం కదా! నిండబోయే- అని చెప్పవలసిన చోట **"నిఱైన్ద"** అని పల్కడం కాలవ్యత్యయ ప్రయోగం (**"కాలవళువమైది"**)- అని ద్రావిడభాషలో ఇటువంటి ప్రయోగం వ్యవహరింపబడుతున్నది. **"ఆశంసాయామ్ భూతవచ్చ"** అనేది సంస్కృత వ్యాకరణసూత్రం కూడా. యతిరాజసప్తతి అనే స్తుతిలో **"అనపాయవిష్ణుపద సంశ్రయం భజే"** (ఏ అపాయం లేని పరమపదాన్ని నివాసంగా కల్గిన శ్రీరామానుజులను భజిస్తాను) ఇత్యాది శ్లోకంద్వారా భగవద్రామానుజులు లోకవిలక్షణులైన చంద్రునిగా వర్ణింపబడ్డారు. ఆ యతిరాజచంద్రుడు ఉదయించిన దినాన్ని **"నన్నాళ్"** అని అనవచ్చు కదా. **"శిత్తిరై నన్నాళ్"** (చిత్తిర మాసం) మానవులకు మొదటి మాసం. మార్గశిర (మార్గళి) మాసం దేవతలకు మొదటి మాసం- అనే సామ్యంకూడా ఇక్కడ ఉన్నది. ఇది తిరుప్పావై వ్యాఖ్యానంలో కూడా స్పష్టం. కనుక, భగవద్రామానుజుల అవతారం మొదటి మాసంలో జరిగింది- అని అనడంలో కొఱత లేదు. **"ఇళశిఙ్గమ్"** అనే

ప్రయోగానికి అనుగుణంగా ఇరామానుశ నూ*ర్ర*న్దాదిలోని **“వలి మిక్క శీయ మిరామానుశన్”** (గొప్పబలాన్ని కల సింహం శ్రీరామానుజులు) అనే ప్రయోగం స్మరణీయం.

2. **“పాఱ్కడలుళ్ పైయ త్తుయిన్ఱ పరమన్”** - (పాలసముద్రంలో తూగే పరమపురుషుడు) క్షీరాబ్ధినాథుడు. నమ్మా*ళ్వా*ర్లు **“ఉనతు పాలే పోల్ శీరిల్ ప*ళు*త్తొ*ళి*న్దేన్”** (నీ పాలవంటి భోగ్యమైన కల్యాణగుణాల అనుభవంలో పండిపోయాను) అనే పాశురం ద్వారా భగవద్గుణాలను క్షీరంగా పలికారు. వారే, ఆ గుణాలను సముద్రంగా కూడా **“శీర్క్కడలై యుళ్ పొదిన్ద”** (భగవానుని గుణాలనే సముద్రంలో మునిగిన) అనే పాశురంలో అన్నారు. ఈ సూక్తులకు అనుగుణంగా **“అపరిమితోదార గుణసాగరం బ్రహ్మ”** (భగవానుడు అంతులేని గొప్ప గుణాలకు సముద్రం) అని శ్రీరామానుజులు శ్రీభాష్యంలో అన్నారు (2-1) ఇంతటితోనే కాక, ఆ గుణాలనే తమ దివ్యగ్రంథాలలో ప్రస్తావించి కీర్తించారుకూడా. ఈవిధంగా భగవద్గుణ సాగరంలో అస్తమితాన్యభావులై ఆనందించే **“పరమన్”** భగవద్రామానుజులని ప్రకృతంలో తాత్పర్యం.

3. **“మణ్మిశై యోనికళ్తోఱుమ్ పిఱన్దు”** (41) (ఈ భూమిలో అనేక జాతులలో అవతరించి), **“ఞానమ్ కనిన్ద నలమ్ కొణ్డు”** (66) (జ్ఞానం పండిన ఆనందాన్ని పొంది) ఇత్యాది ఇరామానుశనూ*ర్ర*న్దాది పాశురాలలో చెప్పబడిన రీతిలో, భగవానునికంటే, (**“ఓఙ్గి”**)- అతిశయించి, లోకాలను అన్నిటిని స్వాధీనం చేసికొన్న ఉత్తములు శ్రీరామానుజులు ఒక్కరే. ఎవరికీ ఏమీ ఉపదేశించనివారు అధములు. నిర్బంధంవల్ల చెప్పేవారు మధ్యములు. తమ కరుణతో తామే స్వయంగా పలికేవారు ఉత్తములు. **“ఓరాణ్ వ*ళి*యాయ్ ఉపదేశిత్తార్ మున్నోర్”** (37) (ఒక విశిష్టమైన మార్గంలో పూర్వాచార్యులు ఉపదేశించారు) అనే ఉపదేశ రత్తినమాలై పాశురంలో తెల్పిన రీతిలో ఉత్తములు శ్రీరామానుజులు ఒక్కరే. ఇరామానుశనూ*ర్ర*న్దాదిలోని **“మ*ర్ర*ొరు పేఱు మదియాతు”** (58) (వేఱొక ప్రాప్యాన్ని నా మనస్సు లెక్కించదు) అనే పాశురంలో అముదనార్, శ్రీరామానుజులను ఉత్తములుగా కీర్తించారు. పాశురంలోని **“నమ్పావై”** (రెండవ పాదం) అనే సూక్తికి అనుగుణంగా **“ఞానత్తుఱై పడిన్దాడి”** (జ్ఞానతీర్థంలో అవగాహించి) అనే నమ్మా*ళ్వా*ర్లు తిరువిరుత్తపాశురభావం స్మరించాలి.

4. ఈ పాశురంలో, భగవానుని సుదర్శనం అనే చక్రం, పాంచజన్యం అనే శంఖం, శార్ఙ్గమనే ధనుస్సు ప్రస్తావింపబడినందువల్ల, **“అడైయార్కమత్తలర్**

మకళ్కేళ్వన్” (33) అనే ఇరామానుశనూ*ర్ర*న్దాది పాశురంలో చెప్పబడిన రీతిలో **“వవృధే పంచభి రాయుధై ర్మురారేః”** అనే యతిరాజసప్తతి సూక్తి రీతిలో పంచాయుధా*ళ్వా*రుల ప్రాదుర్భావ విశేషమైన భగవద్రామానుజులు స్మరింపబడ్డారు. **“ఒన్ఱుమ్ నీ కైకరవేల్”** (నీవు ఎంతమాత్రం లోటు చేయకు)- అనేరీతిలో అపురూపంగా లభించిన అర్థవిశేషాలను ఏమీ వదలకుండా వర్షించిన మేఘం **“ఇరామానుశనెన్నుమ్ శీర్ముకిల్”** (శ్రీరామానుజులనే గొప్ప మేఘమే) మాత్రమే. **“ఆ*ళి*యుళ్ పుక్కు”** (సముద్రం లోపల ప్రవేశించి) అనే ప్రయోగానికి అనుగుణంగా- **“ఉపనిషద్దుగ్ధాబ్ధిమధ్యోద్ధృతామ్”** (ఉపనిషత్తులనే పాలసముద్రం లోపల నుండి ఉద్ధరించిన) అనే శ్రీభాష్యకారుల దివ్యసూక్తి. అనుసంధేయం. **“వా*ళ* ఉలకినిల్ పెయ్దిడాయ్”**- (లోకం ఉజ్జీవించేటట్లు వర్షించు)- లోకులంతా ఉజ్జీవించేటట్లుగా అర్థవిశేషాలను వర్షించినవారు శ్రీరామానుజులే.

5. **“ఆయర్కులత్తినిల్ తోన్ఱు మణివిళక్కు”** (గొల్లకులంలో అవతరించిన మణిదీపం) శ్రీరామానుజులు. కుడిచేయి ఏదో, ఎడమ చేయి ఏదో తెలియని గొల్లలు నివసించే చోటు రేపల్లె. అందులో అవతరించిన **“అణివిళక్కు”** (అందమైన దీపం), **“అయర్పాడిక్కు అణివిళక్కే”** (రేపల్లెకు గొప్ప అలంకారం) అని యశోదచేత పిలువబడేవాడు **“అచ్యుత భాను”**డైన శ్రీకృష్ణుడే. **“నృపశుః”** అని ఆళవన్దార్, **“వృత్త్యా పశుః నరవపుః”**, (ప్రవర్తనలో పశువు, రూపం మానవరూపాన్ని కలవాడు) అని మణవాళమహామునులు పల్కిన రీతిలో పశుప్రాయులైన అస్మదాదులు వర్తించే చోటు రేపల్లెవంటిది కనుక, **“ఇరుళ్ తరు మాఞాలమ్”** (అజ్ఞానాన్ని కల్గించే విశాలమైన భూమి) అయిన ఈ గోకులంలో అవతరించిన **“అణివిళక్కు”- “శ్రీరామానుజ దివాకరులు”**. **“పుణ్యాంభోజవికాసాయ పాపధ్వాంత క్షయాయ చ, శ్రీమానావిరభూద్భూమౌ రామానుజదివాకరః”**(పుణ్యమనే పద్మం వికసించడంకోసం, పాపమనే చీకటి నశించడంకోసం భగవత్కైంకర్య లక్ష్మిని కల శ్రీరామానుజులనే సూర్యుడు భూమిలో అవతరించారు) అని కీర్తింపబడుతున్నది కదా!

6. **“పుళ్ళరైయన్ కోయిల్ వెళ్ళై విళి శఙ్గు”** అనే ప్రయోగం భగవద్రామానుజులకు చాలా చక్కని ప్రత్యభిజ్ఞాపకం. **“పాలన్న వణ్ణత్తున్ పాఞ్జశన్నియమే”** (పాలవంటి తెల్లని రంగును కల నీ పాంచజన్యం) అనే రీతిలో పాలవంటి తెల్లని వర్ణాన్ని కల్గినది- శంఖం. భగవద్రామానుజులు కూడా **“దుగ్ధోదన్వద్ధవళమధురం శుద్ధసత్త్వానురూపం రూపం యస్య స్ఫుటయతి తరాం యం ఫణీంద్రావతారమ్”**

(పాలకడలి వలె తెల్లనిది, భోగ్యమైనది, శుద్ధసత్త్వగుణానికి తగినది అయిన ఏ శ్రీరామానుజుల రూపం, వారు ఆదిశేషుల అవతారమని స్పష్టం చేస్తున్నదో) అనే రీతిలో పాలవలె తెల్లని వర్ణాన్ని కలవారు. ఈ శంఖం ఎక్కడ ఉన్నది? అని అంటే, **"పుళ్ళరైయన్ కోయిల్"** (పక్షిరాజు కోవెల)లో - **"పూమరువి పుళ్ళినజ్గళ్ పుళ్ళరైయిన్ పుకழ் కుழுఱుమ్ పునలరజ్గమే"** (పూలలో నిలచి ఉండి, పక్షుల సమూహాలు పక్షిరాజైన గరుత్మంతుని వాహనంగా కల భగవానుని కల్యాణగుణాలను కీర్తించే శ్రీరంగం) అని అంటూ పెరియழ்వార్లు **"పుళ్ళరైయన్‌కోయిల్"** గా పల్కిన శ్రీరంగంలో నివసించింది. చక్రం, శంఖం- అనే రెండు దివ్యాయుధాలలో, చక్రం **"కరుదు మిడమ్ పొరుదు"** (స్వామి భావించిన చోటుకు పోయి పోరాడే) అని పల్కిన రీతిలో, **"కాశీవిప్లోషచైద్యక్షపణధరణిజధ్వంస"** (కాశీదహనం, శిశుపాలవధ, నరకాసుర సంహారం) ఇత్యాదిగా పలు కార్యవిశేషాల కోసం బాహ్యసంచారాలను చేస్తూ ఉంటుంది. శంఖం ఆవిధంగా కాకుండా, **"ఉణ్బదు శొల్లిల్ ఉలకళన్దాన్ వాయముదమ్ కణ్‌పడైకొళ్ళిల్ కడల్‌వణ్ణన్ కైతలత్తే"** (యథార్థం పల్కితే, లోకాలను కొలిచినవాని అధరామృతాన్ని ఆ సముద్రవర్ణుని శ్రీహస్తంలో నిలచి ఉండి ప్రత్యక్షంగా గ్రహిస్తున్నావు) అనే రీతిలో (భగవానుని శ్రీహస్తంలోనే) ఉంటుంది. భగవద్రామానుజులుకూడా- **"యావచ్ఛరీరపాత మత్రైవ శ్రీరంగే సుఖమాస్వ"** (శరణాగతి గద్యమ్) (శరీరపాతం వరకు ఇక్కడే శ్రీరంగంలో సుఖంగా నివసించండి) అనే శ్రీరంగనాథుని ఆజ్ఞానుసారం శ్రీరంగమే నివాసస్థానంగా వేంచేసి ఉన్నారు. అందువల్ల **"కోయిల్ శఙ్గు"** అనే ప్రయోగం శ్రీరామానుజులపట్ల చాలా బాగా పొసగుతుంది.

7. **"కలన్దు పేశిన పేచ్చరవమ్"** - (కలసి పల్కిన మాటలలోని ధ్వని) పూర్వాచార్య శ్రీసూక్తులతో కలసి ఉండేటట్లుగా (వాటికి విరోధం లేని రీతిలో) శ్రీసూక్తులను అనుగ్రహించినవారు- శ్రీరామానుజులు- అనేది వీరి దివ్యసూక్తులవల్ల సిద్ధం. శ్రీభాష్యాన్ని ప్రారంభించేటపుడే **"భగవద్బోధాయనకృతాం విస్తీర్ణాం బ్రహ్మసూత్ర వృత్తిం పూర్వాచార్యాః సంచిక్షిపుః; తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే"** (భగవానుడైన బోధాయనుడు రచించిన విస్తృతమైన బ్రహ్మసూత్ర వృత్తిని పూర్వాచార్యులు సంగ్రహించి పలికారు. వారి అభిప్రాయానుసారంగా సూత్రాక్షరాలు వ్యాఖ్యానింపబడుతున్నాయి.) అని పల్కినవారు శ్రీరామానుజులొక్కరేకదా! అంతేకాక, **"కలన్దు పేశుకై"** (కలసి పల్కడం) అంటే- సంస్కృత- ద్రావిడభాషలను కలిపి మణిప్రవాళశైలిలో పల్కడం. ఈ విధమైన గ్రంథంగా మొట్టమొదటగా

ఆఱాయిరప్పడి వ్యాఖ్యానమే అవతరించింది. దీనిని తిరుక్కురుకైప్పిరాన్ పిళ్ళాన్ అనుగ్రహించినా, **"ఎతిరాశర్ పేరరుళాల్"** (శ్రీరామానుజుల గొప్ప కరుణవల్ల) అని మణవాళమహామునులు పల్కిన రీతిలో శ్రీరామానుజులు నేర్పిన శైలియే. అది అందువల్ల రెండు భాషలను కలిపి పల్కిన శైలికి నిదానభూతులు శ్రీరామానుజులే- అని ఈవిధంగా సూచింపబడింది.

8. **"మిక్కుళ్ళ పిళ్ళైకళుమ్ పోవాన్ పోకిన్టారై ప్పోకామల్ కాత్తు"** -(మిగిలిన గోపికలను వెళ్ళకుండా అడ్డగించి) అనే ప్రయోగంలో శ్రీరామానుజుల ప్రభావమే బాగా స్ఫురిస్తుంది. **"అర్వాంచో యత్పదసరసిజద్వంద్వ మాశ్రిత్య పూర్వే మూర్ధ్నా యస్యాన్వయ ముపగతా దేశికా ముక్తి మాపుః"** అనే భట్టర్ అనుగ్రహించిన సూక్తికి, **"పాదకోటీరయో స్సంబంధేన సమేధితాత్మవిభవాన్"** (శ్రీరామానుజుల శ్రీపాదాలయొక్క, కిరీటంయొక్క సంబంధంచేత మిక్కిలి వర్ధిల్లిన తమ వైభవాన్ని కల్గినవారైన, అనంతర కాలంలోని ఆచార్యులను,ముందు కాలంలోని పూర్వాచార్యులను) అనే నిగమాంత మహాగురుసూక్తికి అనుగుణంగా శ్రీచరణసంబంధంతో తమకు తరువాతివారిని, శిరఃసంబంధంతో తమకు పూర్వులను ఉజ్జీవింపజేసిన వారు- శ్రీరామానుజులు. **"మిక్కుళ్ళ పిళ్ళైకళ్"** (మిగిలిన గోపికలు) అనేది- స్వామికి పూజ్యులై ఉండే పూర్వులను తెల్పుతుంది. **"పోకామల్ కాత్తు"** (పోకుండా అడ్డుకొని) అనేది -తాము అవతరించివారికి సద్గతిని పొందించిన రీతిని సూచిస్తుంది. దీని వివరం విస్తృతి భయంతో చేయబడలేదు. శ్రీరామానుజచరిత్రలో చూడవచ్చు.

9. **"మణిక్కతవమ్ తాళ్ తిఱవాయ్"**- **"మణి"** అని రత్నానికి పేరు. రత్నాలు తొమ్మిది కనుక **"నవ"** అనే పదం ఇక్కడ సూచితం. **"కతవు"** (కవాటం) అనేది సేకరించిన పదార్థాలను మఱుగుపరుస్తుంది. భగవద్రామానుజుల దివ్యగ్రంథాలే ఇక్కడ **"కతవు"** అని చెప్పబడ్డాయి. శ్రీరామానుజుల గ్రంథాలు- శ్రీభాష్యం, వేదార్థసంగ్రహం, వేదాంతసారం, వేదాంతదీపం, గీతాభాష్యం, శరణాగతిగద్యం, శ్రీరంగగద్యం, వైకుంఠగద్యం, నిత్యం - అనే తొమ్మిది గ్రంథాలు కనుక, అవి ఇక్కడ **"మణిక్కతవు"** (మణికవాటాలు) అని సూచింపబడ్డాయి. వాటిని తెఱవాలి- అంటే- వాటిలోని అర్థవిశేషాలను మా మనస్సులో నిలిచేటట్లు వివరించాలి- అని తాత్పర్యం.

10. **"నోற்ఱు చ్చువర్క్కమ్ పుకుకిన్ఱ అమ్మనాయ్!"** (నోము నోచి స్వర్గాన్ని ప్రవేశించే నాయకీ!), **"అరుజ్కలమే!"** (అరుదైన ఆభరణమా!) అనే రెండు

సంబోధనలలో శ్రీరామానుజులు స్మరణం విశేషంగా కల్గుతుంది. "**నో***ఱ్ఱు*" అనే పదానికి మహాభాగ్యవశంచేత -అని భావం. "**చ్చువర్క్కమ్ పుకుకిన్ట**"- "**వర్క్కమ్**" అనే పదం సమూహాన్ని కూడా తెల్పుతుంది. యాదవప్రకాశులవద్ద విద్యాభ్యాసం చేస్తూ వారి సంరక్షణలో ఉండే శ్రీరామానుజులు, ఆ యాదవప్రకాశులు చేసిన ప్రయత్నంవల్ల ఆపదలను ఎదుర్కొన్నా, ప్రమాదాన్ని పొందకుండా, మనవంటివారి భాగ్యవశంచేత పెరున్దేవిత్తాయార్ వల్లభుడైన వరదుని పరమకృపకు లక్ష్యభూతులై, శ్రీవైష్ణవవర్గంలో ప్రవేశించి, అందఱికి మాతృస్థానీయులు (**అమ్మనార్**) అయినారు. "**శువర్క్కమ్**" అనే పదానికి స్వర్గమనే అర్థాన్ని తెల్పినా, "**య స్త్వయా సహ స స్వర్గో నిరయో యస్త్వయా వినా**" - (నీతో కలసి ఉండడం స్వర్గం, విశ్లేషించడం నరకం) అనే శ్రీరామాయణ సూక్తి రీతిలో, భగవానునితో ఎల్లప్పుడూ కూడి ఉండేవారని భావం. సిద్ధాశ్రమంనుండి వస్తున్నామని అంటూ వచ్చిన వేటగాడు, వేటకత్తె రూపంలోని భగవద్దంపతులతో కలసి వచ్చిన వృత్తాంతం కూడా దీనిద్వారా స్మారితం. "**అరుజ్కలమే!**" అనే దానికి "అరుదైన ఆభరణమా!'' అని, "**ఉత్తమ సత్పాత్రమా!**" అని అర్థం. మన గురుపరంపరలో మహాభూషణంగా ప్రకాశించేవారు, శ్రీరామానుజులు. "**తస్మిన్ రామానుజార్యే గురురితి చ పదం భాతి నాన్యత్ర**" (గురుశబ్దం ఆరామానుజులలోనే ప్రకాశిస్తున్నది, వేఱొకరిలో ప్రకాశించడంలేదు.) అనే సూక్తికి అనుగుణంగా ఉత్తమసత్పాత్రంగా వెలిగేవారుకూడా, వీరే.

11. ఈ పాశురంలో "**క***ఱ్ఱు* **క్కఱవై**" అని ప్రారంభించి, "**కోవలర్తమ్ పొఱ్కొడియే !**" (గోపాలురకు బంగారు తీగవంటిదానా!) అనే పర్యంతం గల సంబోధన పూర్తిగా భగవద్రామానుజుల గొప్పతనాన్ని తెలుపుతున్నది. "**క***ఱ్ఱు*" - "**శొల్లార్ తమి***ఴ్* **ఒరు మూన్ఱుమ్ శురుతికళ్ నాన్గు మెల్లైయిల్లా అఱనెఱి యావుమ్ తెఱిన్దవన్**" (44) (ఇయల్, ఇశై, నాటకమ్ - అనే మూడు ద్రావిడ భాషారీతులను, నాల్గు వేదాలను, అంతులేని ధర్మశాస్త్రాలను అన్నిటిని తెలిసినవారు) అనే ఇరామానుశ నూ*ఱ్ఱ*న్దాది పాశురోక్త క్రమంలో సమస్తవిద్యలను నేర్చి- అని అర్థం. "**కఱవై క్కనజ్గళ్ పల కఱన్దు**" (పలు గోసమూహాలను పితికి) -"**పంచాచార్యపదాశ్రితః**" అని యతిరాజవైభవంలో తెల్పిన విషయాన్ని ఈ ప్రయోగం సూచిస్తున్నది. "**గవా మంగేషు తిష్ఠంతి భువనాని చతుర్దశ**" (గోవుల అంగాలలో పదునాల్గు లోకాలున్నాయి) అనే రీతిలో గోవులు పదునాల్గు లోకాలను వహించేటట్లే, చతుర్దశ విద్యలను తమలో నిలుపుకొని, వాటిని చక్కగా వెలువరించే (నేర్పే) పలువురు ఆచార్యులవద్ద పలు సత్సంప్రదాయార్థాలను విని ఉజ్జీవించిన

వారు- శ్రీరామానుజులు. పెరియనంబివద్ద పంచసంస్కారాలను పొంది, మంత్రార్థాలను ఆలకించారు, పెరియతిరుమలనంబి వద్ద శ్రీరామాయణార్థాలను విన్నారు. తిరుక్కోట్టియూర్నంబివద్ద రహస్యార్థాలను విన్నారు. తిరుమాలైయాణ్డాన్ వద్ద తిరువాయ్మొ*ఴి* అర్థాన్ని గ్రహించారు.ఆళవన్దారా*ఴ్వా*న్ వద్ద దివ్యప్రబంధాల మూలాన్ని, సద్వార్తలను కొన్నిటిని నేర్చినందువల్ల "**కఱవై క్కనజ్గళ్ పల కఱన్దు**" అనే సూక్తి భగవద్రామానుజులకు చాలా పొసగుతుంది. ఇంతేకాక, "**శె***ఱ్ఱా***ర్ తిఱలఴియ చ్చెన్ఱు శెరు చ్చెయ్యుమ్**"- (శత్రువుల బలం నశించేటట్లుగా తానే ముందుగా వెళ్ళి పోరాడే) భగవానుని నిర్గుణుడని, నిర్విభూతికుడని, నిర్లక్ష్మీకుడని, దివ్యమంగళవిగ్రహశూన్యుడని పలికేవారే "**శె***ఱ్ఱా***ర్**' (ప్రత్యర్థులు). వారి బలం నశించేటట్లుగా- వాగ్బలం నశించేటట్లుగా- అని అర్థం. ఈవిధంగా చతుర్దిశలలోను వేంచేసి వాదయుద్ధాన్ని చేసినవారు- శ్రీరామానుజులు "విప్రాన్ నిర్జిత్య వాదతః" (పండితులను వాదంతో జయించి) అనే రీతిలో ఇది దోషం కాదు. సిద్ధాంత సంరక్షణార్థం చేసినది కనుక గుణమే కాగలదు- అనే విషయాన్ని తెలుపడంకోసం "**కు***ఱ్ఱ***మ్ ఒన్ఱిల్లాత**" (దోషం ఏమీ లేని) అని ప్రయోగింపబడింది. "**గో**" (**కో**) అనే సంస్కృతశబ్దం నానార్థకం కనుక, ప్రకృతంలో శ్రీసూక్తిని తెలుపుతుంది. "**యద్గోసహస్ర మపహంతి తమాంసి పుంసామ్**" (ఎవరి వాక్సహస్రం మానవుల అజ్ఞానాన్ని పోగొడుతున్నదో)అనే ప్రయోగంలో ఈ అర్థాన్ని గమనించవచ్చు. "**కోవలర్**"- (**కోవల్లవర్**) మహావిద్వాంసులు. వారిలో, "**పొఱ్కొడి**" (మెఱుపుతీగ) - శ్రీరామానుజులు. "**కో- అల(ల్ల)ర్**"- **కోవలర్**- స్వామి కానివారు శేషభూతులని అర్థం. వారిలో "**పొఱ్కొడి**" (**కో-గో-**వాక్కు) (అనికూడా అర్థం)

12. శ్రీరామానుజులు అవతరించిన పుణ్యస్థలమైన శ్రీపెరుంబుదూర్లో రెండుమార్లు అనుసంధించే పాశురం ఇది. పూర్వాచార్యులుకూడా తమ వ్యాఖ్యానాలలో చివర భగవద్రామానుజులను ప్రస్తావించిన పాశురం ఇది. ఏతావన్మాత్రమే చాలు- ఇక్కడ ప్రస్తావన చేయడానికి. అయినా, మఱి కొంచెం ప్రస్తావింపబడుతున్నది. ఈ పాశురంలోని "నఱ్చెల్వన్" (గొప్ప సంపద కలవాడు) అనే ప్రయోగం శ్రీరామానుజులను నిర్దేశిస్తుంది. "నఱ్చెల్వన్" అనే పదాన్ని సంస్కృతంలో చెప్పాలంటే "**లక్ష్మిసంపన్నః**" (కైంకర్య లక్ష్మిని కలవాడు) అని అనాలి. శ్రీరామాయణంలో "**లక్ష్మణో లక్ష్మిసంపన్నః**" (లక్ష్మణుడు భగవత్ కైంకర్య సంపన్నుడు) అని కీర్తింపబడిన లక్ష్మణులే కదా శ్రీరామానుజులుగా అవతరించారు. ఆ లక్ష్మణుడు, "**అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చ తే**" (మీరిరువురు

మేల్కొని ఉన్నపుడు, నిద్రించేటపుడు అన్ని సేవలను చేస్తాను) అని విభవావతారంలో కైంకర్యాన్ని చేశారు. వీరు శ్రీరామానుజులు **"నిత్యకింకరో భవాని"** (నిత్యకింకరుడను కాగలను) అని అర్చాస్థలాలలో సాటి లేని కైంకర్యాలను చేశారు. **"మన్నియ తెన్నరఙ్గాపురి మామలై మత్తిఱ్ఱు మువన్దిడు నాళ్"** (స్థిరంగా నిలచి ఉండే శ్రీరంగనగరం, వేంకటాద్రి, ఇంకా అన్ని దివ్యదేశాలు ఆనందించే దినం) అనే శ్రీరామానుజుల వాళ్తిత్తిరునామ సూక్తి ఇక్కడ అనుసంధేయం.

13. ఈ పాశురంలో, **"కళ్ళమ్ తవిర్న్దు కలన్దు"** (కపటాన్ని విడచి, కలసి) అనేది ప్రాణస్థానీయమైన శబ్ద సందర్భం. **"కిం తేన న కృతం పాపం చోరేణాత్మాపహారిణా"** (ఆత్మాపహారాన్ని చేసినవాడు ఇక ఏ పాపాన్ని చేయలేదు?) అనే రీతిలో ఆత్మాపహారమనబడే చౌర్యం ఒకటి ఉన్నది. అది కాకుండా, ఇంకొక చౌర్యాన్ని గూర్చి వినండి. **"ఏక స్స్వాదు న భుంజీత భుంజీత బహుభి స్సహ"** (మంచి వస్తువును ఒంటరిగా తినరాదు. అందఱితో కలసి తినాలి) అనే రీతిలో భోగ్యపదార్థాలను పలువురితో కలసి అనుభవించి ఆనందించకుండా, ఇతరులకు తెలియని రీతిలో తాను ఒక్కడే అనుభవించడం ఒక పెద్ద దొంగతనం. భగవద్రామానుజులకు ముందున్న ఆచార్యులవద్ద ఇటువంటి చౌర్యం ఉన్నది. దానిని తీర్చినవారు శ్రీరామానుజులే. దానిని తీర్చి, అందఱితో కలసి అనుభవించారు. **"పిళ్ళైకళ్ ఎల్లారుమ్ పావైక్కళమ్ పుక్కార్"** (గోపికలంతా కాలక్షేపమండపాన్ని చేరారు.) అనే ప్రయోగం కూడా శ్రీరామానుజుల గొప్పతనాన్ని స్మరింపజేస్తుంది. **"పావైక్కళమ్"** - అంటే ఇక్కడ కాలక్షేపమండపం. అందులోకి అందఱు ప్రవేశించడం శ్రీరామానుజులకు ముందు జరుగలేదు. అధికారపరీక్షను చేసి, పలు నిర్బంధాలు, నియమాలు పెట్టినవారు- పూర్వం ఉన్న ఆచార్యులు. ఆశకు మించిన అధికార సంపద ఇంకొటి లేదు- అని భావించిన శ్రీరామానుజుల కాలంలోనే **"పిళ్ళైకళ్ ఎల్లారుమ్ పావైక్కళమ్ పుక్కార్"** (శిష్యులంతా కాలక్షేప మండపాన్ని ప్రవేశించారు) ఆ సంగతిని ప్రస్తుత ప్రయోగం సూచిస్తున్నది.

14. ఈ పాశురంలోని **"శెఙ్గళునీర్ వాయ్ నెకిళ్న్దు ఆమ్బల్ వాయ్ కూమ్బిన"** (ఎఱ్ఱ తామరలు వికసించాయి, కలువలు ముడుచుకొన్నాయి) అనే ప్రయోగం ద్వారా భగవద్రామానుజుల దివ్యప్రభావం ఒకటి స్మరణకు వస్తుంది. శ్రీరామానుజులు యాదవప్రకాశులవద్ద పూర్వపక్షవేదాంతాన్ని (అద్వైతాన్ని) అభ్యసించినపుడు, **"సర్వం ఖల్విదం బ్రహ్మ"** (ఈ జగత్తు అంతా బ్రహ్మ ప్రకారమే కదా), **"ఐతదాత్మ్యమిదం సర్వమ్"** (ఈ జగత్తు అంతా పరమాత్మను ఆత్మగా

కల్గినది), **"తత్త్వమసి"** (నీవు, ఆపరమాత్మకు ప్రకారభూతుడవై ఉన్నావు) ఇత్యాది శ్రుతివాక్యాలకు యాదవప్రకాశులు అపార్థాన్ని పలుకగా, శ్రీరామానుజులు "ఈ శ్రుతివాక్యాలకు ఈవిధంగా కదా అర్థాన్ని చెప్పాలి'' అని ఉపపన్నమైన అర్థాన్ని తెలిపారు. అపుడు ఏమీ బదులు చెప్పలేక యాదవప్రకాశులు వారిపై కోపించి హుంకరించారు- అని శ్రీరామానుజుల చరిత్ర గ్రంథాలు తెల్పుతున్నవి. ఆ సంగతి ఈ ప్రయోగంలో స్మరణకు వస్తుంది. శ్రీరామానుజుల ముఖం వికసించడం- **"శెఙ్గళునీర్ వాయ్ నెకిళ్న్దు"** (తామరలు వికసించాయి) అని తెలుపబడింది. యాదవప్రకాశులు మాఱు పలుకలేక, నోరు మూసికొని ఉండడం- **"ఆమ్బల్ వాయ్ కూమ్బిన"** (కలువలు ముడుచుకొన్నాయి) అని సూచింపబడింది. పాశురంలో తరువాత గల **"శెఙ్గల్ పొడిక్కూఱై వెణ్పల్ తవత్తవర్ తఙ్గళ్ తిరుక్కోయిల్ శఙ్గిడువాన్ పోకిన్దార్"** (కావిరంగు కాషాయాలను ధరించిన, తెల్లని దంతాలను కల సన్న్యాసులు తమ దేవాలయం తలుపులు కుంచకోలతో- బీగపుచెవితో తెరువడం కోసం పోతున్నారు.) అనేవి కూడా శ్రీరామానుజుల విషయంలో చక్కగా పొసగుతుంది. "శెఙ్గల్ పొడిక్కూఱై" - **"కాషాయేణ గృహీతవసనా"** (కాషాయాన్ని ధరించినవారు) అని యతిరాజస్తవతిలో కీర్తింపబడిన దివ్యమూర్తి- అనిభావం. ''వెణ్పల్'' (తెల్లని దంతాలు కలవారు)- **"అచ్యుతపదాంబుజ యుగ్మరుక్మవ్యామోహత స్తదితరాణి తృణాయ మేనే"** (అచ్యుతుని పాదపద్మాల జంట అనే బంగారంలోని వ్యామోహంతో మిగిలినవానిని తృణప్రాయంగా భావించారు) అనే రీతిలో మహావిరక్త సార్వభౌములు కనుక, **"యత్తస్మై తిష్ఠతేఽన్యః కృపణ మశరణో దర్శయన్ దంతపంక్తీః"** (చక్రవర్తి దగ్గర తన దంతాల వరుసను చూపి నవ్వుతూ, దీనుడై, ఏ శరణం లేకుండా ఉండేవాడు) అనే రీతిలో ఇతరులవద్దకు పోయి తమ దంతాలను చూపి యాచించనివారు. **"తవత్తవర్"** (నీకోసం, నీకోసం)- **"మమ, మమ"** (నాది, నాకు) అని అనకుండా **"తవ తవ"** అని అంటూ శేషత్వం పరిమళించేటట్లు ఉండేవారు. **"తవత్తవర్", "తఙ్గళ్ తిరుక్కోయిల్"** - తిరువరఙ్గత్తముదనార్ అధీనంలో ఉండే శ్రీరంగాలయం తమ కోవెల- అనే రీతిలో తమ అధీనంలోకి తెచ్చుకొన్నవారు. **"శఙ్గిడువాన్"** (శంఖం పెట్టడంకోసం) - **"శంఖః"** అనే సంస్కృతపదం **"శఙ్గు"** అనే వికారాన్ని పొందేటట్లే, **"శంకుః"** అనే సంస్కృతపదం **"శఙ్గు"** అనే వికృతిని పొందుతుంది. దీనికి **"కుంచెకోల"** అని అర్థం. ఆఱాయిరప్పడి వ్యాఖ్యలో ఈ అర్థం చెప్పబడింది. కూరేశులద్వారా శ్రీరామానుజులు శ్రీరంగదివ్యాలయానికి చెందిన బీగపు చెవులను పొందిన ఇతిహాసం ఈ పదప్రయోగంద్వారా స్మారితమైనది.

15. ఈ పాశురంలో **"ఉనక్కెన్న వేఱుడైయై"** (నీకేమి ప్రత్యేకమైన గొప్పతనం) అనే పదసందర్భం ప్రధానం. "మీకు మాత్రం అసాధారణమైన గొప్పతనం ఏమి?" అని ఆశ్చర్యంగా పల్కిన మాట ఇది. శ్రీరామానుజులకు పూర్వం నమ్మాళ్వార్లు, శ్రీమన్నాథమునులు, ఆళవన్దార్ మన దర్శనానికి నిర్వాహకులై ఉన్నా, **"నమ్మాళ్వార్ దర్శనమ్"** అని కాని, **"నాథమునికళ్ దర్శనమ్"** అని కాని, **"ఆళవన్దార్ దర్శనమ్"** అని కాని వ్యవహారం ఏర్పడలేదు. **"ఎమ్బెరుమానార్ దర్శనమ్"** అనే వ్యవహారం ఏర్పడడానికి కారణమైన స్వామియొక్క అసాధారణవైలక్షణ్యం దీనిద్వారా అనుసంధేయం. **"మాత్తారై మాత్తళిక్క వల్లానై"** (శత్రువుల గర్వాన్ని తీర్చగలవాడు) అనే ప్రయోగంతో **"పాషండద్రుమషండ దావదహనః చార్వాకశైలాశనిః బౌద్ధధ్వాంతనిరాసవాసరపతిః జైనేభకంఠీరవః, మాయావాది భుజంగభంగగరుడః"**, (శ్రీరామానుజుల త్రిదండం - పాషండమతమనే వృక్షసమూహాలను దహించే దావాగ్ని, చార్వాకులనే పర్వతాలకు వజ్రం, బౌద్ధులనే చీకటిని పోగొట్టే సూర్యుడు, జైనులనే ఏనుగులకు సింహం, మాయావాదులనే సర్పాలను భగ్నం చేయడంలో గరుడుడు) అని, **"తర్క్కచ్చమణరుమ్ శాక్కియ ప్పేయ్కళుమ్... నీశరుమ్ మాణ్డనర్"** (తార్కికులు, శాక్తేయులనే పిశాచాలు. . .. నీచులు నశించారు) అని, **"శాఱువాకమత నీఱు శెయ్తు"** (చార్వాక మతాన్ని భస్మం చేసి) అని గల పూర్వాచార్య సూక్తులు స్మరణకు వస్తాయి.

16. యతిరాజసప్తతిలో - **"అమునా తపనాతిశాయిభూమ్నా యతిరాజేన నిబద్ధనాయకశ్రీః, మహతీ గురుపంక్తిహారయష్టిః"** (సూర్యుని మించిన కాంతిని కల ఈ యతిరాజులనే రత్నంతో గొప్పదైన గురుపరంపర అనే హారం నాయమణిని కల్గినది అయినది) అని చెప్పబడిన రీతిలో, మన గురుపరంపరాహారంలో నాయకమణిగా వెలిగేవారు- శ్రీరామానుజులు - **(నన్దకోపన్)** - తనకు ఔరసపుత్రుడు లేనందువల్ల **"ఆయర్పుత్తిరనల్లన్ అరున్దెయ్వమ్"** (గోపాలుడు కాదు, అరుదైన దైవం) అని చెప్పబడే ఒక దైవాన్ని పుత్రునిగా పొందిన నన్దగోపాలునివలె, శ్రీరామానుజులు కూడా, **"యతిరాజసంపత్కుమారా !"** అని పలికేటట్లు శెల్వప్పిళ్ళైను తమకు పుత్రునిగా పొందారు. **"ఉడైయ" - "ఉడైయవర్"** (సొత్తుదారుడు) అనే తిరునామం ఇక్కడ సూచితమైనదని చెప్పడంలో లోటు లేదు. **(కోయిల్ కాప్పాన్)- "శ్రీమన్! శ్రీరంగశ్రియ మనుపద్రవా మనుదినం సంవర్ధయ"** (శ్రీమన్ ! శ్రీరంగనగర సంపదను నిత్యం వర్ధిల్లజేయాలి) అనే రీతిలో శ్రీరంగాన్ని రక్షించినవారు భగవద్రామానుజులు.

(కొడిత్తోన్రుమ్ తోరణవాశల్ కాప్పాన్)- "ఉభయవిభూతి సామ్రాజ్యపట్టాభిషిక్తా !" అనేది శ్రీరామానుజుల కట్టియంలోని సంబోధన. పూర్వం **"కోయిల్ కాప్పాన్"** (కోవెలను రక్షించేవాడు) అనే ప్రయోగంద్వారా లీలావిభూతి సామ్రాజ్య పట్టాభిషేకం చెప్పబడింది. ఇక్కడ నిత్యవిభూతి సామ్రాజ్యపట్టాభిషేకం తెలుపబడింది. **"కొడియణి నెడుమదిళ్ కోపురమ్ కుఱుకినర్"** (ధ్వజాలతో అలంకరింపబడిన గొప్ప ప్రాకారాలను కల గోపుర ద్వారాలను చేరారు), **"నెడువరై త్తోరణమ్ నిరైత్తెత్తు ఎఙ్గుమ్ తొழுతనరులకే"** (గొప్ప పర్వతాలవలె ఎత్తైన తోరణాలను కట్టి, ఆ లోకంలోనివారు నమస్కరించారు) అనే రీతిలో **"కొడిత్తోన్రుమ్ తోరణవాశల్"** అంటే- నిత్యవిభూతిలోని ద్వారం. దానిలో అన్యులు ప్రవేశించకుండా రక్షించేవారు శ్రీరామానుజులు.

17. అంబరాన్ని (వస్త్రాలను), చల్లని నీటిని, అన్నాన్ని ధర్మం చేసేవారు- శ్రీరామానుజులు. **"అంబరం వ్యోమవస్త్రయోః"** (అంబరశబ్దానికి ఆకాశమని, వస్త్రమని అర్థం) అనే నిఘంటువును బట్టి ఇక్కడ అమ్బరమంటే ఆకాశం. అది పరమాకాశమనబడే పరమపదం. దానిని, విరజాశబ్ద వాచ్యమైన **"తణ్ణీర్"**ను, **"అన్నం బ్రహ్మేతి వ్యజానాత్"** (అన్నాన్ని బ్రహ్మ అని తెలిసికొన్నాడు) అని ఉపనిషత్తులో అన్న శబ్దం చేత నిర్దేశింపబడిన పరబ్రహ్మానుభవాన్ని ధర్మాన్ని చేసే (అనుగ్రహించే) స్వామి- కృపామాత్ర ప్రసన్నాచార్యులై అనుగ్రహించినవారు భగవద్రామానుజులు. ఈ పాశురంలోనే తరువాత గల **"అమ్బర మూడఱుత్తు ఓఙ్గి ఉలకళన్ద ఉమ్బర్కోమాన్"** (ఆకాశం దాటి అంతటా వ్యాపించి పెరిగి లోకాలను కొలిచిన నిత్యసూరినాథుడు) అనే ప్రయోగం కూడా శ్రీరామానుజులపట్ల చక్కగా సమన్వయిస్తుంది. శ్రీయామునుల చరమతిరుమేనిని శ్రీరామానుజులు సేవించినపుడు, "ఆళవన్దార్‌తో కలసి నేను కొంతకాలం ఉండి ఉంటే పరమపదానికి మెట్లుకట్టి ఉండేవాడను" అని శ్రీరామానుజులు పల్కినట్లు ప్రసిద్ధి. ఆళవన్దార్‌తో కలసి జీవించలేకపోయినా, **"యత్పదాంభోరుహధ్యాన"** ఇత్యాది శ్లోకంలో చెప్పబడ్డ రీతిలోను, "ఆళవన్దార్‌క్కు నేను ఏకలవ్యశిష్యుడను" అనే సూక్తి రీతిలోను వారి విలక్షణమైన అనుగ్రహానికి పాత్రమైన వైలక్షణ్యంచేత నిత్యవిభూతికి, లీలావిభూతికి మధ్య ఉండే అడ్డుగోడను పడగొట్టి ఉభయవిభూతులను ఏకం చేసినవారు మన శ్రీరామానుజులు- అనే ప్రసిద్ధి కల్గింది. **"మదురకవి శొన్న శొల్ నమ్బువార్ పది వైకున్దమ్ కాణ్మినే"** (మధురకవులు పల్కిన మాటను నమ్మేవారుండే చోటు పరమపదమే, చూడండి) అనే కణ్ణినుణ్ శిఱుత్తామ్బుసూక్తి వ్యాఖ్యానంలో

ఉభయవిభూతులకు మధ్యగల అడ్డుగోడను కూలగొట్టిన గొప్పతనం పొందినట్లుగా చెప్పబడినా, ఆ గొప్పతనం శ్రీరామానుజుల విషయంలో కింపునర్న్యాయసిద్ధమే. **"అమ్బరత్తై"**- పరమాకాశాన్ని, **"ఊడఱుత్తు"** - అవరోధాన్ని - అడ్డును- తొలగించి- అని అర్థం.

18. ఈ పాశురంవల్లనే సహజంగానే భగవద్రామానుజులకు **"తిరుప్పావై జీయర్"** అనే వ్యవహారం ప్రసిద్ధం వచ్చినదనే సంగతి ప్రసిద్ధం, కనుక ఇక్కడ ప్రత్యేకించి వివరించవలసిన పనిలేదు. అయినా, పూర్వం చేయబడిన, ఇకపై చేయబోయే వివరణానికి అనుగుణంగా ఒక విషయం మాత్రం ప్రస్తావించబడుతున్నది. **"కన్దమ్ కమ***ழு***మ్ కు***ழ***లీ!"** (సుగంధం పరిమళించే కేశాలను కల్గినదానా!) అని అంటూ కేశపాశాన్ని ఉద్దేశించి పల్కడం శ్రీరామానుజుల మనస్సుకు చాలా ఆనందాన్ని కల్గించే సంబోధన. మతాంతరాలకు చెందిన యతులు శిఖను కల్గి ఉండరు. పూర్తిగా శిరోముండనాన్ని చేసికొంటారు. ఆ రీతిలో కాకుండా, **"కారిశుతన్ క***ழ***ల్ శూడియ ముడియుమ్"** (కారిసుతులైన నమ్మా***ழ்***వార్ల శ్రీచరణాలను అలంకరించుకొన్న శిఖ), **"కననత్కైై ముడియుమ్"** (గొప్పదైన, చక్కని శిఖ, కిరీటం) అని మన పూర్వాచార్యులు పల్కిన రీతిలో కమనీయశిఖాబంధంతో శ్రీరామానుజులు దర్శనమిచ్చే సొబగు మనస్సుకు హాయిని కల్గిస్తుంది.

19. తిరుక్కోట్టియూర్ నమ్బిసన్నిధికి శ్రీరామానుజులు పద్దెనిమిదిమార్లు వేంచేసి, వారివల్ల రహస్యార్థ విశేషాలను పొంది, అక్కడే దానిని కొందఱికి ఉపదేశించిన ఇతిహాసం ఈ పాశురంలో చక్కగా సూచింపబడింది. **"తోరణవిళక్కు, కుత్తువిళక్కు"** అని రెండు విధాలైన దీపాలున్నాయి. తోరణవిళక్కు- స్థావరంగా ఉంటుంది. కుత్తువిళక్కు- జంగమమై ఉంటుంది. స్వస్థానంలోనే స్థావరంగా ఉన్న తిరుక్కోట్టియూర్‌నంబి తోరణవిళక్కువంటివారు. పలుమార్లు గతాగతాలను (రాకపోకలను) చేసే శ్రీరామానుజులు కుత్తువిళక్కువంటివారు. ఈ కుత్తువిళక్కు, 'ఎరియ"- నంబిసన్నిధిలో అర్థవిశేషాలను ఆలకించి జ్వలించగా- అని భావం. **(కోట్టు)** 'ఏకదేశ వికృత మనన్యవద్భవతి" (ఏదో ఒక చోట కొంచెం మార్పు వచ్చినా అది ప్రకృతికంటే వేఱుకాదు) అనే సంస్కృతవ్యాకరణ ప్రక్రియానుసారం **"కోట్టి"** అని కొంచెం మార్పుతో ఈ పదాన్ని గ్రహించాలి. **"గోష్ఠీ"**అనే సంస్కృత పదం ద్రావిడంలో **"కోట్టి"** అనే వికృతిని పొందుతుంది. **"తిరుక్కోట్టియూర్"** అని దీని తాత్పర్యం. ఈ తిరుకోట్టియూర్‌లో- **(కాల్‌కట్టు)** రహస్యార్థాలను ఉపదేశించే తిరుక్కోట్టియూర్‌నంబి శ్రీచరణాలను స్పృశించి, శపథం చేసేటట్లుగా

శ్రీరామానుజులు నియమింపబడ్డారు కదా ! అది ఇక్కడ **"కాల్‌కట్టు"** అనే పదం ద్వారా సూచితం. **"మేలేఱి"**- ఇంతకు ముందే తమను అనువర్తిస్తూ ఉండే విలక్షణులైన కొందఱికి ఉపదేశించాలని తలచినవారు- శ్రీరామానుజులు. ఆలయం గోపురం పై అంతస్థుకు చేరిన సందర్భం దీనిద్వారా తెలుపబడింది. ఈ విధంగా ఆచార్యదివాజ్ఞను మీఱి ఉపదేశిస్తారా, శాస్త్రవశ్యులైన శ్రీరామానుజులు ? అనే సందేహాన్ని హరిస్తున్నది- **(మలర్‌మార్బా)**- అనే సంబోధన. దీని ద్వారా శ్రీరామానుజుల హృదయవైశాల్యమే దానికి కారణం- అనే విషయం సూచింపబడింది.

20. ఈ పాశురంలో **"శెప్పముడైయాయ్ ! తిఱలుడైయాయ్ ! శె***ற்ற***ార్‌క్కు వెప్పమ్ కొడుక్కుమ్ విమలా !"** (ఋజుత్వాన్ని కలవాడా ! సామర్థ్యాన్ని కలవాడా! శత్రువులకు భీతిని కల్గించే పరిశుద్ధుడా !) అనే సంబోధనలు శ్రీరామానుజుల విషయంలో చాలా అన్వర్థాలు. సంస్కృతభాషలోని ఆర్జవమనబడే పదం ద్రావిడంలో **"శెప్ప"** మనబడుతుంది. మనోవాక్కాయాలలో సారూప్యమనే కరణత్రయ సారూప్యమే ఆర్జవగుణం. అదే **"శెప్పమ్"**. భగవద్రామానుజుల దివ్యసూక్తులను అనుసంధించేటపుడు ఒక్కొక్క అక్షరం వారి ఆర్జవాన్ని కదా తెలుపుతుంది. పరనింద మొదలైనవానిని మనస్సులో కూడా తలచకుండా, వాక్కుతో పల్కకుండా ఉండే శ్రీరామానుజులకు, వారి పునరవతారమైన శ్రీవరవరమునులకు అసాధారణం కదా ! **(తిఱలుడైయాయ్) "తిఱళ్"** (బలిమి)- అంటే పరాభిభవనసామర్థ్యం. నివురుగప్పిన నిప్పువలె ఉండే అన్యవాదుల దుర్వాదాలను తల ఎత్తని రీతిలో ఖండించిన బలిమి, (సామర్థ్యం) స్వామికి అసాధారణం. **(శె***ற்ற***ార్‌క్కు వెప్పమ్ కొడుక్కుమ్)- "శె***ற்ற***ార్"** -అంటే విరోధులు. భగవానుల వైభవాన్ని సహించలేక **-"గుణిన మపి గుణైస్తం దరిద్రాణ మాహుః"** (కల్యాణగుణాలను కల్గినవానినికూడా గుణాలు లేనివాడని అంటారు.) అనే శ్రీభట్టర్ శ్రీసూక్తి ప్రకారం ఆస్వామిని సర్వదరిద్రునిగా పలికేవారు. వారికి **"వెప్పమ్"** అంటే - జ్వరం. అది భీతిజ్వరం. **"తస్మై రామానుజార్యాయ నమః పరమయోగినే, యః శ్రుతిస్మృతి సూత్రాణా మంతర్జ్వర మశీశమత్"** (శ్రుతులు, స్మృతుల, బ్రహ్మసూత్రాల అంతర్జ్వరాన్ని పోగొట్టినవారు, పరమయోగి అయిన ఆ శ్రీరామానుజాచార్యులవారికి నమస్కారం) అని అంటూ శ్రీరామానుజులు శ్రుతిస్మృతిసూత్రాలకు కల్గిన అంతర్జ్వరాన్ని తీర్చినవారు- అని చెప్పబడింది. ఆ జ్వరాన్ని ఎక్కడికి తరిమివేశారో తెలుసునా? విరోధుల మనస్సులోకి పోయేటట్లు దానిని తరిమివేశారు. హనుమానుడు లంకను

అగ్నిదగ్ధం చేశాడుకదా! ఏ నిప్పుతో దగ్ధం చేశాడు? అని అడిగితే, తనతోకలో రాక్షసులు అంటించిన నిప్పుతో- అని అన్నారట. కాని, కాదు. కాదు. **"శోకవహ్నిం జనకాత్మజాయాః, ఆదాయ తేనైవ దదాహ లంకామ్"** (సీతాదేవి శోకాగ్నిని కొనిపోయి హనుమానుడు లంకను దహించాడు) అనేటట్లు, సీతాదేవి కడుపులో మండుతున్న శోకాగ్నిని అక్కడనుండి తీసికొనిపోయి దానితోనే లంకను దగ్ధం చేశాడు- అని అన్నారు- మర్మజ్ఞులు. అదేరీతిలో ఇక్కడ కూడా శ్రుతిస్మృతిసూత్రాల అంతర్జ్వరాన్ని తొలగించి, దానిని విరోధుల కడుపులో జ్వలింపచేశారు.

21. **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్ ఆఱ్ఱప్పడైత్తాన్"** (గొప్ప ఔదార్యాన్ని కల పశువులను సమృద్ధిగా కలవాడు) అనేటపుడు శ్రీరామానుజుల గొప్పతనం తప్ప వేతేమీ స్ఫురించదు. శ్రీరామానుజులకు ముందున్న ఆచార్యులను ప్రస్తావించి, వారికి ఎంతమంది శిష్యులు? అని ప్రశ్నిస్తే, ఒకరు, ఇద్దఱు, ముగ్గురు, నల్గురు, అయిదుగురు- అని అనాలి; అంతే. శ్రీరామానుజుల శిష్యవర్గాలను గూర్చి అడిగితే **"ఏకాంతినాం ద్వాదశభి స్సహస్రైః, సమేధిత స్సంయమిసప్తశత్యా"** (పన్నెండు వేల మంది ఏకాంతులతో, ఏడువందలమంది యతులతో గొప్పగా వెలిగినవారు) అని వెంట ఉండేవారు (అనుచరులు) పలికే రీతిలో ఉంటుంది. అంతేకాక, మహాజ్ఞాన నిధులుగా తీర్చిదిద్దబడిన డెబ్బైనాల్గుమంది సింహాసనాధిపతులుగా నియమింపబడ్డవారున్నారు. వారు ఎటువంటి వారు? అని అంటే-

(ఏఱ్ఱ కలఙ్గళ్)- ఆచార్యసార్వభౌములకు తగిన స్వభావాన్ని కల్గిన, సత్పాత్రభూతులైన సచ్ఛిష్యులు. అంతేకాక, ఇంకా వారు ఎటువంటివారు? అని అంటే, **(ఎదిర్ పొఙ్గి మీదళిప్ప) "శిష్యాదిచ్ఛేత్పరాజయమ్"** (శిష్యుని వల్ల పరాజయాన్ని కోరాలి) అనే రీతిలో ఆచార్యునికూడా మించి ఉండేవారు. కాశ్మీరదేశంలోని శారదాపీఠంలో శ్రీరామానుజులు, కూరేశులు బోధాయనవృత్తిని పరిశీలిస్తూ ఉండగా, ఆప్రయత్నానికి ఆటంకాలు కల్గినపుడు, శ్రీరామానుజులు "అయ్యో ! వృత్తి గ్రంథాన్ని పూర్తిగా చూచే అవకాశం లేకపోయినదే !" అని బాధపడ్డారు. అపుడు ఆవృత్తిగ్రంథాన్ని పూర్తిగా చదివి, దానిని అంతా మనస్సులో ధరించిన కూరేశులు- "ఇక్కడే దానిని విన్నపించనా? లేక, శ్రీరంగద్వీపంలో దానిని విన్నపించనా?'' అని ప్రశ్నించారనే సంగతి ప్రసిద్ధం. ఈవిధంగానే కదా ఇంకా ఎంతోమంది శిష్యుల చరిత్రలున్నాయి. ఆ శిష్యులు ఇంకా ఎటువంటివారు? అని

అంటే, **(మాఱ్ఱాదే పాల్ శొరియుమ్)**- (నిరంతరం పాలను వర్షించే) ఆ ఆచార్యుల పరంపరను ఇంచుమించుగా అనుస్యూతంగా అనువరిస్తూ, పాలవంటి అర్థవిశేషాలను స్రవించేటట్లుగా పలుకుతారు. ఇటువంటి **"వళ్ళల్ పెరుమ్ పశుక్కళ్"** (ఔదార్యాన్ని కల గొప్ప పశువుల) ను, **"ఆఱ్ఱ పడైత్తాన్"** (సమృద్ధిగా కలవారు)- శ్రీరామానుజులు. **"ఆఱ్ఱ"** అంటే -అపరిమితంగా -అని అర్థం. ఈ పాశురంలోనే తరువాత గల **"మాఱ్ఱాతే వలి తొలైన్దు ఉన్ వాశల్కణ్"** (ఎదిరించలేక, బలాన్ని కోల్పోయి నీ వాకిటిలో) అనే ప్రయోగంలో యాదవప్రకాశులు వచ్చి వారిని ఆశ్రయించిన వృత్తాంతం స్మరణీయం.

22. **"తిఙ్గళుమ్ ఆదిత్తియనుమ్ ఎழுన్దాప్పోల్ అఙ్గణ్ ఇరణ్డుమ్ కొణ్డు"** (సూర్యుడు, చంద్రుడు ఉదయించినట్లుండే అందమైన రెండు నేత్రాలతో) అనేప్రయోగంలో స్వామియొక్క ఉభయవేదాంతగ్రంథప్రవచనపటుత్వం తెలుపబడుతున్నది. సూర్యుడు, చంద్రుడు ఒకేకాలంలో ఉదయించడం అసంభావితం. ఆదిత్యుడు ఉదయించినపుడు తీక్ష్ణతను, చంద్రుడు ఉదయించి నపుడు చల్లదనాన్ని అనుభవించవచ్చు. ఉభయవేదాంత ప్రవర్తకులైన శ్రీరామానుజులు, ప్రభాతవేళలో శ్రీభాష్యకాలక్షేపాన్ని అనుగ్రహించడం, సాయంవేళలో ఆழ்வార్ల శ్రీసూక్తుల (అరుళిచ్చెయల్) కాలక్షేపాన్ని అనుగ్రహించడం చేస్తారు. మతాంతరప్రత్యాఖ్యానతత్పరమైన శ్రీభాష్యంలోని అర్థాలు అనుభవింపబడేటపుడు తీక్ష్ణతను, **"శెవిక్కినియ శెఞ్జొల్"** (చెవులకు ఇంపైన గొప్పసూక్తి), **"శీర్ కలన్ద శొల్"** (భగవానుని కల్యాణగుణాలు కలిసిన సూక్తి) అని కీర్తింపబడే ఆழ்வార్ల శ్రీసూక్తులలోని అర్థాలు అనుభవింపబడేటపుడు సౌమ్యతను దర్శించవచ్చు. రెండిటిలోను రెండూ ఉన్నా, **"ఇప్పడి చ్చొల్లుకిఱతుమ్ ఊఱ్ఱత్తై ప్పఱ్ఱ"** (ఈ విధంగా పల్కడం ప్రాధాన్యాన్ని బట్టి) అనే శ్రీవచనభూషణ ప్రక్రియానుసారంగా గ్రాహ్యం. తరువాత గల **"అఙ్గణ్ ఇరణ్డుమ్ కొణ్డు ఎఙ్గళ్మేల్ నోక్కుదియేల్"** అనే ప్రయోగంలో కూడ "ఉభయవేదాంతార్థాలను మాకు కటాక్షించాలి'' అనే ప్రార్థన ఉన్నది. **"చక్షుష్మత్తా తు శాస్త్రేణ"** (శాస్త్రాలద్వారానే నేత్రాలను - దృష్టిని - కల్గినవారై ఉండడం) అనే రీతిలో **"కణ్"** (కన్ను) అంటే - శాస్త్రమే. ఉభయవేదాంతాలు శ్రీరామానుజులకు రెండు నేత్రాలు. ఒక నేత్రం విషయంలో ఆదరం, ఇంకొకనేత్రం పట్ల అనాదరం కల్గి ఉండడమే శాపం. దానిని పోగొట్టాలి-అని తాత్పర్యం. శ్రీరామానుజుల సన్నిధిలో వారి శిష్యులు చేసే ప్రార్థన ఇది.

23. **"అఱివుఱ్ఱు త్తీ విழித్తు వేరి మయిర్ పొజ్గ ఎప్పాడుమ్ పేర్న్దు ఉదఱి మూరి నిమిర్న్దు ముழజ్గి ప్పుఱప్పట్టుమ్ శీరియ శిజ్గమ్"** (తెలివిని పొంది, అగ్నివంటి చూపులను సారించి, పరిమళాన్ని కల కేశాలు పొంగగా, అతటా శరీరాన్ని సాగదీసికొని, విదలించుకొని, సింహనాదం చేసి బయలుదేరే గొప్ప సింహం) మన యతిసార్వభౌమ సింహమే తప్ప ఇంకొకటి ఉన్నదా! ఇరామానుశ నూఱ్ఱన్దాదిలోని **"కలిమిక్క శెన్నెల్ కழని క్కుఱైయల్ కలైపెరుమానొలిమిక్క పాడలై యుణ్డు తని యుళ్ళమ్ తడిత్తు అదనాల్ వలి మిక్క శీయ మిరామానుశన్"** **(88)** (గొప్ప సారాన్ని కల్గిన, ఎఱ్ఱని ధాన్యం పండే సస్యక్షేత్రాలను కల తిరుక్కుఱైయలూర్‌లోని స్వామి అయిన తిరుమంగై మన్నన్ అనుగ్రహించిన చక్కని సంగీతాన్ని కల పాటలను అనుభవించి, అందువల్ల మనస్సులో ఆనందించి, ఉబ్బి, తత్కారణంగా గొప్ప బలాన్ని కల్గిన సింహం- శ్రీరామానుజులు) అనే సూక్తిలో **"శీరియ శిజ్గమ్"** (గొప్ప సింహం)గా శ్రీరామానుజులు కీర్తింపబడ్డారు. లోకంలోని సింహం, హేయమైన ఆహారాన్ని తిని బలిసి ఉంటుంది. యతిరాజసింహం, తిరుమఙ్గైయాழ்వార్ల దివ్యసూక్తులను భుజించి, దానివల్ల బలిమిని పొందింది- అని ఈ సూక్తిలో అముదనార్ పలికారు. ఈసింహం సంచరించే పర్వతాలు గుహలు విలక్షణంగా ఉంటాయి. మూడువందల ఏండ్లు వేదాన్ని అధ్యయనం చేసిన భరద్వాజమహర్షికి దేవేంద్రుడు వేదాలను పర్వతంగా చూపించాడనే వేదం చెప్పినందువల్ల, ఇక్కడ వేదమే పర్వతంగా గ్రహించదగినది. అందులో గుహ అంటే- **"ధర్మస్య తత్త్వం నిహితం గుహాయామ్"** (ధర్మంయొక్క తత్త్వం గూఢంగా నిలుపబడింది) అనే రీతిలో ధర్మసూక్ష్మాలు పొదగబడి ఉండే చోటు. అందులో స్థిరంగా నిలచి ఉండడం అంటే - లౌకిక విషయాలలో దృష్టిని కల్గి ఉండడం కాకుండా, **"ఆత్మన్యేవ ఆత్మానం పశ్యన్"** అనే రీతిలో భగవదనుభవంతో ఆనందిస్తారు శ్రీరామానుజులు.

(అఱివుఱ్ఱు)- "నేను అవతరించడం ఏ ప్రయోజనం కోసం?'' అని తమ అవతార ప్రయోజనాన్ని గూర్చి భావించి అని భావం. **(తీ విழித్తు) "బుద్ధిర్మనీషా ధిషణా"** అనే అమరకోశవచనానుసారం బుద్ధిపర్యాయమైన ధీవాచకం ఇక్కడ **"తీ"** అని మాఱింది. అది వికసించినది శ్రీరామానుజులకే -అని తాత్పర్యం. **(ఎప్పాడుమ్ పేర్న్దు ఉదఱి) - "శ్రీరంగం కరిశైల మంజనగిరిం తార్క్ష్యాద్రి సింహాచలౌ శ్రీకూర్మం పురుషోత్తమం చ బదరీనారాయణం నైమిశమ్, శ్రీమద్వార వతీ ప్రయాగమధురా౽యోధ్యాగయా పుష్కరం సాలగ్రామఖనిం నిషేవ్య రమతే రామానుజో౽యం మునిమ్"** (శ్రీరంగం, హస్తిగిరి, వేంకటాద్రి, తిరునారాయణ పురం, సింహాచలం, శ్రీకూర్మం, పురుషోత్తమం, బదరికాశ్రమం, నైమిశారణ్యం, ద్వారక, ప్రయాగ, మధుర, అయోధ్య, గయ, పుష్కర, సాలగ్రామం- అనే ఈ దివ్యదేశాలను ఈ శ్రీరామానుజులు సేవించి ఆనందిస్తున్నారు) అనే రీతిలో ఎనిమిది దిక్కులలోను సంచరించి, అక్కడక్కడ విపక్షాల వాదాలను నిరసించారు, శ్రీరామానుజులు.

24. ఇందులో **"వెన్ఱు పకై కెడుక్కుమ్ కైయిల్ వేల్ పోఱ్ఱి"** (శత్రువులను జయించే నీ చేతిలోని వేలాయుధానికి మంగళం) అనే ప్రయోగం గమనించదగినది. **"కొల్‌వదు కోల్"** అనే రీతిలో **"వెల్‌వదు- వేల్"** అనే వ్యుత్పత్తిని **"వేల్"** అనే శబ్దానికి గ్రహించాలి. శ్రీకృష్ణుని శ్రీహస్తంలో **"వేల్"**గా చెప్పబడేది- శ్రీసుదర్శనమే. శ్రీరామానుజుల శ్రీహస్తంలో **"వేల్"**గా చెప్పబడేది- త్రిదండమే. యతిరాజసప్తతిలో **"విష్వక్సేనో యతిపతిరభూత్ వేత్రసార స్త్రిదండః"** (విష్వక్సేనులు శ్రీరామానుజులుగా, ఆయన చేతి బెత్తం త్రిదండంగా అయినవి) అని అంటూ సేనాధిపతి (విష్వక్సేనులు) శ్రీరామానుజులై అవతరించగా, ఉభయవిభూతి నిర్వహణ నిపుణులుగా విష్వక్సేనుల శ్రీకరంలోఉండే వేత్రసారమే (బెత్తమే) త్రిదండంగా అయినవి- అని చెప్పబడింది. ఆవేత్రసారానికి ఎంత శక్తి ఉన్నదో, శ్రీరామానుజుల త్రిదండానికి అంత శక్తి ఉన్నది. ధాటీపంచకంలో శ్రీరామానుజులకు చెప్పబడిన గొప్పతనాలు అన్నీ త్రిదండంపైన, యజ్ఞసూత్రం (యజ్ఞోపవీతం) పైనా ఆరోపించి చెప్పబడ్డాయి. ఆవిధంగా **"పాషండగిరిఖండన వజ్రదండాః ప్రచ్ఛన్న బౌద్ధమ కరాలయమంత్రదండాః.... రామానుజస్య విలసంతి మునే స్త్రిదండాః''** (శ్రీరామానుజుల త్రిదండం- పాషండ మతస్థులనే పర్వతాలను ఛేదించడంలో వజ్రదండం, అద్వైతులనే సముద్రాన్ని ఇంకింపజేసే మంత్రదండం) అని త్రిదండం విషయంలో ఆరోపించి చెప్పబడ్డాయి కదా! అదే ఇక్కడ **"వెన్ఱు పకై కెడుక్కుమ్"** (శత్రువులను జయించి నశింపజేసే) అనే ప్రయోగానికి వివరణం. ఇటువంటి, శ్రీహస్తంలో గల, **"వేల్"** అని నిర్దేశింపబడ్డ త్రిదండానికి మంగళాశాసనం చేయడం- **"ముక్కోల్ పిడిత్త ముని"** (త్రిదండాన్ని ధరించిన ముని)కి మంగళాశాసనం చేయడమేనని గ్రహించాలి.

25. **"తరిక్కిలానాకి త్తాన్ తీఙ్గు నినైన్ద కఞ్జన్ కరుత్తై ప్పిழைప్పిత్తు, అవన్ వయిఱ్ఱిల్ నెరుప్పెన్న నిన్ఱ"** (భరించలేనివాడై, తన మనస్సులో హానిని తలపెట్టిన కంసుని భావనను నిర్వీర్యం చేసి, అతని మనస్సులో అగ్నివలె నిలచిన)

మహనీయులు శ్రీరామానుజులు. శ్రీకృష్ణునకు ఆపదను కల్గించాలని దానికి తగిన మార్గాన్ని కంసుడు అన్వేషించినట్లే, మన శ్రీరామానుజులకు అనర్థాన్ని కల్గించాలని దారిని వెదకినవారొకరు ప్రసిద్ధులు. ఆ కంసుని ఆశయాన్ని నిర్వీర్యం చేసి, ఒకరాత్రిలో రహస్యంగా వర్ధిల్లినవారు- శ్రీరామానుజులు. వింధ్యాటవి ఎక్కడ? సత్యవ్రతక్షేత్రం ఎక్కడ ? ఒకే రాత్రిలో అక్కడనుండి ఇక్కడకు వచ్చి చేరినవారు తమ ప్రభావాలను అన్నిటిని గుప్తంగా చేసి వర్తించారుకదా ! అటువంటివారు ఆసురప్రకృతిని కలవారి కడుపులో నిప్పువలె నిలచారు. **"పాషండసాగరమహా బడబాముఖాగ్నిః"** (పాషండమతస్థులనే సముద్రాన్ని ఇంకింపజేసే గొప్ప బడబాగ్నివంటివారు) అని అగ్నిగా కదా శ్రీరామానుజులు స్తుతింపబడ్డారు **(నెడుమాల్)**- గొప్ప వ్యామోహాన్ని కలవారు. **"అచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ వ్యామోహతః"** (అచ్యుతుని పదపద్మాల జంట అనే బంగారులోని వ్యామోహం వల్ల) అనే సూక్తి స్మరణీయం.

26. ఇందులో **"ఆలినిలైయాయ్"** అనే సంబోధన చాలా రస్యమైనది. **"ఆలినిలైయతన్ మేల్ పైయవు యోకుతుయిల్ కొణ్డ పరమ్పరన్"** (వటపత్రంపై శయనించి యోగనిద్రను పొందే పరాత్పరుడు) శ్రీకృష్ణుడు. **(ఆలిన్ నిలైయాయ్)**- వటవృక్షంయొక్క (ఛాయ వంటి ఛాయను) కలవారు శ్రీరామానుజులు. **"బాహుచ్ఛాయా మవష్టబ్ధో యస్య లోకో మహాత్మనః"** (ఏ మహాత్ముని బాహుచ్ఛాయను ఆశ్రయించిన లోకానికి భీతి లేదో) అనే రీతిలో భగవానుడు తన బాహుచ్ఛాయలో ఒదిగి ఉండేవారికి నీడను ఇచ్చి, తాపాన్ని తీరుస్తాడు. ఇక, శ్రీరామానుజులు అయితే - **"ప్రాప్తానాం పాదమూలం ప్రకృతిమధురయా ఛాయయా తాపహృద్వః"** (పాదమూలాన్ని చేరిన మన తాపాన్ని సహజంగా మధురమైన తన చల్లని నీడతో తీర్చేవారు) అనే రీతిలో తమ శ్రీచరణాలను సేవించినవారికి తమ శ్రీచరణాలనీడను ఇచ్చి, తాపాన్ని తీరుస్తారు. ఇదే "ఆలిన్ నిలైవై" (వటవృక్షం యొక్క స్థితివంటి స్థితి) ఇరామానుశనూఱ్ఱన్దాది ప్రబంధప్రారంభం కూడా - **"పల్కలైయోర్ తామ్ మన్న వన్ద ఇరామానుశన్ శరణారవిన్దమ్"** (పలు శాస్త్రాలను తెలిసినవారు ఉజ్జీవించేటట్లుగా అవతరించిన శ్రీరామానుజుల చరణారవిందాలను) అనే క్రమంలో కదా అయినది. **"పల్కలైయోర్ తామ్ మన్న వన్ద"** అనే విశేషణాన్ని శ్రీరామానుజులకు అన్వయించేటట్లే, వారి శ్రీచరణారవిందాలకుకూడా అన్వయించవచ్చుకదా! **"న్యగ్రోధో బహుపాత్ వటః"** అని అమరకోశం వటవృక్షానికి **"బహుపాత్"** అనే పేరు ఉన్నట్లు తెలిపింది.

వాస్తవానికి వటవృక్షం, మిగిలిన వృక్షాలవలె కాకుండా అపరిమితాలైన పాదాలను (ఊడలను) కల్గినదై ఉంటుంది. స్వామికి కూడా శ్రీచరణాలు (శ్రీచరణ స్థానీయులైన శిష్యులు) అనేకం. ఈ పాశురంలో నిర్దేశింపబడ్డ **"శఙ్గమ్, పెరుమ్ పఱై, పల్లాణ్డిశైప్పార్, కోలవిళక్కు, కొడి, వితానమ్"** అనే పదాలను పరిశీలించి చూస్తే, ఇవి అన్నీ శ్రీరామానుజులే- అని స్పష్టపడుతుంది.

(శఙ్గమ్) - ధ్రువునివద్దకు పోయిన భగవానుడు **"శంఖప్రాంతేన గోవిందః"** అనే రీతిలో శంఖస్పర్శతో అతనిని సర్వజ్ఞునిగా చేశాడని పురాణాలు తెల్పుతున్నాయి. అదేవిధంగా, తమ సంబంధంతో **కూరేశులు, ముదలియాణ్డాన్, అనన్దాళ్వాన్, ఎమ్బార్, పిళ్ళాన్** మొదలైనవారిని సర్వజ్ఞులుగా చేశారు- శ్రీరామానుజులు. (పఱై)- భగవద్గుణాలను అంతటా చాటింపు వేసేవారు కనుక, **"పఱై"** అనదగినవారు శ్రీరామానుజులు. **(పల్లాణ్డిశైప్పార్)** - (పల్లాండు పాడేవారు) పెరియాళ్వార్లవలె భగవానునకు తాము పల్లాణ్డు పాడడం మాత్రమే కాక, పలువేలమందిచేత పల్లాణ్డు పాడించగల్గినవారు, శ్రీరామానుజులు. **(కోలవిళక్కు)**- శ్రీవైష్ణవకుల ప్రదీపం శ్రీరామానుజులు. **(కొడి) "శ్రీమల్లక్ష్మణయోగీంద్రసిద్ధాంతవిజయధ్వజమ్"** (భగవద్రామానుజుల సిద్ధాంత విజయానికి ధ్వజంవంటివారు) అని ఇతరులను గూర్చే పలికేటపుడు ఇక శ్రీరామానుజులను గూర్చి చెప్పాలా ? విశిష్టాద్వైతసిద్ధాంత విజయధ్వజమని భావం. **(వితానమ్)** - శ్రీకృష్ణుడు దేవకీశిశువుగా జన్మించి, మధురనుండి రేపల్లెకు వచ్చేటపుడు **"తొడుత్తు మేల్ వితానమాయ పౌవనీరరావణై"** (పైన వితానంగా విస్తరించిన ఆదిశేషులు) అనే తిరుచ్ఛన్దవిరుత్తపాశురానుసారంగా వితానమై కైంకర్యం చేసినవారు, ఆదిశేషుడే. ఆ ఆదిశేషుని అవతారమే కదా, శ్రీరామానుజులు.

27. యజ్ఞమూర్తివంటి పలువురు అద్వైతులు శ్రీరామానుజులను మొదట ప్రత్యర్థులై వాదించి పోరాడి, **(కూడారైవెల్లుమ్)** తరువాత కలసినవారై శ్రీరామానుజులకు విజయాన్ని కల్గించారు. వారిని జయించడానికి కారణాలైన కల్యాణగుణాలను కలవారు- శ్రీరామానుజులు. ఆకల్యాణగుణాలు ఏవి? అని అంటే, కేవలం వైదుష్యం మాత్రమే కాదు, దివ్యమంగళవిగ్రహగుణాలు, దివ్యాత్మ గుణాలు - అనేకం. శ్రీరామానుజుల సౌందర్యాన్ని సేవించినమాత్రంలోనే అభినివేశాన్ని పొందినవారు, పలువురు. **(గోవిన్దా)**- పశువులను మేపినందువల్ల శ్రీకృష్ణుడు గోవిందుడని అనబడ్డాడు. శ్రీసూక్తులు కూడా గోశబ్ద వాచ్యాలని పూర్వమే తెలుపబడింది. సకలప్రమాణాలు **"బిభేత్యల్పశ్రుతాద్వేదో మామయం**

ప్రతరిష్యతి" (వేదాలు, అల్పశ్రుతుని - అల్పజ్ఞానిని చూచి తమ భావాన్ని అతడు సరిగా తెలుపక మోసగిస్తాడని భయపడతాయి) అనే రీతిలోని వేదాల భీతిని పోగొట్టి రక్షించినందువల్ల శ్రీరామానుజులు కూడా గోవిందుడే. పశుప్రాయులమైన మనలను కాచి రక్షించినవారని కూడా (అపుడు "గో" శబ్దానికి పశుప్రాయులైన మనవంటివారని అర్థం) తాత్పర్యం.

28. **"కుఱై యొన్ఱు మిల్లాత కోవిన్దా! ఉన్దన్నై ప్పిఱవి పెఱున్దనై పుణ్ణియమ్ యాముడైయోమ్"** (ఏ కొఱత లేని గోవిందా! నీవు మా కులంలో అవతరించిన పుణ్యాన్ని మేము కల్గి ఉన్నాము) అనే మాట శ్రీరామానుజులను ఉద్దేశించి శ్రీవైష్ణవ కులస్థులు అందఱు చెప్పాలి. జ్ఞానం, అనుష్ఠానం, పరసమృద్ధ్యైక గీప్రయోజనత్వం- అనే మూడు ఆచార్యపీఠంలో ఉండేవారికి అవశ్యాపేక్షితాలు ఈమూడిటిని పూర్తిగా కల్గినవారు- శ్రీరామానుజులే. **"కుఱై యిల్లాత", "కుఱై ఒన్ఱిల్లాత", "కుఱై యొన్ఱు మిల్లాత"** (కొఱత లేని, ఏకొఱత లేని, కొఱత ఏ ఒకటి ఏమాత్రం లేని) అని మూడుగా యోజనను చేసి, పైనపేర్కొన్న మూడిటితోను ఏవిధమైన కొఱత ఏమీ లేనివారు శ్రీరామానుజులే- అనే అర్థాన్ని గ్రహించాలి. కూరేశులు స్వామి విషయంలో **"యో నిత్యమ్"** ఇత్యాదిగా విన్నపించిన తనియన్శ్లోకంలో **"దయైకసింధో !"** అనే విశేషణం ప్రయోగింపబడింది. దీనిచే వారి పరసమృద్ధ్యైక ప్రయోజనత్వం సూచింపబడింది. ఇటువంటి గొప్పతనాన్ని కల్గిన శ్రీరామానుజులు మనకు కూటస్థులై అవతరించడం వాచామగోచరమైన మన అదృష్ట విశేషమే కదా ! ఈ హర్షప్రకర్షాన్ని **"ఉన్దన్నై ప్పిఱవి పిఱన్దన పుణ్ణియమ్ యాముడైయోమ్"** అనే ప్రయోగం తెల్పుతున్నది. **"ఉన్దన్నై"** అనే దానికి- **"ఉన్దన్నైక్కొణ్డు"** అని అర్థం గ్రహించడం చాలా సరసం. మీద్వారా- అని అర్థం. ఇది విభక్తివ్యత్యయ ప్రయోగం. **"స హి విద్యాత స్తం జనయతి తచ్ఛ్రేష్ఠం జన్మ"** (ఆచార్యుడే కదా విద్యద్వారా జ్ఞానజన్మను కల్గిస్తాడు. అదే శ్రేష్ఠమైన జన్మ) అనే రీతిలో మనం శ్రేష్ఠమైన విద్యాజన్మను వారి అనుగ్రహం వల్ల పొందాము. శ్రీరామానుజుల తిరువంశంలో మనం జన్మించగలిగాము. మన కులదీపంగా స్వామి అవతరించే భాగ్యాన్ని పొందాము- అనే రెండు ఇక్కడ వివక్షితాలు.

29. **"ఎఱ్ఱైక్కుమ్ ఏழ்ఏழ் పిఱవిక్కుమ్ ఉన్దన్నోడుఱ్ఱోమే యావోమ్, ఉనక్కే నామాట్చెయ్వోమ్"** (ఏనాటికి అయినా, ఏడేడు జన్మలకు అయినా నీతోనే సంబంధాన్ని కల్గిన వారం కాగలము, నీకే మేము కైంకర్యం చేస్తాము) అనేది మనం అందరం స్వామిని ఉద్దేశించి విన్నపించదగిన మాట. ఆழ்వార్లు - **"ఇరుళ్తరు మాఞాలత్తుళ్ ఇని ప్పిఱవి యాన్ వేణ్డేన్"** (అజ్ఞానాన్ని కల్గించే ఈ భూలోకంలో ఇక జన్మను కోరను) అని, **"ఇయక్కఱా ప్పల్ పిఱప్పిన్నై మాఱ్ఱి"** (అంతులేని పలు జన్మలనుండి నన్ను విడిపించి) అని, **"ఆదలాల్ పిఱవి వేణ్డేన్"** (అందువల్ల జన్మను కోరను) అని పునర్జన్మను గర్హించి పలికారు. మనం ఈ రీతిలో గర్హించనక్కఱ లేదు. ఎన్ని జన్మలు అయినా యథేష్టంగా సంభవించనీ. సంభవించే జన్మలు అన్నిటిలోను ఇపుడు మనకు కలిగేటట్లే భగవద్రామానుజుల దివ్యసూక్తి సుధలనే పానం చేసే భాగ్యం కలిగితే, జన్మలపట్ల వెగటు మనకెందుకు? ఒక జన్మమాత్రమే కాదు, తొమ్మిది వేల జన్మలు ఎత్తవచ్చు. దానికి అడ్డు పెట్టము. **(ఉనక్కే నామాట్చెయ్వోమ్)** - వడుగనంబివలె శ్రీరామానుజులకే మనం దాస్యం చేయాలి. **"కైయిల్ కనియెన్న క్కణ్ణనై క్కాట్టి త్తరినుమ్ ఉన్దనన్ పిఱఙ్గియ శీరన్ఱి వేణ్డిలన్ యాన్"** (104) (తమరు, కరతలామలకంగా శ్రీకృష్ణుని చూపి నాకు ఇచ్చినా, దేవరవారి దివ్యమంగళవిగ్రహగుణాలను తప్ప వేఱుదేనినీ నేను కోరను) అనే అముదనార్ చేసిన అనుసంధానమే మనకు స్థిరంగా ఉండాలి.

30. తిరుప్పావైలోని ముప్పై పాశురాలకు **"వఙ్గక్కడల్ కడైన్ద మాతవన్"** (ఓడలు నిండిన సముద్రాన్ని చిలికిన మాధవుడు) లక్ష్యభూతుడు. శ్రీకృష్ణుని లక్ష్యంగా గ్రహించేవారు - దేవతల ప్రార్థనవల్ల సముద్రాన్ని చిలికి, అమృతాన్ని ఇచ్చి, **"ఫలేగ్రహిర్ష్వి కమలాలాభేన సర్వః శ్రమః"** (లక్ష్మిని పొందడంవల్ల సముద్రమథనం లోని భగవానుని శ్రమ సార్థకమైనది కదా) అని భట్టర్ అనుగ్రహించిన రీతిలో లక్ష్మీదేవిని కూడా ఆనందించిన భగవానుని లక్ష్యంగా గ్రహించాలి. తిరుప్పావైజీయర్ అనే తిరునామానికి తగినట్లుగా భగవద్రామానుజు లనే తిరుప్పావైకు లక్ష్యంగా గ్రహించేవారు -ఈ క్రింది విధంగా అర్థాన్ని గ్రహించాలి. **"నిర్మథ్యశ్రుతిసాగరాత్"** (శ్రుతిసాగరాన్ని మథించి) అని, **"నమామ్యహం ద్రావిడవేదసాగరమ్"** (ద్రావిడవేదమనే సముద్రాన్ని నమస్కరిస్తున్నాను) అని సముద్రంగా రూపింపబడ్డ సంస్కృత- ద్రావిడాలనే ఉభయవేదాలను జిహ్వా అనే మందరంతో చిలికి, **"వచస్సుధాం... సుమనసో భౌమాః ! పిబంత్వన్వహమ్"** (మంచి మనస్సును కల, విద్వాంసులైన ఈ భూమిలోని జనులారా! ఈ వాగమృతాన్ని ప్రతిదినం పానం చేయండి) అని శ్రీరామానుజులు అనుగ్రహించిన రీతిలో, భూసురులు నిత్యానుభవం పొందడానికి శ్రీభాష్యమనే అమృతాన్ని అనుగ్రహించారు - శ్రీరామానుజులు. **(ఇఙ్గు ఇప్పరిశు ఉరైప్పార్)**- ఈ విధంగా ముప్పైపాశురాలకు ఇక్కడ చూపబడ్డ నిర్వాహాలు- **"అణి పుతువై పైఙ్గమల త్తణ్డెరియల్ పట్టర్పిరాన్**

కోదై" (అందమైన శ్రీవిల్లిపుత్తూర్‌లోని, పచ్చని తామరపూసల మాలికను ధరించే భట్టనాథుల పుత్రిక గోదాదేవి) మనస్సుకు ఆనందాన్ని కల్గించేవే- అని తలచి, ఉపన్యాసగోష్ఠిలో ప్రస్తావించి పలికేవారు, **"శెజ్గణ్ తిరుముకత్తు చ్చెల్వత్తిరుమాలాల్ ఎఙ్గుమ్ తిరువరుళ్ పెర్రు ఇన్బుఱువర్"** (ఎఱ్ఱని నేత్రాలను కలవాడు, అందమైన ముఖాన్ని కలవాడైన శ్రియఃపతి యొక్క, కరుణను సర్వత్ర పొంది ఆనందిస్తారు), **"పీతకవాడైపిరానార్ పిరమకురువాకి వన్దు"** (పీతాంబరధారి అయిన స్వామి పరమాచార్యుడై వచ్చి) అనే పెరియాళ్వార్ల శ్రీసూక్తి రీతిలో **"సా మూర్తి ర్ముర మర్దనస్య జయతి త్రయ్యంతసంరక్షిణీ"** (వేదాంతాలను రక్షించిన ఆ భగవానుని మూర్తి సదా వర్ధిల్లుతున్నది) అనే యతిరాజసప్తతిసూక్తి రీతిలో సాక్షాత్తు శ్రీమన్నారాయణావతారమైన భగవద్రామానుజుల కరుణను అంతటా పొంది **"అమృతసాగరాంతర్నిమగ్నసర్వావయవస్సుఖ మాసీత"** (అమృతసముద్రంలో మునిగిన అన్ని అవయవాలను కలవారై, సుఖంగా ఉండాలి) అని పల్కి ప్రబంధ నిగమనం చేయబడింది.

మన్ను మణవాళమామునివన్ మాణ్బురైక్కు,
మన్ను పుకళ్ అణ్ణజ్గరాశారియన్, శొన్న
తిరుప్పావైచ్చీయర్ శిఱప్పురైక్కు మిన్నూల్,
విరుప్పాలురైప్పార్‌క్కు వీడు

తిరుప్పావై - అర్థపంచకం

మనం అనుసంధించే సకలార్థాలలో ముఖ్యంగా అర్థపంచకం ఉపజీవ్యమైనది- అనేది పూర్వాచార్యుల అభిప్రాయం. తిరుమంత్రార్థాన్ని అనుగ్రహించే శ్రీపిళ్ళైలోకాచార్యులవారు- **"అఱియవేణ్డు మర్థఙ్గళెల్లామ్ ఇదుక్కుళ్ళే యుణ్డు; అతావతు- అర్థపంచకమ్"** (తెలియదగిన అర్థాలన్నీ ఇందులో ఉన్నాయి. అవి ఏమంటే- అర్థపంచకం) అని అన్నారు. **"ప్రాప్యస్య బ్రహ్మణో రూపం ప్రాప్తుశ్చ ప్రత్యగాత్మనః, ప్రాప్త్యుపాయం ఫలం ప్రాప్తేః తథా ప్రాప్తివిరోధి చ, వదంతి సకలా వేదాః సేతిహాసపురాణకాః"** (జీవునిచే పొందదగిన పరబ్రహ్మయొక్క స్వరూపం, దానిని పొందేవాడైన జీవుని స్వరూపం, ఆ ప్రాప్తిని పొందడానికి తగిన ఉపాయం, ప్రాప్తియొక్క ఫలం, ఆ విధంగానే, ప్రాప్తిలో ఎదురయే విరోధులు- అనే వీనిని అన్ని వేదాలు, ఇతిహాసపురాణాలతో పాటు పల్కుతున్నాయి) అనే ప్రమాణం అర్థపంచకాన్ని వివరించి చూపుతున్నది. పరమాత్మ స్వరూపం, జీవాత్మస్వరూపం,

ఉపాయస్వరూపం, పురుషార్థస్వరూపం, విరోధిస్వరూపం- అనే ఇవే అర్థపంచకమనబడతాయి. శ్రీపిళ్ళైలోకాచార్యులవారు ఇంతటితో నిలువకుండా, తరువాత చూర్ణికలో **"పూర్వాచార్యర్‌కళ్ ఇత్తై యొళియ వేఱొన్ఱాల్ కాలక్షేపమ్ పణ్ణి అఱియార్‌కళ్"** (పూర్వాచార్యులు దీనిని తప్ప వేఱు దేనితోను కాలక్షేపం చేసి ఎఱుగరు) అని కూడా అన్నారు. అక్కడ శ్రీవరవరమునులు- **"నాథయామున యతిరాదికళాన నమ్ పూర్వాచార్యర్‌కళ్... వేదశాస్త్రఙ్గళ్, ఆళ్వార్ అరుళిచ్చెయల్ కళ్- ఇవర్రాల్ పోదుపోక్కుమ్ పోదుమ్ ఇమ్మంత్రార్థత్తై యుట్కొణ్డే అనుసంధిక్కైయాలే, ఇత్తైయొళియ వేఱొన్ఱాల్ కాలక్షేపమ్ పణ్ణి అఱియార్‌కళ్ ఎన్న తట్టిల్లై"** (శ్రీనాథముని, యామునులు, యతివరులు మొదలైన మన పూర్వాచార్యులు... వేదాలు, ఆళ్వార్ల శ్రీసూక్తులు అనే వీటితో కాలక్షేపం చేసేటపుడు కూడా ఈ మంత్రార్థాన్ని మనస్సులో భావిస్తూ అనుసంధించడంవల్ల, దీనిని తప్ప వేఱు దేనితోను కాలక్షేపాన్ని చేసి ఎఱుగరు- అని అనడంలో లోటు లేదు) అని వివరించారు.

తిరువాయ్‌మొళికి తనియన్‌ను అనుగ్రహించిన పూర్వాచార్యులుకూడా **"మిక్క ఇఱైనిలైయుమ్ మెయ్యా ముయిర్‌నిలైయుమ్ తక్క నెఱియుమ్ తడైయాకి తొక్కియలుమ్ ఊళ్వినైయుమ్ వాళ్వినైయుమ్ ఓదుమ్ కురుకైయర్‌కోన్ యాళినిశై వేదత్తియల్"** (గొప్పదైన భగవానుని స్వరూపాన్ని, నిత్యమైన ఆత్మయొక్క స్వరూపాన్ని, తగిన ఉపాయాన్ని, ఫలప్రాప్తికి అడ్డం వచ్చే విరోధిస్వరూపాన్ని, ప్రాక్తనకర్మబంధాన్ని, ఉజ్జీవనప్రకారాన్ని- వీణానాదంవలె మధురమైన ధ్వనిని కల నమ్మాళ్వార్ల వేదమైన తిరువాయ్‌మొళి తెల్పుతున్నది) అనే పాశురంలో వేయి పాశురాల రూపమైన తిరువాయ్‌మొళి ప్రబంధంలోని ప్రమేయంకూడా అర్థపంచకమేనని తెలిపారు. ఆచార్యహృదయంలో **"మూన్ఱిల్ శురుక్కియ ఐన్దైయుమ్", "ఉయర్ తిణ్ణై యొన్ఱు", "పయివేఱుకణ్‌కరు", "వీడుశొన్నాలొరు క్కొణ్డ నోర్ర నాలుమ్ ఎమ్మా ఒళివిల్ నెడువేయ్ ఎన్గిఱ ఇరుపదిలే విశదమాక్కి ఎణ్బదిల్ వరప్పుకైయాలే ఐన్దైయుమ్"** (211) అనే చూర్ణికను వివరిస్తూ, శ్రీవరవరమునులు చేసిన వ్యాఖ్యానం అనుసంధేయం. అందువల్ల మనం అనుసంధించే సకలార్థాలకు అర్థపంచకమే ప్రమేయం- అనే విషయం స్పష్టపడుతున్నది. ఈ న్యాయంలో, తిరుప్పావైలోని ముప్పై పాశురాలు అర్థపంచకమయం- అని భావించి పూర్వాచార్యులు **"వేదమనైత్తుక్కుమ్ విత్తాకుమ్ కోదై తమిళ్ ఐయైన్దుమైన్దుమ్ అఱియాద మానిడరై వైయమ్ శుమప్పదుమ్**

వమ్బు" (సమస్తవేదవాఙ్మయానికి బీజంవంటిది అయిన గోదాదేవి రచించిన ముప్పై తమిళపాశురాలను తెలియని మానవులను భూమి భరించడం వ్యర్థం) అని పలికారు. దీనినే విస్తృతంగా నేను నా ఉపన్యాసాలలో ప్రతిపాదించగా పలువురు విన్నారుకూడా. మళ్ళీ ఇపుడు దానిని అతిసంక్షేపంగా విన్నపిస్తున్నాను. తిరుప్పావై పాశురంలో వేదవాక్యాలను, ఉపనిషద్వాక్యాలను - ఉపన్యాసకుల సౌకర్యంకోసం కలిపి విన్నపిస్తాను.

అర్థపంచకంలో మొదటిది పరస్వరూపం. సకలజగత్తులకు కారణభూతుడై ఉండడం, సర్వాత్మరక్షకుడై ఉండడం, పరవ్యూహవిభవాంతర్యామి అర్చారూపాలతో పంచప్రకారంగా వేంచేసి ఉండడం- పరస్వరూపం.

"ఏకో హ వై నారాయణ ఆసీత్" (సృష్టికి ముందు నారాయణుడొక్కడే ఉన్నాడు), **"యతో వా ఇమాని భూతాని జాయంతే"** (ఎవనివల్ల ఈ ప్రాణులు పుడుతున్నాయో అతడే పరబ్రహ్మ), **"అజాయమానో బహుధా విజాయతే"** (కర్మవశంగా పుట్టనివాడైనా, కృపామూలంగా పలు రీతులలో అవతరిస్తున్నాడు.), **"స ఉ శ్రేయాన్ భవతి జాయమానః"** (ఆ భగవానుడు అవతరించినవాడైనపుడే మిక్కిలి శ్రేయస్సును కలవాడవుతున్నాడు), **"పితా పుత్రేణ పితృమాన్ యోని యోనౌ"** (అన్ని లోకాలకు తండ్రి అయిన భగవానుడు పలు అవతారాలను ఎత్తి తల్లితండ్రులను కలవాడవుతున్నాడు) ఇత్యాది వేదోపనిషత్తులు తెల్పిన క్రమంలో, గోదాదేవికూడా **"నన్దకోపన్ కుమరన్"**, **"అశోదై ఇళమ్ శిఙ్గమ్"**, **"నారాయణనే నమక్కే పఱైతరువాన్"**, **"నాఱ్ఱ త్తుఴాయ్ ముడి నారాయణన్"**, **"నమ్మాల్ పోఱ్ఱ ప్పఱై తరుమ్ పుణ్ణియన్"** ఇత్యాది పలు పలు దివ్యసూక్తులతో పరస్వరూపాన్ని వ్యక్తీకరించారు. పరస్వరూపవివరణం లేని పాశురం తిరుప్పావైలో ఎక్కడ ఉన్నదా?- అని అన్వేషించవలసి ఉంటుంది.

అర్థపంచకంలో రెండవది స్వస్వరూపం. **"యస్యాస్మి న తమంతరేమి"** (ఏ భగవానునకు నేను శేషమో, అతనిని విడచి ఉండను), **"యోఽహమస్మి స సన్ యజే"** (ఎవనికి నేను శేషమో, ఆస్వామిని శరణు పొందుతున్నాను) ఇత్యాది వేదవాక్యాలు స్వస్వరూపాన్ని ప్రతిపాదిస్తున్నాయి - అనే విషయాన్ని భట్టర్ శ్రీరంగరాజస్తవ ఉత్తరశతకంలో తెలిపారు. శేషత్వం - అనన్యార్హశేషత్వం- అంటే- అచిద్వత్ పారతంత్ర్య స్వరూపమే. దీనినే గోదాదేవి **"నామ్, నాముమ్, నాఙ్గళ్, నాఙ్గళుమ్ ఉన్తన్నోడుఱ్ఱోమే యావోమ్"**, **"మాఱ్ఱారునక్కు వలి తొలైన్దు ఉన్ వాశల్కణ్ ఆఱ్ఱాదు వన్దు ఉన్నడి పణియుమా"**, **"అబిమాన బఙ్గమాయ్ వన్దు"**, **"తలై ప్పెయ్‌దోమ్"** ఇత్యాది వాక్యాలలో సంక్షిప్తంగా, తగినట్లుగా పలికారు.

అర్థపంచకంలో మూడవది ఉపాయస్వరూపం. **"తస్మాన్న్యాస మేషాం తపసా మతిరిక్త మాహుః"** (అందువల్ల శరణాగతిని అన్ని తపస్సులలోను గొప్పతపస్సుగా పలికారు), **"తస్మాదపి వధ్యం ప్రపన్నం న ప్రతిప్రయచ్ఛంతి"** (యజుర్వేదం-కాండం-6, ప్రశ్నం-5) (అందువల్లకూడా, శరణాగతి చేసినవానిని, అతడు వధింపదగినవాడైనా, అతనిని విడచిపెట్టరు) ఇత్యాది వేదోపనిషద్వాక్యాలు ప్రపత్తిని ఉపాయంగా చూపాయి. ఆణ్డాళ్ కూడా **'ఉన్ పాఱ్ఱామరై యడియే పోఱ్ఱుమ్"**, **"తొఴుదు వాయినాల్ పాడి మనత్తినాల్ శిన్దిక్క"**, **"ఉన్నై అఱుత్తిత్తు వన్దోమ్"** ఇత్యాది పాశురాలతో దీనిని తెలిపారు.

ఇక, అర్థపంచకంలో నాల్గవది పురుషార్థస్వరూపం. భగవద్రామానుజ దర్శనంలో నిత్యకైంకర్యమే పరమపురుషార్థంగా భావింపబడుతున్నది. దీనిని వేదాంతాలు శరీరాత్మప్రతిపాదనక్రమంలో **"యస్యాత్మా శరీరమ్"** (ఎవనికి ఆత్మలు శరీరమో) ఇత్యాదిగా తెలిపాయి. శరీరం అనేది, జీవాత్మకు తాను ఉన్నంతవరకు సకలేంద్రియాలతో కైంకర్యాన్ని చేసే రీతిని మనం ప్రత్యక్షంగా గమనిస్తున్నాము. భగవద్రామానుజులు పల్కిన **"యస్య చేతనస్య యత్ ద్రవ్యమ్"** ఇత్యాది శరీరలక్షణంలో **"తచ్ఛేషతైకస్వరూపమ్"** అని ఉండడం గమనార్హం. **"అకించిత్కరస్య శేషత్వానుపపత్తిః**, **"నాకించిత్కుర్వతః శేషత్వమ్"** (కైంకర్యం చేయనివానికి శేషత్వం సిద్ధించదు) ఇత్యాదులు గమనించదగినవి. దీనిని ఆణ్డాళ్ **"ఉనక్కే నామ్ ఆట్చెయ్‌వోమ్"** (నీకే మేము కైంకర్యం చేస్తాము) అని ప్రధానంగా పలికారు.

ఇక, అయిదవది విరోధిస్వరూపం. పరమదంలోకూడా నిత్యసూరులు "నమః నమః" అని అంటూ విరోధి నివృత్తినే ప్రార్థిస్తారు. భట్టర్ అష్టశ్లోకిలో **"ప్రబలతరవిరోధిప్రహాణమ్"** (ప్రబలమైన విరోధులను తొలగించేది) అని పల్కడం గోదాదేవి పల్కిన **"మఱ్ఱై నమ్ కామఙ్గళ్ మాఱ్ఱు"** (మిగిలిన మా కోరికలను లేకుండా చేయాలి) అనే పాశురాన్ని దృష్టిలో పెట్టుకొనే- అనే విషయాన్ని సూక్ష్మమైన విషయంగా గ్రహించాలి.

శ్రీగోదోపమాష్టకమ్

(సుమారు నూఱు సంవత్సరాలకు ముందు భాగ్యనగరం ద్వారా ప్రకాశింపజేయబడిన "శ్రీవిల్లిపుత్తూర్ మాహాత్మ్యమ్" అనే లఘుగ్రంథంచివరలో ఈ గోదోపమాష్టకం ప్రచురింపబడింది. సహృదయరంజనార్థం ఇపుడు తెలుగు తాత్పర్యంతో పాటు ముద్రింపబడుతున్నది.)

1. సన్మానసాబ్జప్రవణాం సారాసారవివేకినీమ్ ।
సద్గతిం శుద్ధరూపాం త్వాం గోదే ! హంసీం ప్రచక్షతే ॥

సత్పురుషుల మనస్సులనే పద్మం పట్ల ప్రావణ్యాన్ని ఆసక్తిని కల్గిన దానవు- మంచిచెడ్డల వివేకాన్ని - విభాగాన్ని తెలిసినదానవు, సచ్ఛబ్దవాచ్యుడైన భగవానునే గతిగా కల్గినదానవు, సత్త్వగుణప్రధానురాలవు, శుద్ధమైన స్వభావాన్ని కల్గినదానవైన ఓ గోదాదేవీ - నిన్ను, గొప్ప మానససరస్సుపట్ల ఆదరాన్ని కల్గినది, పాలను నీటిని విభాగించే శక్తిని కల్గినది, అందమైన నడకలను కల్గినది, తెల్లని వర్ణాన్ని కల్గిన హంసిగా- ఆడుహంసగా పెద్దలు పల్కుతున్నారు.

2. తేజోమయస్వరూపత్వాత్ శ్రీమత్సేవితవైభవాత్ ।
చింతామణిసమా గోదే ! దేశికై స్త్వ మిహోచ్యసే ॥

తేజోమయమైన స్వరూపాన్ని -గొప్పగా ప్రకాశించే స్వరూపాన్ని- కల్గినందున, శ్రియఃపతిచేత సేవింపబడినదానవనే గొప్పతనంవల్ల, ఓ గోదాదేవీ నీవు, కాంతిమయమైన రూపాన్ని కల్గినది, సంపదను కల్గిన ప్రభువులచేత- లేక- సంపన్నులచేత- సేవింపబడే చింతామణితో సమానురాలవని ఆచార్యులచే చెప్పబడుతున్నావు.

3. అనేకశాఖోజ్జ్వలితస్వరూపా దనంతభోగిప్రియవర్ధకత్వాత్ ।
సురేశభూషాసుమనఃప్రదానాత్ సురద్రుమేణాసి సమాఽద్య గోదే ॥

వేదంలోని పలు శాఖలలో గొప్పగా ప్రకాశించే స్వరూపాన్ని కల్గినందున, అనంతుడనే సర్పాన్ని -ఆదిశేషుని పడుకగా కల్గిన భగవానునకు ఆనందాన్ని వర్ధిల్లజేసినందున, దేవతలలో అలంకారంవలె గొప్పవాడైన భగవానునకు, ధరించి విడచిన పూమాలికను ఇచ్చినందున, ఓ గోదాదేవీ ! నీవు, పలు శాఖలతో ప్రకాశించే ఆకారాన్ని కల్గినది, అనంతమైన భోగాలను కల ఇంద్రునకు ఆనందాన్ని

పెంపొందించేది, దేవతలలో గొప్పవాడైన ఇంద్రునకు పూలను అందించేది అయిన కల్పవృక్షంతో సమానురాలవై ఉన్నావు.

4. సద్గోవిలాసేన తమోహరత్వాత్ సమస్తసద్వందితమండలత్వాత్ ।
పద్మాననౌజ్జ్వల్యకరప్రభావాత్ భాసీహ గోదే ! రవితుల్యశీలా ॥

గొప్పవైన సూక్తుల విలాసంతో అజ్ఞానాన్ని పోగొట్టడంవల్ల, సత్పురుషు లందఱిచేత నమస్కరింపబడే పాండ్యమండలంలోని శ్రీవిల్లిపుత్తూర్‌లో అవతరించినందున, పద్మంవంటి ముఖాన్ని కల్గిన భగవానునకు ఔజ్జ్వల్యాన్ని- ప్రకాశాన్ని- సంతోషాన్ని కల్గించే ప్రభావంచేత, ఓగోదాదేవీ, నీవు, గొప్పకిరణాల విలాసంతో చీకటిని హరించేవాడు, మహనీయులందఱిచేత నమస్కరింపబడే మండలాన్ని కల్గినవాడు, పద్మాల ముఖానికి గొప్ప వెలుగును కల్గించే- వికసింపజేసే- ప్రభావాన్ని కల్గినవాడైన సూర్యునితో సమానమైన స్వభావాన్ని కల్గినదానవుగా ప్రకాశిస్తున్నావు.

5. కలానిధిత్వాత్ కమలాత్మకత్వాత్ భవాతితాపక్షపణస్వశైత్యాత్ ।
సదా మహావిష్ణుపదానుషంగాత్ హిమాంశుతుల్యా త్వమిహాసి గోదే !॥

సమస్తకళలకు (కాంతులకు) నిధివి అయినందున, లక్ష్మీసమానురాలవు అయినందున, సంసారం వల్లకలిగే తాపాన్ని తీర్చే చల్లని స్వభావం- కరుణ వల్ల, ఎల్లప్పుడు శ్రీమహా విష్ణువు శ్రీచరణాలతో సంబంధాన్ని కల్గినందున, ఓ గోదాదేవీ!, నీవు, షోడశకళలకు నిధి, కమల అనబడే లక్ష్మికి సోదరుడైనందున తదాత్మకుడు, శివునకు కల గొప్పతాపాన్ని తీర్చే చల్లదనాన్ని కల్గినవాడు, ఎల్లప్పుడు విష్ణుపద మనబడే ఆకాశంతో సంబంధాన్ని కలవాడైన చంద్రునితో సమానురాలవై ఉన్నావు.

6. శ్యామాం ద్విజాధిపసుతాం శ్రవణాభిరామ-
మంజుస్వనాం మదనమీశ్వరజం భజంతీమ్ ।
గోదే ! గురో స్త్రిజగతాం గుణశాలినీం త్వాం
లీలాశుకీం కృతధియః సముదాహరంతి ॥

గఱిక పచ్చవర్ణాన్ని కల్గినదానవు, బ్రాహ్మణశ్రేష్ఠులైన భట్టనాథులకుమార్తెవు, చెవులకు ఇంపైన, మధురమైన శబ్దాలను కల ప్రబంధాన్ని అనుగ్రహించినదానవు, భగవానుని ప్రాప్తికోసం "అనఙ్గదేవ ! వేఙ్గడవఱ్కు ఎన్నై విదిక్కిఱ్ఱియే" అని అంటూ ఈశ్వరుడైన భగవానుని కుమారుడైన మన్మథుని ప్రార్థించేదానవు,

సద్గుణాలతో ప్రకాశించేదానవు అయిన నిన్ను ఓ గోదాదేవీ !, పచ్చని రంగును కల్గినది, పక్షులలో గొప్పదైన చిలుకజాతిలో పుట్టినది, చెవులకు తీయగా కూసే ఇంపైన ధ్వనులను కల్గినది, లోకంలో భగవానుని పుత్రుడైన మన్మథుడు చేసే ప్రయత్నాలకు సహాయపడుతూ, అతనిని ఆశ్రయించి ఉండేది, శరీరగుణాలు మొదలైనవానితో ప్రకాశించేది అయిన భగవానుని లీలాశుకంగా విజ్ఞులు పల్కుతున్నారు.

7. వృషప్రియాం విశ్వజనాఖిలార్థ విశ్రాణనోత్కాం విధివాసవేడ్యామ్ ।
శ్రుతిప్రసన్నాం సురభిం విశంకే స్వస్థాం మఖార్హాం భవతీం తు గోదే ॥

వృషశబ్దవాచ్యుడైన భగవానునకు ప్రియురాలవు, లోకంలోని జనులు కోరే అన్నికోరికలను సమృద్ధిగా అనగ్రహించడంలో ఆసక్తిని కల్గినదానవు, బ్రహ్మ, ఇంద్రులచే కీర్తింపబడేదానవు, వేదాలచే ప్రసన్నురాలవు- స్తుతింపబడినదానవు, పరమపదంలో వేంచేసి ఉండే దానవు అయిన ఓ గోదాదేవీ ! నీవు, వృషభానికి ప్రియమైనది, లోకంలోని జనుల అర్థించే కోరికలను అన్నిటిని వితరణ చేయడంలో ఆసక్తిని కల్గినది, బ్రహ్మచే, ఇంద్రునిచే పొగడబడేది, వేదాలచే కీర్తింపబడేది (చెవులకుఇంపైన ధ్వనిని కల్గినది), యజ్ఞాల నిర్వహణకు తగిన తన స్థితిని కల్గినది అయిన కామధేనువుగా ఉత్ప్రేక్షిస్తున్నాను.

8. గోదే ! స్నాతాసి మాతః ! త్వమిహ నిగమశాస్త్రోక్తమంత్రక్రియాభ్యాం
ఏతేనైవాతిపాపా వయమపి సకలా ముక్తపాపా భవామః ।
లోకే దృష్టం చ కర్మేదృశ మిహ సకలైః స్వప్రజారోగశాంత్యై
మాతా పీత్వా కషాయం తనయ మథ నిజస్తన్యదానేన పాతి ॥

తల్లీ! ఓ గోదాదేవీ ! నీవిక్కడ వేదాలలో, శాస్త్రాలలో చెప్పబడిన మంత్రాలతో, క్రియాకలాపాలతో, అభిషేకాన్ని స్వీకరించావు. నీ ఈ స్నానంవల్ల ఎన్నో పాపాలను చేసిన మేము అందరం కూడా పాపాలను తొలగినవారమై, పవిత్రులము అవుతున్నాము. లోకంలో కూడా ఇటువంటి క్రియాకలాపం సర్వత్ర కానవస్తున్నది. ఏవిధంగా ? అంటే, తన కుమారునకు కల్గిన రోగం ఉపశమింపజేయడంకోసం, తల్లి కషాయాన్ని తాగి, తరువాత ఆ కషాయసారంతో కూడుకొన్న తన స్తన్యాన్ని కుమారునకు అందించడం ద్వారా అతనిని రక్షిస్తున్నది. కదా !